


# విజయవిహారాన్ని ఆపలేరు!






శేషేంద్ర X సి.నా.రె.

బోస్ మరణం మిస్టరీ

హ్యూమరాలజీ

వాస్తు సంవాదమ్

గాడ్సే వాదులకు జవాబు

ఐలయ్య పుస్తకంపై జాదవ్ స్పందన

సినిమా కబుర్లు










వార్షిక ప్రత్యేక సంచిక

# విజయవిహారం

మార్చి, 2001 రు.15

మోహన్ నిబ్‌సైట్ 4
బోస్ మరణం మిస్టరీ 5
విజయవిహారాన్ని ఆపలేరు! 6
ఎవరు చేసిన హత్యలివి? 7


ఈ ఉన్మాదానికి మతం లేదు ..8

అస్ఘర్ అలీ ఇంటర్వ్యూ 9
హ్యూమరాలజీ 12
కదిలొచ్చిన బొమ్మలకథ 14
హ్యూమర్ స్ప్రెడ్ 16
ఐలయ్య పుస్తకం పై జాదవ్..19
ఉపనిషత్తులు 20
వాస్తు సంవాదమ్ 21
అవతారం అడ్డం తిరిగింది 22
కంప్యూటర్ క్లాస్‌రూమ్ 23
భారతరత్నాలు 25
దిగ్గజాలు 26
జనహర్ష వార్తలు 27
గాడ్సె ఘాతుకం 28


శేషేంద్ర X సి.నా.రె. .10

విజయవిహారంపై సమీక్షా... 30
ఏమిటి'లా' 32
గాస్ట్రోఎంటరాలజీ 33
క్రెడిట్ కార్డ్... 34
బాడీలాంగ్వేజ్ 35
అంబేద్కర్ సీరియల్ 36
కరెంట్ ఎఫైర్స్ 37

గెలుపు కెరటాలు
కీత్ పెరిస్ 16
రాగతి పండరి 17
చిన్నపిల్లి 23
సునీతారావు 27
ఇంద్ర కె.నూయి 27
విశ్వాస్ మోరే 28
చంద్రకాంత్ 29
భరత్ భూషణ్ 43
ఏక్తాకపూర్ 54
చిత్రవిహారం 56
సౌందర్యద్వీపం మారిషస్ 58

అక్షరక్రీడ 38
గిఫ్ట్‌బాక్స్ 39
రక్తకాసారం 40
చిత్కళ 44
కథ 45
తెరఛాట్ 54
చిత్రవిహారం 56
సౌందర్యద్వీపం మారిషస్ 58


షిరిడీ సాయి పేరిట బురిడీబాబా మోసం ..46



# SUMMIT COMPUTERS LIMITED

*(Setting New Standards in Hardware and Networking Technology)*

No... Seminars, No...Crorepatis..... Just Dedication & Hard-work that's What we believe in 'cause no one can simplify the word 'Success', it should be achieved the way it has to be.

Creating Promising Careers @ Summit ; Eligibility : Hard - work & Dedication

***An Offer :*** **Fee discount based on the performance in written test**

***Act :*** **Live practical orientation in the above said subjects.**

***Attention :*** Free Training and Placement for M.Sc., B.Sc. & Diploma (Electronics) candidates (4 in no.)

**Courses Offered :**

- Diploma in PC Maintenance (Card Level & Chip Level)
- Network Engineering. (Win NT + 2000)
- NETSoP (Network Solution Provider)
  I. Windows NT + 2000 II. Sun Solaris Administration
  III. Linux Administration IV. Netware 5 Administration
  V. Oracle DBA VI. Cisco Routers VII. Hardware
- NetR &D ( A full research oriented program in Win NT & Sun Solaris.

SUMMIT : *The Peak of glory !*

1st Floor, Hira Mansion, Opp. Paigha Plaza, Basheerbagh, Hyd - 29. Ph:040-3260508, email : naveen_tp@rediffmail.com, www.summitasia.com

**Bring this coupon to summit and avail fee discount (for first 30 registrations)**

# ఉచితంగా కంప్యూటర్ విద్య!

అంతేకాదు....

# ఒక కంప్యూటర్ పూర్తిగా ఉచితంగా!!

దేశంలోనే తొలిసారిగా Dazzle Network Pvt. Ltd. వారు రూపొందించిన పథకంలో చేరండి

మీ స్నేహితులను మరికొందరిని ఈ పథకంలో సభ్యులుగా చేర్చడం ద్వారా మీ ఫీజు వాపసు...

అంతేకాక... ఏకంగా ఒక 'మల్టీమీడియా కంప్యూటర్' నే ఉచితంగా పొందే అవకాశం...






నేడే మీరు ఉన్న ప్రదేశం నుంచే Dazzle వారు ఇంటర్‌నెట్ ద్వారా అందిస్తున్న NET COURSES లో చేరండి. తరువాత మీరు మరో నలుగురిని (ప్రపంచంలో ఎక్కడివారినైనా) ఈ కోర్సులో చేరిస్తే మీరు చెల్లించిన ఫీజు వాపసు చేయబడుతుంది. ఆ నలుగురూ మరో నలుగురు చొప్పున కొత్త సభ్యులను చేరిస్తే మీకు రు. 45,000/-లు విలువ చేసే కంప్యూటర్ ఉచితంగా లభిస్తుంది.... చూసారా... ఎంత సులభమో...!

Intel Pentium III @ 850 MHz / 64 MB RAM / 20.4 GB HDD / 1.44 MB FDD / 15" Colour Monitor / 52 X MM Kit / Mouse / Internal Modem / Keyboard 100 Hours Internet Connection / Windows licensed version.

ఈ పథకంతో నిమిత్తం లేకుండా కూడా ఈ కోర్సులో చేరవచ్చు
పథకం పూర్తి నిబంధనల కోసం క్రింది చిరునామాలో/వెబ్‌సైట్‌ని సంప్రదించండి.

**Visit us : www.dazzleit.com**

**6th Floor, Heera Mansion, Opp. Paigha Plaza, Basheerbagh, HYDERABAD - 29. Ph & Fax : 6503122, E-mail : info@dazzleit.com**



**Edited, Printed, Published and Owned by** T.V.Ramana Murty, **Printed at** KALAJYOTHI PROCESS LTD., Regd.Office : 1-1-60/5, R.T.C. X Roads, Hyderabad - 20. **Published at** 12-5-149/17, Opp. Railway Degree College, Tarnaka, Sec'bad - 17. ☎ 040-7007053. Editor : T.V. Ramana Murty, e-mail: vijayavihaaram@rediff.com, Mobile No:9848019076




# మాటామంత్లీ

## అయోధ్యలో ఫాసిజం ముఖం

"ఆరోజు నేను అయోధ్యలో ఫాసిజం ముఖాన్ని చూశాను. ఆరోజు అయోధ్యలో జరిగినది ప్రతీ భారతీయుడినీ సిగ్గుపడేలా చేస్తుంది. భారత్ వంటి మహత్తర దేశంలో ఇటువంటి వికృత చేష్ట జరుగుతుందని నేను నమ్మలేక పోయాను".

- నిర్మలా దేశ్‌పాండే, ప్రముఖ గాంధేయవాది
(బాబ్రీ మసీదు విధ్వంసంపైన జస్టిస్ లిబర్‌హాన్ కమిషన్ ముందు వాంగ్మూలమిస్తూ...)

## మేనేజ్ చేసి



"ఇటీవలే సి.ఎం. తాను ప్రపంచంలో వై.ఎస్.ను తప్ప ఎవరినైనా మెప్పిస్తున్నానని చెప్పారు. కానీ నేరుగా నన్ను మోనగించకపోయినా, నా అడ్వకేట్‌ను మేనేజ్ చేసి నన్ను మోసం చేయించారు"

- వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి
(చంద్రబాబు నాయుడుపై కోర్టులో తాను దాఖలుచేసిన కేసులను ఉపసంహరించుకున్న తీరుపై)

## ఏం నాయకుడు?



"ఎవరు చెప్పినా మోసపోయే నాయకుడు ఇంకా మీ నాయకుడిగా ఎలా కొనసాగుతున్నారు? వై.ఎస్. ఇంకా నోట్లో వేలుపెట్టుకుని, బాటిల్‌లో పాలుతాగుతున్నారా... ఎవరు చెప్పినా మోసపోవడానికి..."

- చంద్రబాబు నాయుడు (తన అడ్వకేట్‌ను మేనేజ్ చేసి తద్వారా సీఎం తనను మోసగించారంటూ వైఎస్ చేసిన ఆరోపణపై)

నేతాజీ సుభాష్ చంద్రబోస్ అన్న పేరు ఒక్కసారి తల్చుకోగానే నరనరంలోనూ దేశభక్తి ఉవ్వెత్తున పరుగులు తీస్తున్న అనుభూతి కలుగుతుంది. తాను నమ్మిన మార్గంలో బోసు ఆశించిన విజయాన్ని పూర్తిగా సాధించలేకపోవచ్చు. కానీ భారతీయులకి ఆయన నిత్య ఆరాధనీయు డయ్యారు. స్వాతంత్ర్యానంతర తరంలో వేలాది మంది తమ పిల్లలకి ఆయన పేరు పెట్టుకున్నారు, వాడవాడలా ఆయన విగ్రహాలు నెలకొల్పుకున్నారు.

సుభాష్ చంద్రబోస్‌ది మొదటి నుంచీ సూటిగా నిర్భయంగా ముందుకు దూసుకుపోయే స్వభావమే. 1897 జనవరి 23న కటక్‌లో స్థిరపడిన బెంగాలీ దంపతులకి జన్మించారు. ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ సివిల్ సర్వీసెస్‌లో ఉత్తీర్ణుడైనా, స్వాతంత్ర్య సమరాంగణంలో దూకేందుకు 1921లో ఐ.సి.యస్.కి రాజీనామా ఇచ్చారు. 1938 నాటికి హరిపుర కాంగ్రెస్‌లో కాంగ్రెస్ అధ్యక్ష స్థానాన్ని అలంకరించారు. 1939లో రెండవసారి కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికై గాంధీజీతో ఉన్న బేధాభిప్రాయాల కారణంగా రాజీనామా ఇచ్చారు. 1940లో బోస్‌ను పోలీసులు 11వసారి అరెస్టు చేశారు. తన కార్యకలాపాలు స్వదేశంలో సాగేందుకు వీలు లేదని భావించి 1941 జనవరిలో బోస్ బ్రిటిష్ పోలీసుల కళ్ళు కప్పి మారువేషంలో అత్యంత సాహసంతో 2 మాసాల 11 రోజులు ప్రయాణించి ప్రమాద భరితమైన మార్గాలగుండా జర్మనీకి తప్పించుకుని వెళ్ళిపోయారు. ఈ సంఘటన దేశంలో తీవ్ర సంచలనానికి కారణమైంది. కొంతకాలం జర్మనీలో పనిచేశాక తన కార్యకలాపాలకు ఆగ్నేయాసియా మరింత అనువుగా ఉంటుందని భావించి 90 రోజులు జలాంతర్గాముల ద్వారా ప్రయాణం చేసి టోక్యో చేరుకున్నారు. (రెండవ ప్రపంచయుద్ధకాలంలోనే ఇటువంటి సుదీర్ఘ సాహసప్రయాణం మరొకటి లేదని చెపుతారు)

1943లో సింగపూర్ కేంద్రంగా మహత్తరమైన అజాద్ హింద్ ఫౌజ్‌ను నిర్మించారు. ఛలో ఢిల్లీ నినాదంతో అజాద్ హింద్ ఫౌజ్ బర్మా సరిహద్దుల మీదుగా భారత భూభాగంలోకి ప్రవేశించింది. మిలియన్ల మంది ప్రవాస భారతీయులు నేతాజీ పిలుపుకి స్పందించి అజాద్ హింద్ ఫౌజ్‌కి అండదండలు అందించారు. ప్రపంచ చరిత్రలోనే ఒక దేశ స్వాతంత్ర్యం కోసం ప్రవాసంలో అంతటి మహాసైన్యం నిర్మాణం జరగలేదంటారు. రెండవ ప్రపంచయుద్ధంలో అగ్రరాజ్యాలు ఓటమి పాలయ్యాక అజాద్ హింద్‌ఫౌజ్ వెనుకంజ వేయవలసి వచ్చింది. 1945 ఆగస్టు 18న బోసు విమానప్రమాదంలో మరణించారని ఆగస్టు 23న జపాన్ రేడియో ప్రకటించింది.



## భుజం భుజం కలిపి మాతృదేశ ముక్తికై...

సుభాష్ చంద్రబోస్ అజాద్ హింద్‌ఫౌజ్‌ని నిర్మించిన తీరు, కుల,మత, ప్రాంతీయ, లింగ వివక్షలకి విబేధాలకు అతీతంగా ఐక్యపరిచి నడిపించిన తీరు అద్భుతం, అసాధారణం. హిందువులు, ముస్లింలు, పంజాబీలు, పఠాన్లు, సిక్కులు.... చివరికి ఆగ్నేయాసియా దేశాల్లో రబ్బరు తోటల్లో పనిచేసేందుకు వచ్చిన తమిళ, మళయాళీ కార్మికులు సైతం బోస్ నాయకత్వంలో అజాద్ హింద్ ఫౌజ్‌గా ఐక్యమయ్యారు. మాతృదేశ ముక్తికోసం కదం తొక్కి కదిలారు. (ఇటీవల విజయవంతమైన భారతీయుడు చిత్రంలో కమల్‌హాసన్‌ను అజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగానే చూసారు.)

బోసు నాయకత్వ శైలి ఎటువంటి భేషజాలకూ తావిచ్చేది కాదు. అజాద్ హింద్‌ఫౌజ్ అగ్రస్థాయి నాయకుడైనా ఆయన సాధారణ సైనికులతో పాటుగా అదే ఆహారాన్ని తీసుకునేవారు. మత ప్రాతిపదికపై దేశాన్ని విభజించాలనే ప్రతిపాదనలను సుభాష్ చంద్రబోస్ అత్యంత తీవ్రంగా వ్యతిరేకించారు. తన భావాలను జర్మనీలో ఉన్నపుడే "అజాద్ హింద్" రేడియో ద్వారా ప్రచారం చేశారు. హిందూ ముస్లిం ఐక్యత ఎలా సాధించవచ్చో, దాని ఆవశ్యకత ఎంతో బోస్ ఆచరణలో నిరూపించారు. వందేమాతరం ముస్లింల మనోభావాలకు ఇబ్బందిగా ఉంటుంది కనుక దానికి బదులు రవీంద్రుని "జనగణమన" గీతాన్ని నేతాజీ జాతీయ గీతంగా స్వీకరించారు. భారతీయు లంతా తమ మాతృభూమి "హిందుస్థాన్"కి జయం పలికే విధంగా "జైహింద్"ను నినాదంగా స్వీకరించారు. జర్మనీ నుంచి జపాన్‌కి 90 రోజులు జలంతర్గామిలో ప్రయాణించి వచ్చినపుడు నేతాజీని వెన్నంటి వచ్చిన ఏకైక సహచరుడు అబీద్ హుస్సేన్. సుభాష్ బోసుని తొలిసారిగా "నేతాజీ" అని సంబోధించాలని ప్రతిపాదించిన వ్యక్తి అబీద్ హుస్సేన్. (ఈ ప్రతిపాదనకు బోసు అభ్యం తరాలను ఎవరూ అంగీకరించలేదు). "జైహింద్" పదం కూడా అబీద్ హుస్సేన్ సృష్టి. అజాద్ హింద్ ఫౌజ్ తొలిసారిగా యుద్ధ భూమికి కదిలివెళ్ళినప్పుడు నాయకత్వం వహించిన వ్యక్తి మేజర్ జనరల్ షానవాజ్ ఖాన్. ఆఖరికి నేతాజీ చివరి ప్రయాణంలో విమాన దుర్ఘటనలో కూడా తోడుగా వున్న సహచరుడు కల్నల్ హబీబుర్ రహమాన్. సింగపూర్‌లో ఒకసారి ఒక దేవాలయంలో దసరా ఉత్సవాల్లో పాల్గొనమని ఆహ్వానం వచ్చినపుడు నేతాజీ పట్టుపట్టి క్రైస్తవులు, హిందువులు, మహమ్మదీయులు అనే విచక్షణ లేకుండా తన అజాద్ హింద్ సైనికులందరితో కలిసి ఆ ఉత్సవంలో పాల్గొన్నారు.

నేతాజీ నాయకత్వంలోని ఈ విశిష్టతను గాంధీజీ సైతం ప్రస్తావించారు. - "కులమత ప్రాంతీయ అడ్డుకట్టలకి అతీతంగా తన సహచరుల్లో ఐక్యతా స్ఫూర్తిని నేతాజీ రంగరించిన విధానం- ఆయన జీవితాన్నుంచి మనం నేర్చుకోవలసిన అత్యంత గొప్ప సందేశం. అదే స్ఫూర్తితో వారు సమైక్యంగా తమ ఉమ్మడి లక్ష్యంకోసం రక్తం ధారపోశారు" అని గాంధీజీ ప్రశంసించారు.

# నేతాజీ మరణం మిస్టరీ విడిపోయిందా?

**- ఈశ్వరానంద**



## రగిలిన వివాదం

బోసు మరణవార్త నాటి నుంచీ నేటి వరకూ వివాదంగానే నిలిచింది. ఆ వార్తను బోసుకు అత్యంత సన్నిహితులైనవారు సైతం విశ్వసించలేదు. వాస్తవానికి రెండవ ప్రపంచ యుద్ధం ముగిస్తున్న కాలంలోనే ఎలాగైనా సోవియట్‌కు చేరుకుని భారత స్వాతంత్ర్య సమరానికి మద్దతును సాధించాలని బోస్ ప్రయత్నించారు. రెండవ ప్రపంచయుద్ధంలో బ్రిటన్ తదితర మిత్రదేశాలకు వ్యతిరేకంగా జర్మనీ, జపాన్ తదితర అక్షరాజ్యాలు యుద్ధం చేస్తున్నాయి కాబట్టి వ్యూహాత్మకంగా వాటి సహాయాన్ని పొందేందుకు ప్రయత్నించారే కానీ బోసు నాజీజంనుగానీ ఫాసిజంనుగానీ ఏనాడూ బలపరిచిన వ్యక్తి కాదు. జర్మనీ, జపాన్‌ల సహాయాన్ని పొందే రోజుల్లో కూడా బోస్ హిట్లర్ తదితరుల విధానాల పట్ల విమర్శనాత్మకంగానే ఉండేవారు, ఫాసిస్టుల అదుపాజ్ఞల్లో ఉండేవిధంగా కాక పూర్తిగా స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే విధంగానే తన సంస్థల్ని, కార్యకలాపాలని మలిచారు. బోస్ స్వతంత్ర శైలి పట్ల జర్మన్‌లు, జపాన్‌వారు అనేక సందర్భాల్లో ఇబ్బందికి అసమ్మతికి లోనయ్యేవారు. హిట్లర్ సోవియట్ పైన దాడి చేయడం వ్యూహాత్మక తప్పిదమని బోస్ భావించారు. బోస్ మంచూరియా మీదుగా సోవియట్ భూభాగంలో ప్రవేశించే ప్రయత్నంలో ఉండగానే విమాన దుర్ఘటన వార్త రావడంతో బోస్ సహచరులు అనేకమంది, ఇది బోస్ శత్రువులని తప్పుదారిని పట్టించేందుకు పన్నిన పన్నుగడగానే భావించారు. కెప్టెన్ లక్ష్మీ సెహగల్ ఆ నాటి పరిస్థితిని వివరిస్తూ "... సైగాన్ నుండి జపాన్ వెళ్ళే విమానం కూలి నేతాజీ మరణించారనే వార్త రేడియోలో విన్నాం కానీ అంత పట్టించుకోలేదు. ఆ వార్త అబద్ధమని తాను తప్పించుకోవడానికి వీలుగా నేతాజీయే ఈ వార్త ప్రచారం చేసి ఉండవచ్చని భావించాం..." అని రాశారు. గాంధీజీ కూడా అనేక సందర్భాల్లో బోస్ సజీవుడేనని తాను విశ్వసిస్తున్నట్టుగా ప్రకటించారు.

బోస్ మరణవార్తని నాటి బ్రిటిష్ ప్రభుత్వం విశ్వసించలేకపోయింది. వైస్‌రాయ్ వేవెల్ బోస్ పట్ల, ఆయన సైన్యం పట్ల ఎటువంటి వైఖరి అవలంబించాలనే అంశంపైన ఒక నోట్ తయారు చేయమని నాటి హోంమెంబర్‌గా ఉన్న సర్ ఆర్.యఫ్. ముడీని కోరారు. అనేక పరిశీలనల అనంతరం ముడీ తయారు చేసిన రహస్య నోట్‌లో బోస్‌ను విచారించే, శిక్షించే, ఉరి తీసే ప్రయత్నాలు ఏవైనా భారతీయులని తీవ్రంగా రెచ్చగొడతాయని, అందుచేత బోస్‌ను ఉన్న చోట ఉండనివ్వాలని ఆయన్ని రప్పించే ప్రయత్నం చేయనక్కర్లేదని రాశారు. ఈ అంశాలు తర్వాత వెల్లడైనప్పుడు - బ్రిటిష్ ప్రభుత్వానికి బోస్ మరణవార్త అబద్ధమని తెలిసి ఉండొచ్చని, బోస్ రష్యాకు చేరుకున్న విషయం పట్ల ప్రభుత్వానికి స్పష్టమైన సమాచారం ఉండొచ్చని ఊహాగానాలు వచ్చాయి.

దీనికితోడు 1946లో బోస్ సైబీరియాలో నిర్బంధంలో ఉండగా ఒక జర్మన్ దేశస్థుడు చూశాడనే వార్తలు కూడా వచ్చాయి. నేతాజీ తమ దేశంలో ఉన్నాడనటం అబద్ధం అని 1946లోనే సోవియట్ యూనియన్ తమ పత్రిక ప్రావ్దాలో ప్రకటించినా అనుమానాలు పూర్తిగా తొలగిపోలేదు.

సమర్ గుహ వంటి నాయకులైతే తొలి ప్రధాని నెహ్రూ నేతాజీ జాడ తెలియకుండా నిజాన్ని తొక్కిపెట్టాడని ఆరోపణలు చేశారు.

స్వతంత్ర భారత ప్రభుత్వం ఇప్పటికి ఈ అంశంపై నిజానిజాలను నిర్ధారణ చేసేందుకు 3 కమిషన్‌లు నియమించింది. 1956లో నియమించిన షానవాజ్ కమిటీ, 1970 నాటి ఖోస్లాకమిటి రెండూ నేతాజీ మరణాన్ని ధృవీకరించాయి. అయినా ప్రజల్లో పూర్తిగా అనుమానాలు తీరకపోవడంతో 1999 మే 14న కేంద్ర ప్రభుత్వం జస్టిస్ ఎం.ముఖర్జీ ఏక సభ్య కమిషన్‌ను నియమించింది.

గతంలో సత్యనారాయణ్ సిన్హా వంటి కొందరు వ్యక్తులు, డా॥పురబీరాయ్ నేతృత్వంలోని ఆసియాటిక్ సొసైటీ వంటి సంస్థలు ఎంతో వ్యయప్రయాసలకి ఓర్చి ఈ అంశాన్ని పరిశోధించి షానవాజ్, ఖోస్లా కమిషన్ల కథనాలను ప్రశ్నించారు. నరసింహారావు ప్రభుత్వం నేతాజీకి ప్రతిష్ఠాత్మకమైన భారతరత్న అవార్డు ప్రకటించినప్పుడు కూడా ఈ వివాదాన్ని తొక్కిపెట్టడానికే ఆ పని చేశారనే విమర్శలు వచ్చాయి. విమాన ప్రమాదం తర్వాత నేతాజీ రష్యా వచ్చారని, ఇదే విషయంపై నెహ్రూ స్టాలిన్‌కి 1946లో లేఖ రాశారని, 1946 అక్టోబర్‌లోనే బోస్ విషయం స్టాలిన్, మాలటోవ్ ఉన్నతాధికారులతో చర్చించారని పురబీరాయ్ వెల్లడించారు.

సిద్ధాంతాలపై అభిప్రాయబేధాలున్నంత మాత్రాన బోస్ సమాచారాన్ని నెహ్రూ కావాలని తొక్కిపెట్టారనో మరేదో కుట్ర చేశారనో విశ్వసించడం కష్టం. నిజానికి 1945లో కాంగ్రెస్ తరఫున అజాద్ హింద్ ఫౌజ్ ఖైదీల రక్షణకి పండిట్ నెహ్రూ చురుకుగా పని చేశారు.

ఇదిలా ఉండగా 1945 విమాన ప్రమాదంలోనే బోస్ మరణించారనే కథనాన్ని ధృవపరుస్తూ ప్రత్యక్ష సాక్షి, ఆ రోజు బోస్‌కు వైద్యం చేసిన డాక్టర్ తనెయోషి హోషిమి చెప్పిన వివరాలు ఇప్పుడు తాజాగా వెలుగులోకి వచ్చాయి. డాక్టర్ హోషిమి ప్రస్తుతం ఉత్తర జపాన్‌లో నివసిస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో డా॥హోషిమి జపాన్ సైన్యంలో కెప్టెన్ (మెడికల్) గా పనిచేశారు. జపాన్ లొంగుబాటు తర్వాత డా॥హోషిమిని బ్రిటిష్ ఇంటలిజెన్స్ అధికారులు హాంకాంగ్‌లో ప్రశ్నించినపుడు బోస్ చివరి క్షణాలకి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

డా॥హోషిమి కథనంలో బోస్‌ను ఏ పరిస్థితుల్లో తైకూలోని సైనిక ఆసుపత్రికి తీసుకువచ్చిందీ, తాను ఆయనకు ఏవిధమైన వైద్య సేవలు అందించినదీ వివరంగా పేర్కొన్నారు. బోస్ మరణానంతరం తాను మృతదేహాన్ని జపాన్ తరలించేందుకు రసాయనాలు పూసి సిద్ధం చేశానని, తర్వాత సైనికాధికారులు ఆ ప్రయత్నం విరమించుకుని దహన వాటికకి తరలించారని డా॥హోషిమి స్పష్టం చేశారు. బోస్ అస్థికలు అటుపిమ్మట టోక్యోలోని రెంకోజీ దేవాలయానికి చేరాయని డా॥హోషిమి తెలిపారు.

డా॥హోషిమి ప్రత్యక్ష కథనం వలన బోస్ మరణంపైన ఏర్పడిన వివాదానికి తెరపడినట్లేనని, జస్టిస్ ముఖర్జీ కమిషన్ ఇదే విషయాన్ని సందేహాతీతంగా ధృవీకరిస్తుందని ఇప్పుడు అత్యధికులు అభిప్రాయపడు తున్నారు.

మొన్నటి జనవరి 23 బోస్ 104 వ జయంతి. బోస్ సజీవుడేనని ఏనాటికైనా ఆయన తిరిగి భారత్‌కి వచ్చేది ఖాయమని నమ్మే అభిమానులు అసంఖ్యాకంగా వున్నారు. ఆ మహానాయకుడి వ్యక్తిత్వంలోని లోకోత్తర ఆకర్షణ, ధీరోదాత్తమైన, స్ఫూర్తివంతమైన, సాహసవంతమైన, ఆయన వీరగాథ, నేతాజీ ఏనాటికైనా సజీవంగా తిరిగి వస్తే బాగుండుననే కోట్లాదిభారతీయుల ఉద్వేగభరిత ఆకాంక్ష... ఇవన్నీ ఆ మహనీయుడు మృత్యువును జయించారని విస్పష్టంగా సాక్ష్యమిస్తున్నాయి.

## రాణి ఝాన్సీ రెజిమెంట్



మాతృదేశ ముక్తి కోసం మహిళలు కూడా పురుషులతో భుజం భుజం కలిపి పోరాడాలని నేతాజీ దృఢంగా అభిప్రాయపడ్డారు. ఆయన పట్టుదల కారణంగానే అజాద్ హింద్ ఫౌజ్‌లో పూర్తిగా మహిళలతో కూడిన రాణి ఝాన్సీ రెజిమెంట్ ఏర్పడింది. కెప్టెన్ లక్ష్మి నాయకత్వంలో మొదట కేవలం 20 మందిని కూడగట్టి ప్రారంభించిన ఈ రెజిమెంట్ ఒక దశలో వేలకి చేరుకుంది. స్త్రీలతో దళాన్ని నిర్మించాలనే ఆలోచన నేతాజీకి మద్దతిస్తున్న జపాన్ సైనికాధికారులకే మింగుడు పడలేదు. తరతరాలుగా దురాచారాలకు, బానిసత్వ సంకెళ్ళలోనూ పడి నలిగిపోతూ అబలలని అలుసుగా చూడబడిన మహిళలు - నేతాజీ నేతృత్వంలో అపరకాళికలై తుపాకులు ధరించి దేశ స్వాతంత్ర్యంలో ఆనాడు ఒక అపూర్వమైన వినూత్నమైన అధ్యాయానికి నాందిపలికారు.

## గాంధీజీ - నేతాజీ: నిరుపమాన వ్యక్తిత్వాలు



గాంధీజీ, నేతాజీ రెండు భిన్నమైన పంథాల ద్వారా భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహానాయకులు. గాంధీజీలానే సుభాష్ కూడా ఆధ్యాత్మిక వాదే. సుభాష్ సైతం భగవద్గీత నుంచే ప్రేరణపొందారు. (విమాన దుర్ఘటన సమయంలో కూడా బోసు దగ్గర గీత వ్యక్తిగత కాపీ ఒకటి ఉండేదని చెపుతారు.) గాంధీ విధానాలతో ఎంతగా విబేధించినా, ఎంతగా విమర్శించినా - నేతాజీ ఆమరణాంతము గాంధీ మహాత్ముడి పట్ల అపార గౌరవాన్ని ప్రదర్శించారనే సంగతి ఆశ్చర్యం కలిగిస్తుంది. 1939లో పట్టాభి సీతారామయ్యపై విజయాన్ని సాధించి సుభాష్ చంద్రబోస్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు గాంధీ మహాత్ముడు 'పట్టాభి ఓటమి నా ఓటమి' అని ప్రకటించారు. గాంధీ ప్రకటన పట్ల బోసు వేదన చెంది - మహాత్ముడు ఆ విధంగా భావించడం తన దురదృష్టమన్నారు. మహాత్ముడికి ఓటు చేయాలా లేక నాకు ఓటు చేయాలా అనే ప్రశ్న ఎప్పుడూ ప్రజలముందు లేనపుడు, గాంధీజీ ఓటమి చెందడం ఎలా సంభవిస్తుందని - బోసు ప్రశ్నించారు. మహాత్ముడికి తనపై ఎలాంటి అభిప్రాయం ఉన్నప్పటికీ తానుమాత్రం ఎప్పుడూ ఆయన సానుభూతి పొందేందుకే ప్రయత్నిస్తానని, అది తన ఆశయమని బోస్ స్పష్టం చేశారు. భారతీయులందరి ప్రేమని పొందగలిగిన తాను భారతీయులందరిలో ఉత్తమోత్తముడైన గాంధీజీ ప్రేమ పొందలేకపోతే అంతకంటే విషాదకర విషయం మరొకటి ఉండబోదని - బోస్ గాంధీపట్ల తన గౌరవాన్ని వ్యక్తపరిచారు.

తన పద్ధతితో విబేధించినపుడు "ముందుకు సాగిపోయి నీకు మంచిదని తోచిన పద్ధతిలో చెయ్యి" అని గాంధీ బోసుకి సలహా ఇచ్చారు. అంతేకాకుండా "నీకు విజయం చేకూరితే మొట్టమొదట అభినందించేవాడిని నేనే" అని కూడా మహాత్ముడు బోస్‌కి స్పష్టం చేశారు.

గాంధీ విధానాలతో విభేదించి విదేశాలకు వెళ్ళి అజాద్ హింద్ ఫౌజ్‌ని నిర్మించిన తర్వాత కూడా బోస్ గాంధీ మహాత్ముడిని ఏనాడూ అగౌరవపరిచే విధంగా మాట్లాడలేదు. పైగా స్వాతంత్ర్యాన్ని సాధించి గాంధీ మహాత్ముడి పాదాలముందు ఉంచుతానని ప్రకటించి బోస్ మహాత్ముడి పట్ల తనకున్న గౌరవాన్ని లోకానికి తెలియచేశారు.

సుభాష్ దేశభక్తి అద్వితీయమైనదని గాంధీ మహాత్ముడు అనేక సందర్భాల్లో పేర్కొన్నారు.

గాంధీని "జాతిపిత" అని సుభాష్ సంభావిస్తే, బోసును "దేశ భక్తుల్లో యువతార Prince among patriots) అని గాంధీ ప్రశంసించారు.

# విజయవిహారాన్ని ఆపలేరు!




విజయవిహారం డిసెంబర్ సంచికలోని ఒక ధారావాహికలోని అంశాన్ని అభ్యంతరకరమని పేర్కొంటూ పోలీసులు విజయవిహారం పైన దాడి చేయడం కార్యాలయం సీలు వేసి సామాగ్రి స్వాధీనం చేసుకోవడం, బుక్‌స్టాల్స్‌పై దాడి చేసి కాపీలను స్వాధీనం చేసుకోవడం, రాష్ట్రవ్యాప్తంగా ఏజంట్లను, దుకాణదారులను భయభ్రాంతులను చేయడం, ఎడిటర్‌పైన, కోఆర్డినేటర్‌పైన కేసులు దాఖలు చేయడం - పాఠకులకు విదితమే.

...Prima facie, the action on the part of the respondents in seizing the very printing press and putting a lock and seal on the premises is not supported by any authority of law. It is difficult to countenance such an action on the part of the respondents. Freedom of speech is a guaranteed fundamental right to every citizen of this Country. Publication cannot be proscribed, seized and censored merely dubbing the same as objectionable. If such an action is countenanced the very fundamental rights of speech and expression may be in peril...

పోలీసుల చర్య చట్టవ్యతిరేకమని, చెల్లదని - ప్రకటించాలని, కేసులను రద్దుచేసి న్యాయం చేయాలని కోరుతూ విజయవిహారం ఎడిటర్, కోఆర్డినేటర్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో దాఖలు చేసుకున్న పిటిషన్‌పైన ది. *22-12-2000*న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులలో న్యాయమూర్తి పై వ్యాఖ్యలను చేశారు.

పోలీసులు విజయవిహారం ముద్రణాలయాన్ని స్వాధీనం చేసుకోవడం, దానికి తాళాలు సీళ్ళు వేయడం, చట్టానికి అనుగుణమైన చర్యలుగా కనిపించట్లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. పోలీసుల చర్యలను ఆమోదించడం కష్టమని హైకోర్టు అభిప్రాయ పడింది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ మన దేశంలో పౌరులందరికీ రాజ్యాంగం ద్వారా హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కు అని హైకోర్టు స్పష్టం చేసింది. ఏదైనా ప్రచురణను కేవలం అది 'అభ్యంతరకరం' అనే ముద్రవేయడం ద్వారా - నిషేధించడం గానీ, స్వాధీనం చేసుకోవడంగానీ, సెన్సార్ చేయడంగానీ సాధ్యం కాదని హైకోర్టు నిర్ద్వంద్వంగా స్పష్టం చేసింది. ఇటువంటి చర్యలను ఆమోదిస్తే రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యం, భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యం వంటి ప్రాథమిక హక్కులు ప్రమాదంలో పడతాయని హైకోర్టు స్పష్టం చేసింది.

ఇదే తీర్పులో హైకోర్టు పోలీసులు విజయవిహారం ఆఫీసు నుంచి స్వాధీనం చేసుకున్న కంప్యూటర్లు తదితర సామాగ్రిని ఇచ్చివేయమని, కార్యాలయానికి వేసిన సీళ్ళు తాళాలు తొలగించమని ఆదేశాలిచ్చింది.

* * *

...You are directed not to interfere with the sale and distribution of December 2000 Edition of Vijaya Vihaaram Monthly Magazine until further orders. The petitioners shall be at liberty to distribute and sell December 2000 edition of Vijaya Vihaaram Magazine without any interruption whatsoever from the addresses order follows...

డిసెంబర్ *29*న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మరొక మధ్యంతర ఉత్తర్వును ఇస్తూ - విజయవిహారం డిసెంబర్ *2000* సంచిక అమ్మకాలలోనూ పంపిణీలోనూ జోక్యం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వాన్నీ, ఆంII ప్రII డి.జి.పి. గారినీ, హైద్రాబాద్ నగర పోలీసు కమిషనర్‌గారినీ పై విధంగా ఆదేశించింది. ఈ మధ్యంతర ఉత్తర్వులు తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకూ అమలులో ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. విజయవిహారం డిసెంబర్ సంచికని ప్రభుత్వం, పోలీసుల నుంచి ఎటువంటి ఆటంకాలు లేకుండా పంపిణీ చేసుకునే, అమ్ముకునే స్వేచ్ఛ ప్రచురణకర్తలకి ఉందని హైకోర్టు పేర్కొంది.

* * *

విజయవిహారానికి మద్దతుగా మాకు రాష్ట్రం నుంచీ, జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా పాఠకులు, అభిమానులు, మిత్రులు మద్దతు తెలుపుతూ సందేశాలు రాస్తున్నారు. కార్యక్రమాలు చేపడుతున్నారు. గత రెండున్నర నెలలుగా జరిగినది రాస్తే అది ఒక చరిత్ర అవుతుంది.

పోలీసులు సంపాదకుడిపైన సమన్వయ కర్తపైన పెట్టిన కేసులకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జనవరి *17*వ తారీకున బెయిల్ మంజూరు చేసింది.

పోలీసులు పెట్టిన కేసులని కొట్టివేయాలని కోరుతూ మేము పెట్టుకున్న పిటిషన్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విచారణలో ఉంది.

భారతదేశపు చట్టాలపైన న్యాయస్థానాలపైనా మాకు పరిపూర్ణ విశ్వాసం ఉంది.

యతోధర్మస్తతోజయః

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తన తుది తీర్పు వెలువరించాక ఈ అంశంపైన సమగ్రమైన వ్యాఖ్యానాలు కథనాలతో మా ప్రియపాఠకుల ముందుకు రాగలమని మనవి చేసుకుంటున్నాము.

ధన్యవాదాలు.

**- రమణమూర్తి**



శ్రీచైతన్యకళాశాల

# ఎవరు చేస్తున్న హత్యలివి?



సుమారెడ్డి

*"ఎంత చదివినా మార్కులు రాని నాకు బతకటం అనవసరమని నా జీవితం మీద నాకే విరక్తి కలిగి ఈ పని చేశాను" - శ్రీనాధరావు.*

"హాస్టల్ వార్డెన్ అంటే తల్లితండ్రుల్లా చూసుకోవాలి. పెద్దవాళ్ళు పిల్లల్ని దీవించాలి. శపించరాదు. డోంట్ డిప్రెస్ ది స్టూడెంట్స్. చాలా మందికి మంచి మార్కులు రావు కానీ వాళ్ళంతా చెడ్డవాళ్ళని అర్థం కాదు. వాళ్ళని (అన్నయ్యల్ని) హాస్టల్‌లో మాత్రం జాయిన్ చెయ్యకు. నువ్వు వెళ్ళి వుండు లేదా బయట రూమ్స్‌లో ఉంచు. బి.టెక్కే కాదు ఇంకా చాలా కోర్సులున్నాయి" - శ్రీలక్ష్మి.

"తమ కోసం తాము చెయ్యని యుద్ధంలో ఓడిపోయిన సైనికుల చివరి మాటలు అవి".

విద్యావ్యవస్థ, తల్లిదండ్రులు, కార్పొరేట్ రెసిడెన్షియల్ కాలేజిలు కలిసి బలి తీసుకున్న ఇద్దరు విద్యార్థులు రాసిన లేఖల్లో భాగం. ఈ విద్యాసంవత్సరంలో దాదాపు పది మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఊర్లు వేరు, పేర్లు వేరు, కారణం మాత్రం ఒక్కటే! బలవంతపు చదువు - పెరుగుతున్న ఒత్తిడి.

నిజానికి ఇది పైకి కనిపించే కారణం మాత్రమే. సూక్ష్మంగా ఆలోచిస్తే అసలు కారణాలు ఎన్నో కనిపిస్తాయి. ఈ మధ్యకాలంలో బాగా ముదిరిన ఎంసెట్ మానియా (పిచ్చి) ఒక కారణంగా చూపించి చేతులు దులుపుకోవటం ప్రభుత్వం చేసిన పని. చిత్రమేమిటంటే తప్పంతా మీదేనని ఒకరి మీద ఒకరు తోసేస్తున్నారు. తల్లిదండ్రులు కాలేజీల మీద (చేర్పేటప్పుడు తెలియదా?), కాలేజీలు తిరిగి తల్లిదండ్రుల మీద ఆరోపణలు చేస్తున్నాయి. మేధావివర్గం మాత్రం విద్యావ్యవస్థను దోషిగా నిలబెట్టింది. అసలు కారణం ఏమిటి? అన్న ప్రశ్నకు విడిగా సమాధానం దొరకదు. ఒక్కో స్థాయిలో ఒక్కో కారణం వుండొచ్చు. అయితే చివరగా ఒత్తిడి పెరిగేది మాత్రం ఇంకా పరిపక్వం చెందని చిన్నారి జీవితాల మీదే.

సమస్య ఇంటి నుంచి మొదలై విద్యావ్యవస్థలో భాగమైన విద్యా సంస్థల దగ్గర ముగుస్తుంది. ఆరోపణల పర్వం కూడా అంతే ఉదాహరణకు విజయవాడలోని ఓ ప్రయివేటు రెసిడెన్షియల్ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న కసర్ల సుమారెడ్డి ఉదంతం పూర్వాపరాలు చూస్తే అర్థం అవుతుంది. ఆ అమ్మాయి రాసిన (లేదా రాసిందని చెప్పబడుతున్న లేఖలోని విషయాలు పక్కనబెడితే - సరిగా చదవలేదని తండ్రి ఆగ్రహించటం ఇంటికి వెళ్ళి వచ్చిన తర్వాతే ఇలా జరిగిందని కళాశాల యాజమాన్యం భావిస్తుండగా - తండ్రి మాత్రం కళాశాలలో పెరిగిన ఒత్తిడి కారణంగానే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. అలాగే గుంటూరులో ఫిబ్రవరి ఏడున ఆత్మహత్య చేసుకున్న కొమ్మాలపాటి శ్రీలక్ష్మి రాసిన ఉత్తరంలో కొన్ని విషయాలు స్పష్టంగానే వున్నాయి. ఆ అమ్మాయి అమాయకంగా రాసుకున్న చివరి లేఖలో సమాజానికి సంధించిన కొన్ని ప్రశ్నలున్నాయి. తల్లిదండ్రుల ఒత్తిడి - శాపనార్థాలు, హాస్టల్‌లో పరిస్థితులు - ఎంసెట్ కాకుండా ఇతర కోర్సులు కూడా వున్నాయన్న విషయం - అన్నింటికీ మించి తన ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా బలవంతంగా చేస్తున్న పని (చదువు).

### తల్లిదండ్రుల పాత్ర ఏమిటి?

ఎవ్వరికైనా మొదటి విద్యాసంస్థ ఇల్లే. తల్లిదండ్రులు సమాజంలో తమ పిల్లలు అత్యున్నత స్థానంలో వుండాలన్న ఒత్తిడికి లోనై పిల్లలను వారి అభిరుచి, ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా చదువుకోవటానికి బలవంతం చేస్తున్నారు. తమ పిల్లలు డాక్టర్‌లు గానో, ఇంజనీర్లుగానో సమాజంలో ఉన్నత స్థానంలో వుండాలన్న వారి కోరిక సమంజసమైందే. అయితే తమ పిల్లల శక్తి సామర్థ్యాలను అంచనా వేయటంలో చేస్తున్న తప్పు వల్ల పిల్లలు నెగెటివ్‌గా ఆలోచించే వైపుకు నెట్టబడుతున్నారనేది కొంతవరకు నిజం. నిజానికి అందరు పిల్లలు సమానమైన తెలివితేటలతో వుండరన్నది వాళ్ళు గమనించరు. ఒకే ఇంట్లో కూడా ఈ పరిస్థితి వుండదు. ముఖ్యంగా ఆడపిల్లలు. వివిధ రకాల పోలికలతో తల్లిదండ్రులు పిల్లలపై మానసిక ఒత్తిడిని పెంచుతూ పోతున్నారు. ఈ మధ్య ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో అధికశాతం ఆడపిల్లలే. పిల్లలు ఎపుడైనా చదువులో వెనకబడితే ఎంకరేజ్ చెయ్యవలసింది పోయి మొదటగా వాళ్ళే ఎత్తి పొడవటం ద్వారా పిల్లలు మరింత ఆత్మన్యూనతా భావానికి లోనయ్యే అవకాశం ఎక్కువ. ఆ విధంగా పిల్లలకు గైడ్‌లుగా వుండవలసిన పేరెంట్స్ - ఒక విధంగా విమర్శకులుగా, శత్రువులుగా మారిపోతున్నారు. ప్రేమానురాగాలు వున్న ఇళ్ళల్లో, కొంత మానసిక పరిణతి సాధించిన కుటుంబాల్లో ఇలాంటి ఆత్మ హత్యలకు ప్రేరేపించే ఒత్తిడి దాదాపు వుండదు. ఈ పోటీ ప్రపంచంలో మొదట అభద్రతా భావనకు గురయ్యేది తల్లిదండ్రులే. దాంతో వాళ్ళు ఒత్తిడికి గురయ్యి పిల్లలను మరింత డిప్రెషన్‌కు (వారికి తెలీకుండానే) గురి చేస్తారు. నిజానికి కౌన్సిలింగ్ కావాల్సింది తల్లిదండ్రులకు. వాళ్ళు మొదట మానసిక ఒత్తిడికి, సామాజికంగా ఎదురయ్యే పరిస్థితులకి తట్టుకోవటం అవసరం. చాలా మంది తల్లిదండ్రులు 'ఏం చెయ్యమంటారు పరిస్థితులు అలా వున్నాయి. ఇపుడు కాలేజీల్లో ఎంపిసి, బైపీసీ కోర్సులు తప్ప మరేవీ లేవు. మేము ఏదో ఒకటి ఎన్నుకోవాలి' అన్న బలహీనమైన వాదనతో ఏకీభవించేస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ఏదో ఒకటి తీసుకోవచ్చు. తప్పులేదు. అయితే ఎంసెట్ దృష్టితోనే వాటిల్లో చేరటం వల్ల ప్రెషర్ ఎక్కువవుతుంది. అభిరుచి మేరకు, ఇష్టపడి తీసుకుంటే పర్వాలేదు. చాలామంది తల్లిదండ్రులకు మిగతా ఉద్యోగుల గురించి సరైన అవగాహన లేదు. ఈ పోటీ ప్రపంచంలో కూడా డాక్టర్, ఇంజనీర్‌తో కాకుండా ఇతర ఉద్యోగాలు కూడా బాగానే వున్నాయి - ఎక్కువగా వున్నాయి కూడానూ. కొద్ది శాతం తల్లితండ్రులు అదొక పెట్టుబడి (మగపిల్లల ద్వారా)గా భావించే దురదృష్టకరమైన సామాజిక రుగ్మతలు కూడా వున్నాయి. అందుకే తల్లిదండ్రులు పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపాలి. 'పోతే పోయిందిలే మళ్ళీ చూసుకోవచ్చు - కొంపలేమీ మునగవులే' - లాంటి వేదాంత ధోరణి కూడా చాలా వరకు ఉపయోగపడుతుంది. పిల్లలను తమపైన ఆధారపడేలా కాకుండా స్వతంత్రంగా ఆలోచించేలా పెంచగలగాలి. అన్నింటి కన్నా ముఖ్యం ప్రతీదానికి టెన్షన్ పీలవకుండా నింపాదిగా తాము ప్రవర్తించగలగాలి. అపుడే పిల్లలకి నమ్మకం కలుగుతుంది. పిల్లల గురించి కాలేజీలో గూఢచారుల్లా కాకుండా ఓ కౌన్సిలర్‌లా ప్రవర్తించాలి. ఎప్పుడైనా పిల్లలు విఫలమైతే సముదాయించాలి. పిల్లలు పెద్దయ్యాక ఏం కావాలనుకున్నారో తెలుసుకుని అందుకు అనుగుణంగా వారికి సౌకర్యాలు కల్పించాలి - సాయం చెయ్యాలి. బలవంతంగా ఏదీ చెయ్యకూడదు.

### పనికిరాని విద్యా విధానం

దేశంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా వుందన్నది కొత్తగా కనుక్కున్న నిజం కాదు. "ఇంటర్మీడియెట్‌లో సిలబస్ కొండంతగా వుంది. అదీ అర్థం పర్థం లేకుండా" - అన్న వాదన సరైందే. ఒకసారి ఎంసెట్, ఇంటర్ రెండు కోర్సులకు చదవటం పరిపక్వం చెందని వయసులో మానసిక ఒత్తిడిని పెంచుతుందని సైకాలజిస్టులు మొత్తుకుంటూనే వున్నారు. కీలకమైన ఇంటర్ స్థాయిలో అనేక సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం వుంది. ఎంసెట్ పిచ్చి ఏ స్థాయిలో వుందంటే దాదాపు అన్ని ప్రయివేట్ కాలేజీల్లో ఆర్ట్స్ గ్రూపులు లేవు! ఎంత దారుణం! ఇంటర్ స్థాయి నుంచే వివిధ కోర్సులను ప్రారంభించే అవకాశాలు లేవు. చదివిన చదువుకి బయటి ప్రపంచంలో అప్లికేషన్ లేదు. కోర్సులు పరిమితం. ఛాయిస్ తక్కువ. దానికి తోడు పరీక్షా విధానం కూడా అత్యంత లోపభూయిష్టంగానే వుంది. ప్రతివాళ్ళు దీని గురించి గోల చేస్తూనే వున్నారు. గ్రేడింగ్ పద్ధతి వల్ల విద్యార్థులు ఫెయిల్ కావటం - నిరాశ పడటం వంటివి తగ్గుతాయి. ఒకేషనల్ కోర్సులు చేస్తే ఉద్యోగావకాశాలు తక్కువన్న భావన వుంది.

### ప్రభుత్వ వైఫల్యాలు

రాష్ట్రంలో తామరతంపరగా వెలుస్తున్న కార్పొరేట్ కాలేజీలపై ప్రభుత్వ నియంత్రణే లేదు. నిఘా లేదు. విద్యార్థుల ఆత్మహత్యలపై కూడా ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదు. ఓ 'అధ్యయన కమిటీ' వేసి చేతులు దులుపుకుంది. ఆ కమిటీలో కొంతమంది కళాశాల యజమానులు, కరస్పాండెంట్లు వుండటం విశేషం! ఆ కమిటీ నివేదిక సమర్పించింది. ప్రభుత్వం ఏం చేస్తుందో మరి? మండలానికో కాలేజీ అన్న ప్రాతిపదికన కళాశాలలు వెలుస్తున్నాయి. నిబంధనలకు నీళ్ళొదులుతున్నాయి. అయినా ప్రభుత్వ జోక్యం అంతంత మాత్రమే. ప్రయివేటు కళాశాలలు ఎలా పని చేస్తున్నాయన్న దానిపై ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నది అందరికీ తెలుసు. అసలు వున్న చట్టాలు సైతం అమలవుతున్నాయా? లేదా? అన్న సంగతి వెరిఫై చేసే ఓపిక ప్రభుత్వ యంత్రాంగానికి లేదు. ఇక ప్రభుత్వ కాలేజీల గురించి ఎంత తక్కువ చెపితే అంత మంచిది.

### పిల్లల పాలిటి చెరసాలలు - ఆ కాలేజీలు

ప్రయివేటు కాలేజీలు - అదీ రెసిడెన్షియల్ కాలేజీలు వ్యాపార దృక్పథంతో అనేక నిబంధనలకు తిలోదకాలివ్వటం - ఫలితాల కోసం పట్టుబట్టడంతో పిల్లలు మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారన్నది ఒకవిధంగా స్పష్టమైపోయింది. ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీ కొనన్ని నిజాలు తేల్చింది. దాన్ని బట్టి ప్రయివేట్ కాలేజీల్లో ఒత్తిడి అధికంగా వుంటుందన్న సంగతి తేలిపోయింది. ఆటపాటలు లేకపోవటం - విశ్రాంతి లేకపోవటంతో ఒత్తిడి పెరుగుతుందన్నది నిజమే. కొన్ని కాలేజీల్లో తెల్లవారు జామున ఆరు నుంచి మొదలైన చదువు (మధ్యలో మొత్తం కలిపి ఓ రెండు గంటల విశ్రాంతితో) రాత్రి పదకొండు వరకు సాగుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పిల్లలకు వారాంతపు సెలవులు అస్సలు లేవు. పిల్లల మానసిక, శారీరక స్థితిగతులను అంచనా వేసే పరిస్థితులూ లేవు - టైము అస్సలు లేదు.

కొన్ని కాలేజీలు మరింత ముందుకెళ్ళి వివిధ ప్రదేశాల్లో తమ మార్కెటింగ్ ఆఫీసులను సైతం ఏర్పాటు చేసుకున్నాయంటే పరిస్థితి ఎంత దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక కళాశాలలో ఇరవై వేలమంది పైగా విద్యార్థులు వున్నారన్న దారుణమైన సంగతి ఇటీవలే వెలుగులోకి వచ్చింది. విద్యను ఇంత వ్యాపారాత్మకంగా మార్చిన ఘనత ప్రయివేటు సంస్థలదే.

అలాంటి కాలేజీల్లో, పోటీకి తట్టుకోవాల్సిన పరిస్థితుల్లో పిల్లల పరిస్థితి దారుణం. కొన్ని కాలేజీల్లో ఇళ్ళకు ఉత్తరం కూడా రాయటానికి వీల్లేదట. తల్లిదండ్రులకు ఎప్పుడు పడితే అపుడు అనుమతించరు. కొన్ని కార్పొరేట్ సంస్థలు క్లాస్‌రూమ్‌లలో కెమెరాల నిఘా ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగాయి. మార్కులు తక్కువ వస్తే వివిధ రకాల అవమానాలకు గురి చేస్తున్నారు. సంస్థ అభివృద్ధి కోసం పిల్లలను బలవంతంగా చదివిస్తున్నారు. మార్కులు తక్కువ వచ్చినందుకు లెక్చరర్ ఒక విద్యార్థి మీద చేయి చేసుకోగా - సదరు విద్యార్థి కాలేజీ మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడంటే అర్థం చేసుకోవచ్చు. విపరీతమైన పరీక్షలు, టెస్టులు పెట్టి ప్రతినిత్యం విద్యార్థులపై ప్రెషర్ పెంచుతున్నారు. "గుర్రాల కళ్ళకి గంతలు కట్టినట్లు - విద్యార్థులు దృష్టి మరల్చకుండా నిత్యం ఏదో ఒక పరీక్షనో, క్లాసో లేదా స్టడీ అవరో పెట్టి చంపుతున్నారు" - అని పేరెంట్స్ బాధపడటం తరచూ జరుగుతుంది.

ఇక లెక్చరర్‌లు, ట్యూటర్‌లు, వార్డెన్‌లు కూడా పిల్లల్లో ఒత్తిడి పెంచుతున్నారు. ఎందుకంటే తక్కువ మార్కులు వస్తే యాజమాన్యం వీరినే బాధ్యులుగా చేయటం. దాంతో వారిపై ఒత్తిడి పెరిగిపోతున్నది. అది వాళ్ళు చూపిస్తున్నారు. ఇలా ఎవరి స్థాయిలో వాళ్ళు ఒత్తిడికి లోను కావటం - చివరికి అది పిల్లలపై చూపించటం జరుగుతోంది. ఆ విధంగా రెసిడెన్షియల్ కాలేజీలు కారాగారాల్లా మారిపోయాయి. అన్ని రెసిడెన్షియల్ కాలేజీలు ఎంసెట్ దృష్టితోనే నడుస్తుండటం వల్లనే మరింత ఒత్తిడి పెరుగుతోంది. ఇతర సంస్థలతో పోటీ వల్ల, ఫలితాలే ముఖ్యమైపోయిన నేపథ్యంలో కార్పొరేట్ కాలేజీలు ఏమైనా చేయటానికి సిద్ధపడుతున్నాయి.

• ఈ ఆత్మహత్యల పర్వం ఆగాలంటే ఒక్కరి వల్ల సాధ్యమయ్యేది కాదు. అందరూ ఆలోచించాలి. సమస్యను మరింత క్లిష్టతరం చెయ్యకుండా - చర్చల ద్వారా ఫలితాలు రాబట్టాలి. లేదంటే రాబోయే కాలంలో పిల్లలు చదువంటే భయపడే పరిస్థితి ఉత్పన్నం కావచ్చు.

(విజయవాడ నుంచి రశ్మీసీదర్శ్
కర్నూలు నుంచి సలీం బాషా)

## బలవంతపు చదువులకు ఏది కళ్ళెం?

మన రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో లాభార్జనే ధ్యేయంగా వెలసిన ప్రైవేటు రెసిడెన్షియల్ కళాశాలల్లో ప్రతి సంవత్సరం 30 నుంచి 40 మంది విద్యార్థినీ విద్యార్థులు బలవన్మరణాల పాలవుతున్నారు. అకాల మరణానికి గురైన చాలామంది అభాగ్యుల తల్లిదండ్రులు కన్నీళ్లు కుక్కుకుని ఊరుకోకుండా సుహాసిని తండ్రి ప్రభాకర్ జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై నివేదిక పంపమని జాతీయ మహిళా కమిషన్ రాష్ట్రప్రభుత్వానికి ఒకటికి రెండు లేఖలు రాసింది. స్పందన లేదు. స్వయంగా విచారణ జరపడమే మేలని మహిళా కమిషన్ నిర్ధారణకొచ్చింది. ఈ ఏడాది జనవరి 25వ తేదీన సిద్దిపేటకు చెందిన వాణిప్రియ ఆత్మహత్య చేసుకుంది. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన దాఖలాల్లేవని శ్రీమతి శాంతారెడ్డి తప్పుపట్టారు. ఆమె శ్రీ చైతన్య కాలేజీ క్యాంపస్‌లు, హాస్టళ్లకు వెళ్లి విచారణ జరిపారు. సుహాసిని, వాణిప్రియ చనిపోయిన పరిస్థితుల గురించి శ్రీమతి శాంతారెడ్డి విద్యార్థినులతోను, కాలేజీ యాజమాన్యంతోను విడివిడిగా వాకబు చేశారు. సుమ ఆత్మహత్యతో ఇటు తల్లిదండ్రులు, అటు ప్రజలు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఆత్మహత్యలపై దృష్టి సారించారు. అంతర్మథనం ప్రారంభమైంది. రెసిడెన్షియల్ కాలేజీల యాజయాన్యాలదే బాధ్యతని కొందరు, తల్లిదండ్రుల వైఖరే కారణమని మరికొందరు అంటున్నారు. విద్యార్థి సంఘాలు రాస్తారోకోలు, ప్రైవేటు కళాశాలల బంద్‌లు నిర్వహిస్తూ ఈ విద్యావిధానాన్ని ప్రక్షాళనచేయాలని పట్టుబడుతున్నాయి.

ఎట్టకేలకు జిల్లా అధికార యంత్రాంగం ఒక నివేదికను ప్రభుత్వానికి పంపింది. ఇంటర్మీడియట్ సిలబస్, ఎంసెట్ పరీక్ష గురించి మానసిక వత్తిడి, ప్రైవేటు కళాశాలల్లో విద్యావిధానం, తల్లిదండ్రుల వైఖరి గురించి నివేదిక పంపామని కృష్ణా జిల్లా కలెక్టర్ శ్రీ బి.ఆర్. మీనా ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకటికి రెండు కమిటీలు వేసింది. ముగ్గురు మంత్రులతో ఒక కమిటీని, ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ పి. నీరదా రెడ్డి అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. "సుమ ఆత్మహత్యపై వేర్వేరు ఏజెన్సీలు తమ పరిధిలో దర్యాప్తు చేస్తున్నాయి. మా కమిటీ అకడమిక్ విషయాలకు పరిమితమై అధ్యయనం చేస్తుంది" అని ప్రొఫెసర్ నీరదా రెడ్డి ప్రకటించారు. కొందరు మంత్రులు, ఐఏఎస్ అధికారుల పిల్లలు, బంధువులు చదువుతున్న ప్రైవేటు కాలేజీలపై మంత్రుల కమిటీ విచారణ ఎంతగొప్పగా వుంటుందోనని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సుమ ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. సుమ వున్న హాస్టల్ ఇన్‌చార్జ్ శశికుమార్‌ను కేసు దర్యాప్తు అధికారైన గన్నవరం సిఐ అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థినీ విద్యార్థుల ఆత్మహత్యలపై హైకోర్టు ప్రస్తుత న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, సిబిఐతో విచారణ జరిపించాలని, రెసిడెన్షియల్ పద్ధతిని పూర్తిగా నిషేధించాలని, ఎంసెట్‌ను నిషేధించాలని... ఎవరికి వచ్చిన మాట వాళ్లంటున్నారు. వేలం వెర్రి 'లాభదాయకమైన చదువుల చదరంగం'లో చిక్కి శల్యమవుతున్న వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులకు ఏమైనా నిజంగా మేలు జరుగుతుందో లేదో గాని, ఇప్పటికి మాత్రం అందరూ ఈ ఆత్మహత్యల గురించే మాట్లాడుతున్నారు.



హాస్టల్‌లో సుమారెడ్డి గది

# ఈ ఉన్మాదానికి మతం లేదు



ఇప్పుడిక బుద్ధుడి వంతు!

ఇరవై రెండేళ్లుగా అంతర్యుద్ధం చేస్తూ దేశాన్ని వల్లకాడుగా మార్చినవాళ్లు, స్త్రీలను ఏనాడూ మనుషులుగా చూడనివాళ్లు, ఇప్పుడు బుద్ధుడి మీదకి యుద్ధట్యాంకులను నడిపించారు. ఆసియా ఖండానికి వెలుగును పంచిన మహోన్నత మానవుడి 'మూర్తి'ని పేల్చి దుమ్ముగా ధూళిగా మారుస్తున్నారు.

ఆఫ్ఘనిస్తాన్ దేశాన్ని ఇష్టారాజ్యంగా పాలిస్తున్న తాలిబన్‌ల చర్యలు మననున్న ప్రతి ఒక్కరినీ కలచివేస్తాయి. (విజయవిహారం డిసెంబర్ సంచికలో 'భూలోక నరకం - ఆఫ్ఘనిస్తాన్' పేరుతో ప్రత్యేక వ్యాసం ప్రచురించాం). అసహనానికి మారుపేరైన తాలిబన్‌లు - ఆ దేశంలో ఇస్లాం ప్రవేశించక ముందు నుంచీ వున్న సంస్కృతీ సంపదను గుర్తించటానికి నిరాకరిస్తున్నారు. అక్కడితో ఆగకుండా పనిగట్టుకుని, పగ పెంచుకుని మరీ ఆ ఆనవాళ్లను ధ్వంసం చేస్తున్నారు.

ఇప్పుడు తాలిబన్‌ల చూపు విగ్రహాల మీద పడింది. విగ్రహాలు, విగ్రహారాధన ఇస్లాంకి వ్యతిరేకమైనవి కాబట్టి అన్నింటినీ నాశనం చేస్తాం అంటున్నారు. దేశంలో ఉన్న అన్ని చిన్నాచితకా విగ్రహాలతో పాటు కాబుల్‌కి 150 కిలోమీటర్ల దూరంలో వున్న బమియన్ బుద్ధవిగ్రహాలకు ముప్పు ముంచుకొచ్చింది. బమియన్ కొండల్లో దాదాపు రెండు వేల ఏళ్ల క్రితం ఈ బుద్ధ విగ్రహాలను చెక్కారు. 178 అడుగుల ఎత్తుతో వున్న బుద్ధ విగ్రహం - ప్రపంచంలోనే నిలబడి వున్న బుద్ధ విగ్రహాలన్నింటిలోనూ పెద్దదీ, పురాతనమైనదీ. ఇటువంటిదే మరొకటి 125 అడుగుల ఎత్తున్న విగ్రహం వుంది. నిరంతర యుద్ధం కారణంగా ఈ విగ్రహాలకు ఇదివరకే తూట్లు పడ్డాయి. తాలిబన్ సైనికులు ఇంతకు ముందే గ్రెనేడ్‌లు విసిరి ఈ విగ్రహాల ముఖాలను ధ్వంసం చేశారు. విలువైన, ప్రాచీన బౌద్ధ కళాఖండాలున్న కాబుల్ మ్యూజియంని నాశనం చేశారు.

"అల్లా ఒక్కడే దైవం. విగ్రహాలు ఇస్లాం వ్యతిరేకం. ఇప్పుడు కానీ భవిష్యత్తులో కానీ ఈ విగ్రహాలను ఎవరూ పూజించకుండా వుండాలి. అందుకే వాటిని ధ్వంసం చేస్తున్నాం" అని తాలిబన్‌ల నాయకుడు ఒమర్ అంటున్నారు.

"ప్రాచీన సిల్క్‌రూట్‌లో ఒక కూడలిగా వున్న ఆఫ్ఘనిస్తాన్ - పర్షియా, గ్రీస్, హిందూ మతం, బుద్ధిజం, ఇస్లాం ప్రభావాలతో ఒక ప్రత్యేకమైన సంస్కృతితో విలసిల్లింది. ఆ సంస్కృతీ సంపదను నాశనం చేయవద్దు" అని యునెస్కో కోరింది. ఐక్యరాజ్య సమితి ప్రధానకార్యదర్శి కోఫీ అన్నన్, శ్రీలంక, అమెరికా, ఇండియా దేశాలు విగ్రహాలను ధ్వంసం చేయొద్దని తాలిబన్‌లకి విజ్ఞప్తులు చేసాయి. ఈ పురాతన విగ్రహాలు చారిత్రక సంపద అని, అవి కేవలం ఆఫ్ఘనిస్తాన్‌కే కాక మొత్తం మానవాళికి చెందినవని అనేక దేశాలు చెబుతున్న మాటలు చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టుగా నిష్ఫలమయ్యాయి. "మాకు అవి కేవలం రాళ్ల మాత్రమే, వాటిని పగలకొట్టి పాడుం కింద మార్చేది ఖాయం. నేను ఇస్లాంకు తప్ప దేనికీ భయపడను" అని చెప్పిన ఒమర్ అన్నంత పని చేస్తున్నారు.

తాలిబన్‌ల ఆదేశాన్ని ఆ దేశపు ఇతర నాయకులు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. "ఆ విగ్రహాలు మతంతో ప్రమేయం లేనివి. అవి మన సంపద. ఆఫ్ఘనిస్తాన్ గత 1200 ఏళ్లుగా ముస్లిం దేశంగా వుంది. కాని ఎవరూ ఆ విగ్రహాలను ధ్వంసం చేయలేదు. ఇన్నాళ్లూ పట్టించుకోని అంశాన్ని ఇప్పుడు పట్టించుకోవటం ఎందుకు?" అని ఆఫ్ఘనిస్తాన్ మాజీ విదేశాంగ మంత్రి హమీద్ ప్రశ్నిస్తున్నారు.

నిజమే! మధ్యయుగాల్లో మధ్యాసియాను వణికించి, చరిత్రలో అత్యంత క్రూరులుగా పేరుమోసిన చెంఘిజ్‌ఖాన్, తామర్లేను కూడా ఈ విగ్రహాల జోలికి వెళ్లలేదు. అయితే తాలిబన్‌లు 'గతంలో పాలకులు, వాటి జోలికి ఎందుకు వెళ్లలేదో తమకు అనవసరమనీ, తాము మాత్రం వీటిని నాశనం చేస్తామని' అంటున్నారు.

"మా దేశానికి ఇది మరొక అవమానం. పోయినేడాది తాలిబన్‌లు హిందువులను తేలిగ్గా గుర్తించడానికి వీలుగా పసుపురంగు దుస్తులు ధరించాలని ఆదేశించారు. ఈ మధ్యన కొందరు స్త్రీలను ఉరితీసినట్టు రిపోర్టులు వచ్చాయి. ఇప్పుడు విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు. మిగతా ముస్లిం దేశాలన్నీ తమ తమ దేశాల్లో ఉన్న ముస్లిమేతర సంస్కృతుల విషయంలో - తమ బాటలోనే నడవాలని తాలిబన్‌లు కోరుకుంటున్నారు. ఇది బాగా ముదిరిపోయిన ఉన్మాదం తప్ప మరేమీ కాదు." అని మసూద్ ఖలీలీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఢిల్లీలో వున్న 'ఆఫ్ఘనిస్తాన్ ప్రవాస ప్రభుత్వ' రాయబారిగా పనిచేస్తున్నారు.

దేవుణ్ణి కాదని మనిషిని కేంద్రంగా చేసుకుని విస్తరించిన మతం బౌద్ధం. ఇతరులను తనలో కలుపుకోవటానికి అది కత్తులు దూయలేదు. ఆ విధంగానే బౌద్ధమతం ఒకనాడు ఆఫ్ఘనిస్తాన్‌తో పాటు మధ్యాసియా అంతటా వ్యాపించింది. కాబుల్ రాజధానిగా చేసుకుని పరిపాలించిన కనిష్కుడు బౌద్ధ మతావలంబి. ఒకనాడు గాంధార దేశంగా పిలువబడిన ఆ ప్రాంతంలో 'గాంధారశిల్పం' పేరుతో శిల్పకళ ఉజ్వలంగా వెలిగింది. విజ్ఞానానికి, వికాసానికి ఆ ప్రాంతం మారుపేరుగా నిలిచింది. కాలక్రమంలో అక్కడ ఇస్లామ్ మతం వ్యాపించినా, అలనాటి చరిత్రకు సాక్షులుగా బుద్ధ విగ్రహాలు, హిందూ దేవతల విగ్రహాలు, ఇతర విలువైన కళాఖండాలు ఇంకా మిగిలే వున్నాయి.

వెయ్యేళ్ళ కిందట గజనీ, ఘోరీ లాంటి ఆఫ్ఘన్ పాలకులు భారత ఉపఖండంలో ఎన్నో విగ్రహాలను, దేవాలయాలను ధ్వంసం చేశారు. అదొక అజ్ఞానపుటంధయుగం. కానీ నాగరికత, మానవీయత ఎంతో పెరిగాయనుకుంటున్న ఈ కాలంలో ఇటువంటి హీనమైన పనులకు పాల్పడుతున్నది తాలిబన్‌లు ఒక్కరే. తమ మతానికి వ్యతిరేకమనే పేరుతో విగ్రహ విధ్వంసాన్ని సమర్థించుకున్నా - అప్పుడైనా ఇప్పుడైనా, అసలు విషయం మాత్రం ఒక్కటే; భిన్నమైన విశ్వాసాలున్న వారిని భయభ్రాంతుల్ని చేయటమే.

ఈ ప్రమాదం ఆఫ్ఘనిస్తాన్‌తో ఆగుతుందని చెప్పలేం. అది అటు చెచెన్యా నుంచి ఇటు కాశ్మీరు వరకు వైరస్‌లా అంటుకోవచ్చు. విశ్వాసం పేరు మీద విధ్వంసం - అది బాబ్రీమసీదైనా బుద్ధవిగ్రహమైనా ఖండనార్హమే.

తాలిబన్‌ల మాదిరిగానే ఎవరి దేశంలో వారు, పూర్వ కట్టడాలనీ కళాఖండాలనీ ధ్వంసం చేసుకుంటూ పోతే - ఇన్నాళ్ళ మానవ నాగరికతకి అర్థమే ఉండదు. అప్పుడిక మతం మతమూ కాదు, మనిషి మనిషీ కాదు •

# ఇప్పుడు దళితులపై

• *దళిత ఉద్యమం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏమిటి?*

- దళిత ఉద్యమం గత అనుభవాలను సమీక్షించుకోవాలి. దళితులకు దార్శనికుడు, తత్వవేత్త అయిన డా॥ బి.ఆర్. అంబేద్కర్ అందించిన మార్గాన్ని భూమికగా తీసుకొని దళిత ఉద్యమం నూతన జవసత్వాలను సంతరించుకోవాలి. అయితే కొన్ని సంఘాలు, పార్టీలు... రిజర్వేషన్లు, ప్రమోషన్లు పరమావధిగా భావిస్తున్నాయి. ఇంకొందరు రాజ్యాధికారం వస్తే అన్ని సమస్యలు వాటంతటవే పరిష్కారమవుతాయనే భ్రమలో ఉన్నారు. కానీ ఇవి మాత్రమే దళితులను విముక్తి చేయలేవు. ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు దళితులను పరాధీనులుగా మాత్రమే ఉంచగలుగుతాయి. ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు నిరాకరించడం నా ఉద్దేశ్యం కాదు. కానీ అవి మాత్రమే పరమావధి కాకూడదు. దేశంలో ఆర్థిక సంపద... అంటే పరిశ్రమలు, భూముల్లో తగినవాటా రానంత వరకూ రాజ్యాధికారం చేజిక్కినా ఎక్కువ కాలం నిలువరు. అందుకే దళిత ఉద్యమాల కర్తవ్యాలలో మార్పు రావాలి. భూసంస్కరణలు, పరిశ్రమల స్థాపనలో భాగస్వామ్యం కోసం ఉద్యమాలు సాగాలి. ఆర్థిక పురోగతి లేకుండా మిగతావి ఏవీ నిలబడలేవు. డా॥ అంబేద్కర్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. కులం సామాజిక, సాంస్కృతిక రంగాలలోనే కాదు, ఆర్థిక రంగంలో కూడా ఉన్నదని, అంబేద్కర్ తేల్చి చెప్పారు.

• *ఒకవైపు ప్రైవేట్ రంగం దేశాన్ని యావత్తు ఆక్రమిస్తున్న సమయంలో భూసంస్కరణలు, పరిశ్రమల స్థాపన గొంతెమ్మ కోర్కెలు అవుతాయేమో?*

- నిరంతర సంఘర్షణ దళితుల జీవనంలో భాగం. నిరాశపడి ఉంటే దళితుల చరిత్ర ఏనాడో ముగిసేది. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు పొందడానికి పోరాటం ప్రారంభం కావాలి. దానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సంపద సృష్టిస్తున్న దళితులు, భూములను సాగుచేస్తున్న దళితులు ఏనాటికైనా, ఆ రెండింటిని సాధిస్తారు. తాత్కాలికంగా అవి కష్టమనిపించవచ్చు. కానీ అసాధ్యం మాత్రం కాదు. అందుకుగాను వ్యూహాత్మకంగా దళిత ఉద్యమం తన దిశను నిర్దేశించుకోవాలి.

• *గ్లోబలైజేషన్ ప్రపంచాన్నంతా కబళిస్తుంటే ఎలా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు సాధించగలరు?*

- ఏ ఉద్యమాలైనా విజయం సాధించాలంటే, బలప్రదర్శనలు మాత్రమే సరిపోవు. మన దగ్గర సమాజం గురించిన విశ్లేషణ ఉండాలి. తగిన సమాచారం మనం సాధించుకోవాలి. సమాచారం ఒక్కొక్కసారి బ్రహ్మాస్త్రం అవుతుంది. డా॥ అంబేద్కర్ ఏ బలాన్ని చూపెట్టి సాధించారు? ఆయన సమాజంపై సమాచార యుద్ధం చేశారు. ఆ ప్రచారం సమాజాన్ని కుదిపివేసింది. బ్రాహ్మణీయ సమాజం కూడా తలొంచాల్సి వచ్చింది.

మన దేశమే కాదు ప్రపంచమంతా అమెరికాను ఆదర్శంగా తీసుకుంటున్నారు. అది మంచో చెడో వేరే విషయం. అమెరికా సాధించిన అభివృద్ధిని మనం కీర్తిస్తున్నాం. అయితే అక్కడి ప్రభుత్వం, పరిశ్రమ వర్గాలు ఆ దేశంలో ఉన్న వివిధ వర్గాలను సమైక్యం చేయడానికి కొత్త పథకాలు ప్రవేశ పెడుతున్నారు. శ్వేతజాతేతర ప్రజలకు అన్ని రంగాలలో అవకాశాలను విస్తృతం చేశారు. నైపుణ్యం లేకపోయినప్పటికీ, ప్రత్యేక శిక్షణ ద్వారా నల్ల, ఇతర రంగ జాతి ప్రజలను ఆర్థిక, ఉద్యోగ రంగాలలోకి తీసుకుంటున్నారు. ప్రతిష్టాత్మకమైనా 'నాసా' లాంటి సైన్స్ సెంటర్‌లో కూడా నల్లజాతీయులను చేర్చుకుంటున్నారు. టీవీ, సినిమా, పత్రికా రంగాల్లో తగు ప్రాతినిధ్యం కల్పిస్తున్నారు. రంగు జాతివాళ్ళు లేకుండా, సినిమాలు, సీరియల్స్ రిలీజ్ చేయకూడదనే నిబంధనాలున్నాయి. ఇటువంటి సమాచారం దళితుల చేతుల్లో ఆయుధంగా మారనున్నది.

• *బహుజన దృక్పథం దళిత వ్యతిరేకమంటున్నారని*

# జిహాద్ అంటే జీవితంలో

*అన్వర్ అలీ ఇంజనీర్ ప్రముఖ ఇస్లామిక్ పండితుడు. అయినా సంస్కరణ దృష్టితో మతాచారాలను ప్రశ్నించేందుకు ఎప్పుడూ వెనుదీయలేదు.*

*ఆయన నిత్యం ప్రార్థనలు చేసే లౌకికవేత్త.*

*అనుభూతులకు దూరం కాని హేతువాది.*

*తన తెగవారే తనని వెలివేసినా - ఆవేశంతో మాటతూలని వినయశీలి.*

*తన బోహ్రా దావూదీ తెగలో మతపెద్దల పెత్తనాన్ని, ఛాందసత్వాన్ని సవాలు చేసిన అన్వర్ ఎదుర్కొన్న చేదు అనుభవాలు అన్నీ ఇన్నీ కాదు. ఆయనను నానా తిట్లు తిట్టారు. దాడి చేసి ఎన్నోసార్లు చితక్కొట్టారు. ఇంటినీ కార్యాలయాన్నీ ధ్వంసం చేశారు. నోరు తెరిచిన ప్రతిసారీ విరుచుకుపడ్డారు. మతపెద్దకు ఒంట్లో నలతగా వున్నా దానికి సైతం అన్వర్‌నే దుమ్మెత్తిపోసారు.*

*ఆయన చుట్టూ ఎప్పుడూ ఏదో తుఫాను హోరే... అయినా చలించకుండా ఓ కొండలా నిలబడ్డారు. జెంటిల్‌మెన్ పత్రికకు ఇటీవల అన్వర్ ఇచ్చిన ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలు.*

ప్రశ్న: ...ఇంత జరుగుతున్నా మీరు ఏమాత్రం కఠినంగా మారలేదు. నిజానికి మరింత సున్నితంగా కనిపిస్తున్నారు.

జవాబు: ఇతరులు బాధపడుతుంటే చూసి తట్టుకోలేను కాబట్టే నేను పోరాడుతున్నాను. నిజానికి బానిసలే స్వేచ్ఛను తిరస్కరిస్తారు. ఎందుకంటే తమకు అన్నంపెట్టే యజమానులే లేకుంటే తమను చూసే దిక్కెవరని భయంతోనే. స్వేచ్ఛ తాలూకు విలువను క్రమంగా గుర్తిస్తారు. చాలామందికి తాము బాధలు అనుభవిస్తున్నట్లు తెలియదు. మనం పోరాడేది వాళ్ళలో అవగాహనని చైతన్యాన్ని కలిగించేందుకే కావాలి.

ప్రశ్న: ఏదైనా ఇజంలో ఉండాల్సివస్తే మిమ్మల్ని మీరు మానవతావాదిగా పిలవడానికి ఇష్టపడతారా?

జవాబు: నేను మానవతావాదిని. అంటే దానర్థం మతం పాత్రను తోసిపుచ్చుతున్నానని కాదు. (మానవతావాదిగా ఉండడానికి) మతం అడ్డంకి కానే కాదు. దేవుడి అస్తిత్వాన్ని నేను కాదనను కానీ నా దృష్టిలో మతం కంటే మానవత్వమే మిన్న.

ప్రశ్న: ఓ ఒంటరి ఉద్యమకారుడు సమాజానికి ఏం చేయగలుగుతాడు?

జవాబు: బలమైన దుష్టశక్తులకు ధైర్యంగా ఎదురొడ్డిన వ్యక్తుల ఉదాహరణలు చరిత్ర నిండా కనిపిస్తాయి. వారంతా ఒంటరి యోధులే. ఆ పోరాటంలో ఒంటరిగానే మరణించారు. మీరు సాధించిందేమిటని నన్ను ఎవరైనా అడిగితే వాసిపరంగానే తప్ప ఇదీ అని చూపించడానికి ఏమీ లేదు. ఎందుకంటే నా శక్తులన్నీ నిర్వీర్యమైయ్యాయి. నా విలువల్ని నమ్మినవారే చివరికి ఒత్తిళ్ళకు లొంగిపోయారు.

ప్రశ్న: మీ కుటుంబాన్ని వెలివేయడంతో మీ భార్య ఏ ఫంక్షన్లకీ వెళ్లలేక ఎంతో కుంగి పోయింది. అందరికీ దూరం కావడం నిజంగా దుర్భరమైన అనుభవమే కదా?

జవాబు: కానీ ఆమె నాకు అండగా నిలబడిందంటే కారణం నేను చేసేది స్వార్థంతో కాదన్నది తెలిసే... నా కుటుంబం కష్టకాలంలో ఎప్పుడూ నాతోనే ఉంది. నిజానికి బాగా అన్యోన్యంగా ఉన్న కుటుంబాలే విచ్ఛిన్నమై పిల్లలు విడిపోయిన ఉదంతాలున్నాయి. సంఘ బహిష్కారాన్ని ఎదుర్కోలేక మా అమ్మ మా నుంచి విడిగా ఉన్నా నాది సరైన మార్గమే అన్నది ఆమెకు బాగా తెలును. అందుకేనేమో! మళ్ళీ వచ్చి మాతోనే వుండిపోయింది.

ప్రశ్న: వెలివేయడం గురించి...?

జవాబు: వెలివేశారంటే నిన్ను బోహ్రా తెగతో సంబంధం లేనివాడిగా ప్రకటిస్తారు. నీ తల్లిదండ్రుల్ని చివరికి నీ పిల్లల్ని సైతం కలవడానికి వీల్లేదు. వివాహం రద్దైపోతుంది. స్నేహితులూ, బంధువులతో మాట్లాడటానికి వీల్లేదు. ఏ కార్యక్రమంలోనూ పాల్గొనే వీలుండదు. ఏ పవిత్ర స్థలంలోకీ అనుమతి వుండదు. నాకీ హక్కులేవీ లేవు.

ప్రశ్న: అంటే మీ పెళ్ళి చెల్లదన్నమాట? పిల్లపై అక్రమసంతానం ముద్ర తప్పదన్నమాట?

జవాబు: ఔను...

ప్రశ్న: అయినా దేవుడిపై మీకు విశ్వాసం ఉందా?

జవాబు: ఉంది. పూజారులు తప్పు చేస్తే మతాన్ని నిందిస్తారు నాస్తికులు. ఇటు అణుశక్తి కానీ అటు అగ్గిపుల్ల కానీ దేన్నైనా దురుపయోగం చేయచ్చు. అందువల్ల నా పరిస్థితికి మతాన్ని ఎలా నిందిస్తాను? ఇతరుల్ని వంచించడం ద్వారానో లేక అడ్డు తొలగించుకోవడం ద్వారానో చివరికి దేశభక్తిని కూడా దురుపయోగం చేయవచ్చు. అంతమాత్రాన దేశాన్ని ద్వేషించటం మొదలు పెడతామా? ఈ విశ్వంతో మనకు సంబంధం పెట్టుకోవడానికి మతం దోహదం చేస్తుంది. దైవభావనపట్ల బుద్ధుడు నిరాసక్తంగా వున్నా ఆయన మనకు కొన్ని విలువల్ని ప్రసాదించాడు.

# దాడులు చేస్తున్నది బీ.సీ.లే ◆చంద్రభాన్ ప్రసాద్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ◆



చంద్రభాన్ ప్రసాద్ ప్రాంతం రీత్యా ఉత్తరప్రదేశ్‌వారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశారు. ముందుగా మార్క్సిస్టు - లెనినిస్టు రాజకీయాలతో ప్రారంభమైన చంద్రభాన్ ఢిల్లీ వచ్చిన తర్వాత దళితవాదం వైపు మొగ్గారు. అయితే అందరిలా సాంప్రదాయ దళిత భావాలకు కట్టుబడి ఉండకుండా, నూతన ఆలోచనలకు పదును పెట్టారు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ అనంతరం సాగిన దళిత ఉద్యమాలు, రాజకీయాలను, బహుజన సమాజ్ పార్టీ (బి.ఎస్.పి.) అనుభవాలను లోతుగా పరిశీలించిన చంద్రభాన్ సరికొత్తగా దళిత భావాలకు రూపకల్పన చేస్తున్నారు. పరిశోధకుడిగా, జర్నలిస్టుగా విశేష కృషి చేస్తున్న చంద్రభాన్ "దళితుడి డైరీ' రచయితగా ఆంధ్రప్రదేశ్‌కు సుపరిచితుడు. గత రెండేళ్లుగా ఇంగ్లీషు దినపత్రిక 'పయనీర్'లో 'దళిత్ డైరీ' రాయడం ప్రారంభించారు. ఆ తర్వాత ప్రముఖ తెలుగు దినపత్రిక 'వార్త'లో 'దళితుడి డైరీ'ని మొదలు పెట్టారు. గత జూలైలో మొదలైన ఈ శీర్షిక అనతికాలంలోనే విశేష ఆదరణను చూరగొన్నది. ఇటీవల హైదరాబాద్ వచ్చిన చంద్రభాన్‌తో 'విజయవిహారం' జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

విన్నాం నిజమేనా! ఎలా!

- దీని గురించి వివరించేముందు ముందు బహుజన సమాజ్ పార్టీ అనుభవాన్ని చూద్దాం. పేరుకు ఆ పార్టీ బహుజన సమాజ్ పార్టీ. కానీ దాని వెనుక సమీకృతమైంది కేవలం దళితులు మాత్రమే. ఇది కాన్షీరాం వ్యక్తిగత వైఫల్యంగా చూడడం తప్పు. సామాజిక చరిత్రను విశ్లేషిస్తే దీనికి జవాబు దొరుకుతుంది. దళిత ఉద్యమాలు, వెనుకబడిన కులాల ఉద్యమాలు చెట్టాపట్టాలేసుకొని పోవడం సాధ్యం కాదు. ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్, కాన్షీరాంల నాయకత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ములాయం సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత జరిగిన పరిణామం దళితులపై పెరిగిన దాడులు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ దాడుల పరంపర సాగింది. షెడ్యూల్డ్ కులాల, తెగల అత్యాచారాల నిరోధక చట్టాన్ని ఎత్తివేయాలని ఆలోచించారు. ఆ విధంగా దళితులకు, వెనుకబడిన కులాల మధ్య గ్రామాల స్థాయిలో శతృత్వం పెరిగిందే కానీ తగ్గలేదు. అంతే కాకుండా ఇంకొక అంశం కూడా దీనికి తోడైంది. అగ్రకులాలు ఆర్థికరంగంలో వస్తున్న మార్పుల కారణంగా గ్రామాలను వదిలి పట్టణాలకు చేరుతున్నారు. దానితో గ్రామాల్లో దళితుల, వెనుకబడిన కులాల మధ్య ఘర్షణ పెరుగుతున్నది. ఈ పరిణామం బీహార్‌లో జరుగుతున్నది. బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం బ్రహ్మాండంగా సాగిన తమిళనాడులో దళితులపై జరుగుతున్న దాడులు సాక్ష్యం కాదా?

దళితులపై దాడులు జరుగుతుండడానికి పునాది కులవ్యవస్థను సృష్టించిన బ్రాహ్మణిజం. అయితే పోరాటం కేవలం బ్రాహ్మణులను ఉద్దేశించినది కాకూడదు. బ్రాహ్మణులు గ్రామాలను వదిలిపెట్టి పట్టణాలకి, నగరాలకి, అమెరికాకు వెళ్ళారు. ఈ రోజు బ్రాహ్మణిజాన్ని, కులవ్యవస్థను భుజాలపై మోస్తున్నది ప్రధానంగా శూద్రులుగా చెబుతున్న అగ్రకులాలు, వెనుకబడిన కులాలు. ఇటీవల అధికారంలోకి వచ్చిన అనేక కులాలు నిన్నటి వరకు శూద్రుల కాటగిరిలోనే ఉన్నారు. నిన్నటివరకు బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో కమ్మ సమాజం అందుకు ఉదాహరణ కాదా? త్రిపురనేని రామస్వామి చౌదరి బ్రాహ్మణిజాన్ని తూర్పారబట్టారు. అయితే ఆ తర్వాత ఆ కులమే ఈనాడు బ్రాహ్మణిజానికి ప్రతినిధిగా నిలబడింది. దళితులపై దాడులను చేసింది. వివరాలు ఇలా చెప్పుకుంటూపోతే, ఎన్నైనా చెప్పవచ్చు.

- మతతత్వ ప్రమాదం పెరిగిందనే వాదనపై మీ అభిప్రాయం ఏమిటి?

- మనదేశంలో మతతత్వం కన్నా కులఘర్షణలు ప్రధానమైనవి. చాలామంది మత ఫాసిజం పెరుగుతుందని భావిస్తున్నారు. ఇది బ్రాహ్మణిజం కుట్ర మాత్రమే. దీనిని మాట్లాడుతున్న వాళ్ళకు బ్రాహ్మణిజం ఆదర్శం. దీనివల్ల కింది కులాలపై, ముఖ్యంగా దళితులపై జరుగుతున్న దాడులను తక్కువగా చేసి చూపడానికి ప్రయత్నిస్తున్నారు.

ఎప్పుడో సంవత్సరానికో, పదేళ్ళకో ఒకసారి జరిగే మత కల్లోలాలను భూతద్దంలో పెట్టి చూపెడుతున్నారు. కొన్ని వేల ఏళ్ళుగా దళితుల ఊచకోత అసలు సమస్యగా చూడడానికే నిరాకరిస్తున్నారు. కొన్నిసార్లు కావాలనే మతఘర్షణలను సృష్టిస్తున్నారు. దానివల్ల కుల అణచివేతను తక్కువ చూస్తున్నారు. పెద్ద కొండను చిన్న అద్దంలో చూపెట్టినట్టుగా, పెద్ద గీతను చిన్న గీతగా చేయడానికి అంతకన్నా పెద్ద గీతను గీస్తున్నారు. ఈ కుట్రను అర్థం చేసుకోవాలి.

- మీ వాదన దళితులను ఒంటరి చేస్తుందనే విమర్శ ఉన్నది?

- దళితులు అనగా షెడ్యూల్డ్ కులాలు, తెగలు... తమను తాము రక్షించుకునే శక్తి ఉన్న వర్గాలు. వీళ్ళకు అండగా ఏనాడూ వెనుకబడిన కులాలు ముందుకు రాలేదు. అటువంటి అనుభవం కూడా లేదు. వెనుకబడిన కులాలకు రిజర్వేషన్ల కోసం మండల్ అనుకూల ఉద్యమంలో అగ్రభాగాన నిలబడి పోరాటం చేసి దళితులే. కానీ ఆ తర్వాత దేశవ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగాయి. చేసింది ఎవరనుకున్నారు వెనుకబడిన కులాలే. వెనుకబడిన కులాలు బ్రాహ్మణిజం ప్రకారం సవర్ణులే. బ్రాహ్మణిజాన్ని రక్షించడంలో ఎప్పుడూ ముందున్న వాళ్ళే. అయితే తమ అవసరాల కోసం మాత్రమే తమ పైన ఉన్న కులాలతో పోరాటం చేస్తారు. వాళ్ళకు పైకులాలతో పోరాటం చేసేటప్పుడు ప్రజాస్వామ్యం కావాలి. కానీ దళితులను తమ కాళ్ళకింద పెట్టుకోవాలని చూస్తారు. అది తరతరాలుగా జరుగుతున్న చరిత్ర.

ఒకవేళ నిజానికి వాళ్ళు అగ్రకులాలతో జరిగే పోరాటంలో దళితుల సహకారం కావాలంటే, ముందు షరతుగా దళితులపై దాడులు చేయడం ఆపివేయాలి. పైన ప్రజాస్వామ్యం, కింద అణచివేత వాళ్ళ ఆయుధాలుగా ఉన్నాయన్న వాస్తవాన్ని దళితులు ఇప్పుడు అర్థం చేసుకుంటున్నారు.

ఇంటర్వ్యూ : ఏకలవ్య, ఫొటో : ఉమ

# మంచిని తెలుసుకొనే ప్రయత్నాలు చేయడం -అస్ఘర్ అలీ ఇంజనీర్



ప్రశ్న: మతం అనేది క్రియాశీలకంగా వుండాలని మీరు భావిస్తే దాన్ని హేతు దృష్టితో చూడాల్సివుంటుంది. అది ప్రమాదకరం కాదా?

జవాబు: మతం అంటే ఏమిటి? గింజ నుండి తాలుని వేరు చేయాలన్నది నా ఆరాటం. నా మటుకైతే మతం అంటే సామాన్య ప్రజలు భావించేది ఎంత మాత్రం కాదు. ఏవో కొన్ని ఆచారాల్ని ప్రశ్నించినంత మాత్రాన మొత్తం మతాన్నే వేలెత్తి చూపినట్టు వారనుకుంటారు. మతం అంటే పరిశుద్ధం చేసేది. ఉదాహరణకి మహిళల స్థాయిని తీసుకుంటే ఇస్లాం పూర్వ ఆచారాలెన్నో షరియత్‌లో అవిభాజ్యంగా మారాయి. వీటికి వ్యతిరేకంగానే నేను పోరాడేది. 'తలాక్ త్రయం' ప్రస్తావన ఖురాన్‌లో లేదు. అయితే దీనిపై వివాదం ఉందనుకోండి. ప్రవక్త దీనికి ఆమోదం తెలిపారని కొందరు వాదిస్తారు. ఒకవేళ అది నిజమైనా సామాజిక పరిమితులేవో ప్రవక్తకు ఉండివుంటాయని భావించాలి.

ప్రశ్న: జిహాద్ అంటే ఏమిటి?

జవాబు: ఛాందసవాదులు 'జిహాద్'ను దురుపయోగం చేస్తున్నారు. ఖురాన్ ప్రవచించేది యుద్ధం అనే అర్థంలో ఎంత మాత్రం కాదు. చంపడమనే అర్థంలో ఎక్కడా లేదు. జిహాద్ అంటే జీవితంలోని మంచిని తెలుసుకునే ప్రయత్నాలు చేయడం తప్ప మరేమీ కాదు. అరబ్బీలో జిహాదా అంటే వ్యక్తిగత కోర్కెలకు వ్యతిరేకంగా పోరాడటం, అందుకు తీవ్రంగా కృషి చేయడం అని అర్థం. ఒకవేళ నేను స్వార్థపరుడ్నైతే తోటివారిని పణంగా పెట్టి అనుకున్నది సాధించాలనుకుంటాను.

ప్రశ్న: మరి కాఫిర్ అంటే ఎవరు?

జవాబు: అసలైన 'ఇమాన్' అంటే మానవత్వం మీద విశ్వాసం కలిగి వుండటం. అందువల్ల మంచిని వ్యతిరేకించేవారంతా కాఫిర్‌లే.

ప్రశ్న: విగ్రహారాధన లేకపోవడం వల్ల ఇస్లాంకు ఇంతటి మేకో ఇమేజ్ వచ్చినట్టు కనిపిస్తోంది. విగ్రహారాధన లేకపోవడమే దీనికి కారణమై వుంటుంది. దీనివల్ల తుపాకీయే ఓ శక్తివంతమైన ఆరాధనా రూపంగా మారే ప్రమాదం లేదా?

జవాబు: మీతో ఎంతమాత్రం ఏకీభవించను. కొందరు తుపాకులు ఎత్తుతున్నారంటే దోపిడీయో, అణచివేతనో లేక చారిత్రిక వారసత్వమో ఏదో కారణమై వుంటుంది. ఉదాహరణకి అఫ్ఘనీలు శతాబ్దాల తరబడి హింస మధ్య బతికారు. ఆ హింసాకాండకు కారకులు మొఘలాయిలో, రష్యన్లో లేక సొంత నాయకులో కావచ్చు. అందువల్ల వారు స్వాతంత్ర్యం కోసం నిరంతరం పోరాడాల్సి వచ్చింది. కానీ వారు తమ పోరాటాన్ని జిహాద్ పేరిట ఆమోదయోగ్యం చేస్తున్నారు. దీనివల్ల ప్రపంచం తమని అల్లాకోసం పోరాడుతున్న ముజాహిద్‌లుగా చూసే అవకాశం వుంటుంది.

మరో సంగతేమిటంటే (దైవానికి సంబంధించి) ఇస్లాంలో స్పష్టమైన భావన లేదని ఎవరూ చెప్పలేరు. సమాధుల వద్దకు వెళ్ళే ముస్లింలు సరిగ్గా అలాంటి భావననే సృష్టించారు. దేవుడికి సంబంధించి నైరూప్య భావనని అర్థం చేసుకోవడం కష్టమే కావచ్చు. అందుకే ఇలాంటి ప్రత్యామ్నాయాన్ని కనుగొన్నారు. మనం ఏ వస్తువు ముందూ తలవంచరాదని నా వ్యక్తిగత విశ్వాసమే అయినా ఇస్లాంకి మనుషులలోని ఈ బలహీనత బాగా తెలును. కనుకే హజ్ ద్వారా ఓ శిలను భక్తితో ముద్దుపెట్టుకునే నియమంతో ఈ బలహీనతను పూడ్చింది. శిల ఏదైనా శిలే. కానీ ఒక శూన్యాన్ని అది భర్తీ చేసింది. అందుకే ఆ శిల పవిత్రమైందిగా మారింది. నేనూ హజ్ యాత్ర చేశాను. కేవలం ఆ శిలను ముద్దుపెట్టుకోవడానికే తొక్కిడిని సైతం లెక్కచేయకుండా భక్తితో జనం ఎలా దూసుకొస్తారో చూశాను.

ప్రశ్న: అలాంటప్పుడు విగ్రహారాధనను అనుసరించేవారితో (ఇస్లాంకి) మానసికంగా అగాధం ఎందుకేర్పడింది?

జవాబు: ఇతర మతాల దైవాలను దూషించవద్దని ఖురాన్ చెబుతోంది. ఒకవేళ అలా చేస్తే అల్లాను కూడా ఇతరులూ అలాగే చేసే అవకాశముంది. కానీ చాలా మందికి ఈ భావన పట్ల నమ్మకం లేదు. తాము వెళుతున్నదే సరైన దారి అనుకుంటారు. మతాధిపత్యాన్ని కాపాడుకోడానికే ఇదంతా.

ప్రశ్న: గణపతిపందిర్లో నమాజు చేయడానికి కొందరు మౌల్వీలను ఆహ్వానిస్తే ఆ స్థలం అపవిత్రమైందని అన్నారు...

జవాబు: ఇలాంటి వాళ్ళు సంకుచిత మనస్కులు. ఎవరికి ఎక్కడ నచ్చితే అక్కడ ప్రార్థన చేసుకోవచ్చు. అయితే దీనిపై అభిప్రాయ భేదాలున్నాయి. విగ్రహాల ముందు మోకరిల్లడాన్ని ఖురాన్ ఖండిస్తోంది. 18వ శతాబ్దంలో ఢిల్లీకి చెందిన మజార్ జాన్ జానా అనే సూఫీ సాధువు భావించారు. ఎందుకంటే ఇస్లాంకు ముందున్న పూజావిధానంలో రాళ్ళను దేవతా విగ్రహాలుగా భావించేవారు. కానీ హిందువులు విగ్రహాలను దైవానికి ప్రతిరూపాలుగా భావించి పూజిస్తారు. భగవంతుడు నిర్గుణుడు, నిరాకారుడని వేదాలు చెప్తున్నాయి. పరమాత్మకి ఏ గుణాలూ, ఎలాంటి రూపాలూ లేవు. హిందువుల నిజమైన విశ్వాసం ఇదే. ముస్లింలు సమాధుల దగ్గరకు వెళ్ళినట్టు హిందువులు విగ్రహాలను పూజిస్తారు.

ప్రశ్న: మతం నిజంగా ఏం చెబుతుంది అన్నదానికంటే ప్రజలు ఆచరించేదే మతంగా మారుతోంది.

జవాబు: ముస్లింలలోనే సమాధుల వద్దకు వెళ్లేవారు, వెళ్ళనివారి మధ్య విభేదాలున్నాయి. నా మటుకైతే మతం తాలూకు మౌలిక సారమే ప్రధానం. నన్నడిగితే ఏకేశ్వరోపాసన హిందూయిజంలోనే ప్రధానంగా ఉంది. ఉపనిషత్తులను దారాషికో పర్షియాలోకి అనువదించారు. ఇస్లామేతర మతాల్లో ఏకదైవ భావన కనిపించేది మళ్ళీ హిందూయిజంలోనే - అని పరిచయవాక్యాల్లో అంటాడు దారా. ఇస్లాం మాట్లాడే 'ది హిడెన్ బుక్' అనేది వాస్తవంగా ఉపనిషత్తులే అని చెబుతాడు. సాంస్కృతిక ఘర్షణకు ఆధిపత్య ధోరణులే కారణం.

ప్రశ్న: మెజారిటీ దేశంలో సాంస్కృతికంగా మైనారిటీల పాత్ర ఏమిటి? ఓవైపు తమ గుర్తింపును కాపాడుకుంటూనే మరోవైపు ప్రధాన స్రవంతిలో భాగంగా వుండాలి కదా?

జవాబు: (మైనారిటీలు - ఎవరైనా తమ గుర్తింపును పోగొట్టుకొని) ప్రధాన స్రవంతిలో పూర్తిగా కలిసిపోవాలన్నది పూర్తిగా ఫాసిస్టు డిమాండ్. అసలు ప్రధాన స్రవంతి అంటే ఇదీ అని స్పష్టంగా ఎవరు నిర్వచిస్తారు? ఆర్‌ఎస్ఎస్ అధినేతనా లేక భారత ప్రజలా? ఒకవేళ ప్రజలకే దాన్ని వదిలేస్తే - అందరూ ప్రధాన స్రవంతిలోని భాగస్వాములే అవుతారు. (ఏ వర్గమైనా) తమ గుర్తింపును కాపాడుకోవడమన్నది రాజ్యాంగం ప్రసాదించిన హక్కు.

ప్రశ్న: ఇస్లాం సాంప్రదాయిక వాదులు (స్టీరియోటైప్స్)ల నుంచి మీకేవిధంగానైనా ఇబ్బందులు ఎదురయ్యాయా?

జవాబు: నేను హిందువులు, ముస్లింలు అన్న తేడా లేకుండా అందరి గురించి మాట్లాడతాను. నా ఈ వైఖరివల్లనేనేమో ఆర్ఎస్ఎస్‌తో నేను స్పష్టంగా విభేదిస్తున్నా - వాళ్లు నన్ను ఉన్మాదిగా ముద్రవేయలేదు. మతతత్వం ఎక్కడున్నా దానికి వ్యతిరేకంగా పోరాడుతూనే వుంటాను.

ప్రశ్న: ఇతర మతాల శక్తులేవైనా మిమ్మల్ని తమవైపు తప్పుకోవడానికి ప్రయత్నించాయా?

జవాబు: మతం మారమని చాలామంది నన్నడిగారు. మతం పట్ల నా విశ్వాసం మారదని చెప్పాను. నా స్వంత వర్గంలో వున్న లోపాలపై నేను పోరాటం చేస్తున్నాను. నేనే గనుక మతం మారితే పోరాడే హక్కును కోల్పోతాను.






# వంగేవాడికి
# చేశేవాడు

## శేషేంద్ర , సి.నా.రె. వివాద నేపథ్యంలో

- అని గర్జించిన ధీరకవి,

"మెదడులేని క్యాబేజీ వాడి తల
నగరాల్లో ఉన్న కాలేజీ వాడి వల
వాడు బంగాళా ఖాతంలా నోరు
తెరచి ఆవులిస్తాడు
మాటల చెత్తకుప్పలు సృష్టిస్తాడు
త్రవ్వగా త్రవ్వగా
మొహంజొదారోలో కుండపెంకులా
వాడి పుస్తకాల దిబ్బల్లో
ఎక్కడో ఒక పాయెం" -

- అని అకవిత్వాన్నీ, సాహిత్య రాజకీయాల్నీ చీల్చిచెండాడిన కవి.

గురజాడ ప్రజాకవిత్వం, రాయప్రోలు, కృష్ణశాస్త్రిల భావకవిత్వం, శ్రీశ్రీ విప్లవకవిత్వాల మహా యుగాలు గడిచి స్తబ్దమైన తెలుగు సాహిత్య లోకాన్ని 70వ దశకంలో శేషేంద్ర కవిత్వం ఒక ఉన్మత్త జ్యోత్స్న కెరటంలా ముట్టడించింది.

అప్పటివరకూ ఎరుగని కొత్తచిత్రాలు చిత్ర


సోమసుందర్


వెల్చేరు నారాయణరావు


గజ్జెల మల్లారెడ్డి

ప్రయోగాలు,వినూత్నమైన, సొంపైన భాష, ఉర్దూ కవిత్వాన్ని తలపించే క్లుప్త చమత్కారాల హొయలు, దక్కన్ కీవి నినాద కాలుష్యంలేని నిఖార్సైన తిరుగుబాటు తత్వం, ఇజాలపైన మనిషి యాజమాన్యాన్ని స్థాపించే సూటిదనం -శేషేంద్ర కవిత్వానికి మిరుమిట్లు గొలిపే ఆకర్షణను కల్పించాయి. ఒక దశలో ఆయన ప్రభావం కనిపించకుండా కవిత్వం రాయడం తెలుగుదేశంలో కవులకు పెద్ద సవాలే అయింది.

**"నా కవిత్వం కేవలం మనిషికి డిఫెన్స్"** అన్న శేషేంద్ర ఆ కాలంలో ఉన్న ఏ సాహిత్యటెంట్ పంచనా చేరకుండా అకవిత్వంపైన తనదైన పద్ధతిలో చేసిన యుద్ధం వల్ల - నష్టపడిందే ఎక్కువ. అయినా రెక్కల గుర్రాల్లాంటి ఆయన పద్యాలు సాహితీక్షేత్రంలో హర్ష విభ్రమాన్ని సృష్టించాయి. ఆయన కవిత్వానికి నేల నాలుగు చెరగులా అసంఖ్యాకంగా అభిమానులు ఏర్పడ్డారు. ఆయన కవిత్వం ఇంగ్లీష్, హిందీ, బెంగాలీ, ఉర్దూ, కన్నడ, తమిళ, గ్రీసు భాషల్లోకి అనువాదమై, ఖండాంతరాలకు పాకింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో కూడా శేషేంద్ర కవితలు కలకలం రేపాయంటే ఆశ్చర్యం కలుగుతుంది.

అయినా ఇదంతా ఒక అధ్యాయం. ఈనాడు తన 70వ పడిలో - దశాబ్దాల వ్యవధిలేని కవితా ప్రస్థానం ఫలితంగా అలసిన మనఃశ్శరీరాలతో - ఇపుడు '...రాలే హేమంత పత్రాల మీద సూర్యుడు మనిషి కోసం' రాసిన సందేశాలని పఠిస్తున్న కవి మనసులో కదిలేదేమిటి? బహుశా **"ఏ నక్షత్రం కోసం నిరీక్షిస్తూ నా పాటలన్నీ పాడేనో అది ఈ దేశం మీద ఉదయించనే లేదు"** అనే భావమే సుళ్ళు తిరుగుతోందా? ఎవరికి తెలుసు. చాలాకాలంగా ముభావంగా, తాను స్వయంగా విధించుకున్న ఏకాంత యవనికలోనే ఆయన ఉండిపోయారు.

సమకాలీన సాహిత్య వాదవివాదాలకు, మార్మోగిస్తున్న మార్పులకు శేషేంద్ర చాలా వరకూ దూరంగానే ఉంటున్నారు. కానీ ప్రస్తుత సాహిత్య (రాజకీయ) చదరంగపుటెత్తు జిత్తులకి ఈ మధ్య ఆయన కాస్త కలతపడ్డారనే వార్తలు వచ్చాయి.

### వివరాల్లోకి వెళితే...

మొన్నటి పద్మ అవార్డులు ప్రకటించడానికి కొంతకాలం క్రితం ప్రభుత్వం నుంచి శేషేంద్ర బయోడేటా కావాలనే కబురు వచ్చింది. ఆ తర్వాత సుమారుగా డిశంబర్ నెలలో ఆయన పేరు అవార్డుకి క్లియర్ అయ్యిందని - ఆ సంబంధిత ప్రభుత్వశాఖలో పనిచేస్తున్న సాహిత్యాభిమానులైన అధికారులు శేషేంద్రకు అడ్వాన్స్ కంగ్రాచ్యులేషన్స్ కూడా చెప్పేశారు. అవార్డుల ప్రకటన తేదీకి సరిగ్గా ఒక రోజు ముందు అదే అధికారులు హడావిడిగా శేషేంద్రకి ఫోను చేసి - అవార్డుల సెలక్షన్ లిస్టులో ఆయన పేరు లేదని 'ఒక పెద్దమనిషి' అడ్డుపడి తొలగింపజేసి ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పెద్దమనిషి మరెవరో కాదని - ప్రముఖ కవీ, దేశంలోనే అత్యున్నత సాహిత్య పురస్కారమైన "జ్ఞానపీఠ్" గ్రహీత, రెండు విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్స్‌లర్‌గానూ, అధికార భాషాసంఘ అధ్యక్షుడుగానూ పనిచేసి ప్రస్తుతం రాజ్యసభ సభ్యులుగా ఉన్న సి.నారాయణరెడ్డేనని ఆ అధికారుల సమాచారం.

తర్వాత వెంటనే మరో సందర్భంలో రాజ్‌భవన్ వద్ద శేషేంద్ర ఎదురుపడగానే- సి.నారె. వడివడిగా వచ్చి ఆయన్ని పలకరించారు. "ప్రమాణం చేస్తాను, నాకు దాంతో ఏ విధమైన సంబంధం లేదు. నిజానికి మీ పేరే లిస్టులో లేదు. మిమ్మల్ని కుప్పంలో సన్మానిద్దామని మేమనుకుంటున్నాం" అని ప్రియవచనాలు పలికారు. శేషేంద్ర సున్నితంగా ఆ ప్రతిపాదనని తిరస్కరించారు. ఈ సమాచారం లీకయి దక్కన్ క్రానికల్ దినపత్రికలో వచ్చింది.

తర్వాత శేషేంద్ర దక్కన్ క్రానికల్‌కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో - సెలక్షన్ లిస్టులో తన పేరు తొలగింపు వెనుక ఉన్న వ్యక్తి నారాయణ రెడ్డేనని తనకి రూఢిగా తెలిసిందని - సూటిగా చెప్పారు. అసలు నారాయణ రెడ్డి మన రాష్ట్రం నుంచి ఏ సాహితీ ప్రముఖుడినీ పెద్ద అవార్డులకి సిఫార్సు చేయరని శేషేంద్ర తీవ్రంగా వ్యాఖ్యానించారు. కవికి ప్రాముఖ్యత కవిత్వంవల్లే కానీ అవార్డుల వల్ల రాదని-అసూయతోనే సి.నా.రె. ఇటువంటి పని చేసి ఉంటారని తాను భావిస్తున్నానని శేషేంద్ర స్పష్టం చేశారు.

అసలు ఇవ్వాళ అవార్డులు రావాలంటే కనీసం 100 మందిని కలిసి సిఫార్సులు చేయించుకోవాల్సిన దుస్థితి ఉందని శేషేంద్ర వేదన వ్యక్తం చేశారు. ఏ రంగంలోనైనా అర్హులనే గుర్తించి అవార్డులు ఇవ్వాలని, అరకొర ప్రతిభ ఉన్నవారికి అవార్డులు ప్రకటిస్తే అందుకు రాజకీయ ఒత్తిడే కారణమని భావించాల్సి ఉంటుందని శేషేంద్ర అభిప్రాయం వ్యక్తం చేశారు.

### నారాయణ...నారాయణ...

శేషేంద్ర అభిప్రాయాలు పత్రికల్లో వచ్చిన వెంటనే దాన్ని ప్రత్యక్షంగానో పరోక్షంగా ఖండిస్తూ, వివరణలిస్తూ సి.నా.రె. ఇచ్చిన ఇంటర్వ్యూలు వార్త, దక్కన్ క్రానికల్ పత్రికల్లో వచ్చాయి.

తనకు శేషేంద్ర పట్ల అపారమైన గౌరవాభిమానాలు ఉన్నాయని, శేషేంద్రను ఈ విషయంలో ఎవరో తప్పుదారి పట్టించారని, అందువల్లే అపార్థాలు తలెత్తాయని ఆయన అన్నారు. అవార్డు సెలక్షన్ కమిటీలో తానున్న మాట వాస్తవమైనా, పరిశీలనకి వచ్చిన పేర్లలో శేషేంద్ర పేరు లేదని స్పష్టం చేశారు. అనేక మందికి అవార్డులు రావడంలో తాను బాధ్యుడినని సి.నా.రె. అన్నారు. తనకి జ్ఞానపీఠ్‌తో సహా అనేక పురస్కారాలు, గౌరవాలు లభించాయని, నిజానికి తనకెన్ని అవార్డులు లభించాయో తనకే గుర్తు లేదని సి.నా.రె. అన్నారు. హోంశాఖ రూపొందించిన జాబితాలో పేరు ఉంటేనే, ఆ పేరును తాము సిఫార్సు చేయగలమని, ప్రముఖుల పేర్లు అవార్డు జాబితాలో లేవంటే హోంశాఖ రూపొందించిన జాబితాలో ఆ పేర్లు చేరలేదని గ్రహించాలని సి.నా.రె. వ్యాఖ్యానించారు.

### ఎప్పటి నుంచో...

వాస్తవం కావచ్చు, కాకపోవచ్చు, ఎందువల్లనోగానీ పక్షపాతంగా ఉంటారని, స్వపక్షీయులకి ఎంత ఉపకారం చేస్తారో, విపక్షీయుల పెరుగుదలకి అన్ని అడ్డంకులు సృష్టిస్తారనే గుసగుసల నీలినీడలు సి.నా.రె.పైన ఎప్పటి నుంచో ఉన్నవే.

అసలు 1989లో సి.నా.రె.కి జ్ఞానపీఠ్ అవార్డు రావడానికి సైతం పెద్ద ఎత్తున సాగిన లాబీయింగే కారణమని, అసలు ఆ అవార్డు పుట్టపర్తి నారాయణాచార్యులుకి రావల్సిందని - చివరిక్షణంలో సి.నా.రె. స్వంతమైందని ఒక ప్రచారం జరిగింది.

శేషేంద్ర సి.నా.రె.ల మధ్య అపార్థాలకి కూడా కొంత చరిత్ర ఉంది.

▶ ప్రముఖ కవి ఆవంత్స సోమసుందర్ 1976లో శేషేంద్ర సాహిత్యాన్ని సమీక్షిస్తూ "శేషేంద్రజాలం" అనే పుస్తకం రాశారు. ఆ పుస్తకంలో ఆయన శేషేంద్ర కవితను ఆకాశానికెత్తారు. శేషేంద్ర కవిత్వం ప్రభావం నాటి సమకాలీన కవులపై బలంగా పడిందన్నారు. డా॥ అరిపిరాల విశ్వం, సి.నా.రె., చెరబండరాజు, సుధామ, నాయని కృష్ణకుమారి వంటి కవులు శేషేంద్ర పద్యాలకు ప్రభావితులై అదే తరహా మాటలనూ, భావాలనూ, ప్రతీకలనూ అనుకరిస్తూ ఏ విధంగా కవిత్వం రాశారో - ఈ పుస్తకంలో సోమసుందర్ ఉదాహరణలతో సహా నిరూపించారు. కవిత్వం ఒరిజినల్‌గానే ఉండాలని, ప్రభావాలను తొలగించుకోలేకపోతే అది సెకండ్ రేట్ కవిత్వంగానే మిగిలే ప్రమాదం ఉందని సోమసుందర్ హెచ్చరించారు. సహజంగానే సోమసుందర్ రచన ఆయన ఉటంకించిన కవులందరికీ ఇబ్బంది కలిగించే ఉండాలి.

ఏం జరిగిందో తెలియదు. తరువాత 1995లో సోమసుందర్ సి.నా.రె.ని కీర్తిస్తూ "నారాయణ చక్రం" అనే గ్రంధాన్ని వెలయించారు.

2000 సం॥లో సోమసుందర్ శేషేంద్రజాలం పునర్ముద్రితమైంది. ఈసారి ఈ మలిముద్రణలో పుస్తకానికి అనేక మార్పులు చేర్పులు జరిగాయి. తొలిముద్రణలో ఉన్న "నేటి అకవిత్వ దుర్వాయువులు" అనే అధ్యాయం మొత్తానికి మాయమైంది. ఇంకా చిత్రంగా "మండే సూర్యుడి శక్తిమంతమైన ధ్వని వల్ల తెలుగు నేల మీద అశేష ప్రకంపనాలు" అనే అధ్యాయం విషయ సూచికలో మాత్రం కనిపిస్తుంది కానీ పుస్తకంలో ఎక్కడా లేదు. ఇంకా అనేక అధ్యాయాల స్వరూప స్వభావాల్లో మార్పు జరిగింది. శేషేంద్రని సి.నా.రె. తదితర కవులు ఎంతో కొంత అనుకరించిన వివరాలు మలిముద్రణలో మొత్తానికి మాయ మయ్యాయి. అంతే కాకుండా శేషేంద్ర కవిత్వంలోని లోపాలను వివరించే కొత్త అధ్యాయాలు వచ్చి చేరాయి.

తొలిముద్రణకీ మలిముద్రణకీ మధ్య సోమసుందర్ తన అభిప్రాయాలు మార్చుకుని ఉండొచ్చు, పొరపాటు లేదు. అందుకు ఆయన కారణాలు ఆయనకి ఉండొచ్చు. అయితే పుస్తకం స్వరూపస్వభావాలను ఏదో ఒక మేరకు ఆయన మార్చదలుచుకున్నపుడు, ఆయా మార్పులకి సంబంధించిన వివరణను కనీసం ఒక పేరాలోనైనాసరే రాసి పాఠకులకి తెలియజేయాల్సిన నైతిక బాధ్యత సోమసుందర్‌కి స్ఫురించకపోవడం నిజంగా శోచనీయం!

▶ రాజు అనే కవి రాసిన "సూర్య కళారి" అనే పుస్తకానికి శేషేంద్ర ముందు మాటరాశారు. ఈ పుస్తకం 1994మేలో వచ్చింది. ఈ ముందు మాటలో శేషేంద్ర వెలిబుచ్చిన భావాలతో ప్రత్యక్షంగా ప్రభావితమైనట్టుండే కవిత - "ఊర్ధ్వ ముఖం" పేరిట సి.నా.రె. కలం నుండి వెలువడి 1995 నవంబర్ 20 నాటి ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితమైంది. ఈ పోలిక అప్పట్లో అనేకమంది సాహితీ వ్యక్తుల్ని ఆకర్షించింది. ఈ కవితనే విస్తరించి ఆ తరువాత 1997లో 'మట్టీమనిషీ ఆకాశం'' కావ్యంగా సి.నా.రె. రాశారని ఒక అభిప్రాయం వుంది.

▶ శేషేంద్ర కవిత్వ విశిష్టతని ప్రస్తుతిస్తూ గతంలో డా॥ ముదిగొండ వీరభద్రయ్య ఒక గ్రంధమే రాశారు. డా॥ జి.వి.సుబ్రహ్మణ్యం కూడా ఒక దశలో శేషేంద్ర కవితా వైభవాన్ని ప్రస్తుతించిన వారే.

ఇదిలా ఉండగా సి.నా.రె. "మట్టీ మనిషీ ఆకాశం" కావ్యాన్ని ఆకాశానికి ఎత్తుతూ 1998లో డా॥ముదిగొండ వీరభద్రయ్య మరొక గ్రంధాన్ని రాశారు. ఈ గ్రంధానికి ముందు మాట రాస్తూ డా॥జి.వి. సుబ్రహ్మణ్యం ఎందుకోగానీ సి.నా.రె. కావ్యం శేషేంద్ర రచించిన ఆధునిక మహాభారతం కంటే ఎంతో ఉత్తమం, ఉదాత్తం అని తేల్చి చెప్పారు.(ఈ ముదిగొండ వీరభద్రయ్యే జీ.వి.సుబ్రహ్మణ్యంగారిని ప్రశంసిస్తూ "జీవియస్ విమర్శదర్శనం" అనే పుస్తకం రాశారంటే అది వేరే సంగతి).

దీన్ని అనేకమంది (సాహిత్య) పార్టీ ఫిరాయింపుగా తీసుకుని ముక్కున వేలేసు కున్నారు.

సిద్ధిపేటకి చెందిన కవి గన్నుకృష్ణమూర్తి డా॥ముదిగొండ గ్రంధాన్ని డా॥జి.వి.యస్. ముందుమాటనీ తూర్పారపడుతూ "సి.నా.రె. కవిత్వం - గురు శిష్యుల పైత్యం'' అనే వ్యాసం రాశారు. ఈ వ్యాసం ఏ పత్రికలోనూ రాకపోయినా బుక్‌లెట్ రూపంలో విస్తృతంగా ప్రచారమై సంచలనాన్ని రేపింది.

# వంగి సలాం పుడుతున్నాడు



## తెలుగు కవిత్వాన్ని మింగేస్తున్న కెరీరిజం పై చర్చ

సి.నా.రె. సాహిత్యంలో భజనపరత్వాన్ని ప్రోత్సహిస్తున్నారనే భావం ఏదో ఒక మేరకు చాలా కాలం నుంచే ఉంది.

గజ్జెల మల్లారెడ్డి ఒకసారి నిర్మొహమాటంగా "...నా దృష్టిలో అయన చక్కని చిక్కని కవిత్వం రాయగలిగిన కవి. అయితే అనేక విషయాల్లో సి.నా.రె. వేసే ఎత్తులు, పన్నే జిత్తులు, వల్లమాలిన అవకాశ వాదం నాకు మింగుడు పడవు..." అని తన "మనస్సాక్షి"లో రాశారు.

గజ్జెల మల్లారెడ్డి పదునైన రాజకీయ వ్యంగ్యకవిత్వం రాసే అధిక్షేప కవిగా పేరున్నా మెయిన్‌స్ట్రీమ్ కవిత్వం (అనొచ్చా?)తో అంతగా సంబంధం లేకపోవడంతో ఆయన వ్యాఖ్యలు పెద్దగా ప్రభావం చూపలేదు.

అమెరికాలో ఉన్నా, తెలుగు కవిత్వాన్ని కాపుకాస్తూ అప్పుడప్పుడూ హైద్రాబాద్‌కి వచ్చి తన అభిప్రాయాల్ని కుండబద్దలు కొట్టినట్టు వ్యక్తం చేసే విమర్శకులు వెల్చేరు నారాయణ రావు 1992 మే 5 నాటి సుప్రభాతం సంచికలో సురేంద్ర రాజుకి ఇచ్చిన ఇంటర్వ్యూలో "...ఇవాళ సాహిత్య రాజకీయాల్లో కేంద్ర బిందువు సి. నారాయణరెడ్డి. ఆయనను ప్రశంసించడం మూలంగానో, విమర్శించడానికి భయపడి ఊరుకోవడం మూలంగానో చిన్న కవులు ఈ రోజున పైకి వస్తున్నారు. ఇది వ్యక్తులుగా ఎవరినీ అగౌరవపరచడానికి అంటున్న మాటకాదు. కానీ తెలుగు దేశపు సాహిత్యంలో ఏం జరుగుతున్నదీ తెలుసుకుందామని వచ్చేవారికి బోలెడన్ని అబద్ధాల తెరలు దాటివస్తే తప్ప నిజం కనిపించదు. అభివృద్ధి, అభ్యుదయం, సామాన్య మానవుడు, సోషలిజం, మానవత్వం - ఇలాంటి మాటలు కవిత్వం నిండా, ఉపన్యాసాలనిండా నిరర్థకమైనటువంటి మోతకదనంతో వినిపించడం ఈ సాహిత్య రాజనీతిజ్ఞులు అలవాటు చేసిన పని. ఇప్పటికైనా నారాయణరెడ్డి కవిత్వాన్ని కవిత్వంగా తీసుకుని నిబ్బరమైన విమర్శరాస్తే చదివే వాళ్ళు మెచ్చుకుంటారు. ఆయన్ని పొగడడం ఒక సైకోఫాన్సీ అయిపోతోంది. ఇది మధ్యతరగతి అవకాశవాదానికి పరాకాష్ఠ..." అని తేల్చి చెప్పారు.

## కవిత్వాన్ని మింగేస్తున్న కెరీరిజం

ఇవ్వాళ ఈ సమస్యని ఇద్దరు కవుల మధ్య ఏర్పడ్డ వివాదంగా పరిగణించడం సరికాదు.

శేషేంద్ర అనంతరం గత కొన్ని దశాబ్దాలలో తెలుగు కవిత్వం చాలా దూరం ప్రయాణించింది. ఇటీవలి కాలంలో వెల్లువలా ముట్టడించిన దళిత, స్త్రీవాద కవిత్వాలు తెలుగు సాహిత్యానికి నిజంగా ప్రాణ వాయువునే ప్రదానంచేశాయి. ఈ కవిత్వాలు తెలుగు సాహిత్యానికి జవసత్వాల నిచ్చి పరిపుష్టం చేశాయి. అయితే ఇతర ఉద్యమాల్లో లాగే ఈ ఉద్యమాల్లోకూడా ఎంతోకొంత మేర అకవిత్వమూ,ఇంకొంత దబాయింపు కవిత్వమూ వచ్చిన మాట కూడా వాస్తవమే.

అయితే ప్రస్తుతం ఆ కవిత్వాలు కూడా వస్తువైవిధ్యత లేక మొనాటనీ సమస్యనే ఎదర్కొంటున్నాయి.

ఇదిలా ఉండగా కొన్ని దశాబ్దాల క్రితం చిన్నగా ప్రారంభమైన కెరీరిస్టు కేన్సర్ విశ్వరూపం ధరించి చివరికి దళిత, స్త్రీ వాద పాయల్ని కూడా కలుపుకుని - ఈ రోజు తెలుగు కవిత్వాన్ని మొత్తాన్నే మింగివేసే పరిస్థితి తలెత్తింది.

దాని దుష్పరిమాణం కూడా స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. అదేమిటంటే ఈ రోజు తెలుగు కవిత్వానికి పాఠకుడే లేకుండా పోయే ప్రమాదం. అకవిత్వాన్ని ఖండించే ధైర్యం లేక పోవడం వలన, 'మనకెందుకులే' అనే మర్యాదల మనస్తత్వం కారణంగా ఈ రోజు అకవిత్వం లేదా కవిత్వ రాహిత్యం తెలుగు కవిత్వంలో ప్రధానపాయ అయింది. ఈ గందరగోళంలో జడుసుకున్న తెలుగు పాఠకుడు కవిత్వాన్ని చదవడం మానుకున్నాడు.పత్రికల్లో కథల స్థానాన్ని "సరసశృంగార" కథలు ఆక్రమించినట్లే, కవిత్వం స్థానాన్ని, చౌకబారు సంస్కారం వున్న సినీ టిట్‌బిట్స్ ఆక్రమించాయి. ఈ ప్రమాదాన్ని ఎవరూ పట్టించుకోవడమే లేదు.

ఇజాలమడి గట్టుకుని కూర్చున్న రచయితల సంఘాలు మరణించి మ్యూజియంలో వున్నాయి.

ఇప్పుడు మీరు కవి కావాలంటే తేలిక (ప్రముఖ కవి కావాలంటే మరీ తేలిక). మీకు తోచిన పద్ధతిలో మీరో పుస్తకాన్ని రాసి ప్రచురించేంత మదుపు పెట్టగలిగితే చాలు (ఆ డబ్బులు వెనక్కిరావడం కల్ల). ఇంక మీ పుస్తకం మీకు ఒక విజిటింగ్ కార్డులా ఉపయోగపడుతుంది. (అమ్ముకుందామని మీరు ఆశించి ఉపయోగం లేదు, పాఠకుడు ఇప్పటికే 'తెనాలి రామలింగడి పిల్లి' చందంగా అనుభవజ్ఞుడైనాడు) ఎవరైనా "ప్రముఖ" కవి (లేదా ప్రముఖ కవులు) మీకు ముందు మాట లేదా పీఠిక రాసి వాళ్ళకి చేతనైనంత ప్రశంసించి పెడతారు. మీ కవిత్వంలో మీకే తెలీని కొత్త అర్థాలు చూపెడతారు. ఇందుకు బదులుగా మీరేం చెయ్యక్కర్లేదు. కేవలం ఇలాంటి సందర్భాలే ఏర్పడినప్పుడు మరో కవి(?)ని ప్రశంసించడం తప్ప. అయితే ఒక హెచ్చరిక మీరు ఎవరి కవిత్వాన్నీ, అవలక్షణాలనీ ఎక్కడా విమర్శించడానికి వీల్లేదు.




గత సంవత్సరం హైద్రాబాద్‌లో అధికసంఖ్యలో కవులు హాజరైన కవిగానం దృశ్యం, బయట 'లొంగనితరం' ఆధ్వర్యంలో నిరసన బ్యానర్లు




మీ పుస్తకావిష్కరణ కూడా ఏవైనా పెద్ద సాహిత్య సంస్థలు లేదా సాంస్కృతిక సంస్థలు చేసిపెడతాయి. (ఈ సాంస్కృతిక సంస్థల సబ్జెక్టు చాలా పెద్దది, ప్రస్తావిస్తే మరో వ్యాసం రాయాల్సి ఉంటుంది). మీ పుస్తకావిష్కరణలో కూడా అనేకమంది సాహిత్య ప్రముఖులు ఇంకా ఇతర ప్రముఖులు(ఒక్కోసారి ఎం.పీలు,మంత్రులు కూడా) వచ్చి మిమ్మల్ని ప్రశంసలతో ముంచెత్తి వెళ్తారు. ఒక పుస్తకానికి 2 లేదా 3 ఆవిష్కరణలు జరపడం ఇవ్వాళ్టి ట్రెండ్. మీరు కావాలంటే అలా మీ ఆర్థిక శక్తినీ, పలుకు బడినీ బట్టి 2, 3 ఆవిష్కరణలు జరిపించుకోవచ్చు. ఇక మీకేనైనా బిరుదులు, సన్మానాలు కావాలంటే కూడా కావలసినన్ని.

ఇకపోతే మీ కవిత్వాన్ని కొద్దిగా పత్రికలకి పంపిస్తే మీ పలుకుబడివల్లో లేదా మీ మిత్రుల పలుకబడివల్లో (అక్కడ సాహిత్య పేజీలు చూసేవాళ్ళుకూడా అడపాదడపా మీలాగే కవిత్వ సంకలనాలు విడుదల చేసే కవి(?) మిత్రులే ఉంటారు, అక్కడ వాళ్ళ కవిత్వాన్ని కూడా మీరు పొగిడితే వాళ్ళకి, మీకూ మంచి స్నేహం ఏర్పడుతుంది, ఇదంతా ఒకప్పుడు వచ్చిన ఆడవాళ్ళ చీరలకి సంబంధించిన జోకుల్లాగే ఉందికదా అని మీరు ఫీలవ్వకూడదు, ఈ పబ్లిక్ రిలేషన్ ఎప్పటికైనా పనికివచ్చేదే అని మీరు అర్థం చేసుకోవాలి). మీ కవిత్వ సంకలనానికి మంచి సమీక్ష వస్తుంది. సాధారణంగా సమీక్షకులు పుస్తకాలు చదివిరాయరు. మీరు చెప్పిందో లేక మీ పుస్తకం పీఠికలో కవి ప్రముఖులు చెప్పిందో కోట్ చేసి రాసేస్తారు.

ఈ రూట్‌లో కొంతకాలం ప్రయాణిస్తే మీకు వేరేవేరే ప్రభుత్వ అవార్డులు, ఒక్కోసారి డాక్టరేట్‌లు, పి.హెచ్.డీలు, ప్రమోషన్లు వంటి లాభాలు కూడా సాధ్యమే.

ఇన్ని లాభాలూ ఊరించే పూలబాటని వదిలి మరో దారితొక్కేందుకు ఎవరు సాహసిస్తారు, ఎవరు ఇష్టపడతారు.

ఈ మొహమాటాల, మర్యాదల రాజ్యంలో అలజడులు, తిరుగుబాట్లూ అసలు లేవను కోవడం కూడా నిజంకాదు. ఏడాది క్రితం హైద్రాబాద్‌లో జరిగిన 'కవిగానం' అనే కార్యక్రమం పైన లొంగని తరం పేరున ఉవ్వెత్తున ఎగిసిన నిరసన ఇటువంటి తిరుగుబాట్లలో ఒకటి. నిజానికి వందల సంఖ్యలో సాహిత్యకారులు (కవులు, రచయితలు, అనువాదకులు) ఒకచోట సమావేశం కావడంలో అంత దుర్మార్గం కూడా ఏమీలేదు. సి.నా.రె. ప్రారంభకులు కావడం వలన 'కవిగానం' ఇరకాటంలో పడాల్సివచ్చిందేమో తెలీదు. 'కవిగానం' కార్యక్రమాన్ని వ్యతిరేకించే వరకే తప్ప మొత్తంగా కవిత్వంలో కెరీరిజాన్ని వ్యతిరేకించే ఉద్యమంగా 'లొంగని తరం' రూపుదిద్దుకోలేకపోయింది. ఇందుకు అనేక కారణాలున్నాయి. కవిత్వాన్ని రక్షించాల్సిన ఉద్యమం - 'రాజ్యం', 'కోవర్టు ఆపరేషన్' లాంటి పదజాల పరిమితులు విధించుకోవడం, అవార్డు అర్హులైనవారికి ఇవ్వాలని కాకుండా ఎవరు అవార్డులు తీసుకున్నా తప్పేననే చిత్రమైన వైఖరిని తీసుకోవడం, (శ్రీశ్రీ, అజంతా, కాళోజీ, బోయిభీమన్న వంటివారికి అవార్డులు రావటం, వారు తీసుకోవడం - ఖండిస్తారా?) నిరసనలోకి వచ్చిన కవుల్లోనూ కొందరు అకవులు లేదా కెరీరిస్టు హైరార్కీలో తమకి వాటా దొరకలేదనే అక్కసు ఉన్నవాళ్ళు కావడం, 'కవిగానం'లో పాల్గొన్న వారు ఆ కార్యక్రమాన్ని 'కోవర్టు ఆపరేషన్'గా భావించకపోవడం- ఇవన్నీ కారణాలే. ఏదిఏమైనా "వంద అవార్డులు ప్రకటించనీ, వేయి పైరవీలు సాగించనీ", "అంతా 'నారా'యణం" వంటి నినాదాలతో లొంగని తరం కొంత ఆసక్తిని రేపినమాట నిజం. కేవలం ఒక కార్యక్రమంపై వ్యతిరేకతగా కాక - మొత్తం కెరీరిస్ట్ ధోరణులపై ప్రొటెస్టు ఉద్యమంగా దీన్ని నడిపివుంటే కొంత ఫలితం ఉండేదేమో!

దానాదీనా చెప్పేదేమిటంటే తెలుగు కవిత్వం కెరీరిస్టు కోరల్లో పూర్తిగా చిక్కుకుని మరణించే దశకే చేరుకుంది.



ఇస్మాయిల్

బహుశా ఇటువంటి పరిస్థితి గురించేనేమో శేషేంద్ర చాలాకాలం క్రితమే...

*"ఈ దేశంలో వంగేవాడికి*
*వంగి సలాం చేసేవాడు పుడుతున్నాడు*
*జాగ్రత్త! ఈ లక్షణం తలయెత్తిందంటే*
*ఆకాశంలో తోకచుక్కపుట్టిందన్న మాటే"* అని రాశారు.

పైన పేర్కొన్న సుప్రభాతం సంచికలో ఇస్మాయిల్‌ను అడిగిన ప్రశ్న, దానికి ఆయనిచ్చిన జవాబు చూడండి :

"... (ప్రశ్న:) 'కవికన్ను తెరవకముందే కీర్తి స్తన్యం కోసం తడుము కోవటం, దీన్ని సమృద్ధిగా, చవగ్గా సప్లయిచేసే ఆస్థానంలో చేరిపోవటం ఇటీవల కనిపిస్తున్న వైపరీత్యం' అని మీరు "కొత్త ఆస్థానాల్లో కవిపోషణ" అనే వ్యాసంలో రాశారు. ప్రస్తుతం కవిత్వం రాస్తున్న యువ కవుల్లో చాలా మంది జరూరుగా ఆస్థానాల్లో చేరుతున్నారు. ఎవరినోఒకరిని పట్టుకుని పైకి ఎగబాకే వాళ్ళు వీళ్ళలో కనిపిస్తున్నారు. ఈ ధోరణిపై మీ కామెంట్ ఏమిటి! కెరీరిస్టులు అసలు కవిత్వం రాయడమేమిటి? ఇదెలా సాధ్యమవు తున్నది?

(జవాబు:) మా పైతరం కవులు, అంటే కృష్ణశాస్త్రిగారు మొదలైన భావకవులు కవిత్వం కోసం బతికారు. కవిత్వం కోసం ఉద్యోగాలు మానుకున్న వాళ్ళు కూడా వున్నారు. దేనికీ ఎగబాకే వారుకాదు. మా కిందితరం వచ్చేటప్పటికి ప్రపంచం మారిపోయింది. అన్ని విలువలూ పతనమై పోయాయి. ధనం కోసం, పదవుల కోసం ఎగబాకటం సామాన్యమైంది. కవులు కూడా ఇటువంటి ప్రలోభాలకు దాసులవటం శోచనీయం. కవి కూడా మనిషే కదా! అంటారేమో. కాదు. మామూలు మనిషి కాదు. మామూలు మనిషితనానికి ఉన్నతంగా ఉంటేనే కాని అతనికి కవిత్వ దర్శనం కలగదు. జీవితమూ, కవిత్వమూ వేరు వేరు కాదు. జీవితంలోని మచ్చలు కవిత్వంలో కనిపించి తీరతాయి. అందుకనే, కవికి నిజాయితీ ముఖ్యమని మొదట్నుంచీ అంటున్నాను."

ఇదిలా ఉండగా తెలుగు కవిత్వం మాట అటుంచి మరోపక్క అసలు తెలుగు భాషకే ముప్పొచ్చి పడే పరిస్థితి ఏర్పడింది. ఇంగ్లీషు చదువు, కంప్యూటర్ అమెరికా మోజు కలిసి - త్వరలోనే తెలుగుకి కూడా మరో రెండు తరాల్లో సంస్కృతం స్థానం లభించినా ఆశ్చర్యంలేదు. అంచేత ప్రమాదం ముంచుకొచ్చినట్టే.

ఒకప్పుడు శ్రీశ్రీకి ఆంధ్రదేశంలో గొప్ప హీరో వర్షిప్ ఉండేది. కమ్యూనిస్టులు అయినా కాకపోయినా, ఆయన అభిప్రాయాలతో ఏకీభవించినా ఏకీభవించకపోయినా ఆంధ్రదేశ మంతటా యువతరం ఆయన్ని ఆరాధించేది. ఆయన ఎక్కడికి వెళ్ళినా జనం ఎగబడేవారు. బ్రహ్మరథం పట్టేవారు. కృష్ణ శాస్త్రికూడా తన కాలంలో కవిత్వానికి ఆ గ్లామర్ తెచ్చారు. ఈ రోజు శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి వంటివారు కవిత్వం రాసినా ఎవరూ పట్టించుకోరేమో!

శేషేంద్ర మరో సందర్భంలో కవిత్వంలో ప్రవేశించిన రాజకీయాల విషయం ప్రస్తావిస్తూ "మా కాలంలో మేం దేశం ముందుకి వెళ్తుందనే ఉత్సాహంతో కవిత్వం రాశాం. దశాబ్దాల తర్వాత వెనక్కి తిరిగి చూస్తే చాలా అధోగతికి పోయామనిపిస్తోంది. మన మంత్రులు చాలా మంచివాళ్ళు. వాళ్ళు గనక కవిత్వం రాస్తే అన్ని పీఠాలు, గౌరవాలు వాళ్ళకే చెందుతాయి. ఇవాళ కవిత్వాన్ని ఎవరు రాశారనేదే ముఖ్యం. ఏం రాశారనేది కాదు" అన్నారు.

కవిత్వాన్ని రక్షించుకోవడానికి బహుముఖ పోరాటం అవసరం. అవార్డులు ఎవరి కవిత్వాన్ని రక్షించలేవనేది నిజమే. కానీ అవార్డులు సైతం అర్హులైనవారికే చెందాలి. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. మనం చెల్లించే పన్నులే ప్రభుత్వాల మూలధనం. కేవలం పాలక పక్ష అభిప్రాయాలు కలిగి ఉండకపోయి నంత మాత్రాన, "హోం డిపార్ట్‌మెంట్ క్లియరెన్స్" పేర కొన్ని పేర్లని పక్కన పెట్టే పద్ధతి అమలులో ఉంటే అది తప్పనే చెప్పాలి.

జ్ఞానపీఠ్ అవార్డు పొందిన వారిలో అలీసర్దార్ జాఫ్రీ, తక్కళి శివశంకర పిళ్ళై, మహాశ్వేతాదేవివంటి విశిష్ట రచయితలెందరో ఉన్నారు.



రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.)

గురజాడ, శ్రీపాద, శ్రీశ్రీ (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది, ఇంకొన్నాళ్ళు బ్రతికుంటే జ్ఞానపీఠ్ కూడా వచ్చేదని చెపుతారు), కృష్ణశాస్త్రి, చలం, రావిశాస్త్రి, గద్దర్, అజంతా (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది), శేషేంద్ర, ఇస్మాయిల్, దాశరధి, నగ్నముని, శివసాగర్ వంటి మహామహులెందరో..., వీరు (వీరేకాక ఈ మార్గంలో సజీవ రచనలు చేసినవాళ్ళంతా) తెలుగు భాష ఉన్నంతకాలం చిరంజీవులే. వీరికి అవార్డులు రానంతమాత్రాన లోటేమీ లేదనేది నిజమే, కానీ ఇచ్చేందుకు ఆటంకాలు ఉండటంకూడా సమంజసం కాదు. రాజకీయాభిప్రాయాలతో సంబంధంలేకుండా ప్రతిభనీ, కృషినీ గుర్తించి గౌరవించుకో గలిగితేనే అవార్డులకు రాణింపు.

"ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనంబులున్ సొమ్ములుకొన్నిపుచ్చుకొని" తన కవిత్వాన్ని అమ్ముకోనని ఆత్మవిశ్వాసాన్ని చాటిన బమ్మెరపోతన సర్వదా కవులకు ఆదర్శనీయుడే.

మొహమాటాల్ని మర్యాదల్ని తగ్గించుకుని, నిర్మొహమాటంగా విమర్శించుకోవడం వల్లే అకవిత్వ కేన్సర్‌నించి తెలుగుభాషని రక్షించగలం. మొదట దీనికి సంబంధించిన చర్చ ప్రారంభం కావాలి.

1988లో కీర్తిశేషుడైన రాచమల్లు రామచంద్రారెడ్డి తాననుకున్న పద్ధతిలో తప్పొప్పులు ఎత్తి చూపుతూ నిర్మొహమాటమైన విమర్శలు రాసేవారు. తన పద్ధతిని సమర్థించుకుంటూ ఆయన ఒకసారి తన 'సంవేదన' సంపాదకీయంలో ఇలా రాశారు : "...రాజకీయరంగంలోలాగే సాహిత్య రంగంలో కూడా అయోగ్యులూ, అనధికారులూ, కుక్షింభరులూ, ఆత్మస్తుతి పరాయణులూ, జోహుకుందారులూ, పగటి వేషగాళ్ళూ పెత్తనం సాగిస్తున్నారు. ఈ సాహిత్య పేరిగాళ్ళవల్ల దయాదాక్షిణ్యాలు చూపడం వల్ల తెలుగు సాహిత్యం బాగుపడుతుందని మేము అనుకోవడం లేదు...".

- ఈశ్వరానంద

# అల్లా మెహర్బాన్ తో గధా పహిల్వాన్ 2

## (దేవుడు దయచూపిస్తే గాడిదే పహిల్వాన్)

రాజీనామా ఫార్స్ జరిగి వారం రోజులయిపోయింది.

తనకు ఖచ్చితంగా ఏదొక చైర్మన్ పదవో లేక ఏదొక కమిటీలో మెంబరు పదవో వస్తుందని గంగారామ్ ఆశపడ్డాడు గానీ ఇంకో ఆరునెలల వరకూ మంత్రివర్గ విస్తరణగానీ వేరే పదవుల పంపకంగానీ చేబట్టబోవటం లేదని ముఖ్యమంత్రి ప్రకటించేసరికి కొంచెం నిరుత్సాహపడ్డాడు.

"ఇదేమిటి పాపారావ్ - ఇలా జరిగింది? నా రాజీనామా గొడవతో ముఖ్యమంత్రి దృష్టిలో పడ్డాగానీ ఉపయోగం లేకుండా పోయిందే" అన్నాడు విచారంగా.

"మరీ అంత ఓవర్‌గా రియాక్టవకండి సార్! ఈ విషయం ఎవరయినా సి.యమ్.కి మోశారంటే పదవి మాటలా ఉంచి ఈసారి ఎలక్షన్‌కి పార్టీ టికెట్ కూడా దొరకదు" అన్నాడు పాపారావ్.

ఆ మాటతో గంగారామ్ బెదిరిపోయాడు.

"అహహ! పదవి సంపాదించాలని నాకేం కోరిక లేదులే! కాపోతే - అందరూ నీకు ఏదొక పోస్ట్ గ్యారంటీ అన్నారని కొంచెం ఇదయ్యా! అంతే" అన్నాడు.

సరిగ్గా అప్పుడే రాజేశ్వరీ దేవి రుసరుసలాడుతూ హాల్లోకొచ్చింది.

"ఏమయింది? నా గన్‌మెన్ సంగతి?" అంది కోపంగా. ఆమె కోపం చూసి గంగారామ్ బెదిరిపోయాడు.

"అదీ - అది - నేను ఆల్‌రెడీ హోమ్ మినిస్టర్‌తో మాట్లాడాను"

"ఈ అరిగిపోయిన రికార్డే వద్దన్నాను. ముందిప్పుడు హోమ్ మినిస్టర్ దగ్గరకెళ్ళండి. మన ప్రాణానికి అపాయం ఉందని చెప్పండి. వెంటనే మనకో గన్‌మెన్ ఇవ్వకపోతే హంగర్ స్ట్రైక్ చేస్తానని వార్నింగివ్వండి".

"వార్నింగిచ్చినా గన్‌మెన్‌నివ్వకపోతే?"

"హంగర్ స్ట్రైక్ చేయండి"

గంగారామ్ ఉలిక్కిపడ్డాడు.

"హంగర్ స్ట్రైకా? నో! నా వల్ల కాదు. ఆఖరికి ఏకాదశిక్కూడా నేను భోజనం లేకుండా ఉండనని నీకు తెలుసుగా".

"వీల్లేదు. ఇప్పుడు మాత్రం గన్‌మెన్ లేకపోతే హంగర్ స్ట్రయిక్ చేయక తప్పదు. అవతల మా క్లబ్‌లో లేడీస్ అందరూ ఇద్దరిద్దరు గన్‌మెన్‌లతో షాపింగ్‌కి, పెళ్ళిళ్ళకూ, సినిమాలకూ, పార్టీలకూ తిరుగుతుంటే నాకెంత అవమానంగా ఉందో మీకర్థం కావటం లేదు".

"అవును డాడీ! మా స్కూల్లో ఫ్రెండ్స్ కూడా అడుగుతున్నారు 'మీకు గన్‌మెన్ లేడా అయ్యో' అంటున్నారు".

వాళ్ళిద్దరూ వెళ్ళిపోగానే గంగారామ్ పాపారావ్ వేపు తిరిగాడు.

"ఏం చేద్దామంటావ్?"

"వెంటనే హోమ్ మినిస్టర్‌గారిని కలుసుకుని మాట్లాడండి సార్!మేడమ్ చెప్పినట్లు గన్‌మెన్‌ని ఇవ్వకపోతే నిరాహార దీక్ష చేస్తానని బెదిరించండి! మీరూ ఎంతకయినా తెగించే రకం అని మీ 'రాజీనామా' ఫార్స్ వల్ల వాళ్ళకో తప్పుడు అభిప్రాయం ఏర్పడింది కదా! అందుకని వెంటనే ఒప్పుకుంటారు".

"సరే - అయితే - పద - వెళ్దాం".

ఇద్దరూ హోమ్‌మినిస్టర్ ఆఫీస్‌కి చేరుకున్నారు.

"ఏందయ్యా గంగారామ్. ఇప్పటిదాకా నీ రాజీనామా ఫార్స్ గురించే జోకులేసుకుని నవ్వుకుంటా ఉండాం కాబినెట్ మీటింగ్‌లో".

గంగారామ్ మొఖం ఎర్రబడింది.

"అలాగా సార్"

"మళ్ళీ ఇంకేదయినా కత చేస్తున్నావా ఏంది? ఇంత దూరం వచ్చావ్?"

"అదే సార్! పాత సమస్యే. మీరు ఎప్పటికప్పుడు 'చూద్దాం' అంటున్నారు"

" 'చూద్దాం' అంటే ఇంకా నీకు అర్థం కాలేదా? నువ్ రాజకీయాల్లోకొచ్చి ఎంత కాలమయింది?"

"నేనసలు కాలేజీ డేస్ నుంచే"

"ఊరికే అడిగాన్లే. ఇప్పుడాకతంతా చెప్పకు. "చూద్దాం" అంటే రాజకీయ భాషలో 'ఆ పని అవదు' అని అర్థమయ్యా! ఇంత సిన్న విషయం తెలీకపోటమేందయ్యా"

గంగారామ్ తెల్లబోయాడు.

"చూద్దాం అంటే 'ఆలోచిద్దాం' అని అర్థం కద్సార్?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏవరన్నారామాట. ప్రతి మాటకూ రాజకీయాల్లో వేరే అర్థం ఉండలా? అసలు 'చూద్దాం' అనే మాట ఏడనుంచి వచ్చింది? కామరాజ్ నాడార్ 'పాకలాం' అనే మాటనుంచి వచ్చింది. 'నీ పని కాదు' అని డైరక్ట్‌గా చెప్తే రాజకీయాల్లో కొంపలంటుకుంటాయ్ కదా! అందుకే ప్రస్తుతానికే సమస్య నుంచి తప్పించుకోడానికి వాడతారది. 'పాకలాం' పదమే 'చూద్దాం' అయింది. అలాగే 'మేంటర్ పరిశీలనలో ఉంది అని అసెంబ్లీలో ఎవరయినా స్టేట్‌మెంటిచ్చారనుకో - దానర్థం ఏమిటి? ఆ ఫైల్ ఎక్కడో గంగలో కల్సిపోయిందని అర్థం. అంతేగానీ నిజంగా పరిశీలనలో ఉందనా? అట్లనే అండర్ యాక్టివ్ కన్సిడరేషన్ అంటే అర్థమేంది? ఆ గంగలో కల్సిపోయిన ఫైలు గురించి ఆఫీసోళ్ళు వెతికిస్తున్నారు అనర్థం. అందాకా ఎందుకు? ఏదయినా గొడవ మీద కమిటీ ఏస్తున్నామని స్టేట్‌మెంటిస్తే ఏందర్థం? ఆ చాప్టర్ క్లోజ్ చేశామనే కదా! నువ్వో పని చెయ్ గంగారామ్. మన మాజీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ఆ రోజుల్లో ఒక బుక్ పబ్లిష్ చేశాడు. అది కొనుక్కుని వారం రోజులపాటు చదువుకుని కంఠస్థం చెయ్. అందులో రాజకీయ భాషకు చెందిన పదాలూ - వాటి రాజకీయర్థాలూ అన్నీ ఉన్నయ్"

గంగారామ్‌కి చిరాకేసుకొచ్చింది కానీ కనబడనీలేదు.

"అలాగే కొంటాన్సార్! కానీ ముందు గన్‌మెన్ సంగతి చూడండి సార్"

"ఏంది గంగారామ్ - ఏందట్టా మాట్టాడతావ్. ఉన్నోళ్ళకే గన్‌మెన్ పీకెయ్యమని పైన్నుంచి ఆర్డర్లొస్తే కొత్తగా గన్‌మెన్ ఏడనుంచొస్తారు?

"యూజ్ ఎ స్పెషల్ కేస్ నాకు ఎలాగయినా గన్‌మెన్ కావాల్సార్. నిన్నగాక మొన్న ఎమ్మెల్యే అయ్యాడు సాంబశివరావ్! అతనికి గన్‌మెన్ ఎలా ఇచ్చారు? అలాగే నాకూ ఇవ్వండి"

"ఇదిగో. నువ్వూ సాంబశివరావ్ ఒకటేనా ఏంది? సాంబశివరావ్ ముఖ్యమంత్రికి దగ్గరోడుండలే! పైగా సాంబశివరావ్‌కి వాళ్ళ జిల్లాలో శత్రుగ్రూప్ ఒకటుందన్న విషయం నీకు తెల్సుకదా!"

"నాకూ మా జిల్లాలో ప్రత్యర్థివర్గం ఉంది కదా"

"నీకు ప్రత్యర్థి వర్గం ఏందయ్యా. ఎవడయినా నవ్వుతాడా మాటింటే! ఇదిగో - ఈ గొడవంతా ఎందుగ్గానీ అసలు సంగతేందో చెప్పు. గన్‌మెన్ ఉండాల్సిందేనని మీ ఆవిడ రభస చేస్తోందా ఏంది?"

ఆ మాటతో గంగారామ్ అదిరిపడ్డాడు.

"మా ఆవిడా? మా ఆవిడెందుకు అడుగుతుంది సార్?"

"ఏంది? తెలీనట్టు మాట్టాడతా ఉండావ్! మన రాష్ట్రంలో సగం మంది ఎమ్మెల్యేలకు గన్‌మెన్ ఇచ్చింది వాళ్ళ భార్యల పోరు పడలేకనే కదా! గన్‌మెన్ లేందే ప్రిస్టేజ్ ఏడుందని ఆళ్ళు ఫీలవబట్టే కదా ప్రతోడూ నాకూ గన్‌మెన్ కావాలని అర్జీలు పెట్టింది? ఇదయ్యేది కాదు పెట్టేది గాదు గానీ - నువ్వింకపో"

"చూడండి సార్. మీరు ఓపెన్‌గా మాట్లాడుతున్నారు కాబట్టి నేనూ ఓపెన్‌గానే మాట్లాడతన్నా! నిజంగానే మా మిసెస్ 'మనకి గన్‌మెన్ ఉండాల్సిందే' అని పట్టుబట్టింది సార్! అందుకని మీరు ఇవ్వక తప్పదు! ఇంట్లో పోరు ఎంత భయంకరంగా ఉంటుందో మీకూ తెలుసు కదా! మీకూ గన్‌మెన్ ఉన్నారు"

"ఇప్పుడు నా సంగతెందుకు గానీ - గన్‌మెన్‌ని ఇవ్వటం మాత్రం కుదరదయ్యా!"

"అయితే నేను హంగర్ స్ట్రైక్ చేయాల్సి వస్తుంది సార్"

హోమ్ మినిస్టర్ పగలబడి నవ్వాడు.

"అపోజిషనోళ్ళు చేసే పని నువ్వు చేస్తానంటావేంది గంగారామ్. నీకేమయినా మతిగితీ పోయిందా ఏంటి?"

"మీరు గన్‌మెన్‌నివ్వకపోతే నాకు ఆల్టర్‌నేటివ్ లేద్సార్! తర్వాత మీ ఇష్టం"

"కానీ నువ్వెన్ని రోజులని తిండి లేకుండా ఉంటావయ్యా. అసలు నీకీ నిరాహారదీక్షలు అలవాటున్నయ్యా?"

"అలవాటు లేకపోతే అలవాటు అవుతుంది సార్"

"అట్టనుకోకు. మొన్నే కదా. ఆ రాజశేఖర్ రెడ్డి వాళ్ళు నిరాహార దీక్ష కొన్నాళ్ళు చేసి తర్వాత వాళ్ళంతట వాళ్ళే మానేసింది. ఎందుకనుకుంటున్నావ్? నా మాటిని ఆ ఆలోచన మానుకో!"

"సారీ సార్. ఇంకో రెండు రోజులు చూస్తాను. అప్పటికీ మీరు గన్‌మెన్ శాంక్షన్ చేయకపోతే నిరాహారదీక్ష చేయటం ఖాయం"

"నీ యిష్టం గంగారామ్. నేను చెప్పాల్సింది నేను చెప్పాను. ఈ సంగతి సి.యమ్. గారికి తెలిసిందంటే అది నీ కెరియర్‌కి కూడా మంచిది కాదు. ఆలోచించుకో"

"అన్నీ ఆలోచించుకునే మీ దగ్గరకొచ్చా"

గంగారామ్ తిరిగి వచ్చేశాడు.

బయట నిలబడ్డ పాపారావ్ ఆత్రుతగా దగ్గరకొచ్చాడు.

"ఏమంటున్నాడు సార్?"

"ఇవ్వను పొమ్మంటున్నాడు"

"మరి నిరాహార దీక్ష చేస్తానని బెదిరించారా?"

"చేసుకో పొమ్మంటున్నాడు"

"అయితే ఖచ్చితంగా చేయాల్సిందే సార్! ఇక్కడి నుంచీ ఇది మన ప్రిస్టేజ్ ఇష్యూ"

"ఏయ్ పాపారావ్. ఇలాంటి తిక్క మాటలు మాట్లాడకయ్యా! తిండి లేకుండా పడుండటం ప్రిస్టేజా? ఇలాంటి బోడి ప్రిస్టేజ్‌లు మనకొద్దంతే! మనకస్సలు పడదిలాంటివి!"

"చూడండి సార్! అదేదో సామెత చెప్పినట్లు "రాజకీయాల్లోకి రాగానే సంబరం కాదు. నిరాహార దీక్షలలో వచ్చే తిప్పలు చూసుకోమన్నారు పెద్దలు. రాజకీయాలకూ నిరాహారదీక్షలకూ చాలా దగ్గర సంబంధం ఉంది సార్! పెద్ద పదవులకు నిరాహారదీక్షలు సోపానాలు! ఏ రాజకీయ నాయకుడి చరిత్రయినా బయటకు లాగి చూసుకోండి! ఎక్కడోచోట ఏదోక సందర్భంలో నిరాహార దీక్ష చేసే ఉంటాడు. మనక్కావలసినవన్నీ సాధించుకోడానికి నిరాహార దీక్షల్ని హాపీగా వాడుకోవాలి సార్! కాపోతే ఇక్కడ మీరు తెలుసుకోవలసిందేమిటంటే ఎంత నిరాహార దీక్షయినా సరే త్వరగా వదిలించేసుకోవాలిగానీ చివరికంటా పోగూడదు. పోతే చస్తాం! రాజకీయ నాయకులు బాగా గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే మనం ఎప్పుడూ ప్రజలకోసం భావకూడదు. ప్రజలే మనకోసం భావాలి! ఇది డెమొక్రసీలో ఫండమెంటల్ రూల్! ఇందుకు మీకు లక్ష ఎగ్జాంపుల్స్ దొరుకుతాయ్! ప్రత్యేక తెలంగాణా విగిటేషన్ తీసుకోండి. ప్రత్యేక ఆంధ్రాది తీసుకోండి! రిజర్వేషన్స్‌కి వ్యతిరేకంగా లేవతీసిన ఉద్యమం తీసుకోండి! హిందీ అధికారభాషా ఉద్యమం చూడండి. చచ్చింది నాయకులు కాదు! జనం! అంచేత..."

"ఇంక చెప్పొద్దులే! కేస్ అర్థమయింది! కానీ నువ్వేం చెప్పినా నిరాహారదీక్ష మాత్రం మనతో కాదు"

"సరే సార్! మీ ఇష్టం! నాదేముంది? కానీ ఒక్క విషయం గుర్తుంచుకోండి. హంగర్ స్ట్రైక్ చేయకపోయినా మీకింట్లో ఎలాగూ భోజనం పెట్టరు మేడమ్‌గారు. గన్‌మెన్ లేకపోవటం వల్ల ఆమె మిగతా నాయకుల భార్యల ముందు, ఫ్రెండ్స్ ముందు ఎంత అవమానపడుతున్నారో మీకు తెలీదు. ఎలాగూ పస్తుండక తప్పదు గనుక అదేదో నిరాహార దీక్ష పేరుతో లాగించేస్తే అటు మేడమ్ ఆనందిస్తారు. ఇటు పబ్లిక్ కూడా మీరు ప్రజలకోసం నిరాహారదీక్ష చేస్తున్నందుకు మెచ్చుకుంటారు. ఇవి కాక న్యూస్‌పేపర్లు, ఫోటోలు - ఇవన్నీ మామూలే! ఎంత ఎట్రాక్టివ్ ఆఫరో చూడండి"

"అది సరే ఒకవేళ నేను నిరాహారదీక్ష చేస్తే - సెంట్ పర్సెంట్ చేయనుగానీ, మాటవరసకంటున్నా. ఒకవేళ చేశాననుకో! దానికి ప్రజలు మెచ్చుకుంటారంటావేమిటి? నేను గన్‌మెన్ కోసం చేసే దీక్ష వల్ల వాళ్ళకేం లాభం?"

"భలేవారే సార్ మీరు! రాజకీయాల్లోకొచ్చి ఇంత కాలమయినా ఇంకా కుట్రలు, దురుద్దేశాలూ, గోతులు తవ్వటాలు, పక్కవాడిని ముంచటాలూ, ఒకటి చెప్పి ఇంకోటి చేయటాలూ - ఇవన్నీ నేర్చుకోపోతే ఎలా? మనం నిరాహారదీక్షలు చేసినా, రాజీనామాలు చేసినా, ఉద్యమాలు లేవదీసినా - ఏదయినా మన స్వార్థం కోసమే చేస్తాం కదా! కానీ ఆ విషయం బయటకు చెప్తే మన సొంత నియోజక వర్గంలో జనమే మనల్ని వెంటపడి తంతారు! అందుకని మనం పైకి - అంటే ప్రజలకు ఒక కారణం చూపించి, ఇంకో కారణం కోసం నిరాహార దీక్షలు చేస్తామన్నమాట"

"ఆహా! నిజంగా నువ్ చాలా గ్రేట్ పాపారావ్! ఒక్క మనిషి దగ్గర ఇన్ని దగుల్బాజీ బుద్ధులుండటం నిజంగా చాలా అరుదయిన విషయం!"

"అంతా రాజకీయాల పుణ్యం! అన్నీ మీ లాంటి పెద్దల దగ్గర నేర్చుకున్నవే సార్"

"ఇంతకూ రేపు నేను నిరాహార దీక్ష మొదలు పెడితే - ఎందుకు చేస్తున్నట్లు స్టేట్‌మెంటివ్వాలి?"

మీ నియోజకవర్గంలో శాంతిభద్రతలు లోపించినందుకు నిరసనగా మీరు నిరాహార దీక్ష చేస్తున్నారన్నమాట! దాంతో Two birds in one shot! శాంతి భద్రతలు ప్రజలకు లోపించినందుకు మీరు నిరాహారదీక్ష చేస్తున్నారని ప్రజలనుకుంటారు. నిజానికి మీరు చేస్తోంది - మీ గన్‌మెన్ కోసం అనేది మేడమ్ గారికి తెలుస్తుంది - హోమ్ మినిస్టర్ గారికీ తెలుస్తుంది"

గంగారామ్ ఆనందం పట్టలేక పాపారావ్‌ని కౌగలించుకున్నాడు.

"నీ ప్లాన్లు ఎట్రాక్టివ్‌గానే ఉన్నాయ్‌గానీ నా వీక్‌నెస్ గురించి నీకూ తెలుసు కదా! రోజూ మటన్ బిరియానీ గానీ చికెన్ కర్రీగానీ తినకుండా బ్రతకటం కష్టం! మరి నిరాహారదీక్షంటే..."

"నిరాహార దీక్షల్లో రెండు రకాలున్నాయ్ సార్! ప్రజా నిరాహారదీక్ష, రాజకీయ నిరాహార దీక్ష! ప్రజా నిరాహారదీక్ష అంటే నిజంగా ఏమీ తినకుండా పచ్చిమంచినీళ్ళు కూడా ముట్టుకోకుండా దీక్ష పూనటం. ఇక రాజకీయ నిరాహారదీక్షంటే అందరికీ తెలిసిందే. శుభ్రంగా కావలసినవన్నీ సీక్రెట్‌గా తెప్పించుకుని తింటూ ఎన్ని రోజులయినా హాపీగా నిరాహార దీక్ష చేయటం"

గంగారామ్ హోరున ఆశ్చర్యపోయాడు.

"ఓర్నీయవ్వ - అందుకేనా ప్రతోడూ నేను నిరాహార దీక్ష చేస్తానంటే నేనూ చేస్తానంటూ ఎగపడటం? ఇప్పుడర్థమయింది"

"ఈ రెండూ గాక మూడో రకం కూడా ఒకటుంది గానీ ప్రస్తుతం అది మీకనవసరం!"

"నాకనవసరమయితే అయిందిగానీ అదెలా ఉంటుందో చెప్పు! ఫ్యూచర్‌లో అవసరం రావచ్చు కదా!"

"దాని పేరు ఎరేంజ్‌డ్ హంగర్ స్ట్రైక్ అంటారు. అంటే ముందే కొంతమందితో ఒప్పందాలు చేసుకుని దీక్ష మొదలెడతారన్న మాట. వారం రోజులయ్యేసరికి పెద్ద పదవుల్లో ఉన్నాళ్ళు వచ్చి వాళ్ళకు కర్ర విరగని పాము చావని ట్రైపు హామీలిచ్చి నిమ్మరసం తాగించి దీక్ష విరమింపజేస్తారు. దాంతో అటు ప్రజలను వెర్రివెధవలను చేయవచ్చు. ఇటు దీక్ష బాధలేకుండా తప్పించుకోవచ్చు. ఇంకో పక్క గవర్నమెంట్‌తో కుమ్మక్కయి సొంత పనులేమయినా చేయించుకోవచ్చు"

"ఓర్నీ - నిరాహారదీక్షల్లో ఇన్ని సుఖాలున్నాయని నాకు తెలీనే తెలీలేదు. ఇక





# యర్రంశెట్టి శాయి

# హ్యూమరాలజీ

మంచీ చూస్కో - ఛాన్స్ దొరికినప్పుడల్లా నిరాహార దీక్ష చేసేస్తా"

"అయితే ఇప్పుడు నిరాహార దీక్ష మొదలెడతారా?"

"ఇవాళొద్దులే! ఎల్లుండి ఆదివారం కదా! కైకలూరు నుంచి మా ఫ్రెండ్ రొయ్యలు పంపుతానన్నాడు. ఆ రోజంతా రొయ్యల బిరియానీ బాగా తిని - సాయంత్రం నుంచీ మొదలు పెడతా!"

"ఓకే సార్. అయితే నేను వెంటనే ప్రెస్ మీట్ ఏర్పాటు చేస్తా"

"ప్రెస్వాళ్ళను కొంచం మానేజ్ చెయ్. మనకి కిందటిసారి కంటే ఎక్కువ పబ్లిసిటీ వచ్చేట్లు చూడు"

"అదంతా నాకొదిలేయండి సార్"

ఆ రాత్రి గంగారామ్‌కి ఒకటే కలలు.

తను నిరాహారదీక్ష చేస్తూంటే సడెన్‌గా చచ్చిపోయినట్లూ - తన శవాన్ని నియోజక వర్గంలో ఊరేగిస్తున్నట్లూ -

అదిరిపోయి లేచి కూర్చున్నాడు. తెల్లారే వరకూ మళ్ళీ కన్ను మూయాలంటే భయం వేసింది. మర్నాడు ప్రెస్ మీట్‌కి ఏర్పాటు చేశాడు పాపారావ్.

"నియోజకవర్గంలో శాంతి భద్రతలు లోపించినయ్యంటానికి ఋజువులేమిటి అని జర్నలిస్టులు అడిగారనుకో! ఏం చెప్పాలి నేను?" అడిగాడు గంగారామ్.

"అదే నేనూ ఆలోచిస్తున్నా సార్! ఈ మధ్యకాలంలో న్యూస్ పేపర్లన్నీ ఇందాక ముందేసుకు చూశా! కానీ స్ట్రాంగ్‌గా జరిగిన సంఘటన ఏమీ కనిపించటం లేదు. మామూలుగానే వారినికో రేప్, పదిహేను రోజులకో మర్డరూ, నెలకో దొమ్మీ, రెండు నెలలకో లాకప్ డెత్ జరుగుతున్నయ్ గానీ అవి శాంతి భద్రతల లోపం అంటానికి వీల్లేదు. ఎందుకంటే వాటిని సహజ సిద్ధమయిన విషయాలుగా అందరూ యాక్సెప్ట్ చేసేశారు. ఇకపోతే దోపిడీలూ, దొంగతనాలూ అసలు నేరాల కింద ఎవరూ చూడటం లేదు"

"మరింకేం కారణం చెప్పాలి పబ్లిక్‌కి మనం?"

"అదంతా మా నాన్న చూసుకుంటారు గానీ మీరు హంగర్ స్ట్రైక్‌కి పెద్ద ఎత్తున రిబ్బన్ కటింగ్, ఎవరయినా సినిమా నటుడితోనో ఇంకెవరయినా ప్రముఖుడితోనో ప్రారంభోత్సవం లాంటివి ఏర్పాటు చేయండి" అంది రాజేశ్వరీ దేవి హాల్లోకొస్తూ.

గంగారామ్ పాపారావ్ ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"అదేమిటి? హంగర్ స్ట్రైక్‌కి కూడా ప్రారంభోత్సవమా?"

"అవునూ? తప్పేముంది? మారుతున్న కాలంతో పాటు అన్నిటికీ గ్లామర్ యాడ్ చేస్తూండాలి?"

పాపారావ్ తప్పట్లు కొట్టాడు.

"మేడమ్‌గారి సూచనేదో బాగానే ఉన్నట్లుంది సార్! నేను ఇప్పుడే సినిమా యాక్టర్స్ ఎవరయినా ఖాళీగా ఉన్నారేమో చూసి ఆహ్వానిస్తాను. మనకి మంచి పబ్లిసిటీ వస్తుంది. ముఖ్యమంత్రి గారి దృష్టి కూడా మళ్ళీ మీ మీద పడుతుంది!"

"ఆయన చూసి చూసి రివర్స్ అవడు కదా?"

"అందుకే మిమ్మల్ని రోజా న్యూస్ పేపర్ మొత్తం చదవమనేది! రోజా తనని తిట్టినవాళ్ళనీ, తన మాట వినకుండా సస్పెండయిన వాళ్ళనూ, ఇంకో పార్టీలో ఉండి, తనను విమర్శించిన వాళ్ళనూ తిరిగి పార్టీలోకి చేర్చుకోవటం గురించి న్యూస్ వస్తూనే ఉంది కదా! ఇంక భయం ఎందుకు? పైగా మీరు సి.ఎం.ని గానీ, పార్టీనిగానీ తిట్టటం లేదు. ఇంక ప్రాబ్లెమ్ ఏముంటుంది."

"అంతా బాగానే ఉందిగానీ ఆ ఒకే ఒక్క పాయింట్ విషయం నాకు భయంగా ఉంది పాపారావ్"

"ఏమిటది?" అడిగింది రాజేశ్వరీదేవి.

"అదే శాంతి భద్రతలు లోపించినాయనటానికి ఏవయినా ఉదాహరణలు చూపించమని వాళ్ళు అడిగారనుకో - అప్పుడు ఏం చెప్పాలి?"

అప్పుడే మదన్ మరో పది మంది జనాన్నేసుకుని హడావుడిగా ఇంట్లోకొచ్చేశాడు. అందరి చేతుల్లో గొడ్డళ్ళు, కత్తులు ఉన్నయ్.

గంగారామ్ స్టన్ అయి చూస్తున్నాడు వాళ్ళ వేపు.

"పనయిపోయిందా?" అడిగింది రాజేశ్వరీ దేవి వాళ్ళవంక ఆత్రుతగా చూస్తూ.

"అయిపోయింది మేడమ్" అన్నాడు మదన్.

"ఎంత మందిని వేసేశారు?"

"నలుగురిని వేసేశాం మేడమ్. మిగతావాళ్ళు తప్పించుకున్నారు"

"ఏంటిది? ఎవర్ని వేసేశారు? ఏం జరిగిందసలు?" గాబరాగా అడిగాడు గంగారామ్.

"అదే సార్! మొన్న ఎలక్షన్ టైమ్‌లో మన ఆపోజిట్ గ్రూప్ వాళ్ళు మన గ్రూప్ వాళ్ళు ఆరుగురిని బాంబ్‌లేసి చంపేశారు కదా! అందుకని వాళ్ళ గ్రూప్‌లో నలుగురిని ఇవాళ మర్డర్ చేసేశాము"

గంగారామ్‌కి గుండెలు వేగంగా కొట్టుకున్నయ్.

"అదేమిటి? నన్నడగకుండా ఎందుకు చేశారిది? మొన్నే కదా నేనూ ఆ గ్రూప్ లీడర్ రంగన్నా నేనూ ఇక నుంచీ ఒకరి జోలికి ఒకరు రాకుండా కొట్లాటలు లేకుండా కలసి మెలసి ఉండాలని ఎస్పీగారెదురుగ్గా ఒక అండర్‌స్టాండింగ్‌కొచ్చాం"

"మా నాన్నగారే చేయించారిదంతా! ఆయనకంటే మీకెక్కువ తెలుసా రాజకీయాలు? మీరూరుకోండి!" కోప్పడింది రాజేశ్వరీ దేవి.

అప్పుడే ఫోన్ మోగింది.

గంగారామ్ ఫోన్ అందుకున్నాడు.

"అల్లుడూ! నేనే శంకరయ్యని మాట్లాడతన్నా - రంగన్న గ్రూపోళ్ళు నలుగురిని ఏయించేశా! మదన్, మిగతా పది మందీ ఒక వారం రోజులు మీ ఇంట్లోనే దాక్కుంటారు. పోలీసులొచ్చి అడుగుతే నాకేం తెలవదని చెప్పు!

"అ... అలాగే మావయ్యా"

"ఇప్పుడు నువ్వేదో హంగర్ స్ట్రైక్ చేస్తానన్నావంట కదా! నీ నియోజకవర్గంలో ఇవాళే నలుగుర్ని దారుణంగా ఎవరో నరికి చంపేశారు గనుక శాంతి భద్రతలు లోపించినయ్యనీ, అందుకే నువ్ నిరాహార దీక్ష చేస్తున్నావనీ చెప్పు - సరేనా?"

"సరే మావయ్యా"

ఫోన్ కట్టయింది.

"మదన్! మీరంతా ఇక్కడుంటే డేంజర్! అందుకని మన దోస్త్ మోహన్ రెడ్డి ఫామ్‌హౌస్‌కెళ్ళి అక్కడే రెండు మూడు రోజులు ఉండిపోండి. అక్కడుంటే ఎవడూ కనుక్కోలేడు." అన్నాడు గంగారామ్.

"అలాగే సార్"

వాళ్ళంతా మళ్ళీ కార్లల్లో వెళ్ళిపోయారు. రాజేశ్వరి లోపలికెళ్ళిపోయింది.

గంగారామ్ టేబుల్ మీదున్న మంచి నీళ్ళు గడగడ తాగేశాడు.

"పాపారావ్"

"ఏం సార్?"

"రాజకీయాలు మరీ టూమచ్‌గా ఉంటాయ్ కదూ?"

"ఇవన్నీ చాలా నార్మల్ సార్! మీరు కొత్త కాబట్టి కొంచెం ఇదవుతున్నారు. మీ మావగారు బాగా సీజన్డ్ కాబట్టి ఏటైమ్‌కి ఏ పని చేయాలో అది ఫాస్ట్‌గా చేసేస్తున్నారు"

"నాకెందుకో కొంచెం గాబరాగా ఉంది"

"అందుకే 'మందు' అనేదాన్ని కనిపెట్టారు మన పూర్వీకులు"

గంగారామ్ ఛప్పున రెండు పెగ్గులు కొట్టేశాడు. ఆ తరువాత ప్రెస్ మీట్ అద్భుతంగా జరిగింది.

"ఏమిటీ దారుణం? ఏమిటీ ఘాతుకం? ఏమిటీ మారణహోమం? నా నియోజక వర్గంలోనే పట్టపగలు నడిరోడ్న నలుగురిని దారుణంగా నరికి చంపేశారు. ఇంకో ఆరుగురు చావుదెబ్బలతో బ్రతికి బయట పడ్డారు. శాంతి భద్రతలు పూర్తిగా అడుగంటి పోయాయంటానికి ఇది క్లియర్ ప్రూఫ్! ప్రజలకు రక్షణ అనేది లేకుండా పోయిందనడానికి ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే! అందుకే శాంతి భద్రతలను ప్రభుత్వం కాపాడాలని కోరుతూ నేను ఇవాళ సాయంత్రం నుంచీ నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను" ఆవేశంగా అన్నాడు గంగారామ్.

"మీ ఓన్ పార్టీయేగా అధికారంలో ఉంది! మళ్ళీ మీరే హంగర్‌స్ట్రైక్ అంటారేమిటి?" ఎవరో అడిగారు.

"నేను ప్రజల మనిషిని! నా ప్రజలకు భద్రత ఏర్పరచటం కోసం నా పార్టీతో సహా ఏ పార్టీనయినా నిలదీస్తా!"

"హోమ్ మినిష్టరు గారు మీ పార్టీయే కదా! ఆయనతో ఈ విషయాలన్నీ చెప్తే సరిపోతుంది కదా!"

"హోమ్ మినిష్టరుగారితో మాట్లాడాను. ఆయన నా మాటల మీద అంత శ్రద్ధ చూపించటం లేదు. అందుకని నా మనోవేదనని ఈ విధంగా తెలియజేయ దల్చుకున్నాను"

"ఇలా చేయటంవల్ల మీ పార్టీని, మీ ముఖ్యమంత్రిగారినీ ఇరకాటంలో పెట్టినట్లవుతుంది కదా!"

"ముఖ్యమంత్రిగారు మా అందరికీ గురుతుల్యులు! ఆయన ఆజ్ఞ ఎప్పటికీ శిరసా వహిస్తూనే ఉంటాం! ఈ నిరాహార దీక్ష ఉద్దేశ్యం కేవలం అందరి దృష్టీ మా నియోజకవర్గంలో లోపించిన శాంతి భద్రతల మీదకు ప్రసరింపజేయుటమే!"

ప్రెస్ మీట్ ముగిసింది.

మర్నాడు అన్ని పేపర్లలో గంగారామ్ ఫొటో - నిరాహార దీక్ష శిబిరాన్ని ప్రారంభించిన సినీనటుడి ఫొటోతో సహా పబ్లిష్ అయినయ్. వెంటనే హోమ్ మినిష్టర్ సెల్‌ఫోన్లోకొచ్చారు.

"ఏందయ్యా గంగారామ్ - ఏందిది? నువ్వేం చేసినా ఏమీ ఉపయోగం లేదని అప్పుడే చెప్పినా కదా! గన్‌మెన్‌ని ఇవ్వటం కుదరదు"

"అందుకే కదా - నేనిది మొదలు పెట్టింది?"

"మళ్ళీ అట్టాగే మాట్టాడతావేంది? పైగా ఆ మర్డర్లన్నీ నువ్వే చేయిస్తివి! శాంతిభద్రతలు నేను లోపంచేశానంటుంటివి? ఏందీ కత?"

"ఆ మర్డర్లు నేను చేయించానా?"

"నువ్ కాపోతే నీ మామ! ఎవురయితే ఏంది? పైగా మర్డర్ చేసినోళ్ళందరినీ తీసుకెళ్ళి నీ దోస్త్ మోహన్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో దాస్తివి! నాకు తెలీదనుకుంటివా ఏంది? నా మాటిని నిరాహార దీక్ష ఇరమించుకో! లేకపోతే నీకతలన్నీ బయటకు తీయాల్సి వస్తుంది" ఫోన్ పెట్టేశాడతను.

గంగారామ్ గాబరాగా జరిగిన సంభాషణంతా పాపారావ్‌తో చెప్పాడు.

"భలేవారే సార్ మీరు! హోమ్ మినిష్టర్‌కి భయపడతారేమిటి? ఏం? నెలరోజుల కిందట ఫారెస్ట్‌లో పెద్దపులినీ, ఏనుగుల్నీ చంపిన గాంగ్‌తో ఆయనకు సంబంధం ఉందని మనకు తెలీదనుకుంటున్నారా? ఊరిబయట ఆశ్రమం నడుపుతున్న దొంగ బాబాతో కలిసి భక్తురాళ్ళతో రాసక్రీడలు నడుపుతున్న సంగతి మనకు తెలీదనుకుంటున్నాడా? ఈ రెండు విషయాలూ గట్టిగా అడగండి! ఆయనే సైలంటయిపోతాడు"

"ఇవన్నీ నాకే తెలీదు. నీకెలా తెలుసు పాపారావ్?"

"రాజకీయాలంటే అవే సార్! ఎప్పుడూ ఎవడేం చేస్తున్నాడో కనిపెట్టటమే ప్రజాసేవ!"

వెంటనే గంగారామ్ హోమ్ మినిష్టర్‌కి ఫోన్ చేసి మాట్లాడాడు. గంగారామ్ ఆరోపణలు వింటూనే హోమ్ మినిష్టర్ కంగారు పడ్డాడు.

"సరేలే- మనలో మనకి గొడవలెందుగ్గానీ - నా జోలికి నువ్ రాకు - నీ జోలికి నేను రాను. సి.యమ్. గారేమంటారో చూద్దాం"

ఆ సాయంత్రానికి గానీ ముఖ్యమంత్రి ఫోన్లోకి రాలేదు.

"ఏమిటి గంగారామ్ గారూ! ఏమిటి మళ్ళీ వార్తల్లోకొచ్చారు? మీకు కిందటిసారే చెప్పాను - మీరేం చేసినా, ఎంత గొడవ చేసినా పదవులు మాత్రం ఇవ్వను అని!"

"పదవికోసం కాద్సార్ - నేనెప్పుడూ పదవి కావాలని అడగలేదు కూడా"

"ఎవడయినా 'పదవి కావాలి' అని ఓపెన్‌గా అడుగుతారా ఏంటి? పదవి కావాలి అనుకోగానే ఇలాగే వార్తల్లోకెక్కుతాడు. లేదా ఉద్యమం అంటాడు. అదీగాకపోతే మా కులాన్ని ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అలజడి మొదలుపెడతాడు. ఎవరికి తెలీదివన్నీ"

"గాడ్ ప్రామిస్ సార్. నిజంగా నేను పదవి కోసం చేయటం లేదిది"

"అయితే మరెందుకు? నిజం చెప్పెయ్. శాంతి భద్రతలనే ముసుగు మాత్రం వేసుకున్నావని నాకు ఇంటెలిజెన్స్ రిపోర్ట్ వచ్చాయ్"

"హోమ్ మినిష్టర్ గారితో చెప్పాను సార్ - నాక్కావలసింది"

"సరే. నేను మాట్లాడతాన్లే. నువ్ వెంటనే నిరాహార దీక్ష విరమించెయ్" ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

మరికొద్ది క్షణాల్లో హోమ్ మినిష్టర్ ఫోన్ మీదకొచ్చాడు.

"ఎందుకయ్యా ఈ ముసుగులో గుద్దులాట! నువ్ గన్‌మెన్ తప్ప ఇంకేదయినా అడుగు చేస్తా! గన్‌మెన్ మాత్రం అడక్కు"

"ఏం ఎందుకడక్కూడదు?"

"ఇదిగో - చూడు గంగారామ్. ఈ వ్యవహారం ముఖ్యమంత్రి నోటీస్ వరకూ పోయింది కాబట్టి నిజం చెప్పేస్తా! సంగతేందంటే మన ఎడ్యుకేషన్ మినిష్టరు పెళ్ళాం ఉంది గదా! సుబ్బాయమ్మ! ఆ సుబ్బాయమ్మ మీ ఆవిడా మొన్నేదో ఫంక్షన్‌లో మాటామాటా అనుకున్నారంట! గన్‌మెన్‌ని చూసుకుని విర్రవీగిపోతున్నావ్. నేను తల్చుకుంటే నిమిషంలో గన్‌మెన్‌ని ఏర్పాటు చేయించుకుంటా అని మీ ఆవిడ ఛాలెంజ్ చేసిందంట! దాంతో సుబ్బాయమ్మ మొగుడికీ విషయం చెప్పి ఎలాగయినా నీకు గన్‌మెన్ ఇవ్వటానికి వీల్లేదని అందంట. ఎడ్యుకేషన్ మినిష్టర్ ఆ సంగతి తెలివిగా కాబినెట్ మీటింగ్‌లో పెట్టించి కొత్తగా ఎవరికీ గన్‌మెన్‌లు ఇవ్వటానికి వీల్లేదని ఆర్డరేయించాడు"

గంగారామ్ ఆశ్చర్యపోయాడు. గన్‌మెన్ వెనుక ఇంత పెద్ద కథుందని తనకే తెలీలేదు.

"ఏదేమయినా సరే సార్! సి.ఎం.గారేం చెప్తే అదే చేస్తా"

"సరే. నీకు గన్‌మెన్ ఇస్తా కానీ ఇప్పుడు కాదు. ఇంకో వారం పోయాక ఇస్తా! లేకపోతే నీ నిరాహారదీక్ష వెనుక అసలు కారణం గన్‌మెన్నేనని అందరికీ తెలిసిపోతుంది. మరి వెంటనే నిరాహారదీక్ష విరమిస్తున్నావా?"

"మీరు ప్రామిస్ చేశారు కాబట్టి ఇప్పుడే విరమిస్తా"

"అదేందయ్యా ఆ ఆత్రం! మొదలెట్టావ్ గనుక ఒకటి రెండు రోజులయినా చేశాక ఇరమించు! లేకపోతే అసయ్యంగా ఉంటుంది"

"ఓ.కే."

"కానీ - హంగర్ స్ట్రయిక్ ఎందుకు విరమిస్తున్నావని ప్రెస్ వాళ్ళు అడిగితే ఏం చెప్తావ్?"

"ఏం చెప్పాలో నాకేం తెలుస్సార్! మీరే చెప్పండి! పోనీ మీరు శాంతిభద్రతలు కాపాడతానని ప్రామిస్ చేశారని చెప్తాను"

"అంటే - అక్కడికి నేను అంతకు ముందు అక్కడ శాంతి భద్రతలు సరిగ్గా లేవని ఒప్పుకున్నట్లేగా? ఏయ్ - నా ఉద్యోగం పోగొడతావా ఏంది?"

"అయితే ఏం చెప్పమంటారో మీరే చెప్పండి"

"నాకు తెలుస్తే గదా నీకు చెప్పటానికి! నిరాహార దీక్ష చేయగానే సంబరం కాదోయ్. అది ఎలా విరమించాలో ముందే ఆలోచించుకుని దిగాలి. ఇప్పుడేమాత్రం తప్పు చేసినా నీ పరువుతో పాటు నా పరువు కూడా గంగలో కలిసిపోతుంది. నువ్వే మీ అసిస్టెంట్స్‌తో అన్నీ ఆలోచించుకుని చెప్పు"

ఆ రాత్రంతా ఆలోచించినా నిరాహార దీక్ష విరమించడానికి సరయిన కారణం ఏమీ తోచలేదు.

ఉదయం న్యూస్ పేపర్ చూస్తూనే గంగారామ్ అదిరిపడ్డాడు.

"ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో కృష్ణానదీ జలాల వివాదం గురించి చర్చలకు వచ్చిన కర్ణాటక ముఖ్యమంత్రి కిడ్నీప్! స్మగ్లర్, హంతకుడు, అడవిదొంగ వీరప్పన్ ఘాతుకం! ఇరకాటంలో పడ్డ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు!"

ఆ వార్త చూస్తూనే "సార్. మనదృష్టం పండింది!" అంటూ ఆనందంగా అరచాడు పాపారావ్ వార్త చూపిస్తూ.

"నీకేం పిచ్చెక్కిందా? ఆ వార్తకూ - మనదృష్టానికీ సంబంధం ఏమిటి?"

"లేకపోవటమేమిటి సార్! ఈ కిడ్నాప్ పరిణామం దృష్ట్యా ప్రభుత్వంతో సహకరించడానికి ఎమ్మెల్యే శ్రీ గంగారామ్ నిరాహార దీక్ష విరమణ" ఎలా వుంది సార్ ఈ హెడ్డింగ్ అప్పుడర్థమయింది గంగారామ్‌కి.

"ఒండర్‌ఫుల్ బ్రెయిన్ పాపారావ్ నీది! వెంటనే ప్రెస్ వాళ్ళను పిలిపించు"

"ఓ.కే.సార్" పాపారావ్ ఫోన్ తీసుకుని హడావుడిగా అన్ని పేపర్లకూ ఫోన్ చేయటం ప్రారంభించాడు ●





## కాలం పారిపోతోంది.

మా ఆర్టిస్టులూ, కార్టూనిస్టుల విషయంలో పాతికేళ్లుగా వేసిన చోటే పడుకున్న కాలం అర్జెంటుగా నిద్ర లేచి పరిగెడుతోంది.

ఒకప్పుడు పెన్సిల్ చెవిని పెట్టుకుని సిటీకి వచ్చిన ఆర్టిస్టులని పలకరించేవాడే లేడు. జె.ఎన్.టి.యు ఆర్ట్స్ కాలేజీలో ఐదేళ్ళూ చదివి బయటికొస్తే ఏదో ఊళ్ళో డ్రాయింగ్ పంతులు ఉద్యోగం వస్తే వస్తుంది లేపోతే లేదు. ఆ మధ్య కొంతకాలం వీళ్లకి హైదరాబాద్ న్యూస్ పేపర్లలో, ఎడ్వర్‌టైజింగ్ ఏజెన్సీలో కటింగ్ పేస్టింగ్ పన్లు దొరికేవి. కంప్యూటర్లొచ్చిపడ్డాక అదీ బందయింది. "నేను బొమ్మలే గీసి బతుకుతాను" అని ఎవడన్నా భీష్మిస్తే మర్యాదగా బతికే సందులేదు. ఆర్టిస్టు అల్లంత దూరంలో కనిపించగానే దోస్తులంతా గోడలు దూకి పారిపోడం - డబ్బులు అడుగుతాడని భయం. దశాబ్దాలుగా ఇదే కథ.

ఐదేళ్ళ క్రితం చిన్న మార్పు. జీ టీవీ వాళ్ళు సికింద్రాబాద్‌లో 'జికా' పెట్టారు. కార్టూన్ ఫిలిం తయారు చేసే టెక్నిక్ నేర్పడానికి రష్యానుండి యానిమేటర్లను రప్పించారు. చాలమంది స్టూడెంట్స్ ఫీజులు కట్టి చేరారు. అక్కడ చాలా శాస్త్రీయంగా శిక్షణ ఇచ్చారు. మంచి వాతావరణం కూడా ఉంది. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉన్న కొంత మంది మంచి యానిమేటర్లను ఈ 'జికా'యే తయారుచేసింది. అప్పుడు హార్ట్ ఎన్‌టర్‌టైన్ మెంట్ పేరిట అన్నపూర్ణ స్టూడియోవారు, ఆర్టిస్టు ఉత్తమ్‌తో స్టూడియో పెట్టారు. కానీ అది దేశంలో పత్రికలకు కార్టూన్ ఫీచర్స్ పంపే సిండికేట్‌గానే ఉందికానీ, యానిమేషన్ కదల్లేదు. అప్పుడు నేను ఒంటరి ఒంటెలాగా యానిమేషన్ కాయితాలు ఖరాబు చేస్తూ వాటికి కంప్యూటర్‌లో (డబ్బులు తీసుకోకుండా) రంగులేసే అమాయక చక్రవర్తి కోసం గాలిస్తున్నా. చివరికి దొరికాడు. డాక్టర్ నీరజ్‌రాజ్. యూరప్‌లో, అమెరికాలో ఈ బొమ్మల్ని ఎలా కదిలిస్తారో పుస్తకాల్లో చదవడమే తప్ప ప్రత్యక్షంగా చూడకుండానే తోచినట్టు చేశాం. మా స్టూడియో పక్కనే జె.ఎన్.టి.యు ఆర్ట్స్ కాలేజి. క్లాసులు ఎగ్గొట్టి జులాయిగా తిరిగే బాల కళాకారులంతా కాలక్షేపం కమ్ క్యూరియాసిటీ పథకం కింద మా దగ్గరకొచ్చి కదిలే బొమ్మల్ని చూసేవాళ్ళు. అలా చూసి పనిచేసిన వెర్రి వాళ్లలో చాలామంది ఇపుడున్న స్టూడియోల్లో యానిమేటర్లుగా చెల్లుబడి అవుతున్నారు.



## ఎవరెవరు ఏమేం చేస్తున్నారు?

హైదరాబాద్‌లో అన్ని స్టూడియోలూ అనేక ప్రాజెక్టులు చేస్తున్నాయి. అందరి లక్ష్యం ఒక్కటే అమెరికాకి 'సపోర్ట్ వర్క్'. అంటే అక్కడ తయారయ్యే వేలకు వేల కార్టూన్ ఫిలిం ఎపిసోడ్స్‌ని ఇక్కడ పూర్తి చేయాలి. ఉదాహరణకి మీరు కార్టూన్ నెట్‌వర్క్, నిక్‌లోడియన్ ఛానల్స్‌లో ప్రతిరోజూ డజన్ల కొద్దీ సీరియల్స్ చూస్తారు. వాటిలో ఒక ఎపిసోడ్‌లోని పాత్రల బొమ్మలూ, మొదటి రెండు మూడు నిముషాల యానిమేషన్ ఫిలింను అమెరికన్ స్టూడియో ఇక్కడికి ఇస్తుంది. ఆ బొమ్మల్ని యధాతథంగా కాపీ చేసి, అందులోని డైలాగ్, మ్యూజిక్, సౌండ్ ఎఫెక్ట్స్‌కి అనుగుణంగా ఆ పాత్రలు కదలడం పరిగెత్తడం, నవ్వడం, ఏడవడం - ఒకటేంటి? అన్నిటినీ చేసి ఇరవైమూడో, ఏడో నిముషాలు పూర్తిచేసి ఇవ్వాలి. ఇలా సపోర్ట్ వర్క్ చేయడమనేది ఇండియాలో ఇంకా అలవాటు కాలేదు. చైనా, ఫిలిప్పైన్స్, థాయ్‌లాండ్‌లాంటి దేశాల్లో చాలా కాలంగా ఇది జరుగుతోంది. అమెరిన్ స్టూడియోలలో ఈ మొత్తం ఎపిసోడ్ యానిమేషన్ చేస్తే అక్కడి చట్టాల ప్రకారం ఆర్టిస్టులకి చాలా డబ్బు ఇవ్వాల్సుంటుంది. అదే పనిని పేద దేశాలకు అప్పగిస్తే కారుచౌక కూలీకి కళాకారులు తేరగా దొరుకుతారు. అమెరికా స్టుడియోలకి సగం రేటుకే ఎపిసోడ్ అయిపోతుంది. కనుక ఒక కంపెనీ *250* ఎపిసోడ్‌ల సీరియల్ ప్లాన్ చేస్తే అందులో ఒక యాభై చైనాకీ, పాతిక ఫిలిప్పైన్స్‌కీ, మరో పుంజీడు థాయ్‌లాండ్‌కీ పంచి పెడుతుంది. అన్ని చోట్లా ఒకే సారి యంత్రాల్లాగా ఆర్టిస్టులు చకచకా పనిచేసేస్తే అనుకున్న సమయానికి ఈ ఎపిసోడ్సు రిలీజ్ చేస్తారు. ఇలా ఒక ఎపిసోడ్ పూర్తి చేస్తే రు.*45* లక్షల నుండి కోటిరూపాయల వరకూ డబ్బిచ్చే స్టూడియోలు అమెరికాలో బోలెడున్నాయి. చైనా, ఆగ్నేయాసియా దేశాల వారికి ఇంగ్లీషు అంతంత మాత్రమే వచ్చు. ఘనత వహించిన బ్రిటిష్ బానిసలం గనక భారతీయులం ఇంగ్లీషు గడగడా మాట్లాడేస్తాం, అర్థం చేసుకుంటాం కూడా. ఈ కమ్యూనికేషన్ సౌఖ్యం కోసం అమెరికన్‌లు మనకి సపోర్ట్ వర్క్ ఇద్దామని చూస్తున్నారు. ఎలాగైనా ఈ పనిచేసి ఎపిసోడ్‌కి *45* లక్షల నుంచి కోటివరకూ సంపాయిద్దామని మన స్టూడియోల వాళ్ళు కూడా చూస్తున్నారు. ఇంతవరకూ ఈ పనితనం ఇండియాలో పెరగనందున ఆర్టిస్టుల కొరత ఉంది. సపోర్ట్ వర్క్ అనేది పెద్ద సృజనాత్మక కళ ఏమీకాదు. పైగా అందులో అనంతమైన గొడ్డు చాకిరీ కలదు. మరి డబ్బులు కూడా కలవు. గనక వెంటనే కాకపోయినా రెండేళ్లలో మన స్టూడియోలన్నీ ఈ కార్ఖానాలుగా తయారవుతాయి. వేల సంఖ్యలో పెన్సిల్ కార్మికులూ, కుంచె కూలీలు అవసర మవుతారు. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉన్న స్టూడియోలు రెండు రెట్లయినా, వీటిలోని ఆర్టిస్టుల సంఖ్య పదింతలు దాటినా మరో పాతికేళ్ళు అహోరాత్రులూ చేసినా తరగని సపోర్ట్ చాకిరీ అమెరికాలో పోగుపడి ఉంది. అందరూ ఈ కిరాయి చేసి దాలర్లు సంపాయించి స్వర్ణాంధ్రప్రదేశ్‌కు బాటలు వేయొచ్చు.

అందుకోసమే మన వాళ్లంతా చిన్న చిన్న శాంపుల్ ఫిలిమ్‌లు (డెమో-డిమాన్‌స్ట్రేషన్ ఫిలిం) తయారు చేస్తున్నారు. ఇప్పుడున్న ఏడెనిమిది స్టుడియోల్లో ఏ ఒక్క డెమోనైనా ఏ ఒక్క అమెరికన్ స్టుడియో అయినా బావుందని ఒప్పుకుని సపోర్ట్ వర్క్ ఇచ్చిన శుభవార్త ఇంతవరకూ విన్లేదు. కానీ ఏ స్టుడియో బాస్‌తో మాట్లాడినా ఫలానా కాలిఫోర్నియన్ స్టుడియోతో స్ట్రాటజిక్ ఎలయెన్స్ పెట్టుకున్నామనీ, ఇన్ని వందల ఎపిసోడ్స్ ఎసైన్‌మెంట్ వచ్చిందనీ అంటారే తప్ప ఈ ఐదు నిమిషాల అద్భుతం మేం చేశాం అని చూపించడం కష్టం. తెలుగులో యానిమేషన్ ఇంకా తప్పటడుగులేస్తున్నది గనక ఈ పరిస్థితి సహజం. ఏడాది తిరిగితే సీను మారుతుంది. లేదా చాలా సీనుంటుంది.



ఐదేళ్ల క్రితం జికా, హార్ట్, నేనూ ప్లస్ నీరజ్ యానిమేషన్ గురించి అలా ఆర్టిస్టుల్లో ఓ స్పృహ తీసుకొచ్చాం. మూడేళ్ళపాటు జికా నడిచింది. కానీ లాభసాటిగాలేదని బొంబాయిలో ఆఫీసు మారుస్తున్నా మన్నారు. జికాలోని తెలుగు ఆర్టిస్టులు దాదాపు అందరూ ఇక్కడే ఉండిపోయారు. హార్ట్‌వారు ట్రైనింగ్ కాలేజీ ప్రారంభిస్తే ఎంతోమంది ఫీజులు కట్టి చేరారు. కానీ జికాలో స్టూడెంట్స్ చేసిన కార్టూన్ ఫిలింస్ లాటివేవీ ఇక్కడ తియ్యలేదు. ఒక ఏడాది రెండేళ్ళు ఎక్కడా యానిమేషన్ అనే పేరు వినిపించకుండా డల్‌గా గడిచింది.

ఇంతలో శ్రీవెన్ అనే ఒక చిన్న కంప్యూటర్ కంపెనీ బాస్ సుబ్రహ్మణ్యం వచ్చి మా నీరజ్‌ని కలిసి ఇద్దరి కంపెనీలూ కలిపేసి పెద్ద యానిమేషన్ స్టూడియో పెడదామని ప్రపోజ్ చేశాడు. వెళ్లారు. ఐ.టి. అంటే మార్కెట్‌లో బాగా మోజున్న షేర్ ధర విపరీతంగా పెరిగి డబ్బు వానకురిసింది. వెంటనే చిన్నా చితకా ఆర్టిస్టులంతా యానిమేషన్ కళాకార్లుగా మొలకెత్తడం ప్రారంభించారు. వీళ్లకి ట్రైనింగ్ ఇవ్వడానికి ఉత్తరాది నుండి సీనియర్లు దిగొచ్చారు. రాజ్ భవన్ రోడ్‌లో అద్దాల తలుపులతో రంగుల్లో జిగేల్మనే మయసభలాటి స్టూడియో వెలిసింది. నేనొక మూడేళ్ళు తంటాలుపడి చేసిన చిన్న సి.డి. నుండి ఇంత పెద్ద స్టూడియో పుట్టిందంటే బోలెడు ముచ్చట పడిపోయా.

తర్వాత హార్ట్ నుండి బయటపడ్డ ఉత్తమ్ ఇదే వరసలో 'కలర్ చిప్స్' యానిమేషన్ స్టూడియో ప్రారంభించడం, ఆ తర్వాత పద్మాలయా స్టూడియోస్ కృష్ణగారు అదే దారిలో వెళ్లడం మళ్లీ మళ్లీ అవే డబ్బుల వానలు కురవడం ఎక్కడలేని ఆర్టిస్టులు పుట్టుకురావడం జరిగింది. స్టూడియోల్లో ఆర్టిస్టులూ, కంప్యూటర్‌ల మీద పనిచేసే వాళ్ళూ కలిసి దాదాపు వందేసి మంది పనిచేస్తున్నారు. ఆ మధ్య విజువల్ విస్టాస్ అనే బెంగుళూరు కంపెనీ వారు నరసింహన్ అనే స్టూడియో గురించి తెగ పబ్లిసిటీ ఇచ్చారు. కానీ దాని పేరిపుడు అంతగా వినిపించడం లేదు. డేటాక్వెస్ట్ అనే స్టూడియో అనేకమందిని రిక్రూట్ చేసి పనిచేయిస్తోంది. ఈ మధ్య ఓషన్‌పార్క్ అధినేతలు 'వండర్ టూన్స్' అనే స్టూడియో పెట్టి యాభై మందికి పైగా ఆర్టిస్టులను మరో ఇరవై మంది కంప్యూటర్ పిల్లల్నీ తీసుకుని మొదటి "డెమో" తయారు చేశారు. రెండోది ఇంకా తయారవుతోంది.

ఇలా భారీ రిక్రూట్‌మెంట్ కాకుండా ఓ డజను మంది చిచ్చర పిడుగులతో "ఆల్ కెమిస్ట్" అనే చిన్న స్టూడియో పుట్టుకొచ్చింది. 'యూరోపియన్ మార్కెట్‌కు కార్టూన్ ఫిలింస్ పంపాలనేది మా టార్గెట్' అని దీని బాస్ వాసు అంటారు. "ఇటిఎమ్' అనే స్టూడియో పేరు కూడా వినిపించింది గానీ తర్వాత కనిపించలేదుమరి.

ఇప్పటికి పది స్టూడియోల పేర్లు విన్నారు. అందులో రెండు మూడు లేనట్టే. కొత్తది నా స్టూడియో "మేజిక్ లాంప్". పది, పదిహేనేళ్లుగా నా దగ్గరకు వచ్చిపోతూ, కార్టూన్ వేస్తూ, కంప్యూటర్‌లను కూడా టకటకలాడించే కుర్రకారులో కొందరు ఈ మధ్యే అమెరికా వెళ్లారు. వాళ్ళ ప్రోత్సాహం (అంటే ఫోన్లు చేసి పీక్కు తినడం) వల్ల ఈ కొత్త స్టూడియో పుట్టింది. వీళ్లలో శ్రీనివాస్ భూక్యా ముఖ్యుడు. ఆర్నెల్ల క్రితం కొలరాడో స్ప్రింగ్స్ వెళ్ళి ఎ.ఆర్.జి. యనిమేషన్స్ అనే స్టూడియోలో యానిమేటెడ్, మ్యూజిక్ గ్రీటింగ్ కార్డ్స్ అందంగా తయారు చేసి అమెరికన్‌లని ఆశ్చర్యపరిచాడు. న్యూయార్క్‌లోని అమెరికన్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ (ప్రపంచంలోకెల్లా ప్రతిష్టాత్మకమైన కార్టూన్



సంఘం) వారి దగ్గర కెళ్ళి పేరు మోసిన కార్టూనిస్టులకు తన కార్టూన్‌లు చూపిస్తే వాళ్లు గొప్పగా పొగుడుతూ రివ్యూలు రాశారు. న్యూజెర్సీలో కూడా తన వెబ్ డిజైనింగ్ పురివిప్పి సాఫ్ట్‌వేర్ కంపెనీ వాళ్ల దగ్గర్నుంచి చప్పట్లు సంపాయించాడు. అమెరికన్ గాగ్ రైటింగ్ కింగ్ (కార్టూన్‌లకు ఐడియాలనూ, డైలాగులనీ రాసే వాళ్ళని గాగ్‌రైటర్స్ అంటారు) అని పిలవబడే పెద్దమనిషి శ్రీనివాస్‌ని పిలిచి వెయ్యి ఐడియాల కట్ట చేతికిచ్చి వీటికి నీ బొమ్మలు వేస్తే బావుంటుందని ఇచ్చాడు. ఇంతకంటే బొమ్మలేసే వాడికి ఇంకేంకావాలి? మూడేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చి కొంత కాలం ఉండి వెళ్ళిన స్టార్ టూన్స్ యానిమేటర్ మైక్ ఓవెన్స్, మరికొంతమంది మిత్రులు ఈ కంపెనీతో సహకరించడానికి ఉత్సాహం చూపించారు. అమెరికాలో అందరూ మహానుభావులేం కాదనీ, మనకంటే

# కలిసొచ్చిన కాలానికి కలిలొచ్చిన బొమ్మల కథ








రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉంది కాబట్టి కేంద్రప్రభుత్వం ఉదారంగా సహాయపడి ఆదుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని వాజ్‌పాయ్‌ని కలిశారు.

"ఎంత సేపూ కేంద్రాన్ని డబ్బులు ఇవ్వమని అడగటమే తప్ప మాకు ఎన్ని సమస్యలు ఉన్నాయో మీరు చూడట్లేదు. - తీవ్రవాదంతో తల్లడిల్లుతున్నారు కాబట్టి ప్రత్యేక ప్యాకేజీ ద్వారా భారీ సాయం చెయ్యమని కాశ్మీరు వాళ్ళు అడుగుతున్నారు. - అభివృద్ధిలో వెనుక పడ్డారు కాబట్టి పెట్టుబడులు పెట్టి సాయపడాలని ఈశాన్య రాష్ట్రాలవాళ్ళు కోరుతున్నారు. - బెంగాల్‌కి నిధులిచ్చి సాయం చెయ్యమని మమతాబెనర్జీ అడుగుతున్నారు. - తుఫాను వచ్చింది కాబట్టి భారీ మొత్తం ప్రకటించి తోడ్పడాలని ఒరిస్సా వాళ్ళు అంటారు. - తీవ్రవాదులతో పోరాడారు కాబట్టి రుణాలన్నీ మాఫీ చేసి తాజా రుణాలివ్వాలని పంజాబ్ వాళ్ళు బతిమాలుతున్నారు. - తాజాగా భూకంపం సమస్య వచ్చింది కాబట్టి పెద్ద మనసు చేసుకుని కాపాడాలని గుజరాత్ వాళ్ళు అడుగుతున్నారు. - తమిళనాడు, కర్నాటక డిమాండ్లు సరేసరి. ఇంక మీకు ఎలా డబ్బివ్వమంటారు చెప్పండి?" వాజ్‌పాయ్ తన సమస్యలన్నీ ఏకరువుపెట్టారు.

"నిజమే ఇంత ఖర్చు మధ్య మా రాష్ట్రానికి సాయం చెయ్యాలంటే మీకు కష్టమే" చంద్రబాబు నిట్టూర్చారు.

"ఖర్మ, గాడిదగుడ్డు, నేను ఎవ్వళ్ళకీ రూపాయి ఇవ్వట్లేదు. ఇంక మీకు ఎలా ఇవ్వమంటారు చెప్పండి?"

"!!!!"

**ఈ జోకులన్నీ సరదాకి. కేవలం నవ్వుకోడానికి. వీళ్ళ మీదో వాళ్ళ మీదో జోకేస్తే జనం నవ్వరు సరికదా, నవ్విపోతారు. అదే జోకుకి జయలలితనో, చంద్రబాబునో, వాజ్‌పాయ్‌నో, అద్వానీనో జతకలిపితే చక్కగా పేలుతుంది. కనుక మనసారా నవ్వుకోడానికి తప్ప ఎవరి మనసూనొప్పించడం మా ఉద్దేశంకాదు. సో ఇట్సాల్ జస్ట్ ఫర్ ఫన్. డోన్ట్ మిస్టేక్ అజ్.....**

**- ఎడిటర్**

## విజయవిహారం

12




శివసేన నాయకుడు ఒకాయనకి వృద్ధాప్యం ముదిరిపోయింది. తన మరణించే సమయం ఆసన్నమైందని ఆయన అర్థం చేసుకున్నారు. తాను జీవితాంతం చేసిన పాకిస్తాన్ వ్యతిరేక ప్రచారం, క్రికెట్ పిచ్‌ల్ని తవ్వి పాడుచేయడం, పాకిస్తాన్ గాయకులని పాడనివ్వకపోవడం మొదలైన పనుల గురించి పరిపరివిధాలుగా ఆయన ఆలోచించారు.

తనకు పాకిస్తాన్ పౌరసత్వం ఇప్పించాలని ఆయన పాకిస్తాన్ ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నారు.

ఈ వార్త భారతదేశ మంతటా సంచలనం సృష్టించింది. పాకిస్తాన్ పత్రికలు సైతం దీన్ని పతాక శీర్షికలతో ప్రచురించాయి. శివసేన నాయకుడిలో పశ్చాత్తాపం, పరివర్తన కలిగిందని పాకిస్తాన్ ప్రజలు సంతోషంతో వేడుకలు సంబరాలు జరుపుకున్నారు.

విషయం తెలిసి బాల్‌థాకరే మండిపడ్డారు. "శివసేన నాయకుడివై వుండి ఇలా మరణశయ్యమీద ఉండి పాకిస్తాన్ పౌరసత్వం అడిగేందుకు నీకు సిగ్గులేదా?" అని బాల్‌థాకరే ఆ నాయకుడి ఇంటికి వెళ్ళి గద్దించారు.

"ఒక్క పాకిస్తానీ చచ్చినట్టు అవుతుంది కదా అని ఈ పని చేస్తున్నాను" అని ఆ నాయకుడు తన ఆలోచన చెప్పేసరికి బాల్‌థాకరే ఎంతగానో ఆనందించారు.



స్కూల్ దాటని చదువు, పాతిక దాటని వయస
వ్యవసాయానికి సంబంధించి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సృష్టించి పేటెంట్ పొందబోతు

# విశ్వాస్ మోరే

ఆయన ఏడాది క్రితందాకా ఓ మామూలు రైతు కొడుకే. పేరు విశ్వాస్ మోరె. వయసు 25 ఏళ్లు. మహారాష్ట్రలోని ఓ మారుమూల గ్రామం ఆయనది. చదువు స్కూలు స్థాయి కూడా దాటలేదు. కంప్యూటర్‌లో ఎలాంటి శిక్షణ లేదు. కాని భూమి, పంట గురించి రైతులు ఎదుర్కొనే అన్ని సమస్యలకి పరిష్కారాలు చూపే ఓ సాఫ్ట్‌వేర్ స్రష్టికర్తగా ప్రపంచం ఆయనను గుర్తించబోతోంది. సంచలనం స్రుష్టిస్తున్న విశ్వాస్ సాఫ్ట్‌వేర్ పేరు అగ్రోసాఫ్ట్. ఇది రైతులకు ఓ రకంగా బాలశిక్ష లాంటిది. నీటితడి పెట్టడం దగ్గర్నించి ఎరువులు ఏ పాళ్లలో ఎంత కలపాలి, ఎన్నిసార్లు స్ప్రే చేయాలన్న పనులన్నీ ఆటోమేటిగ్గా ఈ సాఫ్ట్‌వేర్ సాయంతో జరిగిపోతాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఏ పని, ఎలా చేయాలో స్పష్టంగా తెలిసిన ఓ నమ్మకమైన సహాయకుడు దగ్గరున్నట్టే అన్నమాట.

ఆశ్చర్యకరమైన విషయమేమంటే స్కూలు చదువు కూడా పూర్తి చేయని విశ్వాస్... ఇప్పుడు తన సాఫ్ట్‌వేర్‌కి త్వరలో పేటెంట్ కూడా పొందబోతున్నాడు. కంప్యూటర్‌లో ఎలాంటి ప్రాథమిక శిక్షణ కూడా లేకుండా ఓ సాఫ్ట్‌వేర్‌కి పేటెంట్ సాధించే స్థాయికి చేరడం చూసి మేధావులే బిత్తరపోతున్నారు.

ఈ సాఫ్ట్‌వేర్ రైతులకు ఎంత ఉపయోగకరమంటే రైతు చేయాల్సిన పనులన్నీ ఆటోమేటిగ్గా జరిగిపోతాయి. ఉదాహరణకి నీటి పంపుకి ఈ సాఫ్ట్‌వేర్ వున్న కంప్యూటర్‌ని అనుసంధానం చేస్తే గ్రౌండ్ లెవెల్‌లోని వాటర్ ట్యాంక్ నిండగానే ఇంజన్ ఆగిపోతుంది. అలాగే డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటకి చేరే నీటిలో ఎరువుల మిశ్రమాన్ని ఎంత కలపాలో నిర్దేశిస్తుంది. అంటే నీరు, ఎరువులు మొదలైన అన్ని అంశాలకు సంబంధించిన వివరాలు కంప్యూటర్‌కి మొదలే ఫీడ్ చేసి వుండటంతో ఆటోమేటిగ్గా ఈ పనులు జరిగిపోతాయి. అంతే కాక వివిధ రకాల వ్యవసాయ పనిముట్లు, ధాన్యం ధరలు, ఉష్ణోగ్రత, తేమ వివరాలు మొదలైన వివరాలన్నీ ఈ సాఫ్ట్‌వేర్ సాయంతో రైతు తేలిగ్గా తెలుసుకోవచ్చు.

ఇప్పుడు విశ్వాస్ సాఫ్ట్‌వేర్ కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో పా పంజాబ్ కృషి విద్యాపీఠ్ అనే సంస్థ, బెంగుళూరుకు చెందిన అడ్వా ఇండియా తదితర సంస్థలు ఆసక్తి చూపడం విశేషం. విశ్వాస్ ఇదంతా త తానే పట్టుదలతో నేర్చుకుని చేసి చూపించాడు. తాను కాలేజీ గడప వెళ్ళలేక పోయినా స్కూల్ చదువే తనలో కొత్త ఆలోచనల్ని రేపి అంటాడు.

1992లో పి.సి.ఎల్. కంపెనీ తన కంప్యూటర్లని ప్రమోట్ చేసేందు ఓ స్కీమ్ పెట్టినప్పుడు విశ్వాస్ సరదాగా ఒకటి కొన్నాడు. కానీ కంప్యూట సంబంధించి ఎక్కడా ట్రైనింగ్ పొందలేదు. మొదట్లో కొన్ని అడ్డం నిలు లైన్లతో స్ప్రెడ్ షీట్లు తయారు చేసి పొలం లెక్కలు, పంట వివరాలు, ఎరు వివరాలు మొదలైనవి చేరుస్తూ పోయాడు. ఆ ఆసక్తి క్రమంగా పె వ్యవసాయంలో కంప్యూటర్‌ని ఎంత లాభదాయకంగా వాడుకోవ తెలుసుకున్నాడు. దేశంలో ఇప్పటిదాకా ఏ యూనివర్శిటీ కూడా క కంప్యూటరైజేషన్‌పై ఎలాంటి కోర్సు ఆఫర్ చేయడం లేదు. ఇప్పుడు విశ అగ్రోసాఫ్ట్ యూనివర్శిటీలకు సైతం ఇలాంటి కొత్త ఆలోచన కలిగిస్తు దీనికి పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నాడు విశ్వాస్. ఇది వ వ్యవసాయానికి సంబంధించి ఓ సాఫ్ట్‌వేర్‌కి పేటెంట్ పొందిన మొదటి వ విశ్వాసే అవుతాడు. ఎకడమిక్ డిగ్రీలకీ ఆసక్తికీ పొంతన లేదని నిరూపించా ఇరవై ఐదేళ్ళ యువ రైతు విశ్వాస్.



## మీదే

సి.ఎం. చంద్రబాబునాయుడు ఓసారి వైయస్.రాజశేఖరరెడ్డి కలలోకి వచ్చారు.

వైయస్. ఒక్కరూ తన ఇంట్లో కూర్చుని పేపర్ చూస్తుండగా సి.ఎం. స్వయంగా ఒక్కరూ కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చారు. వై.యస్.కి కొత్త మిలీనియం శుభాకాంక్షలు చెప్పారు. తాను వైయస్ అభిమానినని వైయస్ ఉపన్యాసాన్ని చెవికోసుకుని వింటానని చెప్పారు. వైయస్ నుంచి తాను నేర్చుకోవలసింది ఎంతో ఉందని భావిస్తానని నమ్మబలికారు.

వైయస్‌ని స్వయంగా కారెక్కించుకుని తీసుకునివెళ్ళారు. తెలుగుదేశం లెజిస్లేచర్ పార్టీ సమావేశం పెట్టి వైయస్ గుణగణాల గురించి, నాయకత్వ ప్రతిభ గురించి చంద్రబాబు అనర్గళంగా ఉపన్యసించారు. తాను వైయస్‌ను నాయకుడిగా అంగీకరిస్తున్నానని ప్రకటించారు. మొత్తం హాలంతా చప్పట్లతో దద్దరిల్లిపోయింది.

అనంతరం తన మంత్రి వర్గ సభ్యులందరితో, మేళతాళాలతో, బ్రహ్మాండమైన స్వాగత సత్కారాలతో, ఊరేగింపుగా వైయస్‌ని సి.ఎం. తన ఛాంబర్‌కి తీసుకెళ్ళారు. స్వయంగా తన కుర్చీ వద్దకి తోడ్కొని వెళ్లారు.

వైయస్‌కి మాట పెగల్లేదు. ఆయన ఆశ్చర్యంతో చంద్రబాబుని "ఇప్పుడేం చేస్తారు మీరు నన్ను సి.ఎం. గద్దె మీద కూర్చోమంటారా ఏమిటి?" అని తత్తరపాటుతో ప్రశ్నించారు.

చంద్రబాబు చిరునవ్వు నవ్వి "అది తేల్చాల్సింది మీరు, ఇది మీ కల" అన్నారు.





## అభినందన

వీరప్పన్‌ని పట్టుకునే ప్రయత్నాలు ఎలా సాగుతున్నాయో పర్యవేక్షించేందుకు ఎస్.ఎం.కృష్ణ, కరుణానిధి స్వయంగా సత్యమంగళం అడవులకి బయల్దేరారు.

అడవిలో కొంచెం లోపలికి వెళ్ళగానే వాళ్ళిద్దరూ ఒక విచిత్రమైన దృశ్యం చూశారు.

ఒక ఎస్టీఎఫ్ జవాన్ నేలమీద చెవి ఆనించి శబ్దాల్ని వింటున్నాడు. కరుణానిధి, ఎస్.ఎం.కృష్ణ ఆశ్చర్యపడి అతని దగ్గిరకి వెళ్ళారు.

అతను నేలకి చెవి ఆనించే, చిన్నగా చెప్పడం మొదలుపెట్టాడు: "వీరప్పన్! వీరప్పన్ స్వయంగా తుపాకీ తీసుకుని ముందు నడుస్తున్నాడు. యూనిఫారం వేసుకున్నాడు అతని వెంట మొత్తం గ్యాంగ్ సభ్యులంతా నడుస్తున్నారు. ఎడమ పక్కన సేతుక్కుళి గోవిందన్ నడుస్తున్నాడు. మారన్ కొద్ది వెనక వున్నాడు. వాళ్ళదగ్గిర తుపాకు లున్నాయి. ఆహారం, మందులు కావలసినన్ని ఉన్నాయి..."

కరుణానిధి, ఎస్.ఎం.కృష్ణ ఆశ్చర్యంతో తలమునకలైపోయారు. మొదట ఎస్.ఎం.కృష్ణ గొంతు పెగుల్చుకుని "ఇదంతా.... ఇదంతా కేవలం నువ్వు భూమికి చెవి ఆనించి తెలుసుకున్నావా! గ్రేట్, నేను నిజంగా ఇంత అద్భుతం చూళ్ళేదు. నీ సామర్థ్యానికి నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అన్నారు.

అతను మాటలు కూడదీసుకుంటూ, తలపక్కకి కదిపి రక్తాన్ని తుడుచుకుంటూ చెప్పాడు, "వచ్చి తుపాకీలాక్కుని చిత్తుగా తన్ని పడేసి పోయారు".





## పాపం

సతీష్ కుమార్ సిన్హా చచ్చి నరకానికి వెళ్ళాడు. అక్కడ యమకింకరులు ప్రజల్ని సలసలకాగే నూనెలో వేయించడం, తోలువలిచి చిత్రహింసలు పెట్టడం చూసి - పరమానందంతో "ఇది స్వర్గం, ఆహా స్వర్గం" అని గంతులు వేయడం మొదలుపెట్టాడు.

చిత్రగుప్తుడు "పాపం, బీహార్నించి వచ్చావా?" అని సానుభూతి చూపించాడు.



## మంచిపనే

దావూద్ ఇబ్రహీం అనుచరు డొకాయన చచ్చి స్వర్గానికి వెళ్ళాడు.

దేవుడు ఆవాలకం చూసి ఆశ్చర్యపడి "చూడబోతే నువ్వ ఏ మంచిపనీ చేసినట్టు లేవు ఇక్కడికి ఎలా వచ్చావు?" అని అడిగాడు.

ఆ పెద్దమనిషి సిగ్గుపడి "నేను పరమ క్రూరుడు, కిరాతకుడు, పాపి అయిన దావూద్ ఇబ్రహీం స్మగ్లింగ్ సొత్తుని బొంబాయి పోలీసులకి పట్టి ఇచ్చాను" అని చెప్పాడు.

దేవుడు తృప్తిగా తలాడించి "మంచిపనే, కానీ ఎప్పుడు చేశావు ఈ పని?" అని అడిగాడు.

ఆ పెద్ద మనిషి చిన్నగా "ఇందాకే.... పది నిముషాల క్రితం" అని గొణిగాడు.



## పాతికేళ్లుగా నవ్వులు పంచుతున్న ఏకైక లేడీ కార్టూనిస్ట్

# రాగతి పండరి



నవ్వటం తేలిక. నవ్వించటం చాలా కష్టం. కామెడీ అనేది చాలా సీరియస్ వ్యవహారం అనేది అందుకే. రక్తంలో 'హ్యూమర్' వున్నవారే తమ చుట్టూ నవ్వుల పువ్వుల్ని వెలిగిస్తూ తామూ వెలుగుతారు. అటువంటి వారిలో ఒకరు కుమారి రాగతి పండరి. ఒకటి కాదు రెండు కాదు పాతికేళ్లుగా తెలుగు పాఠకుల పెదవుల మీద చిరునవ్వులు విరబూయిస్తున్నారామె. ఆమె పేరు తెలీని, ఆమె కార్టూన్ చూడని తెలుగు పాఠకులు ఎవరూ వుండరు.

పండరికి చదువుకంటే బొమ్మలంటేనే ఇష్టం. పత్రికలూ, పుస్తకాలు తిరగేస్తూ వుండేది. వాటిల్లో అన్నింటికంటే కార్టూన్లు పండరిని ఎక్కువ ఆకర్షించేవి. కొన్నాళ్లకి 'నేను కూడా కార్టూన్‌లు ఎందుకు గీయకూడదు?' అని పట్టుకుందామెకి. కార్టూన్ గీయటమంటే జోకులు కాదు. జోకుకి వ్యంగ్యంగా దృశ్యరూపం ఇవ్వాలి. పత్రికల్లో ప్రచురించటానికి వీలుగా నిర్ణీత కొలతల్లో గీయాలి. కార్టూన్లకి సంబంధించి ఇటువంటి కనీస అవగాహన కూడా లేకుండానే పండరి ఒక ప్రయత్నం చేసింది. ఆ తొలి కార్టూన్ 1974లో 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో అచ్చయింది. అప్పుడు పండరి వయసు నిండా తొమ్మిదేళ్లు కూడా లేదు.

పండరికి ఒక గురువూ, ఒక శిక్షణా ఏమీ లేవు. స్వయంకృషితో, తెలుగు కార్టూన్ రంగంలో మహిళలు లేని లోటు తీర్చారు. తెలుగులో ఏకైక మహిళా కార్టూనిస్ట్‌గా వెలుగుతున్న పండరి ఇప్పటికి దాదాపు పన్నెండు వేలకు పైగా కార్టూన్‌లను గీశారు. ప్రసిద్ధ కార్టూనిస్ట్ జయదేవ్‌కి తనను ఏకలవ్య శిష్యురాలిగా చెప్పుకుంటారామె. తొలినాళ్లలో ఆయన సలహాలను, సూచనలను అందుకుని తనదైన ఒక గీతను సృష్టించుకున్నారు.

సమాజంలో కనిపించే అన్ని అంశాల మీదా చురకలు వేశారు. 'రాజకీయ చెదరంగం', 'శ్రీమతి', 'ఇద్దరమ్మాయిలు', 'కాలేజీగర్ల్', 'మగాడు' లాంటి కార్టూన్ స్ట్రిప్స్‌లతో సంవత్సరాల తరబడి పాఠకులను నవ్వించారు. రాగతిపండరి మొదట్లో తాను రాజకీయ కార్టూన్‌లు గీయలేనేమోనని భయపడ్డారు. కానీ ఆంధ్రభూమిలో పదేళ్ల పాటు చిన్నపిల్లలకు కూడా అర్థమయ్యేలా 'రాజకీయ చెదరంగం' నడిపారు.




వ్యక్తిగత వివరాలకి వస్తే - రాగతి పండరిది చాలా చిన్న ప్రపంచం. విశాఖపట్నం మెయిన్ రోడ్డులో వుండే ఇల్లే ఆమెలోకం. ఇల్లు దాటకుండా ప్రపంచాన్ని జయించిన పండరి, తొమ్మిది నెలల పసిగుడ్డుగా వున్నప్పుడే పోలియోబారిన పడింది. ఆ దురదృష్టాన్ని గురించే బాధపడుతూ కుంగిపో లేదామె. మనిషికి సుఖదుఃఖాలు సహజం అనే తత్వం ఆమెది. "ఉన్న విచారాన్ని మరిచిపోయి నవ్వుతూ గడపటమే కాక, నా చుట్టూ నవ్వుల పువ్వులు పంచటమే నా ఆశయం" అంటారు రాగతిపండరి.

పండరి ఉత్తమ కార్టూనిస్ట్‌గా ఎదగటంలో కుటుంబసభ్యుల ప్రోత్సాహం చాలా ముఖ్యమైనది. అక్క రాగతి రమాదేవి కథా రచయిత్రి. అమ్మ, అన్న, వదినలు కూడా సాహిత్యాభిలాష వున్న వారే. దీంతో ఆమె ప్రపంచం విస్తృతమైంది. వారి ఆదరాభిమానాల తోనే ఆమె నిరంతరాయంగా కార్ట్యూటన్‌లు గీచి, ఆంధ్రదేశాన్ని నవ్వించగలిగింది.

"ఇప్పుడు టీవీ వచ్చేసింది. వార, మాస పత్రికలు తగ్గిపోయాయి. ఉన్న పత్రికలు కూడా కార్టూన్‌ల స్థానంలో సినిమా బిట్‌లు పెడుతున్నాయి. ఆ రకంగా కార్టూన్‌లకు ప్రాధాన్యం తగ్గింది" అన్నారామె. ఈ మధ్య ఎ.పి. పొలిటికల్ కార్టూనిస్ట్‌ల ఫోరం




జరిపిన పోటీలలో బహుమతి గెలుచుకోవటం - పాతికేళ్ల తర్వాత కూడా పదును తగ్గలేదనడానికి నిదర్శనం. రాగతి పండరిని అనేక సాంస్కృతిక సంస్థలు సన్మానించాయి. విశాలాంధ్ర వారు ఈ మధ్యే రాగతి పండరి కార్టూన్‌లను ఒక పుస్తకంగా వేశారు.

"ఇతరులకి ఆనందాన్నివ్వటం, నవ్వించ గలగటం ఒక వరం" అని భావించే పండరి అదే పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగుతున్నారు.

*<u>కొసమెరుపు:</u> రాగతిపండరి మేనకోడలు పదమూడేళ్ల శ్రీ శాంతి కార్టూన్‌లు గీయటం మొదలుపెట్టింది.*

## కంచ ఐలయ్య 'నేను హిందువునెట్లయిత?' పుస్తకంపై ప్రొ. కేశవరావు జాదవ్ స్పందన



# కులనిర్మూలనా పోరాటానికి ద్వేషం ప్రాతిపదిక కాదు

(మొదటి భాగం)

ఈ పుస్తకం ముందు మాటలో, ఐలయ్య అగ్రవర్ణాలను ఉద్దేశించి "మీ సొంత ప్రయోజనార్థం, ఈ గొప్పదేశం ప్రయోజనార్థం మీరిప్పుడు మేం చెప్పేది వినడం, మేం రాసేది చదవడం నేర్చుకోవాలి. ఎవరైతే కొత్త ప్రశ్నలు వినేందుకు, కొత్త సమాధానాలు నేర్చుకునేందుకు నిరాకరిస్తారో, వారు నశిస్తారే తప్ప బాగుపడరు" అన్నారు. నేను దీనితో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. అలాంటి చర్చకు తగిన వాతావరణాన్ని ఎలా సృష్టించ గలుగుతామనేదే ప్రశ్న.

అయితే నేను ముందుగా ఐలయ్య వాడిన హిందువులు, శూద్రులు, అతి శూద్రులు, నయా క్షత్రియులు, రాజపుత్రులు, భూమిహార్లు, క్షత్రియులు వంటి నిర్దిష్ట పదాల గురించి ప్రస్తావిస్తాను. ఆయన హరిజనులు, నిమ్న కులాలు వంటి పరిభాష పట్ల అయిష్టం వ్యక్తం చేసి, దళిత బహుజనులు అనే వ్యక్తీకరణను ఎంచుకున్నారు. పీడిత కులాలను గురించి వివరించేటప్పుడు నిర్దిష్ట పదాల వినియోగంలో మహాత్మ ఫూలే, డాక్టర్ అంబేద్కర్ ఎదుర్కొన్న సమస్యల గురించి ఆయన వివరించారు. అగ్రవర్ణేతరులను, షెడ్యూల్డు కులాలు కాని వారిని శూద్రులుగా, షెడ్యూల్డు కులాల వారిని అతిశూద్రులుగా వ్యవహరించడానికి ప్రాధాన్యమిచ్చారు. డాక్టర్ అంబేద్కర్ ఒ.బి.సి.లనూ షెడ్యూల్డుకులాలను పేర్కొనడానికి "డిప్రెస్డ్ కులాలు" (అణగారిన కులాలు) అనే పదాన్ని ఎంచుకున్నారు. కాని ఆ తర్వాతఆయన అస్పృశ్య కులాల గురించి వివరించడానికి షెడ్యూల్డు కులాలు అనే మాటను ఉపయోగించడం ప్రారంభించారు. కానీ ఒ.బి.సి.లను గురించి వివరించడానికి ఆయన ఎలాంటి నూతన అభివ్యక్తీకరణను రూపొందించలేదు. మహాత్మా గాంధీ హరిజన అనే పదాన్ని వినియోగించారు. అది ఒక సామాజిక కార్యకర్త షెడ్యూల్డు కులాలను వివరించడానికి నిర్ధారించిన పదం. ఇప్పుడు మన వర్తమాన కాలంలో షెడ్యూల్డు కులాలకు చెందిన ఒక రచయితలబృందం దళిత్ పాంథర్స్ ఉద్యమాన్ని ప్రారంభించి, షెడ్యూల్డు కులాన్ని వివరించడానికి దళిత్ అనే పదాన్ని వాడటం ప్రారంభించారు. ఎస్.సి.లు, బి.సి.లు, ఎస్.టి.లను గురించి వివరించడానికి కాన్షీరాం బహుజన్ అనే పదాన్ని ఖాయం చేశారు. ఐలయ్య షెడ్యూల్డు కులాలను, వెనుకబడిన కులాలను గురించి చెప్పడానికి దళిత బహుజనులనే మాటను ఎంచుకున్నారు. అయితే బహుజనుల నుండి షెడ్యూల్డు తెగలను ఎందుకు తొలగించారో ఆయన వివరించలేదు.



బుద్ధుడు



మహావీరుడు



గురు నానక్



శ్రీ బసవ



కబీర్



తుకారాం



వేమన

హిందూ అనే పదం ఏ శాస్త్రంలోనూ లేదు. వాస్తవానికి, ఆ పదాన్ని ఖాయం చేసిన వారు గ్రీకులు, బహుశా వాయువ్య భారతంలో వారు దాటి వచ్చిన మహానది సింధు పేరును వారు సరిగా పలకలేకపోయి వుండాలి. వారు దాన్ని ఇండస్ అన్నారు. ఆ నది పొడవున నివసించిన వారు భారతీయులు. ఆ తర్వాత ఆ పదాన్ని అరబ్బులు అరువు తీసుకుని భారతీయులకు అరబిక్ పాఠాంతరంగా హిందూ అనే పదాన్ని సృష్టించారు. ఇంకా ఆ తర్వాత బ్రిటిష్ వాళ్ళు, ఇతర యూరోపియన్లు తూర్పున పఠానిస్తాన్ నుండి అస్సాం వరకు, దక్షిణాన కన్యాకుమారి వరకు విస్తారమైన ప్రదేశంలో పరివ్యాప్తమై వున్న ప్రజల గురించి వివరించడానికి ఈ పదాల్ని అంది పుచ్చుకున్నారు. ఆ విధంగా ఇక్కడి దేశీయ ప్రజలకు శత్రువులైన వారు, ఆక్రమణదారులు భారతీయ, భారత్, హిందూ, హింద్ అనే పదాలను మొట్ట మొదటగా ఖాయ పరచడాన్ని మనం గమనించవచ్చు. ఇదే కోవకు చెందిన టర్క్‌లు హిందుస్తాన్ అనే పదాన్ని ఖాయం చేశారు. ఆధునిక యూరోపియన్ వలసవాదులు, ఇదే ప్రజలకు శత్రువులైనవారు, ఇక్కడి జనాభాలోని నిర్దిష్ట విభాగాలను వివరించడానికి ఆర్య, ద్రావిడ అనే పరిభాషను ఖాయపరచారు. ఈ విధమైన పరిభాష, వ్యక్తీకరణ సరైనదని రుజువు చేయడానికి పౌరాణికమైన ప్రస్తావనలుగానీ, చారిత్రక పురాతత్వ శాస్త్ర రుజువులుగానీ లేవు. ఈ ప్రాంతమంతా ఒకే దేశం కాదని, ఈ దేశ ప్రజానీకమంతా ఒకే ప్రజ కాదనే అర్థం ధ్వనించేలా బ్రిటిష్‌వాళ్ళు భారత ఉపఖండం అనే మరో అర్థరహితమైన పదబంధాన్ని ఆవిష్కరించారు. వాళ్ళ ఈ దేశాన్ని ముక్కలు చేయాలనుకున్నారనేది స్పష్టమే.



మహాత్మా ఫూలే



నారాయణ గురు



పెరియార్



అంబేద్కర్



లోహియా

ఆక్రమణదారులు ఇక్కడి విజ్ఞాన కేంద్రాలను, ఉత్పత్తి వ్యవస్థలను, సాగునీటి వ్యవస్థలను, ప్రార్థనాస్థలాలను, సాంస్కృతిక కేంద్రాలను, మత సంస్థలను ధ్వంసం చేశారు. కులాలు, వృత్తులు, మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా లక్షలాది మందిని సంహరించారు. అనేక లక్షల మందిని ప్రధానంగా బానిసలుగా మారిన మహిళల్ని, పిల్లల్ని మతమార్పిడులకు గురిచేశారు. ఈ మొత్తం కాలంలోనూ వారు స్థానికుల్ని హిందువులుగానే అభివర్ణించారు. అలెగ్జాండర్ నుండి మౌంట్ బాటన్ దాకా ఈ కార్యకలాపాలన్నీ ఆగకుండా కొనసాగుతూనే వచ్చాయి. దేశ ప్రజానీకంలోని ఒక విభాగం చివరకు ఈ పరాయి శక్తుల వివరణను అంగీకరించింది. ఆక్రమణదారులు స్థానిక ప్రజలపట్ల చులకన భావంతోనూ, ద్వేషంతోనూ దీనినొక పదబంధంగా వినియోగించారు. అయినా నిన్నటి, నేటి జాతీయ వాదులు, కమ్యూనిస్టులు, సోషలిస్టులు, అంబేద్కరైట్లు కూడా ఇదే పదాన్ని వాడుతున్నారు. ఉమ్మడిగా కొన్ని పండుగల్ని, ఆచారాల్ని పాటిస్తున్న విభిన్న కులాలవారి గురించి వివరించేందుకు ఈ హిందూ అనే పదాన్ని వినియోగిస్తున్నారు. దీని నుండే హిందూత్వం, హిందూయిజం వంటి అభివ్యక్తీకరణలు వచ్చాయి. కొంతమంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు హిందూత్వాను ఉమ్మడి సంస్కృతి, జాతీయ గుర్తింపుగల ప్రజలను అభివర్ణించేదిగా భావించగా, స్థానిక ప్రజల శత్రువులు, మిత్రులు కూడా హిందూయిజంను వారి ఆధ్యాత్మిక, లౌకిక భావాలను వివరించే పదంగా వినియోగిస్తున్నారు. హిందూయిజం అనే పదాన్ని జుడాయిజం, క్రిస్టియానిటీ, ఇస్లాం వంటి పదంగా వినియోగిస్తున్నారు. ఇంతకంటే బుద్ధి హీనత వుండదు. భారతదేశంలో వేలాది మతైక, లౌకిక భావాలు, ఆచరణ విధానాలు వున్నాయి. స్థానిక ప్రజలకు సంబంధించినంత వరకు మహోన్నతమైనదిగ, తిరుగులేనిదిగా ఆమోదం పొందిన ఏకైక గ్రంథంగానీ, ప్రవక్తగానీ వుండే ప్రశ్నే లేదు. వారు బ్రాహ్మణులు, క్షత్రియులు, వెనుకబడిన కులాలవారు (శూద్రులు), వైశ్యులు, షెడ్యూల్డు కులాలవారు ఎవరైనా కావచ్చు. వేదాలుగానీ, మనుస్మృతిగానీ, భారత రామాయణాలుగానీ, ఆఖరికి గీత కూడా సార్వజనీనమైన ఆమోదం పొందలేదు. అన్ని కులాలు, తెగలు వాటిని అనుసరించడం లేదు. ఇప్పుడు బాగా చదువుకున్న వారిలో అనేక మంది తమను తాము హిందువులుగా చెప్పుకుంటున్నారు. కానీ మిగతా వారిలో, ఇతర అనేకానేక కులాలకు చెందిన అత్యధిక ప్రజానీకం తమ కులాన్ని పేర్కొనడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ విధంగానే వారు గుర్తింపు పొందాలనుకుంటున్నారు. అయినప్పటికీ ఏ మతమో చెప్పమని ఒత్తిడి చేస్తే హిందూ మతమని చెపుతున్నారు. ఇక్కడి దేశీయ ప్రజానీకం మనస్సులకు మతం అనే పదం పూర్తిగా పరాయిది. ధర్మ అనే దేశీయ పదానికి విధి, కర్తవ్యం అని అర్థం; అది ఒక తెగ విశ్వాసానికో, మతానికో సంబంధించినది కాదు. మజుబ్ అనే పదం కూడా ఇక్కడి స్థానికుల ఆలోచనా ధోరణికి పూర్తిగా పరాయిది.

కేవలం కొన్ని సామాజిక బృందాలు మాత్రమే కాక ఈ సువిశాలమైన దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు వేర్వేరు ఆచారాల్ని, మతవిశ్వాసాల్ని ఆచరిస్తున్నారు. ఉదాహరణకు ఐలయ్య గ్రామంలో నివసిస్తున్న వేర్వేరు కులాలు ఉపసంస్కృతి, ప్రవర్తనగానీ, నిజాం రాష్ట్రంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, విద్యా సంబంధ విషయాలు గానీ విశ్వజనీనంగా వర్తించేవి కాదు. ఇక్కడి ప్రజానీకం మీద బ్రిటిష్ వాళ్ళు రుద్దిన విద్యావ్యవస్థ పూర్తిగా హానికరమైనదే కాక, అసమానతల్ని పెంచేది. దాని వెనుక వున్నది దుర్మార్గమైన లక్ష్యం. కాగా బ్రిటిష్‌వాళ్ళకన్నా ముందున్న విద్యావ్యవస్థ సుసంగతమైనదే కాక, అర్థవంతమైన లక్ష్యం కలది కూడా. బ్రిటిష్ విద్యావ్యవస్థ వల్ల ఫలితాలేమిటో, స్వాతంత్ర్యం వచ్చి యాభై ఏళ్ళు గడిచిన తర్వాత కూడా దాని కొనసాగింపు ఫలితం ఏమిటో అందరం గమనించగలం. అది నూతన బానిస మనస్తత్వాన్ని పెంచింది. అమూలకమైన, ఆంగ్లీకృతమైన, పరాయీకరణ చెందిన కులం - వర్గంను సృష్టించింది.

ఇదే విధమైన దశను అనుభవించిన, ముద్రలు వేయించుకున్న వేరే ప్రజలు కూడా వున్నారు. వారే దేశీయ (native) అమెరికన్లు, అమెరికన్ ఇండియన్స్, రెడ్ ఇండియన్లు. చాలా మంది ఇప్పుడు వారిని ఆ విధంగానే పిలుస్తున్నారు. కానీ ఈ అమెరికన్లు భారతీయులుగానీ, ఎర్రనివారు గానీ కాదు. ఎంతో దూరంగా నివసిస్తున్న వేర్వేరు ప్రజల్ని దురాక్రమణదారులు, శత్రువులు పిలిచినట్లుగా నేటికీ ఇండియన్స్ అని పిలుస్తుండటం విడ్డూరం. ఆ ప్రజల నాయకులు, మేధావులు అనేకమంది అంతిమంగా ఆ పదాల్నే గౌరవ ప్రదమైనవిగానో, నిందగానో స్వీకరించారు. దేశీయ అమెరికన్లను ఇండియన్స్‌గా అభివర్ణించినవాడు బుద్ధిహీనుడైన నావికుడు కొలంబస్. అతను ఇప్పుడు మనం అమెరికా అని పిలుస్తున్న ఉత్తర తీర ప్రాంతాన్ని చేరుకుని దానినే భారత్ అనుకున్నాడు. భారత్‌లోని దేశీయ ప్రజలు ఒక విధంగా అదృష్టవంతులు. ఎందుచేతనంటే దురాక్రమణదారులు వారికి సంబంధించిన సర్వస్వాన్ని నాశనం చేయలేకపోయారు. కానీ అమెరికన్ ఇండియన్స్ సర్వస్వాన్ని కోల్పోయారు. వారి మతాల్ని, విద్యాసంస్థల్ని, వ్యవసాయ వ్యవస్థల్ని, భాషల్ని, సంస్కృతుల్ని సర్వనాశనం చేశారు. ఇప్పటి అమెరికన్ ఇండియన్‌ల జనాభా ఒక నాటి వారి అసలు జనాభాలో ఒక్క శాతం కన్నా తక్కువగా వుంది. తొంభై అయిదు శాతం మంది తెగల ప్రజల్ని చంపేశారు. వాళ్ళ భూములు పోయాయి. విషాదకరమైన "ఇండియన్" నామం తప్ప వారికి మిగిలింది ఏమీ లేదు. మెక్సికో వంటి కొన్ని ప్రాంతాల్లో వాళ్ళు ఇప్పుడు తమకు మిగిలివున్న కొద్దిపాటి అవశేషాల్ని కాపాడుకోవడం కోసం ఆయుధాలు చేపట్టారు. ఒకానొకప్పుడు వాళ్ళు తమను తాము మాయాలు, అజ్‌టెక్‌లు, ఇన్‌కాలు, హోపీలు, సెనెకాలు, నవాజోలు, ఇంకా సంఖ్యానేకమైన పేర్లతో పిల్చుకునేవారు. అవన్నీ కర్కశమైన చరిత్ర గర్భంలో అంతరించిపోయాయి. భారత్, అమెరికాలలోని దేశీయ ప్రజలు ఆక్రమణదారుల చేతుల్లో ఓటములకు, విధ్వంసాలకు గురి అయ్యారు. అమెరికన్ భారతీయుల ఓటమికి చాలావరకు ఆదిమకాలం నాటి యుద్ధతంత్రం కారణం. కాగా, మన దేశీయ భారతీయుల ఓటమికి, పరాభవానికి కులం, నిర్లక్ష్యం, జడత్వం కారణం అయ్యాయి. అయినప్పటికీ దేశీయ భారతీయుల యుద్ధతంత్రం ఆక్రమణదారుల యుద్ధం తంత్రం కన్నా మరీ అల్పస్థాయికి చెందినది కాదు. అందువల్ల వారు కూడా అనేకసార్లు విజయాన్ని సాధించారు. కానీ అప్పుడప్పుడు సాధించిన ఈ విజయాలు వారిని నిరంతర పరాభవభారం నుండి, బానిసత్వం నుండి కాపాడలేకపోయాయి. ఈ పాపం అంతా కులవ్యవస్థది.

ఎవరికైనా హిందూ అనే పదం నచ్చకపోయినట్లయితే, ఇక్కడి దేశీయ ప్రజానీకాన్ని గురించి వివరించడానికి నూతన పదాన్ని ఆవిష్కరించాలి. కొన్ని స్వల్ప మార్పులకు లోనైనప్పటికీ భారతీయ అనే పదం కూడా అదే అర్థం ఇస్తుంది. అయినా అది స్థానిక ప్రజల మీద రుద్దిన విదేశీ పదం. అలాంటప్పుడు మనల్ని మనం భారతీయులని పిలుచుకుందామా? ప్రత్యామ్నాయంగా మనం లక్షలాది కులాలు, తెగల పేర్లను వినియోగించాలి. అది మరింత హాస్యాస్పదం.

మానవ మస్తిష్కం సృష్టించిన అత్యంత అమానుషమైన వ్యవస్థల్లో ఒకటి కులవ్యవస్థ. హిందువుల నుండి ఎవరైనా దూరంగా జరిగినంత మాత్రాన అది నాశనం కాదు. ఇతర మతాలు కూడా అమానుషమైన వ్యవస్థల్ని సృష్టించాయి. ఇస్లాంలో మహిళల అణచివేత, క్రైస్తవంలో జాతి విద్వేషం మొదలైనవి అలాంటివే. మానవ మస్తిష్కం సృష్టించిన అలాంటి దుష్ట వ్యవస్థలను నాశనం చేయడం తేలికైనట్లయితే మనం అంతా సంతోషకరమైన జీవితాన్ని గడపగలిగేవాళ్ళం. ఐచ్ఛికంగా కానీ, మరో విధంగా కానీ మతం మార్పిడి చేసుకున్న భారతీయులు కులవ్యవస్థను పాటిస్తూనే వున్నారు. ఉదాహరణకు ముస్లిములు, క్రైస్తవులు, సనాతన ధర్మమైన కులతత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన బౌద్ధులు, లింగాయతులు, జైనులు, సిక్కులు మొదలైన వారందరూ కూడా కులతత్వాన్ని పాటిస్తూనే వున్నారు. డాక్టర్ అంబేద్కర్ స్ఫూర్తితో మతం మార్చుకున్న నయా బౌద్ధులు కూడా ఇదే కులతత్వాన్ని అనుసరిస్తున్నారు. ఆఖరికి తాము హిందువులం కాదని ప్రకటించుకున్న వారు కూడా, వారి వ్యక్తిగత, బహిరంగ జీవితంలో కులతత్వాన్ని కొనసాగినస్తూనే వున్నారు. అలాంటప్పుడు ఈ రుగ్మత స్వభావం ఏమిటి? దాన్ని నయం చేయడానికి మనం ఏం చేయాలి?

### కులసమస్య స్వభావం - దాని ఆధిక్యత

అన్ని సమాజాలకు ఒక కులవ్యవస్థగానీ, లేదా అలాంటిదాన్ని సృష్టించే ధోరణిగానీ వుంది. కానీ భారత్‌లో తప్ప ఇతర దేశాల్లో అవి వస్తుంటాయి, పోతుంటాయి. అక్కడ వర్ణాలు, వర్ణాలమధ్య నిరంతర చలనం వుంది. కానీ బౌద్ధయుగంలో బలహీనపడినప్పటికీ భారత్‌లో కులవ్యవస్థ మూడువేల సంవత్సరాలుగా స్థిరంగా వుంది. మతం, తత్వశాస్త్రం, రాజకీయాలు, సంస్కృతి, ఆర్థికరంగంతో ముడిపడి వున్నందువల్ల భారత్‌లో దానికి ఆ స్థిరత్వం ఏర్పడింది.

భిన్న వర్ణాల మధ్య పోరాటం తీవ్రతరమైనప్పుడు, రాజీ అసాధ్యమైనప్పుడు కులం తలెత్తుతుంది. అటువంటి పరిస్థితులలో విజయం సాధించిన వర్ణం దాని ప్రత్యేక హక్కుల్ని కాపాడుకునేందుకు కులవ్యవస్థను సృష్టిస్తుంది. సమాజానికి ఒక పాలనా రూపాన్ని కల్పిస్తుంది. కానీ ఈ పాలనారూపం ఎన్నడూ న్యాయబద్ధమైనదిగా, సృజనాత్మకంగా వుండదు. భవిష్యత్తులో అది ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తుంది.

వర్ణణ, దాని ఆధిక్యత సమాజాన్ని ముందుకు తీసుకువెళ్ళేవి అయినందువల్ల ఈ వర్ణణను అణచి వుంచడానికి చేసే ఏ ప్రయత్నమైనా ప్రతిష్టంభన ఏర్పడేలా చేస్తుంది. ఉక్కిరి బిక్కిరి చేసే ఈ విధమైన వాతావరణం సమాజానికి తీవ్రమైన హాని చేస్తుంది. దానిలోని సృజనాత్మక ప్రేరణలను ధ్వంసం చేస్తుంది.

అంతర్నిర్మిత అసమానతలు, క్రూరత్వంతో కూడిన భారతీయ కులవ్యవస్థ స్థిరత్వం ఇటు పీడితుల్ని, అటు పీడకుల్ని కూడా అమానుషులుగా చేసింది. ఈ వ్యవస్థ ఎలాంటి వంచనా శిల్పంతో రూపొందిందంటే, అణగారిన కులానికి చెందిన వ్యక్తులు నిత్యం అవమానానికి గురి అవుతూనే ఉంటారు. అదే సమయంలో మరో కులం ఏదో ఒక దాని కన్నా తాము అధికులం అని సంతృప్తి చెందుతుంటారు. అంతిమ విశ్లేషణలో ఇది భారతదేశానికి, దాని ప్రజానీకానికి ఆత్మహత్య సదృశమైనదిగా రుజువైంది.

చరిత్ర పొడవునా భారతీయ ప్రజలు గణనీయమైన సంఖ్యలో ఈ పాలనా వ్యవస్థ నుండి, మతపరమైన నిర్మాణాల నుండి పరిచ్యుతులమని భావించారు. కానీ వాళ్ళు ఎప్పుడో సకృత్తుగా గానీ తిరుగుబాటు చేయలేదు. ఎంచేతంటే వాళ్ళ మనసులను కర్మసిద్ధాంతం ఆవరించింది. ప్రతివ్యక్తి తన బాధలన్నీ పూర్వజన్మ కర్మానుసార ఫలితమని భావించినట్లయితే, తన కుల సంస్కారాన్ని విధేయతతో పరిపూర్తి చేసినప్పుడు మాత్రమే ఉన్నత కులంలో జన్మ, విముక్తి సాధ్యమవుతాయని విశ్వసించినట్లయితే, అతను వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయలేని పూర్తి అశక్తుడవుతాడు. అందువల్లనే ఈ అమానుష వ్యవస్థకు వ్యతిరేకంగా భారత ప్రజలు అరుదుగా మాత్రమే తిరుగుబాట్లు చేశారు. ఈ అరుదైన తిరుగుబాట్లు కూడా బుద్ధుడు, మహావీరుడు, చక్రధర్, గురునానక్, బసవేశ్వర్, కబీర్, వేమన లాంటి అగ్రకులాల నాయకులు నడిపించారు. కానీ వారు ఆ తిరుగుబాట్లను నిర్మాణయుతంగా సాగించలేదు. వారి సొంత పద్ధతుల్లోనే పోరాడారు. ఆధునిక కాలంలో ద్విజేతర కులాలకు చెందిన మహాత్మ ఫూలే, నారాయణ్‌గురు, రామస్వామి నాయికర్, అంబేద్కర్ వంటి నాయకులు కులవ్యవస్థలోని నిర్దిష్ట దృగంశాలకు వ్యతిరేకంగా నిర్మాణయుతమైన పోరాటాన్ని సాగించారు. కులవ్యవస్థకు వ్యతిరేకంగా సాగించిన ఈ సమరంలో చేరేలా అగ్రకులాలకు చెందిన కొన్ని విభాగాలను ఒప్పించడంతో విజయాన్ని సాధించగలిగారు.

బుద్ధుడి నుండి లోహియా వరకు కులవ్యవస్థకు వ్యతిరేకంగా ప్రతిఘటన ఒక అవిచ్ఛిన్నమైన ధారలా కొనసాగింది. కానీ వారి దార్శనికత, పద్ధతులు భిన్నమైనవి. అదే విధంగా వారి పోరాట దిశలు కూడా భిన్నమైనవే.

(ఇంకావుంది)

(గతసంచిక తరువాయి)

# అభిజ్ఞాన శాకుంతలమ్-7

రాజు - మాతలీ! అప్పుడు ఆకాశం ఎక్కునపుడు దానవులతో యుద్ధపు ధ్యాస - స్వర్గ మార్గమును గమనించకుంటిమి. మనం ఏ మరుత్తుల మార్గమున పయనిస్తున్నాము?

గగనతలంలో ముప్పేట గంగ ప్రవహిస్తుంది.

జ్యోతిర్గోళాలు కాంతి పుంజాలు చిమ్ముతాయి

తమస్సువెరగని విష్ణువు రెండవ పదం

ఈ వాయుమార్గాన్ని 'పరివహ'మంటారు.

రాజు - మాతలీ! అందుకే నబాహ్యాంతః కరణమగు నా అంతరాత్మ ఆనంద పరవశమగుచున్నది. రథ చక్రాన్ని చూచి - మేఘ పదానికి దిగుతున్నాం కదా!

మాతలి - అదెట్లు గ్రహించినారు?

రాజు -

మీ రథచక్ర నేములు
మంచు తుంపరలకు తడిశాయి.
చాతకాలు రథచక్రాల
ఆకుల సందుల మారిపోతున్నాయి.
గుర్రాల మీద మెరుపులు మెరుస్తున్నాయి.
జలదములవైపు రథం దిగుతున్నట్లున్నది.

మాతలి - క్షణంలో ఆయుష్మంతుడు తన అధికార - ప్రభుత్వ - భూమి మీద ఉంటాడు.

రాజు - కిందికి చూచి - వేగంగా దిగుతున్నపుడు మానవలోకం విచిత్రంగా కనిపిస్తుంది.

పొంగిన పర్వత శిఖరాలనుంచి
భూమి దిగుతున్నట్లున్నది.
చెట్ల మొదళ్లే కనిపిస్తున్నందున
ఆకులు లేనట్లున్నవి.
నదుల నీరు కనిపించనందున
సన్నని పాయలుగా కనిపిస్తున్నాయి.
చిత్రం! ఎవరో పైకి విసిరినట్లు
భూమి నా దగ్గరకు వస్తున్నది!

మాతలి - చక్కని పరిశీలన - ఆదరంగా చూస్తాడు. అహో! ఉదార రమణీయా పృథివీ. ఓహో! భూమి ఎంత గంభీరము! ఎంత రమణీయము!!

రాజు - ఆ ముందున్నది ఏ పర్వతం? అది ప్రాక్ పశ్చిమ సముద్రాల్లో దూకుతున్నట్లున్నది - సాయం సంధ్యా మేఘం వలె ద్రవసువర్ణంలో మునిగినట్లున్నది!

మాతలి - ఆయుష్మన్! ఇది హేమకూటమను కింపురుష స్థలం. తపస్సంసిద్ధి క్షేత్రం. విను:-

స్వయంభువు నుంచి మరీచి
మరీచి నుంచి ప్రజాపతి.
సురాసురుల తండ్రియగు
నాతడు భార్యా సహితంగా
ఇచట తపమాచరిస్తుంటాడు.

రాజు - ఆ మహర్షి ఆశీస్సులను దాటిపోరాదు.

మాతలి - సదాలోచన.

రాజు - వింతగా

రథచక్రాల చప్పుడు లేదు.
దుమ్ము లేవదు.
పగ్గాలు లాగి దింపినపుడు
నేలను తాకదు.
దిగిందే తెలియదు రథం!

మాతలి - ఆయుష్మంతునకు ఇంద్రునకు అంతే వ్యత్యాసం.

రాజు - మారీచ ఆశ్రమ పదం ఎచట?

మాతలి - అక్కడ అని చేతితో చూపుతాడు.

అదిగో ముని పుంగవుడు.
అతడు సూర్యాభిముఖుడు.
రొమ్ము వరకు వల్మీకం
ఆపై పాములు కుబుసాలు
జడలు భుజాలదాకా
వాటికి పిచ్చుక గూళ్ళు
నిశ్చల స్థాణువులా వెలుగుతున్నాడు!

రాజు - నమస్తే కష్టతపసే - కఠిన తపస్సుకు వందనం.

మాతలి - గుర్రాల పగ్గాలు లాగి - మహారాజా! మనం ప్రజాపతి ఆశ్రమ పదంలో ప్రవేశించాం. ఇవన్నీ అదితి పెంచిన మందార వృక్షాలు.

రాజు - ఇది స్వర్గాన్ని మించిన ఆనంద భూమి. నాకు అమృతహ్రదంలో మునకలు వేసినట్లున్నది!

మాతలి - రథం నిలిపి - ఆయుష్మంతుడు దిగునుగాత.

రాజు - రథం దిగి- మాతలి- మరి మీరు?

మాతలి - నేనూ దిగుతున్నాను. ఆయుష్మన్! ఇటు ఇటు - కొంతసాగి - ఋషుల తపోవన భూములను దర్శించండి.

రాజు - చకితుడై దర్శిస్తున్నాను :-

ఇది సత్కల్పవృక్ష వనం.
ఇవి గాలితో జీవం పోసుకుంటాయి.
ఈ జలం పద్మపరాగ స్వర్ణరజసం
ఇది ఋషుల దర్మాభిషేకాల నెలవు.
వారి తపస్సు రత్న శిలాతలముల మీద.
విగ్రహం అప్సరల నడుమ.
వీరు తపమాచరించు పదం కొరకే
అన్యమునులు చేయు తపస్సు.

మాతలి - మహాత్ముల ఆశయములు సమున్నతములు!

ఆకాశం చూచి - వృద్ధశాకల్యా! భగవానుడగు మారీచులు ఏ కార్యమున ఉన్నారు? ఏమి? ఏమనుచున్నావు! అదితి దేవి, పతివ్రత ధర్మాలను గురించి అడుగగా ఇతర మునిపత్నుల సహితంగా దేవికి ఉపదేశిస్తున్నారా?

రాజు - చెవియొగ్గి విని - మనం మునుల సమయం కోసం నిరీక్షించవలసిన వారలం కదా!

మాతలి - రాజును చూచి - ఈ అశోక వృక్షచ్ఛాయన ఆసీనులు కండి. ఈ లోగా నేను మీ రాకను మహర్షికి తెలియపరచే ఏర్పాటు చూస్తాను.

రాజు - మీ మాటయే

మాతలి - ఆయుష్మన్! వెళ్తున్నాను.

రాజు -

కోరిక తీరు ఆశలేదు
ఎందుకు భుజం అదరడం
నాడు నిరాకరించిన సుఖం
పరిణామమే నేటి దుఃఖం

- మాటలు వినిపిస్తాయి -

చాపల్యం వదులు - ఇది నీ స్వభావం అయిపోయింది.

రాజు - ధ్యానంగా వింటాడు. ఇది ధూర్తతకు స్థలం కాదు. కోపించువారెవరు?

ధ్వని వచ్చినవైపు చూస్తాడు. ఆశ్చర్యంగా.

ఎవరీ బాలుడు? ఇద్దరు తపస్వినులు వెంట ఉన్నారు! అతడు బాల్యాన్ని మించిన బలవంతుడు!!

సింహపు పిల్ల
తల్లి పాలు సగమే తాగింది.
ఆట కోసం దాన్ని గుంజుతాడు!
జూలు పట్టి లాగుతాడు!!

బాలుడు - సింహమా! నోరు తెరువు. నీ దంతాలు లెక్కిస్తాను.

మొదటి తపస్విని - ఈ జంతువులను మేం స్వంత బిడ్డల్లా సాదుకున్నాం. ధూర్తుడా! ఎందుకు వాటిని అలా పీడిస్తావు? నీ గోల ఎక్కువవుతున్నది! ఋషిజనులు అందుకు తగినట్లుగానే నీ పేరు 'సర్వదమనుడు' అన్నారు.

రాజు - ఏమిది! ఈ బాలుని మీద నా పుత్రుడైనట్లు వాత్సల్యం పొంగుతున్నది!! నేను అనపత్యుడను. నా మనసు ద్రవిస్తున్నది!!!

రెండవ తాపసి - దాని బిడ్డను విడువు. లేకున్న సింగం నీ మీద పడుతుంది!

బాలుడు - చిరునవ్వి - అయ్యో! భయపడతా కదూ! బెదిరిపోతాననుకున్నావా? - దాని పెదవి పట్టి లాగుతాడు.

రాజు -

ఈ బాలుడు
మహా తేజోబీజంలా ఉన్నాడు.
విప్పురవ్వ
ఇంధనం కోసం వేచినట్లున్నాడు.

మొదటి తాపసి - వత్సా! ఈ సింహ కిశోరాన్ని విడువు. నీకు మరో బొమ్మ ఇస్తాను.

బాలుడు - చేయి చాచి - ఏదీ బొమ్మ? ఇవ్వు.

రాజు - ఏమిటిది - ఇతనికి చక్రవర్తి లక్షణాలున్నాయి!

బొమ్మ కోసం
చాపల్యంగా చాచిన
చేతివ్రేళ్లు ఒకేమూలం నుంచి
వికసించినట్లున్నాయి
ఉదయం వికసించిన జలజం
రెమ్మలు కనిపించని అందంలా ఉంది.

రెండవది - సువ్రతా! వీడు మాటలకు మరువడు. వెళ్లు. నా కుటీరంలో రంగులు వేసిన మట్టి నెమలి ఉంది. అది ముని కుమారుడు మార్కండేయునిది. అది తెచ్చి ఇవ్వు.

మొదటి తపస్విని - అట్లే - వెళ్లిపోతుంది.

బాలుడు - అందాకా దీనితోనే ఆడ్తాను. తాపసిని చూచి నవ్వుతాడు.

రాజు -

పిల్లలు గలవారు
వారిని ఎత్తుకొనువారు
ఎంతటి భాగ్యశాలురు!
అక్కడక్కడ అగుపించే
మొగ్గలవంటి దంతాల
బోసినోటి నవ్వు!
అవ్యక్త రమణీయమగు
వొచ్చిరాని మాటలు!
బిడ్డలను చంకనేసుకుని
వారి వంటి దుమ్ముకు మాసేవారు
పిల్లలు గలవారు
వారిని ఎత్తుకొనువారు
ఎంతటి భాగ్యశాలురు!

తాపసి - వీడు నన్ను లెక్కచేయకున్నాడు - చుట్టు చూచి - ఎవరక్కడ మునికుమారులు?

రాజును చూస్తుంది.

భద్రముఖా! నా చేత కావడం లేదు. వీడు సింహకిశోరాన్ని తిప్పలు పెడ్తున్నాడు. రండి.

సింహాలతో ఆడుతున్న భరతుడు



విడిపించండి.

రాజు - చేరి సస్మితంగా - అయిబో మహర్షి పుత్రా!

ఇదేమి ఆశ్రమ విరుద్ధపద్ధతి!
జన్మతో రావలసిన సంయమం ఏది?
కృష్ణ సర్పశిశువు చందన వృక్షాన్ని వలె
ప్రాణి రక్షణ విధిని అతిక్రమిస్తున్నావు.

తాపసి - భద్రముఖీ! ఇతడు ఋషిపుత్రుడు కాడు.

రాజు - రూపసదృశ చేష్టలే చెపుతున్నాయి. పరిసరాల ప్రభావమని భావించాను.

విడిపించే ప్రయత్నంలో బాలుని స్పర్శ
ఎవరి కులాంకురమో!
స్పర్శ మాత్రం - సుఖకరంగా ఉంది!
కన్నవారి మానసికానందం
చెప్పుటెట్లు?

తాపసి - ఇద్దరినీ చూచి - ఆశ్చర్యమాశ్చర్యం!

రాజు - ఏమది?

తాపసి - బాలునికి మీకు రూపసాదృశ్యం ఆశ్చర్యకరం. అది కాక మీరు అపరిచితులు. బాలుడు పరిచయుని వలె చూస్తున్నాడు!

రాజు - బాలుని లాలిస్తూ - ముని కుమారుడు కాడు. మరి ఏ వంశం వాడు?

తాపసి - పురువంశపువాడు.

రాజు - తనలో - ఇతడు నా వంశపువాడెట్లు? అందుకే తాపసి పోలికలు చెప్పింది. ఇది పౌరవుల అంత్య కులవ్రతం.

పౌరవులు తొలుత
క్షితి రక్షణార్థం
సుఖకర సౌధాల్లో వసిస్తారు.
తదుపరి
నియతైకవ్రతులై
తరు మూలాలనే
గృహాలు చేసుకుంటారు.

ప్రకాశంగా - మర్త్యులు స్వశక్తితో చేరలేనివి కదా ఈ స్థలములు?

తాపసి - ఆర్యులు వచించింది వాస్తవం. కాని ఈ బాలుని తల్లికి అప్సరతో బంధుత్వం. ఆ తల్లి ఆమెను ఈ దేవగురు తపోవనానికి చేర్చింది.

రాజు - తనలో - అహో! ఇది రెండవ ఆశాంకురం!

- ప్రకాశంగా -

ఆమె ఏ రాజర్షి పత్ని అగుచున్నది?

తాపసి - ధర్మదారి పరిత్యాగి పేరును ఎవరు ఉచ్చరిస్తారు?

రాజు - తనలో - ఇది నా కథలాగే ఉంది. బాలుని తల్లి పేరు అడుగుదామా? అన్యుని భార్యను గురించి అడిగి అనార్యుడను అవుతాను. మట్టి నెమలిని తెస్తుంది.

తాపసి - 'సర్వదమన'! శకుంత లావణ్యం ప్రేక్షస్వపక్షి అందాన్ని చూడు.

బాలుడు - అటునిటు చూచి - కుత్రవామమ మాతా? నా తల్లి ఏది?

ఉభయులు - తల్లి అంటే ప్రాణం. నామ సాదృశ్యంతో తల్లిని అడుగుతున్నాడు.

రెండవ తాపసి - వత్సా! మట్టినెమలి అందాన్ని చూడమన్నది.

రాజు - తనలో - ఏమి ఈ బాలుని తల్లి పేరు శకుంతలయా? ఒకే పేరుగల వారుంటారు. ఈ పేరు మృగతృష్ణవలె విషాదం మిగుల్చనున్నదా?

బాలుడు - తల్లీ! ఈ మయూరం ఎంతో బావుంది - అందుకుంటాడు.

మొదటి తాపసి - బెదరినట్లు చూచి - అయ్యో! బాలుని ముంజేతికి తాయత్తు లేదు!

రాజు - భయం వలదు. సింహపు పిల్లతో ఆడేపుడు కింద పడ్డది.

అందుకోవడానికి ప్రయత్నిస్తాడు.

ఉభయులు - తాకకండి - తాకకండి. ఎలా? తీశాడే?

ఉభయులు రొమ్ములమీద చేతులుంచుకొని ఆశ్చర్యంగా ఒకరినొకరు చూచుకుంటారు.

మొదటి తాపసి - విను మహారాజా! ఇది మూలిక. అపరాజిత. బాలుని జాతసంస్కార సమయాన భగవానుడగు మారీచుడు కట్టాడు. ఇది కింద పడితే తల్లిదండ్రులు, బాలుడు మాత్రమే తీయాలి. ఇతరులకు నిషేధం.

రాజు - ఇతరుడు తీసినట్లవతే?

మొదటి తాపసి - సర్పం అవుతుంది. కాటేస్తుంది.

రాజు - మీరు చూచారా?

ఉభయులు - పలు మార్లు!

రాజు - హర్షాతిరేకంతో తనలో - నా ఆశలు ఫలించు సమయం వచ్చింది! బాలుని కౌగిలించుకుంటాడు.

రెండవ తాపసి - సువ్రతా! రా. ఈ విషయం దీక్షలో ఉన్న శకుంతలకు చెపుదాం.

వెళ్లిపోతారు.

బాలుడు - వదులు. మా అమ్మ దగ్గరకు వెళ్తా.

రాజు - పుత్రకా! మనం ఇద్దరం కలిసి మీ తల్లిని అభినందింతాం.

బాలుడు - నా తండ్రి దుష్యంతుడు. నీవు కాదు.

రాజు - నవ్వుతూ - ఈ వివాదం సహితం ఆశావహంగానే ఉంది.

ఏక వేణీధర శకుంతల ప్రవేశిస్తుంది.

శకుంతల - సర్వదమనుని చేత తాయత్తు రూపం మారవలసింది. దాని రూపం మారలేదని విన్నాను. అయినా నా అదృష్టం మీద అంతగా నమ్మకం కలుగలేదు. సానుమతి చెప్పిందాన్ని బట్టి సాధ్యం కావచ్చును అనిపించింది.

రాజు - అహో! ఇదిగో శకుంతల. ఎదుట ఎదుట నిలిచి ఉన్నది!

రెండు ధూళిధూసరిత వస్త్రములు.
దీక్షకు క్షీణించిన మోము - ఏకవేణి.
అతి శీలవతి - నా అతినిష్కరుణకు
సుదీర్ఘ విరహ వ్రతధారి.

శకుంతల - పాలిపోయిన రాజును చూస్తుంది. ఇతడు బొత్తిగా నా భర్త వలె లేడు. అట్లయిన రక్షాకవచం గల నా కొడుకును కౌగిలించుకొని మలినం చేసిన ఈతడెవరు?

బాలుడు - తల్లి దగ్గరకు చేరుతాడు. అమ్మా! ఇతడెవరు? నన్ను పుత్రుడంటాడు. కౌగిలించుకుంటాడు?

రాజు - ప్రేయసీ! నేను క్రూరుడను అయినాను. నీవు నన్ను గుర్తిస్తే సుఖాంతం అవుతుంది.

శకుంతల - తనలో - హృదయమా! ఊరడిల్లు - ఊరడిల్లు - నా దైవం నాడు త్యజించాడు. నేడు కరుణిస్తున్నాడు. అవును - ఇతడు ఆర్యపుత్రుడే!

రాజు - విస్మృతి తిమిరాన్ని అభిజ్ఞానం తొలగించింది.

అదృష్ట దేవత నా ముందు నిలిచింది.
గ్రహణం తొలుగుతే రోహిణి చంద్రుని చేరుతుంది.

శకుంతల - జయ ఆర్య... గొంతు పూడుతుంది. వాక్యం పూర్తి కాదు.

జయశబ్దం నీ బాష్పంతో నిలిచిపోయింది!
అయినా నేను విజయుడను అయినాను.
అలంకారం లేని నీ బింబాధర ముఖాన్ని చూస్తున్నాను!

బాలుడు - అమ్మా! ఎవరమ్మా ఇతడు?

శకుంతల - వత్సా! తే భాగధేయా ని పృచ్ఛ - బిడ్డా! నీ అదృష్టాన్ని అడుగు.

రాజు - శకుంతలాయాః పాదయో ప్రణిపత్య - శకుంతల కాళ్ల మీద పడి

సుందరీ! నా నిరాకరణను
నీ మనసు నుంచి తొలగించు.
అప్పుడు బలవన్మాయ
నా మనసును కప్పి పెట్టింది.
సాధారణంగా ప్రబల తమస్సులే
శుభాలకు ఆటంకాలు అవుతాయి.
అంధుడు తలమీద పడిన పూదండను
పాము అనుకుంటాడు. విసరి కొడ్తాడు.

శకుంతల - ఆర్యపుత్రా! లెమ్ము. నా పురాకృతమేదో నా భాగ్యం ఫలించడాన్ని నిరోధించింది. కాకున్న సహృదయుడగు నా భర్త విరసుడెట్లగును?

రాజు లేస్తాడు.

ఆర్యపుత్రా! ఇంతకు ఈ దుఃఖభాగిని మీకు గుర్తు వచ్చిన విధానమెట్టిది?

రాజు - విషాద శల్యం పెరికి వేసినవుడు చెపుతాను.

సుందరీ! మాయలో పడి
పూర్వం నిన్ను ఉపూక్షించాను.
అది నిన్ను బాష్పబిందు
అధరంగా బహుబాధించింది.
నేడు నీ వంపుల కనురెప్పలనంటిన
కన్నీరు తుడిచి దుఃఖ విముక్తుడనవుతాను.

- అట్లని శకుంతల కన్నీరు తుడుస్తాడు -

శకుంతల - ఉంగరం చూచి - ఆర్యపుత్రా! ఇదే ఆ ఉంగరం!

రాజు - ఈ ఉంగరం లభించడం వల్లనే నా జ్ఞాపకం మరలి వచ్చింది.

శకుంతల - ఈ ఉంగరమే దుర్మార్గం చేసింది. దీని వల్లనే భర్తకు గుర్తు చేయడం దుష్కరమైంది.

రాజు - అట్లయిన వసంత సమాగమ చిహ్నంగా లత పుష్పాన్ని ధరించునుగాక.

శకుంతల - నేను దీనిని నమ్మను. నా భర్త వద్దనే ఉండునుగాక.

- మాతలి ప్రవేశిస్తాడు -

(ఇంకావుంది)



## ఉపనిషత్తు - అమృత జీవనం 12

అక్షర వాచస్పతి డా. దాశరథి రంగాచార్య


దత్తాత్రేయ వేషధారి శ్రీనివాస్

## దత్త భగవాన్ కథ

# డామిట్! అవతారం అడ్డం తిరిగింది


లొంగిపోయిన దత్తబాబా

నిరంతరం భజనలతో హోరెత్తుతున్న ఆ ఆశ్రమాన్ని చూసిన వారు ఎవరైనా దాన్ని అనుమానించలేరు. ప్రతినిత్యం పూజలు చేస్తూ కనిపించే బాబాని ఎవరూ శంకించలేరు. పైగా బాబా నిర్వహించిన హోమంలో ఒక కేంద్రమంత్రి, ఒక ఎం.పి. కూడా పాల్గొన్నారని ప్రచారమైన తర్వాత బాబా పలుకుబడి ఇంకా పెరిగింది. మొన్న మొన్న జనవరి ఇరవై తారీకున ఆశ్రమంలో ఒక స్త్రీ ప్రాణం పోయిన తర్వాత గానీ అక్కడి పాపాల పుట్ట బద్దలవలేదు.

రాజధాని నగరంలో ఆశ్రమాన్ని స్థాపించి ఒక వెలుగు వెలిగిన దత్తభగవాన్ బాబా అసలు రూపం పోలీసు స్టేషన్‌లోగానీ కనిపించలేదు. స్త్రీలను లోబరుచుకోవడం, భూమిని కబ్జా చేయడం, డబ్బు వసూలు చేయటం లాంటి ఆరోపణల్లో ఎక్కడా చిక్కని బాబా, చివరికి హత్యానేరంలో దొరికిపోయాడు.

### ఎవరీ బాబా?

అసలు పేరు శ్రీనివాస్. టైలరింగ్, ఎంబ్రాయిడరీ చేసేవాడు. ఊరు గుంటూరు జిల్లా ఏటుకూరు. విలాసంగా జీవించటానికి తేలికైన మార్గం కోసం వెతికిన శ్రీనివాస్ చివరికి గడ్డమూ, జుత్తూ పెంచుకుని, విభూది బొట్లు పెట్టుకుని గుంటూరులో కాశీ భగవాన్ బాబాగా అవతారమెత్తాడు. అక్కడ షిరిడీ సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్టించాడు. అదే రోజు తండ్రి చనిపోవడంతో... అతనికి ఏ మహిమలూ లేవని భక్తులు భావించారు. దీంతో తన ఆటలు సాగవని దత్తబాబా కొన్నాళ్ల తర్వాత హైదరాబాద్‌కి మకాం మార్చాడు. నాలుగేళ్ల కిందట కూకట్‌పల్లి సమీపంలోని వసంత్‌నగర్ కాలనీలో 'సాయిదత్తబాబా' అవతారం ఎత్తాడు. నిరంతరం భజనలతో, నిత్యం పూజలతో శ్రీనివాస్ చేస్తున్న 'ఆధ్యాత్మిక హడావుడి'ని చూసి భక్తులు రావటం పెరిగింది.

'సాయి దత్తాత్రేయమ్' పేరుతో ఒక ఆధ్యాత్మిక మాసపత్రికను కూడా తెస్తున్నాడు. ఈ మధ్యనే మెదక్ జిల్లాలోని మానివల్లి మండలం బుధేరా సమీపంలోని ఒక కొండను, ఆ చుట్టుపక్కల వున్న పదిహేను ఎకరాల స్థలాన్ని దత్తబాబా సొంతం చేసుకున్నాడు. అక్కడ తన ఆశ్రమానికి "శ్రీ దత్తాత్రేయ మహా సంస్థానం" అని, ఆ ప్రాంతానికి 'మణిగిరి' అని గొప్పగా పేర్లు కూడా పెట్టాడు. ఇదంతా చూసి భక్తులు అతడిని ఒక దైవాంశ సంభూతుడిగానే భావించారు.

### ఎందుకీ హత్య?

దత్తబాబాని నమ్మి వచ్చే భక్తుల్లో మహిళలెక్కువ. దత్తబాబా తన దగ్గరికి భక్తితో వచ్చే మహిళల పట్ల శృతిమించి ప్రవర్తించిన సందర్భాలున్నాయి. ఇది నచ్చని భక్తులు కొందరు ఎదురు తిరగటంతో తన మకాంను మియాపూర్‌కి మార్చాడు. అక్కడ వుంటూనే, బుధేరాలో వున్న ఆశ్రమానికి వెళ్లి వస్తుండే వాడు. ఎందరో భక్తుల్లాగానే ఆర్థిక బాధల్లో వున్న శ్రీదేవి అనే భక్తురాలు ఆమె భర్త బాబాను ఆశ్రయించారు. వారిది జీడిమెట్ల. కాలక్రమంలో శ్రీదేవి ఆశ్రమానికే అంటిపెట్టుకోవటం, అది నచ్చని భర్త విడాకులు తీసుకోవటం జరిగిపోయాయి. శ్రీదేవి దత్తభగవాన్‌కి పర్సనల్ సెక్రటరీగా పనిచేస్తూ కూతురుతో సహా ఆశ్రమంలోనే వుండేది. దత్తబాబా శ్రీదేవితో శారీరక సంబంధాలు కొనసాగించాడు. భార్య లక్ష్మి వుండగానే ఆమెను రెండో వివాహం చేసుకున్నాడు.

ఆశ్రమానికి సంబంధించిన వ్యవహారాల్లో శ్రీదేవిది కీలకపాత్ర. దీనివల్ల బాబా భార్య లక్ష్మికి, శ్రీదేవికి మధ్య గొడవలు వస్తుండేవి.


శ్రీదేవి మృతదేహం

పర్సనల్ సెక్రటరీగా తనకు బకాయిపడిన జీతభత్యాలలో రెండు లక్షల రూపాయలను తన కుమార్తె స్నేహప్రియ పేర ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయమని దత్తబాబా మీద శ్రీదేవి వత్తిడి తెచ్చింది. ఇది ఇద్దరి మధ్యా ఘర్షణకి


శ్రీదేవి కుమార్తె స్నేహప్రియ

కారణమైంది. మొన్న జనవరి 20వ తేదీన "నీ గుట్టు బయటపెడతా" అంటూ శ్రీదేవి బాబాను హెచ్చరించి ఆశ్రమం నుంచి వెళ్ళిపోవటానికి ప్రయత్నించింది. ఆమెను దత్తబాబా అడ్డగించి కాషాయకండువాను గొంతుకు బిగించి చంపేశాడని పోలీసుల కథనం. దత్తబాబా కుటుంబీకులు దీన్ని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు నానా తంటాలు పడ్డారు.

సంఘటన రాత్రెప్పుడో జరిగినా బాబా రక్త సంబంధీకులు పోలీసులకు మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ తెలపకపోవటం, శ్రీదేవి మరణించిన రాత్రే బాబా పరారీ కావటంతో ఇది ఆత్మహత్య కాదు హత్య అనే అనుమానం పెరిగింది. పైగా ఆ రాత్రే దత్తబాబా పలాయనం చిత్తగించటం దీన్ని బలపరిచింది. ఫోరెన్సిక్ నిపుణులు కూడా శ్రీదేవిది హత్యేనని తేల్చారు.

### దేశమంతా తిరిగి కుంభమేళాలో మునిగి

పోలీసుల దర్యాప్తు మొదలైంది. క్రమంగా డొంకంతా కదిలింది. పోలీసులు దత్తబాబా కుటుంబ సభ్యుల్ని అదుపులోకి తీసుకుని విచారణ మొదలుపెట్టారు. పది రోజుల తర్వాత బాబాతో పాటు దేశంలోని అనేక ప్రాంతాలు తిరిగితిరిగి విసిగిపోయిన డ్రైవర్ బాషా పోలీసులకు లొంగిపోయాడు. బాబా తరచూ శ్రీదేవిని హింసించేవాడని, డబ్బు విషయంలోనే వారిద్దరి మధ్య విభేదాలు వచ్చాయని తెలిపాడు. నగరం నుంచి పారిపోయిన దత్తబాబా పోలీసులకి దొరక్కుండా విజయవాడ, గుంటూరు, తిరుపతి, పూనా, ఆగ్రా, అలహాబాద్, నాగ్‌పూర్, ఇటార్సీ లాంటి పట్టణాలన్నీ తిరిగాడు. కుంభమేళాకి వెళ్ళి గంగలో మునకేశాడు. తన లాయర్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్న బాబా, కుటుంబ సభ్యుల మీద పోలీసుల ఒత్తిడి తీవ్రమైందని తెలుసుకున్నాడు. ఇక విధిలేక నగరానికి చేరుకుని ఫిబ్రవరి 12న పోలీసులకి లొంగిపోయాడు. శ్రీదేవి హత్యలో తన ప్రమేయం లేదని బుకాయించాడు.

### కిరాయి భజనలు... పరాయి సొమ్ములు

ఏ విషయంలోనైనా దత్తబాబా రూటే వేరు. ఆశ్రమంలో భజనలు చేయడానికి గుంటూరు, విజయవాడ ప్రాంతాల నుంచి కొందరు వృద్ధులను తీసుకొచ్చాడు. వారికి భోజనమూ అదీ పెట్టి నెలకు నాలుగొందలిచ్చే వాడు. ఈ భజన చేసే కిరాయి భక్తులు రోజుకు మూడు షిఫ్టులలో భజనలు చేస్తారు. వీరికి వీక్లీ ఆఫ్ కూడా వుంది.

దత్తబాబా పూజల నిమిత్తం భక్తుల దగ్గర బాగానే డబ్బు దండుకున్నాడు. కాబట్టే మొదట్లో ఏమీ లేకపోయినా కొన్నాళ్లకు మారుతీ వ్యాన్ సంపాదించాడు. బుధేరాలో ఆక్రమించిన పదిహేనెకరాల స్థలం ప్రభుత్వానికి చెందింది. ప్రభుత్వం ఈ భూమిని బడుగువర్గాలకు చెందిన నలుగురికి పట్టాగా ఇచ్చింది. అందులో వృద్ధాశ్రమం, అనాధాశ్రమం, కాలేజీ ఏర్పాటు చేస్తానని వారిని నమ్మించి ఆ భూమిని వారి చేత కానుకగా ఇప్పించుకున్నాడు దత్తబాబా. ముంబయ్ రహదారిని ఆనుకుని వున్న ఈ భూముల ధరలు భవిష్యత్తులో విపరీతంగా పెరిగే అవకాశం వుంది. దత్తబాబా అందుకే ఆ ప్రాంతంలోని మిగతా భూముల మీద కూడా కన్నేసి వుంచాడు. దత్తబాబా గుంటూరులో ఇద్దరు, హైదరాబాద్‌లో నలుగురు మహిళలను మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడని పోలీసుల విచారణలో బయటపడింది.

"ప్రజలు ఎవరు మంచివారో, ఎవరు చెడ్డవారో బేరీజు వేసుకోకుండానే మూఢభక్తి విశ్వాసాలను ప్రదర్శిస్తుండటం వల్లే శ్రీనివాస్ లాంటి నకిలీబాబాలు పెట్రేగిపోతున్నారని, అకృత్యాలకు పాల్పడుతున్నారు" అని రంగారెడ్డి జిల్లా ఎస్పీ సురేంద్రబాబు అన్న మాటల్లో ఎంతైనా నిజముంది.

## శక్తికి సిసలైన ప్రతిరూపం



# చిన్నపిళ్లై

కూలినాలీ చేసుకుని పొట్టపోసుకునే చిన్నపిళ్లైకి 'స్త్రీ శక్తి అనేమాటకి అర్థం తెలీకపోవచ్చు. కానీ, అక్షరజ్ఞానం లేని ఈ దళితమహిళ ఆ మాటకి నికార్సయిన నిర్వచనంగా నిలిచింది. స్త్రీ శక్తి అవార్డును అందచేస్తూ.. ప్రధాని వాజ్‌పేయి చిన్నపిళ్లైలోని గొప్పతనానికి పాదాభివందనం చేసిన దృశ్యం అన్ని పత్రికల్లోనూ పతాకశీర్షికల్లో కనిపించింది. చిన్నపిళ్లై సాధించిన విజయం చిన్నది కాదు. దేశవ్యాపితంగా 'స్త్రీశక్తి పురస్కార్ అందుకున్న ఐదుగురిలో ఒకరు ఆమె.

చిన్నపిళ్లైది తమిళనాడులోని మధురై సమీపంలోని పుల్లుచెరి అనే పల్లె. చిన్నప్పుడే తల్లినీ, ఇద్దరు తోబుట్టువులనీ పోగొట్టుకుంది. పద్దెనిమిదోయేట అంతకుముందే రెండు పెళ్లిళ్లయిన పెరుమాళ్‌తో పెళ్లయింది. చిన్నప్పట్నుంచీ కాయకష్టం చేస్తూ బతికిన చిన్నపిళ్లై , భర్తకి వ్యవసాయం పనుల్లో సాయపడేది. కూలికెళ్లేది. వీటన్నింటితోపాటు భూస్వామి ఇంట్లో గాడిదచాకిరీ చేసేది. ఇంత కష్టపడినా పెరుమాళ్ కుటుంబం చేసిన అప్పులు తీర్చటం కష్టమైపోయేది.

కొన్నాళ్లు కొంతభూమిని కౌలుకి తీసుకుని పనిచేశారు కానీ పరిస్థితి మెరుగు పడలేదు. రుణాలిచ్చిన వడ్డీ వ్యాపారస్తుల దయాదాక్షిణ్యాల మీద బతికేవాళ్లు. చిన్నపిళ్లై చెల్లించవలసిన ప్రతి వందరూపాయలకీ ఒక ధాన్యం బస్తా చొప్పున వసూలు చేసుకునే వాళ్లు. మరోపక్కన కుటుంబం పెరిగింది. పెరుమాళ్ ఆరోగ్యం దెబ్బతింది. ఇటువంటి సమస్యలతో సతమతమవుతూనే చిన్నపిళ్లై కూలీల సంఘానికి నాయకురాలైంది.

అంతకుముందు కూలీరేటును భూస్వాములే నిర్ణయించేవారు. వారు ఎంత చెబితే అంత. చిన్నపిళ్లై ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చింది. కూలీరేటును నిర్ధారించిన తర్వాతే కూలీలను పనులకి పంపించటం మొదలుపెట్టింది. భార్య చేస్తున్న ఈ పనులేవీ పెరుమాళ్‌కి నచ్చేవి కావు. దీంతో కొన్నిసార్లు ఇద్దరి మధ్యన గొడవలు వచ్చేవి.

ఒక స్వచ్ఛందసంస్థ కార్యకర్తలు పుల్లుచెరి వచ్చి స్వయం సహాయక గ్రూపులను ఏర్పాటు చేసుకోవలసిందిగా ప్రోత్సహించారు. చిన్నపిళ్లైతో కలిసి పదిమంది మహిళలు తలకొక ఇరవై రూపాయలతో ఒక పొదుపు గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. నాయకత్వ బాధ్యతలను చిన్నపిళ్లైకి అప్పగించారు. ఇటువంటి పొదుపుగ్రూపులను అక్కడ 'కలాంజియం (ధాన్యపుకొట్టు- అనే అర్థంలో) అని పిలిచేవారు. ఆ ప్రాంతంలోని 130 గ్రామాలలో వున్న ఇటువంటి అనేక కలాంజియంలను పర్యవేక్షించే ప్రాంతీయ కార్యాలయం వైగై ఫెడరేషన్ కూడా పుల్లుచెరికి దగ్గరలోనే వుంది. ఢిల్లీ కేంద్రస్థానంగా పనిచేసే స్వచ్ఛందసంస్థ కార్యకర్తలు, 1990 నుంచి మధురై పరిసరాలలోని గ్రామీణ మహిళలలో పొదుపు ఉద్యమాన్ని ప్రచారం చేశారు. చదువురాకపోయినా, తమంతట తామే పొదుపు సంఘాలను నిర్వహించుకునేలా తర్ఫీదునిచ్చారు. ఫలితంగా చిన్నపిళ్లై,


చిన్నపిళ్ళైకి ప్రధాని పాదాభివందనం

అయ్యమ్మాళ్, భగవతిలాంటి సాధారణ మహిళలు నాయకత్వ లక్షణాలతో ఎదిగివచ్చారు. కలాంజియం పనులమీద తిరగాల్సి వచ్చినప్పుడు ఎన్నోరోజులు కూలి మాను కోవలసి వచ్చినా, ఇంటాబయటా ప్రోత్సహించేవారు లేకపోయినా వారు వెనుకడుగు వేయలేదు. ఇటువంటి అనేక పొదుపు గ్రూపుల కలయికతో ఏర్పడిన అసోసియేషన్‌కి చిన్నపిళ్లై సెక్రటరీగా ఎన్నికైంది. ఆమె హయాంలో మధుర ప్రాంతంలో ఎన్నో గ్రామాల్లో కొత్తగా పొదుపు ఉద్యమాన్ని ప్రారంభించింది. బ్యాంకుల ద్వారా వచ్చిన రుణాలు దుర్వినియోగం కాకుండా చూసింది. అనేక అసోసియేషన్‌లతో కలిసి ఏర్పడిన వైగై ఫెడరేషన్‌కి చిన్నపిళ్లై డైరెక్టర్‌గా కూడా పనిచేసింది. ఇప్పుడామె బ్యాంకు అధికారులతో, ఫండింగ్ ఏజెన్సీలలో, ప్రభుత్వాధికారులతో మాట్లాడి పల్లెల్లో వీధిదీపాలు, పంపు సెట్లు లాంటి సౌకర్యాల కోసం కృషి చేస్తోంది.

ఈ ఫెడరేషన్ స్త్రీలకు లోన్‌లతోపాటు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. టైలరింగ్, కళాత్మక వస్తువుల తయారీ, పాడిపరిశ్రమ లాంటి వాటి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించారు. ఈ సంస్థ తక్కువ వర్షపాతం వున్న ప్రాంతాల్లో జీడిపప్పు, పుచ్చలాంటి పంటలు వేయటానికి రాగాలు అందించింది. సిడ్బి, నాబార్డలాంటి బ్యాంకులు వీరికి సహాయం అందించేందుకు ముందుకువచ్చాయి. టాటాట్రస్ట్ 24 లక్షల రూపాయల విరాళాన్నిచ్చింది.

రెండేళ్ళ క్రితం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళలో వున్న 35 ఫెడరేషన్ల కలిసి ఒక కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసుకున్నాయి. దానికి మొదటి సెక్రటరి చిన్నపిళ్ళై. మొత్తం 70వేల మంది సభ్యులకు నాయకురాలైంది. ఒక వైపు నాయకత్వ లక్షణాలతో ఎదుగుతున్న చిన్నపిళ్ళైకి మరో వైపు కుటుంబపరంగా విషాదాలు ఎదురయ్యాయి. పోయినేడాది భర్త చనిపోయాడు. అంతకు ముందే పదిహేనేళ్ళ కూతురు చనిపోయింది. కొడుకులిద్దరూ చదువు మీద శ్రద్ధ చూపిస్తున్నారు. అదొక్కటే ఆమెకి ఊరట.

అక్షర జ్ఞానం లేని సాధారణ మహిళ నుంచి అసాధారణ మహిళగా ఎదిగిన చిన్నపిళ్ళైకి తాజాగా జానకీ దేవి 'బజాజ్ అవార్డ్-2000' రావటం ఇంకో విశేషం.



ప్రొఫెషనల్స్‌నీ, లెర్నర్స్‌నీ
సమానంగా ఆకర్షిస్తూ,
సంచలనం సృష్టిస్తున్న
తొలి తెలుగు
కంప్యూటర్‌ఎడ్యుకేషన్ సీరియల్ !!



సి.యస్. సలీం బాషా



# కంప్యూటర్ క్లాస్‌రూమ్
## (పన్నెండవ భాగం)

విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ ఒకసారి పలు విండోస్ (కిటికీలు) ఓపెన్ చేసుకోవచ్చు. ఒకదాని తర్వాత ఒకటి చూసుకోవచ్చు. ఒక విండోలోని విషయాలను మరో విండోలోకి కాపీ చేసుకోవచ్చు. అయితే మన చివరగా ఓపెన్ చేసిన విండో మాత్రం అన్నింటికన్నా పైన వుంటుంది. అయితే విండో సైజు తగ్గించుకుంటే ఒకసారి రెండు మూడు విండోస్‌ను స్క్రీన్ పైన చూసుకోవచ్చు.

విండోల సైజు మనం తగ్గించుకోవచ్చు. విండో బోర్డర్ దగ్గరకు మౌస్ పాయింటర్‌ను తీసుకెళ్ళి - ఎడమ చేతి బటన్‌ను నొక్కి అలా లాగుతూ (Drag) వెళితే మనకు కావాల్సిన సైజుకి విండోను తగ్గించుకోవచ్చు.




## స్క్రోల్ బార్స్ (Scroll Bars)

ఒక్క విండోలో అన్ని విషయాలు పట్టనపుడు, లేదా విండో చిన్నదైనపుడు దాన్ని కిందికి, పైకి జరుపుతూ చూడటానికి Vertical Scroll Bars, ఎడమ నుంచి కుడికి, మళ్ళీ వెనక్కి జరిపి చూడటానికి Horizantal Scroll Bars వుంటాయి. ఉదాహరణకు My Computer Window చూడండి.

## కీబోర్డు టెక్నిక్స్ (Keyboard techniques)

విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో మౌస్‌తో పాటు కీబోర్డును కూడా ఉపయోగించవచ్చు. ఒక్కోసారి Move పనిచేయనపుడ కీబోర్డు ఉపయోగించి కొంతవరకు పనిచేసుకోవచ్చు.

- ఒక విండో నుంచి మరో విండోకు తరచు మారటానికి Alt + Tab లేదా Alt + Esc ప్రెస్ చెయ్యాలి.
- బాణం గుర్తులు వున్న 'కీ'లు (Arrow keys) ను కూడా ఉపయోగించి అటు ఇటు చూడవచ్చు.
- Enter నొక్కితే ఒక విండో ఓపెన్ అవుతుంది. లేదా ఒక ప్రోగ్రాం స్టార్ట్ అవుతుంది.
- Tab కీ నొక్కితే విండోలో డైలాగ్ బాక్స్‌ల మధ్య అటు ఇటు కదలవచ్చు.
- ఒక విండో ఓపెన్ చేసివుంటే దాని కంట్రోల్ మెనూ ఓపెన్ చెయ్యటానికి Alt + Spacebar నొక్కితే Control Menu వస్తుంది.

ఇంకా కొన్ని కీబోర్డు టెక్నిక్స్ తర్వాత వివరంగా చర్చించటం జరుగుతుంది.

## డెస్క్‌టాప్ పై విండోలు అమర్చటం

ఇంతకు ముందే చెప్పినట్లు స్క్రీన్ పైన ఒకటి కన్నా ఎక్కువ విండోలు ఓపెన్ చేసినపుడు. Alt + Tab లేదా Alt + Esc నొక్కటం ద్వారా ఒక విండో నుంచి మరో విండకు వెళ్ళవచ్చు. అయితే కొన్ని సార్లు నాలుగైదు విండోలను ఒక పద్ధతిలో అమర్చుకుని ఒకేసారి చూడాలనుకోవటం మామూలే. అందుకోసం డెస్క్‌టాప్ పై విండోల అమరిక ఎలా వుండాలో మనం నిర్దేశించుకోవచ్చు. ఎలా అమర్చుకున్నా ఒక విండో నుంచి మరో విండోకు సమాచారం సరఫరా అవుతుంది. ఒక విండోలోని విషయాలను మరో విండోతో పోల్చి చూసుకోవచ్చు. కాపీ చేసుకోవచ్చు.

స్క్రీన్ మీద విండోలను అమర్చుకోవటానికి రెండు పద్ధతులున్నాయి. ఒకటి మనం స్వయంగా విండోల సైజులను తగ్గించుకోవటం. ఇది సాధ్యమే అయినా, ఎక్కువ కాలం పడుతుంది. పైనుంచి బోర్ కూడా కొట్టవచ్చు. రెండోది విండోస్'95 మన కోసం వాటిని అమర్చి పెడుతుంది. ఇందులో మూడు రకాల అమరికలున్నాయి. ఒకటి Cascaded, రెండు Horizantally tiled, మూడు Vertically tiled.



Cascaded　　Horizontally tiled　　Vertically tiled

దీని కోసం ఏం చెయ్యాలంటే. మొదట అన్ని విండోలు Close చెయ్యాలి. తర్వాత Point విండోను ఓపెన్ చెయ్యాలి. మళ్ళీ Wordpad విండోను కూడా ఓపెన్ చెయ్యాలి. అలా మూడు నాలుగు విండోలు ఓపెన్ చేసిన తర్వాత Taskbar లో ఖాలీ స్థలం (Blank Portion) దగ్గర మౌస్‌ను తీసుకెళ్ళి Right Click చెయ్యాలి. అపుడు ఇలాంటి మెనూ వస్తుంది.




మొదట పద్ధతిని ఎన్నుకుంటే బొమ్మలో చూపినట్లు ఒకదాని తర్వాత ఒకటి విండోలు అమర్చడతాయి. (చివరగా ఓపెన్ చేసిన విండో అన్నింటి కన్నాపైన వుంటుంది) ఇలాంటి అమరికలో ప్రతి విండో Title Bar ను చూడవచ్చు. ఏ విండో కావాలంటే ఆ విండోను Click చేసి పైకి తెప్పించవచ్చు.

రెండవ పద్ధతి Horizontally tiled. ఇది కూడా Cascade లాంటిదే. అయితే ఒక విండో తర్వాత మరో విండో వస్తుంది. దీంట్లో ఒక లాభం వుంది. Paragraph లు పోల్చి చూడటానికి, files list చూడటానికి ఇది అనువైంది.

Vertically tiled పద్ధతిలో విండోలు ఒకదాని పక్కన మరోటి అరేంజ్ చెయ్యబడతాయి. ఒక విండోలోని Objects మరో విండోలోకి కాపీ చెయ్యటానికి ఇది అనువుగా వుంటుంది. ఏదీ చేసినా, ఎలా చేసినా మనం మళ్ళీ మొదటికి రావచ్చు. అందుకే నాలుగైదు విండోలు ఓపెన్ చేసి మూడు రకాల పద్ధతుల్లో అమర్చి చూడండి. ఏం ప్రమాదం లేదు.

## డెస్క్‌టాప్‌పై Objects అమర్చుకోవటం

డెస్క్‌టాప్‌పై Objects (లేదా Icons) మనకు నచ్చిన రీతిలో అమర్చుకోవచ్చు. ఉదాహరణకు My computer Object ను left click చేసి అలాగే నొక్కి పెట్టి వేరే స్థలానికి తీసుకెళ్ళి మౌస్ బటన్




వదిలేస్తే, అది ఇపుడు మనం తీసుకెళ్ళిన స్థలంలో అమరుతుంది. ఈ విధంగా కాకుండా విండోస్ 95 ద్వారా కూడా Object ను ఆటోమాటిక్‌గా అమర్చుకోవచ్చు. డెస్క్‌టాప్‌లో ఖాళీ స్థలానికి వెళ్ళి right click చేస్తే ఇలా వస్తుంది.



ఇందులో Arrange icons ఎన్నుకుంటే నాలుగు Options వస్తాయి. 'By name' option ను ఎన్నుకుంటే objects అన్నీ alphabetical order లో అమరుతాయి. అలాగే By size, By date..... కూడా. అలాగే Auto arrange సెలక్ట్ చేసుకుంటే విండోస్ 95 మన కోసం వాటిని అమరుస్తుంది.

## టాస్క్‌బార్ (Task Bar)

డెస్కటాప్‌లో కిందవైపు వుండేది Task Bar అన్నది తెలిసిందే. టాస్క్‌బార్‌లో కొన్ని Properties (లక్షణాలు) మనం మార్చుకోవచ్చు. మొదట టాస్క్‌బార్‌నే Right clic చెయ్యాలి. అపుడు వచ్చే మెనూ నుంచి Properties ఆప్షన్‌ను ఎన్నుకుంటే కింది విధంగా వస్తుంది. (Task bar డైలాగ్ Box)




పై బాక్స్‌లో మొదటి Tab వచ్చేసి Task bar options. ఇందులో నాలుగు Options వున్నాయి. అవి ఏమిటో చూద్దాం...

***Always on Top :*** ఇది ON లో వుంటే Task Bar మనకు ఎప్పుడూ కనిపిస్తూనే వుంటుంది. అంటే విండోను Maximize చేసినా కూడా వివిధ అప్లికేషన్స్ ఉపయోగించేటపుడు - Task bar కనిపిస్తూ వుంటే ఉపయోగకరం.

***Auto Hide :*** దీన్ని Always on Top తో కలిపి ఉపయోగిస్తే మనం విండో పెద్దది చేసినపుడు ఇది కింది వైపు వెళ్లిపోతుంది (కనిపించదు). అయితే మౌస్ పాయింటర్‌ను కింది వైపు తీసుకెళితే వెంటనే పైకి వస్తుంది (Pops Up) అలా కాకుండా కేవలం Auto Hide మాత్రమే ON చేసి Always on Top Off చేస్తే టాస్క్ బార్ కనపడదు. మళ్లీ మనకు Task bar కనపడాలంటే Alt + Esc లేదా Alt + Tab నొక్కాలి.

***Show small icon in start menu :*** Start up మెనూలోని Icons ను చిన్నవిగా చూపిస్తుంది. దాంతో మెనూ సైజు తగ్గిపోతుంది.

***Show Clock :*** ఇది ON లో వుంటే కుడి చివర Clock కనిపిస్తుంది. ఇది Time చూపిస్తుంది కనుక Always on Top ఆప్షన్‌లో ఉపయోగించటం మంచిది. టాస్క్‌బార్‌ను లాక్కెళ్లి పైన కూడా పెట్టుకోవచ్చు! డెస్కటాప్ పై ! ట్రై చెయ్యండి.

టాస్క్‌బార్ డైలాగ్ బాక్స్‌లో రెడు Tab గురించి చెప్పాలంటే దీన్ని ఉపయోగించి Start Menuకు కొత్త Programms add చెయ్యవచ్చు. దీని గురించి తర్వాత వివరంగా చర్చించటం జరుగుతుంది.

## విండోస్'95లో Programs రన్ చెయ్యటం

ఇంతవరకు విండోస్'95 గురించి కొన్ని ప్రాథమిక విషయాలు చర్చించటం జరిగింది. దాని ఉద్దేశ్యం ఏదైనా అప్లికేషన్ లేదా ప్రోగ్రాంను రన్ చేసేముందు కొంత అవగాహన వుండటం వల్ల మరింత ఉపయోగకరం అని. విండోస్ ఆధారిత ప్రోగ్రాంలు లేదా అప్లికేషన్‌లు ఏవైనా సరే ఇంచుమించు ఒక రకంగా పనిచేస్తాయి ఇక్కడ గుర్తుంచుకోవాలి. మామూలుగా ఒక ప్రోగ్రాంను స్టార్ట్ చేసే లేదా రన్ చేసే పద్ధతి ఇలా వుండవచ్చు.

Start → Programs → Accessories → Program

అయితే అన్ని ప్రోగ్రాములు స్టార్ట్‌మెనూ లిస్ట్ కాకపోతే ఒక సమస్య. అందుకే ఏదైనా ప్రోగ్రాంను రన్ చెయ్యాలంటే ఇతర మార్గాలు కొన్ని...

- డెస్కటాప్‌పై ఆ ప్రోగ్రాంకు సంబంధించిన షార్ట్‌కట్‌ను సృష్టించుకోవటం.
- స్టార్ట్‌మెనూలో రన్ ఆప్షన్ ద్వారా ప్రోగ్రాంను రన్ చెయ్యటం.
- C: లేదా D: డ్రైవ్‌ను బ్రౌస్ చేసి ప్రోగ్రాంను రన్ చెయ్యటం

## డ్రైవ్‌లు-ఫోల్డర్‌లు Browse చెయ్యటం

ఇందులో మొదట My computer object ను Double click చేస్తే ఇలా వస్తుంది.




అందులో మళ్లీ ఒక డ్రైవ్ (C:/D:/E:) సెలెక్ట్ చేసుకుని మళ్లీ Double click చెయ్యాలి. అందులో నుంచి ప్రోగ్రాంను డబుల్‌క్లిక్ చేస్తే ఆ ప్రోగ్రాం రన్ అవుతుంది. ఇది కొంచెం బోరింగ్ వ్యవహారం. ఇలాంటి పని అరుదుగానే చెయ్యాల్సిన అవసరం వుంటుంది. ఎన్నో విండోలు open చెయ్యాల్సి రావచ్చు.

## *Shortcuts :*

ఇది ప్రోగ్రాంను రన్ చెయ్యటానికి లేదా స్టార్ట్ చెయ్యటానికి సులువైన పద్ధతి. మనకు అవసరమైన - లేదా తరచూ ఉపయోగించే ప్రోగ్రాంను objectగా desktop మీద సృష్టించటమే.

Accessories విండోలో నుంచి మనకు కావాల్సిన ప్రోగ్రాంను right click చేసి drag చేయాలి. (Desktop లో ఖాళీ స్థలానికి) అపుడు ఇలా వస్తుంది.




అందులో నుంచి Create Shortcut(s) here. ఆప్షన్‌ను ఎన్నుకుంటే అక్కడ object create అవుతుంది. మనకు కావాల్సినపుడు దాన్ని నేరుగా double click చేస్తే చాలు. అలా ఎన్ని shortcuts అయినా Desktop మీద పెట్టుకోవచ్చు. Shortcutsని Desktop మీద నుంచి తీసేయాలంటే సులువే. ఆ object మీద right click చేసి Delete ఆప్షన్‌ను ఎన్నుకోవటమే.

RUN ఆప్షన్ : Start Menuలో నుంచి RUN ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకుంటే RUN డైలాగ్ బాక్స్ వస్తుంది. Open అన్నచోట మనకు కావాల్సిన ప్రోగ్రాం పేరు type చెయ్యటమే. ప్రోగ్రాం పేరు తెలియకపోతే అందులో నుంచి Browse బటన్‌ను సెలెక్ట్ చేసుకుని మనకు కావాల్సిన ప్రోగ్రాంను సెలెక్ట్ చేసుకుని click చెయ్యాలి.




డాక్యుమెంట్స్ ఓపెన్ చెయ్యటం : Start Menuలో Documents ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకుని అపుడు వచ్చే Cascade మెనూలో నుంచి కావాల్సిన document ను సెలెక్ట్ చేసుకుని పనిచేసుకోవటమే. Ms-Word లాంటి సాఫ్ట్‌వేర్‌లోనైతే నేరుగా ప్రోగ్రాంకు వెళ్లి అక్కడ File Menu లో నుంచి Open document సెలెక్ట్ చేసుకోవటమే. Ms-Word అన్నది Ms-Office లో భాగం. దీని గురించి తర్వాత వివరంగా చర్చించటం జరుగుతుంది.

## DOS అప్లికేషన్‌లు రన్ చెయ్యటం

డాస్ application ప్రోగ్రాంలు Win'95 లో కూడా రన్ అవుతాయి. కొన్ని డాస్ ఆధారిత ప్రోగ్రాములు ఇంకా వాడుతున్నవారి సౌలభ్యం కోసం ఈ ఆప్షన్‌ను పొందుపరిచారు. Start Menu ద్వారా Ms-Dos ప్రాంప్ట్ (లేదా నేరుగా షార్ట్‌కట్ వుంటే Double click చెయ్యాలి)ను Double click చేస్తే ఇలా వస్తుంది.




దీన్ని ఉపయోగించి Dos ప్రోగ్రామును రన్ చెయాఽియలి. పని పూర్తయింతర్వాత prompt దగ్గర Exit అని type చేస్తే మళ్లీ Windows లోకి వచ్చేయవచ్చు. డాస్ ప్రాంప్ట్ విండో Tool Bar లో వివిధ బటన్స్ వున్నాయి. వాటి గురించి తెలుసుకోవాల్సిన అవసరం పెద్దగా లేదని చర్చించటం లేదు.

WORD PAD : నిజానికి ఇపుడు ఈ అప్లికేషన్‌ను ఉపయోగిస్తున్న వారు తక్కువే. ఎందుకంటే దీని స్థానంలో Ms-Word వచ్చేసింది. అయితే అది విండోస్ 95తో పాటు రాదు. దాన్ని ప్రత్యేకంగా కొనాలి. Word-Pad మాత్రం Windows '95 తో పాటు వస్తుంది. ఇందులో డాక్యుమెంట్స్ చేసుకోవచ్చు.

Word-Pad ను Double click చేస్తే ఇలా వస్తుంది.




Word-Pad గురించి వివరంగా చెప్పటం వల్ల పెద్దగా ఉపయోగం వుండదు. ఎందుకంటే Ms-Word ఎలాగూ వుంది. అయితే Word-Pad ను ఉపయోగించి ఓ Document type చేసి వివిధ ఆప్షన్స్‌ను test చేసి చూడండి. ఏమీ కాదు. మహా అయితే మీరు type చేసిన document మాయమవుతుంది. అంతే. విరివిగా experiments చేసి చూడండి. (ఇంకావుంది)



హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్....

ఇటీవల ఓ సాయంత్రం బిస్మిల్లా ఖాన్ కచేరికి ముస్తాబయింది. ఆహూతులతో ఆ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

కచేరి మొదలయింది. షెహనాయ్ స్వరాలు గాలిలో మంద్ర మధురంగా తేలివస్తున్నాయి. ఆ మార్దవానికి, మాధుర్యానికి పులకించిందా అన్నట్టు ఉన్నట్టుండి ఆకాశం కరిగింది. బోరున జల్లు కురిసింది. ప్రేక్షకుల్లోంచి ఇద్దరు లేచివచ్చి ఖాన్‌సాబ్ తడవకుండా గొడుగుపట్టారు. కచేరిని కొనసాగించాల్సిందిగా ఆ వర్షంలోనే కోరారు. ఆ అభిమానానికి ఖాన్‌సాబ్ తడిసి ముద్దయ్యారు. తనపట్ల ఇంత అభిమానాన్ని ప్రేమని కురిపిస్తున్న శ్రోతలకు రసానందం కలిగిస్తానని ఆ వర్షంలోనే కచేరి సాగించారు.

# భారతరత్నాలు

టి. ఉడయవర్లు

## షెహనాయీ కా షెహన్‌షా

# బిస్మిల్లాఖాన్

షెహనాయ్‌పై పలికించలేని పలుకు లేదనీ, వినిపించలేని విన్యాసం లేదనీ, ఒప్పించలేని గమకం లేదని నిరూపించిన ఉస్తాదోంకా ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్. కేవలం ఒక పక్క వాయిద్యంగా చూసే షెహనాయ్‌ని - సితార్, సరోద్‌లాగా ప్రధాన వాయిద్య స్థాయికి తీసుకొచ్చి - షెహనాయ్ అంటే బిస్మిల్లా ఖాన్, బిస్మిల్లా ఖాన్ అంటే షెహనాయ్ అని నిరూపించారు. దేవాలయ ప్రాంగణాలకు మాత్రమే పరిమితమయిన షెహనాయ్ వాయిద్యాన్ని సంగీత వేదికలపైకి తెచ్చి సంగీతం తెలియనివారికి సైతం దాని మధురిమను రుచి చూపించారు. భారతరత్న పురస్కారంతో బిస్మిల్లా ఖాన్‌ను సత్కరించిన ప్రభుత్వం తనను తాను గౌరవించుకుంది.

బీహార్‌లోని డూమ్రాన్ జిల్లాలో 1916 మార్చి 21న బిస్మిల్లా ఖాన్ జన్మించారు. 14వ ఏటనే సంగీత జైత్రయాత్ర ప్రారంభించారు. ఇవాళ 84 ఏళ్ళ పండు వయసులోనూ ఆ నాటి ఉత్సాహం, ఊపు, ఆరాధన నిండుగా కనిపిస్తాయి. ఖాన్‌సాబ్ తండ్రి పైగంబర్ బక్ష్. తాత హుస్సేన్ బక్ష్. అంతా షెహనాయ్ వాద్య కళాకారులే. షెహనాయ్ ఖాన్‌సాబ్‌కు వారసత్వంగా అందిన అపురూప సంపద. డూమ్రావ్‌లోని బీహారీజీ ఆలయంలో ఆరవ ఏటన ఆయన సాధన మొదలయింది.

బిస్మిల్లాఖాన్ అప్పట్లో తిండికి ఎన్నో తిప్పలు పడ్డాడు. అప్పుడే ఆయన తల్లి మరణించింది. మేనమామ అలీబక్ష్ ఖాన్‌తో బిస్మిల్లాఖాన్ వారణాసి చేరారు. షెహనాయ్ సాధనకు మేనమామ ప్రోత్సాహం దొరికింది. వారణాసిలోని గంగా తీరంలో తరంగాల హోరులో ఖాన్‌సాబ్ షెహనాయ్ స్వరసాధన స్వేచ్ఛగా సాగింది. మంగళమాయ, విశ్వనాధ ఆలయాల్లో గంటల కొద్దీ కూర్చుని షెహనాయ్ పలికించేవారు. "గూంజ్ ఉఠీ షెహనాయ్" చిత్రంలో బిస్మిల్లాఖాన్ షెహనాయ్ స్వరఝరి కలకాలం గుర్తుంటుంది. లత "తేరేసుర్ ఔర్ మేరీ గీత్" లో మంద్రమధురంగా వినిపించే షెహనాయ్ స్వరాలు నిజంగా చెవులకు పసందైన విందు. "సనాధ్ అపనే" చిత్రంలో కూడా షెహనాయ్ స్వరాలు వినిపిస్తాయి. దేశంలో ఆయన కచేరి నిర్వహించని చోటులేదు. అమెరికా, తూర్పు ఆసియా తదితర అనేక దేశాల్లోను చేసిన కచేరీలకు లెక్కలేదు. బిస్మిల్లాఖాన్ షెహనాయ్ స్వరమాధుర్యానికి మంత్రముగ్ధులైన కొందరు అమెరికన్లు "ఖాన్‌సాబ్ మీరు అమెరికాలో స్థిరపడండి, సకల సౌకర్యాలు కల్పిస్తాం" అని సాదరంగా ఆహ్వానించారు. దీనికి ఆయన వెంటనే స్పందిస్తూ : "మీరు కల్పించే వసతులు, సౌకర్యాలు ఇక్కడి మాదిరిగానో లేక ఇంతకంటే మెరుగ్గానో వుండవచ్చు కానీ, ఇక్కడి గంగమ్మతల్లిని మాత్రం అక్కడకు తేలేరు కదా!" అని సున్నితంగా తిరస్కరించారు - 'భారతరత్న' బిస్మిల్లాఖాన్.



పుట్టతేనె జుర్రుకుంటున్నట్టు, మల్లెలు మత్తు పరిమళాల్ని చల్లుతున్నట్టు, వెన్నెల సంద్రంలో ఉరకలేస్తున్నట్టు...

ఆమె పాట విన్నప్పుడు కలిగే అనుభూతిని ఏమని చెప్పగలం. ఆమె గొంతు వేనవేల పాటలై, దేశాల హద్దుల్ని దాటి ప్రతి హృదిని కదిలించింది. ఆమె గానకోకిల లతా మంగేష్కర్ అని వేరే చెప్పాలా. ఆలస్యంగానైనా ప్రభుత్వం స్పందించింది. భారతరత్న పురస్కారంతో నిలువెత్తు పాటకు సత్కారం చేసింది. 1929లో నటగాయక, సంగీత విద్వాంసుడు దీనానాథ్ మంగేష్కర్ దంపతులకు పుట్టిన తొలిబిడ్డే ఇప్పటి సంగీత సామ్రాజ్ఞి లతా మంగేష్కర్. 13వ ఏట తండ్రి దీనానాథ్ అప్పుల ఊబిలో కూరుకుపోయి అకాల మరణం చెందారు. దాంతో కుటుంబ పోషణ బాధ్యత ఇంటికి పెద్దదైన లతపై పడింది. చెల్లెల్లు మీనా, ఆశ, ఉష తమ్ముడు హృదయనాథ్ అప్పటికి చిన్నవాళ్ళు. వారిని పోషించేందుకు సినిమాల్లో

## కమ్మటిపాటకు శాశ్వత చిరునామా

# లతా మంగేష్కర్

వేషాలకు, పాటలకు అన్వేషణ మొదలైంది. తండ్రి చనిపోయిన పదిరోజుల్లోనే ముఖానికి రంగు పూసుకుంది. మొదట్లో నటిగానే కొంతకాలం రాణించింది. 1942లో పెహలీ మంగళగౌర్, ఆ తరువాత చిముక్ల సంసార్, మజేబాల్, గజ్‌బావ్, బడీమా, జీవనయాత్ర, సుభద్ర, మందిర్ తదితర సినిమాల్లో నటించింది. మరోవైపు పాటలకోసం తీవ్రంగా ప్రయత్నించింది. లతగొంతు పీలగా ఉందని, పాటకు పనికిరాదన్నారు సినిమా నిర్మాతలు మొదట్లో. 1942లో ఓ మరాఠీ చిత్రంలో ఆమె తొలిపాట పాడింది. దాన్ని రికార్డ్ చేశారు కూడా. కాని చివరికి దానిని తొలిగించారు. తర్వాత అవకాశాలు రాకున్నా తన ప్రయత్నాలు మానలేదు లత. 1947లో నటనకు స్వస్తి చెప్పి నేపథ్యగాయనిగా "ఆప్‌కి సేవామే" అనే హిందీ చిత్రంతో కొత్త జీవితం ప్రారంభించింది.

గులామ్ హైదర్ అనే ప్రఖ్యాత సంగీత దర్శకుడి 'మజ్‌బూర్' చిత్రంలో లత పాట తాలూకు మాధుర్యం లోకానికి తెలిసింది. 'దిల్ మేరా తోడా' అనే పాట సూపర్ హిట్ అయ్యింది. 'మహల్' సినిమాలోని 'ఆయేగా ఆనేవాలా' అనే పాట ప్రతినోటా ప్రతిధ్వనించింది. 'అందాజ్'లో నౌషాద్, 'బరసాత్'లో షంకర్ జైకిషన్ లతతో పాడించిన పాటలన్నీ అజరామరంగా నిలిచిపోయేవే. ఆ తరువాత 'బజార్', 'బడే బెహన్', 'దులారీ', 'లాహోర్' సినిమాల్లోని పాటలన్నీ ఒకే ఏడాదిలో సూపర్ హిట్ కావడంతో ఆమె దరిదాపుల్లోకి మరో గాయని చేరలేకపోయింది. అప్పటినుండి జైత్రయాత్ర ప్రారంభించిన లతా మంగేష్కర్ ఆరుదశాబ్దాలుగా అగ్రస్థానాన్ని నిలుపుకోవటం రికార్డు. ఇప్పటికీ 70 ఏళ్ళ వయసులోనూ 17 ఏళ్ళ హీరోయిన్లకు సైతం ఆమెగొంతు అతికినట్టు సరిపోవడం అద్భుతం. సంస్కృతం, హిందీ, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ, అస్సామీ, ఒరియా, తమిళం, కన్నడం, మలయాళం... ఇలా దాదాపు అన్ని భారతీయ భాషల్లోనేకాక సింహళం, నేపాలీ భాషల్లోనూ 35 వేలకు పైగా పాటలు పాడి రికార్డు సృష్టించింది. 'హమ్ ఆప్‌కే హై కౌన్' సినిమా లత పాటలతో దుమ్ము రేపడం ఇటీవల రికార్డు. తెలుగులో 'సంతానం' చిత్రంలో 'నిదురపోరా తమ్ముడా...' పాట అందరికి పరిచితమే. సినిమా పాటలే కాక మీరా, సూర్‌దాస్, తులసీదాస్, కబీర్ భజనలు ఇంటింటి గీతాలయ్యాయి. గాలిబ్ గజల్లు, రవీంద్ర సంగీతం ఆమెకు వన్నెతెచ్చాయి. ఈ మధ్య 'వందేమాతరం' ఆల్బంలో 'మేరే వతన్ కే లోగో' పాటకి కళ్ళు చెమర్చకుండా ఉండలేం. ఇప్పటి భారత రత్నతో సహా దాదాసాహెబ్ ఫాల్కే, పద్మవిభూషణ్ లాంటి అత్యున్నత పురస్కారాలు పొందిన లతకి ఇప్పటికి వచ్చిన ఇతర అవార్డులకు లెక్కే లేదు.


GOOD NEWS శుభవార్త GOOD NEWS
2nd ANNIVERSARY
FREE OFFER
SPOKEN ENGLISH
COMPUTERS
FRIENDS' TM
Advanced English.
Communication Skills.
OPP. BUS DEPOT, DSNR, Hyd. ✆: 4161336

SRI SAI DENTAL CLINIC
DR. K. RAM DASS B.D.S.(CAL.) (RTED.)
DENTAL SURGEON
Clinic: H.No.1-7-101, Ayyappa Road, Behind Raghavendra Nursing Home, ECIL Post, KAMALA NAGAR, Hyd - 62.
10 A.M. to 1 P.M.
Res: Sri Sai Palace, Flat No.404, Maheshnagar, ECIL Post, Hyd-62.
☎ : 7121510
SUNDAYS: 5 P.M. to 8 P.M.
BY APPOINTMENT ONLY

CATHOLIC BANK
(The Catholic Co-op. Urban Bank Ltd.)
1-7-659/26, Ramnagar, Hyderabad - 500 020. Phone No. 7621787
On the occasion of our Second Anniversary on 28th November, 2000
gives you an opportunity to earn 1/2% more interest on term deposit for 6 months and above for Rs. 50,000 but less than Rs. 1 lakh and 1% more interest on term deposit of Rs. 1 lakh and above made between 28-11-2000 and 31-3-2001
For more details contact us during office hours
Double your money in 54 months - Triple your money in 86 months
Gold Loans Rs. 300 per Gram @ 18% P.A.
Lockers Available
Deposits upto Rs. 1 lakh are insured with the Deposit Insurance & Credit Guarantee Corporation of India.
NO DEDUCTION OF TAX AT SOURCE FOR SHAREHOLDERS
"Let your money grow with us" - "Save today for a better tomorrow"
"Money matters but what matters more is our relationship"

S.S. STICHERS
SPECIALIST IN LADIES WEAR
96/A, 1st Floor, Parklane,
Secunderabad - 500 003.

MANISH Travels
Domestic Air Ticketing for
Indian AirLines and Jet Airways
10, Red Cross Society Bldgs., St.Marry's Road, Sec'bad - 3.
Contact : 7700626/7705174

TRINITY BANK
T.C.U.B.
(Trinity Co-operative Urban Bank Ltd.)
(Regd. No. TB470) Plot No.11, Near Sushma Theatre,
Vanasthalipuram, Hyderabad - 500 070.
Ph : 4026511, 4120835 ; Pager : 9628 929588
TRINITY FACILITIES
Safe deposit lockers • Nomination facility to deposits • Deposits are insured by DICGC • Banker cheques & Demand Drafts facility • TRINITY cash certificate facility • TRINITY daily deposit • Buying / selling Foreign exchange.

TRINITY DEPOSIT SCHEMES

| Name of the Deposit | Rate of Interest |
|---|---|
| * TRINITY Saving Deposit A/c | 5.5% p.a. |
| * TRINITY Current Deposit A/c | 0.5% p.a. |
| * TRINITY Term Deposit Schemes | |

TRINITY Fixed Deposit Scheme (TFDS) :

| | |
|---|---|
| 30 days to less than 180 days | 10.5% p.a. |
| 180 days to less than 1 year | 12.5% p.a. |
| 1 year to less than 2 years | 14.5% p.a. |
| 2 year to less than 3 years | 15.5% p.a. |
| 3 year to less than 5 years | 16% p.a. |
| 5 year and above | 16.5% p.a. |

TRINITY SALIENT FEATURES
* PERSONALISED SERVICE
* Service at your door step by a phone call ; you need not come to the Bank to open an A/c or make a deposit, TRINITY sends its staff to you.
* On all deposits TRINITY offers '1%' extra interest to Senior Citizens and Pensioners.
* Simplified procedures and prompt and courteous service.
* TRINITY offers attractive rates of interest on all kinds of deposits.
* TRINITY has extended banking hours.

RAJDHANI
MINERAL WATER & SODA
(RIVERSE OZONISED)
SODA
1.5 Ltr.
750 ML
400 ML
350 ML
MINERAL WATER
1 Ltr.
Contact
RAJDHANI FOODS & BEVERAGES
1-2-410/1/6, Gaganmahal, Domalguda,
Hyderabad - 29. ☎ : 3221254
WANTED
AREAWISE DISTRIBUTORS

SAPTAGIRI
SCOOTER WORKS
SPECIALISTS IN: BAJAJ CHETAK, LML, BAJAJ SUPER, PRIYA, LUNA, T.V.S. CHAMP, SUNNY, SCOOTY & ETC.
# 1-7-387/1, Bakaram Road, Musheerabad, Hyd - 48. ☎ 7667166

కేవలం మహిళలచే నిర్వహించబడుచున్న
భావన వివాహ వేదిక
బ్రాహ్మణ/కమ్మ/కాపు/రెడ్డి/వెలమ/
పద్మశాలి/గౌడ/యాదవ/ఆర్యవైశ్య/క్షత్రియ/
విశ్వ బ్రాహ్మణ/ముదిరాజ్/ఎస్.సి. &ఎస్.టి./
క్రిష్టియన్/ముస్లింలకు ప్రత్యేక వేదికలు కలవు.
ఇతర కులములవారు వితంతు/విడాకులు
పొందిన వారు కూడా సంప్రదించండి.
హైదరాబాద్ బాలానగర్ రోడ్, హైదరాబాద్-37. ఫోన్ : 3771252, 3775672
విజయవాడ బ్రాంచి శాంతి థియేటర్ ఎదుట, గాంధీనగర్, విజయవాడ-3. ఫోన్ : 573648
విశాఖపట్నం బ్రాంచి ఎరుకుమాంబ గుడి పక్కన, దొండపర్తి, విశాఖపట్నం - 16. ఫోన్ : 596714



### ప్రాణరక్షక మందులపై బడా కంపెనీల గుత్తాధిపత్యాన్ని బద్దలుకొట్టి

### బయోటెక్నాలజీలో భారత్ సత్తాను చాటిన 'శాంతా బయోటిక్స్' సారధి

# కె. వరప్రసాద రెడ్డి

దాదాపు పదేళ్ల క్రితం...

ఆయన అతిసామాన్యుడే... మనలో చాలా మందిలాగే. కాని ఓ మల్టీనేషనల్ కంపెనీ చేసిన అవమానం ఆయన అహాన్ని రెచ్చగొట్టింది. అప్పుడాయన ఎలాంటి వనరులు, అండదండలు లేని ఒంటరి అయినా అవమానాన్ని దిగమింగి చేతులు ముడుచుకు కూర్చోలేదు. కొండను ఢీకొన్నంత సాహసం చేశాడు. బొత్తిగా తెలియని బయోటెక్నాలజీ రంగంలోకి దిగి అద్భుతాలు సృష్టించాడు.

మీ పూరిండియాకి ఏమీ చేతకాదని ఎద్దేవా చేసిన ఆ బడా కంపెనీకి - మాడు పగిలేట్టు బదులిచ్చాడు. జన్యు పరిశోధనలు ప్రాథమిక స్థాయిలో కూడా లేని మనదేశంలో-పూర్తిగా స్వంత టెక్నాలజీతో-మొట్టమొదటి జెనెటిక్ వాక్సిన్‌ను తయారు చేసి బడా కంపెనీలనే ఖంగు తినిపించాడు. ఆ వాక్సిన్ పేరు షాన్‌వాక్-బి.

కోట్లాది మంది పేద జనానికి అది నిజంగా వరప్రసాదమైంది. హెపటైటిస్-బి వ్యాధి నుంచి రక్షించే ఆ ప్రాణ రక్షక వాక్సిన్‌పై ఓ బహుళ జాతి కంపెనీ గుత్తాధిపత్యాన్ని బద్దలుకొట్టి పేదల అందుబాటులోకి తెచ్చాడు. ఇప్పుడాయన అసామాన్యుడు. ప్రపంచానికి తెలిసినవాడు. భారతదేశంలో బయోటెక్నాలజీ రంగానికి కొత్తబాటలు పరిచినవాడు.

ఆయనపేరు కోదూరి ఈశ్వరి వరప్రసాద రెడ్డి.

ఏడేళ్లక్రితం ఉస్మానియా యూనివర్శిటీలోని ఓ చిన్న గదిలో కేవలం ముగ్గురు సైంటిస్టులతో మొదలైంది - ఆయన పరిశోధనా సంస్థ 'శాంతా బయోటెక్'. ఇప్పుడది దేశంలోనే కాక ప్రపంచంలోనే ఓ అగ్రశ్రేణి బయోటెక్ కంపెనీగా గుర్తింపు పొంది ప్రకంపనలు సృష్టిస్తోంది.

ఒక ఒంటరి సాహసికుడి పట్టుదలకీ, విల్‌వర్‌కీ విజయసంకేతం - శాంతా బయోటెక్. వరప్రసాద రెడ్డి తన విజయప్రస్థానంలో దాటిన క్లిష్టమైన మజిలీలు అన్నీ ఇన్నీ కాదు.

## ఉన్నతోద్యోగం వదిలేసి

'శాంతా బయోటెక్' వంటి ఓ ప్రపంచ స్థాయి సంస్థని సృష్టించగలనని - పదేళ్లక్రితం బహుశా వరప్రసాద రెడ్డి కూడా ఊహించివుండడు. బయోటెక్నాలజీ గురించి, జన్యు పరిశోధనల గురించి ఆయనకు బొత్తిగా తెలీదు. ఆయన చదివింది ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్. మొదట్లో డిఎల్‌ఆర్‌ఎల్ రక్షణ రంగ సంస్థలో చేరారు. ఉపగ్రహ గూఢచర్య విభాగంలో నిక్షేపం లాంటి ఉన్నతోద్యోగం. 1985లో ఆ ఉద్యోగాన్ని వదులుకొని హైద్రాబాద్ బ్యాటరీస్ అనే సంస్థలో చేరారు. రక్షణ రంగానికి అవసరమైన బ్యాటరీలు సరఫరా చేసే సంస్థ అది. ఆ ఏడాది 18 లక్షలున్న ఆ సంస్థ టర్నోవర్ ఐదేళ్లు తిరిగేసరికి ఐదు కోట్లకు చేరింది. కాని వంన్త భాగస్వామితో డబ్బు విషయంలో విభేదాలొచ్చాయి. ఆ భాగస్వామి రెడ్డిని మోసం చేశాడు.

దాంతో ఆ బ్యాటరీ ప్రాజెక్టుని వదిలేశాడు. భవిష్యత్తు గురించి నిర్దిష్టమైన ఆలోచనేదీ కొలిక్కి రాలేదు అప్పటికి. ఆ పరిస్థితిలో ఊహించని ఓ సంఘటన జరిగింది.

## వెంటాడిన ఒక ప్రశ్న

1991లో అమెరికాలో వున్న తన బంధువు దగ్గరికి వెళ్లాడు. వరప్రసాదరెడ్డి. జెనీవాలో డబ్ల్యూహెచ్ఓ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓ సదస్సుకు వెళ్లే పనిలో వున్నాడు ఆ బంధువు. ఆయనతోపాటు రెడ్డి కూడా హాజరయ్యాడు ఆ సదస్సుకి. హెపటైటిస్-బి గురించి తొలిసారి విన్నదీ - అదెంత ప్రాణాంతకమైన జబ్బో ఆయనకు తెలిసిందీ అప్పుడే.

వాక్సిన్‌తో వ్యాధి రాకుండా నివారించడమే తప్ప - చికిత్స లేని జబ్బు అది. ఒక్క ఇండియాలోనే దాదాపు ఐదు కోట్ల మంది హెపటైటిస్ - బి 'వాకింగ్ అణుబాంబులు'న్నట్టు అంచనా. ఎయిడ్స్ కంటే వేగంగా విస్తరించే ఈ జబ్బుకి ఏటా మూడున్నర లక్షల మంది బలవుతున్నట్టు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ఈ ముప్పు తప్పాలంటే వాక్సిన్ ఒక్కటే పరిష్కారం. అప్పటికి స్మిత్‌క్లైన్ బీచామ్ మల్టీనేషనల్ కంపెనీ తయారు చేసే వాక్సిన్ మాత్రమే మార్కెట్లో వుంది. కాని దాని ధర 3,800 రూపాయలు.

వాక్సిన్ మార్కెట్లో వున్నా - దానికి అంత ధర పెట్టే తాహతు లేక పేదజనం నిష్కారణంగా బలౌతున్నారన్న చేదు నిజం రెడ్డిని కలిచివేసింది. స్వదేశం తిరిగి వచ్చాక హెపటైటిస్-బి కి సంబంధించిన పుస్తకాలు విపరీతంగా చదివాడు.

'ఇండియా ఎందుకీ వాక్సిన్‌ను తయారు చేయలేదు? పేదజనం భరించే ధరకు ఎందుకు అందిచలేదు?' ఈ ప్రశ్న రెడ్డిని వెంటాడ సాగింది.

ఆ ప్రశ్నే మనదేశంలో బయోటెక్నాలజీ చరిత్రకు కొత్త నాంది పలికింది.

## ఒక అవమానం

వాక్సిన్ తయారీకి రెడ్డి ముందు రెండే మార్గాలున్నాయి.

టెక్నాలజీని బయటి నుంచి కొనుగోలు చేయడం లేదా స్వంతంగా తయారు చేయడం. మొదటి దానికే మొగ్గు చూపాడు ముందు. కాలిఫోర్నియాకు చెందిన ఓ ప్రసిద్ధ బయోటెక్ సంస్థని సంప్రదించాడు. వాక్సిన్ తయారీ టెక్నాలజీ కోసం. కాని రెడ్డిని చూసి నవ్వుకున్నారు ఆ సంస్థ టెక్నోక్రాట్‌లు. మనదేశం గురించి వెటకారంగా మాట్లాడారు. మన సైంటిస్టుల సత్తాను ఎద్దేవా చేశారు.

"... దీనికి ఎంత లేదన్నా 100 మిలియన్ డాలర్లు ఖర్చవుతుంది... ఇంత వ్యయాన్ని ఇండియా లాంటి ఓ వర్ధమాన దేశం భరించగలదా? అసలు ఈ టెక్నాలజీని అర్థం చేసుకునే సత్తా మీ భారతీయ సైంటిస్టులకి వుందా అని... అయినా మీకు వాక్సిన్ ఎందుకు? దేశంలో జనాభాకే కొదువ లేదుగా"

ఇదీ- ఆ మల్టీనేషనల్ కంపెనీ గడపలో రెడ్డికి ఎదురైన దారుణ అవమానం. ఆ సంఘటన ఆయన అహాన్ని దెబ్బకొట్టింది. ప్రతీకారంతో రగిలిపోయాడు.

మన సత్తా ఏమిటో చూపాలన్నదే ఆ క్షణంలో ఆయన ఏకైక లక్ష్యమైంది. వాక్సిన్‌ని స్వంతంగా, దేశీయ పరిజ్ఞానంతో తయారు చేయడమొక్కటే ఇప్పుడు ఆయన ముందున్న చివరి ప్రత్యామ్నాయం.

ఇది నిజంగా చందమామ కథలలో రాకుమారుడి సాహసం లాంటిదే... ఎందుకంటే!

## ఒక ప్రతీకారం

1991 నాటికి మనదేశంలో జన్యు పరిశోధనలు ప్రాథమిక స్థాయిలో కూడా లేవు. బయోటెక్నాలజీ అనేది పూర్తిగా కొత్తది. కొమ్ములు తిరిగిన కంపెనీలే ప్రవేశించేందుకు సాహసించని రంగం అది. ఈ పరిస్థితిలో వరప్రసాదరెడ్డి చేయబోయేది మామూలు సాహసం కాదు. హెపటైటిస్-బి తాలూకు జన్యువులను క్లోనింగ్ చేసేందుకు స్వంతంగా కొత్త టెక్నాలజీ కనిపెట్టాలి. దీన్ని విదేశీ కంపెనీ అందించి వుంటే రెడ్డికి వాక్సిన్ ఉత్పత్తి సులువయ్యేది.

కాని ఆ బడా కంపెనీ చేసిన అవమానాన్ని ఛాలెంజ్‌గా తీసుకున్నాడు. కాని అది అంత తేలిగ్గా జరిగేది కాదు. మొదటి సమస్య - ఎలక్ట్రానిక్ ఇంజనీర్ అయిన రెడ్డికి బయోటెక్నాలజీ గురించి బొత్తిగా తెలియదు. సైంటిస్టు కాడు. చేయాల్సిందేమో - ఏకంగా ఓ జన్యువును క్లోనింగ్ చేసే టెక్నాలజీ కనిపెట్టడం. దీని పెట్టుబడి కోట్లలో కావాలి. అసలే కొత్తగా మొదలు పెట్టాల్సిన ఆ పరిశోధనలో ఫలితాలు ఎన్నాళ్లకొస్తాయో తెలియదు. అసలు ఫలితం వస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. అందుకే సిసిఎంబి, ఐసిఎస్‌ఆర్ వంటి ప్రసిద్ధ సంస్థలకు చెందిన సైంటిస్టులే మొదట్లో రెడ్డి ఆలోచన విని పెదవి విరిచారు. ఫలితాలు సాధించే అవకాశం బొత్తిగా లేవన్నారు.

అయినా రెడ్డి నిరుత్సాహ పడలేదు. వాక్సిన్ కనిపెట్టి తీరాల్సిందేనన్న మొండి పట్టుదల మరింత పెరిగింది. ఆయనకెదురైన మొదటి సమస్య పెట్టుబడి. కుటుంబ ఆస్తులేవో అమ్మడం వల్ల, విదేశాల్లోని కొందరు మిత్రులు సాయం చేయడం వల్ల - 90 లక్షల దాకా సమకూర్చగలిగాడు. రెండవ సమస్య-పరిశోధకులు కావాలి. పరిశోధనకు అనువైన చోటు కావాలి? ఉస్మానియా యూనివర్శిటీలోని మాలిక్యులర్ బయోలజీ విభాగం సాయం కోరాడు. పరిశోధనకు అవసరమైన హంగులు సమకూరుస్తానని చెప్పి అధికారుల్ని ఎలాగో ఒప్పించాడు.

అలా - 1993లో ఉస్మానియా క్యాంపస్‌లోని మాలిక్యులర్ బయాలజీ విభాగంలో ఓ మామూలు కిచెన్ అంతకూడా లేని గదిలో - ముగ్గురు సైంటిస్టులతో ప్రారంభమైంది 'శాంతా బయోటెక్' పరిశోధన.

రెండేళ్లు గడిచాయో లేదో - యూనివర్శిటీ రాజకీయాల కారణంగా రెడ్డి బయటికి రావాల్సి వచ్చింది.

అదృష్టవశాత్తూ 1995లో సిసిఎంబి ఆయనకు సహాయపడింది. ఒక సైంటిస్టును పూర్తికాలం శాంతా బయోటెక్స్ కోసం పనిచేసేందుకు - రూల్స్‌ని సైతం సవరించింది. మరో వైపు హైద్రాబాద్ సమీపంలోని మేడ్చల్‌లో స్వంత రిసెర్చ్ యూనిట్ నిర్మాణం పూర్తికావడంతో 1997లో పరిశోధన అందులోకి మారింది.

అలా వాక్సిన్ పరిశోధనపై నాలుగేళ్లు గడిచాయి. మరో వైపు బ్యాంక్ ఆఫ్ ఒమన్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు, వరల్డ్ బ్యాంక్... ఇలా అనేక చోట్ల నుంచి సేకరించిన దాదాపు 25 కోట్ల పెట్టుబడి ఈ పరిశోధనకి కరిగిపోయింది. అయినా రెడ్డికి తన సైంటిస్టుల సామర్థ్యం, కృషి మీద గట్టి నమ్మకముంది. దివారాత్రాలు ఓ యజ్ఞంలా సాగిన పరిశోధనలు 1997లో ఫలించాయి. రెడ్డి ఆయన సైంటిస్టుల బృందం జెనెటిక్ ఛాలెంజ్‌ని విజయవంతంగా ఛేదించింది. అలా - దేశంలోనే జన్యుపరంగా మొట్టమొదటి వాక్సిన్ షాన్‌వాక్-బి తయారైంది.

మీకేదీ చేతకాదని ఎద్దేవా చేసిన విదేశీ కంపెనీలకి అలా చెంపపెట్టులా సమాధానమిచ్చి ప్రతీకారం తీర్చుకున్నాడు. సరిగ్గా ఈ దశలోనే ఆయనకి మరో పెద్ద సమస్య ఎదురైంది.

## బ్యూరోక్రసీకి ఎదురీది...

వరప్రసాద్ ఆయన సైంటిస్టుల బృందం సాధించిన ఈ అసమాన విజయం పట్ల - మన బ్యూరోక్రసీకి నమ్మకం కలగలేదు. అవినీతికీ, జాప్యానికీ అలవాటు పడ్డ అధికార యంత్రాంగాన్ని ఒప్పించేందుకు ముందుకంటే ఎక్కువ కష్టపడాల్సి వచ్చింది. ప్రభుత్వం తన ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంలో హెపటైటిస్-బి వాక్సిన్ చేర్చాలనుకుంటున్నట్టు ఓ రోజు పత్రికల్లో చదివి రెడ్డి ఆయాతగా ఢిల్లీలోని ఆరోగ్య శాఖ కార్యాలయంలో వాలాడు. అప్పటికి - ఈ వాక్సిన్‌పై స్మిత్‌క్లైన్ బీచామ్ కంపెనీదే గుత్తాధిపత్యం సాగుతోంది. దాని ధర 500ల పైనే. తాను కేవలం రూ.40కే అందిస్తానన్న రెడ్డి మాటల్ని అధికారులు పట్టించుకోలేదు. అక్కడి 'పర్సెంటేజీ'ల లెక్కలు రెడ్డికి రోత పుట్టించాయి.

ముందుగా అధికారులకు 'షాన్‌వాక్-బి' నాణ్యతపై నమ్మకం కుదర లేదు. ఇది 'మేడిన్ ఇండియా' కదూ? అందుకే బోలెడు సందేహాలు సహజంగానే పుట్టుకొచ్చాయి. హైద్రాబాద్‌లోని 'నిమ్స్'కు చెందిన ఎథిక్స్ కమిటీ ముందుగా పైలట్ స్టడీ చేయాలని సూచించింది. నాణ్యతను నిరూపించేందుకు ముందుగా ఈ వాక్సిన్‌ను తాను, తన కుటుంబ సభ్యుల మీదనే పరీక్షిస్తానని చెప్పాడు. రెడ్డిని తీవ్రంగా నిరాశ పరిచిన మరో విషయమేమంటే - ఈ వాక్సిన్ వాడి పిల్లల ప్రాణాలతో రిస్కు తీసుకోవద్దని లోలోపల ఓ సర్క్యులర్ కూడా జారీ అయింది. దీనిపై డ్రగ్ కంట్రోలర్, రెగ్యులేటరీ అథారిటీ అధికారులతో తీవ్ర స్థాయిలో తలపడ్డాడు రెడ్డి.

ఇలా ఎన్నో ఆటుపోట్ల తర్వాత - ప్రభుత్వం రెడ్డికి ఓ అవకాశం ఇచ్చింది. షాన్‌వాక్-బి ని ప్రయోగాత్మకంగా 22 సెంటర్లలో పరీక్షించారు. అద్భుతంగా పని చేస్తున్నట్టు తేలింది.

'షాన్‌వాక్-బి' అత్యుత్తమ నాణ్యతను ప్రఖ్యాత అంతర్జాతీయ జర్నల్ "వాక్సిన్" మార్చి 1999 నాటి సంచికలో ప్రచురించింది. అప్పటిదాకా రెడ్డిని తేలిగ్గా కొట్టిపారేసిన అధికారుల్లో కదలిక వచ్చింది. అలా ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ పొందిన 'షాన్‌వాక్-బి' పేరు దేశమంతటా మారుమోగిపోయింది.

షాన్‌వాక్-బి ధర (10 మంది పెద్దలు లేదా 20 మంది పిల్లల మల్టీ డోస్) రు.1800 కావడంతో దేశవ్యాప్తంగా ఏర్పాటైన క్యాంపుల్లో మామూలు జనం సైతం ఎగబడ్డారు. అదే - స్మిత్‌క్లైన్ బీచామ్ కంపెనీ వాక్సిన్‌కైతే అంతకు ముందు 4,200 చెల్లించాల్సి వచ్చేది.

షాన్‌వాక్-బి దెబ్బకి తన ఆధిపత్యానికి తిరుగు లేదనుకున్న స్మిత్‌క్లైన్ కంపెనీ వాక్సిన్ ధరని దాదాపు 1000 రూపాయలు తగ్గించుకోవాల్సి వచ్చింది.

1997లో మార్కెట్లోకి దూసుకొచ్చిన 'షాన్‌వాక్' కేవలం మూడేళ్లలో - 46 శాతం మార్కెట్ వాటాను చేజిక్కించుకుంది.

వరప్రసాద రెడ్డి విజయం - భారత్ బయోటెక్స్ వంటి అరడజను కంపెనీలకి స్ఫూర్తినివ్వడం మరో విశేషం. అలా చుక్కల్లో వున్న హెపటైటిస్-బి వాక్సిన్ ధర సామాన్యుడు భరించే స్థాయికి దిగింది.

'షాన్‌వాక్-బి' ఓ అపురూపమైన విజయం. 'భవిష్యత్తు బయోటెక్నాలజీదే' అని సైంటిస్టులు చెబుతున్న ఈ దశలో - దేశంలో ఈ రంగం అభివృద్ధికి కొత్త బాట వేసింది - శాంతా బయోటెక్స్.

వాక్సిన్ నిల్వచేయడానికి స్టోరేజీ సౌకర్యాలు లేవని మరో అభ్యంతరం లేవదీశారు. షాన్‌వాక్-బి మామూలు ఉష్ణోగ్రతను తట్టుకోగలదని 35° ఉష్ణోగ్రత దగ్గర నెలరోజులైనా నిల్వ వుండగలదని నిరూపించాడు.

## విజయపు మజిలీలు

షాన్‌వాక్-బి విజయంతో రెడ్డి ఇక వెనక్కి తిరిగి చూడలేదు. ఆ ఒక్క విజయంతోనే సంతృప్తి పడి తన ప్రయాణాన్ని ఆపలేదు. ఇంకా అనేక ప్రాణరక్షక ఔషధాలని పేదజనం భరించే స్థాయిలో అందించేందుకు నడుం బిగించాడు. వీటిలో కాన్సర్ చికిత్సలో ఉపయోగించే ఇంటర్ ఫెరాన్ ఒకటి ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్న ఈ మందు ఒక్క డోసు రూ.1800 వుంది. కాన్సర్ చికిత్సలో రోగికి వారానికి 10 డోస్‌లు ఇవ్వాలి. ఇలా కనీసం 50 వారాలు చికిత్స సాగితే ఖర్చు లక్షన్నర దాటుతుంది. సామాన్యుడికి అందుబాటులో లేని ఈ ఖరీదైన ఈ మందును రూ.400 లేదా అంత కంటే తక్కువ ధరకే అందివ్వాలన్నది రెడ్డి లక్ష్యం. హైద్రాబాద్‌లోని ఎన్.ఐ.ఎన్.లో క్లినిక్ ట్రయల్స్ జరిగేటప్పుడు కొందరు జీవకారుణ్య ఉద్యమకారులు కోతుల్ని వదిలేశారు. దీంతో పరిశోధన కుంటుపడింది. కోర్టు అనుకూలమైన తీర్పుతో ఇపుడు ఈ పరిశోధనలు చురుగ్గా సాగుతున్నాయి. అదే విధంగా హృద్రోగుల ప్రాణాల్ని రక్షించే స్ట్రెప్టోకినాస్ ధర మార్కెట్లో 2,500 వుండగా దాన్ని రు.600లకే అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంకా ఇలాంటి ప్రాణరక్షక మందుల జాబితాలో ఇన్సులిన్, హైపటైటిస్-సి వాక్సిన్, ప్రో విటమిన్-ఎ మొదలైనవి వున్నాయి.

ఇలా వ్యాపారానికి మానవీయ కోణాన్ని జోడించిన శాంతా బయోటిక్స్ కేవలం మూడేళ్ల కలంలోనే 34 కోట్ల టర్నోవర్ సాధించింది. మోర్గన్‌స్టాన్లీ అనే సంస్థ నిజానికి శాంతా బయోటెక్స్‌ని 725 కోట్ల విలువైన మహాసంస్థగా పేర్కొంది.

ఇలా చుక్కల్లో వున్న అనేక ప్రాణరక్షక మందుల ధరలను భూమ్మీదికి దించి, పేదలకు 'వరప్రసాద'మైన రెడ్డి గత ఏడాది ప్రతిష్ఠాత్మకమైన ఎర్నెస్ట్ అండ్ ఎంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నాడు. ఇంకా ఆలిండియా బయోటెక్ అవార్డు, నేషనల్ టెక్నాలజీ అవార్డు తదితర పురస్కారాలు ఆయన్ని వెతుక్కుంటూ వచ్చాయి.

మొదట్లో హెపటైటిస్-బి వాక్సిన్ పైనే దృష్టి కేంద్రీకరించిన రెడ్డి ఇపుడు శాంతాబయాటిక్స్ దేశంలోనే కాక ప్రపంచంలోనే ప్రముఖ బయోటెక్ సంస్థగా మారుతుంది. ఐదువందల కోట్ల విస్తరణ ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. న్యూయార్క్ స్టాక్ ఎక్సేంజ్‌లో ప్రవేశించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ఈ విధంగా - మనదేశాన్ని, మన సైంటిస్టుల సత్తాన్ని ఎద్దేవా చేసిన విదేశీ కంపెనీల పొగరణిచేందుకు, తెలియని రంగంలోకి ఒంటరిగా దిగి, ఆర్థిక సవాళ్ళను ఎదుర్కొని, బ్యూరోక్రసి అవినీతికి ఎదిరీది, భారత్‌ని బయోటెక్నాలజీ రంగంలో నిలిపిన ది ప్రౌడ్ ఇండియన్ - వరప్రసాద రెడ్డి.

- శేషు

## తొలితరం ఇండీపాప్ సెన్సేషన్

# సునీతా రావు




1990 ప్రాంతంలో దేశీయ సంగీతంలో ఓ కొత్త గాలి వీచింది.

కొంచెం స్వదేశీ, కొంచెం విదేశీ కలగలిపి ఇండిపాప్‌గా ఓ కొత్త బీట్ సంగీతాభిమానుల్ని ఊపేసింది.

ఓ ఇరవై ఏళ్ల తెలుగమ్మాయి ఒకే ఒక్క ఆల్బమ్‌తో ఇండిపాప్ మ్యూజిక్‌లో అమాంతం స్టారై కూర్చుంది.

ఆ అమ్మాయి సునీతారావు. ఆమె 'పరి' ఆల్బమ్ ఇండిపాప్‌లో ఓ సెన్సేషనల్ హిట్. అప్పుడే కాదు ఇప్పటికీ "పరీ హు మై... పరీ హు మై... మురేున చూనా" పాట సూపర్ హిట్టే.

మొన్నటికి - మొన్న సికింద్రాబాద్‌లో జరిగిన ఓ మెగామ్యూజిక్ షోలో సునీతారావు 'పరి' పాటకి, స్టేజిపై ఆమె స్టెప్పులకీ కుర్రకారు ఎలా ఊగిపోయారో చూస్తే తెలిసేది ఆ పాట మత్తేమిటో!

32 ఏళ్ల సునీతారావుకి అభిమానుల ఆదరణ ఏ మాత్రం చెక్కుచెదరలేదని రుజువైంది.

అలా 'పరి' ప్యారీగర్ల్‌గా పరిచయమైన సునీతారావు ఇండిపాప్ తొలితరం పాప్‌సింగర్స్‌లో టాప్‌స్టార్.

ఇప్పటికీ టీవీ ఛానెల్ల వెల్లువలో పాప్ గాయకులెందరు పుట్టుకొస్తున్నా సునీతారావుకి వున్న పాపులారిటీకి తిరుగే లేదు. ఇలా రచ్చ గెలిచిన సునీతది గుంటూరు జిల్లా బాపట్ల. ఆమె తండ్రి దేశిరాజు కృష్ణారావుది గుంటూరు. తల్లి కమలారావు. మంచి గాయని.

ఆమె కుటుంబం చాలా ఏళ్ల నుంచీ బొంబాయిలో స్థిరపడింది. సునీత పెరిగిందీ, చదువుకున్నదీ అక్కడే. ముంబయిలోని రాజరాజేశ్వరీ కళామందిర్‌లో కర్ణాటక సంగీతంలోనూ భరతనాట్యంలోనూ శిక్షణ పొందింది. అందుకే పాట, ఆట రెండూ అబ్బాయి. మరోవైపు ముంబయి ఇంటర్నేషనల్ స్కూల్‌లో, సెయింట్ జేవియర్స్ కాలేజీలో చదువు కొనసాగింది. కమ్మటి గొంతు, చూపుల్ని కట్టిపడేసే అందం, సంగీత నాట్యాల్లో శిక్షణ... ఆమెని పాప్ మ్యూజిక్ వైపు మళ్లించాయి. 'పరీ' ఆల్బమ్‌తో దేశానికి స్వదేశీ పాప్‌మ్యూజిక్ రుచిచూపించింది.

ధునా, కేసరియా, తలాష్, సెనోరిటా మొదలైనవి ఆమెకు బాగా పేరు తెచ్చిన మ్యూజిక్ ఆల్బమ్స్. తాజా ఆల్బమ్ 'అబ్‌కే బరస్'తో ఇప్పుడు మరో హిట్టు కొట్టింది.

సంప్రదాయ, ఆధునిక ధోరణుల కొత్త మేళవింపుగా కనిపించే సునీతారావుపై తల్లిదండ్రుల ప్రభావం గాఢంగా



వుంది. వారి ప్రోత్సాహమే తనని ఈనాటి 'పాంగ్ (స్టార్)డమ్'కి చేర్చిందని గర్వంగా చెబుతుంది.

"నేను పదహారణాల తెలుగమ్మాయిని. నాది బాపట్ల. విచిత్రమేమంటే ఒక్కసారైనా అక్కడికి వెళ్లే అవకాశం రావట్లేదు. కాని నేనెక్కడున్నా ఇక్కడి కట్టూ, బొట్టునీ, ఆవకాయ, గోంగూర ఘుమఘుమల్నీ మరిచే ప్రసక్తి లేదు" అంటుంది సునీతారావు.

---

### 2500 కోట్ల డాలర్ల పెప్సీ సామ్రాజ్యానికి ప్రెసిడెంట్, అమెరికన్ కార్పొరేట్ ప్రపంచంలో పవర్‌ఫుల్ ఉమెన్, కోట్లాదిమందితో 'యే దిల్ మాంగే మోర్' అనిపిస్తున్న

# ఇంద్ర కె. నూయి




డిసెంబర్ 2000... న్యూయార్క్.

శీతల పానీయాల రంగంలో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందితో "యే దిల్ మాంగే మోర్" అనిపిస్తున్న గ్లోబల్ జెయింట్ 'పెప్సీ' ప్రధాన కార్యాలయం.

ఓ వ్యాపార ఒప్పందం తాలూకు చర్చల్లో సీరియస్‌గా తలమునకలై వుంది 45 ఏళ్ల ఇంద్ర కె. నూయి - ఓ రోజు.

మధ్యలో ఫోన్ మోగింది. అత్యంత కాన్ఫిడెన్షియల్ కాల్ అది. అవతలి గొంతు పెప్సీ కంపెనీ సిఇఒ, చైర్మన్ స్టీలోశిసీది.

"నిన్ను పెప్సీ కంపెనీ ప్రెసిడెంట్‌గా నామినేట్ చేస్తున్నాం" అన్నది కాల్ సారాంశం. సంభ్రమంతో ఒక్క క్షణం ఆమెకి నోట మాటరాలేదు. కలో, నిజమో అర్థం కాలేదు. ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల ప్రజల్ని తీపినురగల తరగలతో ముంచెత్తుతున్న 2500 కోట్ల డాలర్ల పెప్సీ మహా సామ్రాజ్యమెక్కడ? ధనిక దేశాలు పూర్ కంట్రీగా ముద్రవేసిన భారత్ నుంచి, అదీ ఓ సాదా సీదా కుటుంబంలోంచి వచ్చిన నేనెక్కడ? అనుకుంది ఒక్క క్షణం. కాని పెప్సీ వంటి ఓ బడా బహుళజాతి కంపెనీకి దాదాపు అధిపతి లాంటి ప్రెసిడెంట్ పదవికి ఇంద్ర నూటికి నూరు పాళ్లూ అర్హురాలే.

వ్యాపార ప్రపంచంలో ఇంద్రకి పరిచయం అక్కర్లేదు. అమెరికన్ కార్పొరేట్ రంగంలో అత్యంత శక్తి యుక్తులు గల 50 మంది మహిళల్లో ఇంద్ర ఒకరు. ఇది మన భారతీయ మహిళ అన్న అభిమానంతో మనం ఇస్తున్న సర్టిఫికెట్ కాదు. ప్రఖ్యాత 'ఫార్ట్యూన్' పత్రిక కార్పొరేట్ రంగాన్ని వడబోసి తేల్చిన నిజమిది.

గ్లోబలైజేషన్ మంచి చెడ్డల గురించిన వాదనల్ని పక్కన బెడితే - మన భారతీయులు స్వయం ప్రతిభతో ఎంత ఉన్నత స్థాయికైనా చేరుకోగలరని ఇంద్ర నిరూపించింది.

దీక్ష, పట్టుదల, అంకిత భావం, చెమటోడ్చే తత్వం, అన్నింటికీ మించి సంస్థ పట్ల విశ్వసనీయత - ఇలా ఎన్నో అంశాల్ని బేరీజు వేశాకే - ఇంద్రకి ఇంతటి అరుదైన గౌరవాన్ని, బాధ్యతను అప్పగించింది పెప్సీ. సంస్థలో ఇప్పటిదాకా ఆమె స్థానం ఎలాంటిదంటే - చైర్మన్, సిఇఒకు నేరుగా రిపోర్ట్ చేసే ముగ్గురు, నలుగురు కీలక వ్యక్తుల్లో ఇంద్ర ఒకరు. ప్రస్తుత చైర్మన్‌కి ఎన్రిక్‌కి ఇంద్ర అంటే విపరీతమైన అభిమానం, గౌరవం. "పెప్సీ కంపెనీకి ఇంద్ర ఓ ఆభరణం లాంటిది" అని కితాబిచ్చాడంటే దానికి కారణముంది. పెప్సీ కంపెనీ ఆ మధ్య సంక్షోభంలో పడింది. షేరు ధర బాగా పడిపోయింది. అలాంటి సమయంలో పోటీ కంపెనీల ధాటిని తిప్పికొట్టి-పెప్సీని 'యే దిల్ మాంగే మోర్' అనిపించేలా చేసి - కంపెనీని ఒడ్డుకు చేర్చిన ఘనత ఇంద్రదే.

కంపెనీకి భారంగా మారిన 'బాట్లింగ్ యూనిట్'ను వేరు చేయడం - ట్రోపికానా, క్వాకర్ (పండ్ల రసాలు, ఫుడ్ ప్రాడక్ట్స్‌కు సంబంధించిన) రెండు కంపెనీలను విలీనం చేయడంలోనూ ఇంద్ర ప్రధాన వ్యూహకర్తగా నిలిచింది.

ఆమె ప్రతి ఎత్తుగడలోను సక్సెస్‌ని రుచి చూసింది. ఫలితంగా గత మార్చిలో 29 డాలర్లుగా వున్న పెప్సీ షేరుధర ప్రస్తుతం 49 డాలర్లకి చేరింది. అందుకే ఇంద్ర అంటే పెప్సీ 'పెద్ద'లకి అంత గౌరవం.

చెన్నైలోని ఓ సామాన్య సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఇంద్ర పెరిగిందీ, చదువును కొనసాగించిందీ కూడా అక్కడే. కలకత్తాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి డిగ్రీ పొందిన ఇంద్ర యాలె యూనివర్శిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసింది. ఆ తర్వాత కొన్నేళ్లు స్వదేశంలోని కొన్ని ప్రముఖ సంస్థల్లో పని చేసిన ఇంద్రకి 1994లో అమెరికా నుంచి ఎన్నో అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, మోటరోల, ఎబిబి వంటి ప్రసిద్ధ సంస్థల్లో ఉన్నత పదవులు సమర్థంగా నిర్వహించిన ఇంద్ర చివరగా పెప్సీ కంపెనీలో చేరింది. గత ఏప్రిల్‌లో 'చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్' (సిఎఫ్ఒ)గా ఎంపికైన ఇంద్ర ఏడాది తిరక్కుండానే పెప్సీ వంటి మల్టీ నేషనల్ కంపెనీకే ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగింది. కొత్త బాధ్యతతో పని ఒత్తిడి పెరగలేదా అంటే "పనిలేని ఒక్కరోజుని కూడా ఊహించలేను. పనిలో ఆనందాన్ని వెతుక్కుంటే వత్తిడి అన్న మాటే లేదు. నా కుటుంబాన్ని బాగా ప్రేమిస్తాను. కాని పెప్సీని నా పిల్లలకంటే ఎక్కువగా ప్రేమిస్తాను" అంటుంది ఇంద్ర.

ప్రస్తుతం ప్రపంచాన్ని ముంచెత్తుతున్న కంప్యూటర్ వెల్లువలో 'ఈ చక్కెర నీళ్ల'ని నమ్ముకొని ఎంత కాలముంటావ్?' అని ఎద్దేవా చేసిన వారికి ఇంద్రని వరించిన అత్యున్నత పదవే సమాధానం.

---

## జనహర్ష వార్తలు...



12.12.2000: హైదరాబాద్, మలక్‌పేటలోని జనహర్ష 6వ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి.








11.01.2001: హైదరాబాద్, ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో జనహర్ష స్టాల్‌ను ప్రారంభించిన జస్టిస్ సర్దార్ అలీఖాన్.

# వీరత్వంకాదు, వికృత ఆలోచనాధోరణి ఫలితం!
# మహోన్నత మానవతా మూర్తిని బలిగొన్న గాడ్సే

భారత దేశ స్వాతంత్ర్య మహోద్యమ సారథులలో ప్రథమగణ్యుడైన మహాత్మాగాంధీని హత్య చేయడం అత్యంత పాశవిక అమానుష చర్య అని అనేక మంది ఖండించారు. మతోన్మాద విషం తలకెక్కిన ముష్కర శక్తుల ఆటవిక చర్యగా ఆ హత్యను అనేకులు అభివర్ణించారు. విచిత్రం ఏమంటే మతతత్వం ఎజెండాను ఏనాడూ వదులుకోని కాషాయకూటమి సైతం మహాత్ముని వారసత్వాన్ని - ఎత్తగడగానే అయినా-వినియోగించుకోవడానికి ప్రయత్నిస్తుంటే, హంతకుడు నాథూరాం గాడ్సే ఆరాధకులు మాత్రం గాంధీజీని దూషిస్తూ, గాడ్సేని కీర్తిస్తున్నారు. గాంధీని చంపడం సమర్థనీయమే అని వీరు చేస్తున్న వాదనల్లో ఏవీ వాస్తవాలు కావు; అన్నీ అర్ధసత్యాలు, అసత్యాలు, అభూత కల్పనలు మాత్రమే.



ప్రార్థనా సమావేశానికి వెళ్తున్న గాంధీజీ

ఇటీవలి కాలంలో నాథూరాంగాడ్సే ఒక హంతకుడు కాదని, దేశభక్తుడైన అమరవీరుడని నమ్మించే ప్రచారం ముమ్మరం అవుతోంది. గాంధేయవాదం మీద విద్వేషానికి బీజాలు వేసిన మహారాష్ట్రలోనూ, మహాత్ముని జన్మస్థలమైన గుజరాత్‌లోనూ ఇది సాగుతోంది. జాతి స్వేచ్ఛకోసం నిరాయుధంగా నిబ్బరంగా నిలిచి పోరాడి ప్రాణాలర్పించిన మహనీయ త్యాగధనుడి మీద 'జాతి వ్యతిరేకి' అనే ముద్ర వేస్తుంటే కాదని ఖండించాల్సిన అవసరం లేదా? తప్పనిసరిగా ఉంది. ప్రజాస్వామ్యం పట్ల, లౌకిక విలువల పట్ల, ఆఖరికి ఈ దేశ రాజ్యాంగం పట్ల కూడా కించిత్తు గౌరవం లేని మత విద్వేషశక్తులను తుత్తునియలు చేయవలసిన అవసరం తప్పనిసరిగా ఉంది. అసత్యాలతో, అభూత కల్పనలతో చరిత్రను ఇష్టం వచ్చినట్లు వక్రీకరిస్తూ, జాతి సమైక్యతకు విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తున్న శక్తుల కుటిల నీతిని ఎండగట్టవలసిన అవసరం తప్పకుండా ఉంది.



*1948 జనవరి 30:*
బిర్లా హౌస్‌లో చివరి నిశ్శబ్ద క్షణాలు

గాంధీజీని చంపిన హంతకుడు, అతన్ని సమర్థించేవాళ్లు ఈ హత్య సమర్థనీయమే అని చెప్పడానికి ఈ దిగువ కారణాలు చూపిస్తున్నారు:

*ముస్లింలకు ప్రత్యేక రాష్ట్రం అనే భావాన్ని గాంధీజీ బలపరిచారు. ఒక విధంగా పాకిస్తాన్ ఆవిర్భావానికి ఆయనే బాధ్యుడు.*

*కాశ్మీర్‌పై పాకిస్తాన్ దాడి చేసినప్పటికీ, పాకిస్తాన్‌కు ఇవ్వాల్సిన రు.55 కోట్లు ఇచ్చేలా భారత ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి గాంధీజీ నిరాహారదీక్ష చేశారు.*

*ముస్లింల యుద్ధోత్సాహం గాంధీజీ బుజ్జగింపు విధాన ఫలితం.*

ఆనాటి పరిస్థితులకు సంబంధించి అన్ని విధాల వివరాలతో రికార్డ్ అయిన చరిత్ర వెలుగులో పరిశీలిస్తే ఈ ఆరోపణలన్నీ ఎంతో చాతుర్యంతో కూడిన వక్రీకరణలని, ఉద్దేశపూర్వకంగా పెడదారి పట్టించడం కోసం చేసే వాదనలని వెల్లడవుతుంది. ఆ నాటి తీవ్రమైన గందరగోళ రాజకీయ పరిస్థితుల్లో గాంధీజీ ఎంతో క్రియాశీలంగా ఉండేవారు. దేశ విభజన ప్రతిపాదన, దానికి వ్యతిరేకంగా చెలరేగిన హింసాత్మక ప్రతిస్పందన తీవ్ర ఉద్రిక్తతలకు కారణం అయ్యాయి. అంతిమంగా ఈ పరిస్థితులు అమానుషమైన సెక్టేరియన్ హత్యా కాండలకు దారితీశాయి.

ముస్లిం మత వాదులు సెక్టేరియన్ దృక్పథంతో గాంధీజీని పాకిస్తాన్ ఏర్పాటును వ్యతిరేకించిన హిందువులు నాయకునిగా భావించారు. హిందూమతవాదులు హిందువుల మీద జరిగిన అత్యాచారాలకు ప్రతీకారం తీర్చుకోవాలనుకునే తమ పథకాలకు గాంధీజీని ఒక అడ్డంకిగా భావించారు. ఈ విధమైన వికృత ఆలోచనా ధోరణికి ప్రతిరూపమే గాడ్సే.

మతతత్వ శక్తులు దశాబ్దాల తరబడి ఒక పద్ధతి ప్రకారం మత విద్వేష భావాలను నూరిపోసిన క్రమానికి పరాకాష్టగా గాంధీజీ హత్య జరిగింది. కరడుగట్టిన హిందూమతతత్వ శక్తులు గాంధీజీని తమ గొంతులో ముల్లులాగా భావించాయి. ఈ వ్యతిరేకత కాలక్రమంలో ఒక ఫోబియాగా మారింది. 1934లో ప్రారంభించి ఆ తర్వాత 14 సంవత్సరాల కాలంలో గాంధీజీని చంపడానికి 'ఆరు హత్యా ప్రయత్నాలు' జరిగాయి. 1948 జనవరి 30న జరిగిన ఆఖరి ప్రయత్నం ఆయన్ను బలి తీసుకుంది. మిగతా అయిదు హత్యా ప్రయత్నాలు 1934 జూన్‌లో, 1944 జులైలో, 1946 సెప్టెంబర్‌లో, 1948 జనవరి (20వ తేదీ)లో జరిగాయి. చివరి రెండు హత్యా ప్రయత్నాలలోనూ గాడ్సే భాగస్వామిగా ఉన్నాడు.

1934, 1944, 1946 సంవత్సరాలలో జరిగిన విఫల హత్యా ప్రయత్నాల నాటికి విభజనకు సంబంధించిన ప్రతిపాదనగాని, పాకిస్తాన్‌కు రు.55 కోట్లు విడుదల చేయడానికి సంబంధించిన అంశంగాని ఎంత మాత్రం అస్తిత్వంలో లేవు. అంటే గాంధీజీని హత్య చేయడానికి వేటినైతే ప్రధాన కారణాలుగా గాడ్సే అండ్ కంపెనీ చెబుతుందో పై హత్యా ప్రయత్నాలు జరిగిన కాలంలో ఆ కారణాలు అసలు ఉనికిలోనే లేవు. అత్యంత నీచమైన తమ నేరాన్ని సమర్థించుకోవడానికి ప్రజలను దగా చేయడానికి మాత్రమే హంతకుల ముఠా చారిత్రక వాస్తవాలను వక్రీకరిస్తోంది. ఈ రకమైన వికార మానసిక ధోరణికి చిహ్నమే 'మీ నాథూరాం గాడ్సే బోల్తోయ్' అనే పేరుతో మరాఠీ, గుజరాతీ భాషల్లో ప్రదర్శితమైన నాటకం. దేశ ప్రజల జ్ఞాపకాల నుండి గాంధీజీ హత్య చెరిగిపోక ముందే ఆ నాటి వాస్తవాలను నిర్లజ్జగా, నిస్సంకోచంగా వక్రీకరించడానికి ఈ నాటకం ప్రయత్నించింది.

ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ఏ నాగరిక సమాజంలోనైనా అభిప్రాయ బేదాలు ఏర్పడితే పరస్పరం చర్చించుకుని ఒక అంగీకారానికి వస్తారు. అందుకు గాంధీజీ ఎప్పుడూ సిద్ధంగానే ఉండేవారు. వాస్తవానికి గాడ్సేని కూడా చర్చకు రావాల్సిందిగా గాంధీజీ ఆహ్వానించారు. కానీ అతను ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు. గాడ్సేకి గాని, అతని ముఠాకిగానీ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతులలో పరిష్కరించుకోవడం మీద ఎలాంటి విశ్వాసం లేదనడానికి ఇంతకంటే వేరే ఉదాహరణ అవసరం లేదు. ఇటువంటి ఫాసిస్టు స్వభావం గల వ్యక్తులు ప్రత్యర్థుల్ని అంతం చేసి భిన్నాభిప్రాయం లేకుండా చేసుకోవాలనుకుంటారు.

ముస్లిం మతవాదుల మనోభావాలు పాకిస్తాన్ ఆవిర్భావానికి ఎంత కారణమో, హిందూ ప్రతీకార వాదుల వైఖరి కూడా అంతేకారణం. కరడు గట్టిన హిందువులు ముస్లిముల్ని పెడదారి పట్టిన మ్లేచ్ఛులుగా పరిగణించేవారు. కనుక వాళ్లతో సహజీవనం కుదరదని భావించేవాళ్లు. పరస్పర



మహాత్ముని హత్య మానవతకే మహాపచారం

అవిశ్వాసం, నిందారోపణలతో హిందూ ముస్లిం తీవ్రవాద బృందాలు తాము రెండు భిన్నమైన జాతులకు చెందినవారమనుకునేంత వరకు వెళ్లాయి. ఈ కారణంగా మత సమస్యకు దేశ విభజన మాత్రమే పరిష్కారం అనే ముస్లిం లీగ్ డిమాండ్ బలం పుంజుకుంది. ఉభయ మతాలలోని స్వార్థోన్మత్త శక్తులు విభజన వాదుల మనోభావాలను శక్తి కొద్దీ రెచ్చగొట్టాయి. తమ విద్వేషపూరిత ప్రచారాన్ని సమర్థించుకోవడానికి చరిత్రలోని నిర్దిష్ట అంశాలను వక్రీకరించాయి. దురదృష్టవశాత్తూ ఈ విధమైన ధోరణులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. "సారే జహాసే అచ్ఛా, యే హిందూస్తాన్ హమారా" అనే ప్రసిద్ధగీతాన్ని రాసిన కవి మహమ్మద్ 1930 ఇక్బాల్ ప్రారంభంలోనే ముస్లింలకు ప్రత్యేకమైన రాష్ట్రం అనే భావనకు నాంది పలికాడు. హిందూ తీవ్రవాదులు ఈ భావనను మరింత దృఢతరం చేశారు. 1937లో అహ్మదాబాద్‌లో జరిగిన హిందూమహాసభ బహిరంగ సదస్సులో వీర్‌సావర్కార్ అధ్యక్షోపన్యాసం చేస్తూ ఈ విషయాన్ని స్పష్టం చేశాడు. "భారత దేశం నేడు ఏక కేంద్రకమైనా, సజాతీయుల దేశం అని చెప్పుకోజాలదు. తద్విరుద్ధంగా ఇక్కడ ప్రధానంగా రెండు జాతులు - హిందువులు, ముస్లింలు - కనబడుతున్నాయి" (వీరసావర్కార్ రచనలు 6వ సంపుటి, పేజీ 296).

1945లో ఆయనే "జిన్నా ద్విజాతి సిద్ధాంతంతో నాకెలాంటి ఘర్షణ లేదు. మేం హిందువులందరం ఒక జాతి. హిందువులు, ముస్లింలు రెండు జాతులనే విషయం చారిత్ర వాస్తవం" అని స్పష్టం చేశాడు. (ఇండియన్ ఎడ్యుకేషనల్ రిజిస్టర్, 1943, సంపుటి : 2, పేజీ 10) ఈ విధంగా రెండు మతాలలోనూ రాజీ పడటానికి ఇష్టం లేని శక్తులు చివరకు పాకిస్తాన్ ఆవిర్భావానికి కారణం అయ్యాయి.

ఇందుకు పూర్తిగా విరుద్ధంగా గాంధీజీ ఆయన జీవిత కాలమంతా మత విశ్వాసాల విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండానే అన్య మతాల పట్ల గౌరవాన్ని ప్రదర్శించారు. మనుషుల్లో సమానత్వాన్ని ఆకాంక్షించారు. మనోవాక్కాయకర్మలతో అహింసనే పాటించారు. ఆయన రోజువారీ ప్రార్థనలలో ప్రవచనాలు, భక్తిగీతాలు, వేర్వేరు గ్రంథాలలోని భాగాలను పఠించడం వంటి కార్యక్రమాలు భాగంగా ఉండేవి. వేర్వేరు మతాలకు చెందిన వారు ఆ ప్రార్థనలకు హాజరవుతుండేవారు. సాటి ప్రజలకుండే మత విశ్వాసం కారణంగా వారి జాతీయతను మదింపు వేయడాన్ని ఆయన ఎన్నడూ అంగీకరించలేదు. ఆయన హిందువుల మధ్య ఐక్యత కోసం కృషి చేశారు. అదే విధంగా హిందూ ముస్లింల మధ్య సఖ్యత కోసం ఆయన అలాంటి వినాశకరమైన ప్రతిపాదన చేయడం కంటే చావడమే మేలని ఆయన భావించారు. ఆయన జీవితం తెరిచిన పుస్తకం. ఆ విషయాన్ని ప్రత్యేకంగా రుజువు చేయనక్కరలేదు.

గాంధీజీ నాయకత్వం కింద కాంగ్రెస్ నిర్మాణాత్మక కార్యక్రమాలలో మత సామరస్య భావనకు గర్వించదగిన స్థానం లభించింది. అబ్దుల్ గఫార్‌ఖాన్, మౌలానా అజాద్, డాక్టర్ అన్సారీ హకీమ్ అజ్మల్‌ఖాన్, బద్రుద్దీన్ తయాబ్జీ వంటి ఎందరో జాతీయస్థాయి ముస్లిం నేతలు, మేధావులు, ఆఖరికి జిన్నా కూడా కాంగ్రెస్ పరిధిలో ఉండేవారు. అందువల్ల కాంగ్రెస్ పార్టీ సహజంగానే దేశ విభజన ప్రతిపాదనను వ్యతిరేకించింది. కానీ హిందువులు, ముస్లింలలోని కొన్ని లంపెన్ మూకలు మత

## వయసు: పన్నెండేళ్లు ; చదువు: ఎనిమిదో క్లాసు ;
## పదవి: ఓ మల్టీ మిలియన్ డాలర్ కంపెనీ సిఇఒ, వ్యవస్థాపకుడు

# కేత్ పెరిస్



ఓ మల్టీ మిలియన్ డాలర్ కంపెనీకి వ్యవస్థాపకుడు, సి.ఇ.ఓగా వున్న ఓ వ్యక్తి మామూలుగా ఎలా వుంటాడని ఊహించు కుంటాం?

కనీసం నడివయసైనా దాటి వుంటాడనీ, బిజినెస్‌లో ఢక్కాముక్కలు తిన్న అనుభవంతో తలపండి వుంటాడనే అనుకుంటాం తప్ప-

పొద్దున్నే భుజానికి బ్యాగ్ తగిలించుకొని స్కూల్‌కి పరుగులు తీసే ఓ కుర్రాడు అంత ఉన్నత స్థానంలో వున్నాడంటే నమ్మగలమా?

కాని - ఈ కుర్రాడిని చూసాక నమ్మి తీరాలి.

ఈ హైటెక్ తరం కుర్రాడి పేరు కేత్ పెరిస్. వయసు పన్నెండేళ్ళు. చదువు ఎనిమిదో క్లాసు మరీ చిన్నప్పుడే కంప్యూటర్‌ని ఔపోసాన పట్టాడు.

ఆ ఆసక్తి ఎంత విపరీతంగా పెరిగిందంటే. 1999, జూన్‌లో - అంటే ఐదో తరగతి చదివేప్పుడు - కేత్ 'సైబర్ టెక్ డిజైన్' అనే సంస్థని స్వంతంగా ప్రారంభించాడు. ఇంటర్‌నెట్‌లో సైట్‌ని ప్రారంభించాలనుకునే వివిధ సంస్థలకి క్రియేటివ్ డిజైన్‌లు చేస్తాడు.

కేత్ ప్రతిభకి నిదర్శనంగా ఎన్నో పెద్ద సంస్థల నుంచి ఆఫర్లు వచ్చాయి.

అలా కేవలం రెండేళ్లలోనే 'సైబర్ టెక్ డిజైన్' ఓ మల్టీ-మిలియన్ డాలర్ల కంపెనీగా మారింది.

ఈ కంప్యూటర్ విజ్‌కిడ్ పేరు కెనడాలో ఇంటింటికీ తెలిసింది.

అతి చిన్న వయసులో ఓ కంపెనీ వ్యవస్థాపకుడిగా, సి.ఇ.ఓగా వ్యవహరిస్తున్న కేత్ పెరిస్ స్వంత దేశం శ్రీలంక.

1981లో ఈ కుర్రాడి తల్లి దండ్రులు దీపాల్, సిరియాపెరిస్‌లు జాతి విద్వేషంతో అట్టుడుకుతున్న శ్రీలంకను వదిలి కెనడాలో స్థిరపడ్డారు. ఇప్పటికీ ఓ కంపెనీకి సి.ఇ.ఓ అయినా కేత్ చదువుని నిర్లక్ష్యం చేయలేదు. బుద్ధిగా కూర్చుని హోంవర్క్ చేస్తాడు. ర్యాంక్ రాకుంటే మామూలు కుర్రాళ్ళలానే చిన్నపోతాడు. కంపెనీ పనిని రాత్రిళ్ళు, సెలవుదినాల్లో కూర్చుని పూర్తి చేస్తాడు.

కేత్ ఈ మధ్య అమాంతం వార్తల్లోకి వచ్చాడు. కెనడా ప్రధాని జీన్ చెరెషియన్, ఇటీవల చైనా, హాంగ్‌కాంగ్‌లలో పర్యటించాడు. ఆయనవెంట వెళ్ళిన 300 మంది బడా పారిశ్రామిక వేత్తలు, ప్రముఖ రాజకీయ నాయకుల బృందంల పన్నెండేళ్ళ కేత్ పెరిస్ ముందు వరసలో వున్నాడు. హాంగ్‌కాంగ్‌లో ఓ వాణిజ్య సమావేశంలో ఏమాత్రం తడుము కోకుండా కేత్ చేసిన ప్రసంగానికి - అక్కడ హాజరైన ప్రముఖులు బిత్తరపోయారు.. ఎకడమిక్ డిగ్రీలతో, వయసుతో ప్రతిభకు ఏమాత్రం సంబంధంలేదని నిరూపించాడు..... ఈ గడుసుపిండం.

# తెలుగు పాఠకుడికి మరో పత్రిక అవసరం తప్పించిన 'విజయవిహారం'

## విజయవిహారం
మొదటి సపుటి
(ఫిబ్రవరి-డిసెంబర్ 2000, 11 సంచికలు) పై
ధర్మారావుగారి
సమీక్షావ్యాసం



డిస్కౌంట్ ధరల్లో
పాత సంచికలు
(కొద్ది కాపీలు మాత్రమే కలవు)
విజయవిహారం పాతసంచికల కాపీలు కావాలనుకునేవారు
ప్రతి : ~~రు.15/-~~ రు.10/-
మొదటి సంపుటి (11సంచికలు):రు.~~165/-~~ రు.100/- బైండ్‌సెట్ రు.125/-
ఎమ్.ఓ./డి.డి. ద్వారా చెల్లించి పొందవచ్చు.
జనహర్ష పబ్లిషర్స్ ప్రైవేట్ లిమిటెడ్, 12-5-33/2,
విజయపురి, తార్నాక, సికింద్రాబాద్-17.
☎ 04007007053

### ఆకాశమే హద్దుగా వైవిధ్యం

### మంచిని పొగడటం...

### చెడుని తెగడటం

### సంయమనం ఒక సుగుణం

### శైలీ చమత్కారాలు

### ఒక ఉద్యమ వాతావరణం కల్పించటం

### ఒక ఉచిత సలహా

### తెలుగు పాఠకుడికే ఓ వరం

- సి. ధర్మారావు



Worldwide Meditation
from 1st March to 21st March 2000
DYNAMIC : 6.30 am to 7.30 am
KUNDALINI : 5.30 pm to 6.30 pm
OSHO
OSHO MEVLANA MEDITATION CENTRE
Ph : 040-3220957

KALYAN
MINERAL WATER & PET SODA
THE REAL WATER
☎ : 7620644 Cell : 98480 21238
WE SUPPLY ON ORDER FOR ALL FUNCTIONS, OFFICE & RESIDENCE

SHE NEEDS
BEAUTY POINT
Parlour and Boutique
Ph : 7650768
100% facial Fancy
results with Calcutta
modern dyes & all Sarees at
Mehndi designs Wholesale rates
FREE SCHEME CARD

VAYUPUTRA FOREST GREENERIES (P) LTD.
Contractors Consultants
Land scaping Growers &
Suppliers of Teak Mangium
Red Sandal Bamboo Rose
Wood Horticulture & Forest Plants
LAKHS OF PLANTS
QUANTITIES AVAILABLE FOR SALE
☎ : 0403302763, 040-3311068,
Cell : 9848014216
LEADING TEAK PLANT SUPPLIERS
IN ANDHRA PRADESH

ఇంటి సౌందర్యం కోసం - కంటి ఆనందం కోసం
CERAMIC POINT
3-6-751, Ground Floor,
Sai Sadan, Road No.12,
Lane Opp. S.B.H.
Himayathnagar,
Hyd. - 29. ☎ 7627897
Cell : 9849095393
Dealers in : SOMANY,
PEDDAR, REGENCY TILES
SOMANY
FLOOR & WALL TILES

We also Deal in Fibre Glass Wool &
FRP Raw material, House Keeping
& Security Services
AJANTA SERVICES
C.V.R. BENARJI
Cell : 9849052738

GALAXY DECORS
Interior Decorators
Washable Wall Papers ◆ Non Woolen Carpets
◆ Vertical Blinds ◆ Aluminium Partitions ◆ PVC Flooring
◆ Thermocol Sealing ◆ SUN Control Film ◆ Pop Sealing
K. MAHENDER RAO
☎ 7662872, Pager : 9628913554

# ఎంపీలకి లంచం తీసుకునే లైసెన్స్ ఉందా?






మాడభూషి శ్రీధర్ కాలమ్

రాజకీయాల్లో లంచం తీసుకోవడం నేరమా? లంచం తీసుకోకుండా రాజకీయాలు చేయడం నేరమా? రాజ్యాంగం రాజకీయలంచాలను ప్రోత్సహిస్తుందా లేక అది అవినీతి అని శిక్షిస్తుందా?

లంచం మన దేశ రాజకీయాలకు పునాదిగా మారిపోయింది. లంచంలేని రోజు, క్షణం, కార్యాలయం, ఫైలు చాలా అరుదుగా కనిపిస్తుంటాయో కనిపించవో మనం ఊహించుకోవలసిందే.

లంచం ఇచ్చినా తీసుకున్నా నేరమని చాలా తేలిగ్గా చెప్పారు. మన శిక్షాస్మృతిలో ఇదొక అరుదైన నిర్వచనం. లంచం ఇవ్వాలనుకున్నవాడు సరదాగా ఇవ్వడు. పని జరగడం కోసం తప్పని స్థితిలో తొందరలో ఇస్తాడు. తన ఖర్చులో లంచం ఖాతా కూడా కలుపుకుని విధిలేక లంచాలు ఇచ్చేవారే నూటికి తొంభై మంది. కాని అయినా ఆ విధంగా కూడా లంచం ఇవ్వడం తప్పు, నైతిక పతనం, అధర్మం, అన్యాయం వగైరా వగైరా కనుక లంచం ఇవ్వడం ఇవ్వజూపడం నేరమయిపోయింది. ఇక నిశ్చింత. లంచం ఇచ్చిన వాడు కూడా నేరస్తుడే అనడం ద్వారా తెల్లదొర లంచం డిమాండ్ చేసి మరీ తీసుకున్నవాడిని రక్షించేసాడు. ఇచ్చినవాడు ఇచ్చిన విషయం చెప్పకుండా నోటికి తాళం వేయడానికి ఈ నిర్వచనాన్ని మెకాలే కనిపెట్టి ఉంటాడు. కనుక ఏతావాతా చెప్పుకోక తప్పని విషయం ఏమిటంటే లంచం నిర్వచనంతో లంచగొండితనాన్ని చిరంజీవిగా వర్థిల్లమని ఐపిసి దీవించింది. అంతేకాదు.



## లంచం ఆచంద్రతారార్కం అయ్యేందుకు మెకాలే కృషి

ఈ లంచం ఆచంద్ర తారార్కం నిలిచి భరతభూమిని పాలించే సాధనమై ఆయుధమై వర్థిల్లుగాక అని కూడా వరమిచ్చింది. ఆ కాలంలో లంచగొండులంతా కలిసి మెకాలేకు లంచం ఇవ్వడం కూడా లంచం నిర్వచనంలో కలపమని కోరుతూ లంచం ఇచ్చారేమో తెలియదు. ఆ కాలంలో బతికిన వారెవరయినా ఉంటే వారికి లంచం ఇచ్చి ఈ విషయం తెలుసుకోవాల్సి వస్తుందేమో.

సరే. ఈ చట్టం మనకింకా బాగా పనికి వస్తున్నది. ఇంతవరకు ఈ చట్టంలో చుక్కలు కామాలు కూడా మార్చుకోవడం చేత కాదు. వాళ్ళు వేసిన రైలు పట్టాలను ఒక పట్టాన అర పట్టానైనా కలపడానికి మనకు తీరిక, ఓపిక, డబ్బు, శక్తి ఏమీ లేవన్నమాట. ఆ మాట ఒక అర శతాబ్దం దాకా అర్థమే కాలేదు.

## లంచం నేరం కాకపోవడమేమిటి?

లంచం తీసుకోవడం నేరమా కాదా అని చర్చించాల్సిన అవసరం లేదు. నైతికంగానే కాక చట్టపరంగా కూడా అది నేరమే అని అనేక దేశాల శాసనాలు చెప్తున్నాయి. పార్లమెంటేరియన్లను ఈ నేరానికి శిక్షించే అధికారం, విచారణా పరిధి న్యాయస్థానాలకు లేదని చెప్పినప్పుడే ఈ చిక్కంతా వస్తున్నది. చట్టం సభలలో గౌరవనీయులైన సభ్యులు ఏం మాట్లాడినా ఏం చేసినా అడగడానికి వీల్లేదని ఇటీవల పి.వి. నరసింహారావు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ నియమాలకు చెప్పుకునే అర్థాల ఆధారంగా వచ్చింది. ఈ తీర్పుతో ప్రజలంతా ఏకీభవిస్తారా లేక మారాలని నియమాలు మార్చాలని లంచగొండి చట్టసభాసదులను పట్టుకొని విచారించాలంటారా అని రాజ్యాంగ సమీక్షా కమిషన్ ప్రశ్నిస్తున్నది.

## ప్రత్యేకాధికారాలు ప్రజాపీడనకా?

మామూలు భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు అదనంగా చట్టసభల సభ్యులకు సభావేదికల మీద దేని గురించైనా ఏమయినా చెప్పడానికి స్వేచ్ఛను ఇచ్చారు. ఏం మాట్లాడినా లేక ఏవిధంగానైనా వోటు వేయడానికి వ్యవహరించినా కోర్టులు అడగడానికి వీల్లేదని రాజ్యాంగం ఆర్టికిల్ 105 వివరించింది. ఈ నియమం నుంచే సభ్యుల ప్రత్యేకాధికారాలు - ప్రివిలేజెస్, మామూలు చట్టాల పరిధి నుంచి మినహాయింపులు - ఇమ్యూనిటీలు లభించాయి. అయితే ఈ మినహాయింపులేమిటో, ఈ ప్రత్యేకాధికారాలు ఏమిటో వివరించాలని ఒక శాసనం చేసుకోవాలని కూడా రాజ్యాంగం సూచించింది. ఆ విధంగా ప్రివిలేజెస్ వ్యవహారం చట్టబద్దం చేయనంతవరకు యునైటెడ్ కింగ్‌డం ఉభయ సభల ప్రివిలేజెస్‌నే మన శాసన సభ్యుల ప్రత్యేకాధికారాలుగా భావించాలని కూడా 105 వివరించింది. అంటే మనం ఇంగ్లాండ్ చట్టసభల సభ్యుల అధికారాలను మనవారి ప్రత్యేకధికారాలుగా భావించాలన్నమాట.

## లంచాలు ఇవ్వడం నేరమే కానీ తీసుకోవడం కాదట

సభలో వ్యవహారాల కోసం ఏదో చేసారని అంటూ పార్లమెంటు సభ్యులను ప్రాసిక్యూట్ చేయడానికి వీల్లేదని పి.వి. నరసింహారావు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మెజారిటీ తీర్పు వల్ల సూరజ్ మండల్ వంటి కొందరు జార్ఖండ్ ముక్తి మోర్చా ఎంపీలు ఇమ్యూనిటీ ఛత్రం కింద భద్రంగా ఉన్నారు. లంచం పార్లమెంటు బయట ఇస్తారు కనుక అది సభా వ్యవహారం కాదు కనుక, ఈ ఇమ్యూనిటీ ఛత్రం నీడ లంచాలు ఇచ్చిన వారికి (పార్లమెంటు సభ్యులే అయినా సరే) లభించదని సుప్రీంకోర్టు వివరించింది. ఈ తీర్పు అనేక విమర్శలకు గురయింది. సుప్రీంకోర్టును అందుకు నిందించి ప్రయోజనం లేదు. మనం కష్టపడి రాసుకున్న రాజ్యాంగం నియమాలు ఆ విధమైన అర్థాన్ని ఇస్తున్నాయని సుప్రీం కోర్టు వివరించింది. మీ హక్కులు అధికారాలు ప్రత్యేకాధికారాలు ఏమిటో వివరించాలని, ఎప్పుడికప్పుడుమీ ప్రివిలేజెస్ గురించి రాసుకోవాలని రాజ్యాంగంలో ఉంది. ఆ పని చేయకపోతే కోర్టు ఏం చేస్తుంది? ఇదేదో అస్పష్టంగా ఉంటేనే మనం లంచాలు ఇచ్చి పుచ్చుకుని సరదాగా కాలం గడుపవచ్చు అనుకుంటే ఇటువంటి సంఘటనలు సమస్యలే ఎదురవుతాయి. ధ్యానాకర్షణ తీర్మానం (కాల్ అటెన్షన్ మోషన్)పైన చర్చిస్తూ పరువుతీసే విధంగా మాట్లాడినందుకు ఎన్ సంజీవరెడ్డి నష్టపరిహారం ఇవ్వాలని తేజ్ కిరణ్ దావా వేయడానికి వీల్లేదని సుప్రీం కోర్టు గతంలో చెప్పింది (1970(2) ఎస్‌సిసి272)

## పి.వి. కేసు - తిరకాసు

పి.వి. నరసింహారావు కేసులో సుప్రీంకోర్టు తీర్పు వివాదాస్పదంగా మారింది. సభలో జరిగిన సంఘటనలు నేరాలుగానీ లేదా సివిల్ పౌరహక్కుల భంగం కేసులుగానీ అయితే విచారించేదెవరు? విచారణకు అనుమతించే అథారిటీ ఎవరు? సెక్షన్ 2 సి అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం ఎంపీలు ప్రజాసేవకులా? అనే ప్రశ్నలు తలెత్తాయి. ఈ చట్టం కింద లంచగొండితనాన్ని విచారించాలంటే మంజూరీ అధికారి ఒకరు విచారణకు అనుమతించాలి. పార్లమెంటు సభ్యుల లంచగొండితనం ఆరోపణలను విచారించడానికి అనుమతి నిచ్చేందుకు ఎవరైనా అధికారి ఉన్నారా? ఎంపీల పైన క్రిమినల్ కేసు చార్జిషీటు దాఖలు చేయడానికి ప్రాసిక్యూటింగ్ ఏజన్సీ ఎవరి అనుమతి కోరవలసి ఉంటుంది? ఈ ప్రశ్నలకు జవాబులు లేవు కనుక ప్రాసిక్యూషన్ చేయకుండా ఉండాలా? ఈ అధికారి ఎవరో తేల్చేవరకు ప్రాసిక్యూటింగ్ ఏజన్సీలు స్పీకర్ లేదా రాజ్యసభ అధ్యక్షుని అనుమతి తీసుకోవాలని ఈ కేసులో ఇద్దరు న్యాయమూర్తులు అగర్వాల్, ఆనంద్ అభిప్రాయపడ్డారు. మరో ఇద్దరు న్యాయమూర్తులు భరూచా, రాజేంద్రబాబు మాత్రం సరయిన అధికారి ఎవరో తేలి, ఆ అధికారి నుంచి ప్రాసిక్యూషన్‌కు అనుమతి లభిస్తే తప్ప ఎంపీలను ప్రాసిక్యూట్ చేయడానికి వీల్లేదని చెప్పారు. ఈ లోపాన్ని పార్లమెంటు సభ్యులు సరిదిద్దాలని అందుకు త్వరలో చట్టం చేయాలని న్యాయమూర్తులు సూచించారు. రాజ్యాంగంలో అటువంటి సూచన ఉంది కానీ పాటించేవారెవరు?

## లంచగొండి ఎంపీలకు విదేశాల్లో అరదండాలే

ఇంగ్లాండ్‌లో పార్లమెంటు సభ్యుల లంచగొండితనాన్ని నేరంగా పరిగణించడం 1695లోనే మొదలయింది. ఆస్ట్రేలియాలో అమెరికాలో కూడా ఈ రకమైన తీర్పులే వచ్చాయి. క్రిమినల్ ప్రాసిక్యూషన్ కూడా చేయవచ్చునని తీర్మానించారు.

అయితే పై ప్రధాన ప్రజాస్వామిక దేశాలలో ఉన్న నియమాలతో సమానమైన మార్పులు




మనదేశంలోనూ చేయడానికి న్యాయమూర్తులు అగర్వాల్, ఆనంద్ చేసిన సూచనలను అనుసరించాల్సి ఉంటుందని రాజ్యాంగ సమీక్షా సంఘం సూచించింది. ఎంపీల ప్రాసిక్యూషన్‌ను అనుమతించే అధికారిని ఒకరిని ఏర్పాటు చేయడానికి పిసి చట్టాన్ని సవరించాలి లేదా ఆర్టికల్ 105ను సవరించాలని ఈ న్యాయమూర్తులు సూచించారు. నేరాన్ని దాచడానికి దేశాధ్యక్షుడి ప్రత్యేకాధికారాలను వాడడానికి వీల్లేదని నిక్సన్ కేసులో అమెరికా సుప్రీం కోర్టు 1974లోనే వివరించింది. ప్రత్యేకాధికారాలు ప్రజలకు అవసరమైన మంచి పనులు చేయడానికే గాని లంచాలు తీసుకుని ప్రభుత్వాలు వెలగబెట్టడానికి కాదు.

అయితే చీటికి మాటికి క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు గురై ఎంపీలు క్రిమినల్ కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉంటే ప్రజాప్రాతినిధ్యానికి భంగం ఏర్పడుతుందనే వాదం కూడా ఉంది. అయినా లంచం తీసుకోవడం ఇతర ప్రలోభాలకు గురికావడం అనే నేరాలను ప్రత్యేకాధికారాల కవచం కింద దాచుకోవడానికి వీల్లేదని రాజ్యాంగ సమీక్షా సంఘం సూచించింది. అయితే గౌరవ ప్రతిష్టలున్న గొప్ప సభ్యులు అయిదుగురిని ఎంపిక చేసి వారితో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఈ కమిటీలకు స్పీకరు, రాజ్యసభ చైర్మన్ అధ్యక్షుడుగా ఉండాలని సూచించారు. లంచం తీసుకుంటే విచారణకు సభ్యులకున్న ప్రివిలేజ్ అడ్డురాకుండా 105 అధికరణాన్ని సవరించాలని కొత్తగా క్లాజ్ 3ఎ ను చేర్చాలని సంఘం సూచించింది.

## పదవుల ఎర చూపి అధికారం కాపాడుకుంటే లంచం కాదా?

లంచం అంటే ఏమిటి? కేవలం నగదు డబ్బు ఇస్తేనే లంచమా లేక ఇతర ప్రలోభాలు కూడా లంచాల కిందికి వస్తాయా? పదవులు ఇస్తామని సభలో ఓట్లు గుంజడం అందుకు ప్రతిఫలంగా పదవులు ఇవ్వడం లంచాలు అనిపించుకోవా? ఈ లంచాల గురించి ఎవరూ మాట్లాడరేం? రాజ్యాంగ సమీక్షా సంఘానికి ఈ లంచాల విషయం అవసరం లేదా? భజన్‌లాల్ సూట్‌కేసులతో ప్రభుత్వాలను ఏర్పాటు చేసారు. అసమ్మతి ఎంఎల్యేలు ఎవరయినా ఉంటే వారి ఇంటికి పొద్దున్నే సూట్‌కేసుతో వెళ్లేవారని, వారి ఓటు కనుక్కునే వారని విమర్శలు వచ్చాయి. అందుకే రాత్రికి రాత్రి తన ప్రభుత్వం మొత్తాన్ని మరో పార్టీలోకి మార్చిన ఘనత ఆయనకు దక్కింది. అంతకన్నా సమర్థుడు కల్యాణ్ సింగ్. ఉత్తరప్రదేశ్‌లో ఏ మాత్రం మెజారిటీ లేకపోయినా ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోవడం కోసం కనబడిన ప్రతి ఎంఎల్యేకు మంత్రి పదవి ఎరచూపి పార్టీలను చీల్చి, వచ్చిన ప్రతి వ్యక్తికి మంత్రి పదవులు మరో పదవులు ఇచ్చిన ఘనుడాయన. ఇవన్నీ సభలో విశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓట్లు వేయడానికే కదా? ఇవి లంచాలు కావా? ఈ లంచగొండితనానికి శిక్షలు ఉండాల్సిన పని లేదా?

మరొక ముఖ్యమంత్రి తన పదవిని దక్కించుకోవడానికి పార్టీ నాయకుడి మీద తిరుగుబాటు చేయడానికి మద్యనిషేధాన్ని సాధనంగా వాడుకున్నాడు. నిషేధంలో కూడా సారా బ్రాందీ వ్యాపారం చేయడానికి చాటూమాటుగా అనుమతించి ఒక్కొక్క ఎంఎల్యే నెలకు లక్షల రూపాయల డబ్బు సంపాదించేందుకు అనుమతించాడు. అందుకు కృతజ్ఞతగా అసెంబ్లీలో మద్దతు సంపాదించాడు. ఇది లంచగొండితనం కాదా?

## అక్రమార్జనను పట్టుకోవాలి

అసలు లంచగొండి తనాన్ని శిక్షించడం సాధ్యం కాదు. కాని అవినీతి నిరోధక చట్ట కింద అక్రమార్జనను శిక్షించే వీలుంది. అంటే లెక్కకు మించిన ఆస్తిపాస్తులు కలిగి ఉన్న వారిని ప్రాసిక్యూట్ చేయవచ్చు. ఇక్కడ దొరికిపోతారు ఈ నాయకులంతా. కాని వారిని ప్రాసిక్యూట్ చేసేదెవరు? అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(1)(ఇ) కింద వనరులకు మించిన ఆస్తి ఉన్న నేతలను ప్రజా సేవకులను కోర్టుకు తీసుకుపోవచ్చు. కాని ఆ పని చేయరు. ఆ పని చేయాలని, ఆ విధంగా అవినీతి సొమ్ము అని తేలిన డబ్బును ప్రజలపరం చేయాలని, ప్రజలకు అవినీతి రహిత పాలనలో బతికే ప్రజాస్వామిక హక్కు ఉందని రాజ్యాంగంలో ఏమయినా ఏర్పాట్లు చేయాలేమో చూడాల్సిందే.

Statement about ownership and other Particulars of the VIJAYA VIHAARAM, Hyderabad as required under Rule 8 of the Registration of News paper (Central) Rules, 1956.

### Form IV (See Rule 8)

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : Hyderabad |
| 2. | Periodicity of publication | : Monthly |
| 3. | Printer's Name | : T. V. Ramana Murty |
| | Whether citizen of India? | : Indian |
| | Address | : 12-5-149/17, Opp Railway Degree College, Tarnaka, Secunderabad-17, ☎:7003525 |
| 4. | Publisher's Name | : T. V. Ramana Murty |
| | Whether citizen of India? | : Indian |
| | Address | : 12-5-149/17, Opp Railway Degree College, Tarnaka, Secunderabad-17, ☎:7003525 |
| 5. | Editor's Name | : T. V. Ramana Murty |
| | Whether citizen of India? | : Indian |
| | Address | : 12-5-149/17, Opp Railway Degree College, Tarnaka, Secunderabad-17, ☎:7003525 |
| 6. | Name & Address of Individuals who owner the Newspaper | : T. V. Ramana Murty |

I T. V. Ramana Murty hereby declare that the particulars given above are true the best of my knowledge and belief.

1 - 3 - 2001

Sd/-
T. V. Ramana Murty
Publisher

## సందేహాలు-సమాధానాలు

### రాజ్యాంగం లంచాలు తీసుకొమ్మందా?

ప్రశ్న: జార్ఖండ్ ముక్తి మోర్చా కేసులో ఎంపీలు లంచాలు తీసుకున్నా నేరం కాదన్నారు. ఇవ్వడమే నేరం అన్నారు. రాజ్యాంగం వారికి లంచాలు తీసుకోవడం తప్పు కాదని చెప్పిందా?

జవాబు: రాజ్యాంగం ఎప్పుడూ లంచాలు తీసుకొమ్మని చెప్పదు. ఎవరికీ ఆ అధికారాలు ఇవ్వదు. లంచం తీసుకోవడం చట్టవ్యతిరేకమయిన పని. చట్టాలు ఎలా ఉండాలో చెప్పే రాజ్యాంగం చట్టవ్యతిరేకమయిన పనులను ప్రోత్సహించే అవకాశమే లేదు. చట్టసభలలో సభ్యులు స్వేచ్ఛగా నిర్భయంగా ఉంటేనే అన్ని విషయాలు నిరాటంకంగా చర్చించుకుని నిర్ణయాలు తీసుకునే వీలుంటుంది కనుక రాజ్యాంగంలో చట్టసభసభ్యులకు ప్రత్యేకమైన స్వేచ్ఛ అధికారాలను ఇచ్చింది. అందులో భాగంగా వారు సభలో చేసిన వ్యాఖ్యలకు, నిర్ణయాలకు లేదా వోటింగ్ నిర్ణయానికి సంబంధించి కోర్టులో కేసులు వేయరాదని నియమాలు రూపొందించారు. వోటు వేయడం సభానిర్ణయం. వోటు ఎందుకు వేసారని కోర్టులు అడగడానికి వీల్లేదు. వోటు వేయడానికి లంచం తీసుకున్నారని కూడా అనడానికి వీల్లేదు అని సుప్రీం కోర్టు చెప్పింది. అంత మాత్రాన లంచాలు తీసుకొమ్మని కాదు. ప్రతి ఎంపీ రాజ్యాంగాన్ని రక్షిస్తానని న్యాయంగా వ్యవహరిస్తానని భయపక్షపాతాలు లేకుండా పాలిస్తానని ప్రమాణం చేస్తారు. లంచం తీసుకుంటే పక్షపాతం వున్నట్టే, న్యాయంగా వ్యవహరిస్తాననే మాట ఉల్లంఘించినట్టే. ఈ అధికారాన్ని దుర్వినియోగం చేసుకోవడం వల్ల ఈ పరిణామాలు ఏర్పడతాయి. ఎంపీలుగానీ ఎంఎల్యేలు గాని నేరాలు చేసినా లంచాలు తీసుకున్నా మామూలు పౌరులు చేసిన నేరాలకన్నా తీవ్రమయిన నేరాలుగా వాటిని పరిగణించాలి. లేకపోతే అన్యాయమే అవుతుంది. కాని మామూలు పౌరులకు విధించే శిక్షించేందుకు కూడా వేల్లేదంటే న్యాయం కాదు. చట్టసభల గౌరవం కాపాడడానికి, కోర్టుతో సమానంగా శాసనసభా వ్యవస్థకు గౌరవం ఇవ్వడానికి ఒకరి మీద మరొక సంస్థ కేసులు నడపవద్దని నియమాలు చేసారు. పార్లమెంటులో ఇటువంటి తప్పులను నేరాలను పార్లమెంటే శిక్షించే ఏర్పాటు ఉండాలి. అప్పుడు కోర్టులకు ఆ అధికారం లేదంటే పరవాలేదనుకోవచ్చు. పార్లమెంటును చట్టసభలను, సభ్యులను అవమానిస్తే ప్రివిలేజెస్ కమిటీ విచారించి శిక్షిస్తుంది. కానీ చట్టసభల గౌరవానికి భంగం కలిగించే విధంగా లంచాలు తీసుకున్న వారిని ఈ కమిటీ ఎందుకు శిక్షించదు అన్నది ప్రశ్న. ఈ వివేకం వారిలో ఉదయించాలని కోరుకుందాం.

### లంచం సొమ్ము ఎవరికి చెందుతుంది?

ప్రశ్న: లంచాలు తీసుకున్న వారిని కోర్టులు శిక్షిస్తాయి కదా. మరి ఆ లంచం సొమ్ము ఎవరికి పోతుంది. నేరస్తులకేనా లేక ప్రభుత్వానికా లేక కోర్టులకా?

జవాబు: మీకు మంచి సందేహమే వచ్చింది. నిజానికి ఈ విషయంలో మన చట్టాలలో తీవ్రమైన లోపాలు ఉన్నాయి. సొమ్ము అక్రమంగా ఆర్జించినదని రుజువైన తరువాత కూడా ఆ సొమ్ము ప్రభుత్వానికి పరంచేయాలని జైలు శిక్షతోపాటు ఆస్తుల స్వాధీనం చేసుకోవాలని చట్టాన్ని సవరించాలని సూచిస్తూ, లా కమిషన్ ఒక సిఫార్సు చేసింది. కాని మన సర్కారు వారింకా కదలలేదు.

న్యాయసంబంధమైన అంశాలపై మీ సందేహాలకు **డాక్టర్ మాడభూషి శ్రీధర్** (అసోసియేట్ ప్రొఫెసర్, నేషనల్ లా అకాడమీ ఫర్ లీగల్ స్టడీస్ అండ్ రీసర్చ్ లా యూనివర్సిటీ, హైదరాబాద్) సమాధానాలు ఇస్తారు.

చిరునామా : ఏమిటి'లా'?, విజయవిహారం 12-5-33/2,విజయపురికాలనీ,తార్నాక, సికింద్రాబాద్-17, ☎ 7007053

# కొత్తపుంతలు తొక్కుతున్న గ్యాస్ట్రో ఎంటరాలజీ

## కొన్నేళ్ళ క్రితం

విపరీతమైన కడుపు నొప్పితో వచ్చాడు ఓ పేషెంట్. వెంటనే డాక్టర్ ఆ పేషెంట్‌ని ఫిజికల్‌గా పరీక్షించి, అతని ఆహార అలవాట్లు గురించి అడిగి - అల్సర్ కావచ్చని అనుమానించాడు. కాని అదే అని నిర్ధారణగా తెలియదు. దీని కోసం బేరియం మీల్ అనే పరీక్ష రాశాడు డాక్టర్.

* * *

పేషెంట్ ఖాళీ కడుపులో ఎక్స్‌రే విభాగానికి వెళ్ళాడు. అక్కడ టెక్నీషియన్ ఓ పెద్దగ్లాసు నీళ్లలో బేరియం సల్ఫేట్ అనే తెల్లటి పొడిని కలిపాడు. చిలికిన పెరుగులాంటి ఆ ద్రావణాన్ని పేషెంట్‌తో తాగించాడు. ఇబ్బంది అనిపించినా దాన్ని తాగక తప్పలేదు. వెంట వెంట కడుపు ఎక్స్‌రేలు తీశాడు టెక్నీషియన్. బేరియం ద్రావణం జీర్ణాశయంలో జారినంత మేర ఫిల్ములో తెల్లగా కనిపించింది. ఆ ఫిల్ములను రేడియాలజిస్టు చూసి క్రానిక్ అల్సర్ వున్నట్టు రిపోర్ట్ రాశాడు.

* * *

ఆ రిపోర్ట్ చూశాక సర్జన్ ఆపరేషన్ చేసి అల్సర్ పుండుని తొలగించాడు. కడుపు మీద 20-25 సెం.మీ.ల మేర జెర్రిపోతులా పెద్ద గీత... పదిపదిహేను కుట్లు... రెండు బాటిళ్ల రక్తం కూడా ఎక్కించారు. పదిరోజుల దాకా పేషెంట్ ఆస్పత్రిలోనే వున్నాడు. మళ్లీ అన్ని పనులు చేసుకునే స్థితి వచ్చేసరికి కొన్ని నెలలు పట్టింది.

## ప్రస్తుతం

పైన చెప్పిన పేషెంట్‌లానే తీవ్రమైన కడుపు నొప్పితో గాస్ట్రో ఎంటరాలజిస్టు దగ్గరికి వచ్చాడు ఓ వ్యక్తి. సింప్టమ్స్‌ను బట్టి అల్సర్ వున్నట్టు అనుమానించాడు. ఆ వ్యాధిని ఖచ్చితంగా నిర్ధారించుకోవడానికి ఇంతకు ముందిలా బేరియం మీల్ పరీక్షకి పంపలేదు. ఎండోస్కోపీ అనే పరీక్ష తానే చేశాడు. ఆ పరీక్షలో అల్సర్ ఉన్నట్లు దాని నుంచి రక్తస్రావం అవుతున్నట్లు గమనించాడు. ఎండోస్కోపి ద్వారా దాన్ని నివారించారు. కడుపు మీద గాటు లేదు. కుట్ల మచ్చలు లేవు. రెండు మూడు రోజుల్లోనే పేషెంట్ ఇంటికి వెళ్లిపోయాడు. 15 రోజుల్లోనే అన్ని పనులూ శుభ్రంగా చేయడం మొదలు పెట్టాడు.

## భవిష్యత్తులో

ఇంతకు ముందు చెప్పినట్టే ఓ పేషెంట్ వచ్చాడనుకోండి. వ్యాధినిర్ధారణకు ముందు చెప్పిన పరీక్షలేవీ అవసరం వుండవు. డాక్టర్ ఓ కాప్సూల్‌ని మింగిస్తాడు. పేషెంట్ నడుముకి వాక్‌మెన్ లాంటి పరికరాన్ని బిగిస్తాడు. పేషెంట్ మర్నాడు వెళ్లాలి. నడుముకున్న ఆ పరికరాన్ని తీసి, దాన్ని కంప్యూటర్‌కి కలిపితే - పేషెంట్ కడుపులో జీర్ణమండలమంతా స్పష్టంగా కనిపిస్తుంది. పుండు ఎక్కడుందో, ఏ స్థాయిలో వుందో స్పష్టంగా తెలుస్తుంది. ఎండోస్కోప్ సాయంతో ఆపరేషన్ పూర్తవుతుంది. ఈ పనంతా జరిగేది రెండు మూడు రోజుల్లోనే. పేషెంట్‌కి అసలు ఆపరేషన్ చేయించుకున్న ఫీలింగే వుండదు.

* * *

రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్న గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆవిష్కరించిన అద్భుతాల్లో ఇవి కొన్ని మాత్రమే. గ్యాస్ట్రో ఎంటరాలజీ అనేది జీర్ణ మండలానికి సంబంధించిన ప్రత్యేక విభాగం. ఇది ప్రస్తుతం ఓ అత్యాధునిక ప్రత్యేక విభాగంగా అభివృద్ధి చెందింది. పేషెంట్‌కి ఏమాత్రం ఇబ్బందినీ, అసౌకర్యాన్నీ కలిగించని సులభమైన రీతిలో వ్యాధుల్ని ఖచ్చితంగా నిర్ధారించే పరీక్షలు, ఆపరేషన్ పద్ధతులు ఎన్నో వచ్చాయి. పై ఉదాహరణ వీటిలో ఒకటి మాత్రమే. గతంలో కడుపు ఆపరేషన్ అంటే కడుపు మీద పెద్ద గాటు, కుట్లు వేయడం జరిగేది. ఆపరేషన్ తరువాత రోగి కోలుకోవడానికి కనీసం ఆరు నెలలు పట్టేది. ఇప్పుడు ఇటు వ్యాధి నిర్ధారణలోనూ అటు చికిత్సలోనూ అనేక ఆధునిక పద్ధతులు వచ్చాయి. చికిత్స సునాయాసంగా చేస్తున్నారు. పేగులలో అల్సర్, గాల్ బ్లాడర్‌లో రాళ్ళు, అపెండిసైటిస్ తదితర సమస్యలకు ఆపరేషన్ మరీ తేలికైపోయింది. వ్యాధి తీవ్రతను ఆపరేషన్ అవసరం లేకుండానే తగ్గించగలిగే మందులు వచ్చాయి. కీ హోల్ సర్జరీ లాంటి పద్ధతులతో ఆపరేషన్ చాలా సులభమైంది. వీడియో ఎండోస్కోప్ లాంటి పరికరాలతో చాలా వరకు జీర్ణ వ్యవస్థకు సంబంధించిన వ్యాధులను ఆపరేషన్ అవసరం లేకుండానే నివారిస్తున్నారు.

"గ్యాస్ట్రో ఎంటరాలజీ అభివృద్ధి చెందడంతో జీర్ణకోశ వ్యాధులలో సుమారు 70 శాతం కేసులకు ఆధునిక పరికరాలు, మందులతో నయం చేస్తున్నాం" అని ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ చీఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి తెలిపారు.

## గ్యాస్ట్రో ఎంటరాలజీ అభివృద్ధి

జీర్ణవ్యవస్థలో సంభవించే వ్యాధులన్నింటిని ఒక విభాగంలో చేరుస్తూ 1970లో మొదటిసారిగా దేశంలో గ్యాస్ట్రో ఎంటరాలజీ ప్రారంభమైంది. అంతకుముందు ఈ వ్యాధులకు జనరల్ సర్జన్లు, జనరల్ ఫిజీషియన్లు చికిత్స చేసేవారు. 1980 నాటికి అందులో నుంచి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ అవతరించింది. ఈ రెండు విభాగాలను వేరువేరుగా పిలుస్తున్నప్పటికి కొన్ని రకాల జీర్ణకోశ వ్యాధులకు చికిత్స చేసే సమయంలో మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌లు, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌లు కలిసి పని చేయడం గమనార్హం. ఉదాహరణకు గాల్‌బ్లాడర్‌లో రాళ్ళు ఏర్పడినప్పుడు మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ ఆధునిక రోగనిర్ధారణ పరీక్షలతో ఆ విషయం నిర్ధారించగా సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ లేప్రోస్కోపి సర్జరీ చేసి వాటిని తొలగిస్తాడు. 1975లో ఆంధ్రప్రదేశ్‌లోని ఉస్మానియా హాస్పటల్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం ప్రారంభమైంది. 1988 నాటికి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ అభివృద్ధి చెందింది. దాదాపు అదే సమయంలో జీర్ణకోశ వ్యాధులకు నిర్ధారణకు ఉపయోగించే ఎండోస్కోప్ అనే పరికరాన్ని జర్మనీ, జపాన్ దేశాలలో రూపొందించి వినియోగిస్తున్నారు. ఆ పరికరాన్ని దిగుమతి చేసుకోవడంతో ఇక్కడ కూడా అది అందుబాటులోకి వచ్చింది. ఇదే కాలంలో జీర్ణ వ్యవస్థలోని గాల్‌బ్లాడర్, క్లోమము, ఇతర వ్యాధుల నిర్ధారణకు ఉపకరించే అల్ట్రాసౌండ్ స్కానర్‌ను కూడా దిగుమతి చేసుకోవడంతో ఈ రంగంలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

80వ దశకానికి ముందు ప్రేవులలో అల్సర్‌ను నిర్ధారించడానికి బేరియం ద్రావణాన్ని తాగించి ఎక్స్-రే తీసేవారు. గర్భిణీ స్త్రీల విషయంలో ఇది కొన్నిసార్లు దుష్ఫలితాలకు దారితీసేది. ఉదాహరణకు గర్భిణీ స్త్రీలకు ఎక్స్-రే తీసినప్పుడు ఇది గర్భస్థ శిశువుపై ప్రభావం చూపి పుట్టే పిల్లలకు అంగవైకల్యానికి దారి తీసేది. అల్ట్రాసౌండ్ స్కానర్ రంగప్రవేశంతో ఆ పరిమితి తొలగి పోయింది. ఫలితంగా జీర్ణకోశ వ్యాధుల నిర్ధారణలో మరింత మెరుగైన ఫలితాలు లభించడంతో చికిత్స తేలికైంది. మరోవైపు శస్త్ర చికిత్స రంగంలో గుణాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి.







## లేప్రోస్కోపి సర్జరీ

లేప్రోస్కోపి సర్జరీని 1989లో మొదటిసారిగా ఫ్రాన్స్‌లో నిర్వహించారు. ఈ సర్జరీ అభివృద్ధి చెందక ముందు జీర్ణకోశ వ్యాధులకు మేజర్ సర్జరీ నిర్వహించవలసి వచ్చేది. ముఖ్యంగా గాల్‌బ్లాడర్‌లో రాళ్ళు, అపెండిసైటిస్ (24 గంటల కడుపునొప్పి), చిన్నపేగు, పెద్దపేగు క్యాన్సర్‌లు మూత్రపిండానికి సంబంధించిన ఆపరేషన్లు, గర్భసంచి వ్యాధులకు మేజర్ సర్జరీ చేయవలసి వచ్చేది. మేజర్ సర్జరీ సందర్భంగా ఉదరంపై 20 నుంచి 25 సెంటీమీటర్ల కోతపెట్టి, మూడు నుంచి నాలుగు గంటలు కష్టపడి దీన్ని పూర్తి చేయవలసి వచ్చేది. ఆపరేషన్ సందర్భంగా రోగికి ఒకటి లేదా రెండు సీసాల రక్తం కూడా ఇవ్వవలసిన అవసరం ఏర్పడేది. ఆపరేషన్ తరువాత రోగి కనీసం రెండు నెలలు విశ్రాంతి తీసుకోవలసి వచ్చేది. కనీసం ఆరునెలల వరకు బరువైన పనులు చేయకూడదని సలహా ఇచ్చేవారు. లేప్రోస్కోపి సర్జరీ రాకతో ఆ బాధ తప్పిపోయింది.

లాప్రోస్కోపి సర్జరీలో అవయవాలు స్పష్టంగా కన్పించడానికి ముందుగా రోగి ఉదరంలో నాలుగు లీటర్ల వరకు 'కార్బన్ డయాక్సైడ్($CO_2$)ను ప్రవేశపెడతారు. మత్తు ఇచ్చిన అనంతరం రోగి బొడ్డు కింద చిన్న రంధ్రాన్ని చేసి దాని ద్వారా టెలిస్కోప్ కలిగిన వీడియో కెమెరాను లోపలికి పంపిస్తారు. ఈ వీడియో కెమెరాను ఆపరేషన్ థియేటర్‌లో టెలివిజన్‌కు కలుపుతారు. ఫలితంగా రోగి కడుపులోని భాగాలన్నీ టెలివిజన్ తెరపై 20 రెట్లు పెద్దగా కన్పిస్తాయి. మరి రెండు రంధ్రాల ద్వారా ప్రత్యేకమైన కత్తెరలు, పట్టకార్లు, క్లిప్పులు లోపలకు ప్రవేశపెడతారు. రోగి శరీరం నుంచి రక్తం స్రవించకుండా ఎలక్ట్రోకాటరే అనే పరికరాన్ని ఉపయోగించి రక్తనాళాలను మూసి వేస్తారు. పెద్ద సైజు రక్తనాళాలను మూసివేయు డానికి ప్రత్యేకమైన క్లిప్పులను ఉపయోగిస్తారు. డాక్టర్ టీవీ. మానిటర్‌పై చూస్తూ ఆపరేషన్ నిర్వహిస్తాడు.

లాప్రోస్కోపి ఆపరేషన్ అనంతరం రోగి ఆస్పత్రిలో మూడు రోజులకంటే ఎక్కువ కాలం ఉండవలసిన అవసరం లేదు. రోగి కేవలం 24 గంటలలో ఆహారం తీసుకోవచ్చు. 15 రోజులలో రోగిబరువు పనులుకూడా చేసుకోవచ్చు. ముందు ముందు ఆ రంగంలో మరిన్ని మార్పులు చోటుచేసుకోనున్నాయి. "అభివృద్ధి చెందిన దేశాలలో ఇప్పటికే ఇప్పుడు మనం వాడుతున్న 2డి కెమెరాల స్థానంలో 3డి కెమెరాలను వినియోగిస్తున్నారు. అతి త్వరలో మనదేశంలో కూడా ప్రవేశిస్తాయి" అని డాక్టర్ సి.ఎల్. వేంకట రావు అన్నారు. అదేవిధంగా రోబోట్ ద్వారా లేజర్ కిరణాల ద్వారా ఈ శస్త్రచికిత్సలను నిర్వహించే విధానాలు ఊపందుకోనున్నాయి.

## బహుళ ప్రయోజనకారి ఎండోస్కోప్

ఎండోస్కోప్ రంగప్రవేశంతో జీర్ణకోశ వ్యాధుల నిర్ధారణ, చికిత్స చేయడం మరింత సులభతరంగా మారింది. మొదటితరం ఎండోస్కోప్‌ను ఫైబర్ ఆప్టిక్ ఎండోస్కోప్ అనేవారు. ఈ ఎండోస్కోప్‌లో భాగమైన ఒక పైప్‌ను నోటి ద్వారా, రెక్టమ్ ద్వారా జీర్ణవ్యవస్థ లోనికి ప్రవేశపెట్టి వ్యాధులను నిర్ధారించేవారు. 1995 నాటికి వీడియో ఎండోస్కోప్ రంగ ప్రవేశం చేసింది. ఎండోస్కోప్ వ్యాధి నిర్ధారణకు మాత్రమేకాక జీర్ణవ్యవస్థలో వ్యాధి ఉన్న ప్రాంతంలోకి నేరుగా మందులు ఇవ్వడానికి, అల్సర్ పగిలి రక్తస్రావం జరుగుతున్నప్పుడు దాన్ని నివారించడానికి ఉపకరించేలా అభివృద్ధి చేశారు. ఈ కారణంగానే ఈ వీడియో ఎండోస్కోప్‌ను థెరపాటిక్ ఎండోస్కోప్ అని పిలుస్తున్నారు. దీంతో ప్రస్తుతం 70 శాతం జీర్ణకోశ వ్యాధులు చికిత్స చేస్తున్నారు.

కొద్ది రోజుల్లో క్యాప్సుల్ రూపంలో ఉన్న ఎండోస్కోప్ అందుబాటులోకి రానుంది. అంటే ఓ బుల్లికెమెరా క్యాప్సుల్ రూపంలో ఉంటుందన్న మాట. దీన్ని మింగితే చాలు జీర్ణవ్యవస్థకు సంబంధించి చిత్రాన్ని స్పష్టంగా కళ్ళముందుంచుతుంది. ఇది ప్రస్తుతం ప్రయోగదశలో ఉంది. మొత్తం ఆసియా ఖండంలోనే ఈ క్యాప్సుల్ కెమెరా మన హైద్రాబాద్‌లో మొట్టమొదట వినియోగంలో రానుంది.

## లేజర్ కిరణాలతో చికిత్స

జీర్ణకోశవ్యాధులకు చికిత్సకు లేజర్‌కిరణాలు కూడా వినియోగిస్తున్నారు. ఉదాహరణకు లివర్ సిర్రోసిస్ అనే వ్యాధి సంభవించి నప్పుడు అన్నవాహికలో రక్తనాళాలు పెద్దవవు తాయి. అవి చిట్లి రక్తపు వాంతులవుతాయి. ఈ రక్తనాళాలను తొలగించాలంటే ఆపరేషన్ చేయవలసి ఉంటుంది. అభివృద్ధి చెందిన వైద్య విధానాలలో భాగంగా లేజర్ కిరణాలతో అనారోగ్యకరమైన రక్తనాళాలను పాడిచేస్తారు.

లివర్ క్యాన్సర్, లివర్ సిర్రోసిస్‌లాంటి వ్యాధులకు కాలేయుమార్పిడి తప్ప మరో గత్యంతరం లేదు. దీనికోసం కాలేయాన్ని దానం చేయాల్సిన అవసరం వుంది. అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి. జన్యుపరిశోధనలు అనేకవ్యాధుల నిర్ణారణలో, చికిత్సలో అద్భుతాలు సృష్టించబోతున్నాయి. గాస్ట్రో ఎంటరాలజీలో కూడా జీన్‌థెరపితో కొత్త శకం ఆరంభం అవుతుందని డా॥ రెడ్డి తెలిపారు●

- టి.ఎస్. నివాస్

## ప్రపంచశ్రేణి వైద్యసేవలు ఇక్కడా ఉన్నాయి



డా॥ సి.ఎల్.వెంకట్రావు మెడ్విన్ హాస్పిటల్ ఛీఫ్ సర్జికల్ గాస్ట్రో ఎంటరాలిజిస్ట్‌గా పనిచేస్తున్నారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జీర్ణకోశ సంబంధమైన వేలాది శస్త్ర చికిత్సలు నిర్వహించిన ఈయన మరోవైపు అనేక సేవా కార్యక్రమాల్లోను పాల్గొంటున్నారు.

విజయవిహారం: రాష్ట్రంలో గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం అభివృద్ధి ఎలా ఉంది.

సి.ఎల్.వెంకటరావు: 1970 ప్రాంతంలో మొదలైన గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం క్రమేణా 1990 నాటికి గణనీయంగా అభివృద్ధిని సాధించింది. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్‌లో గ్యాస్ట్రో ఎంటరాల జిస్ట్‌లు ప్రపంచశ్రేణి వైద్యసేవలను అందిస్తున్నారు.

వి.వి.: వైద్యరంగంలో మొదటి నుండి గుండె వ్యాధుల చికిత్స విభాగం కీలకమైనదిగా భావిస్తున్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజీకికూడా అంత ప్రాధాన్యముందా?

సి.ఎల్.: వైద్యరంగంలో ఒక విభాగం ఎక్కువ, మరొక విభాగం తక్కువ అని లేదు. ప్రతివిభాగం ముఖ్యమైనదే. గ్యాస్ట్రో ఎంటరాలజీ అభివృద్ధితో ఇప్పటి వరకు పరిష్కారం దొరకని అనేక వ్యాధులకు చికిత్స చేస్తున్నాం. ఒకప్పుడు లివర్ క్యాన్సర్ వస్తే మరణమే అని భయపడేవారు. కాని లివర్‌ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్స అందుబాటులోకి రావడంతో ఈ వ్యాధిగ్రస్తుల ఆయుర్దాయాన్ని గణనీయంగా పొడిగించగలుగు తున్నారు.

వి.వి.: ఆంధ్రప్రదేశ్‌లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సలు జరగకపోవడానికి కారణమేమిటి?

సి.ఎల్.: ప్రజాచైతన్యం లోపించడమే. ఎవరైనా మరణిస్తే వారి బంధువులు ఉదారంగా ఆలోచించి మృతుడి లివర్‌ను దానం చేయడానికి ముందుకు రావాలి. అప్పుడు ఇక్కడ కూడా కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయవచ్చు. మన దేశంలో నిపుణులకు కొదవ లేదు. ప్రజలకు అవయువాల దానం పట్ల అవగాహన లేకనే దేశంలో వందల సంఖ్యలో జరగవలసిన కాలేయ మార్పిడీ శస్త్రచికిత్సలు, ప్రస్తుతం పదుల సంఖ్యలో మాత్రమే జరుగుతున్నాయి.

వి.వి.: అభివృద్ధి చెందిన దేశాలలో గ్యాస్ట్రో ఎంటరాలజీ అభివృద్ధి ఎలా ఉంది?

సి.ఎల్.: అభివృద్ధి చెందిన దేశాలలో ఈ రంగంలో విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఉదాహరణకు ప్రస్తుతం ఇక్కడ లాప్రోస్కోపి శస్త్రచికిత్స చేయడానికి '2డి' కెమెరాలను ఉపయోగిస్తున్నాం. అక్కడ '3డి' కెమెరాలను ఉపయోగిస్తున్నారు. 3డి కెమెరాలు ఈ శస్త్రచికిత్సను మరింత సులభతరం చేస్తాయి. అక్కడ రోబోట్ సహాయంతో శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇవి త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రవేశించనున్నాయి.

వి.వి.: అభివృద్ధి చెందిన చికిత్సా విధానాలు కేవలం డబ్బు చెల్లించే వారికోసమేనా, వైద్యులు సేవా దృక్పథంతో ఆలోచించి, తమ సేవలను పేదలకు అందించాల్సిన అవసరం లేదంటారా?

సి.ఎల్.: అభివృద్ధి చెందిన చికిత్సా విధానాలు పేదలక్కూడా అందించాలి. అందుకోసం కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించడానికి ఉచిత గ్యాస్ట్రో ఎంటరాలజీ క్లినిక్‌ను నిర్వహిస్తున్నాను. ఇంకా ఆ సమీప గ్రామాలలో కూడా క్రమం తప్పకుండా ఉచితవైద్యశిబిరాలను నిర్వహి స్తున్నాను. హైదరాబాద్‌లో కూడా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాక్సినేషన్ సెంటర్లను నిర్వహిస్తున్నాం. ఇక్కడ కొన్ని రకాల వాక్సిన్లను ఉచితం, మరికొన్ని రకాల వాక్సిన్లను సబ్సిడీధరలతో అందిస్తున్నాం ●

## పరిశోధనల్లో ఇంకా విజయాలు సాధిస్తాం



డా॥ డి.వి. నాగేశ్వరరెడ్డి మెడినోవా డయాగ్నస్టిక్ సర్వీసెస్‌కు చెందిన ప్రతిష్ఠాత్మకమైన ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గాస్ట్రో ఎంటరాలజి డైరెక్టర్‌గా, చీఫ్ గాస్ట్రో ఎంటరాలజిస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. వైద్య వృత్తిలో క్షణం తీరికలేకున్నా అనేక పరిశోధనా కార్యక్రమాల్లో పాలుపంచుకుని అంతర్జాతీయ ఖ్యాతి గడించారు.

వి.వి : జీర్ణకోశ వ్యాధులకు చికిత్సలో మెడికల్ గాస్ట్రో-ఎంటరాలజిస్టుల పాత్ర కీలకమైందా? సర్జికల్ గాస్ట్రోఎంటరాలజిస్టుల పాత్ర కీలకమైందా?

డా॥నా.రె. : గాస్ట్రో ఎంటరాలజీలో మెడికల్ గాస్ట్రో ఎంటరాలజీ, సర్జికల్ గాస్ట్రో ఎంటరాల జిస్ట్‌లకు సమాన ప్రాధాన్యముంది. నిజానికి ఈ రెండు విభాగాలు పరస్పర సహకారంతో పనిచేయ వలసి వుంటుంది. ఉదాహరణకు మెడికల్ గాస్ట్రో ఎంటరాలజిస్ట్ జీర్ణకోశం రోగనిర్ధారణ పరీక్షలన్నీ నిర్వహిస్తే, ఆ పరీక్షలపై ఆధారపడి సర్జికల్‌గాస్ట్రో ఎంటరాలజిస్ట్ శస్త్ర చికిత్స చేస్తాడు. ఈ రెండు విభాగాల డాక్టర్లు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు లభిస్తాయి. ఈ కారణంగానే మా ఇనిస్టిట్యూట్‌లో 'టీమ్' వర్క్‌కు ప్రాధాన్యమిస్తాం.

వి.వి. : జీర్ణకోశ వ్యాధుల చికిత్సలో ఫలితాలు ఎలా వుంటున్నాయి.

డా॥నా.రె. : వ్యాధి నిర్ణారణకు ఖచ్చితమైన పరీక్షలు, ఔషధాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఈ వ్యాధుల చికిత్స విషయంలో మంచి ఫలితాలు లభిస్తున్నాయి. ఉదాహరణకు 1993లో అల్సర్ వ్యాధి బాక్టీరియా (హెచ్.పైలోరియా) కారణమని పరిశోధనలో వెల్లడైంది. అప్పటి నుంచి అందుకు అవసరమైన వైద్య విధానాల ననుసరించి చికిత్స చేస్తున్నాం. ఇప్పుడు మంచి ఫలితాలు లభిస్తున్నాయి.

వి.వి.: జీర్ణకోశవ్యాధుల నివారణకు పరిశోధనలు ఏ స్థాయిలో జరుగుతున్నాయి.

డా॥నా.రె.: జీన్‌థెరపిపై అంతర్జాతీయస్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయి. యు.ఎస్.ఎ.లో 'ఆండీ' అనే చింపాంజీ పిండ దశలో ఉన్నప్పుడే పాంక్రియా టైటిస్ వ్యాధికి కారణమయ్యే క్రోమోజోమ్‌ను కనుగొన్నారు. క్రోమోజోమ్-2 అనే ఈ క్రోమోజోమ్‌ను పిండదశలో సరిచేయడం ద్వారా విజయం సాధించారు. ఈ పరిశోధన ఫలితాలు త్వరలో మానవులకు కూడా అందుబాటులోకి వస్తాయి.

వి.వి.: జీన్‌థెరపీ ద్వారా ఏఏ వ్యాధులకు చికిత్స లభిస్తుంది?

డా॥నా.రె.: వ్యాధులు వచ్చిన తరువాత చికిత్స చేయడం కన్న, అవి అసలు రాకుండా చూసుకోవడం మంచిది. ఉదాహరణకు కోలన్ క్యాన్సర్ ఫాంక్రియాస్ క్యాన్సర్, వచ్చిన తరువాత చికిత్సలేదు. కనుక జీన్ థెరపీద్వారా ఈ వ్యాధులను పిండదశలోనే నివారించవచ్చు.

వి.వి.: ఆంధ్రప్రదేశ్‌లో ఏ అంశాలపై పరిశోధనలు జరుగుతున్నాయి? ఫలితాలు ఎలా వున్నాయి.

డా॥నా.రె.: ఇక్కడ అనేక అంశాలలో పరిశోధనలపై పాలు పంచుకుంటున్నాం. కొన్ని విజయాలు కూడా సాధించాం. ఈ సోపేగస్ కాన్సర్ చికిత్సలో ఉపయోగించే 'స్టెంట్' అనే పరికరాన్ని గతంలో దిగుమతి చేసుకునే వాళ్ళం. అప్పుడు దాని విలువ సుమారు 30 వేల రుపాయిలేండేది. ప్రస్తుతం దాన్ని మా ఇనిస్టిట్యూట్ అభివృద్ధి చేసిన ఫలితం కేవలం నూరు రూపాయలకే అందిస్తున్నాం. ఇంకా కాప్యుల్స్, ఎండోస్కోప్ పై పరిశోధనలో పాలు పంచుకుంటున్నాం ●



# ఇంటిఖర్చుపై అదుపుంటే క్రెడిట్ కార్డుతో ఎంత లాభమో!




నచ్చిన వస్తువు కొనాలంటే మధ్యతరగతి జీవుల పర్సు ఎప్పుడూ పచ్చగా వుండదు. రెడీ క్యాష్ లేకపోవడంతో ఇన్‌స్టాల్‌మెంట్ల చుట్టూ గిరికీలు కొడతాం. ఏ ఒకటో రెండో దుకాణాల్లో దొరికే వస్తువుల్నే నచ్చకున్నా రాజీపడి తీసుకోవాల్సి వస్తుంది. రెడీ క్యాష్ లేదనే సమస్యకి బెస్టైన పరిష్కారం క్రెడిట్ కార్డ్. ఇది జేబులో వుందంటే ఎంత తక్కువ స్థాయి కార్డు అయినా - కనీసం ఓ ఇరవై వేలు జేబులో వున్నట్టే. భరోసాతో ధీమాగా మార్కెట్‌ను చుట్టి రావచ్చు. ముఖ్యంగా మనకు నచ్చిన వస్తువుల్నే కొనుక్కోవచ్చు. ఏ అర్ధరాత్రైనా అప్పుకోసం ఎవర్నీ దేబిరించాల్సిన అక్కర లేదు. మనం ఎంత మేరకు ఖర్చు చేయవచ్చో నిర్దేశిస్తూ బ్యాంకు క్రెడిట్ కార్డు జారీచేస్తుంది. ఆ మొత్తానికి లోబడి మనం షాపింగ్ చేయవచ్చు. ట్రేడర్ మన బిల్లుల్ని బ్యాంకుకు పంపుతాడు. దాన్ని బ్యాంకు చెల్లించి ఆ మేరకు ఒక స్టేట్‌మెంట్ రూపంలో ప్రతినెలా మనకు పంపుతుంది. ఆ తర్వాత బ్యాంకుకు ఆ మొత్తాన్ని మనం జమచేయాల్సి వుంటుంది. వడ్డీ లేకుండా 50 రోజుల్లో లేదా నిర్ణీత వడ్డీతో మనకు వీలైనంత మేరన తిరిగి చెల్లించే వెసులుబాటు క్రెడిట్ కార్డ్‌లో వుంది. ఇలా క్రెడిట్ కార్డ్‌ని మనకి వచ్చే ఆదాయాన్ని బట్టి ఓ ప్లానింగ్ ప్రకారం మెయింటేన్ చేస్తే చాలా లాభాలున్నాయి.

దొరికింది కదా అని కనిపించిందల్లా కొనేస్తూ పోతే వడ్డీ చక్రంలో ఇరుక్కునే ఇబ్బందులూ వున్నాయి.

## స్టేటస్ సింబల్ కాదు...

క్రెడిట్ కార్డులు ఒకప్పుడు బాగా ఉన్నత స్థాయిలో ఉన్న వారికే పరిమితమైన వుండేది. స్టేటస్ సింబల్‌గా భావించేవారు. కానీ ఇప్పుడు క్రెడిట్ కార్డ్ కల్చర్ మధ్యతరగతి కుటుంబాలకి వేగంగా పాకుతోంది. దీన్ని ఓ స్టేటస్ సింబల్‌గా కాక ఓ ముఖ్య అవసరంగా భావిస్తున్నారు. కార్డ్‌ని జారీ చేయాలంటే గతంలో సవాలక్ష నియమాలుండేవి. ఇప్పుడు బ్యాంకుల మధ్య పోటీ పెరిగింది. మెంబర్‌షిప్ నియమాలు సడలిపోయాయి. దీంతో సాధారణ ఉద్యోగులు కూడా చాలా తేలిగ్గా సభ్యులుగా చేరే అవకాశం కలిగింది. దీనికి తోడు క్రెడిట్ కార్డుల్ని అనుమతించే దుకాణాలు, వ్యాపార సంస్థల సంఖ్య నగరాల్లోనే కాక చిన్న చిన్న పట్టణాల్లో కూడా విపరీతంగా పెరిగింది. "ఎక్కడికైనా, ఎప్పుడైనా, ఏదైనా" అన్నది క్రెడిట్ కార్డులోని సౌలభ్యం. భవిష్యత్తులో పచ్చనోట్లు ఎక్కడా కనిపించవు. టెలిఫోన్, విద్యుత్ బిల్లులు చెల్లించడం దగ్గర్నుంచీ లావాదేవీలన్నీ ప్లాస్టిక్ కార్డులతోనే జరుగుతాయనడానికి సంకేతాలు అప్పుడే కనిపిస్తున్నాయి. మన జీవితంలో అతి ముఖ్యావసరంగా మారబోతున్న క్రెడిట్ కార్డ్ గురించి ప్రజల్లో అవగాహన ఇప్పటికీ తక్కువే వుంది.

## క్రెడిట్ కార్డు పుట్టుక

క్రెడిట్ కార్డు ఆలోచన మొదట ఫ్రాంక్ మెక్ నమరా అనే వ్యాపారవేత్తకు వచ్చింది. 1950లో ఓసారి న్యూయార్క్‌లోని ఓ రెస్టారెంట్‌కి వెళ్ళాడు ఫ్రాంక్. తీరా తిన్నాక బిల్లు కడదామని చూస్తే జేబులో పర్సు లేదు. రెస్టారెంట్ ఓనర్‌కి క్షమాపణ చెప్పి ఎలాగో బైటపడ్డాడు కానీ ఆ పరిస్థితి చాలా అవమానంగా తోచింది. బైటికి నడుస్తుంటే - ఎవరూ ఇలాంటి ఇబ్బందిని ఎదుర్కోకుండా పరిష్కారం కనిపెట్టలేమా అన్న ఆలోచన వచ్చింది. దాని ఫలితమే 'డైనర్స్ క్లబ్' అనే సంస్థ ఏర్పాటు... ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అమలులో వున్న డైనర్స్ కార్డ్ అలా పుట్టింది. అయితే క్రెడిట్ కార్డ్‌కి ఆద్యుడిగా ఫ్రాంక్‌ని చాలా మంది ఒప్పుకోరు. బాగా తెలిసిన వారికి వ్యాపారులు సరుకుల్ని అరువుకి ఇవ్వడమనేది కొన్ని వందల ఏళ్ల క్రితం నుంచే వుందని చెబుతారు. ఇప్పటికీ కిరాణా కొట్లలో నెలవారీ ఖాతాలు మామూలే. ఈ పద్ధతినే ఫ్రాంక్ అభివృద్ధి చేసి వుండవచ్చు. ఒకటో రెండో దుకాణాల్లో కాక దాదాపు మనకిష్టమైన చోటునుంచి, నచ్చిన వస్తువుని కొనుక్కునే వెసులుబాటుని క్రెడిట్ కార్డ్ కలిగిస్తుంది.

ఇండియా విషయానికి వస్తే 1980 మొదట్లో క్రెడిట్ కార్డ్‌లు అమలులోకి వచ్చాయి. దేశంలోకి మొదట వచ్చింది డైనర్స్ కార్డే. ఆంధ్రా బ్యాంక్ దీనికి తొలుత శ్రీకారం చుట్టింది. క్రమంగా కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, సెంట్రల్ బ్యాంక్... ఇలా ఎన్నో జాతీయ బ్యాంకులు దీన్ని అనుసరించాయి. మన దేశంలో అతి పెద్ద బ్యాంకైన ఎస్‌బిఐ క్రెడిట్ కార్డు రంగంలోకి దాదాపు పదేళ్ళు ఆలస్యంగా ప్రవేశించింది. ఇప్పుడు జాతీయ, ప్రైవేటు, విదేశీ అన్న తేడా లేకుండా దాదాపు అన్ని బ్యాంకులూ క్రెడిట్ కార్డుల్ని జారీ చేస్తున్నాయి.

## క్రెడిట్ కార్డ్ అంటే ఏమిటి?

మన ఆదాయ పరిమితిని బట్టి ఓ నిర్ణీత మొత్తాన్ని - స్వల్పకాలిక రుణంగా వాడుకునేందుకు అనుమతిస్తూ బ్యాంకు జారీ చేసే కార్డే క్రెడిట్ కార్డ్. ఉదాహరణకి నెలకి 5000 పొందే ఉద్యోగికి 20-25 వేల మధ్య క్రెడిట్ లిమిట్ గల కార్డు పొందేందుకు అర్హత ఉంది. అంటే మన క్రెడిట్ లిమిట్‌కు లోబడి ఎంత మొత్తానికి షాపింగ్ చేస్తామో ఆ మొత్తాన్ని ట్రేడర్‌కు బ్యాంకు మన తరపున చెల్లిస్తుందన్న మాట. బ్యాంకుకి ఆ మొత్తాన్ని మనం తర్వాత చెల్లించాలి. రెడీ క్యాష్ ఎప్పుడూ ఉండని మధ్య తరగతి ఉద్యోగులకి క్రెడిట్ కార్డు నిజంగా వరమే. క్రెడిట్ కార్డ్ వల్ల ముగ్గురికి ప్రయోజనం వుంది.

ఒకటి కార్డు మెంబరుకి భద్రత. ఆ క్షణంలో డబ్బు లేకున్నా షాపింగ్ చేయగలం అనే ధీమా. కొనుగోలు శక్తి పెరుగుతుంది. నచ్చిన చోట వస్తువుల్ని కొనుక్కోవచ్చు.

రెండవది ట్రేడర్‌కి - కార్డుల్ని అనుమతించడం వల్ల దుకాణదారుడికి గిరాకీ పెరుగుతుంది. జేబులో తక్షణం డబ్బు లేక తర్వాత కొందాంలే అని వాయిదా వేసే వినియోగదారుల్ని షాపింగ్‌కి ఆకర్షించినట్టు అవుతుంది.

మూడవది బ్యాంకులకి - కార్డు జారీ చేసినందుకు వినియోగదారుడి నుంచి ప్రవేశ ఫీజు (ఒకేసారి), వార్షిక ఫీజు (ఏడాదికి ఒకసారి), దుకాణదారుల నుంచి కొంత కమిషన్, వినియోగదారుడి నుంచి వడ్డీ రూపంలో ఆదాయం లభిస్తుంది.

మనం నెలవారీగా ఎంతో కొంత డబ్బు ఖర్చు చేయకుండా ఉండలేం కదా. అదే డబ్బును క్రెడిట్ కార్డుకి జమచేయడం అలవాటు చేసుకుంటే ఏ క్షణానికి ఏ అవసరం వస్తుందో తెలియని - జేబులో డబ్బు ఎప్పుడూ రెడీగా ఉండని మధ్యతరగతి వారికి నిజంగా ఇది వరమే అవుతుంది.

## క్రెడిట్ కార్డు పొందడం ఎలా?

నెలసరి ఆదాయం కనీసం ఐదు వేలు వుంటే క్రెడిట్ కార్డు వచ్చేసినట్టే. బ్యాంకుకి వెళ్ళి నేరుగా దరఖాస్తు తెచ్చుకోవచ్చు. దాదాపు అన్ని బ్యాంకులకు 24 గంటలు పని చేసే కాల్ సెంటర్లు ఉన్నాయి. (ఉదాహరణకి ఐసిఐసిఐ నంబరు 040-3756062) ఈ నంబర్‌కి ఫోన్ చేస్తే ఏజెంట్ ఇంటికే వస్తాడు. వ్యక్తిగత వివరాలన్నీ నింపిన దరఖాస్తుతో ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలను జతచేసి పంపాలి. అప్లికేషన్ ప్రాసెస్ కావడానికి ఆయా బ్యాంకులని బట్టి వారం నుంచి మూడు వారాలు పడుతుంది. మన ఆదాయాన్ని బట్టి క్రెడిట్ లిమిట్ (అంటే మనం ఖర్చు చేయాల్సిన పరిమితి)ను బ్యాంకు నిర్దేశిస్తూ కార్డును కొరియర్ ద్వారా ఇంటికి పంపుతుంది. వ్యాపారులు, స్వయం ఉపాధి కలవారు ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్‌తోపాటు 6 నెలల బ్యాంక్ పాస్‌బుక్ స్టేట్‌మెంట్ లేదా బిజినెస్ పేరిట ఉన్న బ్యాంక్ అకౌంట్ లేదా ఆడిట్ అయిన బ్యాలెన్స్ షీట్ కాపీ జత చేయాలి. ఆదాయం ఎక్కువగా వుంటే క్రెడిట్ లిమిట్ కూడా ఎక్కువుంటుంది. కొన్ని కార్డులకి ఈ లిమిట్ 1,75,000 వరకూ కూడా ఉంటుంది.

## కార్డ్‌కి ఎంత చెల్లించాలి?

1) ఎంట్రీ ఫీజు (ఒకేసారి చెల్లించేది) కార్డుని బట్టి 100 - 400 మధ్య వుంటుంది.

2) వార్షిక ఫీజు (ఏడాదికి ఒకసారి) ఇది కూడా కార్డుని బట్టి 300 - 1500 మధ్య వుంటుంది. ఉదాహరణకి 21,000 క్రెడిట్ లిమిట్ ఉన్న ఐసిఐసిఐ కార్డ్‌కి ఎంట్రీ ఫీజు రు.100 వార్షిక ఫీజు రు.300

3) యాడ్ ఆన్ కార్డ్ - కార్డ్‌ని మీరొక్కరే కాకుండా మీ శ్రీమతి లేదా సోదరుడో కూడా వాడుకోడానికి వీలుగా ఉండాలనుకుంటే మరో కార్డ్ జారీ చేస్తుంది. దీనికి కూడా కార్డుని బట్టి 100-1200 మధ్య వుంటుంది.

అప్లికేషన్‌లో పేర్కొన్న మన ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకొని బ్యాంకు మన క్రెడిట్ లిమిట్‌ను నిర్దేశిస్తుంది. ఉదాహరణకు ఐసిఐసిఐ ట్రూ బ్లూ, స్టెర్లింగ్ సిల్వర్, గోల్డ్ కార్డు అనే మూడు రకాల కార్డులను జారీ చేస్తుంది. 5000 ఆదాయం ఉన్న వారికి ట్రూ బ్లూ కార్డ్ జారీ చేస్తుంది. దీని క్రెడిట్ లిమిట్ 21,000. మిగతా కార్డులకి ఈ లిమిట్ ఎక్కువగా ఉంటుంది.

## అన్ని కార్డుల్ని అన్నిచోట్ల అనుమతిస్తారా?

వీసా, మాస్టర్ కార్డ్, డైనర్స్ కార్డ్ వంటి అంతర్జాతీయ కార్డులకు అన్నిచోట్లా ఆదరణ వుంది. ఇప్పుడు కొత్తగా ఈ రంగంలోకి ప్రవేశిస్తున్న బ్యాంకులన్నీ వీటితో ఒప్పందం చేసుకోవడం వల్ల ఈ బ్యాంకుల కార్డులకి కూడా అన్ని చోట్లా అనుమతి లభిస్తోంది. ఉదాహరణకి ఐసిఐసిఐకి వీసాతో ఒప్పందం ఉంది. అంటే దానర్థం వీసా కార్డ్‌ను అనుమతించే ఏ షాపులోనైనా ఐసిఐసిఐ కార్డు ఉన్నవారు కొనుగోలు చేయొచ్చన్నమాట. అందుకే కొత్తది పాతది అన్న తేడా లేకుండా ఏ బ్యాంకు జారీ చేసే కార్డుకైనా దాదాపు ఒకే రకమైన ప్రయోజనాలు, రూల్సు, ఆదరణ వుంటాయి.

## క్రెడిట్‌కార్డ్ ఎలా పని చేస్తుంది?

నాలుగైదు దుకాణాలు షాపింగ్ చేసామనుకోండి. వెళ్ళిన ప్రతిచోట కార్డు చూపి బిల్లు (చార్జ్ స్లిప్) మీద సంతకం చేయాలి. ఈ చార్జ్ స్లిప్‌లను ట్రేడర్లు కార్డుని జారీ చేసిన బ్యాంకుకి పంపుతారు. ఆ బిల్లు మొత్తాన్ని కొంత కమిషన్ మినహాయించుకుని బ్యాంకు చెల్లిస్తుంది. ప్రతి నెలలో ఏదో ఒక తేదీ లోగా బ్యాంక్ నుంచి స్టేట్‌మెంట్ వస్తుంది. బ్యాంక్‌కు మనం చెల్లించాల్సిన డబ్బు వివరాలు అందులో వుంటాయి. ఇది అందిన 20 - 22 రోజుల్లోగా ఈ మొత్తాన్ని బ్యాంకుకి జమచేయాలి. అలా వీలు కానప్పుడు కనీసం బిల్లు మొత్తంలో 5% అయినా లేదా అంతకు మించైనా చెల్లించవచ్చు. ఇంకా చెల్లించాల్సింది మిగిలి వుంటే ఆ మొత్తాన్ని మరునటి నెల స్టేట్‌మెంట్‌లో కలుపుతారు. అప్పుడు దానిపై 2.5 శాతం వడ్డీ పడుతుంది. ఉదాహరణకి ఐసిఐసిఐ బ్యాంక్ 50 రోజులు 'ఇంట్రెస్ట్ ఫ్రీ' పీరియడ్ ఇస్తామని చెబుతుంది. అంటే దీనర్థం 50 రోజులదాకా రుణాన్ని ఫ్రీగా ఇస్తుందన్న మాట. అయితే ఐదు వేరువేరు రోజుల్లో కొనుగోళ్ళు చేసామనుకుందాం. ఈ ఐదు కొనుగోళ్ళకి 50 రోజులు 'ఇంట్రెస్ట్ ఫ్రీ' పీరియడ్ వర్తిస్తుందా అన్నది అనుమానం. మనకి ప్రతి నెలా 15న బ్యాంక్ నుంచి స్టేట్‌మెంట్ వస్తుందనుకుందాం. ఆ స్టేట్‌మెంట్‌లో గత నెల 15 నుంచి ఈ నెల 14 దాకా చేసిన ఖర్చు వివరాలు వుంటాయి. ఇది అందిన 20 రోజుల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించాలి. అంటే మొత్తం యాభై రోజులన్న మాట. అంటే గత నెల 15న కొన్న వస్తువుకి 50 రోజుల దాకా వడ్డీ ఉండదని తేలిగ్గానే అర్థమవుతుంది. అదే ఒకటో తారీకు కొన్న వస్తువుకి 35 రోజుల వరకే వడ్డీ లేని పీరియడ్ లభిస్తుంది. సుమారుగా ఏ తేదీల్లో షాపింగ్ చేస్తే వడ్డీ లేని పీరియడ్‌ను గరిష్ఠంగా వాడుకోవచ్చో ఒకసారి స్టేట్‌మెంట్ చూస్తే తేలిగ్గానే తెలుసుకోగలం. ఈ లెక్కలన్నీ ఎందుకంటారా? ఏ తేదీని పట్టించుకోకుండా షాపింగ్ చేసినా కూడా మినిమమ్ 20-22 రోజుల వడ్డీ లేని వ్యవధి లభిస్తుంది.

## వాడుకున్నమొత్తాన్ని ఒకేసారి కట్టాలా?

అవసరం లేదు. క్రెడిట్ కార్డ్‌లో ఉన్న సౌలభ్యం, ప్రమాదం కూడా ఇదే. ఒక నెలలో వాడుకున్న మొత్తంలో కనీసం 5 శాతం కట్టినా చాలని బ్యాంకు చెవుతుంది. చెల్లించాల్సిన మిగతా మొత్తానికి 2.5 శాతం చొప్పున వడ్డీతో మరునటి నెల పంపే స్టేట్‌మెంట్‌లో కలుస్తుంది. ఆ పరిస్థితిలో తాజాగా చేసే కొనుగోళ్ళపై కూడా కొన్న తేదీ నుంచే వడ్డీ పడుతుంది. ఇక్కడే మనం జాగ్రత్తగా వుండాలి. కార్డు ఉంది కదా అని యదేచ్ఛగా షాపింగ్ చేస్తూ పోతే వడ్డీ చక్రంలో ఇరుక్కున్నట్లే. అందువల్ల మనం కార్డు లేనప్పుడు ఒక నెలలో ఎంత డబ్బు ఖర్చు చేస్తున్నామో ఆ మొత్తానికి కాస్త అటో ఇటో మన షాపింగ్‌ను పరిమితం చేసుకుంటే - ఆ నెలలో చేసిన ఖర్చు చేసిన మొత్తాన్ని సులభంగా చెల్లించగలుగుతాం. అప్పుడు క్రెడిట్ కార్డ్ సౌలభ్యం మన అనుభవంలోకి వస్తుంది.

## కొన్ని ముఖ్య విషయాలు

* బ్యాంక్ ఇచ్చిన క్రెడిట్ లిమిట్‌లో మూడో వంతు భాగాన్ని నగదుగా తీసుకునే అవకాశం కూడా ఉంది. అయితే సరుకుల కొనుగోళ్ళ మాదిరిగా కాకుండా క్యాష్ విత్‌డ్రాయల్స్‌కి తీసుకున్న తేదీ నుండి వడ్డీ పడుతుంది. ఈ వడ్డీ కూడా 3 శాతం దాకా ఉంటుంది. అందుకే నగదును అత్యవసరం అనుకుంటే తప్ప తీసుకోకపోవడమే మంచిది.

క్యాష్‌ని బ్యాంక్‌లోనైనా, ఎటిఎం నుండి అయినా తీసుకోవచ్చు.

* కార్డ్‌ని ఎవరికీ ఇవ్వద్దు. ఒకవేళ పోగొట్టుకుంటే తక్షణమే బ్యాంక్‌కి తెలియజేస్తే కొత్త కార్డు జారీ చేస్తారు. జాప్యం చేస్తే కార్డు దొరికిన వ్యక్తి మన అకౌంట్‌ను గుల్ల చేసే ప్రమాదం వుంది. (ఇదంత సులభం కాకున్నా రిస్కే).

* మూడో నాలుగో కార్డులు కలిగి ఉండడం శ్రేయస్కరం కాదు. అదో స్టేటస్ సింబలూ కాదు. కార్డులు ఎక్కువైతే కోర్కెలు గుర్రాలవుతాయి. చేసే ఖర్చుకు అంతుండదు. అప్పుడు బ్యాంకులకి డబ్బు కట్టలేక వడ్డీలో కూరుకుపోతాం.

* కార్డు మీద చేసే ఖర్చు నెలకు మనకు వచ్చే ఆదాయానికి తగ్గట్టుగానే ఉండాలి. అప్పుడే వడ్డీ భారం లేకుండా కార్డు ప్రయోజనాన్ని పొందగలుగుతాం. ముఖ్యంగా వాడుకుంటున్న ప్రతి రూపాయి మళ్లీ కట్టాల్సిందే అన్నది గుర్తుంచుకోవాలి.

ప్రస్తుతం బ్యాంకులో కార్డుతో పాటు ప్రమాద బీమా, కుటుంబ బీమా వంటి అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నాయి. తొందర్లోనే కరెంట్, టెలిఫోన్, వాటర్ బిల్లుల్ని చెల్లించే బాధ్యతను కూడా బ్యాంకులే తీసుకోబోతున్నాయి. మనం చేయాల్సింది 24 గంటల కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి బిల్లు మొత్తాన్ని ఎవరికి చెల్లించాలో చెప్పడమే.

చివరిగా ఒక్క మాట. క్రెడిట్ కార్డ్ ఇప్పుడు కేవలం ఓ స్టేటస్ సింబల్ కాదు. డబ్బు దగ్గర లేని వేళల్లో ఆదుకునే నేస్తంగా భావించాలి. అదుపు లేకుండా ఖర్చు చేసి వడ్డీ చక్రంలో ఇరుక్కుని క్రెడిట్ కార్డ్‌ని తిట్టుకుంటే లాభం లేదు ●

బాడీ లాంగ్వేజ్ మేటర్ ③

# నడత ఏమిటో నడక చెబుతుంది

నడక చెప్పే భాష ఒక్కోసారి స్పష్టంగా వుంటుంది. 'గాల్లో తేలుతున్నట్లు నడుస్తున్నాడ'నో, 'నిద్రలో నడిచినట్లు నడుస్తున్నాడనో' ఒక్కోసారి చెప్పటం జరుగుతుంది. నెమ్మదిగా, నింపాదిగా నడుస్తుంటే 'ఏంటా పెళ్ళి నడక?' అని వినుక్కోవటం తరచూ చూస్తుంటాము. అయితే మనకి తెలీకుండానే మనం వ్యక్తపరిచే భావాలు కొన్ని నడవటంలో కనిపిస్తాయి.

ప్రతి ఒక్క వ్యక్తికి ఒక స్టైల్ వుంటుంది. దాన్ని బట్టి కొంత దూరం నుంచే వచ్చే వ్యక్తిని గుర్తుపట్టొచ్చు. నడవటంలో చేతులు, భుజాలు, తల కాళ్ళు వంటి భాగాలు కూడా పాలు పంచుకుంటాయి కనుక - ఒక్కోసారి అంచనా వేయటం కష్టమే. కాని జాగ్రత్తగా గమనిస్తే నడక ద్వారా ఆ వ్యక్తి లోపలి భావాలను స్పష్టంగానే వ్యక్తపరుస్తున్నట్లు చాలా వరకు అర్థమవుతుంది. లోపల చెలరేగుతున్న భావాలను బట్టి నడకలో వేగం, అంగలు వేయటం, శరీర భంగిమ ప్రభావితం అవుతాయి. ఇది ఒక బాడీ లాంగ్వేజ్ సిగ్నల్.



ఉదాహరణకు రెండు చేతులు ప్యాంటు జేబుల్లోకి దూర్చి తలవంచుకుని భుజాలు కుదించుకుని నెమ్మదిగా అడుగులు వేస్తూ వెళ్తున్న వ్యక్తులు సాధారణంగా నిరాశను వ్యక్తపరుస్తారు. కనిపించే ప్రతీ వస్తువు మీద దృష్టి పెడుతున్నట్లే అనిపిస్తుంది. కళ్ళు కూడా నిస్తేజంగా, భావరహితంగానే వుంటాయి. చిన్న చిన్న అడుగులు వేస్తూ ఎంతో భారంగా ఈడ్చుకుంటూ నడుస్తారు.

అయితే బాగా అలసిపోయినపుడు నడిచే నడకకి దీనికి కొంత తేడా వుంటుంది. మొదటిది శారీరకమైన సమస్య. రెండవది నిరాశ - నిస్పృహలు. మరి కొంతమంది రెండు చేతులు నడుము రెండు పక్కల పెట్టుకుని పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ, ఉత్సాహంగా నడుస్తారు. అది ఎనర్జీకి సూచిక. సాధారణంగా ఇలాంటి వ్యక్తులు తక్కువ సమయంలో ఎక్కువ దూరం నడవటం అన్న లక్ష్యంతో వుంటారు. ఉన్నట్టుండి నెమ్మదిగా నడుస్తారు. ఇది ఉత్సాహాన్ని సూచిస్తుంది. బ్రిటన్ మాజీ ప్రధాని చర్చిల్ నడక ఇలాంటిదే.



మరికొంతమంది వేగంగా చేతులూపుకుంటూ నడుస్తారు. వీళ్ళు ఒక లక్ష్యం వైపు దూసుకుపోతున్నట్లు కనిపిస్తారు. ఏదో పని వుంది దాన్ని ఎలాగైనా పూర్తి చెయ్యాలన్న సంకల్పంతో నడుస్తున్నట్లు కనిపిస్తారు. చలిగా లేకపోయినా రెండు చేతులు ప్యాంటు జేబుల్లో పెట్టుకుని నడిచేవారు. సాధారణంగా నిశితంగా విమర్శించేవారు - రహస్యాలను ఎవరికీ చెప్పకుండా దాచేవారు. ఎప్పుడూ వేరేవాళ్ళనే గమనిస్తూ వుంటారు.

రెండు చేతులూ వెనక్కి కట్టుకుని, తల దించుకుని నెమ్మదిగా నడిచేవారు ఏదో విషయం గురించి ఆలోచిస్తున్నట్లు కనిపిస్తారు. అప్పుడప్పుడూ నిద్రలో నుంచి మేల్కొన్నట్లు అటూ ఇటూ చూసి మళ్ళీ తమ నడకలో తాము నిమగ్నమవుతారు. దీర్ఘాలోచన నడక ఇది. మరి కొంత మంది తలపైకెత్తి, చేతులు అవసరానికన్నా ఎక్కువగా ఊపుతూ, స్టిఫ్‌గా నడుస్తారు. వీళ్ళకి కీర్తి కండూతి ఎక్కువే. వేరేవాళ్ళ దృష్టిని ఆకర్షించటం - తాము గొప్ప వాళ్ళని చెప్పటం కోసమే నడిచే నడక ఇది. కొంత మంది చేతులు ఛాతీ మీద పెట్టుకుని నడుస్తారు. సాధారణంగా ఎవరైనా మాట్లాడుతూ వుంటే వింటూ నడిచే పద్ధతి ఇది. చేతులు వదులుగా కట్టుకుంటే అవతలి వ్యక్తి మాట్లాడే దాని మీద ఆసక్తి చూపించకపోవటం - చేతులు స్టిఫ్‌గా కట్టుకుంటే ఆసక్తి వున్నట్లు. ఏది ఏమైనా చేతులు కట్టుకుని వింటూ నడవటం అన్నది అవతలి వ్యక్తి పట్ల తక్కువ భావం వుండటం వల్ల కూడా కావచ్చు. నేను గొప్ప వాడిని అని చెప్పటం దాని ఉద్దేశ్యం. కొంత మంది ఏమీ పట్టించుకోకుండా 'అలా' నడుస్తూ పోతుంటారు. దాన్ని 'పరాకు నడక' అంటారు. హఠాత్తుగా ఏదైనా అడ్డు వస్తే తప్ప వాళ్ళు నడక ఆపరు. చిన్నపిల్లలు సంతోషంగా వున్నపుడు గబాగబా అడుగులు వేసుకుంటూ నడుస్తారు. కోపం వచ్చినపుడు అడుగులు బరువుగా ఇష్టంలేనట్లు వేస్తారు. నడిచేటపుడు తలను ఎగిరేయటం పిల్లల్లో పొగరుబోతు తనాన్ని సూచిస్తుంది. కొంతమంది చేతులను ఊపుతూ, ఠీవిగా లయబద్ధంగా నడుస్తారు. అది ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తుంది. మరికొంత మంది పక్కవారి భుజాలపై చేతులు వేసి నడిచే ప్రయత్నం చేస్తారు. వారు ప్రతిదానికీ వేరేవాళ్ళ మీద ఆధారపడే మనస్తత్వం. నడకలో ప్రస్ఫుటమయ్యే ఎమోషన్స్ ఒకటి పాజిటివ్ అంటే సంతోషం, ఉత్సాహం వంటివి. రెండు నెగెటివ్ అంటే నిరాశా, బాధ, నిస్పృహ వంటివి.





ఈ విషయంలో స్టడీ చేసినవారు సూత్రప్రాయంగా కొన్ని రకాల నడకలను వర్గీకరించారు. అయితే అలాంటి నడక నడిచే ప్రతీ వ్యక్తికీ అలాంటి లక్షణాలు వుంటాయని కచ్చితంగా చెప్పలేము. చాలా వరకు అలా వుండవచ్చు.

ఒయ్యారపు నడక: ఇది సాధారణంగా ఆడవాళ్ళు చేస్తారు. ఇందులో నడుము తిప్పుతూ, సుతారంగా లయబద్ధంగా నడవటం వుంటాయి. గుర్తింపు కోరుకునేవారు, సానుభూతి కావాలనుకునేవారు సాధారణంగా ఇలానే నడుస్తారట. దీన్నే హంసనడక అనటం మామూలే.

పిల్లి నడక: పిల్లిలా అడుగులు దగ్గర దగ్గరగా వేయటం, కుంగిపోయిన భుజాలు ఈ నడక లక్షణాలు. అతివినయం, నిస్పృహ కనిపిస్తాయి ఇందులో. ఇది బానిస మనస్తత్వానికి కూడా ప్రతీక.

నిస్పృహ నడక: తల వేలాడేసుకుని, భుజాలు కుచించుకుపోయి, అడుగులు బరువుగా ఈడుస్తున్నట్లు వేయటం. భయం, నిరాశ, నిస్పృహ కనిపిస్తాయి.

బాతు నడక: ఛార్లీచాప్లిన్ నడక ఇదే. శరీరం అటూ ఇటూ ఊగుతుంది. కాలి వేళ్ళు బయటివేపుకు విస్తరించి వుంటాయి. బాతులా నడవటం ఇండివిడ్యుయాలిటీ వున్న వ్యక్తులు ఇలా నడుస్తారట.

బ్యాలెన్స్ నడక: దగ్గర దగ్గరగా అడుగులు వేసుకుంటూ - అటూ ఇటూ చూస్తూ నడవటం. బానిస మనస్తత్వం వుంటుందిట.

అయితే కేవలం ఒక సందర్భంలో నడిచే పద్ధతిని బట్టి ఎమోషన్స్ అంచనా వేయలేము. దాంతోపాటు ఇతర శరీర భంగిమలు కూడా నిశితంగా పరిశీలించాలి.







## నిలబడే శరీర భంగిమలు

ప్రతి వ్యక్తి కొన్ని సందర్భాలలో ఎక్కడో ఓ చోట, ఎప్పుడో ఓసారి నిలబడక తప్పదు. బస్సు కోసం వెయిట్ చేసేటపుడు, దేనికోసమైనా క్యూలో నిలబడినపుడు, క్లాసులో పాఠం చెపుతున్నపుడు - ఇలా ఏదో ఒక సందర్భంలో కొంతసేపు నిలబడటం మామూలే. కొంతమంది నడుమ్మీద చేతులు పెట్టుకుని నిలబడతారు. లేదా చేతులు ఛాతీ మీద కట్టుకుని నిలబడతారు. మరికొంత మంది చేతులు వెనక్కి (వీపు మీద) కట్టుకుని నిలబడతారు. నిలబడే భంగిమలో కాళ్ళు, చేతులు, భుజాలు, తల వంటివి ప్రధాన పాత్ర వహిస్తాయి. నడుమ్మీద చేతులు పెట్టుకుని కాళ్ళు ఎడంగా పెట్టి నిలబడ్డం అగ్రెసివ్ భంగిమ. బెదిరించే లక్షణం చేతులు వెనక కట్టుకోవటం దానికి వ్యతిరేకం - నడుముపై చేతులు పెట్టుకుని తల పైకెత్తి నిలబడటం డామినేటింగ్ లక్షణం - ఒక అరచేతిలో మరో చెయ్యి పెట్టి నిశ్చలంగా నిలబడటం ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తుంది. వెనక వైపు ఒక చేతి మణికట్టును మరో చేత్తో గట్టిగా బిగించి పట్టుకుని నిలబడ్డం నిస్పృహను సూచిస్తుంది. ఒక మోచేతిని మరో చేత్తో గట్టిగా పట్టుకుని నిలడటం కోపాన్ని, అసహనాన్ని సూచిస్తుంది. ఒక్కో సందర్భంలో ఛాతీ మీద రెండు చేతులు కట్టుకుని నిశ్చలంగా నిలబడటం కూడా ఆత్మవిశ్వాసాన్నే సూచిస్తుంది.

- సి.యస్. సలీం·బాషా





(గతసంచిక తరువాయి)



# వైతాళికుడు అంబేద్కర్ 10

సాంఘిక విప్లవ సూర్యుడి శిఖరాయమాన వ్యక్తిత్వంపై నిబద్ధతగల సోషలిస్టు మేధావి నిష్పాక్షిక విశ్లేషణ

కులనిర్మూలన కాంక్షించే ప్రతి ఒక్కరూ చదివితీరాల్సిన రచన!

ధారావాహిక ♦ రచన : కీ.శే. మధులిమాయె ♦ అనువాదం : కీ.శే.సురమౌళి

దళితవర్గాలవారికి, రిజర్వు స్థానాలతో బాటు సంయుక్త నియోజకవర్గాల పద్ధతిని గాంధీజీ ప్రతిపాదిస్తే, అంబేద్కర్ నిరాకరించాడన్న ఆరోపణను ఆయన తిరస్కరించారు. అటువంటి ప్రతిపాదన మహాత్ముని వైపునుంచి ఏనాడూ రాలేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం, ప్రత్యేక నియోజకవర్గాల పద్ధతినేకాక, దళితవర్గాల వారికి ఎటువంటి ప్రత్యేక ప్రాతినిధ్య పద్ధతినైనా గాంధీజీ వ్యతిరేకించారు. వయోజన ఓటింగ్ సిద్ధాంతాన్ని అనుసరించి, సాధారణ నియోజకవర్గాలలో అందరితోబాటు ఓటువేసే హక్కును తప్ప దళితవర్గాలవారికి ఎటువంటి రాయితీని అంగీకరించడానికి గాంధీజీ సిద్ధపడలేదు. తన వైఖరిని, స్పష్టంచేస్తూ అంబేద్కర్, నా ప్రజల హక్కుల పరిరక్షణకోసం రాజ్యాంగ బద్ధమైన హామీని సాధించే విషయంలో తాను ఏ పరిస్థితిలోనూ రాజీపడేది లేదన్నారు. ప్రత్యేక నియోజకవర్గాల ప్రాతిపదిక పైన ఇచ్చిన కమ్యూనల్ అవార్డును గాంధీజీ మార్చదలచుకున్నట్లయితే నా దళిత వర్గాలవారికి ఆయన మరేదైనా ఉత్తమ హామీని ఇవ్వాలనీ డాక్టర్ అంబేద్కర్ సూచించారు.

డాక్టర్ అంబేద్కర్‌పైన తీవ్రమైన ఒత్తిడి వచ్చింది. బ్రిటీష్‌వారి అండదండలతో ఆయన గట్టిగా నిలబడగలిగారు. కులాలతోవున్న సమాజంపట్ల తన వ్యతిరేకత మిగతా అన్నింటికన్నా ప్రధానమైనదిగా భావించారాయన. న్యాయదృష్టి వున్నటువంటి ఏ మానవుడైనా ఆయన్ను ఎలా దూషిస్తాడు? దూషణలకూ కోపతాపాలకూ ఆయన తావివ్వలేదు. ఈ సమస్య మీద రెండవ రౌండు టేబిలు మహాసభలో గాంధీజీని ఆయన విమర్శించినప్పుడు జాతీయ పత్రికలన్నీ ఆయన్ను ద్రోహిగా చిత్రించడానికి ప్రయత్నించాయి. జాతీయ లక్ష్యానికి ఆయన ద్రోహం తలపెట్టినట్లు ప్రచారం చేశాయి. సహజంగానే అంబేద్కర్ బాధపడ్డారు. దురుద్దేశాలు కూడా అంటగట్టారు. అయినా ఆయన ఆత్మోన్నతి ఏమాత్రం దిగజారలేదు. ఈ సమస్యకు సంబంధించిన సంప్రదింపులు ముగిసినట్లేనని తీర్మానించుకొని పర్వతంలా నిలబడే శక్తి సామర్థ్యాలు, న్యాయమైన అర్హతా ఆయనకు ఉన్నప్పటికీ, ప్రత్యామ్నాయ ప్రతిపాదనను పరిశీలించడానికి తన సంసిద్ధతను ప్రకటించారు. తన అఖండ ప్రతిష్టను కప్పుకొని గాంధీజీ అగ్రకులాల వారిలో నిక్షిప్తంగా వున్న అంతః కరణలను మేలుకొలిపి అగ్రగామి అయినారుగాని నా ఉద్దేశంలో మాత్రం అంబేద్కర్ పరమ మహాత్ముడు. అన్యాయానికి వ్యతిరేకంగా అవిశ్రాంత సమరశీలిగానేకాక, గొప్ప భారతీయుడుగా ఆయన ఎదిగాడు. మహాత్మాగాంధి స్వయంగా హిందూ విలేఖరితో అన్న మాటలు:

"తరతరాలుగా హిందువులన్న పేరుతో బ్రతుకుతున్నవారు సాగించిన పాపాలకు శిక్షగా, అంబేద్కర్ రాజీలేని దృఢ వైఖరిని అవలంబించి వుండవచ్చు. ఆయన అలాంటి వైఖరినే అవలంబించి వుంటే, నా వరకు నేను దాన్ని వ్యతిరేకించేవాణ్ని కాదు. తరతరాలుగా అనేక శతాబ్దాలుగా హిందూమతంలోని వారు బహిష్కృతుల పట్ల సాగిస్తున్న అన్యాయాలకు, అక్రమాలకు, అత్యాచారాలకు ప్రతీకారంగా నా ప్రాణం బలి అయితే! అది స్వల్పమైన శిక్షే అయ్యేది. కాని ఆయన అనుసరించింది మహోన్నత సంస్కారం ప్రతిబింబించే మార్గం. అన్ని మతాలు బోధించిన క్షమాధర్మాన్ని ఆయన ఆచరించారు. ఈ క్షమకు అర్హతను అగ్రకులాల వారు సంపాదించుకోగలరని నేను ఆశిస్తున్నాను.

ఒప్పందంలో రాజకీయం భాగం అత్యంత ప్రధానమైనదే అయినప్పటికి అవసరమైన సంస్కరణరంగంతో పోలిస్తే అది ఆక్రమించే స్థానం చాలా స్వల్పమైనదేనని గాంధీజీ అన్నారు. దళితులను పీడిస్తున్న సాంఘిక పరమైన, మతపరమైన అనర్హతలనన్నింటినీ నిర్మూలించడం" లక్ష్యంగా నిర్ణయించారాయన. ఈ అనర్హతల వల్లనే కదా దళితులు దళితులుగా వుండటం. స్వాతంత్ర్య సందేశం ప్రతి అస్పృశ్యుని ఇంటిలోనికి చొరబడాలని గాంధీజీ ఉద్బోధించారు.

డాక్టర్ అంబేద్కర్, మహాత్మాగాంధి రాజీపడ్డారనే అనిపించింది కొంతకాలం. హిందూ సమాజాన్ని పీడిస్తున్న అనాచారాలను, అత్యాచారాలనూ నిర్మూలించడం కోసం ఉభయులూ తమ శక్తియుక్తులను సమీకరించి పోరాడగలరన్న ఆశ రేకెత్తింది. మహాత్మాగాంధి అంతరాంతరాల్లోని మహోన్నతత్వాన్ని అంబేద్కర్ దర్శించారు. కొన్ని విషయాల్లో తనకూ గాంధీజీకి మాటలు లేకపోయినప్పటికీ దళితుల సమస్యకు సంబంధించినంత వరకు ఆయనకున్న చిత్తశుద్ధిని మాత్రం శంకించ వీలులేదని అంబేద్కర్ ప్రకటించారు. చివరి సంవత్సరాలలో గాంధీజీ దగ్గరగా వచ్చింతర్వాత 'జాతి'పట్ల ఆయనకున్న తపనదృష్ట్యా పరిశీలించినపుడు, అగ్రకులాలవారిపట్ల గాంధీజీదృక్పథం అందుకు భిన్నంగా ఉండాలని ఆశించడం సబబుకాదని అంబేద్కర్ భావించేవారు. జాతీయత గాంధీజీకి అభిప్రాయం మాత్రమే కాదు. అది ఆయన ప్రాణశ్వాస అని అంబేద్కర్ అన్నారు.

ఈ ఇద్దరు నాయకులకూ పరస్పరం ఇంత సద్భావన ఉన్నప్పటికి, సదవగాహన ఉన్నప్పటికి, ఉభయుల మధ్య సహకారం ఎంతోకాలం ఎందుకు కొనసాగలేదు? చివరిదాకా ఎందుకని వారి మధ్య సామరస్యం కుదరలేదు?

ఈ ఉభయ నాయకులకూ ప్రియమైన లక్ష్యం కోసం ఉభయులూ కలిసి పనిచెయ్యక పోవడానికీ మూడు కారణాలు నాకు తోస్తున్నవి. ఉన్న దురాచారం గురించి ఉభయుల అవగాహనలోగల మౌలిక తేడా మొదటి కారణం. పెద్దా చిన్నా తేడాలను సృష్టించిన నిచ్చెనమెట్ల పద్ధతి కుల వ్యవస్థకూ, అస్పృశ్యతకూ విడదీయరాని సంబంధం వున్నదని గాంధీజీ చాలా కాలంగా అంగీకరించక పోవడం రెండో కారణం. కులవ్యవస్థనూ దానికి మూలమైన చాతుర్ వర్ణ పద్ధతిని గాంధీజీ సమర్థించడం మూడవ కారణం.

మహాత్మాగాంధీకి వర్ణం అంటే ఏమిటో కులం అంటే ఏమిటో నిర్దిష్టమైన, స్పష్టమైన అవగాహన లేదని డాక్టర్ అంబేద్కర్ అభిప్రాయం. ఆయన అభిప్రాయమే సరైనదని నేనూ విశ్వసిస్తున్నాను. ఈ విషయాన్ని మహాత్ముడు మరింత భ్రష్టు పట్టించి అయోమయంకావించారని డాక్టర్ అంబేద్కర్ తన రచనల ద్వారా విపులీకరించారు. కులం సమస్యమీద గాంధీజీ అవగాహన

## విడినియోజకవర్గాల కోరిక: యెరవాడ ఒప్పందం - 2

అసంబద్ధము, అయోమయమని అంబేద్కర్ ఆరోపించారు. ఎవరిని సంతృప్తి పరచడానికి గాంధీజీ అలా వాదించారు. గాంధీజీలోని యోగి వ్యక్తిత్వాన్ని రాజకీయ వ్యక్తిత్వం అడ్డుకున్నదా? కులం సమస్యకు సంబంధించిన వాస్తవాలను యోగి గుర్తించడానికి నిరాకరించారా? ఇది ఇలాంటివే అనే ప్రశ్నలు అంబేద్కర్ మనస్సును కలవరపరిచాయి. గాంధీజీ చెప్పే మూఢవిశ్వాసాలు, మహిమా మాయలు, హేతుబద్ధంకాని అంధ విశ్వాసాలు అంబేద్కర్‌ని చకితుణ్ణి చేశాయి. రాజకీయ రంగంలోని ఒత్తిడులు, అనివార్యతలు, గాంధీజీకి ఉన్నటువంటి ప్రజాదరణ మీద రాజకీయరంగం ఆధారపడి వుండటం అనే పరిస్థితులవల్ల కాంగ్రేసువారు, కులం సమస్యపట్ల గాంధీజీ అనుసరించిన తర్క రాహిత్యాన్నీ తార్కిక అసంబద్ధతలనూ ఎత్తి చూపించలేకపోయారు. కాని, డాక్టర్




అంబేద్కర్‌కు కులం సమస్య జీవన్మరణ సమస్య. కులం గురించి గాంధీజీ అభిప్రాయాలలోని అనేక అసందర్భాలనూ, అసంగతాలనూ ఎత్తిచూపించకుండా, ఆయనపట్ల ఉదారమైన వైఖరికి అవలంబించటం ఆయనకు సాధ్యమయ్యేది కాదు. ఈ సమస్యపైన గాంధీజీ వైఖరిలో ఏర్పడిన అయోమయానికి ఆయన కున్నటువంటి శైశవమానసిక స్థితి కారణం అయివుంటుందని అంబేద్కర్ 1936లో అభిప్రాయపడ్డారు. ప్రతీ విషయంలో ఆయన శైశవ మానసికావస్థను చూపించేవారు; శైశవ మానసికావస్థవల్ల తననే తాను మోసం చేసుకొనే వారుకూడా. వర్ణవ్యవస్థ పట్ల తనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని మార్చుకునే వరకూ మనం నిరీక్షించాలి. ఈనాడు అమలులో ఉన్న స్వరూపంలో కులవ్యవస్థ పట్ల తన విశ్వాసాన్ని ఆయన ఇప్పటికీ విరమించుకున్నారు.

స్పష్టమైన అవగాహన లేకపోవడమేకాక గాంధీజీ మహాత్మునిగానూ, రాజకీయవాదిగానూ, ద్విపాత్రిభినయం చేసే నేరానికి కూడా పాల్పడ్డారు. రాజకీయాలను, అధ్యాత్మికం చెయ్యడానికి మహాత్ముడు ప్రయత్నించారు. ఆయన తన ప్రయత్నంలో సఫలుడైనా కాకపోయినా రాజకీయాలు మాత్రం ఆయన్ను వాణిజ్యవంతం చేశాయి. సమాజం సంపూర్ణ సత్యాన్ని భరించ జాలదని రాజకీయ నాయకుడు గ్రహించాలి. అందువల్ల అతడు అప్రియంగా ఉండే సంపూర్ణ సత్యాలు మాట్లాడకూడదు. హిందువుల ఆశయాలే, తప్పుడు ఆశయాలు. ఆ తప్పుడు ఆశయాల సాధనకు తప్పుడు సాంఘిక జీవన విధానాన్ని అనుసరించారనీ అంబేద్కర్ దృఢవిశ్వాసం.

డాక్టర్ అంబేద్కర్ సరస్వతీ భక్తుడని నేను నిర్ద్వంద్వంగా విశ్వసిస్తున్నాను. గాంధీజీ విజ్ఞానాన్ని, బోధనమూ తక్కువ చూపు చూశారని, మూఢవిశ్వాసాలనూ, నిర్హేతుకతనూ, అజ్ఞానాన్నీ, ఆరాధనాతత్వాన్నీ గద్దెనెక్కించారని ఆయన గట్టిగా భావిస్తూ వుండేవారు.

గాంధీజీ ప్రవేశానికి ముందు అధిపత్యానికి పోటీపడేవి రెండే రెండు పార్టీలుండేవని అంబేద్కర్ గుర్తుచేశారు. కాంగ్రెసు పార్టీని నియమించిన లిబరల్ పార్టీ ఒకటి కాగా, మరొకటి టెరరిస్టుపార్టీ. లిబరల్ పార్టీలో ఎవరు కూడా, విద్యేకాదు, విద్యలో ఉన్నత డిగ్రీలు పొందకుండా పైకి వచ్చే అవకాశం వుండేది కాదు. లిబరల్ నాయకత్వపు మెట్ల మీద అడుగు పెట్టాలంటేనే, విద్యలో ఉన్నత ప్రతిభ, సాధించినపట్లు రుజువు చేసుకోవాల్సిన అవసరం ఉండేది. మరొకవైపు టెర్రరిస్టు పార్టీలో స్థానం లభించేదికాదు. గాంధేయ సిద్ధాంతాలను, విధానాలను హేళన చేస్తూ అంబేద్కర్ శాసనోల్లంఘనంకోసం విద్యాగంధం ఏ మాత్రం అవసరం లేదన్నారు. అంతేకాదు ప్రాణాలనైనా అర్పించగల త్యాగనిరతి కూడా శాసనోల్లంఘనానికి అనవసరం. బలిదానాలకు సిద్ధం కాజాలని వారు వేలాదిమంది, లక్షలాది మంది పాల్గొనే విధంగా గాంధీజీ రాజకీయాలను మలిచారు.

అంబేద్కర్ విశేషణ చాలావరకు వాస్తవమే. ఒక విధంగా ఆయన మహాత్మాగాంధీని ప్రశంసించాడు. రాజకీయాలను విశిష్టవర్గం గుప్పిట్ల నుంచి సామాన్యజనానికి అందించడానికి ఆయనది అమోఘమైన మార్గం. అంబేద్కర్ కూడా ఒక రకమైన విశిష్టవర్గ రాజకీయాలనే సమర్థించారని నా అభిప్రాయం. బ్రాహ్మణ్య సూత్రమైనటువంటి జన్మనావిశిష్టతను ఆయన ఒప్పుకొనక పోయినా, విద్యవల్ల ప్రతిభవల్ల ప్రాప్తించే విశిష్టతకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారనిపిస్తుంది. గాంధీజీ ఈ విశిష్ట వర్గతత్వానికి వ్యతిరేకి. విశిష్టతను డాక్టర్ అంబేద్కర్ సాంఘిక చలనం సిద్ధాంతంతో కలపదలచుకొని వుండవచ్చు. సమాన అవకాశాల సిద్ధాంతాన్ని సమగ్రంగా ఆచరించడానికి అవకాశం వుండే సమసమాజాన్ని ఆయన కలగన్నారు. అసమాన సమాజంలో సమానావకాశాల సిద్ధాంతం నిరర్థకమైనదని ఆయనకు తెలుసు.

ప్రాశ్చాత్య దేశాలలో వున్న ఉదార ప్రజాస్వామ్య సిద్ధాంతాలు డాక్టర్ అంబేద్కర్ విశేషంగా ప్రభావితం చేశాయి. ఆయనకు అనంతమైన జిజ్ఞాస ఉండేది. పాండిత్యాన్ని గౌరవించే వారాయన. మనస్తత్వ రీత్యాపరిశీలిస్తే, డాక్టర్ అంబేద్కర్ రానడే సిద్ధాంతాను యాయుడన వచ్చు. అయితే ఈ మాట డాక్టర్‌గారి వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా ప్రతిబింబించదు. హిందూ సమాజంలోని కులాల తారతమ్యాల పద్ధతిని, సమాజంలోని దిగువవర్గాల పతనావస్థనూ, అణగదొక్కే పద్ధతినీ అంబేద్కర్ వ్యతిరేకించారు. ఆయన అమోఘమైన ప్రతిభా వంతుడైనప్పటికీ మహాపండితు లైనప్పటికీ, ఆయన్ను అగ్రవర్ణాలవారు అడుగడుగునా అవమాన పరిచారు. ప్రతి దశలో ఆయన్ను నీచపరిచారు. షెడ్యూలు కులాల, దళితుల పరిస్థితిని మెరుగుపరచాలని ఆయన దీక్ష బూనారు. సాంఘిక సమానత్వ లక్ష్యానికి ఆయన అంకితమయ్యారు. అన్యాయాలకూ, దోపిడీకి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారు. తిలక్ మార్గం పట్ల డాక్టర్ అంబేద్కర్‌కు సానుభూతి వుండేదికాదు. ఈ మార్గంలో బ్రాహ్మణాధిపత్యం, అత్యధికులమన్న భావన, తలబిరుసూ తాండవించేనని ఆయన భావం. సనాతన ఛాందసత్వాన్ని కొనసాగించడానికి సాధ్యమైనదంతా చేయాలని వారి అభిమతం. శిక్షణ ద్వారా నైతేనేమి, ప్రకృతిరీత్యానైతేనేమి అంబేద్కర్ రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్యవాది. ఆయన శాసనోల్లంఘనం చేసినా సాంఘిక వివక్షతలనూ, అన్యాయాలనూ ఎదిరించినా, పరిస్థితుల ప్రభావం వల్ల చేశాడే గాని, సత్యాగ్రహ సిద్ధాంతాన్ని విశ్వసించి మాత్రం కాదు. నిజానికి ఆయనకు సత్యాగ్రహ విధానం నచ్చలేదు. శాంతియుత మైన రాజ్యాంగబద్ధమైన మార్పులను ఆయన సమర్థించారు. అంబేద్కర్‌కు సాయిధపోరాటం పట్ల విశ్వాసం ఉండేదికాదు. డాక్టర్‌గారికన్న సంపూర్ణ ప్రజాసామ్యవాది వేరెవరూ కాదు. సార్వత్రిక వయోజన ఓటింగ్ పట్ల ఆయనకు అఖండమైన విశ్వాసం ఉండేది. స్వేచ్ఛాయుతమైన న్యాయమైన ఎన్నికల ద్వారా ప్రజాస్వామిక పరివర్తన ప్రభావాన్ని ఆయన సంపూర్ణంగా ఆదరించేవారు. ఆయన అడుగు జాడల్లో నడిచే స్త్రీ, పురుషులకు ఆయన గరపిన శిక్షణ, వారికాయన నేర్పిన క్రమశిక్షణా అమోఘమైనవి. అట్టడుగున వున్నటువంటి సామాన్యులైన దళితులు ఎన్నికల్లో గెలుపొంది, తమకు లభించిన అవకాశాన్ని సక్రమంగా, సోద్దేశంగా, ప్రభావవంతంగా వాడుకోవాలని ఆయన జీవితాంతం కలకన్నారు.

నేను కళాశాలలో చేరినప్పుడు నాకు నవోదయం దర్శనం ఇచ్చింది. నాకు రాజకీయ చైతన్యం తెచ్చి రాజకీయ ఉద్యమాల పట్ల ఆసక్తి పెరిగింది. వార్తాపత్రికలనూ, వార, మాస పత్రికలను ఆసక్తితో చదవడంతో బాటు రాజకీయపరమైన సమావేశాలలో పాల్గొనడం, నాయకుల ఉపన్యాసాలను వినడం కూడా చేస్తూ వుండేవాణ్ని. కొత్త రాజ్యాంగాన్ని అనుసరించి రాష్ట్రాలలో కాంగ్రెసు ప్రభుత్వాలుండిన ఆ రోజుల్లో రాజకీయ కార్యకలాపాలు తీవ్రంగా ఉన్న రోజుల్లో అలాంటి సమావేశం ఒకటి పూనాలో, గోఖలే హాలులో జరిగింది. ఆ సమావేశంలో డాక్టర్ అంబేద్కర్ ప్రసంగించారు. ఆ రోజుల్లో డాక్టర్ గారు బొంబాయి విధానసభలో సభ్యులుగా వుండేవారు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీకి నాయకులుగా వుండేవారు. 1937-38 మధ్య భారత రాజకీయరంగంలో ప్రధాన చర్చనీయాంశంగా ఉన్నది. భావి సమాఖ్య రూపురేఖలకు సంబంధించిన అంశం. ఆ రోజు డాక్టర్ అంబేద్కర్ ప్రసంగం కూడా ఈ అంశం మీదే సాగింది. హాలు నిండిపోయింది. నేనూ నా సహచరులతో బాటు బయటే నిలుచోవలసి వచ్చింది. అదృష్టవశాత్తు మైక్రోఫోన్లు అమర్చారు. డాక్టర్ గారి ఉపన్యాసాన్ని మేం వినగలిగాము.

(ఇంకావుంది)

# కరెంట్ ఎఫైర్స్



ఎరియల్ షెరాన్

1-2-2001

◎ గుజరాత్ భూకంప బాధితుల్ని ఆదుకోవటానికి గాను ఆదాయం, కార్పోరేట్ పన్నులపై రెండు శాతం చొప్పున సర్‌ఛార్జి విధించాలని కేంద్రం నిర్ణయించింది.

3-2-2001

◎ గుజరాత్ భూకంపం కారణంగా 15 వేల మందిపైగా మరణించారని, 3.5 కోట్ల మంది నిరాశ్రయులయ్యారని; 20,875 కోట్ల రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని కేంద్రం ప్రకటించింది.

◎ సినీనటుడు రజనీకాంత్‌ను రెండుకోట్ల ఆరులక్షల రూపాయల మేరకు టోపీ వేసిన ఆరోపణలపై పోలీసులు మాజీమంత్రి పి.వి. రంగారావును అరెస్టు చేశారు.

5-2-2001

◎ కేంద్రంలోని ఎస్.డి.ఏ. ప్రభుత్వం నుంచి పి.ఎం.కె. తప్పుకుంది. ఆ పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు ఎన్.టి. షణ్ముగం (బొగ్గుశాఖ), ఇ. పొన్ను స్వామి (పెట్రోలియం) తమ పదవులకు రాజీనామా చేశారు.

6-2-2001

◎ సీనియర్ కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీమంత్రి, వి.ఎన్. గాడ్గిల్ గుండెపోటుతో మరణించారు.

◎ పొగాకు ఉత్పత్తుల అమ్మకం, పంపిణీ, వ్యాపార ప్రకటనలపై నియంత్రణ విధించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టాన్ని తీసుకురానుంది. ఈ కొత్త చట్టం కింద బహిరంగ ప్రదేశాల్లో పొగతాగటాన్ని, 18 ఏళ్లలోపు వారికి పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను నిషేధిస్తారు. సిగరెట్, పొగాకు ఉత్పత్తుల కంపెనీలు ఇకపై సాంస్కృతిక కార్యక్రమాలు, క్రికెట్ పోటీలను స్పాన్సర్ చేయటానికీ వీలుండదు.

7-2-2001

◎ జాతీయ బ్యాడ్మింటన్ పోటీలలో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను పుల్లెల గోపీచంద్ గెలుచుకున్నారు. మహిళల డబుల్స్‌లో కూడా తెలుగు వారైన గుత్తా జ్వాల, శ్రుతి కురియన్‌లు విజయకేతనం ఎగురవేశారు. మహిళల సింగిల్స్‌ను అపర్ణ పోపట్ గెలుచుకుంది.

◎ ఇజ్రాయిల్ ప్రధానిగా లికుడ్ పార్టీ నేత ఎరియల్ షరాన్ ఎన్నికయ్యారు.

◎ ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కోవటానికి గాను ప్రధాని వాజ్‌పేయి సారథ్యాన జాతీయ కమిటీ ఒకటి ఏర్పడింది. ఇందులో అన్ని ప్రధాన పార్టీల నాయకులూ, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులూ సభ్యులుగా వుంటారు.

8-2-2001

◎ కేంద్ర దర్యాప్తు సంస్థ (సి.బి.ఐ.) డైరెక్టర్ ఆర్.కె. రాఘవన్ నియామకాన్ని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) బెంగుళూరు బెంచ్ కొట్టి వేసింది. రాఘవన్ నియామకాన్ని కర్ణాటక డి.జి.పి. సి. దినకర్ సవాలు చేశారు.

9-2-2001

◎ శ్రీనగర్ పోలీస్ కంట్రోల్ రూమ్‌పైన లష్కర్ తోయిబాకి చెందిన ఆత్మాహుతి దళం చేసిన దాడిలో నలుగురు మిలిటెంట్లు, ఇద్దరు పోలీసులు మరణించారు.

10-2-2001

◎ జమ్మూకాశ్మీర్‌లో మిలిటెంట్లు పదిహేను మందిని హత్య చేశారు. మరోవైపు శ్రీనగర్‌లో పోలీస్ కంట్రోల్ రూమ్‌పై దాడి చేసిన సంఘటనలో మృతుల సంఖ్య 11కి చేరింది.

11-2-2001

◎ వరంగల్ జిల్లా కలెక్టరు ఆదిత్యనాథ్ దాస్‌పై పీపుల్స్‌వార్ నక్సలైట్లు కాల్పులు జరిపారు. కొద్ది గాయాలతో ఆయన బతికి బయట పడగలిగారు.

◎ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సరోజినీ పుల్లారెడ్డికి చోటు లభించింది. కోట్లకు ఉద్వాసన పలికారు. ముఖ్య అధికార ప్రతినిధిగా జైపాల్‌రెడ్డి నియమితు లయ్యారు.



13-2-2001

◎ రాజ్యాంగ సమీక్ష కమిషన్ గడువును ఈ ఏడాది అక్టోబరు 31 వరకూ పొడిగించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది.

◎ మణిపూర్‌లో అధికారంలో వున్న మణిపూర్ స్టేట్ కాంగ్రెస్ పార్టీ నిలువునా చీలిపోయింది. ముఖ్యమంత్రి నిపమాచా రాజీనామా చేశారు.

18-2-2001

◎ పౌరహక్కుల సంఘం నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఆజం అలీని గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో నరికి హత్య చేశారు.

20-2-2001

◎ సి.పి.ఐ. అగ్రనేత, సీనియర్ పార్లమెంటేరియన్ ఇంద్రజిత్ గుప్తా కన్నుమూశారు.



దాన్ బ్రాడ్‌మన్



గుజరాత్ భూకంపం

◎ రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు 2001 - 2002 సంవత్సరానికి ప్రవేశపెట్టారు. ప్రణాళికేతర వ్యయం, ప్రణాళికా వ్యయం కింద రూ. 35,823.62 కోట్ల రూపాయలు ఖర్చుచేయాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. లోటు 147.64 కోట్ల రూపాయలకు చేరుతుందని లెక్కగట్టారు.

22-2-2001

◎ కాశ్మీరులో కాల్పుల విరమణ మే నెలాఖరు దాకా కొనసాగుతుందని ప్రధాని వాజ్‌పేయి ప్రకటించారు.

23-2-2001

◎ గిద్దలూరు, బద్వేలులో జరిగిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం ఘనవిజయం సాధించింది. బద్వేలు నుంచి కొనిరెడ్డి విజయమ్మ, గిద్దలూరు నుంచి సాయికల్పన అసెంబ్లీకి ఎన్నికయ్యారు.



సాయికల్పన విజయమ్మ

25-2-2001

◎ పీపుల్స్ వార్ నక్సలైట్లు జరిపిన కాల్పులలో ఆమనగల్లు ఎస్సై కె.హనుమంత్ రెడ్డి మరణించారు.

◎ ఇండియాతో సహా ఆసియాలోని పలు దేశాల్లో భూకంపం సంభవించింది. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, జపాన్, చైనాల్లో భూకంపం సంభవించగా... చైనాలో 20 వేల ఇళ్ళు నేలమట్టం అయ్యాయి. ముగ్గురు మృతి చెందారు. వంద మందికి పైగా గాయపడ్డారు.

26-2-2001

◎ సాటిలేని మేటి క్రికెటర్ సర్ డొలాల్డ్ బ్రాడ్‌మన్ కన్నుమూశారు. ఆయన వయసు 92 సంవత్సరాలు. ఆయన 1928లో టెస్టులలో అరంగేట్రం చేసి, 1948లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరయ్యారు. మొత్తం 52 టెస్టులు ఆడి సాధారణ బ్యాట్స్‌మన్‌లకు సాధ్యంకాని రీతిలో 99.94 సగటుతో 6,996 పరుగులు చేశారు.

◎ రైల్వేమంత్రి రైల్వేబడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. చార్జీల్లో పెంపుదల లేకపోవటం ఈ బడ్జెట్ విశేషం. సరకు రవాణా చార్జీలను 3 శాతం పెంచారు. 24 కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్ళను ప్రకటించారు. వాటిలో మూడు ఆంధ్రప్రదేశ్‌కు దక్కాయి. సికింద్రాబాద్ - ధర్మవరం ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ - పలాసా ఇంటర్‌సిటీ సర్వీస్, వారానికి ఒకసారి నడిచే సికింద్రాబాద్ - న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లు వీటిలో ఉన్నాయి.



పౌరహక్కుల నేత ఆజం అలీ

27-2-2001

◎ ఆసియాలోనే మరెక్కడా లేని 'జలాంతర్గామి మ్యూజియం'ను విశాఖ పట్నంలో ఆవిష్కరించారు. 31 ఏళ్లపాటు నౌకాదళానికి విశిష్ట సేవలందించిన ఐఎన్ఎస్ కురుసురను మ్యూజియంగా తీర్చిదిద్దారు.



ఇంద్రజిత్ గుప్తా

## స్మరించుకుందాం!



## లూయి బ్రెయిలీ

శతాబ్దాలుగా అంధులు నిరక్షరాస్యత చీకట్లలో కొట్టుమిట్టాడుతూ వుంటే, వారికి ప్రత్యేక లిపి కనిపెట్టి వెలుగు చూపించిన వారు లూయి బ్రెయిలు. పారిస్‌కి దగ్గరలో కూప్‌వెరి గ్రామంలో 1809లో జనవరి 4వ తేదిన జన్మించారు. తండ్రి గుర్రపు జీనులు తయారు చేసేవాడు. బ్రెయిలీ ఒక రోజున ఇనుప పని ముట్లతో ఆడుకొంటుండగా ప్రమాదవశాత్తు కంటికి తగిలి దృష్టి కోల్పోయారు. పారిస్‌లో వున్న అంధుల విద్యాలయంలో చేరారు. చార్లెస్....అనే సైనికాధికారి కాగితం మీద బుడిపెలు రూపొందించి రాత్రివేళల్లో సైనికులకు రహస్య సమాచారం పంపేవారు. ఇది లూయి దృష్టిని ఆకర్షించింది. ఆరు చుక్కల ఆధారంగా ఆంగ్లవర్ణములు తయారు చేశారు. వీటిని అంధులు సులభంగా చేతి వ్రేళ్ళ కొనలతో తడుముతూ చదువగలరు. ఈ.... రూపొందించటానికి, ఒక కొయ్య పలక - ఇనుపమూలికి - ఆరుచుక్కల సెల్స్ వున్న పట్టి తయారు చేశారు. 1932వ సంవత్సరంలో ఈ లిపి అంధుల లిపిగా అంతర్జాతీయ ఆమోదం పొందింది. ఆయన పేరిట బ్రెయిలి లిపి అని ప్రసిద్ధి చెందింది. ఈనాడు అంధులకి బ్రెయిలి టైపు రైటర్లు - ముద్రణాలయాలు, కంప్యూటర్లు కూడా వచ్చాయి. అన్నిటికి మూలం ఆ ఆరుచుక్కలే. బ్రెయిలీ 1852లో జనవరి 6వ తేదిన దివంగతుడయ్యారు. - కె. రామారావు

## మఖ్దూం మొహియుద్దీన్



మఖ్దూం కవి, కార్మికనేత, జీవితాంతం ప్రజల పక్షాన నిలిచిన ప్రజలమనిషి. 1908, ఫిబ్రవరి 4న మెదక్ జిల్లాలో ఆందోల్‌లో జన్మించారు. ఉస్మానియాలో ఎమ్మే చదువుకున్నారు. హైదరాబాద్‌లో లెక్చరర్‌గా పనిచేస్తూ కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాణంలోకి ప్రవేశించారు. తెలంగాణా పోరాటంలో చురుకుగా పనిచేశారు. రహస్య జీవితాన్ని గడిపారు. అనంతరం కార్మికోద్యమంలో ప్రవేశించి ఎన్నో కార్మిక సంఘాలకు, పోరాటాలకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా అనేకసార్లు జైలుశిక్ష కూడా అనుభవించారు. ఎ.ఐ.టి.యు.సి. ఉపాధ్యక్షులుగా, భారత కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ సమితి సభ్యులుగా పనిచేశారు. ప్రపంచట్రేడ్ యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యాలయం (వియన్నా)లో కొంతకాలం పనిచేశారు. 1952లో హుజూర్ నగర్ నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికయ్యారు. కొంతకాలం శాసన మండలి సభ్యుడిగానూ వున్నారు.

మఖ్దూం తన కవిత్వంతో ప్రజలలో చైతన్యం తీసుకొచ్చే కృషి చేశారు. కవిత్వంతోనే ఆగిపోకుండా జీవితాంతం ప్రజల మధ్య పనిచేశారు. ఆయన కవిత్వం ఇంగ్లీష్, రష్యన్, హిందీ, తెలుగు తదితర భాషల్లోకి అనువాదమైంది. తెలుగులో 'మఖ్దూం కవిత' పేరిట ఒక పుస్తకం వెలువడింది. మఖ్దూం 1969 ఆగస్ట్ 24న మరణించారు.

# మరికొన్ని Polite Expressions



ఇలా ఈజీగా నేర్చుకుందాం 12

## ఆర్వీయార్ మాష్టారి ఇంగ్లీషు పాఠాలు

పలుకరింపులు, పరిచయాలు యెలా వుంటాయో చూశాం కదా. Please, Kindly యెక్కువ వాడతారనీ చూశాం.

ఇక ఇంగ్లీషువాళ్లు మర్యాద తెలియ చేసేందుకు వాడే మరికొన్ని expressions చూద్దాం. ప్రతిదానికీ Please అన్నట్టే, యెవళ్లన్నా యేదన్నా సాయం చేసినా, వస్తువును యిచ్చినా ఆఖరికి ఓ గ్లాసు మంచినీళ్లు అందించినా కూడా Thanks అనీ, Thank you అనీ చెపుతూ వుంటారు. మన భారతీయ భాషల్లో యిలాంటి expression వాడకం తక్కువ. హిందీలో ధన్యవాద్ అనీ మన భాషలో కృతజ్ఞతలు అనీ పదాలు వున్నాయి. కాని పదేపదే పనిగట్టుకుని వాటిని చెప్పరు. అందుకు సమానార్థకమైన expressions అదే spiritది తెలియచేసేవి వున్నాయి. నీ మేలు మర్చిపోలేను, నీ రుణం యెలా తీర్చుకుంటాను అనే మాటలు సందర్భాన్ని బట్టి వాడుతూ వుంటాం. కాసిని మంచినీళ్లు యిచ్చినా, ఓ కప్పు కాఫీ యిచ్చినా "నీ మేలు మర్చిపోలేను" అనం. ఎగతాళిగా వుంటుంది. యిటీవలి కాలంలో Thanks అని మనమూ వాడేస్తున్నాం. యూరోపియన్ మర్యాదల్లో అన్ని భాషల్లోనూ యిలాంటి మాటలు వున్నాయి. Thank you అనీ, Thanks అనీ రెండు విధాలా వాడచ్చు. Vote of thanks మనకి ప్రతి మీటింగులోనూ బాగా నలిగిందే. Thanks giving అని దేవునికి కృతజ్ఞతలు తెలియచెప్పడం కూడా వుంది, యిందుగ్గాను ఒక ప్రార్థన కూడా వుంది. Thanks giving Day అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఒక రోజునే యిందుకు కేటాయించేరు. దేవుని జేదార్యానికి స్తుతించడం. సాధారణంగా నవంబరు నెలలో నాల్గవ గురువారం యిలా పాటిస్తారు.

Thank క్రియ. Thank a person for help.

I thank you for helping me in my troubles.

కష్టాల్లో నన్ను ఆదుకున్నందుకు కృతజ్ఞుణ్ని.

Thank you అని gratitude express చేసేటప్పుడు అంటాం.

Thanks noun plural. యెవళ్లన్నా యేదన్నా యిచ్చినప్పుడు Thanks చెప్పినట్టే యే offerనైనా వద్దంటున్నప్పుడు Thanks అని మర్యాదగా చెప్తారు. No, thanks వద్దు...

No, thank you వద్దు (offer చేసినందుకు thanks అన్నమాట)

Thanks to you help we are here. మీ దయవల్ల యిక్కడ వున్నాం.

Thanks అన్నాం. మరి దానికి బదులుగా యేం అనాలి? మనం అయితే దాన్దేముంది లెండి, నేను చేసింది యేముందండీ అంటూ వినయం చూపిస్తాం (లేకపోతే ప్రదర్శిస్తాం!).

బ్రిటిష్ ఇంగ్లీషులో బదులుగా యేమీ చెప్పడం వుండేది కాదు. కానీ కొంత మంది "That's all right" అనడం వుంది. 'That's o.k.' అనీ, 'Don't mention it' అనీ అంటారు. మనం ఫక్తు ఇండియన్ స్టైల్‌లో No mention అని ధీమాగా అనేస్తాం. అది తప్పు. అంటే Don't mention it అనండి. అమెరికన్ ఇంగ్లీషులో "you're welcome" అనడం యివాళ common అయింది. మళ్లీ సాయం కావాలంటే అడగండి అని ఆహ్వానించేందు కనేమో బహుశా! ఏమైనా you're welcome అన్నది ప్రస్తుతం వాడుక.

Would like some more explanation?

(మరింత వివరణ కావాలా?)

No, thanks -

No thank you.

(చాలు బాబూ అక్కర్లేదు!)

Thanks లాగానే ఆభావం వెల్లడి చెయ్యడానికి 'cheers' అనీ వాడతారు. బ్రిటిష్ ఇంగ్లీషులో informal గా వాడతారు.

"Here your book I borrowed".

"oh, cheers".

Thanks అన్నమాటను చిరాకు సూచించే సందర్భాల్లో వాడడం వుంది, జాగ్రత్తగా గమనించండి.

I'll thank you to mind your own business.

తమరు వేలు పెట్టకుండా వుంటే బాబూ మీకు పుణ్యం వుంటుంది అని భావం.

అలాగే He has only himself to thank for what happened.

Who do we have to thank for this disaster?

యీ సందర్భాల్లో అర్థం తెలుస్తూనే వుందిగా.

ఇక Thanks a lot

Thanks very much

Thanks a million అనీ expressions వున్నాయి.

Have you said your thank-you to your uncle?

అంకుల్‌కు కృతజ్ఞతలు చెప్పావా?

Thanks చెపుతూ రాసే జాబుల్ని Thank you letters అంటారు.

***Sorry, Pardon, Excuse me***

ప్రతిదానికీ thanks చెప్పినట్టే sorry, pardon, excuse అనే మాటల్ని మర్యాదల కోసం వాడుతూ వుంటారు.

***Excuse me*** అనే మాటను అవతలి attention ఆకట్టడానికి వాడుతూ వుంటారు.

Excuse me, could you tell me the way to post-office?

Excuse me, is the Editor there?

అసలు excuse అనే మాటకు క్షమించండి అని అర్థం. యిక్కడ క్షమించడం లాంటిదేమీ లేదు. అయినా అవతలవాళ్ల పనిచేస్తున్నామేమోనన్నది యిమిడి వుందేమో మరి.

***Sorry*** : ఏదన్నా చిన్న పొరపాటు జరిగినా sorry అంటూ వుంటారు.

Sorry, I'am late.

బ్రిటిష్ usageలో Sorry, I'am sorry అనే మాటల్ని యెక్కువగానే వాడుతూ వుంటారు. అదేరకంగా యెవళ్లన్నా చెప్పిన దాంతో agree కానప్పుడు, విభేదిస్తున్నప్పుడు వాడతారు, refusalకీ వాడతారు.

I'am sorry, I don't agree (ఆ వలానా ప్రతిపాదనలో)

I'am sorry, I can't (యేదన్నా అడిగినప్పుడు లేదనడం)

Better safe than sorry అని ఒక సూక్తి వుంది. ముందే జాగ్రత్తగా వుంటే విచారించే అవసరం రాదు. అడుసు తొక్కనేల కాలు కడుగనేల అన్నారు కదా!

***Pardon***

యిదీ excuse లాంటిదే. అమెరికన్ ఇంగ్లీషులో యీ రెండింటినీ apologies కి వాడతారు.

Pardon me, I didn't understand your answer. I beg you pardon అనీ అంటారు. యెవళ్లన్నా యేదన్నా చెప్పినప్పుడు మనకి వినిపించక repeat చెయ్యమని అడిగేందుకు యిలా వాడతారు. యేదన్నా తప్పు చెప్పామనుకోండి, correct చేసుకుందుకూ యిలా వాడతారు. రేడియో వార్తల్లో యిలా అనడం వినే వుంటారు.

Pardon, could you say that again?

Sorry, I have to rewind the tape!

(ఇంకావుంది)

థాంక్స్ అన్నానేకదాని వెల్కమ్ అంటే దూరిపోవడమే!



# అక్షర క్రీడ-12

నిర్వహణ : కె.రాజేశ్వరరావు

**నిబంధనలు :** ఈ పత్రికలోని గళ్ల నుడికట్టులోనే కొట్టివేతలు, దిద్దుబాట్లు లేకుండా పూరించి పోస్టులో పంపాలి. జిరాక్స్ కాపీ అనుమతించబడదు. అన్ని జవాబులు సరిగ్గా రాసిన మొదటి పది మందికి **జనహర్ష** సిల్వర్ కాయిన్లు బహుమతిగా లభిస్తాయి. సరిగ్గా రాసిన వారి సంఖ్య ఎక్కువ వుంటే బహుమతులను, లాటరీ ద్వారా ఎంపిక చేసిన 10 మందికి ఇస్తాము. దీని విషయంలో తుది నిర్ణయం యాజమాన్యానిదే. ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు. ఎంట్రీలు మార్చి 20వ తేదీలోపుగా మా కార్యాలయానికి అందాలి.



## అక్షరక్రీడ-12 ఆధారాలు :

### అడ్డం :

1. నియమం తోటిది. తెలుగు కండిషన్ (4)
5. ఉడకపోతలో అల్పప్రాణి (3)
7. హరణంలేని నంది తిమ్మన ప్రబంధం (5)
10. అటునుంచి లక్ష్మణుని కోసం కాదు, అతని అన్న కోసం (5)
13. ప్రతిమావరణంలో 1,4,5 (3)
14. నేడు గడిస్తే (2)
16. కొమ్మ (2)
17. కుక్కతోక ఆకృతి (3)
18. దపం మరో అక్షరంతో చెట్టు (3)
20. యవనిక (2)
22. 38 అడ్డంతో ప్రారంభమైతే ఆదివారం తర్వాత వచ్చే వారం (1)
23. అటునుంచి బసవయ్య విగ్రహం వున్న ప్రసిద్ధ స్థలం; ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ పేరు కూడా (3)
25. దాహం (3)
29. సరస్వతి చేతిలో వుంటుంది (2)
30. ఇదీ, ప్రతీకారం కలిపి ద్వంద్వపదం (2)
32. తొమ్మిది రాత్రులు (5)
33. మధ్య అక్షరాలు అటూ ఇటయిన రథము (4)
36. నేడు నేడా అయితే, నాడు లంగా బొందవు తుందా? (2)
37. వాడుక, ఆనవాయితీ - మరోలా (3)
38. వంకర టింకర ఓ, వాని తమ్ముడు___ ? (1)
39. విరామ చిహ్నం (2)
40. అడ్డం 44 చివరి అక్షరమైతే మరక (1)
41. 'క' గుణింతంలో నెమలి (2)
43. ముని తర్వాత రెండక్షరాలుంటే సాయంత్రం (2)
44. అడ్డం 48కి ముందుంటే ఆలయం (1)
45. పనసలో సారం (2)
46. తింటే ఇవి తినాలి, మధ్యలో విరిస్తే ఎలా?(2)
47. సరస్వతికి మరోపేరు (3)
48. అడ్డం 47లో మొదటి అక్షరంతో మొదలైతే పదును (1)
49. జేమ్స్ వాట్ కనిపెట్టింది (5)

### నిలువు :

1. వాసంగల ఇల్లు (3)
2. సిరకాదు, మరోటి (3)
3. కుస్తీ పట్టడానికి ఇందులోకి దిగాలి (2)
4. తెలుగులో చివరి దాకా లేని "వెదర్" (4)
6. అవతలవేపు చూస్తే ఆలోచన (3)
7. వారం ముందు రెండక్ష రాలుంచండి. సముద్రం అవుతుంది (2)
8. ప్రశ్నలు - జాబుల్లో తలకిందులైన - నాయకుడు (2)
9. ఇహలోకం కాదు, ___ లోకం (2)
11. ఇదో రకము మొగ్గ, తెలుసుకో (4)
12. భిక్ష కాదు, పిడికిలి (2)
14. గీత మరోలా మారితే నిన్నటి హిందీ హీరోయిన్ (2)
15. చుట్టూ తిరగడంలో దక్షిణ దేనికో (4)
16. "ఊర్వశి" పురస్కార మందుకున్న నటి, మాజీ ఎంపీ కూడా (3)
19. ___ పసివాడు తలకిందులయ్యాడు (2)
21. ధాన్యమరాడిస్తే వచ్చే పొట్టు (2)
24. లేడి పయనమున కనిపించే పూత (4)
26. చెరకు రసం పిండేస్తే మిగిలేది తలకిందులైంది (2)
27. దుష్యంతుని అత్తగారా? (3)
28. కోపంవస్తే ఆడవాళ్ళు మిరియాలతో పాటు ఇవి కూడా నూరతారు (3)
29. వారసులకు ఆస్తులు, మొదలైనవి రాసిచ్చే పత్రం (4)
31. అంగద కుమారా! ఏదీ నీ ఆయుధం (2)
34. కల్మషం (3)
35. సాక్ష్యాలు (4)
39. రక్షణ; కాయలు కాయడం (2)
41. సింహం (3)
42. అక్క భర్తను పిలవండి(2)
43. కోయిల తినే చిగురు(2)
45. పల్లవిని వజ్రాయుధం తీయమందాం (2)
46. అంతగా ఆత్రం దేనికి? పాడాలంటే గొంతు బాగుండాలె (2)

## అక్షరక్రీడ-11 సమాధానాలు



### అక్షరక్రీడ-11 విజేతలు :

- కె. జయలక్ష్మి, W/o. కె.ఎస్.ఎం. రావు, 19, 1-1-298, అనుకూల్ అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం.103, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాద్-500 020.
- జె. కృష్ణవేణి, జె. సీతారామయ్య కరణం వీధి, బెర్హంపూర్ - 760 009, ఒరిస్సా
- డి. వేణు గోపాల్ సీనియర్ అసిస్టెంట్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గాంధీ బజార్ బ్రాంచ్, అనంతపూర్ - 515 001.



ఎంట్రీలు పంపే చిరునామా :
అక్షరక్రీడ, **విజయ విహారం**,
12-5-33/2, విజయపురి, తార్నాక,
సికింద్రాబాద్-17 ☎ 7007053

పేరు :

చిరునామా :

పిన్‌కోడ్ :






## వంకాయకూర

భలేరావు, బోళాశంకర్ ఓ మెగా కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనికి కుదురుకున్నారు. ఆ కంపెనీ 70 అంతస్థుల బిల్డింగ్ పూర్తి చేస్తోంది.

మధ్యాహ్నం భలేరావు, బోళాశంకర్ 70వ అంతస్థు మీద కూర్చుని లంచ్‌కి ఉపక్రమించారు. భలేరావు బాక్స్ తెరిస్తే దాంట్లో వంకాయకూర ఉంది. "దరిద్రపు వంకాయకూర, రేపు కూడా మా ఆవిడ ఈ దరిద్రపు వంకాయకూర వండితే నేను ఈ బిల్డింగ్ మీద నించి దూకి ఛస్తాను" అని అరిచాడు భలేరావు.

బోళాశంకర్ తన బాక్స్ తెరవగానే దాంట్లో కూడా వంకాయకూరే వుంది. బోళాశంకర్‌కి చిర్రెత్తుకొచ్చి "వెధవ వంకాయకూర, రేపు కూడా నా లంచ్ బాక్స్‌లో ఈ వెధవ వంకాయకూరే వుంటే నేనూ ఈ బిల్డింగ్ మీద నించి దూకి ఛస్తాను" అన్నాడు.

మర్నాడు మధ్యాహ్నం యధావిధిగా లంచ్ టైముకి బాక్స్ తెరిచి చూడగానే భలేరావు బాక్స్‌లో వంకాయకూరే వుంది. భలేరావు చిందలు తొక్కి 70 అంతస్థుల బిల్డింగ్ మీదనించి కిందకి దూకేశాడు.

బోళాశంకర్ తన బాక్స్ తెరిచి చూడగాననే దాంట్లో కూడా వంకాయకూర ఉంది. బోళాశంకర్ కూడా మండిపడి బిల్డింగ్ మీదనించి దూకేశాడు.



70 అంతస్థుల మీదనించి కిందికి వడిపోతూ, సరిగ్గా మాడు పగిలి చచ్చేముందు బోళాశంకర్ ఈ విధంగా విచారించాడు : "నాకేమైనా మెంటలా? రోజూ నేనేవండుకుని నా లంచ్ బాక్స్ ప్యాక్ చేసుకుంటాను కదా!"



## ఎందుకు?

"ఉద్యోగానికి బ్రహ్మచారులు వద్దు పెళ్ళి చేసుకున్న మగవాళ్ళే కావాలని అడ్వర్టైజ్‌మెంట్‌లో ఎందుకు రాశార్సార్" భలేరావు ఇంటర్వ్యూకి వెళ్ళినపుడు అడిగేశాడు.

"పెళ్ళైన వాళ్ళైతే మేం ఎంత చెడతిట్టినా అప్‌సెట్ అవకుండా ఉంటారు" ప్రొప్రైటర్ జవాబిచ్చాడు.

## ప్లీజ్



భలేరావు చచ్చేముందు భార్యని తన గదిలో పిలిపించుకుని "నేను చచ్చిపోయాక నువ్వు మా బాస్‌ని పెళ్ళాడు, కాదనకు, ప్లీజ్" అంటూ పరిపరివిధాల వేడుకున్నాడు.

ఆవిడ "అదేమిటి మీ బాస్ అంటే మీకు కోపం, అసహ్యం కదా?" అని ఆశ్చర్యపడింది.

"అందుకే మా బాస్‌ని పెళ్ళాడమంటు న్నాను" అని భలేరావు మళ్ళీ బతిమాలడం ప్రారంభించాడు.

## తప్పనిసరి

బోళాశంకర్ ఓసారి ఫిషింగ్ చేసన్తూ ప్రమాదవశాత్తూ చెరువులోపడి మునిగిపోతున్న పిసినారి ధనవంతుడ్ని సాహసంతో రక్షించాడు.

ఆ పిసినారి పెద్దమనిషి కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోయి తన చొక్కా జేబు అంతా వెదికి ఓ రూపాయిబిళ్ళ తీసి బోళాశంకర్ చేతిలో పెట్టి "ఇది ఉంచండి, మీ ఉపకారం ఆజన్మాంతం మరవలేను" అన్నాడు.

బోళాశంకర్ ఇబ్బందిపడి "దాన్దేముంది లెండి" అని వెనక్కి తిరిగి ఇచ్చేః

ఆ పెద్ద మనిషి "భలేవారే, తీసుకోండి, మీరు నన్ను రక్షించకపోతే నాతో పాటు ఈ రూపాయిబిళ్ళ కూడా చెరువులో పోయేదేకదా. మీరు తప్పనిసరిగా తీసుకోవల్సిందే" అని గట్టిగా చెప్పాడు.





## రేపు

భలేరావు భార్య పొద్దున్నే భర్తని లేపి గోముగా "ఏమండీ, మీరు నాకు ఖరీదైన చీర కొనిఇచ్చినట్టు కల వచ్చింది" అని చెప్పింది.

"మంచిది, రేపు కలలో ఆ చీర కట్టుకుని మీ పుట్టింటికి ఓ సారి వెళ్ళిరా" జవాబిచ్చాడు భలేరావు.

## అందుకే



భలేరావు: స్వామీ, దేముడు ఆడవాళ్ళని అంత అందంగా ఎందుకు పుట్టించాడు?
బాబా: నువ్వు ప్రేమించేందుకు నాయనా.
భలేరావు: స్వామీ, దేముడు ఆడవాళ్ళని అంత మంచిగా ఎందుకు పుట్టించాడు?
బాబా: నువ్వు ప్రేమించేందుకు నాయనా.
భలేరావు: స్వామీ, దేముడు ఆడవాళ్ళని అంత బుద్ధిలేకుండా ఎలా పుట్టించాడు?
బాబా: నిన్ను ప్రేమించేందుకు నాయనా.

## అదృష్టం

చిన్నారావు వెయింగ్ మిషన్ ఎక్కి బరువు చూసుకున్నాడు. 58 కిలోలు ఉంది. కార్డు వెనక్కి తిప్పి అదృష్టం చూసుకున్నాడు. "ఇంటికెళ్ళు, 2 రు. వృధాగా తగలేసినందుకు మీ ఆవిడ మొహం పగలగొడుతుంది" అని ఉంది.





## ఆందోళన

భలేరావు ఆందోళనని చూసి పక్కింటాయన ఏమయ్యిందని వాకబు చేశాడు.

"మా ఆవిడ బయటికి వెళ్ళి 5 గంటలైంది. ఆవిడ్ని ఎవరైనా కిడ్నాప్ చేసినా చేసి ఉండొచ్చు, ఏ కారైనా ఆవిడ్ని గుద్దేసినా గుద్దేసి ఉండొచ్చు. లేదా ఆవిడ షాపింగ్ చేస్తూ ఉండొచ్చు. ఏమయ్యిందో ఏమో, షాపింగ్ మాత్రం కాకూడదని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను."



## వయగ్రా

భలేరావు వయాగ్రా వాడిచూడాలనే తన కోరికని డాక్టర్‌కి ధైర్యంగా చెప్పుకోలేక పోయాడు

డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్‌ని చూసి "నిజం చెప్పండి డాక్టర్, దీంట్లో నన్ను ఉద్రేకపరిచేదీ, రెచ్చగొట్టేదీ ఏదైనా ఉందా?" అని చిన్నగా అడిగాడు.

"అటువంటిది నా బిల్లులో ఉంటుంది" డాక్టర్ సర్ది చెప్పాడు.

## టైమ్

భలేరావుని బాస్ పిలిచి "నా దగ్గిర వెయ్యి రూపాయలు పుచ్చుకున్నావు మర్చిపోయావా?" అని గద్దించాడు.

భలేరావు జడుసుకుని "లేద్సార్, ఇంకాలేదు, కొంచెం టైమివ్వండి. తప్పనిసరిగా మర్చిపోతాను" అనేశాడు.



## అవసరం

భలేరావు తాను కొత్తగా అద్దెకి దిగబోతున్న ఇంటి ఓనర్‌తో మాట్లాడుతూ చెప్పాడు: "మేం అంతకుముందు అద్దెకి ఉన్న ఇంట్లో ఓనర్స్ మేం ఖాళీ చేస్తుంటే బాధపడి ఏడ్చినంత పని చేశారు".

కొత్త ఇంటి ఓనర్ మామూలుగా చెప్పాడు: "నాకా అవసరం రాదులెండి. నేను అడ్వాన్స్ చెక్కులు ముందే తీసుకుంటాను"



## ఇచ్చానా?

బోళాశంకర్ గుళ్ళోంచి బయటకివస్తూ ముష్టివాడికి రూపాయి దానమిచ్చి "దీన్ని తిండికి ఖర్చుపెట్టుకో అంతేగానీ తాగి తందనాలాడి తగలేసుకోకు" అని చెప్పాడు.

ముష్టివాడు డబ్బు తీసుకుని "చూడు బాబూ, నీ డబ్బు ఎలా ఖర్చుపెట్టుకోవాలో నేను నీకేమైనా సలహా ఇచ్చానా? అని అడిగాడు.







# నవీన్

సీరియల్

# రక్తకాసారం

6

(గతసంచిక తరువాయి)

"మీకో సంగతి చెప్పుకుందామనొచ్చినం దేశముఖ్‌గారూ!" అన్నాడు యాదయ్య. ఆ మాటనడానికి అతడు చాలాసేపట్నించి ప్రయత్నిస్తున్నాడు.

"చెప్పు... యేం సంగతో చెప్పు... నేను వద్దంటలేను గదా... ఇది ప్రజా ప్రభుత్వం. ఈ రోజుల్ల ప్రజలే ప్రభువులంటున్నరు. నీ కొడుకు పేరేందో ఉండెనేమురా లచ్చిగా! నేను మరచిపోయిన" అన్నాడు దేశ్‌ముఖ్.

"వాని పేరు యాదిగాడు బాంచెన్" అన్నాడు లచ్చయ్య.

"యాదయ్య! అని చెప్పు. యాదిగాడు అనే రోజులు పోయినయి. నిన్ను కూడా లచ్చయ్యనే పిలవాలె" అన్నాడు దేశ్‌ముఖ్.

"యేదో మీదయ బాంచెను" అన్నాడు లచ్చయ్య.

"యేం యాదయ్యా! ఏం చదువుతున్నవు?" అన్నాడు దేశ్‌ముఖ్.

"ఇంటర్మీడియట్ పూర్తయ్యింది" అన్నాడు యాదయ్య.

"మీ తమ్ముడేం చదువుతున్నడు"

"ఈ సంవత్సరం టెన్త్ అయిపోయింది"

"నువ్వింక చదువుతవా? బంధ్‌జేస్తవా?"

"చదువాల్ననే ఉన్నది. కని మా అయ్య వద్దంటున్నడు. యేదన్న నౌకరి జూసుకొమ్మంటున్నడు"

"అట్లెందుకంటున్నవు? వాన్ని చదువుకోనీయ్. మీ అసుంటోళ్ళందరు చదువుకోవాలె. దునియా అంటె యేందో తెలుసుకోవాలె. అప్పుడే గీ దేశం బాగుపడ్తది"

దేశ్‌ముఖ్‌ను చూస్తున్నా, అతని మాటలు వింటున్నా యాదయ్యకు ఈయన నిజంగానే మంచివాడనిపించింది.

"చల్లకొచ్చి ముంత దాసుడెందుకు? యేం సంగతో చెప్పుండ్రి" అన్నాడు దేశ్‌ముఖ్.

ఆ ముగ్గురూ ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.



విషయాన్ని ఎక్కడ, ఎలా మొదలెట్టాలో వాళ్ళకర్థం కాలేదు.

అక్కడున్న చాలామంది పనిపాటల వాళ్ళు వాళ్ళనే చూస్తున్నారు.

యాదయ్యే మెల్లగా నిన్న జరిగిందేమిటో చెప్పడం మొదలెట్టాడు.

"నిన్న మా అవ్వ అది మీ పాలమని ఎరుకలేక కొన్ని పిడకలేరింది. చీకట్ల దాన్ని మీ పాలమని గుర్తుపట్టలే. వరసగ ఒకరి పాలంల నుంచి ఇంకొకరి పాలంలకు పిడకలేరుకుంట వస్తాంది. పిడకలు లేకపోతే మాకు గడవదిగదా... పల్లెటూర్లల్ల గిట్ల పిడకటేరుకొచ్చుడు... వాటితోటి పొయ్యి రాజేసుకునుడు మామూలె. నిన్న మా అవ్వ మీ పాలంల పిడకలేరినందుకు మీ శేర్‌దార్ వెంకటాద్రి మా అవ్వను నోటికొచ్చినట్టు తిట్టిండు. నిన్ను గాడ్దెలు, గుర్రాలు అని ఎన్ని గలీజు మాటలన్నడో లెక్కలేదు. గట్ల తిట్టింది చాలక మా మాదిగగూడెమంత చూస్తాంటే మా అయ్యతోటి మా అవ్వను యాభై దెబ్బలు కొట్టిపిచ్చిండు. గంత చిన్న తప్పుకు గింత పెద్ద శిక్ష వేసుడు న్యాయమేనా అని అడిగేందుకొచ్చినం. ఈ ఊర్లె మిమ్మల్నందరు దేవుడసుంటోడంటరు. దేశ్‌ముఖ్‌గారు మంచోడే గని ఆయన శేర్‌దారుడే మంచోడు కాడంటరు. మీ శేర్‌దార్ మీ పేరు చెప్పుకునేగదా గిసుంటి పన్లు జేస్తున్నడు. నిన్న మా అవ్వను అన్ని తిట్లుదిట్టి గంతమంది ముంగట మా అయ్యతోటే కొట్టిపిచ్చినంక మేమా వాడల ఎట్లుండాలె. మా ఇజ్జతంతా గోదాట్లె కల్సిందా లేదా... మీరే చెప్పుండ్రి. మీరు ఇది ప్రజా ప్రభుత్వమన్నరు. ప్రజలే ప్రభువులన్నరు. గీ రోజుల్ల గిట్ల జేసుడు న్యాయమేనా? మీరే చెప్పుండ్రి. దేశ్‌ముఖ్‌గారూ! మీరే న్యాయం చెప్పుండ్రి. మీరు న్యాయం చెప్పుతరనే మీ దగ్గరకొచ్చినం" అన్నాడు యాదయ్య.

దేశ్‌ముఖ్ కరుణాకరరావు యాదయ్య చెబుతున్న ప్రతి మాటనూ ఎంతో జాగ్రత్తగా విన్నాడు. యాదయ్య ముగించాక ఆరాం కుర్చీలో కొంచెం ఇబ్బందిగా అటూ యిటూ కదిలాడు. పక్కనే నిల్చున్న వెంకటాద్రికేసి ఓసారి తీక్షణంగా చూశాడు. కాస్సేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. అక్కడున్న వాళ్ళందరూ దేశ్‌ముఖ్‌గారి నోట్లోంచి యేం మాటలు వెలువడ్తాయా అని గుండెలు బిగబట్టుకొని ఎదురు చూశారు.

"నువ్వేమన్న చెప్పుకునేదుందార లచ్చయ్య?" అన్నాడు దేశ్‌ముఖ్ లచ్చయ్యకేసి చూసి

"చెప్పుకునేటందుకింకేముంది బాంచెను. నేను మీ దగ్గర నా చిన్నప్పట్నించి జీతముంటాన... రాత్రనక పగలనక కష్టం జేస్తాన. నేనయినా, నా పెండ్లామయినా ఎవరితోటి పల్లెత్తుమాట పడకుంట బతుకుతానం. ఇయ్యాళ ఎరుకలేక నా పెండ్లం మీ పాలంల పిడకలేరింది. అది జేసింది తప్పే. నేను కాదంటలేను. ఎన్నడులేంది ఇయ్యాళ దానికా పాడు బుద్దెందుకు పుట్టిందో గా ముత్తాలమ్మకే తెల్వాలె... కని గింత చిన్న తప్పుకు గిట్ల పజీత పజీత జేసుడు నాయమేనా బాంచెను. మీ శేర్‌దారే గిట్ల జేస్తె మేమెక్కడ బోవాలె బాంచెను. మీరే మా దేవుడు... మీరే మా దైవం..." అన్నాడు లచ్చయ్య.

దేశ్‌ముఖ్ మళ్ళీ ఆలోచనలో పడిపోయాడు. మళ్ళీ వెంకటాద్రికేసి యేం తలనొప్పి తెచ్చిపెట్టావురా బాబూ! అన్నట్టుగా చూశాడు. తర్వాత మాట్లాడటం మొదలెట్టాడు. అతడు మాట్లాడిన ప్రతి మాటా అక్కడున్న వాళ్ళకందరికీ ఎంతో గంభీరంగా వినిపించాయి.

"మా పాలంల గొడ్లు పెండబెడ్తయి. పెండబెట్టిన ఆ గొడ్లెవరివి? దేశ్‌ముఖ్‌గారియే. ఆ పెండ ఎండిపోయినంక పిడకయితది. ఆ పిడకెవరిది. దేశ్‌ముఖ్‌గారిదే... ఆ పిడక తర్వాతేమయితది? పాలంల కలిసిపోయి పాలానికి జవయితది. ఆ జవవల్ల ఆ పాలంల వడ్లు బాగ పండుతయి. వడ్లు పండినంక ఆ వడ్లేమయితయి? బియ్యమయితవి. ఆ బియ్యమేమయితయి. కొన్ని వేలమందికి అన్నమయితయి. పాలంల పిడకలేరడం మీరు చాలా చిన్న తప్పంటున్నరు. కని మీరు నా పాలంల పిడకలేరడం వల్ల ఎంత పంట పండకుంట పాయిందో మీకు తెలుస్తలేదు. మీరు నా పాలంల పిడకలేరడం వల్ల నా పాలం చాన కంజార్ అయిపోతది. గట్ల కంజార్ అయిన పాలంల వడ్లు పండతయేమో మీరే చెప్పుండ్రి. నా పాలంల వడ్లు పండకుంట జేసిండ్రు. వడ్లు పండకపోతే బియ్యమెక్కడ్నించొస్తయ్? అన్నం ఎక్కడ్నించొస్తది? అన్నం లేకపోతె పాట్టెట్ల గడుస్తది. ఎక్కడన్న కొట్టుండ్రి. కని పొట్టమీద కొట్టకుండ్రి అంటరు. ఆ మాట నిజమొ కాదో మీరే చెప్పుండ్రి. ప్రజల పొట్టల మీద కొట్టుడు న్యాయమేనా? మీరే చెప్పుండ్రి. ఇది ప్రజా ప్రభుత్వమని నేనన్న మాట నిజమే. ప్రజలే ప్రభువులని నేనన్న మాట కూడా నిజమే. మీరంతా ప్రజలు. మీరెట్ల చెబితె అట్లనె. ప్రజల పొట్టల మీద కొట్టుడు న్యాయమేనా? అని అడుగుతున్న. మీరే చెప్పుండ్రి. మీరెట్ల చెప్తె అట్లనే" అన్నాడు దేశ్‌ముఖ్.

"ప్రజల పొట్టల మీద కొట్టుడు అన్యాయం. అన్యాయం" అన్నారు అక్కడ నిల్చున్న ప్రజలంతా.

"నీ పెండ్లం నా పాలంల నాల్గు గంపల పిడకలేరినందువల్ల నాకెంత నష్టమయిందో చెప్పుండ్రి. నాకు నష్టమయినా ఫరవాలేదు. దేశానికెంత నష్టమయిందో చూడుండ్రి. ఎంత మంది పొట్టలు కొట్టినట్టయిందో లెక్క కట్టుండ్రి. ఇది చిన్న తప్పో పెద్ద తప్పో మీరే చెప్పుండ్రి" అన్నాడు దేశ్‌ముఖ్.

అక్కడున్న వాళ్ళందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. యాదయ్య తన చెవుల్ని తాను నమ్మలేకపోయాడు. దేశ్‌ముఖ్ గారు పిడకలేరడాన్ని దేశ ఆహార సమస్యతో ముడిపెట్టడం అతన్ని అమితంగా ఆశ్చర్య పరచింది.

"ఇది చాన పెద్ద తప్పు" అన్నారు అక్కడున్నవాళ్ళంతా.

"చానా పెద్దతప్పని అందరూ చెప్పుకున్నారు గదా! ఈ తప్పుకు వెంకటాద్రి వేసిన శిక్షేంది? మొగునితోటి పెండ్లాన్ని కొట్టించిండు. వేరే వాళ్ళతోటైతె కొట్టియ్యలేదు గదా. మొగుడు పెండ్లాన్ని ఎన్ని సార్ల కొట్టడు? లచ్చిగాడు వాని పెండ్లాన్ని ఎన్ని సార్లు కొట్టిండో మీకెరిక లేదా? మీరు చూళ్ళేదా? గిది గట్లాటిదే అనుకోండ్రి. లచ్చిగాడంటె ఎవడు... వాడు మా జీతగాడు. రేపో పాలాన్ని దున్నెటోడు వాడె... దాన్ని పండించేటోడు వాడె. వాడెంతో కష్టంజేసి, ఆ పాలాన్ని దున్ని, నాటు పెట్టి నానా తంటాలు పడ్తే... రేపో పాలంల ఏం పండలేదనుకోండ్రి. వాడెంత బాధపడ్తాడు. వాడు పడ్డ కష్టమంత మట్లె కలిసిపోలె. దోపిడి... దోపిడి అంటరు. ఇది దోపిడి కాదా? పాలంల పడ్డ బలాన్నంతా దోచుకపోవుడే గద ఇది. పాలంల ఉన్న జవనంగా దోచుకుపోయిందెవరు? లచ్చిగాని పెండ్లామే కద... గందుకే వాడు దాన్ని శిక్షించిండు. లచ్చిగాడే వాని పెండ్లాన్ని గిట్లెందుకు జేసినవని ఓ నాలుగు దెబ్బలు కొట్టిండు. ఇండ్ల వెంకటాద్రి జేసిందేమి లేదు" అన్నాడు దేశ్‌ముఖ్.

అప్పుడే అక్కడికి మాదిగ గూడానికంతా పెద్దమనిషైన మైసయ్య వచ్చాడు.

"యేమే ముత్తీ! నిన్ను నీ మొగడే కొట్టిండుగద. ఇంకోడైతె కొట్టలేదు కద. నువ్వు తప్పుజేసినప్పుడో... లేకపోతే వాడు బాగ తాగొచ్చినప్పుడో వాడు నిన్నెన్ని సార్ల కొట్టలే. మేం ఎన్ని సార్ల చూడలే. ఇది కూడా గసుంటిదే అనుకో. పెద్ద ఘనకార్యం జేసినమని దేశ్‌ముఖ్‌గారి తోటే చెప్పుకుంటమని వచ్చిండ్రా? సప్పుడు జెయ్యకుంట యెళ్ళిపోండ్రి. వారెంతో ధర్మాత్ములు కాబట్టి ఇంతటి తోటి వదిలిపెట్టిండు. మరొకరైతే పోలీసులకు పట్టిద్దురు" అన్నాడు మైసయ్య.

"నేనైతే దాన్ని అక్కడ్నే నరికి పారేద్దును. మల్లోసారి దేశ్‌ముఖ్ పాలంల పిడకలేరితివో ఆ పాలానికే నిన్ను బలిస్త" అన్నాడు దేశ్‌ముఖ్‌గారి పెద్ద జీతగాడు నర్సింహులు.

"ఇండ్ల మీకు జరిగిన అన్యాయమేం లేదు. మొగుడు పెండ్లాన్ని కొట్టుడు సర్వసాధారణం. దీనికి మీరు బాధపడొద్దు. మల్లోసారి ఇట్ల జరక్కుంట చూసుకోండ్రి." అంటూ దేశ్‌ముఖ్‌గారు వెంకటాద్రి వైపు తిరిగాడు.

"అరెయ్ వెంకటాద్రి. నీ నోరును జర కంట్రోల్ల పెట్టుకో. వెనకటి రోజులు పోయినవి. నోటికొచ్చినట్టు బూతుమాటలు తిడ్తే ఎవ్వరు పడరు. అందుల గీ యాదయ్య, వాని తమ్ముడు బస్తీల చదువుకుంటాండ్రు. వాళ్ళతోటి జర మర్యాదగ మాట్లాడుడు నేర్చుకో" అంటూనే దేశ్‌ముఖ్‌గారు ఆ రోజుకు దర్బారు చాలించి లేచినిల్చున్నారు. అందర్నీ వెళ్ళిపొమ్మన్నట్టుగా చూస్తూ లోపలకెళ్ళి పోయాడు.

ఆ ముగ్గుర్నీ పిచ్చివాళ్ళన్నట్టుగా చూస్తూ మిగతా వాళ్ళందరూ ఎవరి పనుల మీద వాళ్ళు వెళ్ళిపోయారు.

లచ్చయ్య, ముత్తమ్మ, యాదయ్య కాస్సేపటి వరకు అక్కన్నించి కదలలేకపోయారు. వాళ్ళకు దేశ్‌ముఖ్‌గారన్న మాటలు పదేపదే వినిపించసాగాయి.

"సప్పుడుజేక మీ గూడెం మొఖానపోక ఇంకెందుకు నిల్చున్నరిక్కడ. సప్పుడుజేక పోండ్రి" గద్దించినట్టుగా అన్నాడు నర్సింహులు వాళ్ళను తినేసేట్టుగా చూస్తూ.

వాళ్ళు ముగ్గురూ మెల్లగా నడుచుకుంటూ గడీలోంచి బయటకొచ్చి మాదిగగూడెం వైపు నడవసాగారు.

యాదయ్య ఆలోచిస్తున్నాడు.

*జరిగినకథ :* పోలీస్ అధికారి జితేందర్‌రెడ్డిని రైల్వే స్టేషన్లో ఓ అజ్ఞాత వ్యక్తి కాల్చి చంపుతాడు. ఓ వైపు శవయాత్ర జరుగుతుండగా మరోవైపు ప్రజాబంధుగా పేరుబడ్డ డాక్టర్ రఘువీర్ క్లినిక్‌లోకి ఇద్దరు ఆగంతకులు చొరబడి ఆయనపై గుళ్ళు కురిపిస్తారు. రఘువీర్ మరణిస్తాడు. ఈ హత్యపై యూనివర్సిటీలో పెద్ద చర్చ జరుగుతుంది. మరోవైపు రావులపల్లి అనే గ్రామంలో పంచాయితీ బోర్డుకు ఎన్నికలు దగ్గరపడతాయి. వీరస్వామి, మురహరిరావుల మధ్య పోటీ తీవ్రంగా వుంటుంది. వీరస్వామి అంచనాలను తలకిందులు చేస్తూ మురహరిరావు ఎన్నికల్లో గెలిచి సర్పంచ్ అవుతాడు. వీరస్వామి వెళ్లి క్రాంతికారుల్లో కలుస్తాడు. దళనాయకుడై వచ్చి మురహరిరావుని ప్రజాద్రోహిగా ప్రకటించి బెదిరిస్తాడు. కొన్నాళ్ళకు మురహరిరావు హత్య జరుగుతుంది. అనంతారం గ్రామ సర్పంచ్ ముత్యంరావును కూడా క్రాంతికారులు హత మారుస్తారు. సీతంపేట దేశ్‌ముఖ్ కరుణాకరరావు దగ్గర శేర్‌దార్‌గా పనిచేసే వెంకటాద్రి, దేశ్‌ముఖ్ పొలంలో పిడకలు దొంగిలించిందని లచ్చయ్య భార్య ముత్తమ్మకి 50 దెబ్బల శిక్ష విధించాడు. తల్లికి జరిగిన అవమానం చూసి యాదయ్య లోలోపల రగిలిపోతాడు.

అతనికింతకాలం దేశ్‌ముఖ్ చాలా మంచి వాడే అయ్యుంటాడనే అభిప్రాయముండేది. దేశ్‌ముఖ్‌ను చూడటం, వినడం అతనికిదే మొదటిసారి. దేశ్‌ముఖ్ అతనికి తేనెపూసిన కత్తిలా కనిపించాడు. గోముఖ వ్యాఘ్రంలా కనిపించాడు. తనెంత అమాయకుడో యాదయ్యకిప్పుడర్థమైంది.

దేశ్‌ముఖ్ వెంకటాద్రిని తప్పకుండా గట్టిగా మందలిస్తాడనుకున్నాడు. తన తల్లిని కొట్టించినన్ని దెబ్బలు అతనికి పడ్తాయనుకున్నాడు. అలా దేశ్‌ముఖ్ తమకు న్యాయం చేస్తాడనుకున్నాడు. కానీ ఎంత తెలివిగా అతడు తన శేర్‌దార్‌ను సమర్థించాడో ఆలోచిస్తున్నకొద్దీ అతనిలో ఆవేశం పెల్లుబికింది. అతని రక్తం మసలిపోయింది.

దేశ్‌ముఖ్ పాలంలో నాల్గు పిడకలేరినందుకు ఇంత శిక్షా? మాదిగ గూడెమంతా చూస్తోంటే తన తల్లిని తన తండ్రితోటే కొట్టిపించడం ఎంత న్యాయం. తన తండ్రి తనకు బుద్ధి తెలిసినప్పట్నించీ దేశ్‌ముఖ్ దగ్గరే జీతగాడుగా ఉంటున్నాడు. రాత్రింబవళ్ళు అతనికోసం కష్టం చేశాడు. అతని భూముల్లో బంగారం పండించినందుకు ఇదీ ప్రతిఫలం! ఆ భూముల్లో ఎక్కడియో, ఎవరివో పశువులు వేసిన పెండను ఏరుకోవడం పెద్దతప్పు! ఆ నాల్గు పిడకలేరుకోవడం వల్ల కొన్ని వేలమంది పొట్టలు కొట్టినట్టయిందట! తమ పొట్టల సంగతేమిటి? పిడకలేరుకున్నది తమ పొట్టలకోసమే కదా! ఆ పిడకలతోటే కదా తమ యింట్లో పొయ్యి వెల్గేది? పొయ్యి వెలిగితేనేగదా తమ పొట్టకింత దొరికేది. డబ్బున్న భూస్వాములైతే వాళ్ళింట్లోనే పిడకలు చేయించుకొని పిడకలగూళ్ళు పెట్టుకుంటారు. కానీ తమలాంటి పేదవాళ్ళకు యేరోజుకారోజు ఏరుకొచ్చుకునే ఏరుడు పిడకలే ఆధారం. పల్లెటూళ్ళల్లో పేదవాళ్ళు భూస్వాముల పొలాల్లోకి, చెలకల్లోకి వెళ్ళి పిడకలు ఏరుకోవడం సర్వసాధారణం. ఇది ఎన్నాళ్ళుగానో జరుగుతున్నదే. భూస్వాములు చూస్తే నాల్గు తిట్లు తిట్టి ఊరుకుంటారు. కొందరు మరీ కర్కోటకులైతే ఏరుకోబడిన పిడకల్ని మళ్ళీ వాళ్ళ భూముల్లో పోయించుకుంటారు. అంతేగానీ ఊరంతా చూస్తోంటే యాభై దెబ్బలు కొట్టించడం ఎంతన్యాయం! ఎంత అక్రమం! ఎంత అమానుషం. ఇంతటి హేయమైన చర్యను దేవుడిలాంటి వాడని చెప్పుకోబడే దేశ్‌ముఖ్ సమర్థిస్తాడా? నిజానికి దేశ్‌ముఖ్, వెంకటాద్రి... ఇద్దరూ ఒకటే! అమాయకులైన ప్రజల్ని మోసగించడానికే దేశ్‌ముఖ్ మంచివాడే... కానీ అతని శేర్‌దారుడే మంచివాడు కాడనే ప్రచారం జరిగింది. ఆ ప్రచారాన్ని దేశ్‌ముఖ్‌గారే చేయించాడు. అంతా కుట్ర.. దగా.. మోసం.. దౌర్జన్యం.. దోపిడి.. ఉన్నవాడు లేనివాన్ని దోచుకోవడం.. ఊరికి దూరంగా పెట్టేశారు. హీనాతి హీనంగా చూస్తున్నారు. ఇది తరతరాలుగా జరుగుతోంది. ఎందరు మహాత్ములొచ్చిపోయినా, ఎన్ని చట్టాలు చేసినా తమకు న్యాయం జరగడం లేదు. కనీసం భవిష్యత్తులో తమకు న్యాయం జరుగుతుందన్న ఆశ కూడా కనిపించడం లేదు. ఈ సమాజానికో సర్జికల్ ఆపరేషన్ జరిగితే తప్ప... లేక ఈ సమాజాన్ని కూకటివేళ్ళతో సహా పెల్లగించి దాని స్థానంలో కొత్త సమాజాన్ని నిర్మిస్తే తప్ప ఈ తుప్పుపట్టిన సమాజం మారదు. కుళ్ళి గబ్బుకొడ్తున్న ఈ దుష్ట, దుర్మార్గ సమాజం మారదు. ఈ సమాజాన్ని నేలమట్టం చేయ్యాలంటే తనేం చెయ్యాలి? ఈ సమాజాన్ని నేలమట్టం చేసి, దాని స్థానంలో నవ సమాజాన్ని నిర్మించటం కోసం పోరాడుతున్న వాళ్ళతో చేరిపోవాలి... తప్పదు... తను వాళ్ళతో చేరిపోక తప్పదు.

**...ముందు ముందు గిట్ల జరుగుతదని బ్రహ్మంగారెప్పుడో చెప్పిండు. మ్లేచ్ఛులు దేవాలయాలల్ల ప్రవేశిస్తరని చెప్పిండు. మ్లేచ్ఛులే రాజ్యం చేస్తరని కూడ చెప్పిండు. అంత ఆయన చెప్పినట్టే జరుగుతున్నది...**

తను అలాంటి పని చేస్తే ఉత్పన్నమయ్యే పరిణామాలేమిటో అతడూహించడానికి ప్రయత్నిం చాడు... తను వాళ్ళను ఉద్ధరిస్తాడని తన మీద వెయ్యి ఆశలు పెట్టుకున్న తన తల్లిదండ్రుల్ని విడిచిపెట్టాలి. తనెక్కడున్నాడో చెప్పమని వాళ్ళను చిత్రహింసలు పెట్టే రక్షక భటులు అతని కళ్ళల్లో మెదిలారు. తను తన తల్లిదండ్రుల్నీ, తమ్ముణ్నీ, చెల్లెల్నీ ఆ క్రూరజంతువులకు ఆహారంగా వదేసి వెళ్ళిపోగలడా? అతడు గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

వాళ్ళు ముగ్గురూ మాదిగగూడెం చేరుకొని వాళ్ళ గుడిసెలోకి వెళ్ళిపోయారు.

ఓ వారం రోజులు గడిచిపోయాయి.

ఆ రోజు సాయంకాలం... యాదయ్య ఆ ఊర్లో ఉన్న అతని కొందరు స్నేహితులతో కలిసి ఊరి పక్కనే ఉన్న చెరువు కట్టమీద కొంతదూరం నడిచి ఓ చోట కూర్చున్నారు.

ఆ ఊరికి తూర్పు దిక్కున ఓ చెరువుంది. చెరువుకట్ట దాటాక తాడిచెట్ల వనం వస్తుంది. ఆ తాడిచెట్లల్లోని చాలా తాడిచెట్లకు కల్లుపారుతుంది. ప్రతిరోజూ ఆ ఊరి గౌండ్ల వాళ్ళు తాళ్ళల్లోకి వెళ్ళి మోకుల సహాయంతో కల్లుపారే తాడి చెట్లెక్కి కల్లుగీస్తారు. కల్లుబుడ్లలోకి పారిన కల్లును చెట్లకిందికి తీసుకొస్తారు. కల్లు తాగేవాళ్ళు చాలామంది తాడిచెట్లకిందకే వచ్చి కల్లుతాగుతుంటారు. కొందరు తమ ఇళ్ళల్లోకే కల్లు తెప్పించుకుంటారు.

వెంకటాద్రికి ఎలాంటి కల్తీ కలవని చెట్టుమీంచి దించిన కల్లంటే చాలా యిష్టం. ఇంటికొచ్చే కల్లులో కొంత కల్తీ తప్పకుండా ఉంటుందని అతని నమ్మకం. ప్రతిరోజూ సాయంత్రం నాల్గింటివరకు పనులన్నీ ముగించుకొని తాళ్ళళ్ళకు తప్పకుండా వస్తాడు. అతనికి రోజూ కల్లుపోసే రామస్వామి గౌడ చెట్టు దగ్గరకొచ్చి అప్పుడే చెట్టుమీంచి దించిన కల్లు రామస్వామి భార్య పోస్తోంటే తాగుతాడు. ఆ కల్లు కడుపులో పడ్డాక అతనికి స్వర్గంలో తేలిపోతున్నట్టుగా ఉంటుంది. ఆ క్షణంలో అతనికి వాళ్ళ మీదకెక్కి స్వారి చెయ్యాలనిపిస్తుంది. ఎవరన్నా అతనికి ఎదురు తిరిగినట్టుగా అనిపిస్తే వాళ్ళను నోటికొచ్చినట్టుగా తిట్టేస్తాడు.

ఆ రోజు కూడా వెంకటాద్రి చెట్టు మీంచి దించిన కల్లు కడుపునిండా తాగి చెరువు కట్ట మీంచి నడుస్తూ ఊరి వైపు వస్తున్నాడు. అతనితో పాటు ఓ ఇద్దరు ఆ ఊరి వాళ్ళే నడుస్తూ అతడు చెప్పే మాటలు వింటున్నారు. వాళ్ళకు వెంకటాద్రి దేశ్‌ముఖ్‌గారి పొలంలో పిడకలు ఏరడానికి సాహసించిన "ముత్తి అనే మాదిగదాన్ని" తనెలా శిక్షించాడో చాలా రెచ్చిపోయి వివరిస్తున్నాడు.

అలా మాట్లాడుకుంటూ వాళ్ళు యాదయ్య, అతని మిత్రులు కూర్చున్న ప్రదేశాన్ని సమీపించారు.

యాదయ్యను చూడగానే వెంకటాద్రి యింకా రెచ్చిపోయాడు.

"గివీడే... గివీడే దాని కొడుకు. జర బస్తీల చదువుతున్నవని వీనికి మస్తిబట్టింది. పెద్ద తీస్‌మార్ ఖానోలె దేశ్‌ముఖ్‌గారి దగ్గరికే వచ్చి నా మీద షికాయిత్ జెయ్యబొయ్యిండు. దేశ్‌ముఖ్‌గారి తోటి నన్ను తిట్టిపిస్తనని నఖరాలు జేసిండు. కని వీనిజ్జతే బోయింది. దేశ్‌ముఖ్‌గారు వీడి ముఖం మీద ఊంచిండు. ఈ మాదిగలంజె కొడుకుల్ని ఎక్కడుంచాల్నో అక్కన్నే ఉంచాలె. లేకపోతే వీళ్ళు చేతులుంటరా? మా అంతటోడు లేడని మన మీదకు మర్లబడ్తరు. ఈ లంజె కొడుకులను చెప్పుకింద తేళ్ళను నలిపినట్టు నలపాలె. సర్కారోళ్ళకు బుద్ధి లేదు. వీళ్ళకేమెమొ యిస్తున్నరు. వీళ్ళను కూడ మనతోటి సమానంగ జూడాల్నంటున్నరు. గొడ్డుమాంసం తినే గీ లంజకొడుకులను నెత్తికెక్కించు కుంటున్నరు..." అన్నాడు వెంకటాద్రి యాదయ్యకేసి వేలెత్తి చూపిస్తూ.

యాదయ్య దిగ్గున లేచి నిల్చున్నాడు.

"అరేయ్ సాతనోడా! మాటలు జర మంచిగ రానీయ్!" అన్నాడు యాదయ్య వెంకటాద్రికేసి తీక్షణంగా చూస్తూ.

"నన్ను... నన్ను సాతనోడా అంటావురా... అధునామాదిగోనివి... నన్ను... నన్ను... దేశ్‌ముఖ్‌గారి శేర్‌దారును... సాతనోడా అంటవా? నీ అవ్వను డక్కలోడు....." వెంకటాద్రి నోటివెంట బూతులు ప్రవహించాయి.

మరుక్షణంలో యాదయ్య వెంకటాద్రి మీదకు లంఘించాడు. తన శక్తి కొద్దీ అతని పొట్టలో గుద్దాడు. ఒక్క గుద్దుకే బాధతో విలవిల్లాడిపోతూ వెంకటాద్రి నేలమీద పడిపోయాడు. యాదయ్య వెంకటాద్రి ఛాతి మీద కూర్చొని రెండు చేతులతోనూ అతని



గొంతు పట్టుకొని శక్తికొద్దీ నొక్కసాగాడు. వెంకటాద్రి మొఖం తేలవేశాడు. కనుగుడ్లు నిశ్చలంగా మారిపోయాయి. అతని మొఖంలో మృత్యుఛాయలు స్పష్టంగా కనిపించాయి. ఇంకో కొన్ని క్షణాలు యాదయ్య అలాగే అతని పీక నొక్కేస్తే అతని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయేవే. కానీ అక్కడున్న వాళ్ళందరూ కలిసి యాదయ్యను వెంకటాద్రి మీది నుండి లాగేశారు. వెంకటాద్రిని లేపి కూర్చోబెట్టారు. అతడు వర్షానికి తడిసిన మేకపిల్లలా వణికిపోతున్నాడు. అతనిలో ప్రవేశించిన భయం అతన్ని వదలడం లేదు.

చెరువుకట్ట మీద ఏదో గొడవ జరుగుతున్నదని గమనించిన చాలా మంది జనం అక్కడికి పరిగెత్తుకొని వచ్చారు. తాళ్ళల్లోంచి కొందరు... ఊర్లోంచి కొందరు అక్కడకొచ్చారు. నర్సింహులుకు కూడా ఈ విషయం తెలిసి అతడు కూడా అక్కడకొచ్చాడు.

"దేశ్‌ముఖ్ సాబ్ శేర్‌దార్‌నే కొడ్తవురా. నీకెంత ధైర్యంరా. నిన్ను పోలీసులకు పట్టిచ్చి నీ తోడకలు తీయించకపోతే నా పేరు నర్సింహులు కాదురా..." అన్నాడు నర్సింహులు.

"వీని తోడకలు తీసేటందుకు పోలీసులు గావాల్నా... మనందరం గాజులు పెట్టుకోని కూచున్నమా? వీన్నిప్పుడే ఇక్కడ్నే నరికి పారేద్దాం. కట్టమైసమ్మకు బలిద్దాం" అన్నాడు కోదండం. కోదండం కూడా దేశ్‌ముఖ్‌గారికి ఆ ఊర్లో ఉన్న నమ్మిన బంట్లలో ఒకడు.

అంతే... అందరూ కలిసి యాదయ్యను పట్టుకొని గొడ్డును బాదినట్టు బాదడం మొదలెట్టారు. వాళ్ళ దగ్గరున్న వెదురుకర్రలన్నీ యాదయ్య వీపు మీద నాట్యం చేశాయి. తలకు దెబ్బలు తగలకుండా ఉండటం కోసం యాదయ్య తలను కిందకు వంచి వీపు మాత్రం వాళ్ళకిచ్చేశాడు. అతని వీపు చిట్లిపోయి రక్తం కారింది.

కాస్సేపట్లో తేరుకొని ఆ దృశ్యాన్ని చూస్తున్న వెంకటాద్రికి వాళ్ళందరూ కలిసి కాస్సేపట్లో యాదిగాన్ని చంపేస్తారనిపించింది. వాడు చస్తే ఆ నేరం తన మీదనే పడ్తుందనిపించింది.

"వాన్నిక వదిలిపెట్టుండ్రి" అన్నాడు వెంకటాద్రి.

వాళ్ళతని మాట వినిపించుకోకుండా యాదయ్యను కొడ్తూనే ఉన్నారు.

"వాన్ని కొట్టకుండ్రి. వదిలిపెట్టుండ్రి" ఈసారి దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు వెంకటాద్రి.

వాళ్ళు ఆగిపోయారు.

ఎవరో మాదిగగూడెం వెళ్ళి యాదయ్య తల్లిదండ్రులకీ విషయం చెప్పారు.

యాదయ్య తల్లి ముత్తమ్మ పెద్దగా యేడుస్తూ చెరువు కట్టమీదకు పరిగెత్తింది. ఆమె వెంటే ఆమె చిన్న కొడుకు, కూతురూ పరిగెత్తారు. దేశ్‌ముఖ్‌గారి పొలం దగ్గరున్న లచ్చయ్యక్కూడా ఈ విషయం తెలిసింది. అతడు కూడా చెరువుకట్ట మీదకొచ్చేశాడు. వాళ్ళందరూ రక్తసిక్తమైపోయిన యాదయ్య మీద పడి యేడ్చారు.

"మీవోనికి మదమెక్కింది. శేర్‌దార్ సాబ్‌నే కొట్టిండు. వాన్ని పోలీసులకు పట్టిచ్చి వాని తోడకలు తీపిస్తం. వాడు బాగ నఖరాలు జేస్తున్నడు. తొందర్లనే వాని శత్త లేచిపోవుడు ఖాయం" అన్నాడు నర్సింహులు.

"చిన్నా పెద్దా అంతరం లేకపోతెట్ల? బస్తీకిబొయి జర చదువు కోంగనే నా అంతటోడు లేడంటడా? మాదిగ పుటక పుట్టిన సంగతి మరచిపోతడా? వినాశకాలానికి విపరీత బుద్ధులు" అన్నాడు కోదండం.

"ముందు ముందు గిట్ల జరుగుతదని బ్రహ్మంగారెప్పుడో చెప్పిండు. మ్లేచ్ఛులు దేవాలయాలల్ల ప్రవేశిస్తరని చెప్పిండు. మ్లేచ్ఛులే రాజ్యం చేస్తరని కూడ చెప్పిండు. అంత ఆయన చెప్పినట్టే జరుగుతున్నది..." అన్నాడు ఆ ఊరి విశ్వబ్రాహ్మణుడు వేణుగోపాలాచారి.

"అంతా కలికాలం మహిమ. భూలోకంల పాపం పెరిగిపోతాంది. గిట్ల జరగకపోతె ఎట్ల జరుగుతది" అన్నాడు ఆ గుంపులో ఉన్న శఠగోపాచారి అనే ఆ ఊరి నాటువైద్యుడు.

అందరూ ఎవరిష్టమొచ్చినట్టుగా వాళ్ళు మాట్లాడుకోసాగారు. అందరూ యాదయ్యదే తప్పని తేల్చారు.

యాదయ్య తల్లిదండ్రులు కింద పడిపోయిన యాదయ్యను లేపి నిల్చోబెట్టి మెల్లగా నడిపిస్తూ మాదిగ గూడెం తీసికెళ్లారు.

వెంకటాద్రి అతని మనుషులతో కలిసి ఊర్లో ప్రవేశించాడు. తర్వాత దేశ్‌ముఖ్ గారింటికెళ్ళి కరుణాకరరావును కలిసి చెరువుకట్ట మీద జరిగిన సంఘటనను గూర్చి చెప్పాడు. అతడు చెప్పింది విన్నాక కరుణాకరరావుకు చాలా కోపమొచ్చింది.

"కల్లు తాగితె నీకు వొళ్ళు తెలవకుంట పోతది. మొదలే కోతివి. కల్లు తాగినవు. ఇగ నువ్వు చేతులుంటవా? మొన్ననే మల్లోసారీ వాళ్ళ జోలికి పోవద్దురా అని చిలకకు చెప్పినట్టు చెప్పిన. ఇయ్యాళ రేపు మాదిగోళ్ళను ఏమనెటట్టు లేదురా అని చెప్పిన. పిడకలేరినందుకు దాన్ని నాల్గు తిట్టి పంపియ్యక గింత రాద్ధాంతమెందుకు జేసినవురా అన్న. గింతమంది ముంగట దాన్నెందుకు కొట్టిచ్చినవురా అన్న. నేను చెప్పింది నీకేమన్న సమఝయిందా? మూర్ఖపు ముండాకొడుకువు. నీ తలకాయల మెదడు లేదురా... పెండుంది. వాళ్ళు నా దగ్గరకొచ్చి నీ మీద షికాయత్ చేసినప్పుడు నువ్వు నా మనిషివి కాబట్టి నిన్ను వెనకేసుకొచ్చిన. రోజులు బాగలేవు. మల్లోసారి మాదిగోళ్ళ జోలికి పోకురా అని చెప్పిన్నా లేదా? ఇయ్యాళ ఆ పోరగాన్ని... అందుల బస్తీల చదివే పోరగాన్ని నీ నోటికొచ్చినట్టు బండబూతులు తిడ్తే వాడూరుకుంటడనుకున్నవా? వాంది ఉడుకురక్తం. బస్తీల చదువుతున్నడు. వానికి ప్రపంచం తెలుసు. రాజకీయాలు తెలుసు. వాని కులానికెన్ని మద్దతులున్నయో తెలుసు. అసుంటోళ్ళ జోలికి పోవద్దురా అన్న. వాన్ని నోటికొచ్చినట్టు తిడ్తివి. వానికి రోషం ఎక్కిస్తివి. పైలావచ్చినం మీదున్నోడు ఊరుకుంటడా? మీదబడి కొడ్తడు. గొంతు పిసికి చంపుతడు. ఎట్లనో బతికి బయట పడ్డవు. నీకాయుష్షున్నది. భూమ్మీద గింజలు బాకున్నయి. నీ పెండ్లాం పిల్లల అదృష్టం బాగున్నది. అందుకనే బతికినవు. అంతవరకు బాగనే ఉంది. నర్సింహులుగాడు, కోదండం గాడు కలిసి వాన్ని చచ్చేటట్టు కొట్టిరి. రేపు పేపర్లల్ల సీతంపేటలో హరిజనులకు రక్షణ లేదని, ఆ ఊరి దేశ్‌ముఖ్ హరిజనుల మీద దౌర్జన్యం చేస్తున్నడని రాస్తరు. ఇది నాకెంత అప్రతిష్ట తెస్తదో ఆలోచించినవా? నువ్వేం జేసినా నేనే చేయించిన్నంటరు. నేను మన జీతగాళ్ళతోటి మంచిగుండాలే అని చెప్పిన. వాళ్ళను తిట్టే రోజులు, కొట్టే రోజులు పోయినయిరా అని చెప్పిన... వాళ్ళతోటి మంచిమాటతోటే పనిచేయించుకోవాలని చెప్పిన. దేశ్‌ముఖ్‌గారు దేవునసుంటోడని చెప్పుకోవాలంటే మనం మన జీతగాళ్ళతోటి మంచిగుండాలె... పనిపాటలోళ్ళతోటి మంచిగుండాలె.. మాదిగోళ్ళతోటి మంచి గుండాలె... అందరితోటి మంచిగుండా లనేదే నా పాలసి. నేను జేసిందంత నువ్వు మట్టి గలిపితివి" అన్నాడు దేశ్‌ముఖ్ కరుణాకరరావు. ఈ ధోరణిలో ఆయన చాలాసేపు మాట్లాడుతూ ఉండిపోయాడు.

అక్కడే ఉన్న నరసింహులు "వాన్ని రేపు పొద్దాల పట్టుకపోయిన పోలీసుస్టేషన్ల దించిరానా?" అన్నాడు.

"రామాయణమంత విని రామునికి

సీతేంగావాల్నని అడిగిండట నీఅసుంటి దిమాగ్ లేనోడు. మీరు చేసిన నిర్వాకం చాలు. మల్ల పోలీసులెందుకు. మల్లోసారి వాళ్ళ జోలికి పోకుండ్రి" అన్నాడు కరుణాకరరావు.

"ఈయన విజంగ దేవునసుంటోడె" అనుకున్నాడు నరసింహులు.

మూడురోజులు గడిచాయి.

నాల్గోరోజు తెల్లారేటప్పటికి మాదిగ లచ్చయ్య ఇద్దరు కొడుకులూ ఊళ్ళోంచి మాయమైపోయారన్న వార్త ఊరంతా వ్యాపించింది. ఆ వార్త విన్న చాలామంది కనబొమలెగరేశారు. వాళ్ళెక్కడికెళ్ళి ఉంటారో ఊహించటానికి ప్రయత్నించారు. కొన్ని రోజుల తర్వాత యాదయ్య, అతని తమ్ముడు సారయ్య వీరస్వామి దళంలో చేరిపోయారని సీతంపేట ప్రజలు చెప్పుకోవడం మొదలెట్టారు. త్వరలోనే వాళ్ళు సీతంపేట కొస్తారనీ, వెంకటాద్రినీ, దేశ్‌ముఖ్‌గార్ని 'ఖతం' చేస్తారని కూడా గుసగుసలు చెప్పుకోవడం కూడా మొదలెట్టారు.

ఇలా గుసగుసలు ప్రారంభమైన కొద్ది రోజుల తర్వాత ఆఖరికి రక్షకభటు లొచ్చారు. మాదిగలచ్చయ్య యింటిమీద దాడి చేశారు. లచ్చయ్యను పట్టుకొని అతని కాళ్ళూచేతులూ విరిచి గోగునార పగ్గాలతో కట్టేశారు. అతని కడ్డం రాబోయిన ముత్తమ్మను రైఫిల్‌బట్స్‌తో బాదారు. ఆమె స్పృహతప్పి కిందపడిపోయింది.

లచ్చయ్యను "నీ ఇద్దరు కొడుకులు ఎక్కడికి బోయిండ్రో చెప్పమని" అడిగారు. అతన్ని కట్టేసిన గోగునార పగ్గాలమీద చన్నీళ్ళు పోశారు - అతని చేతులచుట్టూ, కాళ్ళచుట్టూ ఉన్న పగ్గాలు చన్నీళ్ళు పడ్డప్పుడు బాగా దగ్గరికి బిగుసుకోవడం వల్ల లచ్చయ్య యమయాతన అనుభవిస్తూ హాహాకారాలు చేశాడు. "వాళ్ళెక్కడికి బోయిండ్రో నాకు తెలియద"న్నాడు.

వాళ్ళెన్నిసార్లు అడిగినా, ఎంత చిత్రహింసకు గురిచేసినా అతడదే సమాధానం చెప్పాడు. అతని తలకిందికి, కాళ్ళు పైకిపెట్టి కోసేసిన గొర్రెనో, మేకనో వేలాడదీసినట్టు అతన్నో చెట్టుకు వేలాడదీసి వెదురుకర్రలతో అతని పిర్రల మీద, వీపుమీద అదేపనిగా వాయించడం మొదలెట్లారు. అయినా అతడు తన కొడుకుల సంగతి తనకేమీ తెలియదనే చెప్పాడు.

చివరకు కొన ఊపిరితో ఉన్న లచ్చయ్యను వదిలేసి రక్షకభటులు వెళ్ళిపోయారు. వెళ్ళిపోయే ముందు లచ్చయ్య నివసిస్తున్న గుడిసెను కూలగొట్టి, నేలమట్టం చేసి మరీవెళ్ళారు.

ఊర్లో చాలామంది ఊరికి పోలీసులను దేశ్‌ముఖ్ గారే పిలిపించి ఉంటారని చెప్పుకున్నారు.

ఇది జరిగిన కొన్నిరోజులకు దేశ్‌ముఖ్ గారికో ఉత్తరం వచ్చింది.

"నువ్వు చేసిన, చేస్తున్న అఘాయిత్యాలకూ, అక్రమాలకు చరమగీతం పాడే రోజు త్వరలోనే వస్తుంది. ఈ ప్రపంచంలో యేశక్తీ నిన్నూ, నీ చుట్టువున్న నీ తాబేదార్లను కాపాడలేదు-" అన్నది ఆ ఉత్తరంలోని సారాంశం.

ఆ ఉత్తరం వచ్చిన కొన్ని రోజుల తర్వాత ఆ ఊర్లో ఓ తాత్కాలిక రక్షకభట నిలయాన్ని ఏర్పాటు చేశారు - దాన్ని కూడా దేశ్‌ముఖ్‌గారే ఏర్పాటు చేశారని ఈ ఊరి ప్రజలు చెప్పుకున్నారు.

రక్షకభటులు రోజోకోన్ని తింటూ, బుడ్లకొద్ది కల్లుతాగుతూ, ఊరంతా తిరుగుతూ గ్రామస్తుల్ని భయకంపితుల్ని చేశారు.

ఈ ఊర్లో పోలీసు పికెట్ ఏర్పడటానికి నేను కారణం కాదని దేశ్‌ముఖ్‌గారు ఎంత చెప్పినా జనం అతని మాటల్ని నమ్మలేదు.

కరుణాకరరావు ఇక ఒక్క క్షణం కూడా ఆ ఊర్లో ఉండొద్దని, వెంటనే పట్నం వచ్చి మాతో ఉండిపోవాలని అతని తమ్ములు పట్టుబట్టారు. అందరికంటే ఎక్కువ కరుణాకర రావు తర్వాతివాడైన సుఖేందర్ రెడ్డి అన్నను వెంటనే పట్నం రమ్మని చాలా బలవంతం చేశాడు. సుఖేందర్ రెడ్డి జీపులో సీతం పేట వచ్చి అందరిముందే క్రాంతికారుల్ని నోటికొచ్చినట్టల్లా తిట్టడం మొదలెట్టాడు. వాళ్ళు ఏనాటికైనా తన అన్నను చంపుతారని, కాబట్టి అన్న ఒక్క క్షణం కూడా ఈ ఊళ్ళో ఉండొద్దని పట్టుబట్టాడు. ఆ ఊరికి తన అన్న ఏమేం చేశాడో చెప్పాడు. జీపులో అన్నను కూర్చోమన్నాడు. కానీ కరుణాకరరావు తన పుట్టిపెరిగిన ఊర్ని విడిచిపెట్టి వేరే ఊరికి వెళ్ళలేనన్నాడు.

"ఈ ఊరిమీద నువ్వో పిచ్చి అభిమానం పెంచుకున్నావు... ఈ ఊరినేదో ఉద్ధరించాలని కలలుగన్నవు.. కని ఒకప్పటి మన ఊర్లన్నీ నాశనమైపోయినయి.. చీకటిదొరలొచ్చి ఊర్లను నాశనం చేసి పారేసిండ్రు... వెనకటికి పిండారీలోచ్చి ఊర్లకు ఊర్లు దోచుకు పోయేదట. ఈ చీకటిదొరలు పిండారీల కంటె భయంకరమైన వాళ్ళు.. వాళ్ళు దోచుకుపోయే టందుకే వచ్చేది... వీళ్ళైతే చంపిపోయేటందుకే వస్తున్నారు.

గిట్లాటి ఊర్లల్ల నువ్వెందుకుండాలన్నా! పోనీయ్. పంటలుపండే భూములు పోనీయ్. మనల్ని ఆశ్రయించి బతికే జీతగాళ్ళు పోనీయ్. పశువులు పోనీయ్. కొట్టాలు పోనీయ్. అన్నీ పోనీయ్. నీకింక ఈ ఊర్లె ఏముందని ఉంటవన్నా?" అన్నాడు సుఖేందర్ రెడ్డి

సుఖేందర్ రెడ్డి రాజకీయాల్లో పాల్గొంటూ ఇప్పుడిప్పుడే పైకొస్తున్నాడు. త్వరలోనే ఆయన ఎం.ఎల్.ఏ. అవుతాడనీ, మంత్రి కూడా అవుతాడనీ చాలామంది రాజకీయ పరిశీలకులు అంచనావేశారు. సుఖేందర్ రెడ్డికి ఆవేశం చాలా ఎక్కువని, రాజకీయాల్లో ఉన్నవాడికి అంత ఆ వేగం పనికిరాదని అతన్ని చాలా దగ్గర్నుంచి పరిశీలించే వాళ్ళు చెప్పుకుంటారు.

మరో నెలరోజుల గడిచాయి.

వెంకటాద్రి ప్రతిరోజు రాత్రి తనింట్లో పడుకోవడం మానేశాడు. రోజుకో యింట్లో



పడుకునేవాడు. "ఊర్లో పోలీసులున్నారుకద.. ఎందుకంత భయపడిచస్తున్నావ"ని దేశ్‌ముఖ్‌గారు అతని మీద చాలాసార్లు విసుక్కున్నాడు.

"వాళ్ళ లిస్టుల పడ్డంక నన్నే పోలీసులు రక్షించలేరు మహాప్రభో!" అన్నాడు వెంకటాద్రి.

"రక్షించలేకపోతే చావు.. వాళ్ళు చంపుతారన్న భయంతోటే చచ్చేటట్టున్నావు.. అన్నిటికి ముందే..! అన్నాడు దేశ్‌ముఖ్.

ఓ రోజు పక్కూర్లో వున్న వాళ్ళ బంధువులింటికి వెళ్ళొస్తున్న వెంకటాద్రిని బస్సుదిగి ఊర్లోకొస్తుండగా నల్గురు గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డళ్ళతో నరికి చంపేశారు.

వెంకటాద్రిని చంపినవాళ్ళల్లో యాదయ్య, సారయ్యలు కూడా ఉన్నారని జనం చెప్పుకున్నారు.

"వెంకటాద్రికి పట్టిన గతే తొందర్లోనే నీకూ్కడా పడ్తుంద"ని హెచ్చరిస్తూ దేశ్‌ముఖ్‌గార్కి మరో ఉత్తరం అందింది.

ఇక కరుణాకరరావు ఆ ఊర్లో ఉండటం ఏమాత్రం కూడా క్షేమం కాదని అతని బంధువులందరూ భావించారు. సుఖేందర్‌రెడ్డి పోలీసు బలగంతో ఆ ఊరికొచ్చి కరుణాకరరావునూ, అతని భార్యనూ తీసుకొని పట్నం వెళ్ళిపోయాడు. ఊర్లో వాళ్ళకున్న వ్యవసాయాన్నంతా చూసుకోవడం కోసం ఓ గుమాస్తాను పెట్టుకున్నారు.

ఆ గుమాస్తా పేరు వేమూరి సత్యనారాయణ. అతని స్వంతూరు సీతంపేట కాదు. అతడు గుంటూరు జిల్లాకు చెందిన వాడు. చాలా కాలం క్రితమే అతడు తన స్వంతూర్లో ఉన్న భూములు అమ్మేసుకొని సీతంపేటకొచ్చాడు. సీతంపేటలో తను అమ్మిన భూమికి రెట్టింపు భూమి కొనుక్కొని వ్యవసాయం చేస్తూ అక్కడే స్థిరపడిపోయాడు. ఆ ఊర్లో త్వరలోనే అతనికి వ్యవసాయం చెయ్యడంలో గొప్ప ప్రావీణ్యం ఉందన్న పేరు తెచ్చుకున్నాడు. మేలురకం విత్తనాలు, క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులు, వాణిజ్య పంటలు మొదలైన సాధనాల ద్వారా అతడు వ్యవసాయరంగంలో మంచి దిగుబడిని సాధించాడు. అతన్నందరూ 'ఆదర్శ రైతు' అనడం మొదలెట్టారు. ప్రభుత్వం వారు కూడా అతన్ని రెండు మూడు సార్లు ఆదర్శ రైతుగా గుర్తించి అవార్డులిచ్చి సత్కరించారు. సీతంపేటలో చాలా మంది రైతులు సత్యనారాయణతో స్ఫూర్తి పొంది అతన్ని అనుసరిస్తూ మంచి ఫలితాలు సాధించారు.

కరుణాకరరావుకు చాలాకాలం నుండి సత్యనారాయణకు తన వ్యవసాయాన్నంతా అప్పగిస్తే బావుండును అన్న కోరికుండేది. అతనితో చాలాసార్లు "నువ్వు నీ వ్యవసాయంతో బాటు మా వ్యవసాయం కూడా చేయించు. వచ్చిన పంటలో పావలా వాటా నీకిస్త. పెట్టుబడంతా మాదే. నువ్వొక్క పైస కూడ పెట్టొద్దు" అంటుండేవాడు.

"మీకో శేర్‌దార్ ఉన్నాడు కదా. నేనెందుకు?" అంటుండేవాడు సత్యనారాయణ.

"వాని మొఖం. వానికేం వ్యవసాయం చేయించొస్తది. గుడ్డెద్దు చేన్ల బడ్డట్టు యేదో నడిపిస్తున్నడు" అనేవాడు దేశ్‌ముఖ్.

వెంకటాద్రి ఈలోకాన్నే విడిచి వెళ్ళిపోవడం, కరుణాకరరావుక్కూడా ఆ ఊర్ని విడిచిపెట్టి వెళ్ళిపోయే పరిస్థితి ఏర్పడటంతో కరుణాకరరావు వాళ్ళ వ్యవసాయాన్ని సత్యనారాయణ చేతిలో పెట్టకతప్పలేదు.

కరుణాకరరావు ఆ ఊర్ని విడిచి వెళ్ళిపోయే ముందు సత్యనారాయణను పిలిపించాడు.

"మా వ్యవసాయాన్నంతా నువ్వే చేయించు. పండిన పంటలో పావలా వాటా తీసుకో. పెట్టుబడి మాదే" అన్నాడు. సత్యనారాయణ సరేనన్నాడు.

"నన్ను శేర్‌దార్ అని మాత్రం అనొద్దు. గుమాస్తా అనండి చాలు" అన్నాడు సత్యనారాయణ.

సత్యనారాయణ కరుణాకరరావు వాళ్ళ వ్యవసాయాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాక చాలా మంచి ఫలితాలొచ్చాయి. "లేబర్‌ను నమ్ముకుంటే లాభం లేదని కరుణాకరరావును ఒప్పించి ఓ ట్రాక్టర్ కొన్నాడు. బావులకన్నింటికి మొదలు ఆయిలింజన్లు,

**...ఈ ఊరిమీద నువ్వో పిచ్చి అభిమానం పెంచుకున్నావు... ఈ ఊరినేదో ఉద్ధరించాలని కలలుగన్నవు.. కని ఒకప్పటి మన ఊర్లన్నీ నాశనమైపోయినయి.. చీకటిదొరలొచ్చి ఊర్లను నాశనం చేసి పారేసిండ్రు... వెనకటికి పిండారీలోచ్చి ఊర్లకు ఊర్లు దోచుకు పోయేదట. ఈ చీకటిదొరలు పిండారీల కంటె భయంకరమైన వాళ్ళు.. వాళ్ళు దోచుకుపోయేటందుకే వచ్చేది... వీళ్ళైతే చంపిపోయేటందుకే వస్తున్నారు...**

తర్వాత కరెంటొచ్చాక కరెంట్ మోటార్లు పెట్టించారు.

పట్నంలో ఉంటున్నప్పటికీ కరుణాకర రావు మనస్సంతా ఎప్పుడూ వాళ్ళూరి మీదనే ఉండేది. నెలరోజులకోసారన్నా అతడు సీతంపేటకొచ్చి తన వ్యవసాయాన్నంతా పర్యవేక్షించి వెళ్తుండేవాడు.

రెండేళ్ళు గడిచాయి. ఈ రెండేళ్ళలో రక్షకభటులకూ, క్రాంతికారులకూ జరుగుతున్న యుద్ధంలో రక్షకభటులదే పైచేయి అయ్యింది.

ఏడాది క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎవ్వరూ ఊహించని విధంగా కొత్తగా ఏర్పడిన ఓ రాజకీయ పార్టీ అధికారాన్ని కైవసం చేసుకుంది. చాలాకాలంగా అధికారాన్ని చెలాయించిన పార్టీ చిత్తుగా ఓడిపోయింది. కొత్తగా ఎన్నికైన ముఖ్యమంత్రి క్రాంతికారుల్ని వేటాడటమే తన ప్రధాన కర్తవ్యంగా నిర్ణయించుకున్నాడు. క్రాంతికారుల్ని అణచడం కోసం రక్షకభటులకు అత్యాధునిక ఆయుధాల్నిచ్చాడు. సంపూర్ణాధికారాల్నిచ్చాడు. త్రిలింగ ద్వీపాన్ని రక్షకభటుల రాజ్యంగా మార్చేశాడని పౌరహక్కుల సంఘాలవాళ్ళు స్టేట్‌మెంట్లిచ్చారు.

క్రాంతికారులకూ, రక్షకభటులకూ మధ్య ఎన్నో ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఎందరో క్రాంతికారులు నేలకొరిగారు. అవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లేనని పౌరహక్కుల సంఘాలవాళ్ళు అంటూనే ఉన్నారు. క్రాంతికారుల కొమ్ముకాయటానికే పౌరహక్కుల సంఘాలు ఏర్పడ్డాయని రక్షకభట వర్గాలవాళ్ళన్నారు.

సీతంపేటకు చాలా దగ్గర్లో ఉన్న ఓ మోటబావి దగ్గరున్న కొట్టంలో షెల్టర్ తీసుకున్న వీరస్వామి దళానికి, పోలీసులకూ మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లో వీరస్వామి నేలకొరిగాడన్న వార్త ఆ చుట్టుపక్కల గ్రామాల్లో గొప్ప సంచలనాన్ని కల్గించింది. ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం కారణంగానే వీరస్వామిని పోలీసులు పట్టుకోగల్గారని, వీరస్వామిని వంగాల టౌన్లో అరెస్టుచేసి, సీతంపేట అడవుల్లోకి తీసుకొచ్చి కాల్చేశారని క్రాంతికారులు తెలియజేశారు.

వీరస్వామి శవాన్ని రావులపల్లిలోని అతని తల్లిదండ్రులకు అప్పగించారు. వీరస్వామి శవాన్ని చూడటానికి ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. తమలాంటి పేదప్రజల అభ్యున్నతి కోసం పోరాడుతూ ప్రాణాలు త్యాగం చేసిన వీరుడని శ్లాఘించారు.

అతని అంత్యక్రియలకు రాష్ట్రం నలుమూలల నుండి పాత్రికేయులు, కవులు, పౌరహక్కుల సంఘాల నాయకులు, న్యాయవాదులు, సంఘసేవకులు, మేధావులూ హాజరై నివాళులర్పించారు. వీరస్వామి ఎన్‌కౌంటర్ మీద హైకోర్టు న్యాయమూర్తి చేత ఎంక్వైరీ జరిపించాలని కోరారు.

వీరస్వామి ఎన్‌కౌంటర్‌తో ఆ ప్రాంతంలో క్రాంతికారుల కార్యకలాపాలు పూర్తిగా తగ్గిపోయాయని రక్షకభటులు గర్వంగా ప్రకటించారు. సీతంపేటలోని పోలీసు పికెట్‌ను ఎత్తేశారు.

కరుణాకర్ రావుక్కూడా వీరస్వామి ఎన్‌కౌంటర్ ఎంతో ఉపశమనాన్ని కల్గించింది. అతడు ఇదివరకంటె స్వేచ్ఛగా సీతంపేటకు వెళ్ళిరావడం మొదలెట్టాడు. మొన్న జరిగిన ఎన్నికల్లో వాళ్ళ తమ్ముడు సుఖేందర్‌రెడ్డి అందరూ అనుకున్నట్టే ఆ నియోజకవర్గం నుండి ఎం.ఎల్.ఏ.గా పోటీ చేసి గెల్చాడు. కానీ అతని పార్టీ ఓడిపోవడం వల్ల మంత్రి కాలేకపోయాడు.

వీరస్వామి ఎన్‌కౌంటర్ తర్వాత నిజంగానే ఆ ప్రాంతంలో క్రాంతికారుల కార్యకలాపాలు తగ్గిపోయాయి. వీరస్వామి దళం పూర్తిగా తుడిచి పెట్టుకుపోవడంతో అక్కడ మరో దళం సంచరించడం లేదని ప్రజలు చెప్పుకోవడం మొదలెట్టారు. వీరస్వామి దళంలో కొంతకాలం పనిచేసిన యాదయ్య, సారయ్యలు ఏమైపోయారో ఎవరికీ తెలీదు.

* * *

అది నవంబర్ నెల.

వరి పొలాలు కోసి కుప్పలు పెట్టారు.

ఆ సంవత్సరం వరిపంట బాగా పండింది.

కరుణాకర్‌రావు వాళ్ళ పదెకరాల వరి పొలాన్ని కోసి కుప్పపెట్టారు. తమ వరిపొలాన్ని కోస్తున్నారని తెలియగానే కరుణాకరరావొచ్చి సీతంపేటలో ఉంటున్నాడు.

వరిపొలాన్ని కోసి, మోపులు కట్టి కుప్ప పెట్టడాన్ని కళ్ళారా చూసుకున్నాడు. ఈసారి ఆ పొలంలో ముందెన్నడూ పండనన్ని వడ్లు పండుతాయని సంతోషించాడు.

కుప్పపెట్టిన రెండ్రోజుల తర్వాత సత్యనారాయణ ఆ కుప్పను కొట్టించే ఏర్పాట్లు చేశాడు.

కుప్ప కొట్టాక, వడ్లొచ్చాక, వాటిని కొలిపించి బస్తాల్లో పోయించి, లారి మీదకెక్కించాకే తనా ఊర్లోంచి వెళ్ళాలని కరుణాకరరావు నిర్ణయించుకున్నాడు.

ఆ రోజు సాయంత్రం నాల్గు గంటలవుతుండగా కరుణాకరరావు గడీ నుండి పొలం దగ్గరకు బయల్దేరాడు. దార్లో ఉన్నవాళ్ళందరూ అతన్ని చూడగానే వొంగి వొంగి దండాలు పెట్టారు.

కరుణాకరరావు వాళ్ళ పొలం ఊరికి చాలా దగ్గర్లోనే ఉంది. అతడు ఊరి బయటకొచ్చి పొలం వైపు మెల్లగా నడుస్తున్నాడు. అక్కడికి కొంచెం దూరంలోనే అతని పొలం దగ్గర కుప్పకొడ్తున్న కూలివాళ్ళ సందడి వినిపిస్తున్నది.

అతడు కాలిబాటమీద కొంచెం దూరం నడవగానే అతనికి ఎదురుగా వస్తున్న ఓ ఐదుగురు వడ్డరివాళ్ళలా ఉన్నవాళ్ళు కనిపించారు. వాళ్ళంతా తలలకు రుమాళ్ళు చుట్టుకున్నారు. నడుములకు చిన్న పంచెలు కట్టుకున్నారు. వాళ్ళ మిగతా శరీరమంతా నగ్నంగా కనిపిస్తోంది. మూడొంతుల భాగం నగ్నంగా ఉన్న వాళ్ళ శరీరాలు నల్లగా, వాళ్ళు కొట్టే బండరాళ్ళలా నిగనిగలాడ్తూ కనిపిస్తున్నాయి. వాళ్ళ భుజాలమీద గొడ్డళ్ళున్నాయి. వాళ్ళంతా ఇరవై, ఇరవై ఐదేళ్ళ మధ్యలో ఉన్నట్టుగా కనిపించారు.

"వీళ్ళను నేనిదివరకెప్పుడూ చూసినట్టు గుర్తులేదే!" అనుకున్నాడు కరుణాకరరావు.

(ససేషం)






కాసేపు రొటీన్ వ్యాపకాల్ని పక్కకు నెట్టి ఓపిగ్గా ఈ చిత్రాల్ని చూడండి. మాటలకందని భావాలు ఎన్నో ఒక్కసారిగా మనలో పెల్లుబుకుతాయి. గడిచిపోయిన బాల్యం లీలగా గుర్తుకువస్తుంది. ఒకప్పుడు ఆడిపాడిన పల్లె కళ్ళముందు కదులుతుంది. తోలుబొమ్మలాటలో కేతిగాడు మనల్ని కొత్తగా వెక్కిరిస్తుంటాడు. వెలవెలబోయిన జాజిరంగు దర్వాజలు ఆర్తిగా పల్లెకు రమ్మని మనల్ని పిలుస్తుంటాయి.





# కెమెరా కంటితో బతుకు లోతుల్ని చూస్తున్న భరత్ భూషణ్

లోకంలోని చీకటివెలుగుల్నీ, మట్టి మనుషుల బతుకుల్లో దాగిన నిసర్గ సౌందర్యాన్నీ... మన మనసుల్లోకి అందంగా ఒంపే ఈ ఛాయా చిత్రకారుడి పేరు భరత్ భూషణ్.

పాతికేళ్ళ ప్రస్థానంలో అరుదైన కళాఖండాలను తన కెమెరాలో బంధించిన భరత్ భూషణ్ ఇప్పటి దాకా రెండు ఎగ్జిబిషన్‌లను, ఒక వన్ మ్యాన్ షోను ప్రదర్శించాడు. 1997లో ఐ.సి.సి.ఆర్.లో 'పీపుల్ అండ్ ఈస్థటిక్స్' పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహించారు. పల్లె నుంచి పట్నం దాకా తెలంగాణా రోజువారీ జీవన సంఘర్షణను ఈ ఎగ్జిబిషన్‌లో ఆయన ప్రదర్శించారు. ప్రపంచీకరణ వేగంలో మసకబారిన పల్లె జానపద కళారూపాల్ని, వీధి పాలైన బాల్యాన్ని, సంక్రాంతి రంగవల్లుల్నీ, బతుకమ్మ పండగల్నీ, కులవృత్తుల అవశేషాల్ని తన కెమెరాలో బంధించాడు.

సాధారణ దృశ్యాల్లో మన కన్నులు కాంచని అసాధారణ జీవన సౌందర్యాన్ని ఆవిష్కరిస్తాడు. ప్రాణంతో వెలిగే ఇటువంటి ఫోటోలను తీయడానికి, సృజనాత్మకతతో పాటు స్పాంటేనిటీ కూడా ముఖ్యం అంటారు భరత్. మొదటి ఎగ్జిబిషన్ ఇచ్చిన స్ఫూర్తితో భరత్ భూషణ్ 1998 డిసెంబర్‌లో ఐ.సి.సి.ఆర్. ప్రాంగణంలో 'గర్ల్‌చైల్డ్'పై ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు.

పల్లెల్లో, పట్నాల్లో ఇంద్రధనసు లాంటి బాల్యం ముక్కలు ముక్కలై నేలరాలుతున్న వ్యథాభరిత దృశ్యాల్ని మన కళ్లముందుంచాడు. మనల్ని పదే పదే వెంటాడే చిత్రాల్ని అద్భుతంగా చిత్రీకరించిన భరత్ భూషణ్ అంతరంగ ఆవేదన వీటి వెనుక మనకు స్పష్టంగా గోచరిస్తుంది. బహుశా ఆయన వచ్చిన నేపథ్యమే ఆయనలోని ఇంతటి కళాకారుణ్ణి వెలికితీసి ఉండవచ్చు.

వరంగల్ జిల్లాలోని మారుమూల గ్రామంతో పేగు బంధమున్న భరత్ అప్పటికే తెలంగాణా వెనుకబాటు తనాన్ని అర్థం చేసుకున్నాడు. చిత్రకారుడిగా మొదట జీవితం ఆరంభించి సత్యజిత్‌రే అంతటి దర్శకుడు కావాలని తపనపడ్డాడు. మద్రాస్ ఫిలిం ఇనిస్టిట్యూట్ సినిమాటోగ్రఫీ శాఖలో సీటు లభించినా ఇంట్లో వత్తిడి కారణంగా ప్రయత్నం విరమించుకున్నాడు. తరువాత ఫోటోగ్రఫీ మీద ఆసక్తి పెంచుకుని హైదరాబాద్ ఫోటోగ్రఫీ ఇనిస్టిట్యూట్‌లో చేరి గోల్డ్ మెడల్ సాధించాడు. మొదట బ్రతుకుదెరువు కోసం సితార, జ్యోతిచిత్ర లాంటి సినిమా పత్రికలలో స్టిల్ ఫోటోగ్రాఫర్‌గా పనిచేశాడు. సినిమాల మీద ప్రేమతో అరవిందన్ 'కాంచనసీత', నరసింగరావు 'రంగులకల' చిత్రాలకు పనిచేశాడు. రవీంద్రన్ 'హరిజన్' సినిమాకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. కమర్షియల్ సినిమా రంగంలో ఇమడలేక ఫోటోజర్నలిజంలో స్థిరపడ్డాడు. ఆయన హైదరాబాద్ వచ్చేనాటికి ఫోటోగ్రఫీలో పిక్టోరియలిస్టు ధోరణులు ప్రబలంగా ఉన్నాయి. ఆ ప్రభావం నుంచి ఫోటోగ్రఫీకి మానవీయ స్పర్శను, సృజనాత్మకతను జతచేసి దానిని ఒక క్రియేటివ్ కళగా రూపుదిద్దే మార్గంలో ప్రధాన మలుపు దగ్గర నిలుచుని భరత్ భూషణ్ స్వాగతించారు. ఈ మార్గంలో భారతీయ ఫోటోగ్రఫీ జర్నలిజానికి వన్నె తెచ్చిన రఘురాయ్, రఘుబీర్ సింగ్‌ల ప్రభావం అపారంగా ఉందని ఆయన చెప్పుకుంటారు.

ఇతర దేశాల్లో చారిత్రక సంఘటనలకు సంబంధించి ఖచ్చితమైన డాక్యుమెంటేషన్ జరిగినట్లు మనదేశంలో 1947కు ముందు దేశంలో ముఖ్య రాజకీయ ఘట్టాలను డాక్యుమెంట్ చేయలేకపోవడం దురదృష్టకరం అంటారాయన.

ఆఁ ఫోటో ఏముందిలే. కెమెరా ఉంటే ఎవరైనా తీసెయొచ్చు అన్న తొలి రోజుల్లోని ఈజీ భావనను పక్కకు నెట్టి ఫోటోగ్రఫీకి ఒక సృజనాత్మక కళగా గుర్తింపు తేవడంలో ప్రధాన భూమిక పోషించాడు భరత్. ఈ క్రమంలో వ్యక్తిగతంగా, సామాజికంగా అనేకానేక చేదు జ్ఞాపకాల్ని దిగమింగుకున్నారు భరత్ భూషణ్. కాన్సర్ వ్యాధి తల్లిని దిగమింగిన విషయం జ్ఞాపకాల్లోంచి తొలగకముందే తనపై కూడా అది పంజా విసిరిందని తెలిసి మానసికంగా క్రుంగిపోయాడు భరత్. అయినా అనేక మంది అభిమానులు, స్నేహితులు ఇచ్చిన మనోస్థైర్యంతో తాత్కాలికంగా క్యాన్సర్ బారి నుంచి బయటపడ్డాడు. తన జీవితాన్ని కరిగించి చీకటి కాలానికి రంగులు దిద్దుతూ సాగిపోతున్న పరివ్రాజకుడాయన.



ఒకే ఒరలో కళను, కన్నీటిని యిముడ్చుకుని జీవితంతో పోరాడుతున్న అలుపులేని యుద్ధ సైనికుడు భరత్. నిత్యం మనం చూస్తున్న దృశ్యాల్లోనే చూడటం మర్చిపోయినవీ, చూడలేకపోతున్నవీ, చూసీ గమనించలేని చీకటి కోణాల్లో దాగినవీ కళాత్మకంగా ఆవిష్కరించిన భరత్ భూషణ్ ఫోటోలు మనల్ని మనం చూసుకున్నట్టుగా అనిపిస్తాయి. మనమెక్కడైతే, ఏదైతే కోల్పోయామో అక్కడే దాన్ని మనం తిరిగి కనుగొన్నట్టుగా అనుభూతి చెందుతాం.

ఆయన గదిలోని గోడమీద కనిపించే 'టైమ్ ఈజ్ షార్ట్' అన్న వాక్యం చూసి - బట్ 'హిజ్ ఆర్ట్ ఈజ్ లాంగ్' అని మనం... అతని కళను' గుండెల్నిండా [illegible]కోకుండా వుండలేం.

-కె. క్రాంతి కుమార్









## చాప్టర్ : శతాబ్దం

చలివెన్నెల జోరు జలపాతం

ఒకే పుస్తకం లోంచి
ఇరువురి సమస్యల్ని చదువుకుంటాం
మనమీద హాస్యం విసురుకునే
అనాది బాధలు

రాలిపోతాం
వానాకాలపు తాకిడికి పూలవలె
మనసు మూగగా
ఒంటరి స్తంభమై నిలుస్తుంది
దీని చుట్టూ బడిపిల్లలు ఆడుకుంటూరు

అదే పనిగా అమ్మ అస్త్రమై
పిలుస్తుంది

పాటలై
శోకాలు నాట్యం చేస్తాయి రాత్రికి రాత్రి
ఖాళీ నవ్వులు
ఖాళీ ఖాళీ ఆప్యాయతలు
ఊపిరి పెనవేసుకపోయిన
మనుషుల జాడ తెలియదు

కిటికీ లోంచి
గాలితో పాటు గాయాలు కూడా
తెలవారతాయి

రేడియో మీద వాలిన పిచ్చుక
పాటని నింపిపోతుంది
ముల్లును ఏ స్టేషన్ మీదికి కదిపినా
అదే కమిలిన దుఃఖం

**- పులిపాటి గురుస్వామి**

## తల్లి

పాదాలకు చెప్పల్లేని పాప
హాయిగా ఆడుకుంటోంది ఎండలో
తల్లికి కాళ్లు కాలుతున్నాయి నీడలో

**- మల్లంపల్లి**

## కన్నీటి సవ్వడి

వెన్నెల లేదు వేణువూ లేదు
నెత్తురుగక్కుతున్న చీకటే అంతా!

కనుపాప చూపుల్లా
కన్నీటి పాటల్లా
కదలబారిన మనసు నెర్రెలే అంతా!

మెట్రోపాలిటన్ నగర
నల్లని పీడ నీడలో
వచ్చివెళ్లిన వసంతాల జాడలే లేవు

కళ్లమీద సంచరిస్తున్న కంప్యూటర్ ఆక్టోపస్!

కలల్లో వేలాడే ఉట్లను ఉరితీసి,
సారవంతమైన శ్మశానం మీద
పడుకున్నాను మత్తుగా!

చనుమొన మీద రాలిన
కన్నీటి చుక్కను
పాలతో పాటు చప్పరిస్తూ
ఏడుపుకు అర్థాన్ని వెతుక్కునే
శిశువునై!

అప్పడప్పడూ
అమ్మ పాడిన లాలిపాటొకటి
పచ్చని బాల్యం మీదుగా తేలుకుంటూ వచ్చి
గుండెల్ని తన్ని పోతుంటుంది!

భిక్షాపాత్ర పట్టుకొని
తిరుగుతున్నాను
చార్మినార్ గల్లీల్లో
పిడికెడు ప్రేమకై!

నవాబులు వదిలి వెళ్లిన
షెహనాయ్‌ల కింద
ఒక గజల్ కోసం!

ఫర్‌ఫ్యూమ్ స్పర్శలూ
లిప్‌స్టిక్ ముద్దులూ
కాస్మొటిక్ కౌగిళ్లూ
పెదవులైనా తడపలేని పాదరసపు ప్రేమలే
అంతా!

తెల్లని బూడిద రాసుల్లో
సంచరిస్తున్నా
ఉబ్బిపోయిన శవాన్ని మోస్తూ

రాక్షస నగరోన్మాదంలో
క్షుద్ర దేవతకు బలవుతున్న
బికారి స్వప్నాలనేరుకుంటూ,
కోల్పోయిన నన్ను నేను
వెదుక్కుంటున్నా వెర్రిగా!!

**- పగడాల నాగేందర్**

## గురూ!

స్నేహం అర్థమవ్వదు
అదొక రంగుల గాలి

తుంచిన ద్రాక్షపళ్లతో
కొన్ని కన్నీళ్లని నీలో పిండుకుంటావు
నములుతూ ఉంటావు

ఈ భూమిపైన తిరుగాడే
సత్యాలన్నింటినీ తెల్సుకొని నువ్వొక
సత్యాన్ని కనుగొంటావు

యూనెల దువ్వెనతో
రోజుకొక రహస్య సత్యాన్ని
నువ్వు దువ్వుకొని జడేసుకుంటావు

అందరూ నీ జడని పూజిస్తారు
సాష్టాంగపడతారు అర్చనలు చేస్తారు
చిన్న ముడేసి నువ్వు పారేసిన వెంట్రుకల్ని

బూడిద చేసుకొని బొట్టులు పెట్టుకుంటారు
నామాలుగా పూసుకుంటారు ఔషధంగా మింగుతారు
మృత్యుంజయులవుతారు జనులు

దీవిస్తావు లేదా కోపగిస్తావు
అవే నీ కరుణా కటాక్షాలు
ఇక నీ భక్తులు పునీతులు మూర్ఖమోక్షగాములు

ప్రేమ అర్థమవుతుంది
అదొక గాలి లేని రంగు

**- ఎం.ఎస్. నాయుడు**

# మాదిగల సామాజిక జీవితానికి చిత్రిక 'కక్క'!

గోపిచంద్ యాభై ఏళ్ళ క్రితం 'చెప్పులుకుట్టేవాడు' అనే కథ రాశారు. చెప్పులు కుట్టే మాదిగల దైన్యస్థితిని ఈ కథ చిత్రించింది. కథ చదివిన వారు 'అయ్యో పాపం' అని అనుకుంటారు. ఆ కథ పరిమితి అంతే. మాదిగవాడు చెప్పులు కుట్టడం గురించే ఆ రచయితకు తెలును. కాని మాదిగవాడి అంతరంగం ఏమిటి? మాదిగల జీవితం ఎలా ఉంటుంది? వాళ్ళ ఆలోచనలు ఎలా ఉంటాయి? మాదిగపల్లెలోని మాదిగల జీవన స్వరూపం ఎలా వుంటుంది? అన్న అంశాల గురించి గోపిచంద్ చెప్పగలరా? చెప్పలేరు. ఎందుకంటే గోపిచంద్ మాదిగవాడు కాదు. మాదిగపల్లెలో పెరగలేదు. వారిలోకి పరకాయ ప్రవేశం చేయడం గోపిచంద్‌కే కాదు మాదిగేతర రచయితలెవరికీ సాధ్యం కాదు. కనుకనే తెలుగు సాహిత్య చరిత్రలో ఎల్లయ్య రాసే వరకు మాదిగల జీవితాన్ని చిత్రించిన నవల ఒక్కటి కూడా రాలేదు.

ఇటీవలి సంవత్సరాల్లో దళితకులాలకు చెందిన వారు తమ గురించి తాము మాట్లాడుతున్నారు. అందులో భాగంగానే గతంలో నాగప్పగారి సుందర్రాజు కథలు రాశారు. అవి 'మాదిగోడు'గా పుస్తకరూపంలో వచ్చాయి. కర్నూలు జిల్లాలోని మాదిగల జీవిత స్వరూపాన్ని దర్శింపజేశాయి ఆ కథలు.

ఇప్పుడు నల్లగొండ జిల్లాకు చెందిన వేముల ఎల్లయ్య 'కక్క' నవల రాశాడు. తెలంగాణా మాదిగవాడ నైసర్గిక స్వరూపాన్ని, మాదిగల అంతర్ బహిర్ జీవితాల్ని చిత్రించిన నవల ఇది. మాదిగల జీవితంపై వచ్చిన తొలి నవల ఇది. శతాబ్దాలుగా అక్షరాలకు దూరమైన మాదిగల నుంచి వచ్చిన మాదిగల చరిత్ర ఇది. తమ గురించి తమదైన భాషలో, యాసలో ఎల్లయ్య రాశాడు. అందువల్లనే తెలుగు నవలా సాహిత్యంలో 'కక్క' ఓ సంచలనం.

ఎల్లయ్య నల్లగొండ జిల్లాకు చెందిన 'గోసంగి' కవులలో ఒకడు. ఇప్పటివరకు యాభై వరకు కవితలు రాశాడు. నీలగిరి సాహితి, గోసంగి కవుల సంకలనాల్లో అతని కవితలు ఉన్నాయి. ప్రత్యేకించి తన కవితల్ని కలిపి పుస్తకంగా తీసుకురాలేదు. కవిత్వంలోనే కొత్త ధోరణికి శ్రీకారం చుట్టిన ఎల్లయ్య నవలా రచనలోనూ తనదైన ఒరవడికి పాదువేశారు. మాదిగలు ఇప్పుడు తమ గురించి తాము మాట్లాడతారని చెప్పాడు. కవిత్వంలో కన్నా మాదిగల అంతరంగాన్ని, జీవితాన్ని వచనంలో రికార్డు చేయడం మంచిదని ఈ నవల రాశాడు.

'కక్క' అనే పేరే విచిత్రంగా తోస్తుంది చాలా మందికి. కక్క ఏంటి కక్క అన్నారు చాలామంది. కాని ఒక పేజీ చదవగానే కక్క అంటే నామవాచకమని తెలిసింది. ఈ నవలలోని కథా నాయకుడే కక్క. కక్కడు కడుపులో ఉండగానే వాళ్ళ అయ్య తేలు కుట్టి చనిపోతాడు. వాళ్ళమ్మ కూలినాలికి పోయి పిల్లగాణ్ణి సాదింది. అయితే కక్కడు చిన్నతనంలోనే పాపిరెడ్డి దొర దగ్గర జీతగాడయ్యాడు. చిన్నగున్నప్పుడే కక్కణ్ణి గారాబంగా పెంచిన నాయనమ్మ చనిపోతుంది. దొర కక్కణ్ణి సొప్పకట్టెతో వీపు మీద కొట్టే దెబ్బలు చూసి బర్ల ఎల్లయ్య బాధపడతాడు. కక్కడి తల్లి కలెమ్మతో కొడుకును పొద్దుగాల దొర ఇంటికి పంపమని చెబుతాడు. కలెమ్మ బావ ఆగమయ్య దగ్గర దేనికీ కొంగు చాపదు. తన బతుకు ఏదో బతుకుతుంది. అది గిట్టని ఆగమయ్య బర్ల ఎల్లయ్యతో కలెమ్మకు అక్రమ సంబంధం ఉందని ప్రచారం చేస్తాడు. కులపెద్దల ముందు పంచాయతీ చేసి వేలేయిస్తాడు. అప్పుడు కక్కడు తల్లికి మారు మనువు చేస్తాడు. "కొడ్కు బుట్టి తల్లి పెండ్లి చేసిన గనుడయ్య గీ బాడ్కావ్" అని ఊరి జనం ముక్కు మీద వేలేసుకుంటారు. లింగాల దొర దగ్గర జీతానికి కుదిరి మూడు వేల రూపాయలు తెచ్చి పాపిరెడ్డి పటేలు బాకీ తీరుస్తాడు. తర్వాత అక్కడ జీతం మానేస్తాడు.



పుస్తక పరిచయం

కక్క
(దళిత నవల)
రచయిత: వేముల ఎల్లయ్య
ధర: రు.35/-, ప్రచురణ: గోసంగి, నల్గొండ, ప్రతులకు: నవోదయ, విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు

ఫకీరు తాత దగ్గర అల్కసెప్పులు, కిర్రు సెప్పులు అన్నిరకాల మాదిగ చెప్పుల తయారీ నేర్చుకుంటాడు. ఎన్నో రకాల డప్పు వాయింపు నేర్చుకుంటాడు. ఫకీరు తాత మనుమరాల్ని పెళ్ళి చేసుకుంటాడు. కక్కడి పెళ్ళిలో మాదిగోళ్ళకు, సూదరోళ్ళకు గొడవ అవుతుంది. దీంతో ఊరికి పోలీసులు వస్తారు. మాదిగల ఇళ్ళలోని మగవాళ్ళందరినీ స్టేషనుకు తీసుకుపోతారు. ఫకీరు తాత ఉరి పెట్టుకొని చనిపోతే పంచనామా చేయడానికి అధికారులు వచ్చినప్పుడు ఆ ఊరి సర్పంచ్ ఫకీరు తాత అనే విషయం తెలుస్తుంది. దీంతో మా సర్పంచిగిరి మాకియ్యండని మాదిగలు పెద్దపటేలును నిలదీస్తారు. దీంతో గొల్ల అయిలయ్యను సర్పంచి చేస్తారు. ఆర్నెల్లకు ఎన్నికలొస్తే పటేలు భార్య అందమ్మను సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటారు.

గుంటూరు కమ్మరాములు పటేళ్ళ పొలాన్ని కౌలుకు తీసుకున్నాక మాదిగల జీవితం మారిపోతుంది. వాళ్ళు జీతగాళ్ళు కాకుండా కూలీలవుతారు. కోస్తా నుంచి వలస వచ్చిన కమ్మోళ్ళ పెత్తనం పెరుగుతుంది. పటేళ్ళ కన్నా వారు మాదిగల మీద మరింత దురుసుగా ప్రవర్తిస్తారు. పరాయి ప్రాంతపు వాళ్ళ పెత్తనం మరింత దుర్భరమవుతుంది. ఈ నేపథ్యంలో కక్కడి జీవితంలో వచ్చే మార్పులు అనేకం. వాటన్నిటిని వివరిస్తూ ఈ నవల సాగుతుంది.

ఈ నవల అంతా తెలంగాణా మాండలికంలో నడిచింది. అంతకన్నా ప్రత్యేకించి మాదిగల భాషలోనే నడిచింది కథ, కథనం, మాటలు అన్నీ మాదిగల భాషలోనూ ఉండడం విశేషం. దీనివల్ల నవల అర్థం కాదనేవారు ఉండకపోరు. కాని తమ గురించి తమదైన భాషలో కాకుండా ఇతరులు మాట్లాడే భాషలో రాయమని ఏ రచయితనైనా అడగటం అన్యాయమే. ఇప్పటి వరకు తెలంగాణా రచయితలు కోస్తా వారు నిర్దేశించిన పరిభాషలోనే రాసేవారు. మాండలికాన్ని పరిమితంగా వాడేవారు. అర్థం కావాలనే పేరుతో తమది కాని భాషలో రాశారు. మాండలికాన్ని సంభాషణలకే పరిమితం చేసి కథనాన్ని కోస్తావారి భాషలో చెప్పుకొచ్చారు. దాన్ని పూర్తిగా బ్రేక్ చేసిన నవల ఇది. ఈ విధంగా వేముల ఎల్లయ్య కొత్త ధోరణికి పాదు వేశాడు. తమది కాని భాషలో రాయాల్సిన అవసరం తమకు లేదన్నది ఈ రచయిత వాదన.

ఇరవయ్యో శతాబ్దపు తొలినాళ్ళలో వచ్చిన 'యులిసిస్' నవల అంతా డబ్లిన్ నగర వీధుల్లో తాగుబోతులు, వేశ్యలు, అరాచకంగా తిరిగే గుంపులకు చెందినవారు మాట్లాడుకునే భాషలోనే జేమ్స్ జాయిస్ రాశారు. అందుకని ఆ రోజుల్లో అది నవలే కాదు పొమ్మన్నారు చాలామంది. అయినప్పటికీ సాహిత్య చరిత్రలో అదొక గొప్ప నవలగా నిలిచిపోయింది. ఎవరి గురించి రాస్తున్నామో వారి భాషలో రాయడం వల్లనే అది గొప్పదయింది. అర్థం కావడానికి సార్వత్రికమైన భాష అంటూ ఏదీ ఉండదన్న సంగతిని గుర్తిస్తే 'కక్క' చూపిన మార్గాన్ని ఇతరులు అనుసరిస్తారు.

మాదిగల పెళ్ళిళ్ళు, వారి ఆటపాటలు, విందు వినోదాలు, వృత్తులు ప్రవృత్తులు, లైంగిక సంబంధాలు, సుఖదుఃఖాలు, ఆనంద విషాదాలు, ఏడ్పులు, నవ్వులు సమాజంలోని ఇతరులకు భిన్నమైనవి. ఈ భిన్నత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ నవల చెబుతుంది. 'ఆధునికత'ను సంతరించుకునే పేరిట తమ సంస్కృతిని, జీవన విధానాన్ని విధ్వంసం చేసుకోవడం తగదన్నది 'కక్క' అందించే సందేశం. ఒకరు మరొకరిని ఆధునీకరించనక్కర్లేదు. ఎవరికి తోచిన జీవన విధానాన్ని వారు అనుసరిస్తారు. వాటి ప్రత్యేకతల్ని, ఉనికిని గుర్తించడం అవసరం. ఈ విషయాన్నే కక్క చెబుతుంది. అంతరాల్ని రూపుమాపే పేరిట వచ్చిన కమ్యూనిస్టులు మాదిగలకు మేలు చేసిందేం లేదన్న వాస్తవాన్ని కూడా ఈ నవల చెబుతుంది. మాదిగలకు, డక్కలివాళ్ళకు, చిందు భాగోతం చెప్పేవారికి మధ్యన వైరుధ్యాలు ఏతీరున ఉంటాయో కూడా ఈ నవలలో చూస్తాం.

ఈ నవల రాయడం ద్వారా మాదిగల సామాజిక జీవితాన్ని ఎల్లయ్య రికార్డు చేశారు. వర్తమానమే కాదు, గతం, భవిష్యత్తు కూడా ఈ నవలలో చోటు చేసుకున్నాయి. వెనకబడినవారిని పైకి తీసుకొచ్చే పేరిట వాళ్ళ జీవన సంస్కృతిని విధ్వంసం చేయడం తప్ప జరుగుతుందేం లేదన్న సత్యం ఆవిష్కృతమవుతుంది. ఇదే సమయాన అగ్రకులాలు మాదిగల మీద సాగించే పెత్తనాన్ని, దౌర్జన్యాన్ని, వాటిని ఎదుర్కోలేని మాదిగల నిస్సహాయతను చూపిస్తుందీ రచన. యాభై ఏళ్ళుగా అమలుచేస్తున్న రిజర్వేషన్లు మాదిగలకు ఒరగబెట్టిందేమిటన్న ప్రశ్న కూడా కలుగుతుంది ఈ నవల చదివితే. మాదిగలు పంచాయితీల్లో సర్పంచులయినా అధికారం మాత్రం మరొకరు చెలాయించడం మామూలయింది. రాజ్యాంగం కల్పించిన హక్కులు కాగితాల వరకు పరిమితం కావడం తప్ప మాదిగల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఉపకరించలేదని ఈ నవల చెబుతుంది. ఈ వ్యవస్థను, అధికారగణాన్ని, అగ్రకులాల దురహంకారాన్ని, అగ్రకులాలు, వెనుకబడిన కులాలు తమను చూస్తున్న తీరును మాదిగల మానసిక ప్రపంచాల్లోంచి రచయిత చెప్పాడు. ఇక్కడే వేముల ఎల్లయ్య రచయితగా సఫలమయ్యాడు. ఇప్పటివరకు మాదిగల బాధల్ని, వారు ఎదుర్కొనే సమస్యల్ని మరొకరు చెప్పారు. అంతేగాక తెలుగు సాహిత్యంలో మాల పల్లెల గురించి, అగ్రహారాల గురించి, చాకలి వాడల గురించి, గొల్లకుర్మల గురించి చాలామంది రాశారు. మాదిగవాడి గురించి మాత్రం ఎవరూ రాయలేదు. అందులోనూ తెలంగాణా మాదిగ వాడల జీవితాన్ని మొట్టమొదటిసారిగా ఎల్లయ్య రాశాడు. తెలుగునాట పెరుగుతున్న సాహిత్య చైతన్యానికి ఇది నిదర్శనం. - గుడిపాటి

కథ

# ఎగిరిపోయిన తోట



## కాసుల ప్రతాపరెడ్డి



మా మేనత్త చనిపోయిందంటే ఊరెళ్లాను. ఇంత అకస్మాత్తుగా ఆమె మరణించిందంటే నమ్మబుద్ధి కాలేదు. మా మేనమామ ఇంటి ఎదురుగానే మా ఇల్లు. నేరుగా మా ఇంట్లోకి వెళ్లాను. ఊళ్లో మా అమ్మ ఒక్కతే వుంటుంది. వెంట వస్తున్నామని లోపలే పెట్టేసిన వంట సామాగ్రినంతా బయటకు తీయడంలో నిమగ్నమై వుంది మా అమ్మ. ఇంట్లోకి అడుగు పెడుతూనే "ఎలా చనిపోయింది?" అని అడిగాను మా అమ్మను. "ఏమో బిడ్డా! బాలవ్వ బిడ్డ వచ్చి లక్ష్మమ్మ పడిపోయిందని చెప్తే గబగబా పోయా. నేను వెళ్లేసరికి ఏముంది? లక్ష్మి రక్తం కక్కుకుని పడిపోయింది. నేల మీద రక్తం మడుగు. నాకు కళ్లు గిర్రున తిరిగాయి" అని చెప్పింది. మాఅమ్మ కన్నా దాదాపు పది, పదిహేనేళ్లు చిన్నది మా మేనత్త. ఆరోగ్యంగా కూడా కనిపించేది. ఇంత హఠాత్తుగా ఆమెను మృత్యువు కబళించిందంటే నమ్మలేకపోతున్నాను.

లోన గూడు కట్టుకున్న విషాదమే ఆమెను మింగేసిందా అని సందేహం కలిగింది. మా అమ్మ కష్టాలతో పోల్చుకుంటే ఆమెవి కష్టాలే కావు. కానీ, ఆమెకున్నటువంటి కష్టాలు మా అమ్మకు లేవు. మా మేనమామ ఇంట్లోకి వెళ్లాను. బంధువులందరూ వచ్చారు. మా మేనత్త కూతుళ్లు తల్లి శవం పక్కనే కూర్చుని కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తున్నారు. మా మేనత్త కొడుకు రాంరెడ్డి ముఖం చూశా. చాలా పీకిపోయినట్లుంది. ఒక మూలన ఆరాం కుర్చీలో మౌనంగా కూర్చున్నాడు. అతనిలో ఏ భావమూ వ్యక్తం కావడం లేదు. ఆయన ప్రభుత్వ పాఠశాలలో టీచర్. ఈ రకంగా ఊళ్లో ఆయన హోదా పెరిగినట్లే. కానీ, ఎప్పుడూ మా మేనత్త మిగతా టీచర్ల భార్యలతో కలిసేది కాదు. ఇలా కలవకపోవడానికి కారణాలు నాకు పెద్దయ్యాక అర్థమయ్యాయి. మిగతా టీచర్లు చాలా మంది ఊరిలోని మోటాటి రెడ్లు. కొంత మంది ఇతర గ్రామాలవారు.

ఆమె ముఖం చూశాను. ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు అనిపించింది. ఆమె ఎప్పుడూ మా అమ్మమ్మ మీద, మా అమ్మ మీద ధుమధుమలాడుతూ వుండేది. తన భర్తను తనకు దూరం చేస్తున్నారనేది ఆమెకు మా అమ్మ, అమ్మమ్మల మీద ఉన్న కంటెంప్ట్ అనుకుంటా. మా అమ్మమ్మ మా మేనత్తతో తగువు పెట్టుకుని మా ఇంట్లోకి వచ్చి మా అమ్మతో గుసగుసలాడేది. కోడలు మీద ఆమె ఫిర్యాదులు చేస్తుందనేది నాకు తెలిసిపోతూనే వుండేది. ఇలా ఫిర్యాదులు చేస్తూ మధ్య మధ్యలో "కులం తక్కువ బుద్దులు ఎక్కడికి పోతాయి" అనేది మా అమ్మమ్మ. మేనత్త మా కన్నా కులం తక్కువ ఎట్లాగో నాకు చిన్నప్పుడు అర్థం కాలేదు.

అక్కడ నిలబడాలనిపించలేదు. బయటకు వచ్చి ఎదురుగా వున్న మా ఇంట్లోకి వెళ్లాను. మా అమ్మ టీ తయారు చేసింది. ఆ ఆవిడ, పిల్లలు, మా అన్న, మా వదిన అందరూ మా మేనత్త వాళ్లింట్లోనే వున్నారు. టీ తాగుతూ - "అమ్మమ్మ ఎప్పుడూ అత్తమ్మను తిట్టేది ఎందుకు?" అని అడిగా మా అమ్మను. "దానిదో గొడవ. పెళ్లి కావడంతో తనకు కొడుకు దూరమైపోతాడేమోనని దాని భయం. అది చెప్పే మాటలకు మామకు కూడా మీ అత్తమ్మంటే చిర్రుబుర్రులాడేవాడు" అని చెప్పింది.

టీ తాగేసి పెరట్లోకి చూశాను. మా పెరటి గోడ సగం కూలిపోయింది. మా పెరడు అవతల పచ్చటి పొలాలు వుండేవి. మొక్కజొన్న, పెసర, రకరకాల కూరగాయల మొక్కలతో అది కనువిందు చేసేది. దానికి వెంకటరెడ్డి దొర కాపలా కాసేవాడు. చేల మీద పిట్టలను, ఇతర పక్షులను ఎగుర గొట్టినట్లుగానే నోటి అదురుతో నన్ను, నాలాంటి పిల్లకాయలను భయపెట్టేవాడు. ఆ చేను వైపు చూడాలంటే కూడా భయమేసేది. మా పెరట్లో కూడా వర్షాకాలంలో మొక్కజొన్న చేను వేసేవాళ్లం. అవతలి చేలో నుంచి తరిమేయబడ్డ పక్షులు మా మొక్కజొన్న చేను మీద వాలేవి.

ఒక్కసారిగా విషాదం గుండెలో నిండిపోయింది. వెంకటరెడ్డి చనిపోయాడు. ఆ తోటకు నీరందించే బావి ఎండిపోయింది. వర్షాలు లేక, దున్ని, పంట వేసేవారు లేక మా పెరడు పాడుబడిపోయింది. పక్షులు లేవు. వాటిని ఎగరగొట్టడానికి మనుషులూ లేరు. అంతా నా ప్రేమ లాగే అయిపోయిందనిపించింది.

సౌందర్యకు నేనెప్పుడయినా గుర్తొస్తానా అని ప్రశ్నించుకున్నాను. ఆమె కనిపిస్తే బాగుండు అనుకుంటాను. ఇప్పుడూ అలాగే అనుకున్నాను. వెంటనే ఊళ్లోకి బయలుదేరాను. వాళ్లింటి ముందు నుంచి వెళ్తూ ఎప్పటిలాగే వాళ్లింట్లోకి తొంగి చూశాను. పెద్ద బంగళా అది. ఇంటి ముందు విశాలమైన వాకిలి. వాకిలిని కూడా మూస్తూ పెద్ద ద్వారం. ద్వారానికి బలమైన తలుపులు. ఈ తలుపులు మూసిన గుర్తు లేదు నాకు. ఎప్పుడూ తెరిచే వుంటాయి. వాకిలి బోసి పోయినట్లుంది. నేను లోనికి తొంగి చూసి నప్పుడు రివ్వున బయటకు పరుగెత్తుకొచ్చేది సౌందర్య. వాళ్ల నాన్న ఇంట్లో వున్నప్పుడు మాత్రం ఏదో పని చేస్తున్నట్లు నటిస్తూ అక్కడే నిలబడేది. మిగతా వాళ్లు ఆమె పరుగెత్తుక రావడం నేను ఆమెతో గంటలు గంటలు మాట్లాడడం పెద్దగా పట్టించుకునేవారు కారు.

అలాగే నడవసాగాను. నా ప్రమేయం లేకుండానే వేంకటేశ్వరస్వామి గుడి దాకా వెళ్లాను. గుడిని చూశాను. పెద్ద చార్మింగ్‌గా అనిపించలేదు. నా చిన్నప్పుడే అన్నసత్రాలు శిథిలావస్థలో వున్నాయి. ఇప్పుడు అవి మరింతగా శిథిలమయ్యాయి. దేవుడ్ని ఊరేగించే రథం చక్రం వూడిపోయి వుంది. ఇప్పుడు 'శవ' తీయడం లేదని మా అమ్మ చెప్పినట్లు గుర్తు. ఇదే గుళ్లో సౌందర్య, నేను ఆమె పెళ్లి అయ్యే వరకు కూర్చొని గంటల తరబడి ముచ్చట్లాడేవాళ్లం. పూజారి మమ్మల్ని చూసి పలకరింపుగా నవ్వేవాడు. అంతే, ఒక్క మాట కూడా అనేవాడు కాదు. అప్పుడప్పుడు మేం కొబ్బరికాయ తీసికెళ్తే దాన్ని కొట్టి సగం మాకిచ్చి ఇద్దర్నీ శఠగోపంతో దీవించేవాడు. మేమిద్దరం ఇలాగే కలిసి వుంటామని అతని దీవెనలు నాకో నమ్మకాన్ని ఇచ్చేవి. ప్రతి సంక్రాంతికి అక్కడ జాతర జరుగుతుంది. ఆ జాతరలో నేను సౌందర్యను చూడడం, ఆమె నన్ను చూడడం తప్ప మరోటి వుండేది కాదు మాకు. ఎడ్ల బండ్లు గుడి చుట్టూ తిరుగుతూ వుంటే నా మనసు సౌందర్య చుట్టూ తిరుగుతుండేది. నేను హైదరాబాద్‌లో చదువుకుంటున్నప్పుడు తప్పకుండా సంక్రాంతికి ఊరు వెళ్లేవాడ్ని. ఆమె పెళ్లయిన తర్వాత కూడా సంక్రాంతికి తప్పకుండా వెళ్లేవాడ్ని. ఆమె పెళ్లయిన తర్వాత పండుగకు ఆమెను జాతరలో చూడడానికి తప్ప మరో రకంగా చూడడానికి వీలయ్యేది కాదు. ఓసారి నావైపు చూసి తన దారిన తాను పోయేది సౌందర్య. అలా చూసినప్పుడు నా మీద ఆమెకింకా ప్రేమ వుందా అనే ప్రశ్నించుకునేవాడ్ని. ఆమె చూసినప్పుడు ఆమెకు ఈ ప్రశ్న వేయాలని వుండేది. కానీ, అందుకు నేనేం ప్రయత్నం చేయలేదు. ప్రయత్నం చేయకపోవడమనేది నా భయమో, అసమర్థతో కారణాలు కావని నాకు స్పష్టంగా తెలుసు. మేం విడిపోయిన పద్ధతే అందుకు కారణం.

సౌందర్యపై తరగని ప్రేమ, నన్ను ఆమెకు దూరం చేసిన దొరతనం మీద ద్వేషం. ఇవి రెండే నా అభిప్రాయాలను, ఇష్టాయిష్టాలను శాసిస్తున్నాయని నాకు అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది. మళ్లీ ఇంటికెళ్లాను. మేనత్త శవయాత్ర బయలు దేరింది. ఊరు మధ్య నుంచి గుట్ట వైపు బయలు దేరింది. ఊరవతల ఉన్న ఆ చిన్న గుట్ట మా మిత్రులకు ఒక విడిది. సాయంత్రాలు, సెలవు రోజుల్లో ఆ గుట్టపైకి వెళ్లేవాళ్లం. హైదరాబాద్ నుంచి ఊరికి వచ్చినప్పుడు కూడా సాయంత్రాలు గుట్ట పైకి ఎక్కడం నాకు అలవాటుగా మారింది. ఆ గుట్టపై నుంచే గాలిపటాలు ఎగిరేసేవాళ్లం. అప్పుడు పచ్చని కంది చేను మధ్య నుంచి వెళ్తుంటే పక్షులు లేస్తూ చప్పుడు చేసేవి. ఇప్పుడు చేనూ లేదు, పక్షులూ లేవు. గుట్ట పక్కనే స్మశానం.

రంగారెడ్డి అప్పుడు నన్ను గుట్ట పైకే తీసుకొచ్చాడు. సీరియస్ విషయాలు మాట్లాడడానికి కూడా ఈ గుట్టపైకే రావడం మా ముందుతరం వారికి, మా తరంవారికి ఆనవాయితీ. "నువ్వు సౌందర్యను పెళ్లి చేసుకుంటావా?" అని అడిగాడు. రంగారెడ్డి సౌందర్య కుటుంబానికి దగ్గరివాడు. రంగారెడ్డి తండ్రి తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు. కమ్యూనిస్టు కుటుంబం నుంచి వచ్చినవాడు కావడం వల్ల అతను మాతో కూడా సన్నిహితంగా వుండేవాడేమో అని ఇప్పుడనిపిస్తుంది నాకు.

"అవును" అన్నాను.

"మీ నాయన సౌందర్య వాళ్లింటికి వెళ్తే ఎలా వ్యవహరిస్తాడు" అని అడిగాడు. నేను సమాధానం చెప్పలేదు. నా మౌనాన్ని అతను అడ్వాంటేజ్‌గా తీసుకున్నాడు. "సౌందర్య తండ్రి ఆరాం కుర్చీలో దర్జాగా కూర్చుంటే మీ నాయన చేతులు కట్టుకుని వాకిట్లో నిలబడుతాడు. నీకు సౌందర్యను ఇచ్చి పెళ్లి చేస్తాడని ఎలా అనుకుంటున్నావు?" అన్నాడు. "అతని అంగీకారంతో పనేమిటి?" అని అడిగాను. నాలో ఉక్రోషం కట్టలు తెంచుకుని పొంగి పొర్లేలా వుంది. తమాయించుకున్నాను. "సౌందర్య ధైర్యం చేసి నీతో వచ్చేస్తుందనుకుంటున్నావా?" అని అడిగాడు. నేను మాట్లాడలేదు. నాలో సందేహం మొదలైంది. "నువ్వే అడుగు. ఏమంటుందో?" అని లేచి వెళ్లిపోయాడు.

మా మేనత్త శవం కాష్టం మీద భగభగ మండుతోంది. మాడు చిట్లింది. అందరూ వెనుదిరిగారు. ఆలోచనలతో నేనూ వెనుదిరిగాను. మా మేనత్తను మా అమ్మమ్మ కులం తక్కువదని తిట్టడానికి, రంగారెడ్డి నాకు చెప్పిన సత్యానికి ఒకే లంకె వున్నట్లు నాకనిపించింది. సౌందర్య కుటుంబం రెడ్ల కుటుంబం, మాదీ రెడ్ల కుటుంబమే. మా మేనత్త కూడా రెడ్ల కుటుంబం నుంచి వచ్చిందే. మాలమాదిగలను మా ఇళ్లలోకి రానీయకపోవడం అనుభవంలోనిదే. కానీ, కలిసి వుంటూ కూడా ఇంత తేడా పాటించాలా? సౌందర్యవాళ్లు మోటాటి రెడ్లు, మేం పాకనాటి, మా మేనత్తవాళ్లు గుడాటి రెడ్లు. రెడ్లలో ఎనిమిది ఉపకుటుంబాలున్నాయి. ఈ ఉపకుటుంబాల మధ్య కూడా అంటరానితనమేదో వున్నట్లు నాకనిపించింది.

చాలా రోజుల తర్వాత ఊరికి వచ్చిన నన్ను ఆ జ్ఞాపకాలు వదలడం లేదు. వాటిని నెమరేసుకుంటూ ఒంటరిగా గడపడం నాకెందుకో ఇప్పుడు ఒక కలగా వుంది. ఆ కలను తుంచేయడం నాకిష్టం లేదు. ఇంటికి వచ్చి పెరట్లోకి వెళ్లాను. వెంకటరెడ్డి దొర కాపలా కాసిన తోట బోసిగా కనిపించింది. ఆయన కర్ర పట్టుకుని నడిచే వెంకటరెడ్డి మోటాటి కులమే మమ్మల్ని అంతగా ఆ రోజుల్లో భయపెట్టిందా? ఈ కులం వల్లనే నాకు, సౌందర్యకు వున్న ప్రేమ సంబంధం ఏమీ జరగనట్లే మాసిపోయిందా? ఇదెంత హింస? రంగారెడ్డి ఆ మాటనగానే నేను సౌందర్య వాళ్లింటికి వెళ్లాను. మా నాయన చేతులు కట్టుకుని నిలబడే ఇంట్లో నేను దర్జాగా కుర్చీలో కూర్చోగలను. నాకు ఆ స్వతంత్రం ఎలా వచ్చింది? నా చదువు వల్ల కావచ్చు. ఇంట్లోకి రానిచ్చే ఆ పెద్ద మనిషి కంచం కలుపుకోవడానికి కులం అడ్డం వచ్చింది. "నాతో వచ్చేస్తావా?" అని నేరుగా అడిగాను సౌందర్యను. ఆ సమయంలో ఇంట్లో ఆమె, నేను తప్ప ఎవరూ లేరు. ఎవరూ లేకుండా చూసుకునే వెళ్లానేమో! కానీ గుర్తు చేసుకుంటే రక్తం ఉడికిపోతుంటే ఇంట్లోకి ఒక వీరుడిలా ప్రవేశించినట్లనిపిస్తుంది. "రాను" అంది. "ఏం?" అన్నాను. ఆమె మాట్లాడలేదు. "నా మీద నీకు ప్రేమ లేదా?" అని అడిగాను. "లేదు" అంది. నాకు బాధ కలిగిందో, కోపం వచ్చిందో ఇప్పుడు చెప్పడం కష్టం. వెంటనే బయటకు వెళ్లి సిగరెట్ కొనుక్కొచ్చి వాళ్లింట్లోనే తాగాను. గట్టిగా సిగరెట్ పొగంతా పీల్చిన తర్వాత నన్నేదో వైరాగ్యం ఆవరించినట్లనిపించింది. బహుశా, నాతో సౌందర్య రానన్నందుకు నాకంత బాధ, కోపం కలగలేదనుకుంటా. నీ మీద ప్రేమ లేదనే మాట నన్ను ఘోరంగా దెబ్బతీసినట్లనిపించింది. ఆమెకు నా మీద ప్రేమ లేదనే మాట అబద్ధమని నేను ఇప్పటికీ నమ్ముతుంటాను. చాలాసార్లు ఆమె నా మీద తన ప్రేమను వర్షించింది. ఆ ప్రేమ వర్షంలో నిండా మునిగిపోయానని అనడానికి నా జ్ఞాపకాల నుంచి ఆమె నవ్వు చెరిగిపోకపోవడమే.

ఆ తర్వాత ఇంటికి వచ్చిన నన్ను అమ్మ అడగలేక అడిగింది ఆ అమ్మాయిని మర్చిపొమ్మని. నేను మాట్లాడలేదు. "నీ మంకు నీదేనా?" అని అడిగింది. అంతా అయిపోయిన తర్వాత మా అమ్మ నన్నీ కోరిక కోరడం నాకు నవ్వు తెప్పించింది. "ఎందుకురా నవ్వుతావు?" అని అడిగింది. "ఏం లేదు" అని చెప్పేశా. దొరల బంకుల్లో మాట్లాడుకుంటుంటే బంకులూడ్చే మల్లి విన్నదట. ఆ విన్న మాటలనే మల్లి మా అమ్మకు చెప్పిందట. మా అమ్మ నాకు చెప్పిన వివరాల ప్రకారం - సౌందర్య మనసు మార్చడానికి కూడా ఆమె తలిదండ్రులు రంగారెడ్డినే ప్రయోగించారట. "నువ్వు కనుక వాడ్ని కాదనకపోతే వాడి ప్రాణాలుండవు. మీ నాయన వాడ్ని చంపేస్తాడు" అని రంగారెడ్డి సౌందర్యకు చెప్పాడు. ఇది తెలిసినప్పుడు నాకనిపించింది - పంజరంలోని చిలుక మీద కత్తి వేటు పడినట్లు సౌందర్య భయంతో గజగజలాడే వుంటుందని.

నా ప్రేమకథ విషాదాంతం కావడంతో నేను ఊరికి రావడం తగ్గించాను. ఇప్పుడయితే వెంకటరెడ్డి తోటా, మా పెరడే కాదు, ఊరు ఊరంతా పక్షులెగిరిపోయిన తోటలా వుంది ●


> **సౌందర్య కుటుంబం రెడ్ల కుటుంబం, మాదీ రెడ్ల కుటుంబమే. మా మేనత్త కూడా రెడ్ల కుటుంబం నుంచి వచ్చిందే. మాలమాదిగలను మా ఇళ్లలోకి రానీయకపోవడం అనుభవంలోనిదే. కానీ, కలిసి వుంటూ కూడా ఇంత తేడా పాటించాలా? సౌందర్యవాళ్లు మోటాటి రెడ్లు, మేం పాకనాటి, మా మేనత్తవాళ్లు గుడాటి రెడ్లు. రెడ్లలో ఎనిమిది ఉపకుటుంబాలున్నాయి. ఈ ఉపకుటుంబాల మధ్య కూడా అంటరానితనమేదో వున్నట్లు నాకనిపించింది.**



# ఈ బురిడీబాబా దేవుడెలా అయ్యాడు?

పరిశోధనాత్మక ధారావాహిక -12

రచయిత : చంద్రకౌంస్

# షిరిడీ సాయి పేరుతో...

(గత సంచిక తరువాయి)

19వ శతాబ్దం ప్రథమార్ధంలో భారత మాత ఒక మహనీయుడికి జన్మనిచ్చింది. జాతి మత కుల భేదాలకతీతంగా దేవుడు ఒక్కడేనని ఆ మహాత్ముడు ఎలుగెత్తి చాటారు. హిందూ, ముస్లిం తదితర మతాల సారాంశం ఈ మహత్తర సత్యమేనని ఆయన బోధించి, ఆచరించి చూపారు. అసంఖ్యాక ప్రజలు ఆయన సందేశానికి ముగ్ధులయ్యారు. లక్షలాది మంది, జీవిత కాలంలోనే ఆయనను ప్రత్యక్షదైవంగా ఆరాధించారు. షిర్డి సాయిబాబాగా ఆయన ప్రఖ్యాతులయ్యారు.

ఈనాడు మతాలకి అతీతంగా కోట్లాది భారతీయుల ఇళ్ళలో ఆయన పటాలున్నాయి. దేశమంతటా ఆయన మందిరాలున్నాయి. ఆయన జీవితంపట్ల బోధనపట్ల ఆసక్తి చూపుతున్నవారి సంఖ్య ప్రతీనిత్యమూ పెరిగిపోతోంది.

## అచ్చమైన ఆత్మజ్ఞాని

దుఃఖం వచ్చినపుడు ఉద్విగ్నమనస్కుడు కానివాడు, సుఖం వచ్చినపుడు పొంగిపోని వాడూ, కాంక్షలని, భయాలని విడిచిపెట్టినవాడు, మట్టిని, బంగారాన్ని సమదృష్టితో చూడగల వాడు అయిన స్థితప్రజ్ఞుని గురించి భగవద్గీతలో శ్రీకృష్ణుడు వివరించారు. షిర్డీ సాయిబాబా జీవితం - భగవద్గీత వర్ణించిన ఆత్మయోగిత్వానికి ప్రత్యక్ష భాష్యం అని చెప్పాలి.

విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవిహస్తిని,
శునిచైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః

విద్యావినయ సంపన్నులైన బ్రాహ్మణుల పట్ల, ఆవుపట్ల, ఏనుగుపట్ల, కుక్కపట్ల, ఆ కుక్కని తినే చండాలుడి పట్ల జ్ఞానులు సమదృష్టిని కలిగి ఉంటారని శ్రీకృష్ణుడు భగవద్గీతలో ప్రతిపాదించారు. అంతే కాకుండా, ఆ తరువాతి శ్లోకంలో

ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః
నిర్దోషం హిసమం బ్రహ్మతస్మాద్బ్రహ్మణి తేస్థితాః

ఆ విధమైన సమదృష్టిని పాటించేవారు ఈ జీవితంలోనే ప్రపంచాన్ని జయించిన వాళ్ళు అవుతున్నారనీ, బ్రహ్మపదాన్ని చేరుకుని జీవన్ముక్తిని పొందుతున్నారనీ శ్రీకృష్ణుడు ముక్తికి కొత్త భాష్యం చెప్పారు.

ఆ విధంగా జీవించడం, జీవన్ముక్తిని పొందడం అంటే ఏమిటో మనకి షిర్డీ సాయి బాబా జీవితం చూస్తే అర్థం అవుతుంది.

## "సాయి" అంటే ఏమిటి?



ఈనాడు దేశమంతటా ప్రసిద్ధి పొందినా - నిజానికి "సాయి" అనే పదం భారతీయ పదం కాదు, పర్షియన్ పదం. పర్షియన్ భాషలో జనసామాన్యానికి దూరంగా బతికే ఫకీర్లకి, ఆధ్యాత్మిక రుషులకి ఈ పదం వాడతారు. బాబా అనే హిందుస్తానీ పదానికి తండ్రి అని అర్థం. ఒకోసారి ఈ పదాన్ని పెద్దల పట్ల గౌరవ సూచకంగా, పూజ్య భావంతో కూడా ఉపయోగిస్తారు. (సాయి అంటే తల్లి అని బాబా అంటే తండ్రి అని, సాయిబాబా అనే పదంలో తల్లి, తండ్రి ఇద్దరూ కలిసి ఉన్నారని పుట్టపర్తి బాబా తరచుగా చేసే వ్యాఖ్యానం స్వకపోల కల్పితమే అవుతుంది కానీ యదార్థం కాదు)

షిర్డీసాయిబాబా తనకు తానుగా సాయి అనే పేరు పెట్టుకోలేదు. నిజానికి ఆయన పేరేమిటో ఎవ్వరికీ తెలీదు. మహల్సవతి అనే బ్రాహ్మణ పూజారి మొదటిసారిగా ఆయన్ని "సాయి" అనే పేరుతో సంబోధించారు. తర్వాత ఆయన "సాయిబాబా"గానే ప్రఖ్యాతులయ్యారు.



## సాయిబాబా గురించి తెలుసుకోవాలంటే...

షిరిడీ సాయిబాబా గురించి పూర్తిగా తెలుసుకోవడం కొంచెం కష్టమైన సంగతే. తన గురించి, తన ఊరు, పేరు, పుట్టుపూర్వోత్తరాల గురించి అందరికీ తెలియాల్సిన, చెప్పాల్సిన లేదా ప్రచారం జరగాల్సిన అవసరం లేదని ఆ మహాత్ముడు అనుకుని ఉండవచ్చు.


హేమాద్ పంత్

షిర్డీ సాయిబాబా జీవితకాలంలోనే ఆయన బ్రాహ్మణ భక్తుడు శ్రీ గోవింద రఘునాధ దాభోల్కరు మరాఠీ భాషలో "శ్రీ సాయి సచ్చరిత" అనే గ్రంథాన్ని గొప్ప భక్తిభావంతో, కవితాభినివేశంతో రచించారు. (ఈయననే సాయిబాబా ప్రేమపూర్వకంగా హేమాద్ పంత్ అని పిలిచేవారు). ఈ పుస్తకంలో అత్యధిక భాగం షిర్డీ సాయిబాబా జీవించి ఉండగానే (ఆయన సమ్మతితోనే) రచించారనే భావంతో భక్తులు దీనిని అత్యంత ప్రామాణిక గ్రంథంగా భావిస్తారు. ఈ పుస్తకం ఇంగ్లీషులోకీ అనంతరం అనేక ఇతర భాషల్లోకి అనువాదమైంది. సద్గురు శ్రీ సాయిబాబా మందిరం, కిషన్‌బాగ్, రాజేంద్ర నగర్ రోడ్, హైదరాబాద్ - తరపున మణి అనే భక్తుడు హేమాద్ పంత్ విరచితమైన మరాఠీ మూలాన్ని తెలుగులోనికి "శ్రీ సాయి సచ్చరిత" పేరిట అనువాదం చేశారు. (ఈ సంచికలో నేను "శ్రీ సాయి సచ్చరిత" నుంచి చేసే ఉల్లేఖనలన్నీ ఈ అనువాదం నుంచే అని గమనించాలి.)


దాసగణు

శ్రీ సాయి సచ్చరిత వాస్తవానికి దగ్గరగానే ఉన్నదని అందరూ భావిస్తారు. నిజమే కానీ, "బ్రాహ్మణులు వర్ణాశ్రమ ధర్మాలను అపహాస్యం చేసినప్పుడు, శూద్రులు బ్రాహ్మణులైపోవాలని ప్రయత్నం చేసినప్పుడు" వర్ణాశ్రమ ధర్మాలను రక్షించేందుకు సాయిబాబా వంటి సత్పురుషులు ఉద్భవిస్తారని (4వ అధ్యాయం) - రచయిత చేసిన వ్యాఖ్యలు - కేవలం రచయిత గోవింద రఘునాధ దాభోల్కర్ (హేమాద్ పంత్) బ్రాహ్మణీయ దృక్పథం నుంచి చేశారనే భావించడం సముచితం. కులమత అంతరాలకు గడ్డిపోచంత విలువ కూడా ఇవ్వని షిర్డీ సాయిబాబాకి ఈ వ్యాఖ్యలను ఆపాదించడం అసమంజసం. ఇటువంటి మాటలు అక్కడక్కడ ఉన్నా షిర్డీ సాయిబాబా చరిత్ర రాయడంలో హేమాద్ పంత్ చిత్తశుద్ధిని శంకించడం సబబు కాదు.

సాయిబాబా సమాధి అనంతరం ఆయనకి సంబంధించిన వివరాలను సమగ్రంగా సేకరించి మద్రాసు నుంచి బి.వి. నరసింహ స్వామి "లైఫ్ ఆఫ్ సాయిబాబా" పేరిట 4 సంపుటాల గ్రంథాన్ని రాశారు.

సాయిబాబా జీవితకాలంలోనే దాసగణు ఉరఫ్ గణపతి రావు దత్తాత్రేయ సహస్రబుద్ధే అనే ప్రసిద్ధ భక్తుడు సాయిబాబా జీవిత చరిత్రని అందించాలనే ప్రయత్నం చేశారు. ఈయన హరికథా కళాకారుడు, మంచి కవి. దాసగణు రచించిన సంత్ కథామృత్, అర్వాచీన భక్తలీలామృత్, భక్తి సారామృత్ అనే గ్రంథాలలోని కొన్ని భాగాలను యస్వీయల్ తెలుగులోకి అనువాదం చేయగా, సాయిపథం ఆశ్రమం, షిర్డీ వారు "శ్రీ సాయి గురు చరిత్ర" పేరిట చక్కని పీఠికతో ప్రచురించారు. దాసగణు రచనల్లోని సాయిచరిత్రకి సంబంధించిన భాగాలకు చాలా వరకు ప్రామాణికత, నిర్దుష్టత లేవు. ఈ విషయాన్ని ఆయనే మరో సందర్భంలో అంగీకరించారు కూడా. దాసగణు తన రచనలో కులవ్యవస్థపైన చేసిన దాడి ప్రత్యేకంగా ప్రశంసించదగినది. "ఈ సమాజమనే దైవమందిరంలోని కులమత దురభిమానాలనే చెత్తాచెదారాన్ని ఊడ్చి శుభ్రం చెయ్యడానికి మీకో చీపురు కట్ట కావాలి కదా? నన్నా చీపురులా సద్వినియోగ పరుచుకోండి. ఇదే నా ప్రార్థన!" అంటారు దాసగణు. ఇది షిర్డీ సాయిబాబా అందించిన స్ఫూర్తిని పూర్తిగా ప్రతిబింబించే భావం.

ఆర్థర్ ఆస్‌బర్న్ రచించిన "The Incredible Sai Baba (The life and Miracles of a Modern day saint)" సాయిబాబా జీవితంపైన రాసిన మరో చక్కని గ్రంథం. ఆర్థర్ ఆస్‌బర్న్ రమణ మహర్షి ఆశ్రమంలో అనేక సంవత్సరాలు ఉన్నారు. భారతీయ ఆధ్యాత్మికతను పాశ్చాత్య ప్రపంచానికి పరిచయం చేసేందుకు చిత్తశుద్ధితో ఎన్నో చక్కని గ్రంథాలు రాశారు. ఆర్థర్ ఆస్‌బర్న్ సాయిబాబాపై రాసిన గ్రంథాన్ని పోరంకి దక్షిణామూర్తి "మహిమాన్వితులు సాయిబాబా, ఈ కాలపు అద్భుత

**గతసంచికల్లో...** పుట్టబాబా దెయ్యాల్ని తోలే నెపంతో, స్త్రీలను జుట్టు పట్టుకుని కొట్టిన సంగతి, గిరగిర తిప్పి గోడకి బంతిలా విసిరి కొట్టిన సంగతి, తల మధ్య భాగం నుంచి వెంట్రుకలు పీకి కింద ముల్లులా పొడవుగా ఉన్న దాన్ని చూపిన సంగతి, కొన్నాళ్ళ తర్వాత ఈ నాటు పద్ధతి మానుకున్న సంగతివివరంగా. పుట్టపర్తిబాబా తెలుగులో ఒక్క లైనుకి మూడు తప్పులు రాసే సంగతి ఆధారాలతో.



పుట్టపర్తి బాబా తానే దేవుడ్ననీ, ఈ విశ్వమంతా తానే సృష్టించాననీ, కృష్ణావతారంలో కుండల కొద్దీ పాలు త్రాగడం వల్ల ఇప్పుడు పాలమీద విరక్తిగా ఉన్నాననీ, ఆకాశాన్ని భూమిగా, భూమిని ఆకాశంగా మార్చగలుగు తాననీ, వేదాలు తననే వర్ణించాయనీ, త్యాగరాజుకి తానే సంగీతం నేర్పాననీ... ఎలా పడితే అలా గప్పాలు కొట్టే సంగతులు ఆధారాలతో.

పుట్టపర్తిబాబా చెప్పుకున్న అవతార రహస్యం అనబడే అతుకుల బొంత పిట్ట కథ, తనని పొగుడుతూ పూజించమని చెప్పి, తానే రాసుకున్న స్వంత డబ్బా పాటలు, పద్యాలూ కూడా. పుట్టపర్తి బాబా తనకి ఆహారం అక్కర్లేదని, కేవలం ప్రజలకోసమే తింటున్నాననీ దబాయించిన సంగతి.

పుట్టపర్తి బాబా శ్రీరాముడికంటే, శ్రీకృష్ణుడి కంటే తాను అధికుడినని అహంకరించిన సంగతి. శ్రీకృష్ణుడి కాలంలో కంటేతాను జన్మించిన కాలంలో జన్మించడమే భక్తులకి ఎక్కువ అదృష్టమని గొప్పలు చెప్పుకున్న సంగతి. బురిడీబాబా తన గొప్ప తనం చాటుకునేందుకు పార్వతీ పరమేశ్వరుల, ఇతర దేవతా విగ్రహాలను తన పాదాల దగ్గర ప్రదర్శించుకునే సంగతి.

బుద్ధుడిపైన విమర్శలు, బుద్ధుడి వేషంతో బురిడీ బాబా పాదాలపై పడే నాటకం.

యూదుమతం గురించి పుట్టబాబా అజ్ఞానం. నకిలీ దేవుడికి నకిలీ కవుల స్తోత్రాలు. పుట్టబాబా రాశాడని చెప్పే పద్యంలో గణభంగాలు, యతిప్రాసల నియమభంగాలు.

క్రీస్తు పుట్టిన తేదీపై పుట్టబాబా మాటమార్చడం. మోజెస్ క్రీస్తును పూజించాడనే కబుర్లు. బురిడీబాబా సృష్టించాడని చెప్పే 2000 ఏళ్ళ క్రితంనాటి క్రూసిఫిక్స్ బండారం. క్రీస్తు మరణంపై పుట్టబాబా పసగని వ్యాఖ్యానాలు. శిలువని వేలాడదీశారని వాదనలు. గొర్రె బా-బా- అని తన పేరే జపిస్తుందని చెప్పటం.

బాబా భక్తి ప్రచారం కోసం కోట్ల రూపాయల ప్రభుత్వాదాయానికి తూట్లు పొడిచే జీ.ఓ. బండారం.



అలెగ్జాండర్ గురించి పుట్టబాబా అజ్ఞానం.

శ్రీ అరవింద యోగి పైన, వివేకానందుడిపైన బురిడీ బృందం దుష్ప్రచారం వివరాలు.

బురిడీబాబాపై అంతర్జాతీయంగా వెల్లువెత్తుతున్న సెక్స్ ఆరోపణల దుమారం వివరాలు.

యోగి కథ" అనే పేరిట తెలుగులోకి అనువాదం చేయగా ఓరియంట్ లాంగ్మన్ వారు ప్రచురించారు.

సాయిబాబా గురించి తెలుగులో ఇంగ్లీషులో ఎక్కిరాల భరద్వాజ్ రాసిన గ్రంథాలు కొంత ప్రాచుర్యం పొందాయి. సాయిబాబా గురించి గ్రంథాలు తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఇప్పటికే వందల సంఖ్యలో వెలువడ్డాయి, ఇంకా వెలువడుతున్నాయి కూడా.

కెనడాకి చెందిన డా॥ మేరియన్ వారెన్ షిర్డీ సాయిబాబాను సూఫీ తాత్వికత నేపధ్యంలో పరిశీలించి, పరిశోధించి సాయిబాబాని సూఫీ తత్వవేత్తగా ప్రవక్తగా నిర్ధారిస్తూ, నిరూపిస్తూ "Unravelling the Enigma, Shirdi Sai Baba in the light of Sufism" అనే 440 పేజీల పరిశోధనాత్మక గ్రంథం రాశారు. దీనిని ఢిల్లీలోని స్టెర్లింగ్ పబ్లిషర్స్ వారు ప్రచురించారు.

పనిచేసినట్టుగా సాయిబాబా స్వయంగా వెల్లడించిన సంగతి వెలుగులోకి వచ్చింది. ఇంతకుమించి వివరాలేమి తెలియకపోయినా, ఆకర్మయోగి మాతృదేశ విముక్తికై ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారనే అభిప్రాయం ఒకటి వ్యాప్తిలోకి వచ్చింది. బి.వి.నరసింహ స్వామి "లైఫ్ ఆఫ్ సాయిబాబా" నాలుగవ సంపుటంలోనే కాకుండా డా॥మారియెన్ వారెన్ "షిర్డిసాయిబాబా ఇన్ ది లైట్ ఆఫ్ సుఫీఇజం" పుస్తకంలో కూడా ఈ సంగతి ప్రస్తావించారు.

## దేముడినని చెప్పుకోలేదు

శ్రీ సాయి సచ్చరిత ఉపోద్ఘాతంలో బాబా భక్తుడు హరిసీతారాం దీక్షిత్ ఇలా రాశారు: "సాయిబాబా యొక్క అనేక భక్తులు, వారిని సిద్ధి పొందిన వారి వలె కాక,





**అంకితం :** సత్యమేదైవమని, ఆ సత్యం కోసం ఒక్కళ్ళూ నిలబడాల్సి వచ్చినా నిలబడాలని, అవసరమైతే అందుకు యావత్ ప్రపంచాన్నీ ఒంటరిగా ఎదిరించాలనీ చెప్పిన గాంధీ ఆదర్శం,-కర్మలపైనే కానీ ఫలితంపై ఆసక్తి వలదని, సిద్ధి, అసిద్ధులపైన సమభావంతో యోగివై కర్తవ్యాన్ని నిర్వహించమనే భగవద్గీతలోని శ్రీకృష్ణుడి ఆదేశం,-వెర్రి నమ్మకాలు, మూఢ విశ్వాసాలతో సత్కార్యాలు సాధ్యం కావనీ, బురదతో బురదను కడగలేమని, ప్రజల్ని స్వతంత్రులని చేయమని, వాళ్ళ సంకెళ్ళను ఛేదించమనే వివేకానందుడి ఉపదేశం,-ఈ ప్రయత్నానికి ప్రేరణ, స్ఫూర్తి. ఈ మహనీయులు ముగ్గురికీ ఈ ధారావాహికని అంకితం చేస్తున్నాను. - రచయిత

# బురిడీ బాబా మోసం



ఉన్నారు. దునియా మే కిసీకా కోఈ హై ఔర్ కిసీకా కోఈ హై అపనాతో యహా కోఈ నహి, అపనా అల్లా హీ అల్లాహై, మనకిక్కడ ఎవరూ లేరు. మనకు అల్లా ఏ అల్లా..." అని భక్తులతో అనేవారని హేమాద్ పంత్ రాశారు. సాయిబాబా చాలా అరుదుగా అనల్‌హక్ అని పేర్కొన్నట్టుగా కూడా కొందరు చరిత్రకారులు రాయక పోలేదు. కానీ దాన్ని మనం సాయిబాబా తన జీవితమంతా చెప్పినదానికి భిన్నంగా తీసుకోనక్కర్లేదు. బాబా అనల్‌హక్ అన్నపుడు అహంబ్రహ్మ అనే అర్థంలో అంటున్నారే తప్ప, తాను సృష్టికర్తనని అహంకరించి నట్టుగా భావించనక్కర్లేదు.

## ఏది నిజం?

ఈ రోజు మన దేశంలో మారుమూల ప్రాంతాల్లో కూడా షిరిడీ సాయిబాబా మందిరాలు నిర్మాణమౌ తున్నాయి. ఈ మందిరాలన్నింటిలో రజత సింహాసనం మీద, కాలు మీద కాలు వేసుకుని కూర్చుని రత్న ఖచిత కిరీటధారి ఐన సాయిబాబా మూర్తి కనిపిస్తుంది. విగ్రహం చుట్టూ జరీశాలువాలు ఖరీదైన పట్టువస్త్రాలు కప్పి ఉంటాయి. ఈ మూర్తికి సాయిబాబా ఫొటోల్లో కనిపించే తెల్లటి చిరుగుల కఫనీ, తలపాగతో కనిపించే సాయిబాబా రూపానికీ పోలికలేదు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ శైలాహట్టంగడి అనే రచయిత్రి తన "సాయి, ఫర్ ఈచ్, ఫర్ ఆల్, ఫర్ ఎవర్" అనే పుస్తకంలో 14వ పేజీలో - ఫొటోల్లో కనిపించేది సాయి నిజరూపమని, రత్న ఖచిత కిరీటధారి ఐన సాయి వైభవ రూపం - ఆయన భక్తులు తమ ఇష్టదైవాన్ని ఏవిధంగా చూడాలని కోరుకుంటున్నారో, అటువంటి ఊహా మూర్తి - అని చక్కటి వ్యాఖ్యానం చేశారు.

## మిగిలింది 7 రు. మాత్రమే

సాయిబాబాది పూర్తిగా విరాగి అయిన ఫకీరు జీవితం. ఆయన ఊరు, పేరు, పుట్టుపూర్వోత్తరాలు ఇదమిత్థంగా ఎవరికీ తెలీదు. 15-16 సంవత్సరాల వయసులో మొదటిసారిగా ఆయన షిర్డీలో కనిపించారు. తర్వాత షిర్డీనే స్థిరనివాసంగా చేసుకున్నారు. షిర్డీలో సాయిబాబా నివశించిన శిథిలమైన మసీదు గురించి ఆర్థర్ ఆస్‌బర్న్ ఇలా రాశారు: "సాయిబాబా గారు మొదట అక్కడ నివాసం ఏర్పరుచుకొన్నప్పటికి అదొక పాడుపడిన మట్టికొంప. ఎనిమిదడుగులు మాత్రం ఎత్తు పద్నాలుగడుగులు పొడుగూ ఉన్న గోడలు మూడు వైపుల ఉన్నాయి. తూర్పువైపు తెరిచి. *గాలీవానా చొరబడేవి. పైకప్పు సగం దిగబడింది. మిగతాది వంగిపోయి ఏ క్షణాన్నయినా కూలడానికి సిద్ధంగా ఉంది"* - మహామహిమాన్వితులు సాయిబాబా, పే.53.

ఆ మసీదును విడిచి వేరేచోట ఉండమని సాయిబాబాని ప్రార్థించినా ఫలితం లేకపోయే సరికి దాన్నే పునర్నిర్మించేందుకు భక్తులు పూనుకుంటే బాబా అంగీకరించేవారు కాదు. ఆ పని కోసం తెప్పించిన రాళ్ళను హైందవ దేవాలయాల పునరుద్ధరణకి వాడమనేవారు. తర్వాత కొంచెం మెత్తబడినా పనిలో కలగజేసుకుని కట్టింది కూలగొట్టడం, రాళ్ళని అటూ ఇటూ పడేసి పని పాడు చెయ్యడం చేసేవారు. ఆయన లేని సమయాల్లోనే పని సాగేది. ఒకోసారి శ్రమపడి పాతిన ఇనుప స్థంభాలను బాబా వచ్చి పీకేస్తే మర్నాడు అంతా కష్టపడి పాతాల్సి వచ్చేది. ఒకసారి బాబాకి కోపం వచ్చి ఒక చేత్తో స్తంభం మరో చేత్తో తాత్యా అనే భక్తుడి పీక పట్టుకున్నారు. తాత్యా తలపాగా లాగి దానికి

నిప్పంటించి విసిరేశారు. అందరికీ తిట్లూ, శాపాలు కురిపించి, చేతికి దొరికిన భాగోజీ శిండే అనే భక్తుడ్ని ఇష్టమొచ్చినట్లు గుద్దారు. మాధారావు అనే భక్తుడ్ని ఇటుకతో దెబ్బలు కొట్టారు. తర్వాత కాసేపటికి శాంతించి, జరీ అంచు తలపాగా తెప్పించి తానే స్వయంగా తాత్యా తలకి కట్టారు. ఇదంతా శ్రీ సాయి సచ్చరిత 6వ అధ్యాయంలో వివరంగా హేమాద్ పంత్ రాశారు. తనకి ప్రాముఖ్యతనిచ్చి, మామూలు సౌకర్యాలు కల్పించబోయినా బాబా ఇష్టపడేవారు కాదని, అయితే భక్తుల మీద ప్రేమతో చివరికి అంగీకరించేవారని దీన్ని బట్టి స్పష్టమౌతుంది.

బాబా ప్రతీ రోజూ ఆహారాన్ని భిక్షాటన ద్వారా సంపాదించుకునేవారు. అలా సంపాదించిన ఆహారాన్ని దాచుకోకుండా బయట మూతలేని మూకుడులో వదిలేసేవారు. ఆ మూకుడు నుంచి మసీదును శుభ్రం చేసిన మనిషిగానీ, చివరకు కుక్కలుగానీ కాకులుగానీ తినేసినా పట్టించుకునేవారు కారు. మట్టితో చేసిన చిలుంగొట్టంతో తాను చిలుం తాగుతూ ఇతరులకు కూడా అందించేవారు. హేమాద్ పంత్ శ్రీ సాయి సచ్చరితలో ఇలా రాశారు. "... ఒక చేతిలో టమరేలు (రేకుడబ్బా) రెండో చేతిలో జోలి పుచ్చుకుని ప్రతిరోజూ స్వయం, నియమంగా కొన్ని ఇళ్లకు వెళ్లేవారు. పప్పు పులుసూ, కూరలు, పాలు, మజ్జిగ, పలుచని పదార్థాలను టమరేలులో పోయించుకుని, అన్నం, రొట్టె జోలిలో వేయించుకునేవారు. జిహ్వకు చాపల్యం లేనప్పుడు, వేరు వేరు పదార్థాల రుచి తెలుసుకోవాలని కోరికెక్కడుంటుంది. వారి జిహ్వకు రుచే తెలియనట్లు, రుచిగా ఉన్నాయా లేదా అని చూసేవారు కాదు. ప్రతి దినం మధ్యాహ్నం భిక్షనడిగి జోలిలో పడ్డ వాటితోనే,



కడుపు నింపుకుని సంతృప్తి చెందేవారు. ఇదీ వారి భోజన పద్ధతి. ఒక నియమిత సమయంలో కాక, తమకు బుద్ధి పుట్టినప్పుడు, ఒక్కోసారి ఒకే రోజు 12 సార్లు గూడా భిక్షకు వెళ్లేవారు. ఈ విధంగా తెచ్చిన భిక్షాన్నాన్ని మశీదులోని, మట్టి కుండీలో ఉంచేవారు. దానిలో నుండి కాకులు, కుక్కలు స్వేచ్ఛగా తినేవి. వానినెప్పుడూ తరిమేవారు కాదు. మశీదు శుభ్రపరిచే స్త్రీ కూడా, పది పన్నెండు రొట్టెలను తనింటికి పట్టుకుని వెళ్లేది. కుక్కలను, పిల్లులను కలలో కూడా వారించని వారు, పేదలనెట్లా అడ్డగించగలరు? వారి జీవితం ధన్యమైంది. భిక్షనడిగి పొట్టనింపుకునే వారిని మొదట్లో ప్రజలు పిచ్చి ఫకీరని తలచేవారు..." - 8వ అధ్యాయం - పే.76, "వారు శిథిలమైన పురాతన మశీదులో శయనించేవారు. వారి దగ్గర చిలుము, పొగాకు, రేకు డబ్బా, సటకా ఎప్పుడూ ఉండేవి. శరీరానికి కఫని - తలకు తెల్లటి బట్టను చుట్టుకుని ఎడమ చెవి వద్ద జటాజూటంలా ముడి వేసేవారు. వారం రోజులైనా స్నానం చేసేవారు కాదు. వారి పాదాలకెప్పుడూ పాదరక్షలుండేవి కావు.

రచయిత్రి ఈ గ్రంథాన్ని పుట్టబాబాకి అంకితమివ్వడం ఒక విశేషం. ఈమె పుట్టబాబా భక్తురాలు. కొద్ది కొద్ది మినహాయింపులున్నా ఈమె గ్రంథం నిక్కచ్చిగా పుట్టబాబా క్యాంపు ప్రచారంతో విభేదించే సారాంశంతో రాసినదే. పుట్టబాబా భక్తబృందంలో ఎక్కడా మచ్చుకైనా కానరాని పరిశోధనాత్మకత డా॥ మేరియన్ వారెన్ రచనలో (కొన్ని మినహాయింపులతో) కనిపించి అలరిస్తుంది.

## సాయిబాబా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారా?

సాయిబాబా బాల్యం పుట్టుపూర్వోత్తరాలు, తొలినాళ్ళ జీవితం గురించి నిర్దుష్టంగా ఏమీ తెలియదు. ఉపాసనీ మహారాజ్ తమ్ముడైన బాలకృష్ణ ఉపాసనీ శాస్త్రిని బి.వి.నరసింహ స్వామి ఇంటర్వ్యూ చేసినపుడు - రాణీ ఝాన్సీ పాల్గొన్న యుద్ధంలో తానూ సైన్యంలో

ప్రత్యక్ష అవతార పురుషునిగా భావిస్తారు. వారి లీలలను, వారి అద్భుత శక్తిని చూచి, వారిని శ్రీకృష్ణావతారంగా కొలుస్తారు. కాని వారు మాత్రం తమపై స్వయంగా ఏ అధికారాన్ని ఆపాదించుకోరు. నేను పరమేశ్వరుని సేవకుణ్ణి. మా గురువు యొక్క ఆశీర్వాద బలం వలన, వారి కృపతో నేను భక్తుల కష్టాలను దూరం చేసి, వారికి శుభం, కల్గిస్తానని అనేవారు. భక్తులను ఆశీర్వదించే టప్పుడు తరుచు 'అల్లా భలా కరేగా' అని అనేవారు కాని తమను తాము గొప్పగా చెప్పుకునేవారు కాదు, వారెప్పుడూ 'యాదే హక్' అంటే నేను పరమేశ్వరుని స్మరించేవాణ్ణి అనేవారు కాని నేను 'అనల్ హక్' అంటే నేను పరమేశ్వరుణ్ణి అనేవారు కాదు."... శ్రీ సాయి సచ్చరిత 23వ అధ్యాయంలో (226వ పేజీలో) హేమాద్ పంత్ ఇలా రాశారు: "నేనే పరమేశ్వరుణ్ణని ఎప్పుడూ అనేవారు కారు. నేను పరమేశ్వరుణ్ణే ఎప్పుడూ స్మరించేవాణ్ణే 'యాదే హక్' వారి పాద దాసుణ్ణని అంటూ సదా అల్లాని స్మరిస్తుండేవారు." 14వ అధ్యాయంలో 137వ పేజీలో బాబా "ప్రపంచంలో ఒకరికి మరొకరు



షిరిడీలో సాయిబాబా నివసించిన ద్వారకామాయి (జీర్ణోద్ధరణ అనంతరం)

గోనెముక్కపైనే నిత్యం కూర్చునేవారు. తలగడగాని, పరుపుగాని వారెరుగరు. ఎప్పుడూ మేలుకునే ఉండేవారు. ధునివద్ద కూర్చుని చలికాచుకునే వారు..." - (5వ అధ్యాయం, పే.48)

ఎక్కిరాల భరద్వాజ "శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర" అనే గ్రంథంలో ఇలా రాశారు: "...శిథిలమైన మశీదే ఆయనకు రాజభవనము. ధునిలోని విభూతియే ఆయన యొక్క ధనం, చినిగి వున్న కఫ్నీయే చీనాంబరము. సట్కాయే రాజదండము. తలచుట్టూ రుమాలే వారికున్న రత్నకిరీటము. భిక్షగాళ్ళే వారి కొలువులోనివారు. ఆయన వద్ద ఎప్పుడూ వుండే ఇటుకరాయి. గోనెపట్టాలే వారికి దిండు, పట్టు పరుపులు. ఒక రేకు డబ్బా, కొద్ది మట్టికుండలే వారికి స్వర్ణపాత్రలు. మశీదు ముంగిటనున్న పెద్ద రాయియే వారి సింహాసనము..." - పే.193

"... ఒకసారి దీక్షిత్ ఆయనకొక మంచం తెస్తానన్నాడు. 'మహల్సావతిని క్రింద విడిచి నేను మంచం మీద ఎలా పడుకునేది? అతనిని దానిపై పడుకోమని నేను క్రింద పడుకోవచ్చు' అన్నారు బాబా. అతడు వారిద్దరికీ చెక్కపలకలు ఇస్తానన్నాడు. కానీ బాబా అంగీకరించలేదు. వారికి దోమల బాధ నివారించాలని దోమతెర కడదామంటే ఆయన ఒప్పుకోలేదు. ఒకసారి పట్టుదలగా కడితే ఆయన కోపంతో దానిని పీకి అవతల పారేశారు. అలానే తీవ్రమైన వేసవిలో ఆయనకు చల్లదనమివ్వాలని భక్తులు, మశీదు ముంగిలి నీటితో తడిపేవారు. కానీ సాయి ధునిలో ఎక్కువ కట్టెలు వేసి, వేడిమి పెంచి దాని దగ్గర కూర్చునేవారు..." - పే.194.

శ్రీసాయి సచ్చరిత ఉపోద్ఘాతంలో హరి సీతారాం దీక్షిత్ ఇలా రాశారు: "...నానా సాహెబు డేంగలె, సాయి మహారాజు శయనించడానికని ఒక చెక్క పలకను తెచ్చి వారికిచ్చాడు. వారు దానిని భూమిపై వేసుకోకుండా, పాత చినిగిపోయిన గుడ్డ పీలికలతో మశీదు పైకప్పుకు వ్రేలాడకట్టి శయనించేవారు. ఆ గుడ్డ పీలికలు అసలు చెక్క బరువునే మోయలేనట్లుంటే బాబా బరువునెట్లా మోస్తాయా అని అందరికీ పరమ ఆశ్చర్యంగా ఉండేది. సాయిబాబా శయనించేటప్పుడు ఆ పలకపై నాలుగువైపులా నాలుగు ప్రమిదలు వెలుగుతుండేవి. ఆ విధంగా వారు చెక్కపలకపైన శయనించటాన్ని జనం నిలబడి కౌతుకంగా చూచేవారు. కాని సాయి మహారాజు ఆ చెక్క పలకపైకి ఎక్కేటప్పుడు గాని క్రిందకు దిగేటప్పుడు గాని ఎవరూ చూడలేదు. దానిని గమనించాలని అనేక మంది నిగా వేసుకుని కాచుకుని ఉండేవారు. కాని ఎవరూ చూడలేకపోయారు. ఈ విచిత్రాన్ని చూడటానికి జనం మూగిపోవటం గమనించి సాయిబాబా ఆ చెక్కపలకను ముక్కలు చేసేశారు..."

కుష్టు రోగులనైనా ఆయన చీదరించుకోకుండా చేరదీశేవారు. మానసిక పరిశుద్ధత లేదని తాను భావించే వ్యక్తుల పట్ల (వారెంతటి వారైనా) బాబా ఉగ్రులయ్యేవారు. "...కుష్టురోగైన భాగోజీని అనుగ్రహించడానికి అతనిచే సేవ చేయించుకునేవారు. భాగోజీ యొక్క భాగ్యవిశేషం బాబా యొక్క సాన్నిధ్య సౌఖ్యం లభించింది బాబా లెండీ తోటకు షికారుకు వెళ్ళేటప్పుడు, వారికి భాగోజీయే గొడుగు పట్టేవాడు. చీమురక్తంతో శరీరం నిండి ఉన్నా అతడు బాబా యొక్క ప్రథమ సేవకుడు. ప్రతిరోజూ ప్రాతఃకాలమందు, బాబా ధుని వద్ద స్తంభం దగ్గర కూర్చుని విశ్రాంతి తీసుకునే వేళ, భాగోజీ అక్కడ హాజరై వారి చేతికట్టు విప్పి అక్కడి నరాలను నేతితో మర్దించి సేవ చేసేవాడు. అతడు పూర్వజన్మ పాపం వల్ల మహారోగి. అతని అవయవాలన్నీ కుష్టురోగపు దుర్గంధంతో చూచేవారికెంతో అసహ్యాన్ని కల్గించుచుండేవి. మహాపాపిష్టి అయినా అతడు బాబా యొక్క భక్తశ్రేష్ఠుడు. బాబా యొక్క సేవాభాగ్యం అట్టి దౌర్భాగ్యుని క్కూడా లభించింది..." - శ్రీసాయి సచ్చరిత, 7వ అధ్యాయం, పే.66.

ఒక సందర్భంలో కుష్టురోగి ఐన భక్తుడి దగ్గరున్న మురికి పట్టిన బట్టల మూటలో తెచ్చిన మిఠాయిలు తీసి సౌందర్యవతి ఐన భక్తురాలికిచ్చి తినమన్నారు బాబా.

భక్తుల మీద అనుగ్రహంతో ప్రేమ ఎలా కురిపించేవారో, అపుడపుడూ ఆగ్రహంతో తిట్లూ, తన్నులు, గుద్దులు కూడా కురిపించేవారు.

బాబా కఫ్నీ గురించి ఎక్కిరాల భరద్వాజగారు ఇలా రాశారు: "...ఆ కఫ్నీ తలకట్టూ కూడా కొన్ని నెలల దాకా మార్చేవారు కాదు. అవి మార్చదలచినప్పుడు కాశీనాధుడనే దర్జీవాణ్ణి పిలిచి, కొత్తది తెమ్మనేవారు. అతడు తీసుకురాగానే అది ధరించి, పాతది ధునిలో పారేసి నమస్కరించేవారు. ఒక్కొక్కప్పుడు తమతోపాటు మరికొందరు భక్తులకు కూడా కఫ్నీలు ఇచ్చేవారు. ఆయన కఫ్నీ మార్చడం మరీ ఆలస్యమై పాతది చిరిగిపోయేది. అప్పుడు తాత్యా ఆయన దగ్గర జేరి, దానిని చూచే మిషమీద ఆ చిరుగుల నింకా పెద్దవి చేసేవాడు. అయినా ఆయన క్రొత్తది వేసుకునే బదులు మధ్యాహ్నం ఒంటరిగా వున్నప్పుడు ఒక ముల్లును సూదిగా చేసుకుని, ఆ చిరుగులన్నింటికీ మాసికలు వేసుకునేవారు..." - శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర, పే.187

సాయిబాబా ఎవరిమీదా ఆధారపడకుండా తన పని తాను చేసుకునేవారని శ్రీసాయి సచ్చరితలో హేమాద్ పంత్ రాశారు. "... ఏదైనా స్వయంగా చేయాలని ఎంతో ఉత్సాహాన్ని కనబరిచేవారు కనుకనే ఎవరి సహాయం లేకుండానే స్వయంగా వండి పెట్టేవారు. వంట మాత్రమే కాదు కట్టెలు పెట్టే గది యొక్క ముందు గోడ, మూడు వంతులు బాబా తన స్వహస్తాలతో తయారు చేసిందే. మన్ను బాగా తడిపి ఇస్తే బాబా తాపి చేతపుచ్చుకుని ఇటుకల వరుసలతో గోడను కట్టేవారు. ఇంకా ఎన్నెన్నో పనులు చేసేవారు. మశీదును తాము స్వయంగా అలికేవారు. తమ కఫనీని లుంగీని స్వయంగా కుట్టుకునేవారు. ఎవరి సహాయాన్ని ఆశించేవారు కాదు" - 38వ అధ్యాయం, పే.389



సాయిబాబా చాలా సందర్భాల్లో దక్షిణ ఇమ్మని భక్తుల్ని అడిగేవారు. ఒక్కోసారి కచ్చితంగా ఇంత మొత్తం ఇమ్మని అడిగి తీసుకునేవారు. అయినా ఆయనకి డబ్బంటే బొత్తిగా లక్ష్యం లేదని భక్తులందరికీ తెలుసు. చాలాసార్లు ఆయన డబ్బులు అడగడం వెనుక భక్తుడికి ప్రతీకాత్మకంగా ఏదో ఉపదేశం గానీ, పరీక్ష గానీ ఉందని భక్తులు భావించేవారు.

ఒక సందర్భంలో ఒక వ్యక్తి ఆయనకి 500 ఇవ్వబోతే "నీ డబ్బు నాకక్కర్లేదు. ఇంట్లో ఉంచుకున్నావుగా ఆవిడకియ్యి" అని అరిచారు. ఒక్కోసారి భక్తుడి దగ్గర డబ్బు అంతా తీసుకున్నాక కూడా ఆయన ఇంకా కావాలని అడిగి ఆ భక్తుణ్ణి అప్పుకోసం ఊరంతా తిరిగేలా చేసేవారు. ఒకసారి ఇద్దరు భక్తులు వచ్చినపుడు బాబా ఒకాయన దగ్గిర రు.15 అడిగి తీసుకున్నారు,రెండో ఆయన అడక్కుండానే రు.35 ఇవ్వబోతే తిరస్కరించారు.

ఈ విధంగా తన విచిత్ర ప్రవర్తనతో అందర్నీ తికమక పెట్టేవారు. ఎంత డబ్బు తీసుకున్నా తన దగ్గర ఉంచుకునేవారు కాదు. రోజు ముగిసేసరికి ఆయన దగ్గిర ఏమీ ఉండేది కాదు. పేద భక్తుల్ని ఆదుకునేవారు, అన్నం పెట్టేవారు. ధారాళంగా డబ్బు తీసి ఇచ్చేసేవారు. ఏదైనా కొనేటప్పుడు ఒకోసారి గీసిగీసి బేరాలాడేవారు. ఒకోసారి కొన్న వస్తువు అమ్మేవాడికే దానం ఇచ్చి వెళ్ళిపోయేవారు.

ఒక దశలో ఆయన దగ్గిరకి డబ్బు, భక్తులు ప్రవాహంలా రావడం మొదలైంది, ఆయన ఆదాయం భారతదేశపు వైస్‌రాయ్ ఆదాయం కంటే ఎక్కువ ఉండేది. ప్రభుత్వం ఆయనపై ఆదాయపు పన్ను విధించాలని అనుకుంది. కానీ సాయంత్రానికి కాణీ కూడా మిగుల్చుకోని ఫకీరుపైన పన్ను వేయడం ఎలా సాధ్యం? చివరికి ప్రభుత్వం సాయిబాబా నుంచి దానం పుచ్చుకునే భక్తులు కొందరి మీద ఆదాయం పన్ను విధించింది. అంత ఆదాయం వస్తున్నా సాయిబాబా విలాసాలకు లోనుకాలేదు, ఆస్తుల్ని కూడబెట్టుకోలేదు, సంస్థల్ని స్థాపించలేదు, భవనాలు కట్టలేదు. చనిపోయే నాడు ఆయన దగ్గిరున్న డబ్బు కేవలం 7 రూపాయలు - అది ఆయన అంత్యక్రియలకి వెచ్చించడానికి సరిపడినంత మాత్రమే.

## నేను ఇప్పుడు వెళ్ళి బిచ్చమెత్తుకోవాలి

డబ్బు, అధికారం, దర్పం ఉన్నవారు తన శిష్యులు, భక్తులు అయ్యి తనని ఆశ్రయించడానికి వస్తే బాబా పొంగిపోయి వాళ్ళకి మర్యాదలు చేసేవారు కాదు, నిర్లక్ష్యం ప్రదర్శించేవారు. ఆయన సన్నిధిలో చక్రవర్తికీ ముష్టివాడికీ ఒకే రకమైన మర్యాద ఉండేది.

బ్రిటిష్ ప్రభుత్వంలో జిల్లా రెవెన్యూ కమిషనర్‌గా ఉన్న దొరగారికి చాలాకాలం సంతానం కలగలేదు. ఆయన భార్య బాబా మహిమల గురించి విని ఆయన్ని దర్శించి ఆశీర్వాదం తీసుకుంటే ఫలితం ఉండవచ్చుని భావించింది.

ఆ దొరసాని, ఆమె భర్తతో పాటు జిల్లా కలెక్టర్‌ని మందిమార్బలాన్ని వెంట తీసుకుని ఆర్భాటంగా సాయిబాబా దర్శనం కోసం వచ్చారు. వాళ్ళు వచ్చే ముందే వారి రాక బాబాకి ముందే తెలుసన్నట్టుగా ఆయన "ఆ దుర్మార్గుడు దేనికోసం వస్తున్నాడు నా దగ్గిరకి? నా దగ్గరేముంది? అందరిలాగే నేనూ అన్ని అవయవాలు ఉన్న దిగంబర ఫకీరుని" అని కేకలు వేశారు.

దొరల పటాలమంతా మశీదుకి వెళ్ళి అక్కడి వాతావరణానికి కొద్దిగా ఇబ్బందిపడి - తాము సాయిబాబా దర్శనం కోసం వచ్చాం కాబట్టి, బాబాని తొందరగా పనులు ముగించుకుని దర్శనం ఇమ్మని - భక్తుల ద్వారా కబురు పెట్టే ప్రయత్నం చేశారు. బాబాకి ఆదేశాలు ఇవ్వడం ఎవ్వరికీ వీలుకాదని భక్తులు చెప్పడంతో బాబా దర్శనం ఇచ్చేదాకా దొరలు వేచి ఉండాల్సి వచ్చింది.

"బాబా, మీతో కాస్త మాట్లాడాలి" అని దొరసాని తలవంచి మర్యాదగా అడిగితే, "మీరు ఒక అర్ధగంట ఆగాలి,నేను ఇప్పుడు బయటకి వెళ్ళి బిచ్చమెత్తుకోవాలి" అని బాబా ఛెళ్ళుమని సమాధానం ఇచ్చారు.

పది నిమిషాల్లో భిక్షాటన ముగించుకుని బాబా తిరిగి వచ్చాక దొరసాని మళ్ళీ అడిగితే మళ్ళీ ఇంకో గంట వేచి ఉండమని బాబా చెప్పారు.

తమ పట్ల ఫకీరు చాలా అమర్యాదకరంగా వ్యవహరించాడని భావించి దొరలు వెళ్ళిపోయారు. ఆ దొరసాని సంతాన హీనురాలిగానే ఉండిపోయారు. ఈ ఉదంతం ఆర్థర్ ఆస్బర్న్ రాసిన "మహా మహిమాన్వితులు సాయిబాబా" గ్రంథంతో పాటు అనేక ఇతర సాయిసాహిత్య గ్రంథాలలో విరివిగా చోటు చేసుకుంది.

## పూజించమనలేదు

సాయిబాబా తాను దేవుడని చెప్పుకోలేదనే సంగతి చూశాం. సాయిబాబా తనని పూజించమని ఎవరికీ చెప్పలేదు, పైగా పూజ పట్ల మొదట్లో తీవ్ర అయిష్టతతో ప్రతిఘటించేవారు. క్రమంగా భక్తుల వత్తిడికి తల ఒగ్గి ఆయన పూజకి ఒప్పుకున్నారు.

శ్రీసాయి సచ్చరిత ఉపోద్ఘాతంలో హరి సీతారాం దీక్షిత్ ఇలా రాశారు: "...సాయి మహారాజు మొదట్లో తమకు పూజను చేయనిచ్చేవారు కాదు. ప్రథమ పూజను మహల్సావతి ద్వారా స్వీకరించారు. తర్వాత కొంతకాలానికి సాయి మహారాజు నిమ్‌గాంలోని సీతారాంజి డేంగలె, వారి పూజ చేయడానికి వచ్చాడు. మొదట సాయి అతనిపై కోపగించారు కాని చివరికి పూజను స్వీకరించారు... సాయిబాబా తమకు హారతినివ్వనిచ్చే వారు కాదు. కొంత కాలానికి ప్రథమంగా వారికి హారతినిచ్చే గౌరవం (లక్ష్మణ కృష్ణాజీ) తాత్యా సాహెబు నూల్కరుకు దక్కింది..."

డా॥ మారియన్ వారెన్ మరో ఆసక్తికరమైన సంగతి రాశారు:

*"Hari Vinayak Sathe told Narasimhaswami in his interview in 1936, that on one occasion he had asked Sai Baba if he could do puja to him as Mahadeva or Shiva on Shiva ratri night, but Baba refused permission. Nevertheless, he and Megha took some bilva leaves to the steps of the mosque at midnight and started to do a silent puja with sandalpaste. But Sai Baba awoke from sleep and was exceedingly angry, hurling wild abuse which roused the whole village."* - Shiridi Saibaba in the light of Sufism, Page 30.

("...హరి వినాయక సాథే 1936లో నరసింహస్వామికి ఇంటర్వ్యూ ఇచ్చారు. శివరాత్రి రోజు మహాదేవుడిగా లేదా శివుడిగా ఆయనని సంభావిస్తూ పూజించవచ్చా - అని తాను స్వయంగా బాబానే ప్రశ్నించిన సంగతి గురించి - సాథే ఆ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. అయితే బాబా అనుమతి నిరాకరించారు. ఐనప్పటికీ, సాథే, మేఘ కలిసి కొన్ని బిల్వపత్రాలు సేకరించి మశీదు మెట్ల దాకా తెచ్చి గంధం పూసి బాబాకి నిశ్శబ్దంగా పూజ చేయడం మొదలుపెట్టారు. కానీ సాయిబాబా నిద్ర నుంచి లేచి పట్టరాని కోపంతో ఉగ్రరూపం దాల్చారు. ఆయన అరుపులకీ తిట్లకీ మొత్తం గ్రామమంతా నిద్రలేచింది..." - షిర్డీ సాయిబాబా ఇన్ ది లైట్ ఆఫ్ సూఫీజం, పేజీ 30.)

చివరి రోజుల్లో అట్టహాసంగా రాజలాంఛనాలతో జరిగే వార్షికోత్సవాల్లో ఆడంబరం సాయిబాబాకి బొత్తిగా నచ్చేది కాదని, కానీ అనుచరుల ఒత్తిడి మేరకే ఒప్పుకునేవారని ఆర్థర్ ఆస్‌బర్న్ రాశారు.

అయితే తనకి నచ్చకపోయినా పూజ చేసే తన భక్తుల్ని ఎవరైనా విమర్శిస్తే బాబా ఏదో విధంగా సర్ది చెప్పేవారు. ఒక ముస్లిం భక్తుడు బాబా వల్ల ఇస్లాం మతానికి హాని ఏర్పడిందని భావించి వెనుక నించి దుడ్డు కర్రతో బాబా తలపైన కొట్టబోయాడు. బాబా చటుక్కున వెనక్కితిరిగి ఆ భక్తుడి చేయి పట్టుకున్నారు. బాబా చూపుల తీక్ష్ణతకి ఆ భక్తుడు నేల మీద కూలబడ్డాడు. సాయిబాబా పూజకి ఇబ్బంది పడిన మరో ముస్లిం భక్తుడిని సముదాయిస్తూ, అవసరమైతే తన గొంతు కొయ్యమని చెప్పిన ఘట్టాన్ని ఆర్థర్ ఆస్‌బర్న్ తన పుస్తకంలో హృద్యంగా వర్ణించారు.

"...మీర్ జమాన్ అనే ముస్లిం అనుచరుడు రాత్రివేళ హఠాత్తుగా లేచి కత్తి దూసి, హిందువులు సాయిబాబాను పూజిస్తూ చెడగొడుతున్నారని ప్రకటించి వాళ్ళ గొంతుకలు కొయ్యడానికి అనుమతి ఇమ్మని అడిగాడు. సాయిబాబాగారు అతనికి ఇలా చెప్పి శాంతపరిచారు: పిచ్చివాణ్ణి నేను! వాళ్ళు నన్ను పూజించడానికి కారకుణ్ణి నేను! కనక, నువ్వు ఎవరి గొంతుకలయినా కొయ్యదలిస్తే నాతోనే మొదలు పెట్టాలి..." - మహిమాన్వితులు సాయిబాబా, పే.51.

అయితే డా॥మారియన్ వారెన్ ఇలా అంటారు:

*"... While Sai Baba lived in Shirdi for six decades as a Sufi faqir, it was only during his last eight years that Hindu devotees were attracted to Shirdi. It was only in his final two or three years that he allowed any Hindu ritualistic practices to be performed in his honour, and then only to please the devotees..."* - Shirdi Sai Baba in the light of Sufism, Page 381.

("... సాయిబాబా షిర్డీలో 6 దశాబ్దాలు సూఫీ ఫకీర్‌గా జీవించారు. అయితే కేవలం ఆఖరి 8 సంవత్సరాల్లోనే హిందూ భక్తులు షిర్డీకి ఆకర్షించబడ్డారు. అందులోకేవలం ఆఖరి 2 లేదా 3 సంవత్సరాల్లోనే బాబా తన గౌరవార్థం హిందూ పూజ కర్మకాండ జరపడాన్ని అనుమతించారు, అదీ తన భక్తుల్ని సంతోషపెట్టేందుకే..." - షిర్డీ సాయిబాబా ఇన్ ది లైట్ ఆఫ్ సూఫీజం, పేజీ 381)

అయితే తన చివరి దశలోని ఈ అతి స్వల్పకాలంలో

జరిగిన సంఘటనలు బాబా మొత్తం జీవితాన్ని, దృక్పథాన్ని అర్థం చేసుకోవడంలో, అంచనా వేయడంలో - బాబా జీవిత చరిత్రకారులపైన తీవ్రమైన ప్రభావాన్ని చూపాయని డా॥ మేరియన్ వారెన్ అభిప్రాయపడ్డారు.

పండిత్ అనే బ్రాహ్మణుడు ఓసారి బాబా నుదుట త్రిపుండ్ర రేఖలు దిద్దాడు. అందరూ బాబా ఆగ్రహిస్తారేమోనని అనుకున్నారు. బాబా ప్రసన్నులుగానే ఉన్నారు. ఇందుకు బాబా భక్తుల అశాంతి, బాబా ఇచ్చిన వివరణ హేమాద్ పంత్ తన "శ్రీ సాయి సచ్చరిత"లో రికార్డు చేశారు. "దాదా మనసులో అశాంతి చెలరేగింది. ఆ రోజు సాయంకాలం "బాబా, మేము మీ నుదుట చందన తిలకం దిద్దాలని ఉత్సాహపడితే తాకనివ్వరు కదా మరి ఉదయం, పండిత్ మీ నుదుట తిలకం దిద్దితే వారించలేదు, మా తిలకం మీకు కష్టంగా ఉంటుంది. పండిత్ దిద్దితే ఇష్టంగా ఉంది కారణమేమని" అడిగారు. బాబా సస్మిత వదనుడై "దాదా, అతని గురువు బ్రాహ్మణుడు. "ఇతడు మహమ్మదీయుడు, నేను గొప్ప పవిత్ర బ్రాహ్మణుణ్ణి ఈ అపవిత్ర మహమ్మదీయుని ఎట్లా పూజించాలని శంకించకుండా తన గురువును పూజించినట్లే పూజ చేసి నన్ను తన అధీనం చేసుకున్నాడు. అందువలన నేను అడ్డు పెట్టలేక పోయాన"ని చెప్పారు" - 11వ అధ్యాయం, పే.102. ఈ సంఘటన బాబా తన భక్తుల దృష్టికోణానికి ఎంత విలువ ఇచ్చేవారో పట్టి ఇస్తుంది.

భక్తులు బాబా సేవ చేయడం సరే, బాబా భక్తుల సేవలు చేస్తూ నేనూ నీ లాంటి వాడినే'అని ఎంత ఉదాత్త వ్యక్తిత్వాన్ని కనపరిచారో ఎక్కిరాల భరద్వాజ రాశారు.

"... మశీదులో ఆ ఇద్దరే వున్నప్పుడు బాబా, మహల్సాపతి కాళ్ళు పిసికి, అతడు వారిస్తే, "ఫర్వాలేదులే, మనిద్దరమొక్కటే! అందరూ నన్ను గొప్పవాడనుకుంటారు గాని, అది నిజంగాదు. నేనూ నీలాంటివాడినే!" అనేవారు. తాత్యాగూడ యిలా చెప్పాడు: "ఒకనాడు బాబా అకస్మాత్తుగా నా పాదాలు తాకారు. నాకెంతో బాధన్పించి, 'మీరిలా చేయవచ్చా?' అన్నాను. 'హోర్మయ్, నీకేం తెలును?' అని చేతులు విడిపించుకొని మరలా నా పాదాలు తాకి నమస్కరించి, 'జయదేవా, జయదేవా!' అన్నారు..." - శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర, పే.195.

## ఉపవాసం వల్ల ఉపయోగం లేదు

అర్థంలేని చాదస్తాలకీ, మూఢనమ్మకాలకీ బాబా అంత ప్రాధాన్యం ఇచ్చేవారు కాదనే సంగతి దురదృష్టవశాత్తూ ఎక్కువ ప్రచారం పొందలేదు.

బాబా ఉపవాసానికి ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వలేదు. "...బాబా తామెప్పుడూ ఉపవాసం చేసేవారు కాదు. ఎవరినీ చేయనిచ్చేవారు కాదు. ఉపవాసమున్న వారి మనసు స్థిరంగా ఉండదు. వారు పరమార్థాన్ని ఎలా సాధించగలరు? కడుపు ఖాళీగా ఉంటే దేముడు లభించడు... పొట్టలో అన్నం తడి లేకపోతే ఏ కళ్ళతో దేవుణ్ణి చూడగలం? ఏ చెవులతో దేవుని గురించి వినగలం? ఏ వాక్కుతో దేవుని మహిమను వర్ణించగలం? ...అతి భోజనం మంచిది కాదు. మిత భోజనమే నిజంగా సుఖమైనది. ఉపవాసం అత్యంత భయంకరం...బాబా యొక్క నిత్యక్రమానుసారం, పరమార్థ విచారానికి, ముందుగా అన్నం మూట కట్టుకోవాలి...భగవంతుని ప్రసన్నం చేసుకోదలచిన వారు ముందు అన్నం తినాలి. ప్రాణం తృప్తిగా ఉండకపోతే భగవంతునెలా ఆరాధించ గలరు? ఆకలితో పొట్ట మండుతుంటే భగవంతుడు లభించటం కల్పాంతంలో కూడా సంభవించదు. సాయి వద్ద ఉపవాసాలు తపవాసాలు అనే కష్టాలుండవు.

అంతరంగ సాక్షి ఐన సాయికి అంతా ముందే తెలుసు. దాదా కేల్కరుతో మాట్లాడుతూ, 'ఈ పండుగ రోజులలో నా పిల్లలు ఉపవాసముంటారా? నేను వారినెట్లా ఉండనిస్తాను? నేనిక్కడ ఎందుకున్నానని అన్నారు..." - శ్రీ సాయి సచ్చరిత, 32వ అధ్యాయం, పే. 321, 322.

బాబా ఆజ్ఞ మీద ఒక భక్తురాలు ఉపవాసం మానేసి, బొబ్బట్లు చేసి తిన్న సంఘటన శ్రీసాయి సచ్చరితలో ఇదే అధ్యాయంలో వివరంగా ఉంది.

"సాయిబాబా గారు, ఉల్లిపాయలు తినకపోవడం లాంటి అతి చాదస్తాలను అంగీకరించేవారు కాదు" అని ఆర్థర్ ఆస్‌బర్న్ తన "మహిమాన్వితులు సాయిబాబా" (28వ పేజీ)లో రాశారు.

సాయిబాబా స్వయంగా మాంసాహారాన్ని వండి, అందరికీ స్వయంగా ఎలా పెట్టేవారో శ్రీసాయి సచ్చరిత వర్ణించింది.

"... బాబా మశీదు ప్రాంగణంలో పెద్ద పొయ్యి పైన వెడల్పయిన పాత్రను పెట్టేవారు. అందులో సమంగా నీరు పోసి ఒకప్పుడు పరమాన్నం మరొకప్పుడు మాంసంతో పులావ్‌ను వండేవారు. ఒక్కోసారి సూకల పిండిలోనో లేక జొన్న పిండితోనో ముక్కలుగానో, బిళ్లలుగానో చేసి వానిని పప్పుచారులో ఉడికించేవారు. వాటితో పాటు బండపైన మసాలాను కూడా నూరి పప్పులో వేసేవారు. స్వహస్తాలతో వడలను చేసి మెల్లగా పాత్రలో వేసేవారు. బాబా స్వయంగా తామే, వంటనేవిధంగా చేయాలో అట్లే చేసేవారు. స్వర్గాది భువనాలవాశించి, పశుహింస చేసి యజ్ఞాలను చేస్తారు. ఆ పురోడాశాన్ని బ్రాహ్మణులు కూడా సేవిస్తారు. ఈ పశుహింస శాస్త్ర సమ్మతమైనదని అంటారు. అట్లే బాబా కూడా,ముల్లాను ఆజ్ఞాపించి, శాస్త్రోక్త మంత్రోచ్చారణతో, విధి విధాన పురస్సరంగా, మేకను కోయించే వారు... బాబా స్వయంగా వెళ్లి అప్పుగా కాకుండా అప్పటికప్పుడు వారికి డబ్బిచ్చి, ఉప్పు, మిరపకాయలు, మిరియాలు జీలకర్ర, కొబ్బరి కూరగాయలవీ బేరం చేసి తెచ్చేవారు. మశీదులో కూర్చుని, తమ చేతులతో విసుర్రాయిలో, గోధుమలు, జొన్నలు పప్పు మొదలగు వానిని స్వయంగా విసిరేవారు. వంట చేయడంలో బాబా చాలా శ్రమ పడేవారు. పొయ్యిలోని కట్టెలను కూడా మాటి, మాటికి క్రిందకూ పైకి ఎగతోస్తూ మంట పెట్టేవారు. పప్పు



నానవేసి స్వయంగా రాతి మీద నూరి వడలు చేసి, వానిని మెల్లగా పాత్రలో వేసి అవి మాడిపోకుండా కలిపేవారు. ఇంగువ జీలకర్ర కొత్తిమీర మొదలగు వానిని వేసి ఘుమ ఘుమలాడే వంటకాలను తయారు చేసేవారు. పెద్దపెద్ద రొట్టెలను కూడా చేసేవారు. జొన్న పిండితో అంబలి తయారు చేసి దానిలో మజ్జిగను కలిపి, అందరికీ అన్నంతో పాటు వడ్డించేవారు. వంటంతా అయిపోయిన తర్వాత, వంటపాత్రను పొయ్యిపై నుండి దించి మశీదు లోనికి తీసుకుని వెళ్ళి విధి పూర్వకంగా మౌల్వీచే నైవేద్యాన్ని పెట్టించి, మొదట మహల్సాపతికి, తాత్యాకు ప్రసాదాన్ని పంపేవారు. మిగతా అన్నాన్నంతా బాబా తమ స్వహస్తాలతో పేదలకు, దీనులకు దుర్బలులకు తినండి తినండి అని మరల మరల ప్రీతిగా అడిగి, తృప్తిగా పెట్టేవారు. బాబా స్వయంగా వండి వడ్డించిన అన్నాన్ని తృప్తిగా భోజనం చేసిన వారెంత ధన్యులు, ఎంత భాగ్యవంతులు, ఎంత పుణ్యం చేసుకున్నవారు? బాబా మాంసమున్న అన్నాన్ని ప్రసాదమని అందరికీ పంచేవారా అని సంశయం కలగడం సహజం. ఎవరు మాంసాహారులో వారికి మాత్రమే ఆ అన్నాన్ని వడ్డించేవారు. ఎన్నడూ మాంసాహారమెరుగని వారిని అసలు తాకనిచ్చే వారు కూడాకాదు."- శ్రీ సాయి సచ్చరిత, 38వ అధ్యాయం, పే.386, 387, 388.

ఇందులో శాకాహార, మాంసాహార భక్తుల సెంటిమెంట్లకు ఇబ్బంది కలగకుండా అందరితో బాబా ప్రేమగా నమిష్టిగా ఎలా మసలుకునేవారో తెలుస్తోంది.

పై ఉదాహరణలో బాబా ఇస్లాం మత పద్ధతిని తు.చ. తప్పకుండా పాటిస్తూ మౌల్వీని పిలిచి శాస్త్రోక్తంగా మాంసాహారాన్ని తయారు చేసినట్టు కనిపిస్తుంది. అంత మాత్రాన ఆయన ఇస్లాం సాంప్రదాయాలను తు.చ. తప్పకుండా పాటించే ముస్లింగా కూడా పరిగణించడం కష్టం. రంజాన్ నెల ఉపవాసాలను ఆయన పాటించకపోయి ఉండొచ్చని ఊహించడం సులభమే. వేళ కాని వేళల్లో సాంప్రదాయ విరుద్ధమైన పద్ధతుల్లో ఆయన నమాజు చేసేవారు. "... దేవుడికి ఇస్లాం మత పరమయిన పేరే వాడేవారు. ఆయన జపిస్తుండగా వినిపించే మంత్రాలు ఇస్లాం మత పరమయినవే కాని హిందువులవి కావు. అయినప్పటికీ ఆయన నమాజు చేయడం చాలా అరుదు. కొందరైతే ఆయన నమాజు చేస్తుండగా చూడలేదు. ఆయన అప్పుడప్పుడు శనివారాల్లో కాని కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కాని నమాజు చేసేవారని కొందరంటారు. శనివారాల్లో ఎందుకు అన్నది సాయిబాబా గారిని గురించిన చిక్కు ప్రశ్న. ఎందుకంటే ముస్లిములు సామూహిక ప్రార్థనలు చేసే రోజు శుక్రవారం..." - మహా మహిమాన్వితులు సాయిబాబా, పే.47.

సాయిబాబా సాముద్రికం పట్ల ఆసక్తి చూపలేదని శ్రీ సాయి సచ్చరిత 12వ అధ్యాయం చెపుతోంది. సూతకంలో ఉన్న ఒక భక్తుడు పేడా సమర్పిస్తే బాబా స్వీకరించిన ఘట్టం శ్రీసాయి సచ్చరిత 9వ అధ్యాయంలో వస్తుంది.

మంత్రం కావాలని పట్టుబట్టి 3 రోజులు ఉపవాస దీక్షలో కూర్చున్న భక్తురాలికి బాబా బోధ చేసిన శ్రీ సాయి సచ్చరిత, 19వ అధ్యాయంలోని ఉదంతం-చాలా అపురూపమైనది. "అమ్మా నీ ప్రాణానికింత ముప్పు తెచ్చుకున్నావెందుకు? నేనొక అడుక్కునే ఫకీరును. నేను నిజంగా నీ బిడ్డను. నువ్వు నా తల్లివి. నీకు నాపై అనురాగముండాలి. నీకు పరమ సుఖాన్ని కలిగించే ఒక విషయాన్ని చెప్తుతాను శ్రద్ధగా విను" - అంటూ బాబా, భక్తులు కరిగి నీరై ప్రవహించేంత ప్రేమతో తన బోధను ప్రారంభిస్తారు. "నా గురువు. ఒక గొప్ప అవలియాదయా సముద్రుడు. వారి సేవ చేసి చేసి అలసిపోయినా, నాకే మంత్రాన్నీ ఇవ్వలేదు. నాక్కూడా ప్రబలమైన ఇచ్ఛ ఉండేది. వారి నుండి మంత్రోపదేశం తీసుకోవాలని, వారినెప్పుడూ విడవకూడదని, ఎంతో ప్రయాసపడ్డాను. కానీ వారు ముందు నన్ను గుండు చేసి రెండు పైసలడి గారు. వెంటనే నేను వారికవి ఇచ్చేశాను. మా గురువు ఏ కోరికలూ లేని పూర్ణకాములు. అట్టి వారికి రెండు పైసలెందుకు? శిష్యులను డబ్బులడిగే వారు నిష్కాములెట్లా అవుతారని శంకించకు, వారికి వ్యావహారిక పైసలు అవసరం లేదు. వారికి డబ్బుతో ఏంపని? వారడిగిన రెండు పైసలూ నిష్ఠా మరియు సహనం, మరి వేరే ఏం కావు. నేనవి అప్పుడే వారికిచ్చే శాను. వారెంతో ప్రసన్నులయ్యారు. ఈ సహనమే ధైర్యాన్నిస్తుంది. దీన్నెప్పుడూ వదిలిపెట్టకు" - అని సూటిగా మంత్రతంత్రాల నిష్ప్రయోజకత్వాన్ని హృదయానికి హత్తుకునేలా ఉపదేశిస్తారు. "మా గురువు నా చెవిలో ఏమీ ఊదలేదు. నీకు నేనెలా ఊదగలను?" అని స్పష్టం చేస్తారు. "మంత్రాలు, ఉపదేశాలు వ్యర్థం. అంచేతనువ్వెళ్ళి అన్నం తిను. నీ ప్రాణాన్ని అపాయంలో పడవేసుకోకు" అని తేల్చి చెపుతారు. శ్రీసాయి సచ్చరిత 19వ అధ్యాయంలో రెండు పేజీలకుపైగా సాగిన ఈ బోధ - ఆ ప్రేమమూర్తి కమనీయ వ్యక్తిత్వాన్ని పాఠకుడి కళ్ళ ముందు నిలబెడుతుంది.

శ్రద్ధ, సబూరిలకు ప్రాధాన్యతనిస్తూ అర్థంలేని ఆచారాలను, మంత్రతంత్రాలను దూరంగా పెట్టిన సాయిబాబా పేరు మీద కొత్తగా తంతులు, వ్రత కల్పాలు పుట్టుకు రావడం నిజంగా విషాదమే.

## మతం-కబీర్, కులం-పర్వర్దిగార్

" 'మీ పేరేమిటి?'
'సాయిబాబా అంటారు'
'మీ తండ్రి పేరు?'
'సాయిబాబాయే'
'మీ గురువు గారి పేరు'
'వెంకుసా'
'మతం?'
'కబీర్'
'కులం?'
'పర్వర్దిగార్'
'వయస్సు'
'లక్షల సంవత్సరాలు' "
- మహామహిమాన్వితులు సాయిబాబా పే.19

ఆశ్చర్యాన్ని, ఆలోచననీ రేకెత్తించే ఈ జవాబులు సాయిబాబా ఒకానొక సందర్భంలో ఆనాటి బ్రిటిష్ మెజిస్ట్రేటు ముందు వాంగ్మూలమిస్తూ చెప్పినవి. సాయిబాబా తన మతం - కబీర్ అనీ, కులం పర్వర్దిగార్ అనీ చేసిన ఉద్ఘాటనలు - ఆయన పైకి కనిపించేటంత సులువైన మనిషి కాదనీ, చాలా గాఢమైన అభిప్రాయాలు, లోతైన పరిజ్ఞానం, స్పష్టమైన కార్యక్రమం కలిగిన ప్రవక్త అని పట్టిస్తాయి.







### మేకప్ టెస్ట్ ఓ.కె. - షాట్ రెడీ .. స్మైల్ ప్లీజ్.... దటీజ్.. బురిడీబాబా స్టైల్!!



ఇప్పటి బురిడీబాబా గెటప్ బాగా అలవాటైన భక్తులకి ఈ గెటప్‌లో సెటిల్ కావడానికి ముందు పుట్టబాబా చాలా రకాల వేషాల మేకప్ స్టిల్స్, రిహార్సల్స్ ట్రై చేశాడని తెలీదు - ఈ చిత్రాల్లో కనిపించేవన్నీ బాబా భిన్నమైన గెటప్‌లు. పులిచర్మం, యోగాసనాల గెటప్ చూసి బురిడీ బాబా జప, తపం చేశాడని యోగాభ్యాసం చేశాడని అనుకునేరు - అటువంటిందేంలేదు. ఇది కేవలం ఫోటో పోజు గురించే - (నమ్మకం లేకపోతే సత్యం శివం సుందరం, నాలుగవ భాగం, 17వ పేజీ చూసి తెలుసుకోవచ్చు)

శ్రీ దాసగణు మహారాజ్ విరచిత శ్రీ సాయి గురు చరిత్రకు చక్కని పీఠిక రాస్తూ శ్రీ సాయినాధుని శరత్‌బాబు ఇలా అంటారు: బాబా గతాన్ని గూర్చి ఆయన మతాన్ని గూర్చి ఎంతో తర్జనలు భర్జనలు చేసిన చాలా మంది సాయి చరిత్రకారులు (బాబా తమకై ఎన్నోసార్లు ప్రస్తావించిన) ఒక కీలకమైన అంశాన్ని ఎందుకో విస్మరించారని తోస్తుంది. అది బాబాకు కబీరుకు ఉన్న సంబంధం! బాబా ఎన్నో సందర్భాలలో 'నేను పూర్వం కబీరును. నూలు వడికేవాడిని.' అనీ 'నేనొకప్పుడు బట్టలు, తలపాగాలు, పీతాంబరాలు, రగ్గులు నేసేవాడిని. అయినా కడుపు నిండా తినేందుకు తిండి గూడ దొరికేది గాదు'అనే వారు. మరో సందర్భంలో శిరిడీలోని గురుస్థాన్ వేపచెట్టు ఉన్న ప్రదేశం గురించి ప్రస్తావిస్తూ 'కబీరు నా గురువు. ఇక్కడున్నది కబీరు సమాధి. అందుకే నేనిక్కడ నివసిస్తున్నాను..'అని అన్నారు."

15వ శతాబ్దికి చెందిన కబీరు - మహాప్రవక్త, మహా కవి, భక్తిమార్గాన్ని బోధించిన వాడు. హిందూ, ముస్లిం మతాల సామ రస్యాన్ని, సమన్వ యాన్ని బోధించిన వాడు. ఉత్తర భారత దేశంలో ఇంటింటా నేటికీ కబీరు దోహాలు పాడతారు. కుల దురభిమానంపైన, మత దురహంకారంపైన కబీరు సమర్థమైన దాడి చేశారు. మత సామరస్యం కోసం కృషి చేసినవారికి నేటి భారత ప్రభుత్వం కబీరు పేరిట పురస్కారాలను అందజేస్తోంది.

షిర్డీ సాయిబాబా చరిత్ర కూడా మత సామరస్యానికి ఎత్తిన పతాక వంటిదే.

షిర్డీలో బాబా రామ కథ ఉత్సవాన్ని ఉరుసు ఉత్సవంతో కలిపి జరిపించేవారు. బాబా మసీదులో అగ్నిహోత్రం రాజేసేవారు. దీన్నే ధుని అంటారు. ఆ



మశీదుకి ద్వారకా మాయి అని పేరు పెట్టారు.ఆ మశీదు బయట తులసీ కోట ఉండేది. దీన్ని తులసీ బృందావనం అనే వారు. ఆ మశీదుని బాబా "బ్రాహ్మణమశీదు" అనేవారు. చాలా సందర్భాల్లో బాబా "బ్రాహ్మణ" అనే మాటని బ్రహ్మజ్ఞాని అనే అర్థంలోనే వాడతారని అందరికీ తెలుసు.

ఆర్థర్ ఆస్‌బర్న్ ఇలా రాశారు: "... సౌహార్ద చిహ్నంగా, తమ హిందు, ముస్లిం అనుచరులు ఒకరి ఉత్సవాల్లో ఒకరు - ఆరాధనలో వాస్తవంగా పాల్గొనకుండానే - కలిసి (భారత దేశంలో చాలా కాలంగా ఉన్న ఆచారం ప్రకారంగానే) ఆనందించాలని ఆయన అభిలషించేవారు. ఉదాహరణకు, శ్రీరామ నవమినాడు ఊరేగింపు ఎలా జరుగుతుందో హైందవ భక్తుడు చెబుతాడు. ఆ తరవాత హిందువులు పవిత్రగీతాలు పాడతారు. మధ్యమధ్యలో ఖురాన్ పఠనం జరుగుతుంది. ఒక్కొక్కప్పుడు ముస్లిములే ఒక మెత్తమీద సాయిబాబా గారి పాదరక్షలు తమ ముందు పెట్టుకొని (మానవాకృతిలో దైవాన్ని ఆరాధిస్తున్నట్టు లేకుండా లేదా ప్రతిమారాధనను పరిహరించడానికి) ఊరేగింపు మొదలు పెడతారు. హిందువులు వాళ్ళవెంటవెళ్తారు."-మహా మహి మాన్వితులు సాయిబాబా, పే.48.

హిందూ ముస్లిం మతాల దృక్పథాల వైవిధ్యం, ఐక్యత గురించి సూఫీ అవగాహన గురించి ఆర్థర్ ఆస్‌బర్న్ చాలా ఆసక్తికరంగా రాశారు. సుదీర్ఘమైనా జిజ్ఞాసులను అలరిస్తుందనే ఉద్దేశంలో ఇక్కడ ఉల్లేఖిస్తున్నాను.

"సహజంగానే, సౌహార్దమూ అవగాహనా ఎల్లప్పుడూ ఉండేవి కావు. హిందువులు సాయిబాబాను కొలవడమన్నదే ముస్లిములకు ప్రతిబంధకంగా ఉండేది. ఆ పూజ కూడా మసీదులో చెయ్యడం గాయానికి కారం పూసినట్టుగా (adding insult to injury) ఉంది.

దేవుణ్ణి మాత్రమే కొలవాలనీ ఈ జగత్తునంతనూ ఆయన శూన్యంలోంచి వెలువరించాడనీ మనుషులందరూ ఆయన ముందు శూన్యం లాంటివారేనన్న దృక్పథాన్ని ఇస్లాం వ్యక్తం చేస్తుంది. అన్ని జీవులతోబాటు ఈ జగత్తంతా దేవుడు తాల్చిన రూపమనీ ఆయనకు వ్యక్తీకరణమనీ అయినప్పటికీ ఆయన మాత్రం తన అవ్యక్త సత్తకు భిన్నంగా మారడం కాని తొలగడం కాని జరగదనే దృక్పథాన్ని హిందూమతం వ్యక్తం చేస్తుంది. దేవుడు జగత్తును శూన్యంలోంచి సృష్టించాడని లేదా జగత్తనేది దేవుడనే సత్యాన్ని మరుగుపరిచే భ్రాంతి (మాయ) తప్ప మరేదీ కాదని చెప్పినా అదే అర్థం వస్తుంది. కాబట్టి ఈ రెండు దృక్పథాలూ ఒక సత్యం తాలూకు రెండు పార్శ్వాలు. ఒకే విషయాన్ని చెప్పే రెండు పద్ధతులు. మనిషికి దేవుడిచ్చిన సత్త తప్ప మరేదీ లేనందువల్ల అతని ఉనికి తాలూకు నిగ్గు, అతని సత్త, తదన్యమయినదేదీ లేని సత్తే - అంటే దేవుడే అయి ఉండాలి. మధ్యయుగాల క్రైస్తవులు చెప్పిన ఆత్మశూన్యీ కరణ (self-naughting) మాదిరిగా, తన వ్యక్తిత్వపు శూన్యతను గ్రహించిన మీదట మానవుడు, దైవసత్త (Divine Essence) విశ్వజనీనతను గ్రహించగలుగుతాడు. కాబట్టి వాస్తవమయిన తనను తెలుసుకొన్నవాడు నిరాకార బ్రహ్మతో తనకుగల ఏకత్వాన్ని తెలుసుకొన్న వాడవుతాడు. హిందువులు దీన్ని గ్రహించి, అలాటివాణ్ణే దేవుడిగా పూజిస్తారు. చాలా మంది ముస్లిములు వాచ్యార్థానికి (letter of the law) కట్టుబడి అలాటి పూజను విగ్రహారాధనగా (వ్యక్తి ఆరాధనగా) పరిగణిస్తారు. నిజానికి అది కాదు; దేవుడు కానివాణ్ణే (పూజిస్తున్నట్టు) కాదు. కాకపోగా, పూజ అందుకొంటున్న వాడు పూజిస్తున్నవాణ్ణే ఇంకా కమ్ముకొని ఉన్న - భగవంతుడి కంటె వేరు అన్న - భ్రాంతిని తొలగించాడని గుర్తించడం.



సూఫీలకు ఇదంతా తెలుసు. వారు ఇస్లాం ఆధ్యాత్మిక భావ సంపన్నులు. వారిలో గొప్ప సాధువులున్నారు. హిందువులు బహిరంగంగా బోధించే దాన్నే వారు గోప్యంగా బోధిస్తారు. కాని సామాన్య ముస్లిములు అర్థం చేసుకోరు. ఈ రెండు దృక్పథాలకూ నడుమ చాలా భేదం ఉందనుకుంటారు. వాళ్ళ దృష్టిలో హిందువులు బహుదేవతారాధకులూ విగ్రహారాధకులూ. అల్ హల్లాజ్ అనే సూఫీ కవి పారవశ్య స్థితిలో ఉన్నప్పుడు 'అన్ అల్ హక్' (నేనే సత్యాన్ని) అనేవాడట. 'సత్యం' అనేది దైవనామాల్లో ఒకటి. (ఈ విధంగా) దైవనింద చేశాడని చెప్పి ఇస్లాం న్యాయ ప్రకారం అతన్ని ఉరితీశారు. కాని సూఫీలు అతను చెప్పింది అర్థం చేసుకున్నారు; అతన్ని గౌరవిస్తూనే వచ్చారు. అబూ సైయద్ అనే మరో సూఫీ, ఇస్లాం న్యాయానికి చిక్కకుండా వ్యతిరేక వచనంలో ఇలా ప్రకటించాడు: 'ఈ బట్టకు దిగువ అల్లా తప్ప మరేమీ లేదు.' ఈ నాటికీ కూడా సూఫీలు సామాన్యంగా చేసే ఒక ప్రార్థన ఇలా ఉంటుంది '(నాలో) దేవుడు తప్ప తదన్యంగా ఉన్నదాన్ని గురించి దేవుడికి క్షమాపణ చెప్పుకుంటున్నాను..." - మహా మహిమాన్వితులు సాయిబాబా, పే.49, 50.

శ్రీ సాయి సచ్చరితలో హేమాద్ పంత్ ఇలా రాశారు:

"బాబా హిందువను కున్నవారికి ముస్లిం వలె, ముస్లిం అనుకున్న వారికి హిందువువలె కన్పించే విలక్షణ అవతారం. వారు హిందువా లేక యవనుడా? అన్న విషయం చివరి వరకు ఎవరికీ అణుప్రమాణమైనా అంతు చిక్కలేదు. వారు ఉభయ మతాల వారినీ సమానంగా చూసేవారు. హిందువుల పండుగ రామనవమికీ, సభామండపంలో, ఊయలను కట్టింపచేసి, కథాకీర్తనాదులతో, ఉత్సవం జరిపించేవారు. అదే రోజు రాత్రి సందల్ ఊరేగింపు సమారంభంలో ముసల్మానులు గుమిగూడే వారు. ఉభయ ఉత్సవాలను సమానంగా చేయించేవారు. రామనవమి పండుగ నాడు అత్యంత ఉత్సాహంగా కుస్తీలు పట్టించి వారికిఉల్లాసంగా బహుమానాలను పంచి పెట్టేవారు. గోకులాష్టమి నాడు గోపాల కాలా చేయించేవారు. అట్లే ముసల్మానుల పండుగలు వచ్చినప్పుడు, నమాజు చదవటానికి, అడ్డుపెట్టేవారు కారు. ఒకసారి మొహరం పండుగ రాగా మహమ్మదీయులు మశీదుకు వచ్చి ఒక తాబూత్ చేయించి ఊరేగించాలన్నారు. బాబా సరేయని అనుమతినివ్వగా తెచ్చి దానినక్కడ నాలుగు రోజులుంచి ఐదవ రోజు క్రిందకు దించేశారు. హిందువుల వలె వారి చెవులు కుట్టి ఉండేవి. హిందువు కాని ముసల్మాను కాని పావన అవతారం వారిది. మశీదులో మకాం చేయువారిని హిందువని ఎట్లనగలం? ముసల్మానని అందామంటే, మశీదులో అహర్నిశలూ అగ్ని, ఘంట, శంఖువాదన, అర్ఘ్యపాద్య పూజలు, భజనలు విసుఘ్నాయితో విసరటం, అన్న సంతర్పణలే కాక తమ అభిమానాన్ని వదలి బ్రాహ్మణోత్తములు, అగ్నిహోత్రులు మడితో బాబాకు పూజచేసి సాష్టాంగ దండప్రణామాలు చేస్తారు. వారి వారి భావాలకనుగుణంగా అనుభవాలు కలుగుతుంటే భక్తులు నోట మాటరాక విస్మితులయ్యేవారు. సదా హరిస్మరణలో ఉండేవారిని హిందువని యవనుడని ఎట్లా చెప్పగలం? శూద్రులైనా చండాలురైనా కడజాతి వారైనా వారికి అణుమాత్రమైనా భేదం లేదు. హిందువైనా ముసల్మానులైనా సకల మతాలు వారికి సమానం. వారికి జాతి మత భేదాలు లేవు. దేహాభిమానమసలే లేదు. ఫకీరుల పంక్తిలో కూర్చుని మత్స్య మాంసాలు సేవించేవారు. వారి ఆహార పదార్థాలలో కుక్కలు మూతి పెట్టి తింటున్నా, వానినసహ్యించుకుని, తరిమేసే వారు కాదు" - 7వ అధ్యాయం, పే.63.

"సాయిని బ్రాహ్మణుడని కొందరు, ముసల్మాను అని కొందరు అనుకుంటారు. కాని వారు ఏ జాతికీ చెందని వారు. వారు ఎక్కడ ఎప్పుడు జన్మించారు? వారి తల్లిదండ్రులెవరు? వారసలు ఎక్కడి నుండి వచ్చారన్న విషయాలు ఎవరికీ తెలియవు. ఇక ముసల్మానా? బ్రాహ్మణుడా అన్నది ఎట్లా తెలుస్తుంది? వారు ముసల్మాను అయి ఉంటే మశీదులో అగ్నిహోత్రుని ఆరాధన, తులసీ బృందావనం, ఘంటా వాదన, శంఖానినాదం, సదా కథా కీర్తనలు, తాళాలు, ఢోలు, మృదంగ వాద్యాలు, హరినామ గర్జనలు చేయనిచ్చే వారా? వారు మహమ్మదీయుడైతే, స్వయంగా మశీదులో కూర్చుని గంధార్చనలు చేయించుకుంటారా? అందరితో సహభోజనం చేస్తారా? హిందువులకు వలె వారి చెవులు కుట్టి ఉంటాయా? మహమ్మదీయుడైతే తమ స్వంత డబ్బు ఖర్చుపెట్టి దేవాలయాలను జీర్ణోద్ధారణ చేయిస్తారా? పట్టు పీతాంబరాలను ధరిస్తారా? ఆరాధ్య దైవాన్ని అనాదరం చేస్తే బాబా ఒక్క క్షణమైనా సహించేవారు కాదు." - 38వ అధ్యాయం పే.391, 392.

కుల అతిశయంతో సాయిబాబా దగ్గరికి వచ్చిన బ్రాహ్మణుడిని చూసి "ఖబడ్దార్ మెట్లు ఎక్కావంటే. ఇక్కడ మహమ్మదీయుడు కూర్చున్నాడు. నీవు గొప్ప బ్రాహ్మణ జాతీయుడవు. నేను నీచాతి నీచమైన యవనుణ్ణి. నీవు మైలపడిపోతావు వెళ్ళిపో" అని గర్జించిన సందర్భాలు ఉన్నాయి. (ఆధారం: శ్రీసాయి సచ్చరిత, 28వ అధ్యాయం)

"నీ మనసులో ఏమను కుంటున్నావు? నా దగ్గరా నీ ప్రతాపం? ఇదేనా నీవు ఖురాను చదివి నేర్చుకున్నది? మక్కా మదీనా వెళ్ళానని గర్వపడుతూ నన్నెరుగ లేకున్నావు?" అని - మక్కా, మదీనా యాత్రలు చేసొచ్చిన హాజీని గద్దించిన సందర్భాలు ఉన్నాయి. (ఆధారం: శ్రీసాయి సచ్చరిత, 11వ అధ్యాయం)

సాయిబాబా సన్నిధికి అన్ని కులాల అన్ని మతాల ప్రజలకీ ప్రవేశం ఉంది. "...శిరిడీ సాయి దర్బారుకు, జ్యోతిష్యులు వచ్చి నమస్కారాలు చేసి నరదేహం యొక్క భవిష్యత్తును చెప్పుతారు. ధనధాన్య వైభవాలనుభవించే భోగులు, రాజులు, ప్రజలు, జోగులు, విరాగులు, తాపసులు, సన్యాసులు బాబా దర్శనం కొరకు ఉత్సాహంతో వస్తారు. జపతప వ్రతాల నాచరించేవారు, యాత్రీకులు, ఆ క్షేత్ర నివాసులు, గాయకులు, నర్తకులు సపరివార సమేతంగా శిరిడీ వస్తారు. శ్రీ సాయి దర్బారుకు హరిజనులు కూడా వచ్చి జోహారులర్పించి ఈ సాయే మాకు నిజంగా తల్లి తండ్రి. మమ్ము జన్మమరణాల నుండి రక్షించే వాడని అంటారు..." - శ్రీసాయి సచ్చరిత, 32వ అధ్యాయం, పేజి.321.

సాయిబాబా షిర్డీలోని శని, గణపతి, శంకర పార్వతి, మారుతి మరియు గ్రామదేవతల దేవాలయాల జీర్ణోద్ధరణను చేయించారని శ్రీసాయి సచ్చరిత, 7వ అధ్యాయంలో హేమాద్ పంత్ రాశారు.

సాయిబాబా బోధలు, ఆచరణ ప్రజలను ఎంతగా ప్రభావితం చేసేవో ఇక్కడ పేర్కొన్న అబ్దుల్లా పఠాన్ అనే ముస్లిం మాటల్ని బట్టి మనం స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు "... అయినప్పటికీ సాయిబాబా గారి దగ్గర ఉండటం వల్ల నా మనోవైఖరిలో స్పష్టమయిన మార్పు వచ్చింది. నేను మొదట శిర్డీ వచ్చినపుడు హిందువులను నా శత్రువులుగా చూసేవాణ్ణి. కానీ సాయిబాబా గారి దగ్గర మూడేళ్ళు ఉండేసరికి ఈ విధమైన శత్రుత్వం నాలోంచి తొలగిపోయింది. వారిని నా సోదరులుగా పరిగణించడం ప్రారంభించాను."- మహా మహి మాన్వితులు సాయిబాబా, పే.48.

అయినా తన భక్తుల్లో అపుడపుడు ఏదో ఒక స్థాయిలో తలెత్తే పొరపొచ్చాలకు, అసహనానికి బాబా చాలా అశాంతికి లోనయ్యేవారని ఆయన పరమపదించే 2 సంవత్సరాల ముందు అంటే 1916 విజయ దశమినాడు షిర్డీలో జరిగిన సంఘటన చూస్తే మనకి అర్థం అవుతుంది. "...అకస్మాత్తుగా ఆకాశంలో మేఘగర్జనలు, విద్యుల్లత మెరుపులు, మొదలయ్యాయి. అప్పుడు బాబా తమ తలగుడ్డను, కఫనీని లంగోటిని తీసి, ముక్కలు ముక్కలు చేసి ధునిలో పారవేసి జమదగ్ని స్వరూపంలో ప్రకటమయ్యారు. అసలే బాగా మండుతున్న ధుని, బాబా బట్టల ఆహుతి నందుకుని మరింత ప్రజ్వలంగా జ్వాలలు లేచాయి. ఆ అగ్ని తేజం కంటె కూడా బాబా తేజోవంతంగా కన్పించారు. అగ్ని కణాలవంటి వారి ఎఱ్ఱటి కళ్లను భక్తులు చూడలేక పోయారు. బాబా దిగంబరంగా నిలబడి "ఇప్పుడు బాగా చూడండి రా! నేనెవరో, నేను హిందువా ముసల్మానా అన్న విషయం ఇప్పుడు నిస్సందేహంగా నిశ్చయించు కోండి" అని గర్జించసాగారు..." - శ్రీ సాయి సచ్చరిత, 42వ అధ్యాయం, పే.424.

సర్వమతాల సారమొకటేనని, కుల, మత భేదాలకి అర్థం లేదని, భక్తి శ్రద్ధల ద్వారా దైవాన్ని చేరుకోవచ్చని శతాబ్దాల క్రితం కబీరు చెప్పిన బోధనలను నవీన భారత దేశానికి మళ్ళీ అందించి, అత్యంత నిరాడంబరుడుగా, పరమ విరాగిగా, మహాప్రవక్తగా జీవించిన సాయిబాబా 1918 సంవత్సరం విజయదశమి నాడు పరమపదించారు. అల్లా నామం నిరంతరం ఆయన పెదవులపై లాస్యం చేసేది. నిర్యాణానికి ముందు 11 రోజులు మశీదులో కూర్చుని "రామ విజయం" పారాయణ చేయించుకుని విన్నారు.

నిర్యాణానంతరం ఆయన భౌతిక కాయాన్ని షిర్డీలో సమాధి చేశారు. లక్షలాది మంది ఇప్పటికీ షిర్డీకి వెళ్ళి ఆ మహాత్ముడి సమాధిని సందర్శిస్తారు. కోట్లాది హిందువుల ఇళ్ళలో (ఎటువంటి అభ్యంతరం లేకుండా) సాయి బాబా ఈ రోజు దైవంగా పూజలు అందుకుంటున్నారు.

ఆ మహనీయుడి గురించి పూర్తి విశేషాలని ఒకే వ్యాసంలో సమగ్రంగా అందించడం సాధ్యం కాదు. అయినా ఆయన వ్యక్తిత్వంలో విభిన్న పార్శ్వాలను స్పృశించేందుకు నేను ఇక్కడ పాక్షికమైన ప్రయత్నం మాత్రమే చేశాను.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బాబా ఆలయాలపై ఇచ్చిన



వివాదంపై తీర్పు చెబుతూ పేర్కొన్న ఈ కింది అంశంతో బహుశా అందరూ ఏకీభవిస్తారు.

*"...Baba's philosophy was neither exclusively Hindu or Muslim or Christian. He believed that God was not bound by the fetters of caste, creed or religion..."* - (Source: Shirdi Sai Baba in the light of Sufism, page 31)

("...బాబా తత్వం పూర్తిగా హైందవం అని కానీ, ఇస్లాం అని కానీ, క్రైస్తవం అని కానీ అనలేము. దైవం కులాల, తెగల, మతాల అంతరాలకు అతీతమని ఆయన విశ్వసించారు..." - (ఆధారం: షిర్డీ సాయిబాబా ఇన్ ది లైట్ ఆఫ్ సూఫిజం, పే.31) ).

# షిర్డీసాయి పేరిట చలామణీ కావాలని బురిడీ బాబా దుష్ప్రయత్నం

కోట్లాది మందికి ఆరాధ్యనీయుడైన షిరిడీ సాయి వైభవంపైన బురిడీబాబా తన జీవితపు తొలి దశలోనే కన్నువేశాడు. బురిడీ బాబా తన ఆధ్యాత్మిక గోల్‌మాల్ దుకాణం తెరిచిన తొలి దినాల్లో తన ప్రభ వెలిగించుకునేందుకు అనేక వేషాలు, జిమ్మిక్కులు చేశాడు (కొన్నింటి గురించి మనం గత సంచికల్లోనే చర్చించుకున్నాం). అన్నింటి కంటే అతి ముఖ్యమైన ఎత్తు తాను షిరిడీ సాయిబాబా అవతారాన్నని ప్రకటించుకోవడమే.

బురిడీబాబా ప్రకటనని ఈనాటికీ ప్రపంచం ఆమోదించలేదని బురిడీ క్యాంపుకి కూడా తెలుసు. ఇది అతి పెద్ద ఆధ్యాత్మిక ద్రోహగాధ. ఒక మహనీయుడి స్మృతిని, ఇమేజ్‌ని హైజాక్ చేసేందుకు జరిగిన అతి పెద్ద మోసం. ఈ విఫల కుట్ర తాలూకు అంశాలను ఇక్కడ ఒక దాని తర్వాత ఒకటి చర్చించుకుందాం.

## ☞ వారు చెప్తున్నారు, కాబట్టి మనం వినాలి?

బురిడీబాబా అసలుపేరు రత్నాకర సత్యనారాయణ రాజు. 14 సం. వయసులో సత్యనారాయణ రాజు మొదటిసారిగా తాను సాయిబాబానని ప్రకటించుకున్నాడు. ఆనాటి నుంచి ఆ సంఘటనలని చిలవలు పలవలుగా చెక్కి, కథలు కథలుగా పేర్చి బురిడీబాబా సాహిత్యమంతటా నింపుతున్నారు.

ఇంతకీ ఈ బురిడీ బాబా మనని నమ్మించదలుచుకున్న విషయం ఏమిటంటే - తానే గత జన్మలో షిరిడీ సాయిబాబానని, అంతే కాదు - ఈ జన్మలో తాను 96 సంవత్సరాలు (అంటే 2022 వరకూ) జీవిస్తాననీ - వచ్చే జన్మలో 2030 సం॥లో కర్నాటక రాష్ట్రం మాండ్యా జిల్లాలోని గుణపర్తి గ్రామంలో తాను మళ్ళీ ప్రేమ సాయిగా జన్మిస్తానని ఊర్లు పేర్లతో సహా కట్టుకథలల్లి పకడ్బందీగా ప్రచారం చేస్తున్నాడు బురిడీ బాబా.

అయితే కీలకమైన ప్రశ్న ఏమిటంటే ఈ సంగతిని పాపం బురిడీ బాబా మాత్రమే ఎందుకు ప్రకటించాల్సి వచ్చిందిట?

భవిష్యత్తులో తాను ప్రేమసాయి అవతారంగా కర్నాటకలోని గుణపర్తి గ్రామంలో జన్మిస్తానని బురిడీ బాబా ఇవాళ చెప్తున్నట్టు - గతంలో షిరిడీ సాయిబాబా తాను ఆంధ్రప్రదేశ్‌కి చెందిన పుట్టపర్తి గ్రామంలో జన్మిస్తానని (సారీ అప్పటికి ఆంధ్రప్రదేశ్ లేదుగా, పోనీ హైద్రాబాద్ సంస్థానంలో...) ఎందుకు ప్రకటించలేదు? ఈ ప్రకటన భారం అంతా పాపం బురిడీబాబా జన్మకే ఎందుకు అట్టే పెట్టుకున్నట్టు?

షిర్డీసాయి తనకి ఎంతో దగ్గరైన మహల్సాపతికి గానీ, తాత్యాకి గానీ, తన జీవితచరిత్ర రాస్తున్న హేమాద్ పంత్‌కి కానీ తన కోసం బుట్టీవాడా (ప్రస్తుతం షిరిడీసాయి సమాధి మందిరం ఉన్న భవంతి)ను నిర్మించిన బుట్టీకి కానీ - తాను పుట్టపర్తిలో (వెరైటీ గెటప్‌తో) జన్మిస్తానని, ఆనక కర్నాటకలో ప్రేమసాయిగా జన్మిస్తాననిగానీ ఎందుకు చెప్పుకోలేదు?

- సమాధానం ఇల్లె, ప్చ్ -

అంచేత ఈ వన్‌సైడ్ స్టోరీని - వారు చెప్పారు కాబట్టి మనం నమ్మాలి - అంతేనా?

షిర్డీసాయి వచనాలు (లేదా సూత్రాలు) పేరిట భక్తులు త్రికరణ శుద్ధిగా నమ్మే 11 సూత్రాల్లోని 4వ సూత్రంలో బాబా -*"నా సమాధి మీ కోరికలను తీరుస్తుంది. నాయందు దృఢ విశ్వాసముంచండి"* అని ప్రకటించారు. బాబా సమాధి నుంచే సర్వకార్యాలూ నిర్వర్తిస్తూ భక్తులను ఆదుకుంటారని భక్తుల విశ్వాసం. శ్రీసాయి సచ్చరిత ముందు భక్తులకు సూచనలిస్తూ, నాగేశ్ ఆత్మారాం సావంత్ ఇలా రాశారు:*"...నా ఎముకలు నా సమాధి నుండి మాట్లాడుతాయి. ప్రజలిక్కడకు చీమల వలె వస్తారు. నా బిడ్డలను నేను పిచ్చుక కలవలె వారి కాళ్ళకు దారం కట్టి నా వద్దకు తీసుకుని వస్తానని బాబా అనేవారు. ఈ మాటలు అనుభవంలోకి వస్తున్నాయి..."*

సాయిబాబా చెప్పిన ఈ మాటలు అబద్ధాలనుకోవాలా? తాను భవిష్యత్తులో పుట్టపర్తిలో జన్మిస్తున్న విషయం తనకు అత్యంత ప్రియమైన భక్తులకు కూడా చెప్పకుండా తప్పుదారి పట్టించారనుకోవాలా? లేక బురిడీ బాబా షిరిడీ సాయి భక్తకోటిని తన దారికి తెచ్చుకునేందుకు తప్పుడు ప్రకటన ఇస్తున్నాడని అర్థం చేసుకోవాలా? - ఆలోచించండి.

## ☞ బాబా అలానే చెప్పుకున్నారా?

*'నేను సాయిబాబాను. ఆపస్తంబ సూత్రుడను. భరద్వాజ గోత్రుడను'* - ఇదీ బురిడీబాబా తాను షిర్డీ సాయిబాబానని చెప్పుకుంటూ చేసిన మొదటి ప్రకటన వరస! (ఆధారం: సత్యం శివం సుందరం, ప్రథమ భాగం, పేజీ 26)

షిర్డీ సాయిబాబా తన జీవితకాలంలో ఇలా ఏనాడైనా గోత్రాలు, సూత్రాలు చెప్పుకునే ప్రయత్నం చేశారా? అసలు సాయిబాబా అనే పేరే భక్తులు పెట్టింది, కానీ ఆ మహనీయుడు తన పేరు ఇదీ అనీ ఏనాడూ చెప్పుకున్న వ్యక్తి కాదు.

అప్పటి షిర్డీ సాయి, ఇప్పటి బురిడీబాబా, రాబోయే ప్రేమసాయి ముగ్గురు భరద్వాజ గోత్రులూ, ఆపస్తంభ సూత్రులూ అని బురిడీ సాహిత్యం నమ్మబలుకుతోంది. ఏమిటి ఈ భరద్వాజ గోత్రంలోనూ, ఆపస్తంభ సూత్రంలోనూ ఉన్న స్పెషాలిటీ? దేవుడి దృష్టిలో అన్ని కులాలు, మతాలు, గోత్రాలు, సూత్రాలు సమానమే కదా, కేవలం ఈ గోత్రంలోనే/సూత్రంలోనే దేవుడు పుట్టి తీరడానికి ఏముందట ఆ స్పెషాలిటీ?

షిర్డీ సాయిబాబా బ్రాహ్మణుడని బురిడీబాబా క్యాంప్ చాలా తీవ్రమైన ప్రచారం చేస్తోంది. స్వయంగా బురిడీబాబా ఏం చెప్తున్నాడో చూడండి: *"షిర్డీ సాయిబాబా మహమ్మదీయుడు కాడు. భరద్వాజ గోత్ర, ఆపస్తంబ సూత్ర బ్రాహ్మణ వంశములో పుట్టినవాడు. సాయిబాబాయను పేరు వలన మీరు పొరబడితిరి."* - సత్యం శివం సుందరం, ద్వితీయ భాగం, పే.230

షిర్డీసాయిబాబాని బ్రాహ్మణుడిగా నిరూపించాలని అంతటి ఆత్రుత ఏమిటో తెలీదు? ఇలాంటి వాళ్ళని చూసేగా - బాబా *"ఖబడ్దార్ వెట్లు ఎక్కావంటే. ఇక్కడ మహమ్మదీయుడు కూర్చున్నాడు. నీవు గొప్పబ్రాహ్మణ జాతీయుడవు. నేను నీచాతి నీచమైన యవనుణ్ణి. నీవు మైలపడిపోతావు వెళ్ళిపో"* అని గర్జించింది - (చూడండి: శ్రీసాయి సచ్చరిత, 28వ అధ్యాయం)

షిర్డీ సాయిబాబా తన తల్లి తండ్రులు బ్రాహ్మణులని మహల్సాపతికి చెప్పినట్టుగా నరసింహస్వామి రాసిన సంగతిని మారియన్ వారెన్ ప్రస్తావించారు. నిజమే, కానీ షిర్డీ సాయిబాబా బ్రాహ్మణ శబ్దాన్ని బ్రహ్మజ్ఞాని అనే అర్థంలోనే వాడేవారనే సంగతి అందరికీ తెలుసు. ఇటువంటి ఉదాహరణ మరెక్కడా లేదు. మరో సంగతి ఏమిటంటే అత్యధిక శాతం సాయి చరిత్రకారులు ఈ కథనాన్ని విశ్వసించట్లేదు.

షిర్డీ సాయిబాబా చెవులు కుట్లువేయబడి ఉన్నాయి అనేది కూడా వివాదాస్పదమే. ఆయన చెవులు కుట్లు వేయబడి లేవని దాసగణు చెప్పిన సంగతిని డా॥మారియెన్ వారెన్ ప్రస్తావించారు. షిర్డీ సాయిబాబా సుంతీ చేయించుకున్నారని హేమాద్ పంత్ రాశారని కూడా డా॥ మారియెన్ వారెన్ చెప్తున్నారు. (ఆధారం: షిర్డీ సాయిబాబా ఇన్ ది లైట్ ఆఫ్ సూఫీజం, పే.352)

అసలు విషయం ఏమిటంటే ఈరోజు బురిడీ బాబా పదే పదే ప్రకటిస్తున్న విధంగా షిరిడీ సాయిబాబా తన కులం, వంశం, గోత్రం, సూత్రం ప్రకటించి ఉంటే సమస్యే ఉండేది కాదు.

కానీ రహస్యం ఇక్కడే ఉంది.

ఆయన గోత్ర సూత్రాల సంగతి అటుంచి తన పేరు కూడా చెప్పుకోలేదు. బహుశా దీన్నే బురిడీబాబా ఉపయోగించుకో దల్చుకున్నది. నిజానికి షిరిడీ సాయికి బురిడీ బాబాకీ కీలకమైన తేడా కూడా అదే!

## ☞ దేవుడని చెప్పుకున్నారా?

షిర్డీ సాయిబాబా తాను పరమేశ్వరుణ్ణి స్మరించే వ్యక్తిననే కానీ, తానే పరమేశ్వరుడనని చెప్పుకోలేదని తెలుసుకున్నాం. బురిడీబాబా ప్రవర్తన దీనికి పూర్తిగా వ్యతిరేకం. బురిడీ బాబా దేవుణ్ణని, సృష్టికర్తనని ఎన్ని డంబాలు కొట్టాడో విజయవిహారం మార్చి 2000 సంచికలో వివరంగా, సుదీర్ఘంగా ఆధారాలతో సహా ఇచ్చాము.

ఇక్కడ విషయ నిరూపణ కోసం కొన్ని ప్రకటనలు మాత్రం ఇస్తాను.

*"...నేను మీ మధ్య నడయాడుట" అనే కార్యము దేవతలు కూడా సదా ఆకాంక్షించు నట్టి అపూర్వమైన అవకాశం. ఇట్టి అవకాశమును మీరు ప్రతీనిత్యం పొందుతున్నారు. అందులకై సదా కృతజ్ఞులై వుండవలె.."* -"సనాతన సారథి" జనవరి, 93 సంచికలో, వెనుక కవర్ పైన.

*"...నేను గోకులంలో విహరించి నప్పుడు దొంగతనంగా కుండల కొద్దీ పాలుత్రాగాను. అందువల్ల నాకు ఇప్పుడు పాలంటే ఇష్టంగా లేదు.."*- "శ్రీ కృష్ణుడు శ్రీ సత్యసాయి" పుస్తకం పే.176,రచయిత :డా॥ జంధ్యాల సుమన్‌బాబు.



*"నా ఆనందం కోసం నేను ఈ విశాల విశ్వం సృష్టించదలచాను. అప్పటి వరకూ నేనెవరో తెలిసికొనడానికి ఎవ్వరూ లేరు. కేవలం సంకల్పించాను. అంతే తక్షణమే పర్వతాలు పైకి లేచాయి. నదులు ప్రవహించ సాగాయి. క్రింద పృథ్వి, పైన గగనం ఏర్పడ్డాయి. సముద్రాలు ఉప్పొంగాయి. సూర్యుడు, చంద్రుడు, ఎడారులు సమస్తం ఆకృతి ధరించి నా ఉనికిని నిరూపించ సాగాయి. అప్పుడు మానవులు, జంతువులు,విహంగాలు..అనేక జీవరాసులు మాట్లాడటం, వినడం, విహరించటం నేర్చాయి. అందులో మానవునికి ప్రథమ స్థానం అనుగ్రహించ బడింది. విశిష్టమైన నా విజ్ఞానాన్ని మానవుని మస్తిష్కంలో అమర్చాను"*- "శ్రీకృష్ణుడు శ్రీసత్యసాయి" పుస్తకం పే.192.

*"... పూర్వం ఋషులు చాలా సంవత్సరాల పాటు తపస్సుచేసి చివరకు కొన్ని క్షణాల పాటు భగవంతుడు ప్రత్యక్షమైతే ఆ "దర్శనం" వల్ల పరమానందంపొందే వారు. త్రేతాయుగంలో వానరులు శ్రీరామచంద్రుని తో "సంభాషణ" చేసి ఎనలేని తృప్తిని పొందారు. ద్వాపర యుగంలో గోపికలు శ్రీకృష్ణుని దివ్య "స్పర్శన" భాగ్యం*




...ఎవరో బజార్లో పోయే బెగ్గర్లు చెప్పినదంతా మనం ప్రచారం చేయకూడదు. అది బెగ్గర్లు చేసే ప్రచారమేకాని, బిగ్గర్లు చేసే ప్రచారం కాదు...

– సనాతన సారథి, నవంబర్'93,పే.282

*పొంది పులకించిపోయారు. ప్రస్తుత అవతారకాలంలో భక్తులందరికీ శ్రీసత్యసాయి అన్ని సమయాలలోను దర్శన, సంభాషణ, స్పర్శన భాగ్యాలను ప్రసాదిస్తున్నాడు ! మీరెంత అదృష్టవంతులు ! ఆలోచించండి..."* - అదే పుస్తకం, పేజీలు : 196,107

*"...నా దర్శనార్థం దేవలోకంలోని దేవతలు కూడా ఎంతో ఆతురతతో వేచియుంటారు. ఇంతటి దర్శన భాగ్యం మీకు సులభంగా దినదినము లభిస్తున్నది..."*

*"...ఈ చరాచరసృష్టి కంతటికీ నేను అంతర్యామిని. అన్నిటిని ప్రేరేపించు శక్తిని నేనే. నేనే జ్ఞానిని..."* - అదే పుస్తకం పేజీ : *202*

ఈ అహంకారానికీ, ఆ మహాత్ముడి అతిలోక వ్యక్తిత్వానికీ ఏమైనా పోలిక ఉందా?

## ☞ పూజించమన్నారా?

షిర్డీ సాయిబాబా పూజపట్ల అయిష్టత వ్యక్తం చేసేవారనీ, తిరస్కరించేవారనీ భక్తుల తీవ్రమైన ఒత్తిడి మేరకే, కేవలం ఆఖరి సంవత్సరాల్లో పూజకి అంగీకరించారనీ మనం తెలుసుకున్నాం.

బురిడీ బాబా వైఖరి అందుకు పూర్తిగా వ్యతిరేకం.

*"నేను సాయిబాబాను. ఆపస్తంభ సూత్రుడను. భరద్వాజ గోత్రుడను"* అని 14 ఏళ్ళ వయసులో బురిడీ బాబా ప్రకటించిన వెంటనే తండ్రి వెంకమరాజు *'మేమేం చెయ్యాలి?'* అని అడిగితే బాల బురిడీ బాబా ఠక్కున ఇచ్చిన సమాధానం -**"నన్ను పూజింపుడు"**- (ఆధారం: సత్యం శివం సుందరం, ప్రథమ భాగం, పేజీ 26)

కేవలం మాటలే కాదు, పాటలు కూడా అదే వరస!

ఒక ఉదాహరణ: 1947లో స్వయంగా పుట్ట బాబా కట్టిన చూతమురారే! సుదతులార! అనే పాట యస్. లక్ష్మీదేవమ్మ అనే భక్తురాలు రాసిన "భక్తోద్ధారక శ్రీ సత్యసాయి" అనే పుస్తకంలో 15, 16 పేజీల్లో పూర్తి పాఠం ప్రచురించారు.

ఆ పాటలో *"షిరిడీ వాసుడట, చిన్న సాయీశుడట"* అని తాను షిరిడీ సాయి అవతారాన్నని గ్యారంటీ ఇస్తాడు.

*"హస్తలాఘవమున్నదట, అడుగునన్ని యిచ్చునట"* అని తన మ్యాజిక్కులన్నీ హస్తలాఘవమేనని దివ్యమహత్యం కాదని శుభ్రంగా ఒప్పేసుకుంటాడు.

*"శివరామకృష్ణుడట, చిందులందు మారుతి అట సర్వరూపములతడట, సద్భక్తులకు చూపునట"* అని తానే శివుణ్ణే, రాముడిని, కృష్ణుడిని, ఆంజనేయస్వామినని టోకుగా దబాయిస్తాడు.

ఆ రోజుల్లో కూడా పుట్టపర్తిలో అనేకమంది ప్రజలు ఈ వెూస ప్రచారాన్ని గమనించి బాగానే విమర్శించినట్టున్నారు- అందుకే *"మంత్ర తంత్రమనుచు కొందరు మంద భాగ్యులనుకొందురు మతిలేని మూఢ జనులు, మరుగునందు తలచుంద్రు"* అని బురిడీబాబా బాధపడాల్సి వచ్చింది కూడా.

*"ఎన్ని పనులుండినను, దండిగ శ్రీసాయినాథుని నెలవునకు పట్టువీడకు, సాగిపోతము"* అని తనే బుజ్జగిస్తాడు.

*"తెలివిలేని మూఢులారా! తెలివి తెచ్చుకొని నేడు తరలి, తరలి వేగమీరు, తరలిరండి పర్తిపురికి"* అని బెదిరిస్తాడు.

*"కుషీతో సాయీశుడునేడు, కుప్పం భక్తులతో కూడి కోర్కెమీద చెప్పేపాట. కొనియాడుచుయిందురండి"* అని పాటతనదేనని వివరిస్తాడు.

చివరగా *"జయమంగళ మీరెసాయి, శుభమంగళంబు మీకు సర్వమంగళంబు మీకు, సాయినాథ గైకొనుము"* అని తనకు తానే మంగళం కూడా చెప్పుకుంటాడు.

ఇలా భక్తులు పూజ చేస్తానని వెంటబడితే తిరస్కరించి, వారించాలని చూసే ఆత్మయోగి ఒకరైతే భక్తుల వెంటబడి తనని పూజించమని పాటలు

పద్యాలతో వెంట తగులుకుని, తనకితానే మంగళ హారతి ఇచ్చుకునే దైవవేషధారి ఒకరు - మరి ఇద్దరూ ఒకరేనంటారా?

## ☞ షిర్డీసాయి గురించి నిజంగా తెలీదా?

బురిడీ బాబా తన 14వ సంవత్సరంలో అంటే 1940లో తన అవతార ప్రకటన చేశాడని బురిడీబాబా సాహిత్యం మనకు చెపుతోంది.

ఇంకా బురిడీబాబా సాహిత్యం మనకి నమ్మబలికే విషయం ఏమిటంటే - బాల బురిడీ బాబా తాను షిర్డీ సాయిబాబానని ప్రకటించుకోక ముందు అసలు ఆ ప్రాంత ప్రజలెవ్వరికీ షిర్డీ అన్నా సాయిబాబా అన్నా బొత్తిగా తెలీదని.

ఇదే పాయింట్ నిరూపించడానికి చాలా బిగించి రచించిన బురిడీ సాహిత్యంలోనే - ఈ పాయింట్ని కాదనదగ్గ క్లూలు మనకి కనిపిస్తాయి.

బాల బురిడీబాబా ఉరఫ్ సత్యం చిన్నపుడు తన ఊళ్ళో స్థాపించిన భజన మండలి పేరు "పండరి భజన మండలి". (ఆధారం: దైవతం మానుషాకారం, ఆంగ్ల మూలం: మంత్రి ప్రగడ నరసింహారావు, తెలుగు అనువాదం : గరిమెళ్ళ కృష్ణమూర్తి, పే.11) మహారాష్ట్ర భక్తి ఉద్యమాల ముద్ర బలంగా కలిగిన పండరిపురం, విఠలుడు (పాండురంగడు) మొదలైన పదబంధాలు, సాహిత్యం ప్రచారం కాకుండా 'పండరి భజన మండలి' అనే పేరు వచ్చే అవకాశం లేదు. మహారాష్ట్ర భక్తి ఉద్యమం వ్యాప్తిలో ఉందంటే, మహారాష్ట్రలో ఉచ్ఛస్థితిలో ఉన్న షిర్డీ గురించి సాయిబాబా గురించి ఆ ఊరికి అప్పటికే తెలిసి ఉండే అవకాశం ఉందన్నమాటే.

10 సం. వయసులో బాల బురిడీబాబా ఉరఫ్ సత్యం తన 18 మంది బృందంతో - షిర్డీ యాత్ర, సాయిబాబా మహత్యం మొదలైన ఘట్టాలను ప్రదర్శించి ఆశ్చర్యంలో ముంచేవాడు. (ఆధారం: సత్యం శివం సుందరం, ప్రథమభాగం, పే.9). దీనర్థం షిర్డీ సాయి చరిత్ర, వైభవం ఆనాడే ఆ గ్రామాల్లో నాటకాలుగా ప్రదర్శించే స్థాయిలో ఉందన్నమాటే. కానీ సత్యం శివం సుందరం (అనబడే బురిడీ బాబా అధికారిక జీవిత చరిత్ర) రచయిత కస్తూరి ఆ ఊరి ప్రజలకి షిర్డీ బాబా గురించి తెలీదనే మనని నమ్మమంటారు.

- 1940 అక్టోబర్ 20న బురిడీ బాబా అవతార ప్రకటన (అంటే తానే షిరిడీ సాయిబాబాననే దబాయింపు ప్రకటన) చేశాడనే ఉద్దేశ్యంతో 1990 అక్టోబర్ 20న అవతార ప్రకటనా స్వర్ణోత్సవాలు జరిపారు.

1940లో ఉరవ కొండలో బాల బురిడీ బాబా ఉరఫ్ సత్యం తన అన్న శేషమరాజు ఇంట్లో ఉండి చదువుకునేవాడు. శేషమరాజు ఇంటి పక్కనే మంచిరాజు తమ్మిరాజు అనే బ్రాహ్మణ ఉపాధ్యాయుడి కుటుంబం ఉండేది. తమ్మిరాజు కుటుంబంతో సత్యం బాగా సన్నిహితంగా ఉండేవాడు. తమ్మిరాజు భార్య చాలా పవిత్రమైన గృహిణి కావడంతో ఆమెకు మరీ చేరికగా ఉండేవాడు (ఆధారం: దైవతం మనుషాకారం, పే.18)

ఇదే తమ్మిరాజు 1940 జూన్లో షిరిడీ సాయిపైన "శ్రీ సాయినాధ శతకం" పేరిట నూరు పద్యాలుగల శతకం రచించాడు. సత్యం ఆ వ్రాతపతిని చూసేందుకు వాళ్ళ ఇంటికి వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. (ఆధారం: దైవతం మానుషాకారం, పే.20)

ఇదంతా ఉరవకొండలో, సత్యం చుట్టు పట్ల వాతావరణంలో అప్పటికే షిరిడీసాయి భక్తి గణనీయంగా వ్యాపించి ఉందనే సూచిస్తోంది.

- 1940లో పుట్టపర్తికి 18 మైళ్ళ దూరంలో ఉన్న పెనుగొండలో ప్రతి గురువారం వందల మంది భక్తులతో షిర్డీసాయి భజన చేస్తున్న భక్తుడి ప్రసక్తి సత్యం శివం సుందరం ప్రథమ భాగం 119వ పేజీలో వచ్చింది.

ఈ పుస్తకాలన్నీ బురిడీ క్యాంపు రచయితలు తమవాదం వినిపించేందుకే రాశారన్న సంగతి మనం మర్చిపోకూడదు. ఈ పుస్తకాల్లో స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్న వివరాలు బురిడీబాబా బాల్యం నాటికే ఆ ప్రాంతాల్లో షిరిడీ సాయి భక్తి ఏదో ఒక స్థాయిలో వ్యాపించిందనే విషయం స్పష్టం చేస్తున్నాయి.

ఆ రోజుల్లో అక్కడ షిరిడీ సాయికి ఏర్పడిన పాపులారిటీని బట్టే - తాను సాయిబాబా అవతారాన్నని చెప్పుకుని ప్రయోజనం పొందవచ్చని దురాలోచన సత్యానికి కలిగింది. ఆ నేపథ్యం బయట పడకూడదనే ఇప్పుడు - అసలు సత్యం అవతార ప్రకటనకి ముందు ఆ ప్రాంతంలో ఎవరికీ షిరిడీసాయి గురించి తెలీదని బురిడీ క్యాంప్ ప్రచారం చేస్తోంది.

## ☞ అతకని పిట్టకథలు చెపితే అవతారం అయిపోతారా?

పిట్టకథ 1 : (విజయవిహారం మార్చి 2000 సంచికలో "అవతార రహస్యం అనబడే పిట్టకథ'' పేరిట బురిడీ బాబా భగవదవతారాన్నని చెప్పుకోవడానికి ప్రచారంలో పెట్టిన ఈ కథని ప్రస్తావించడం జరిగింది.)

1963 జూన్లో పుట్టబాబాకి ఎడమచేతి వైపు పక్షవాతం వచ్చి నట్టుగా వ్యవహరించాడు. మెట్లు ఎక్కాలంటే కష్ట మైంది. కాలు మార్చి కాలును ఒకళ్ళు పట్టాల్సి వచ్చింది. తలకి గుడ్డ కట్టాడు. ఒళ్ళంతా ఒంగి పోయింది. శత వృద్ధుడిలా కనిపించాడు. గడగడా వణుకుతుంటే భక్తులంతా గొల్లున ఏడ్చారు. "ఈ జబ్బంతా వేరే ఒక భక్తుడిది నేను తీసు కున్నాను" అని మామూలుగా వివరించాడు. మంచి నీళ్ళు తెప్పించాడు. కుడిచేతితో నీళ్ళు తీసి ఎడమ చేతిపైన, కాలిపైన చిలకరించాడు. వెంటనే పక్షవాతం తగ్గినట్టు లేచి నిలబడి అందర్నీ రెండు చేతుల్తో దీవించాడు. ఆ తర్వాత ఒక మంచి పిట్టకథ చెప్పాడు.

శివుడు, పార్వతి కైలాసంలో నృత్యం చేస్తు న్నారు. భరద్వాజ మహర్షి యజ్ఞం తలపెట్టి పార్వతిని అధిష్టాన దేవతగా ఒప్పించాలని కైలాసం వెళ్ళాడు. నృత్యంలోపడి శివుడు, పార్వతి, 8 రోజులు ఈ భరద్వాజ మహర్షిని చూడలేదు. శివుడు హెచ్చరించినా, పార్వతి నవ్వింది గానీ పట్టించుకోలేదు. మునికి కోపం వచ్చి, వెళ్ళిపోతుంటే, కాలుచెయ్యి పడిపోయింది. నోరురాలేదు. శివుడికి జాలి కలిగి కమండలంలో నీళ్ళు చల్లితే, సరిగ్గా అయింది. పార్వతికి జాలికలిగి తాండవం హడావుడిలో చూడలేదనీ, యజ్ఞానికి తామిద్దరం వస్తామని వాగ్దానం చేసింది. మీ వంశంలోనే కలియుగంలో 3 అవతారాలుగా పుడతామని చెప్పింది. ఈ 3 అవతారాల్లో మొదటిది షిరిడీసాయి - శక్తి అవతారమని, రెండవది తను - శివ-శక్తి అవతారమని, మూడవది భవిష్యత్తులో రాబోయే ప్రేమసాయి - శివ అవతారమని-పుట్టబాబా వివరించాడు. ఇకపోతే తను శివ-శక్తి స్వరూపం అంటే, ఎడమభాగం శక్తి, కుడిభాగం శివుడి అంశ అనికూడా పుట్టబాబా సెలవిచ్చాడు. శక్తి అశ్రద్ధవల్ల మహర్షికి 8 రోజులు బాధకలిగింది కాబట్టి, తన దేహంలో ఎడమభాగం 8 రోజులు (శక్తి అంశ ?) బాధ అనుభవించింది అని, కుడిభాగం (శివుడి అంశ ?) దాన్ని నివారణ చేసిందని పుట్టబాబా తన పిట్టకథ ముగించాడు.

ఈ కంగాళీ కథ పుట్టబాబా శత్రువు లెవరూ కల్పించింది కాదు. 1963 జూన్ 29న ఆయన చెప్పినట్టు ఆయన భక్తులే రాసిన "అన్యధా శరణం నాస్తి" (పేజీ : 220-222, రచయిత్రి : కుమారమ్మ), శ్రీ కృష్ణుడు సత్యసాయి (పేజీ : 164), సత్యం శివం సుందరం, రెండవ భాగం (పేజీ : 51 - 57) తదితర పుస్తకాల్లో కొద్ది కొద్ది తేడాలతో వివరంగా ఉంది.

· పిట్టకథ 2 : షిర్డీసాయి జీవిత చరిత్ర 15-16 సం॥ వయసు నుంచే చరిత్రకారులకి తెలుసు. అంతకు ముందు జీవితం గురించి, ఆయన పుట్టుపూర్వోత్తరాల గురించి నిర్దిష్టంగా ఎవరికీ తెలీదు, అవి ఇప్పటికీ మిస్టరీగానే ఉన్నాయి. తాను షిర్డీ సాయిబాబానని చెప్పుకోవాలంటే ఈ మిస్టరీ ఛేదించాల్సి ఉంటుందని బురిడీబాబాకి బాగా తెలుసు. అందుకే ఆయన ఈ పిట్టకథని రచించాడు.

ఈ కథ ప్రకారం - గోదావరి నదీతీరంలో పత్రి గ్రామంలో గంగాధరుడు (గంగా భవాడియా అని కొన్ని చోట్ల రాశారు) దేవగిరమ్మ అనే బ్రాహ్మణ దంపతులు ఉన్నారు. వాళ్ళు చాలా భక్తి ప్రపత్తులు, సద్వర్తన కలవాళ్ళు. వాళ్ళకి పిల్లలు లేరు. ఓ రోజు ఓ పెద్ద మనిషి అతిధిగా వచ్చాడు. భోంచేసి వరండాలో పడుకోబోయేముందు స్త్రీ సాంగత్యం కావాలని కోరాడు. (కొన్ని చోట్ల కాళ్ళు పట్టేందుకు స్త్రీ కావాలని కోరాడని కూడా రాశారు.)

అతిధి కోర్కె ఎలా తీర్చాలో తెలీక దేవగిరమ్మ ఇబ్బంది పడింది. ఇంతలో మరో సౌందర్యవతి ఐన స్త్రీ వచ్చి తను ఆ అతిధి కోరిక నెరవేర్చగలనని దేవగిరమ్మకి చెప్పింది. దేవగిరమ్మ ఈ స్త్రీని ఆ అతిధి దగ్గరకి పంపి తలుపు వేసుకున్నాక, మళ్ళీ తలుపు చప్పుడైంది. ఈ సారి తలుపు తీసేసరికి ఆ అతిధి, ఈ అందగత్తె తమ నిజరూపాలతో పార్వతీ పరమేశ్వరులుగా దేవగిరమ్మకి దర్శనమిచ్చి ఆమెను మెచ్చుకున్నారు. (ఎందుకు అతిధి సేవ పేర బ్రోతల్ హౌస్ నడపడానికి సిద్ధపడినందుకా?) ఆమెకి ఒక కుమారుడు, ఒక కుమార్తె పుడతారని మూడవ సంతానంగా స్వయంగా తానే ఆమె గర్భాన జన్మిస్తానని - దేవగిరమ్మకి స్వయంగా పరమేశ్వరుడు వరమిచ్చాడు.

భర్త దేవగిరమ్మ మాటలు నమ్మలేదు. కానీ ఇద్దరు పిల్లలు పుట్టి దేవగిరమ్మకి మూడవసారి గర్భం ధరించేసరికి - గంగాధరుడికి వైరాగ్యం ముదిరిపోయి అడవులకి తపస్సు చేసుకోవడానికి వెళ్ళిపోయాడు. (స్వయంగా పరమేశ్వరుడే కొడుకుగా పుడుతుంటే, ఏ భక్తుడైనా అడవికెళ్ళి తపస్సు చేసుకుంటాడా?). అప్పుడే పుట్టిన బిడ్డని అరణ్యంలో చెట్టుకింద పడుకోబెట్టి దేవగిరమ్మ కూడా భర్తని అనుసరించి అడవులకి వెళ్ళింది. ఆ బిడ్డని ఒక మహమ్మదీయ ఫకీరు, అతని భార్య చూసి పెంచుకున్నారు. ఆ బిడ్డే షిర్డీ సాయిబాబా.

ఈ పిట్టకథని మొదట బురిడీబాబా 1944 లో వి.పి. కొండప్ప అనే ఉపాధ్యాయుడికి చెపితే ఆయన 102 పద్యాలుగల పుస్తకంగా రాసి ప్రచురించారని సత్యం శివం సుందరం, ప్రథమ భాగం, 120, 121 పేజీల్లో రాశారు. ఇంకా ఇది దైవతం మానుషాకారం పుస్తకం 106, 107 పేజీల్లోనూ, సత్యసాయి స్పీక్స్, 23వ వాల్యూం 239 - 242 పేజీల్లోనూ, షిర్డీ టు పుట్టపర్తి పుస్తకంలో 79-80 పేజీల్లోనూ కొద్ది కొద్ది తేడాలతో మనకి కనిపిస్తుంది.

ఇప్పుడు ఈ రెండు పిట్టకథల్నీ పోల్చి చూడండి. మొదటి కథ ప్రకారం షిర్డీ సాయిబాబా శక్తి అవతారం. రెండో పిట్టకథ ప్రకారం షిర్డీ సాయిబాబా శివుడి అవతారం.

ఇటువంటి పిట్టకథల్ని చరిత్రకారులు ఎవరూ పట్టించుకోరని వేరే చెప్పక్కర్లేదు కదా. మామూలు పాఠకులకి సైతం ఇదంతా గందరగోళంగానే ఉంటుంది. బురిడీ సాహిత్యంలో పేజీలకు పేజీలు విస్తరించిన ఈ కథల్ని నేను టూకీగా చెప్పే ప్రయత్నమే చేశాను.

సందర్భానికి తోచిన కథ చెప్పడమే తప్ప, తిరగేసి అడిగే వాళ్ళెవరూ భక్తుల్లో లేరని బురిడీ బాబాకి మహా ధీమా.

ఇంతకీ ఈ రెండు కథలూ ఒకదానికి ఒకటి ఎదురు వస్తున్నాయి కదా - దీన్ని బట్టి - రెండూ బురిడీ బాబా సృష్టించిన పిట్టకథలేనని - బురిడీబాబా షిరిడీ సాయి అవతారం కాడు గాక కాడని స్పష్టంగా తెలీట్లేదా?

## ☞ చించోళీ రాణీ - కమండలం సాక్ష్యం

ఒకప్పుడు హైద్రాబాద్ రాష్ట్రంలో చించోళీ జాగీర్ రాణీగారు బురిడీబాబాకి భక్తురాలు. మొదట్లో బురిడీబాబాకి రాజుల దగ్గిర రాణుల దగ్గర జమీందార్ల దగ్గిర చాలామంచి గిరాకీ ఉండేది. చించోళీ రాణిగారి ప్రసక్తి సత్యం శివం సుందరం, ప్రథమభాగం 124, 125 పేజీల్లోనూ, హోవర్డ్మమర్ఫెట్ మ్యాన్ ఆఫ్ మిరకిల్స్ పేరిట ఇంగ్లీషులో రాసిన పుస్తకానికి అమరేంద్ర తెలుగు అనువాదం - అద్భుతమూర్తి 32వ పేజీల్లో కనిపిస్తుంది.

ఈ వృత్తాంతం ప్రకారం - చించోళీ రాజా గారు బ్రతికున్నపుడు షిర్డీసాయి చించోళీ రాజ భవనానికి వస్తాండేవారట, టాంగాలో రాజాగారితోపాటు షికార్లకి కూడా వెళ్ళేవారట. ఆ రోజుల్లో షిర్డీసాయి ఒక కంచుకమండలం (దానిపైన సాయిబాబా అనే పేరు దేవనాగర లిపిలో రాసిఉందట) రాజభవనంలో విడిచిపెట్టేశారట. దాన్ని మళ్ళీ ఇన్నాళ్ళకి బురిడీబాబా గుర్తు చేశారట (ఆ కమండలం చుట్టూ నాగుపాము కూడా చుట్టుకుని ఉండేదట) - అంచేత బురిడీబాబాని షిర్డీసాయి అవతారంగా నమ్మాలని దీని సారాంశం.

బురిడీబాబాకిమల్లే కాకుండా షిరిడీ సాయికి రాజులూ, బిచ్చగాళ్ళూ ఒకటే. ఆయన ఎప్పుడూ రాజసంస్థానాలకి ప్రత్యేక అతిధిగా వెళ్ళడం, రాజులతో టాంగాలెక్కి తిరగడం చేసిన మనిషి కాదని షిరిడిసాయి భక్తులు అందరికీ తెలుసు. రేకుడబ్బా వాడుకునే షిరిడిబాబా, తనపేరు చెక్కిన కంచుకమండలం వాడటం కూడా సందేహాస్పదం. పైగా బాబా ఆఖరి 60 సంవత్సరాలు షిర్డిలోనే ఉన్నారని ఎక్కడికీ వెళ్ళలేదని షిర్డీసాయి సాహిత్యమంతా ఘోషిస్తోంది.

అందుకే బురిడీబాబా అఫీషియల్ బయాగ్రాఫర్ కస్తూరికే దీన్ని ప్రజలు నమ్ముతారని అనిపించలేదు, ఆయన ఇలా రాశారు : *"శ్రీ షిర్డీబాబా తానున్న చోటినుండి యెక్కడకును పోలేదని వారి మహారాష్ట్ర భక్తులు వ్రాసిన గ్రంధములలో ఉండగా చించోళీకి పోయి రాజాగారి దగ్గర కమండలమునెప్పుడు విడిచి వచ్చియుండును? నమ్ముటకు వీలులేదేయని కొందరికి సంశయము కలుగవచ్చును."* - సత్యం శివం సుందరం, ప్రథమ భాగము, పే. 125.

## ☞ 8 సంవత్సరాల తిరకాసు

శ్రీసాయి సచ్చరితకి రాసిన ఉపోద్ఘాతంలో షిర్డీసాయి ప్రముఖ భక్తుడు హరిసీతారాం దీక్షిత్ - "నేనిప్పుడు వెళ్ళిపోయి ఎనిమిదేళ్ళ బాలునిగా మరలవస్తా"నని షిర్డీసాయి తనతో స్వయంగా చెప్పారని రాశారు. ఈ విషయం షిర్డీసాయి భక్తుల్లో బహుళ ప్రచారంలో ఉన్న సంగతి.

షిర్డీసాయి పరమపదించింది - 1918లో, బురిడీబాబా జన్మించింది 1926లో. తేడా 8 సంవత్సరాలేకదా - అందుచేత హరిసీతారాం దీక్షిత్ రాసిన దాంట్లో '8 ఏళ్ళ బాలునిగా' అనే మాటని '8 సంవత్సరాల తర్వాత' అని మార్చగలిగితే-తమకి వాటంగా అక్కర కొస్తుందని బురిడీబాబా అండ్ కోటరీకితట్టింది.

చాలాకాలం తర్వాత హరిసీతారాం దీక్షిత్ తమ్ముడికొడుకు ఎస్.ఎస్.దీక్షిత్ ఒక సందర్భంలో పుట్టపర్తికి వచ్చినప్పుడు "నేను మీ పెదనాన్నతో ఎనిమిదేళ్ళ తరువాత వస్తానని చెప్పాను. ఎనిమిదేళ్ళ వానిలా వస్తానని చెప్పినట్లు పొరపాటుగా అర్థం చేసుకున్నాడేమో" అనేశాడు బురిడీబాబా. (ఆధారం: అద్భుత మూర్తి, పే.35)

భళీ! ఏం అడ్జస్ట్మెంటు!

కానీ శ్రీసాయి సచ్చరిత 43వ అధ్యాయం (439వ పేజీ)లో హేమాద్ పంత్ ఇలా రాశారు: "... నేను ఎనిమిది సంవత్సరాల బాలునిగా మరల ప్రకటన మౌతానని బాబా భక్తులతో చెప్పారు..."

హేమాద్పంత్ ఇక్కడ భక్తులతో అనడం గమనించండి!, అంటే దీనర్థం, బాబా కేవలం హరిసీతారాం దీక్షిత్తో మాత్రమే కాకుండా ఇంకొందరు భక్తులతో కూడా ఈ మాట చెప్పారన్న మాట. మరి అందరూ పొరపాటుగా అర్థం చేసుకున్నారనే బురిడీబాబా దబాయిస్తాడా!

"షిర్డీ టు పుట్టపర్తి" గ్రంథాన్ని రాసిన బురిడీ బాబా భక్తులు డా॥ ఆర్.టి. కాకడే, డా॥ ఎ.వీరభద్రరావు వంటివారైతే ఈ తేడా మొత్తం దాచిపెట్టి, అసలు హేమాద్ పంతే "8 సంవత్సరాల తరువాత" అని రాసినట్టుగా మాట్లాడుతున్నారు. ఇది బుద్ధిపూర్వకంగా చేస్తున్న వక్రీకరణ.

గాలి శారదాదేవి అనే బురిడీబాబా భక్తురాలికి (బురిడీబాబా ఈమెకు పెద్ద బొట్టు అని పేరు పెట్టాడు) షిర్డీబాబా ఒకప్పుడు తాను ఆంధ్రదేశంలో జన్మిస్తానని చెప్పారని - బురిడీ గ్యాంగ్ చేసే ప్రచారం కూడా నమ్మశక్యంగా లేదు. దశాబ్దాలు తనతో కలిసి ఉన్న మహల్సాపతి, అబ్దుల్, భాగోజీ, తాత్యా వంటి భక్తులందర్నీ వదిలి మామూలుగా తనని చూడ్డానికి వచ్చిన శారదాదేవికి ఈ రహస్యం (అదీ, సమయం వచ్చేదాకా ఎవరికీ చెప్పనని ప్రమాణం చేయించుకుని) షిర్డీసాయి చెప్పారని - షిర్డీసాయి భక్తులెవరైనా నమ్మడం కష్టమే.

శ్రీసాయి సచ్చరితలో వర్ణించబడిన షిర్డీసాయి లీలల వంటివే మక్కీకి మక్కీ కాపీ చేసి (ఉదా: గుర్రాన్ని వెతకడంలో సాయపడటం, వర్షాన్ని తగ్గమనడం, వ్యాధిని నిరోధించడం..... వగైరా) బురిడీబాబా పేరిట ప్రచారం చేసే ప్రయత్నం జరిగింది. ఆ ప్రయత్నమూ అంతగా ఉపకరించలేదు.

## ☞ గారడీ విభూతి షిరిడీ 'ఊదీ' అవుతుందా?

"... కర్రలు కొని ఒక చోట రాసిపోసి ఉంచేవారు. వానిని తమ సముఖంలో ధునిలో వేసి హోమం చేసేవారు. ఆ విభూతినే భక్తుల కిచ్చేవారు..." - శ్రీ సాయి సచ్చరిత, 32వ అధ్యాయం, పేజి. 325. ఇదీ - షిరిడీ సాయి విబూతిని సృష్టించే పద్ధతి. దీనినే ఆయన ఊదీ అనేవారు. ఇందులో షిరిడీసాయి ఎటువంటి గారడీ చేయలేదు. తన నిష్కల్మషప్రేమ, నిర్మల అంతఃకరణ, ఉదాత్త ఆచరణ ద్వారా భక్తులని ఆకర్షించిన వ్యక్తికి బహుశా అటువంటి అవసరం కలగదు.

షిరిడీ సాయి అవతారంగా తనని వర్ణించుకున్న బురిడీబాబాకి తన క్లెయిమ్ రుజువు చేసుకోవడానికీ ఏదోవిధంగా తనకీ, షిరిడీ సాయి ఉదాత్తచరితకి లింకుని ఎస్టాబ్లిష్ చేసుకోవడానికీ, ఈ గారడీ విభూతి (హస్తలాఘవం - అనేమాట స్వయంగా బురిడీ బాబానే ప్రయోగించాడు) సృష్టి అవసరమైంది.

ఈ గారడీ విభూతిని సృష్టించేందుకు బురిడీబాబా చిన్న చిన్న విభూతి ఉండల్ని ఏవిధంగా చేతులు మార్చుకుంటూ, పొడిచేస్తూ సృష్టిస్తాడో ఇప్పటికే బురిడీబాబా స్వంత వీడియోల సహాయంతోనే అనేకమంది బట్టబయలు చేసి అంతర్జాతీయంగా వెబ్సైట్లలోకి కూడా ఎక్కించారు. గత సంచికలో ఈ విభూతి ఉండల రహస్యాన్ని బయట పెట్టే ఫోటోని ప్రచురించాం. ఆ ఫోటోనే మళ్ళీ ఇక్కడ ఇచ్చాను.

బురిడీబాబా విభూతి దివ్య సృష్టికాదని చెప్పే మరో తిరుగులేని సాక్ష్యం చూడండి.

"...ప్రభు సృష్టించే విభూతి, పొడిగాకాక, బెల్లం అచ్చులా, చదరంగా గట్టిగా ఉండేది. ఒక్కోసారి వుండలా గట్టిగానే వుండేది. దాన్ని పొడి చేసి యిచ్చేటప్పుడు, వారి చేతి వ్రేళ్ళు



యెర్రగాయైపోయేవి. అంతగట్టిగా వుండేది ఒక సారి బూడిదరంగుగా, మరోసారి తెల్లగా, మరోసారి తెలుపు నలుపు కలిసినట్టుగా, మరోసారి యజ్ఞగుండం విభూతిలాగా, రకరకాలుగా వుండేవి. వాటి రుచులు అంతే. వాటి వసలూ అంతే. ఒక్కోసారి కర్పూరంలా, మరోసారి కస్తూరిలా, చందనంలా సుగంధ పుష్పంలా, పన్నీరు వాసనలూ, ఘుమఘుమ లాడేవి. ఒక్కోసారి వాసనే వుండదు. సాయి స్టోరు నుండి వచ్చే వస్తువులు చిత్ర విచిత్రములై, మానవుని శారీరక, మానసిక చిత్త ప్రవృత్తులను నివారణగావించేవి..." - అన్యథా శరణం నాస్తి, పేజీ : 35.

ఈ పుస్తకంలో వర్ణించిన పరిస్థితి 40వ దశకం నాటిది. దైవశక్తితో తయారయ్యే విభూతికి ఇన్ని రకాలూ, ఇంత తిప్పలూ ఎందుకు?

దీన్ని బట్టే బురిడీబాబా కేవలం (ఆయన చెప్పినట్టుగానే) హస్త లాఘవం ద్వారా విభూతి సృష్టించే మోసగాడని తేలట్లేదా?

ఈయనకి షిర్డీసాయితో పోలిక ఏముంది?

## ☞ ఏ ప్రయోజనం ఆశించి?

బురిడీబాబా షిర్డీసాయి వేషం ఎత్తాలని ఎందుకనుకున్నట్టు?

"...తమకు కలిగిన రోగాలు నయం చేసుకునేందుకు, సత్యం దగ్గరకు వచ్చేవారు. సత్యం యొక్క పేరు షిర్డీసాయి పేరు ప్రతిష్టలతో ముడిపడి యుండేది..."

- దైవతం మానుషాకారం, పే. 25

అదీ సంగతి! ఈ బురిడీబాబా భక్తుడు ఆదమరపున అసలు విషయం తేల్చేశారు. అప్పటికే పుట్టపర్తి పరిసరాల్లో షిరిడీసాయి లీలలు బాగా ప్రాచుర్యం పొంది ఉండాలి. షిరిడీ సాయి లీలల్లో ఆయన రోగాలు తగ్గించే వారని ఉంది కాబట్టి, షిరిడీసాయి పేరు ప్రతిష్టలతోటే ఈ బురిడీబాబా ఉరఫ్ సత్యం పేరు ముడిపడి ఉంది కాబట్టి, ఈ సత్యం కూడా రోగాలు తగ్గించగలడేమో అనే భ్రమతో జనం ఈయన దగ్గరకి వచ్చేవారు.

బహుశా ఆ రోజుల్లో ఇది సత్యంకి మంచి ఆదాయమార్గం కూడా కావచ్చు.

(ఈ సీరియల్ మొదటి సంచికలోనే మనం తొలినాళ్ళలో బురిడీబాబా దెయ్యాల్ని తోలే పనులు ఎలా చేశేవాడో చూశాం. హోవర్డ్ మర్ఫెట్ పుస్తకంలోనైతే బురిడీబాబా బొమికెల గురించి చెప్పడం, నిమ్మకాయల వైద్యం చేయడం వంటి వివరాలు కూడా వున్నాయి.)

పేరుకి పేరు, డబ్బుకి డబ్బు చిక్కే అవకాశం, అప్పటికే సిద్ధంగా ఉన్న షిరిడిసాయి భక్తి సామ్రాజ్యాన్ని ఆక్రమించుకోవచ్చనే ఆశ....సత్యం ఈ వేషం కట్టడానికి కారణమైనాయి.

## ☞ వారు వీరెలా అవుతారు?

సత్యంశివం సుందరంలో షిర్డీసాయికీ బురిడీబాబాకి అభేదం ప్రతిపాదించడానికి "వారే వీరు,వీరే వారు" అనే అధ్యాయంరాశారు.

ఇరువురి జీవన విధానాన్ని పరిశీలించిన వారికి వారు వారే, వీరు వీరే అని స్పష్టంగా అర్థమౌతుంది.

ఆయన చిరుగుల కఫనీ తొడుక్కుంటే ఈయన సిల్కు జుబ్బా, పట్టు పంచె ధరిస్తాడు. ఆయన మసీదు మట్టి నేలమీదో, లేక గాలిలో తేలే చెక్కబల్లమీదో శయనిస్తే ఈయన శేష శయనం సెట్టింగుతో ఉన్న (వాటర్?) కుషన్ పరుపు మీద, ఎ.సి. రూమ్స్‌లో శయనిస్తాడు. విదేశీ కార్లమీద తిరుగుతాడు. ఆయన అల్లా మాలిక్ అంటే ఈయన నేనే దేవాధి దేవుణ్ణి అంటాడు.

ఈయన సీకో వాచీలు తీసి, బంగారు చైన్లు తీసి భంగపడ్డ అనుభవాలు - ఆయనకి తెలీదు.

ఈయన బెడ్‌రూమ్‌లో సాగిన హత్యల కుట్రలు, కుహకాలు, ప్రపంచమంతా వెల్లువెత్తిన సెక్స్ ఆరోపణల దుమారాలు - ఆ భగవతోత్తముడే కాదు, అసలు ప్రపంచ చరిత్రలో ఏ ఆధ్యాత్మిక నేత ఎరుగడు.





| షిరిడీ సాయి | | బురిడీ బాబా |
|---|---|---|
| తెలీదు, చెప్పుకోలేదు, భక్తులు సాయిబాబా అని పిలిచారు. | పేరు | రత్నాకర సత్యనారాయణ రాజు. తాను షిరిడీ సాయిబాబానని ప్రకటించాడు. |
| ఎప్పుడూ అల్లా మాలిక్, సబ్‌కా మాలిక్ ఏక్ అనేవారు. | దైవం | తానే దైవాన్నని, సృష్టికర్తనని ప్రకటించుకున్నాడు. |
| దేవుడని పూజించబోతే తిరస్కరించారు, వారించారు. వత్తిడి వలన కాదనలేక పోయారు. | పూజ | దేవుడనని, పూజించమని కవితలల్లాడు, పూజలందుకున్నాడు. |
| తాను భవిష్యత్తులో పుట్టపర్తిలో రత్నాకర సత్యనారాయణ రాజుగా జన్మిస్తానని ఎక్కడా చెప్పలేదు. | అవతారం | తానే షిరిడీ సాయిబాబానన్నాడు. వచ్చే జన్మలో ప్రేమసాయినన్నాడు. |
| తనది కబీర్ మతం అని చెప్పుకున్నారు. | మతం | అన్నిమతాలకూ కేంద్రస్థానంలో తానే ఉన్నానంటాడు. |
| షిరిడీలోని శిధిలమైన మసీదు (ద్వారకా మాయి) | నివాసం | పుట్టపర్తిలోని ప్రశాంత నిలయం |
| చిరిగిన తెల్ల కఫ్నీ, తెల్ల తలపాగా | బట్టలు | పట్టుపంచె, సిల్కు అంగరఖా |
| మసీదులో ధుని నుంచి తీసి ఇచ్చారు | విభూతి | హస్తలాఘవంతో తీసి, సృష్టించానంటాడు. |
| మట్టి మసీదు నేలపై, గోనె పట్టాపై, లేదా గుడ్డపీలికలతో వేలాడదీసిన చెక్క పలకపై | నిద్ర | శేషశయనం సెట్టింగు ఉన్న (వాటర్?) పరుపుపై, ఎ.సి.గదిలో |
| ప్రణాళికా బద్ధమైన ప్రజాసేవ కాకపోయినా, తనకున్నదంతా ప్రజలకందించారు. నైతిక, ధార్మిక, ఆత్మిక అభివృద్ధికి దోహదపడ్డారు. | ప్రజాసేవ | లేటుగా రూటుమార్చి ప్రజాసేవ బాణీ అందుకున్నా, దండుకుంటున్నాడనే విమర్శలు, అక్రమాల ఆరోపణలు తప్పట్లేదు. |
| శ్రద్ధ, సబూరిల సందేశం నిష్కల్మష ప్రేమ, ఆచరణ తప్ప గారడీలు చేయలేదు. | మేజిక్కులు | సీకో వాచీలు తీసి భంగపడిన, బంగారు చైన్ తీసి వీడియోకి దొరికిన అనుభవం ఉన్నాయి. |
| ఈయన జీవితం తెరిచిన పుస్తకం, రహస్యం ఏమీలేదు. | పారదర్శకత | దర్శన సమయంలో తప్ప మిగతా జీవితం నిగూఢం, పరమ రహస్యం. |
| పుట్టినరోజే తెలీదు, ఇక ఖర్చెక్కడ? | పుట్టినరోజు ఖర్చు | రమారమి 100 కోట్లు అని ఒక పత్రిక అంచనా |
| చనిపోయేటపుడు మిగిలింది 7రు. | ఆస్తులు | ఒక అంచనా ప్రకారం 6 వేల కోట్లు |
| ఆరాధన తప్ప ఆరోపణలు ఎదుర్కోలేదు. | ఆరోపణలు | మోసం, అక్రమాల ఆరోపణలు, సెక్స్ ఆరోపణలు వెల్లువెత్తాయి. |

అందుకే - ఆరు నూరైనా వారు వారే - వీరు వీరే.

## ☞ ఇది మొదలూ కాదు - ఇదే చివరాకాదు

షిరిడీసాయి పేరు ఉపయోగించు కుందామని ప్రయత్నం చేసిన బాబాల లిస్టు పుట్టబాబాతో మొదలూకాలేదు, పుట్టబాబాతో అంతమూకాదు. నెల్లూరులో మోసాలు చేసిన షబ్బీర్‌బాబన్ (విజయవిహారం మొదటి సంచికలో వివరాలున్నాయి) నుంచి నిన్నమొన్న హైద్రాబాద్‌లో అరెస్టయిన దత్తబాబా వరకూ షిరిడీసాయి వారసులుగానో, అవతారాలుగానో చెప్పుకుని చలామణి అయినవారే.

షిరిడీ సాయి పేరు ఉపయోగించు కోవాలనే ప్రయత్నం గతంలో కూడా అనేకులు చేసినట్టు మనకి శ్రీసాయి సచ్చరిత ముందు భక్తులకు ఇచ్చిన సూచనలో షిరిడీ సాయి భక్తులు నాగేశ్ ఆత్మారాం సావంత్ రాశారు.

షిర్డీలో 'నేనుసాయి యొక్క ముఖ్య శిష్యుణ్ణి. వారు నాతో ప్రత్యక్షంగా మాట్లాడ తారు' అని చెప్పేవారిపట్ల సావధానులై ఉండాలంటారు సావంత్.

'సాయిబాబా ద్వారకామాయిలో తమ స్థానంలో నన్నేకూర్చోమని ఆదేశాన్ని ఇచ్చారు. నేనే వారసుణ్ణి' అనే వారి గురించి సావంత్ ప్రస్తావించారు. ద్వారకా మాయిలోనూ, మరియు సమాధి మందిరంలోనూ, 'సాయి బాబా నాలో అవతరించారు' అంటూ ప్రజలను మోసగిస్తూ పాదాలకి వందనాలు చేయించు కుంటున్నారని సావంత్ రాశారు. నకిలీవాళ్ళు కూడా తమ స్థలంలో అభివృద్ధి అవుతున్నారని సావంత్ వ్యాఖ్యానించారు.

సద్గురువుతో తమ్ముపోల్చుకునే సాహసం చేసే వారకి చివరికి అధోగతే అంటారు సావంత్.

## ☞ బురిడీ ప్రచారం ఫలించిందా?

"అయితే, శ్రీ షిర్డీసాయిబాబాను గాఢంగా విశ్వసించే కొందరు భక్తులు మాత్రం ఈ విషయం నమ్మేవారు కాదు. ఈ నాటికి కూడా దేశవిదేశాల నుండి వచ్చే ఎందరో భక్తులకు షిర్డీగొప్ప యాత్రాస్థలముగా ఉంటోంది. 60 సంవత్సరాల తరువాత కూడా ఈ విషయంలో షిర్డీభక్తులకు కొన్ని అపోహలున్నాయి"

- దైవతమానుషాకారం, పే. 104,105.

*"...Officially the Sansthan in Shirdi (and some Shirdi Sai devotees) have not accepted the authenticity of Sathya Sai Baba as a reincarnation of Shirdi Sai Baba. A number of Shirdi Sai devotees are in fact still quite antagonistic to Sathya Sai Baba..." - Shirdi Sai Baba in the light of Sufism, page 376.*

("...అధికారికంగా షిర్డీ సంస్థాన్ (మరియు కొందరు షిర్డీసాయి భక్తులు), షిర్డీ సాయిబాబా అవతారంగా సత్యసాయిబాబా సాధికారికతను ఇప్పటివరకూ ఆమోదించలేదు. చాలామంది షిర్డీసాయి భక్తులు సత్యసాయి బాబా పట్ల ఇప్పటికీ వ్యతిరేక భావంతోనే ఉన్నారు...") - షిర్డీసాయి ఇన్ ది లైట్ ఆఫ్ సూఫీజం, పే. 376)

ఈ పుస్తకాలు బురిడీబాబా భక్తులు రాసినవేనని గమనించాలి.

## ☞ షిర్డీసాయిని సారథి చేసి రథమెక్కిన బురిడీబాబా

బాబా సంస్కారం చాలా తక్కువ స్థాయిలో ఉన్నట్టు గతంలో శివుడు పార్వతీ తదితర దైవవిగ్రహాల్ని తన పాదపీఠం దగ్గిర ప్రదర్శించినపుడే చూశాం. (చూడండి : విజయవిహారం, ఏప్రిల్ సంచిక) బుద్ధుడి వేషం తన పాదాలపై పడే డ్రామాలు ప్రదర్శించి నపుడే చూశాం.

తాను షిర్డీసాయినేనని, షిర్డీసాయికి సమానుడినేనని చెప్పుకున్నా బురిడీబాబా అహంకారానికి తృప్తిలేదు. షిర్డీసాయిని ఏదోవిధంగా తన కంటే తక్కువ అని చూపితేనే ఆయన అహం శాంతిస్తుంది.

అవసరార్థం షిరిడీసాయిని తలకెత్తుకున్నా, "బుద్ధుని తర్వాత వచ్చిన అవతారం తానేనని" ప్రకటించి షిరిడీసాయిని పూర్వపక్షం చేసేందుకు బురిడీబాబా ప్రయత్నించిన సందర్భాలున్నాయి. (ఆధారం : దైవతం మానుషాకారం, పే.280).

"...షిరిడీ సాయిబాబా-శక్తి అవతారం. అందుకే ఆ అవతారంలో అంత కోపం. శక్తి కాబట్టి ఎవరికీ ఆ అవతారం గురించి అంతగా తెలియలేదు.."-అన్యథా శరణం నాస్తి, పే.222.

ఆ అవతారం గురించి అంతగా ఎవరికీ తెలియలేదు అని బురిడీబాబా అనడం ఎంత సాహసం! (ఆ సందులో, నా గురించి తెలిసి నంతగా షిరిడీసాయి గురించి ఎవరికీ తెలియ లేదని - చెప్పుకోవాలనుకునే - తెంపరి తనమే కదా ఇది). షిరిడీ సాయికి స్వల్పకాలంలోనే లభించిన వైభవం, ఖ్యాతి ఆధ్యాత్మిక లోకంలోనే అపూర్వం. నిజానికి మన దేశంలో షిరిడీ సాయి బొమ్మ/ఫోటో లేని పూజా గృహం లేదని చెప్పడం అతిశయోక్తి కాదు.

"...షిరిడీ సాయి శరీరంలో ఉన్నప్పటి కంటే ఈ శరీరంలో ఉన్నప్పుడు "ఏ కొద్దిమంది మాత్రమే ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం పొందితే చాలదు అనిపిస్తూ ఉంటుంది నాకు" అంటూ ఉంటారు బాబా తరచుగా..." - సత్యం శివం సుందరం, నాల్గవ భాగం, పే.105.

అంటే - షిర్డీసాయి ఏ కొద్ది మందికో ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం ఇవ్వదలుచుకున్నట్టు తాను అందరికీ ఇవ్వదలుచుకున్నట్టు - అంచేత ఆటోమేటిగ్గా తాను షిర్డీసాయి కంటే పెద్ద అవతారాన్నని చెప్పకనే చెప్పినట్టేకదా-

అన్నిటిలోకీ ఘోరమైన సంగతి, ఎవరైనా, ఏ విశ్వాసాలు కలవారైనా ఆమోదించలేని సంగతి - కోట్లాది ప్రజలచే దైవంగా, ప్రవక్తగా పూజలందుకుంటున్న మహనీయుడికి జరగకూడని అపచారం సంగతి - బురిడీ క్యాంపు చేసిన నేరం సంగతి - ఒక గొప్పగా, నిస్సిగ్గుగా - బురిడీబాబా అధికారిక జీవిత చరిత్ర సత్యం శివం సుందరం, ప్రథమ భాగం, 127వ పేజీలో చోటు చేసుకుంది.

"... మరొకప్పుడలంకరింపబడిన రథములో తాను అధిక స్థానములో కూర్చుండి (తన క్రింద) సారధి స్థానములో షిర్డీబాబా విగ్రహమును పెట్టి, ఆ విగ్రహము యొక్క యెడమ చేతిలో రథమున కలంకరింపబడిన గుఱ్ఱముల వగ్గములను, కుడి చేత కోలను నుంచును..."

దీంట్లో చర్చించేందుకు, వాదించేందుకు ఏమీలేదు. ఇది ఘోరం, నేరం, అనైతికం ఒక మహాప్రవక్త పట్ల అపచారం, బురిడీబాబా అహంకారానికీ, కుసంస్కారానికి, అపరాధ మనస్తత్వానికీ బుజువు అని మాత్రం చెప్పదలుచుకున్నాను.

## ☞ బురిడీబాబా అని ఎందుకంటున్నాం?

పుట్టపర్తి అసలు పేరు రత్నాకరం సత్యనారాయణ రాజు. ఒక ముహూర్తంలో ఆయన తాను షిర్డీ సాయిబాబానని ప్రకటించుకున్నాడు. ఈ ప్రకటన వెనుక కేవలం దుర్బుద్ధి, దురాశ, కుట్ర తప్ప మరేం లేదు. ఎవరైనా ఒక వ్యక్తి తాను గాంధీ మహాత్ముడినని కానీ, వివేకానందుడినని కానీ, రామకృష్ణ పరమహంసనని కానీ, అంబేద్కర్‌నని గానీ ప్రకటించుకున్నంత మాత్రాన వాళ్ళని అలా పిలవాల్సిన అవసరం లేదు.

ఈ రత్నాకర సత్యనారాయణ రాజుని సాయిబాబా అని సంబోధించడమంటే - ఇతగాడి కుట్రని ఆమోదించినట్టే అవుతుంది, పైగా అది షిరిడీ సాయిబాబా పట్ల అపచారం కూడా అవుతుంది. అందుకే గత 11 సంచికల్లో ఈ సీరియల్‌లో - కేవలం ఇతరుల అభిప్రాయాలను పేర్కొనడం, పుస్తకాల్లో అంశాలను ఉల్లేఖించటం, అనువదించడం వంటి అరుదైన సందర్భాల్లో తప్ప ఇతగాడ్ని ఉద్దేశించి సాయిబాబా అనే పదం ప్రయోగించేందుకు నేను ఇష్టపడలేదు.

మరి రత్నాకరం సత్యనారాయణ రాజు అంటే బహుశా ఎవరూ గుర్తుపట్టరు, నేను చెప్పేది అర్థం చేసుకోరు కూడా. అందుకే ప్రత్యామ్నాయ పదాలని అన్వేషించే ప్రయత్నం చేశాను.

ఇతగాడు ఛీటర్ అనీ ప్రజల్ని మోసం చేస్తున్నాడు కాబట్టి - బురిడీ బాబా అనడం సమంజసం అని అనిపించింది, విన్న మిత్రులు సమర్థించారు. బురిడీ - అంటే బోల్తా కొట్టించడం, మోసం చేయడం అనే అర్థం తప్ప వేరే అర్థమేమీ లేదు. ఆ విధంగా బురిడీబాబా అనే పదం - ఈ మిలీనియం ఆధ్యాత్మిక ఛీటర్‌గా పరిగణించాల్సిన వ్యక్తికి అతికినట్టుగా సరిపోతుందని భావించి దాన్నే సీరియల్ మకుటంగా ఎంచుకున్నాను.

ఇతగాడు పుట్టింది పుట్టపర్తిలో - భక్తులు పర్తి బాబా అంటే, నేను పుట్టబాబా అన్నాను. గారడీలు చేస్తున్నాడని గారడీ బాబా అన్నాను.

ఈ సీరియల్‌లో ఈయనని సంబోధించేందుకు, నేను వాడుతున్న పదాల విషయంలో వివరణ ఇచ్చేందుకు - ఇది సరైన సందర్భమని నేను భావించడం వలన ఈ వివరణ ఇస్తున్నాను.

మరిన్ని విశేషాలతో వచ్చే సంచికలో కలుద్దాం.

(ఇంకా ఉంది)

# అమ్మజోల, నాన్నపాట, తెలంగాణా పల్లె పదం కలిస్తే నా పాట

## సుద్దాల అశోక్ తేజ



ఆ ఇంట్లో అతనికన్నా ముందే పాట పుట్టింది. పాటతో కలిసి అతడు పెరిగాడు. పలుమార్లు పాటతో పేచీలు పడ్డాడు. ఒకసారి పాట గెలిచింది. మరోసారి అతను గెలిచాడు. చివరికి పాట అతనికి ప్రాణమైంది, జీవనాధారమైంది. పాటనే ప్రాణవాయువుగా, సుద్దాల నుంచి మద్రాస్ వరకూ ప్రయాణించిన ఆ పాటసారి .. సుద్దాల అశోక్ తేజ.

*నేలమ్మ నేలమ్మ నేలమ్మా*
*నీకు వేల వేల వందనాలమ్మా*

నేలతల్లికి దండం పెడుతూ సాగే ఈ పాట రాసినప్పుడు అది తెలంగాణా జాతీయగీతమన్నారు. మరికొంతమంది సుద్దాల హన్మంతుకి తగ్గ వారసుడనన్నారు. ఎవరేమన్నా అద్భుతమైన పాటలతో జనహృదయంలో ఒక మంచి స్థానాన్ని సంపాదించుకున్నది మాత్రం నిజం.

నల్గొండ జిల్లా సుద్దాలలో పుట్టి, కరీంనగర్ జిల్లా మెట్‌పల్లిలో టీచర్‌గా పనిచేసి సినిమాల్లోకి రావాలన్న తపనతో వుద్యోగాన్ని వదిలిపెట్టాడు.

*పల్లెటూరీ పిల్లగాడా*
*పసులగాసే మొనగాడా*
*పాలు మరిచీ ఎన్నాళ్లయ్యిందో*

అంటూ తండ్రి రాసిన పల్లెపదాల్నీ, జానపదాల్నీ జోలెలో వేసుకుని మద్రాసుకు చేరుకున్నాడు. నిలబడటం కోసం మొదట్లో ఏవేవో పాటలు రాశాడు. దాసరి 'ఒసేయ్ రాములమ్మా'లో రాసిన పాటల ద్వారా అశోక్ తన సత్తా ఏమిటో నిరూపించుకున్నాడు.

*'రామసక్కని తల్లి రాములమ్మో రాములమ్మా*
*సినబోయి కూసున్నవెందుకమ్మో ఎందుకమ్మా*
*తల్లడిల్లకు బిడ్డ రాములమ్మా*
*నువ్వు తల్లివవుతున్నావు రాములమ్మా'*

అంటూ తల్లి అవసరమైన పసిపిల్ల తనే తల్లయిన సందర్భగీతం అశోక్ కలం నుంచి ఆర్ద్రంగా జాలువారింది.

దళం సినిమాలో రాసిన పాటను చూడండి.

*'అవ్వ నీకూ దండమే, ఆలు నీకూ దండమే*
*బతుకుముళ్లబాటలోన జతగ స్నేహితురాలవైతివి*
*కళ్లనీళ్ల తుడిచేవేళ తోడబుట్టిన చెల్లెవైతివి*
*పురిటినొప్పుల బాధ తెలియని పురుషజాతికి తల్లివైతివి'*

స్త్రీ ఔన్నత్యాన్ని బహుశా ఇంతకంటే గొప్పగా ఇంకొరు రాసివుండరు.

ఎన్‌కౌంటర్, అడవిలో అన్న, అడవిచుక్క లాంటి సినిమాలతో పాటు... నిన్నేపెళ్లాడుతా, మురారి, సముద్రం, లాంటి పక్కా కమర్షియల్ సినిమాల్లోనూ తనదైన ముద్రతో పాటలను రాసి మెప్పించాడు.

**కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టి సినిమాల్లో ఈ పాటలేంటీ.. అని అడిగితే....**

ప్రజాకళాకారుడి కుటుంబంలో పుట్టిన నాకు కళలంటే చిన్ననాటి నుంచి ఆసక్తి, వెర్రి వ్యామోహం. అదే నన్ను సినిమావైపుకు నడిపించింది. ఎందుకంటే సినిమా అనేది లలితకళల చౌరస్తా.... అని చెబుతాడు.

సినీమాయలోకానికి ఎన్నిపాటలు రాసినా, కవిగా తాను బతికి వున్నాడో లేదో అన్న అనుమానం అశోక్‌ను ఎన్నో కొత్తపాటలను రాయించింది.

**పాట ఎలా పుట్టిందీ.. ఎలా ఎదిగిందీ అని అడిగితే..**

*'ఒకటో మాసంలోన ఉయ్యాల*
*ఒకటాయె రెండాయె ఉయ్యాల*
*రెండో మాసంలోన ఉయ్యాల*
*రెండాయె మూడాయె ఉయ్యాల'*

ఇలా తల్లి నిండు చూలాలుగా వున్నప్పుడు పాట, బిడ్డ పుట్టినప్పుడు పాట, ఎదుగుతున్నప్పుడు పాట, పెద్దమనిషైనప్పుడు పాట, పెళ్లప్పుడు, తల్లి అయినప్పుడు, రోకలివేసేటప్పుడు, నాటువేసేటప్పుడు, కోత కోసేటప్పుడు... ఇలా నిరంతరం మనిషి జీవితంతో పెనవేసుకుపోయిన పాట, చనిపోయిన తర్వాత శవం ముందు చిరుతలు పట్టుకుని ఆధ్యాత్మిక గీతం పాడేదాకా మనల్ని వెంటాడుతూనే వుంటుంది. ఇక పాటలేని జీవితం ఎక్కడుంది? అంటారాయన.

**ఇంత బలీయమైన సాహిత్య నేపథ్యానికి కారణం ఏమిటని అడిగితే...**

'చిన్నప్పుడు అమ్మపాడిన జోలపాటలూ, నాన్న రాసిన, పాడిన గీతాలూ, తెలంగాణాతో వున్న పేగుబంధం, కరీంనగర్ ఉద్యమ ప్రభావం, జానపదుల సాహిత్యం...అన్నీ కారణమే'.. అని చెబుతారు.

**మరి ప్రజాసాహిత్యాన్ని సినిమాలకు అమ్ముకుంటున్నారనే విమర్శ...**

నాకెప్పుడూ ప్రజా ఉద్యమాలతో ప్రత్యక్ష సంబంధం లేదు. కానీ వారి త్యాగాలపట్ల, ఉద్యమ జీవితం పట్ల అపారగౌరవం వుంది. పక్కనున్నవాడిని పట్టుకుని కాల్చి చంపుతున్న రాజ్యహింసపై కవిగా స్పందించటం వల్లే ..

*'పల్లె తెల్లవారుతున్నదా, పల్లె బతుకు తెల్లవారుతున్నదా*
*పాలధారలతోటి, కోడికూతలతోటి తెల్లవారెపల్లె*
*లాఠీల దెబ్బల్ల, తుపాకీ మోతల్ల తెల్లవారుతున్నదా..'*

అని ఎన్‌కౌంటర్ సినిమాలో తెలంగాణా వర్తమాన కల్లోలాన్ని అంతబలంగా రాయగలిగాను. ఎందుకంటే నేను తెలంగాణా వాడిని. తెలంగాణా మట్టిలో నుంచి పుట్టినవాడిని. అంతేగానీ, ఉద్యమాలతో ఎలాంటి క్రియాశీల సంబంధం లేదు. ఎం.ఎఫ్. హుస్సేన్, రవివర్మలు తమ కళను అమ్ముకున్నట్టు భావిస్తే... నేను కూడా అందుకు మినహాయింపేమీ కాదు.

'అవ్వ నీకూ దండమే'(1996) పాటకి కళాసాగర్ అవార్డు, 'రామసక్కని తల్లి రాములమ్మో' పాటకు ఆత్రేయ అవార్డు(1997), 'ఆడకూతురా నీకు అడుగడుగున వందనం' పాటకి(1998) నంది అవార్డు, 'నవ్వాలమ్మా నవ్వాలి' పాటకి (1999) సినీగోయర్స్ అవార్డులు వచ్చినా అవి కేవలం సినీగేయరచయితగా నక్సెన్‌కి కొలమానాలే తప్ప రచయితగా పూర్తి సంతృప్తి లేదంటాడు. పల్లెల్లో పసులుగాసే పోరగాళ్లను సుద్దాల అశోక్ ఎవరని అడిగితే 'నేలమ్మ నేలమ్మ పాట రాసిన గాయిన ...బాగా తెల్సు.. అన్నప్పుడే నేను కవిగా బతికినట్టు లెక్క అంటాడు. ఎందుకంటే ఏ జాక్సన్ పాడలేని పల్లెటూరి పాటగాళ్లు .. అసలు సిసలు కవులు వాళ్లే .. వాళ్లు పెట్టిన భిక్షనే మేం సినిమాల్లో అమ్ముకుంటున్నాం' అంటూ వినమ్రంగా చెబుతాడు సుద్దాల అశోక్ తేజ.

- క్రాంతికుమార్

# మూసకథలకి ఫ్యాక్షన్ మసాలా జోడిస్తే ... వారెవ్వా!

తెలుగు సినిమా రంగానికి రాయలసీమ ఫ్యాక్షనిజం ఇటీవలి ఇన్స్‌పిరేషన్. ఇప్పుడు అదే నేపథ్యంతో తీసిన బాలకృష్ణ సినిమా 'నరసింహనాయుడు' మంచి హిట్టయింది. దీనికి ఏడాదిన్నర ముందు వచ్చిన బాలకృష్ణ మరో సినిమా 'సమరసింహారెడ్డి' సూపర్ డూపర్ హిట్టయింది. ఈ రెండు సినిమాలకూ మధ్య విడుదలైన బాలకృష్ణ సినిమాలు ఏ ఒక్కటీ చెప్పుకోదగ్గ విజయాలు సాధించలేదు. ఇప్పుడు సినిమా పండితులు ఈ సంగతిని బాగా గుర్తించి 'ఫ్యాక్షన్' ఇష్టులుగా మారిపోతున్నారు. ఈ ఊపులో మరో పది పదిహేను సినిమాలను రాయలసీమ వాసనతో తీయబోతున్నారు.

ఇదంతా తమ్మారెడ్డి భరద్వాజ తీసిన 'కడప రెడ్డమ్మ'తో మొదలైంది. ఆ తర్వాత వెంకటేష్ సినిమా 'ప్రేమించుకుందాం...రా' సినిమా ఫ్యాక్షనిజం బ్యాక్‌గ్రౌండ్‌లో విజయం సాధించే ప్రేమికుల కథ. ఈ సినిమా విజయవంతంగా నడిచింది.

తెలుగుదేశం నాయకుడు, మాజీ మంత్రి పరిటాల రవి, 'శ్రీరాములయ్య' పేరుతో తన తండ్రి పరిటాల శ్రీరాములు జీవితాన్ని తెరకెక్కించాడు. ఇందులో హరికృష్ణ ఒక ప్రత్యేక పాత్ర పోషించాడు. ఆ తర్వాత వచ్చిన 'అంతఃపురం' పూర్తిస్థాయి ఫ్యాక్షన్ సినిమా. ఇందులో ప్రకాష్‌రాజ్ నటనకి మంచి పేరు వచ్చింది. (ఈ సినిమాని



తమిళ్‌లో ప్రకాష్‌రాజ్ హిందీలో శ్రీదేవి పునర్నిర్మిస్తున్నారు). ఈ మధ్యన వచ్చిన 'జయం మనదేరా' సినిమాలో పల్నాడు ప్రాంతపు ఫ్యాక్షనిజం కనిపిస్తుంది.

నిజానికి ఈ సినిమాలలో రాయలసీమ నిజమైన సమస్యల పట్ల అవగాహన కనిపించదు. దర్శకులకీ, నిర్మాతలకీ కావలసింది - ఆ పేరుతో బీభత్సమైన హింసాత్మక చిత్రాలను తీయటం, కలెక్షన్లు వసూలు చేసుకోవటం. (హీరోహీరోయిన్లు తప్ప) విలన్‌లు ఇతర పాత్రధారులందరూ రాయలసీమ మాండలికం మాట్లాడతారు. కరకు కత్తులు, నాటు బాంబులు, రక్తప్రవాహాల మధ్య హీరోహీరోయిన్లు ఏ స్విట్జర్లాండ్‌లోనో, న్యూజీలాండ్‌లోనో పాడుకునే పాటలుంటాయి. అలా హింసకు హింస, గ్లామర్‌కి గ్లామర్ - రెండింటినీ కలిపి కొట్టి ఈ 'రాయలసీమ' సినిమాలను వండుతున్నారు. రాయలసీమ అనగానే ఫ్యాక్షనిస్టులూ, బాంబులూ వారి హింసాకాండ తప్ప ఇంకేమీ వుండదనే రీతిలో ఈ చిత్రాలు వుంటున్నాయి.

కథలకోసం నానా అగచాట్లూ పడే తెలుగు సినిమా వారికి రాయలసీమ బంగారు బాతులా మారింది. కొత్తదనం ఉన్న కథలను రూపొందించుకునే శ్రమకి బదులు పాత కక్షలూ కార్పణ్యాల కథలకు రాయలసీమ మసాలా చల్లితే సరిపోతుంది. కథలో మంచి నేటివిటీ కనిపిస్తుంది. కత్తులకి బాగా పదును పెట్టచ్చు. కలెక్షన్స్‌కి తిరుగుండదు. అంతకంటే కావల్సిందేముంది?

# సినిమాల్లేని కాలంలో



శ్రీదేవికి ఈ మధ్య రు.6 కోట్లు కలిసి వచ్చాయి. ఇది సినిమా డబ్బు అనుకునేరు? కాదు? కోర్టులో కేసు గెలిచింది. అదీ అమెరికా కోర్టు నుంచి... ఆ కేసు కమామీషు ఏమిటంటే.... శ్రీదేవి తల్లికి అమెరికాలో కెటరింగ్ హాస్పిటల్‌లో ఆ మధ్య బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ జరిగింది. కుడిఎడమైనా పరవాలేదనుకున్నారేమో...ట్యూమర్ ఒకవైపు వుంటే ఆపరేషన్ మరోవైపు చేశారు. దాంతో తల్లి చనిపోయింది. ఆనక నాలుక్కర్చుకుని డాక్టర్లు అపాలజీ కూడా చెప్పుకున్నారు. కానీ శ్రీదేవి, ఆమె వెనకాలున్న బోనీ కపూర్ ఊరుకోలేదు. కోర్టుకెక్కింది. రు.6 కోట్ల నష్టపరిహారాన్ని ఇవ్వాలని తీర్పు చెప్పింది. డబ్బు వచ్చేసరికి ఇన్నాళ్ళు ముఖాముఖాలు చూసుకోని శ్రీదేవి, ఆమె చెల్లెలు లత దగ్గరయ్యారు. కోటి రూపాయలు లతకి, మరో చెల్లెలుగా చెప్పుకుంటున్న మహేశ్వరికి రు. 50 లక్షలు, కోటి రూపాయలు లాయర్‌కి పోగా 3 కోట్లు ఆమెకు మిగిలాయి.



## కష్టపడి కోట్లు సముద్రంలో పోసిన



సినిమాల్లో గ్రాఫిక్స్ ఉపయోగించటం హాలీవుడ్‌లో ఇపుడు మామూలు విషయం. అయితే తెలుగు సినిమా మరింత ముందుకెళ్ళి గ్రాఫిక్స్ కోసమే ఓ సిన్మా తీశారు (కాదు లాగారు...) అదే 'దేవీపుత్రుడు'. సినిమా ప్రారంభంలోనే 'ద్వారకా నగరం' (అదే కృష్ణుడి నగరం) సముద్ర గర్భంలోకి మునుగుతుంది ((ప్రేక్షకుల కొంప కూడా...). ఆ తర్వాత ఏం జరుగుతుంది అన్నదే సినిమా మొత్తమూ. దీన్ని సోషియో ఫాంటసీ చిత్రమని ముద్రవేయటానికి అనేక అంశాలు వున్నప్పటికీ - ఓ జన్మనివ్వని (లేదా పుట్టీపుట్టని) పాప - ఆమె తాలూకు హమ్మింగ్ (హంటింగ్) ముఖ్యం. ఇంకా ఈ సినిమాలో అవసరమైన అనేక పాత్రలతో పాటు - ఆర్కియా'లాజిక'ల్ డిపార్ట్‌మెంటు ప్రహసనం కూడా వుంది. మొత్తానికి నిర్మాత (పాపం!), దర్శకుడు, కంప్యూటర్ కలిసి ఓ చిత్రాన్ని తీసి చేతులు దులుపుకున్నారు. ఈ చిత్రం పట్ల హాలీవుడ్ నటుడు హారిసన్ ఫోర్డ్ ఏమైనా ఆసక్తి చూపించే అవకాశాలు వున్నాయి తప్పితే ప్రేక్షకులు కాదు.

సినిమా కథ గురించి చెప్పాలంటే - ఓ చిల్లర దొంగ (బొంబాయిలో లెండి) - నెక్లెస్ వుందని చెప్పి తాత మనవరాలిని కిడ్నాప్ చేయటం-ద్వారకా చేరటం - పాప కలవటం -కథ చెప్పటం-శక్తి పేటికని తిరిగి సముద్రంలోకి పడేయటం - వంటి కన్ఫ్యూజింగ్ పాయింట్ల మీద నడిపించబడింది. చిల్లర దొంగగా - ఆర్కియాలజిస్ట్‌గా (ఇరవై వేల జీతం - ద్వారకలో నివాసం!) రెండు పాత్రల్లో - అంజలా జవేరీ (పాటలకు) సౌందర్య (సెంటిమెంటుకు), సురేష్ (సస్పెన్స్‌కు), అలీ (హాస్యానికి!?) తమ వంతు కృషి చేశారు. విఫలమయ్యారు. సిన్మాలో దేవీపుత్రుడు ఎవరన్నది మనకి ముందే తెలిసిపోతుంది. (మళయాళ డబ్బింగ్ సినిమా, మోహన్ లాల్ నటించిన 'యోధ' ప్రేక్షకులకు గుర్తొస్తే అది వాళ్ళ తప్పు ఎంత మాత్రం కాదని మనవి).

గతంలో అంకుశం లాంటి పవర్‌ఫుల్ హిట్ తీసిన దర్శకుడు ఇలాంటి చిత్రం ఎందుకు, ఎలా తియ్యగలిగాడో అర్థం కాదు. సోషియో ఫాంటసీ కనుక లాజిక్ వుండదని ముందే ప్రిపేరయిన ప్రేక్షకులు తీరా సినిమా చూసేటప్పటికీ 'మరీ ఇంతనా?' అని ఆశ్చర్యపోతారు. కష్టపడి కొన్ని కోట్లు సముద్రంలో పోసిన సినిమా ఇదే! లాజిక్‌కు అందని ఎన్నో సంఘటనలు సహజమే అయినా- మరీ ఇంత తర్కరహితంగా సినిమా వుంటుందని ప్రేక్షకులు ఊహించలేరు.

కథ వివరంగా చెప్పుకోవాలంటే ఓ చిల్లర దొంగ జనాల్ని (ప్రేక్షకుల్ని) దోచుకోవటం - ఆనందంగా పాట పాడటంతో మొదలవుతుంది. (అంతకు ముందే ద్వారక సముద్రంలో...) దానికన్నా ముందు అమెరికా నుంచి ఓ అమ్మాయి ఇండియాకు వస్తే (అంజలా) ఆమె అక్క (సౌందర్య) ద్వారక వెళ్ళిందని తెలుస్తుంది. ఆమె అక్క కోసం బయలుదేరుతుంది. చిల్లరదొంగ (వెంకటేశ్) వాళ్ళని తీసుకుని ఎలాగోలా (చిత్రంగా) ద్వారక చేరుతాడు. అక్కడ అందరూ వెంకటేశ్‌ని చంపే ప్రయత్నం చేస్తారు. మధ్యలో ఓ పాప (మాయ) కలిసి ఇంకో వెంకటేశ్ కథ చెపుతుంది. ఈ ఆర్కియాలజిస్ట్ ఏదో కనుక్కోవాలనే ప్రయత్నంలో వుంటాడు. ద్వారక కోసం సౌందర్య వస్తుంది. ఇద్దరూ పెళ్ళి చేసుకుంటారు - వెంకటేశ్ సముద్రంలో నుంచి 'శక్తి పేటిక' తీస్తాడు. అయితే అది ఓ ప్రళయానికి అడ్డుగా వుంటుంది. మళ్ళీ దాన్ని సముద్రంలోకి పంపకపోతే ప్రళయమే. చిత్రంగా ఆ పెట్టె కోసం (ఏ దేశస్థులో?) కొందరు ప్రయత్నించటం వెంకటేశ్ నిరాకరించటం - చచ్చిపోవటం - పెట్టె రహస్యం సౌందర్యకే తెలియటం వంటివి వున్నాయి. చివరకు పాప (సౌందర్యకు - వెంకటేశ్‌కు) సాయంతో చిల్లర దొంగ వెంకటేశ్ దాన్ని సముద్రంలో పడేయటంతో కథ ముగుస్తుంది.

హైటెక్ సినిమాలో ఓ మాంత్రికుడి పాత్రలో కోట శ్రీనివాసరావు వున్నాడు. ఏం చేస్తుంటాడో ఎవరికీ తెలియదు. ఎప్పుడూ ఆర్కియాలజిస్ట్ వెంట పడుతూ వుంటాడు. చిత్రం మొత్తం గందరగోళంగా గ్రాఫిక్స్ మయంగా వుండటంతో అర్థమైనప్పటికీ ఇది మాత్రం చికాగ్గానే వుంటుంది. ఎక్కడో బొంబాయిలో వున్న దేవీపుత్రుడు వెంకటేష్‌ని గుర్తించి ద్వారకకు రప్పించగలిగిన పాప చిల్లర మాంత్రికుడికి భయపడటం ఏమిటో? శక్తి పేటికలో ఏముందో తెలియకుండానే కొన్ని దేశాల వారు దాని కోసం తాపత్రయ పడటం ఆశ్చర్యమే. అయినా సోషియో ఫాంటసీ చిత్రంలో లాజిక్ కోసం వెతకటం గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలు వస్తున్నాయని చిరాకు పడటం లాంటిది.

ఈ సినిమాలో అసందర్భమైన పాటలు కూడా వున్నాయి. ఇంతా చేస్తే సస్పెన్స్ వుండకపోతే బావుండదని అదీ పెట్టారు. (ప్రేక్షకులు ఆ స్టేజి దాటిపోయారని మర్చిపోయినట్టున్నారు). మరీ విడ్డూరం (సారీ!) కడుపులో పాప మాట్లాడటం. గ్రాఫిక్స్ మీద నమ్మకంతో కథను వదిలేసిన ఈ సినిమా శక్తి పేటికలాగే - ఎక్కడ నుంచి వచ్చిందో అక్కడికే వెళ్ళిపోయే అవకాశాలు ఎక్కువ. జానపద బ్రహ్మ విఠలాచార్యగారు ఇంతకన్నా (బాగా) మంచి సిన్మాలు తీశారని జనం గొణుక్కుంటూ వెళ్ళటం ఆయనకి కాంప్లిమెంట్ కావచ్చు కానీ తెలుగు సినిమా వెనకబాటు తనానికి నిదర్శనం.

- సి.యస్

## చిరంజీవితో పాటు సింహాలూ కాపాడలేని



"పన్నెండు కోట్లు సింహం నోట్లో పెట్టారు..." ఈ సిన్మా గురించి ఒక్క మాటలో ఎవరో కాని బాగా చెప్పారు. తెలుగు సినిమా పరిశ్రమ ఓ జిరాక్సు సెంటర్ అన్నది మరోసారి రుజువు చేసే ప్రయత్నం ఇది. 'ది ఘోస్ట్ అండ్ డార్క్‌నెస్' అనే హాలీవుడ్ చిత్రానికి ఇది కాపీ. ఇందులో కొత్త ఏముంది? ఏమీ లేదు జిరాక్సు దారుణంగా వచ్చింది. సరిగ్గా కనపడటం లేదు. చిరంజీవి దారుణమైన ఫ్లాప్స్ జాబితాలో బహుశా దీనిది మొదటి స్థానం కావచ్చు.

కొద్దికాలం క్రితమే 'చూడాలని వుంది' అనే పర్వాలేని సినిమా తీసిన గుణశేఖర్ ఒక అర్థం పర్థం లేని సినిమా తీసి చిరంజీవిని మరింత ఇబ్బంది పెట్టాడు. ఎక్కడో కడుతున్న ఓ బ్రిడ్జి కట్టనివ్వకుండా సింహం అడ్డుపడే 'పాయింట్' బ్రహ్మాండం అని మొదట అనుకున్నవారు ఇపుడు చిత్ర విజయానికి అదే అడ్డం అని కూడా గొణుక్కుంటూ వుండవచ్చు.

కథ ప్రకారం ఓ దండకారణ్యంలో రైలు బ్రిడ్జి నిర్మిస్తే అది ఎంతో ఉపయోగం అని ప్రభుత్వం భావించి ఓ ఇంజనీర్ (సిమ్రాన్)ను పంపిస్తుంది. అయితే కార్మికులు పని చెయ్యటానికి భయపడుతుంటారు. కారణం ఓ సింహం. దాన్ని సహజంగానే చిరంజీవి తప్ప (ఇతను గైడ్ కూడా!) మరెవరూ చంపలేరని అంతా నిర్ణయించుకుని అతన్ని పిలిపిస్తారు. చిరంజీవి ఓ సింహాన్ని ఇంటర్‌వెల్ ముందే చంపేస్తాడు. అయితే మరో సింహం కూడా వుంటుంది. దాన్ని ఇంటర్‌వెల్ తర్వాత ఎలాగూ చంపుతాడు కనుక ప్రేక్షకులు టెన్షన్ పడరు. అయితే సింహాన్ని చూసిన తర్వాత ప్రేక్షకులు భయపడుతూ కూచుంటారు. ఆ భయం దాన్ని చూసి కాదు. దాంతో చిరంజీవి ఫైట్ చేస్తాడేమోనని! దర్శకుడు ప్రేక్షకుల పట్ల చూపించిన సాఫ్ట్ కార్నర్ ఇదొక్కటే! చిరంజీవికీ సింహానికీ మధ్య అస్సలు ఫైటింగ్ లేదు! ఈ సినిమా ఎందుకు విజయవంతం కాదో చెప్పటం కష్టం కానీ, ఎందుకు ఫెయిలవు తుందో చెప్పటానికి వంద కారణాలున్నాయి. మొదటి కారణం సింహం కథ- రెండు చిరంజీవి. అగ్రస్థానంలో వున్న నటుడు కాలక్రమేణా వయసుకు తగిన పాత్రలు ఎన్నుకోవటం మంచిదన్న చిన్న విషయం తెలుసు కోవటానికి కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. అదీగాక ఆఫ్రికాలో సింహం భారతదేశంలో ఏం చేస్తుందో? అలాంటి సింహాలు మన దేశంలో లేవన్నది నిర్మాత, దర్శకులకు తెలియదా? ఈ సిన్మా మరో 'విఫలకారణం' చిరంజీవి ఫ్లాష్‌బ్యాక్. అసలు ఇంజనీర్ సిమ్రాన్ గతంలో (అంటే గత జన్మలో కాదు - భయపడకండి) చిరంజీవి భార్య! మధ్యలో ప్రేక్షకుల్ని కన్ఫ్యూజ్ చెయ్యటానికి కొండొకచో కనువిందు చేయటానికి సంఘవి వుంది...

ఫ్లాష్‌బ్యాక్‌లో చిరంజీవి ఓ ఎగ్జిబిషన్‌లో సిమ్రాన్‌కు పరిచయం కావటం - గబగబా (చిత్రమైన స్థితిలో) పెళ్ళి కావటం జరిగిపోతుంది. సిమ్రాన్ తండ్రికి సహజంగా ఇష్టం వుండదు. చిరంజీవి తల్లిదండ్రులు (ఒక్కరే! ప్రకాశ్‌రాజ్, కోవై సరళ) గిరిజనులు - వాళ్ళని అవమాన పరిచినందుకు చిరంజీవి సిమ్రాన్‌ను వదిలేస్తాడు. సిమ్రాన్ తండ్రి తన తెలివితో ఇద్దరి మధ్య ఓ అగాధం సృష్టిస్తాడు.

చిరంజీవి కార్మికుల కోసం ఎలాగోలా చివరి వరకూ వుండి సింహాన్ని చంపేస్తాడు. ఈ సినిమాలో చిరంజీవి వయసు స్పష్టంగా కనబడింది. ప్రేక్షకుల కోసం ఓ పాట (చాయ్ పాట) కూడా చిరంజీవి పాడాడు. ఒక హాలీవుడ్ సినిమాని తెలుగీకరించే ముందు అది మన రాష్ట్ర/దేశానికి సరిపోయే కథనేనా అని ఆలోచించక పోవటం పెద్ద తప్పు. ఈ సిన్మాలో మరీ బావుండదని ఇద్దరు విలన్‌లు (రామిరెడ్డి, సూర్య) వున్నారు. దీని మాతృకలో మనకు సింహం చాలా సేపటి వరకూ కనపడదు. అయినా ఎఫెక్ట్ వుంటుంది. మృగరాజులో సింహం కనపడినా పెద్దగా ఎఫెక్టు కనిపించలేదు. సినిమా సింహానికి సంబంధించిందైతే - బీద-ధనిక సంఘర్షణే ఎక్కువ భాగం వుంది. అదే ప్రేక్షకులను విసిగించింది. చాలా కాలం తర్వాత మళ్ళీ ఈ సినిమాలో చిరంజీవి చెలరేగి డాన్సులు చేసినప్పటికీ - ప్రేక్షకులు మృగరాజు (సింహం) కోసమే ఎదురుచూస్తుంటారు కనుక ఆ వైపు దృష్టి పోదు. ఇంటర్‌వెల్‌కు ముందే సింహాన్ని చంపినా మరో సింహం కథ నడపటం కోసమే పెట్టారు. చిరంజీవిని అపార్థం చేసుకున్న సిమ్రాన్ పెద్దగా కన్విన్స్ కాకుండానే మళ్ళీ అర్థం చేసుకోవటం చిత్రమే. సింహం వచ్చే సన్నివేశాలు, అది జనం మీద చేసే దాడి చిత్రీకరణ మొత్తం చాలా చప్పగా వుంది. చిరంజీవి సిన్మాలో సింహం మాత్రం ఏం చెయ్యగలదు. ఎంత మృగరాజైతే మాత్రం. సింహంచుట్టూ నడిచే (లేక నడవాల్సిన) కథలో దాని ప్రాధాన్యత తక్కువే! ఈ చిత్రం చిరంజీవిని, ప్రేక్షకులనీ ఇద్దరినీ సమానంగా నిరాశ పరిచి వుండవచ్చు. ఎందుకంటే 'మృగరాజు' సిన్మాలో ఒక సింహం, ఒక చిరంజీవి వుంటే ఎవరు రాజో తెలిసేది. అయితే రెండో సింహం టెంపోను దెబ్బ తీసింది. చిరంజీవి సిన్మాలో ఏదైనా భారీగా వుంటుందన్నది ఓ అభిప్రాయం. దాని ప్రకారం సింహం మాత్రం భారీగానే వుంది- రెండో సింహం కూడా. అయినా రెండు సింహాలు (మూడా?) కూడా సినిమాను కాపాడలేవు.

- బాషా

## గ్రాఫిక్స్ పాకానికి కొంచెం హిందీ తిరగమోత



ఓ అందమైన పల్లెటూరు, పచ్చని పంటపొలాలు, గలగలా పారే నది, లంకంత కొంప, హడావిడి జనం, వాళ్ళ నవ్వులు, కేరింతలు... ఇదంతా ఒక అందమైన కల. అంతలోనే గ్రాఫిక్ మాయలూ, గుళ్ళో విరామమెరగక వెలిగే దీపాలు, అప్పుడప్పుడూ భగ్గున మండే మంటలు... ఇవన్నీ మధ్యలో వచ్చి ఆ అందమైన కలను చెడగొట్టేస్తుంటాయి. కృష్ణవంశీ అనగానే ఏదో నావెల్టీ ఉంటుందన్న ఆశతో వెళ్ళే ప్రేక్షకుడు ఉస్సురుమంటూ బయటికి వస్తాడు. దీనికి కారణం ఆయనలోని క్రియేటివ్ డైరెక్టర్‌ని కంప్యూటర్ గ్రాఫిక్స్ పూర్తిగా డామినేట్ చేయడమే. ఈ మధ్యే సూపర్‌హిట్టయిన ఉత్తరాది కుటుంబ సినిమాల సారాన్ని చాలా దృశ్యాల్లో కాపీ కొట్టినట్టు అనిపిస్తాయి.

కథా ప్రారంభం 19వ శతాబ్దం. మురారి ముత్తాత (ప్రకాష్‌రాజ్) తెల్లదొరల వద్ద చేసిన అప్పుతీర్చడం కోసం దేవాలయంలోని అమ్మవారి విగ్రహాన్ని కదల్చడానికి ప్రయత్నిస్తాడు. అంతలోనే అమ్మవారి గ్రాఫిక్ మాయలతో దీపాల నూనె పడి అందరూ కాలిపోతారు. ఆ పాపం మురారి వంశాన్ని వెంటాడుతూ ప్రతి 48 ఏళ్ళకు ఒకమారు ఆ కుటుంబంలోని ఒకరిని బలితీసుకుంటుంది. వర్తమాన కాలానికి వచ్చేవరకు అమ్మవారి ఆగ్రహం మురారిపై వుంటుందని పూజారి మురారి బామ్మకు చెపుతాడు. మురారికి చివరకు ఏమవుతుందోనన్న టెన్షన్‌తోనే చివరిదాకా ప్రేక్షకుల మనస్సులోనే పట్టి వుంచుతాడు. మాయలూ, మర్మాలతో బోర్ కొడుతున్న ప్రేక్షకులు సోనాలి బెంద్రే ఎంట్రీతో కాస్త రిలీఫ్‌గా ఫీలవుతారు.

మురారి (మహేష్‌బాబు) పెద్ద వదినతో పాటు ఆమె పుట్టింటికి వెళ్ళి వసుంధర (సోనాలి బెంద్రే)తో ప్రేమాయణం సాగించడం కాసేపు ప్రేక్షకులమనసుల్ని గిలిగింతలు పెడుతుంది. మురారి, వసుంధర వరుసకు బావా మరదళ్ళవుతారు. ఇంకేం. బావా మరదళ్ళ ప్రణయం ఎన్ని తెలుగు సినిమాల్లో చూల్లేదు. కానీ ఈ బావా మరదళ్ళ సరసం ఇంకొంచెం మోడరన్‌గా ఉంటుంది లెండి. మురారికి వసుంధర షర్ట్ గుండీలు పెట్టడం. తెగ కష్టపడి టీ చేసివ్వడం, మురారి వసుంధరను 'ఏంట్లా' అంటూ ఏడిపించడం, పాము చూపెట్టి భయపెట్టడం... చెప్పుకుంటే చాలా ఉన్నాయి. ఇవన్నీ ప్రేక్షకులకు గిలిగింతలు పెడతాయి. 'బంగారు కళ్ల బుచ్చమ్మో' అంటూ బావా మరదళ్ళు సరసంగా పాడుకున్న పాటలు ప్రేక్షకులకు గిలిగింతలు పెడతాయి. మురారి, వసుంధరను దగ్గరగా చూసినపుడు 'అయ్ బాబోయ్ టెంప్టయిపోతున్నానేంటి' అనడం, వసుంధర దగ్గరినించి విడిపోయేపుడు గట్టిగా వసుంధరను కౌగిలించుకున్న మురారి మామూలుగా వెళ్ళిపోవడం... ఇవన్నీ ప్రేక్షకుల మనసుల్ని గట్టిగా పట్టేస్తాయి. కుటుంబదృశ్యాలు, బావామరదళ్ల రొమాంటిక్ సీన్స్ చూస్తూ కలల్లోకి జారిపోయే ప్రేక్షకుడ్ని... మాయమంత్రాల కంప్యూటర్ గ్రాఫిక్స్ గాలంవేసి లాక్కొస్తుంటాయి. గ్రాఫిక్స్‌ని జొప్పించేందుకు మాయమంత్రాల దృశ్యాల్లో అయితే బోల్డుస్కోప్ ఉంటుంది కాబట్టి ఇలాంటి కథ ఎన్నుకున్నారేమో అనిపిస్తుంది. అమ్మవారి పీడ మురారి బామ్మతో పాటు మనల్నీ భయపెడుతుంది. చివర క్లైమాక్స్‌ను పెద్దగా సాగదీసి ప్రేక్షకులకు బోర్ కొట్టించాడు దర్శకుడు. క్లైమాక్స్ గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది అందరికీ. బామ్మ మరణం, 'మురారి పునరుజ్జీవనం' విషయంలో ప్రేక్షకులను సరిగ్గా కన్విన్స్ చేయలేకపోయాడు దర్శకుడు.

మహేష్ బాబు, సోనాలి బెంద్రేలు బావామరదళ్లుగా చలాకీగా నటించారు. సినిమా నడిచేదంతా మహేష్‌బాబు పాత్ర పరిధిలోనే. నటనలో అప్పుడప్పుడూ తండ్రి కృష్ణను గుర్తుకు తెస్తాడు. రొమాంటిక్ సన్నివేశాల్లో సోనాలి అందాలు ఆరబోసింది. మణిశర్మ సంగీతం బాగుంది. బయటికి వెళ్ళే ప్రేక్షకుడు 'ఎక్కడ తారకా' అని హమ్ చేస్తూ వెళ్తాడు. సోషియో ఫాంటసీగా మలచాలనుకున్న కృష్ణవంశీకి దర్శకుడిగా తన క్రియేటివిటీని చూపించేందుకు అవకాశం తక్కువగా ఉన్న సినిమా ఇది.

- క్రాంతి



## పాత సినిమాలకే దగ్గులు నేర్పే

## మా ఆవిడమీదొట్టు మీ ఆవిడ చాలామంచిది

సినిమా పేరులో దర్శకుడికీ నిర్మాతకీ కొత్తదనం కనిపించిందేమో తెలీదు. కానీ ప్రేక్షకులకు మాత్రం చౌక బారుగా కనపడుతోంది. చూస్తే కథ కూడా అంతే! 'కన్యాదానం' సినిమాని కొద్దిగా మార్పులు చేసినట్టు వుంది ఈ సినిమా. 'చాలా బాగుంది' సినిమా లక్షణాలు కూడా కొన్ని కనిపిస్తాయి.

నవీన్, రాశిని తీవ్రంగా ప్రేమిస్తాడు. కానీ అతడి తండ్రి కోట దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. మేనకోడలు లయకి తలిదండ్రులు లేకపోతే అతడే పెంచాడు. కొడుక్కి మేనకోడల్నిచ్చి పెళ్ళి చేయాలని అతడి తాపత్రయం. నవీన్, రాశి పారిపోయి పెళ్లి చేసుకోవాలని ప్లాన్ వేసుకుంటే, వారికి అడ్డు తగులుతాడు. రాత్రివేళ నవీన్ పారిపోతుండగా చాటు నుంచే ఇనుప కమ్మీతో తల మీద బాదుతాడు. తలకి బలమైన గాయంతో నవీన్ ఆసుపత్రిలో చేరతాడు. చూసి చూసి ప్రియుడు మోసం చేశాడనుకుని రాశి వెనక్కి వెళ్ళిపోతుంది. తర్వాత నవీన్, లయను - శ్రీకాంత్, రాశిని పెళ్ళి చేసుకుంటారు. నవీన్‌ను మరవలేని రాశి, భర్తకు దూరంగానే వుంటుంది. నవీన్, రాశి కలిసి లేచిపోదామని నిర్ణయించుకుని, గోవా చేరుకుంటారు. అక్కడ నవీన్ మిత్రుడు జీవి తటస్థపడి లేచిపోయే స్త్రీల గురించి అసహ్యంగా మాట్లాడతాడు. రాశి అది భరించలేక నవీన్‌తో ఇంటికి తిరిగి వస్తుంది. ఊరిజనం సూటిపోటి మాటలంటారు. రాశి బాధతో విషం తాగితే, ఆమె భర్త శ్రీకాంత్ ఆసుపత్రికి తీసుకువెళతాడు. ఈలోగా లయ కూడా అబార్షన్ కోసం అదే ఆసుపత్రికి వస్తుంది. కానీ డాక్టర్ దంపతులు (ప్రకాష్ రాజ్, అవంతి) అబార్షన్ చేయలేదు. మరోవైపు రాశి ప్రాణాలు నిలిచాయి. నవీన్ డాక్టర్ దంపతులతో కలిసి గోవాలో ఆడిన నాటకం ఫలితంగానే సుఖాంతమవుతుంది కథ.

శ్రీకాంత్, నవీన్‌ల నటన బాగుంది. రాశి మరింత అందాల రాశిగానే కనిపించింది. ఎం.ఎస్, బ్రహ్మానందం, శ్రీరాం, మల్లికార్జున రావు యధావిధిగా కొంత హాస్యాన్ని, కొంత అపహాస్యాన్ని పండించారు. ఒక్కపాట మినహా మిగతా పాటలు గుర్తుండవు. గోవా, వైజాగ్ బీచ్‌ల అందచందాలను కెమెరా బాగా పట్టుకుంది. మాజీ ప్రియుడు, మాజీ ప్రేయసి, లేచిపోవడం, కన్యాదానం లాంటి లక్షణాలతో తప్ప వేరే కథాంశంతో ఇ.వి.వి. సినిమా తీయలేడా?

- డి.కె.ఎం.




ఎలాంటి సిన్మా అయినా తెలుగులో 'హిట్' అవుతుంది అని చెప్పటానికి పనికొచ్చే ఓ రాయలసీమ ఫ్యాక్షనిజం సినిమా 'నరసింహనాయుడు' - పైగా తెలుగు సిన్మా నిర్మాతల్ని కన్ఫ్యూజ్ చేసిన చిత్రం కూడా ఇదే! గతంలో ఇదే కాంబినేషన్‌తో వచ్చిన 'సమరసింహారెడ్డి'ని మించి కమర్షియల్‌గా కదం తొక్కుతున్న ఈ సినిమాలో హిట్ కొట్టాల్సినన్ని అంశాలు ఏమున్నాయని అందరూ (ముఖ్యంగా సినిమా ఫీల్డు) చర్చించుకోవటానికి అవకాశం ఇచ్చిన సినిమా కూడా ఇదే! పోతే ప్రేక్షకులతో పాటు రాయలసీమ ఫ్యాక్షనిస్టులు సైతం ఆశ్చర్యపడే అనేక సంఘటనలతో కూడుకున్న కథ, అది (ఇష్టం వచ్చినట్లు) నడిచిన తీరూ చూస్తే తెలుగు సినిమా మీద జాలేస్తుంది. ఈ సినిమాలో వున్న ఫ్యాక్షన్ నాయకులు ఎవ్వరూ అసలు ఫ్యాక్షనిస్టులా కనిపించకపోవటం మైనస్ పాయింట్ కొండొకచో ప్లస్ పాయింట్ కూడానూ. పైగా ఈ సిన్మాలో ఫ్యాక్షన్ అంతం చేయటానికి ఇచ్చిన సొల్యూషన్ పోలీసులు గమనించదగ్గది(!)

రూలు ప్రకారం కథ ఓ ఫ్యాక్షన్ లీడర్ (!?) అతని ప్రత్యర్థుల మధ్యనే నడుస్తుంది. చిత్రంగా ఈ సినిమా చూస్తున్నవారు భయపడేది బాంబులు, నరకటం వంటి హింసాత్మక సంఘటనలను ఊహించి కాదు. ఎప్పుడు పాట వస్తుందోనని బెదిరిపోయి. ఈ సిన్మాలో బాంబుల్లాంటి పాటలు అనేకం వున్నాయి. (ఫ్యాక్షనిస్టులు కొంచెం సిగ్గు పడేది ఇక్కడే) ముగ్గురు హీరోయిన్లు పాటలను పంచుకున్నారు. బహుశా అందుకోసమే వాళ్ళని తీసుకున్నారు. అయినా బాలకృష్ణ సిన్మాలో (అదీ ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్) వాళ్ళు మాత్రం ఏం చెయ్యగలరు కనుక? మొదటిసారి ఇందులో ఫ్యాక్షనిస్ట్ నాయకుడు డ్యాన్స్ మాస్టర్‌గా కూడా కనిపిస్తాడు!

కథ గురించి చెప్పాలంటే... రెండు గ్రామాలు - ఒకదానికి మంచి ఫాక్షనిస్ట్ రఘుపతి నాయుడు (విశ్వనాథ్.కె.) నాయకుడైతే మరో దానికి కుప్పుస్వామి నాయుడు (ముకేష్ రిషి?) అధిపతి. అదీ ప్రారంభం... అయితే అంతకు ముందు నరసింహనాయుడు (బాలకృష్ణ) డ్యాన్స్ మాస్టర్‌గా ఓ అందమైన ప్రదేశంలో స్కూలు నడపటంతో సినిమా ప్రారంభమవుతుంది. (ఇది అజ్ఞాతవాసం). కుప్పు స్వామి నాయుడి కూతురు అంజలి (ప్రీతి జింగాని) న.నాయుడి దగ్గరే డ్యాన్స్ నేర్చుకోవటానికి ఇష్టపడ్డం - దరిమిలో ఆయన్నే ఇష్టపడటం లాంటి సంఘటనలు మామూలే. ఉన్నట్టుండి న.నాయుడికి ఓ కొడుకు పుట్టుకొస్తాడు. (ఆయనక్కాదు. అది ఫ్లాష్ బ్యాక్). సరే ఇక అంజలిని తన బావకొడుక్కి ఇచ్చి పెళ్ళి చేయాలని కు.నాయుడు ప్రయత్నం. అయితే అంజలి న.నాయుడితో పాటు రైల్లో పారి(?)పోతుంది. ఆమెను వెనక్కి తెచ్చే ప్రయత్నంలో కు.నాయుడి మనుషులకి న.నాయుడి ఐడెంటిటీ బయటపడుతుంది. అపుడు న.నాయుడు అంజలికి తన ఫ్లాష్‌బ్యాక్ చెపుతాడు.

ఫ్లాష్‌బ్యాక్ : ముందే చెప్పేసినట్లు రఘుపతి నాయుడు ఫ్యాక్షన్ అంతం చేయటానికి తన కొడుకుని ఓ నాయకుడిగా తీర్చి దిద్దుతాడు. ఆ నాయకుడే అవతలి ఊరి ఫ్యాక్షన్ లీడర్‌ను చంపేస్తాడు (పోలీసులు అస్సలు ఏమీ అనరు) అప్పట్నుంచి రెండు ఊర్ల (లేక గ్రామాలా?) మధ్య ఫ్యాక్షన్ బతికే వుంటుంది. న.నాయుడికి ఓ మధ్యతరగతి యువతి (సిమ్రాన్)తో పెళ్ళి జరుగుతుంది (అతి కష్టం మీద). ఇంతలో అమెరికా నుంచి న.నాయుడి అన్నలు దిగుతారు. వాళ్ళకీ సిమ్రాన్‌కి ఆర్గ్యుమెంటు జరిగి న.నాయుడు సిమ్రాన్‌ను పుట్టింటికి పంపుతాడు (అన్నలంటే అంత ప్రేమ మరి!) అక్కడ సిమ్రాన్‌కు ఓ కొడుకు పుడతాడు. కు.నాయుడు ఆమెను చంపుతాడు. పగ తీర్చుకోవాలని వెళుతున్న న.నాయుడు శ్రావణి ఆఖరి కోరిక మేరకు (తండ్రి బలవంతం మీద) ఊరు వదిలేసి అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోతాడు. మళ్ళీ కథలోకి వస్తే ఇక మిగిలింది క్లైమాక్స్. ఎలాగోలా అంజలిని పెళ్ళి చేసుకుంటాడు. కు.నాయుడు మారిపోతాడు. అంతా సుఖంగా వుంటారు(?!)

ఈ సినిమా కథ విన్న తర్వాత ఇలాంటి కథనా ప్రేక్షకులు 'హిట్' చేసింది అని విన్నవారు విస్తుపోతారు. ముందు చెప్పినట్లు ఇందులో అనేక చిత్రమైన సంఘటనలు వున్నాయి. ఫ్యాక్షన్‌ను అంతం చేయటానికి రఘుపతి నాయుడు గ్రామస్థులందరికీ 'ఇంటికొక బిడ్డను గ్రామం కోసం త్యాగం చెయ్యమని' చెప్పి ఓ సేనను తయారు చేయటం - న.నాయుడి గురించి అంజలికి అస్సలు తెలియక పెళ్ళికి ఒప్పుకోవటం. యాభై మంది కత్తులు, కొడవళ్ళు, బాంబులతో దాడి చేసినా న.నాయుడు తన అన్నా వదినలను క్షేమంగా రైలెక్కించి పంపటం. (ఫ్యాక్షనిస్టులు నిట్టూర్చేది ఇక్కడే. మన దగ్గర అలాంటి న.నాయుడు ఒక్కడుంటేనా... అని) హీరోకి బలం తక్కువైనా, ఆస్తిపాస్తులు పెద్దగా లేకపోయినా - గట్టి ప్రత్యర్థి వర్గాన్ని చిత్తు చేయటం... అమెరికా నుంచి తమ్ముడిని చూడటానికి వచ్చిన అన్నలు చిత్రంగా ప్రవర్తించటం. వీళ్ళు తమ్ముడి సెక్యూరిటీ మీద నమ్మకం లేక పోలీసుల్ని (అంతదాకా ఎక్కడున్నారో మరి!) పిలిపించుకోవటం చిత్రంగానే వున్నాయి.

బాలకృష్ణ న.నాయుడిగా కొంచెం సరిపోయాడు - మిగతావారు ఆ పాత్రను ఎలివేట్ చెయ్యటానికే పనికొచ్చారు. ఎలాంటి వాడినైనా సరే చంపే ఫ్యాక్షనిస్టులు ఇందులో మనకి కనపడరు. మధ్యలో బ్రహ్మానందం కామెడీకి ప్రయత్నం చెయ్యటం - ఆశా సైనీ అనే నటి చిలిపి చేష్టలు (?) వంటివి కూడా వున్నాయి. కూతురి పుట్టిన్రోజు కోసం బట్టలు హెలికాప్టర్‌లో పంపించే తాహతుగల కు.నాయుడు ప్రత్యర్థిని చంపటానికి సాదాసీదా ప్లానులు వెయ్యటం విచిత్రం. రైల్లో వెళుతున్న న.నాయుడిని(తెలియక) వెంటాడిన యాభైమంది అతన్ని చూడగానే కత్తులు కటార్లు పడేసి పారిపోవటం - (అంతకు ముందు వాళ్ళే అతన్ని చంపటానికి ముందుకొచ్చినవారు) ఫ్యాక్షనిజం కాదు. దానాదీనా ఓ మామూలు మసాలా సినిమా - ఫ్యాక్షనిజం పేరుతో తీయటం అది విజయం సాధించటం - రాయలసీమ ఫ్యాక్షనిజానికి మంచి రోజులు వచ్చినట్లే (!) ఈ నేపధ్యంలో రాయలసీమ ఫ్యాక్షన్ మీద మరిన్ని సిన్మాలు తీయబోవటం - అవి బాంబుల్లా పేలటం కూడా జరగొచ్చు. అయితే ఇందులో గాయపడేది (లేదా పోయేది) ఎవరన్న విషయం చెప్పలేము.

- సి.యస్. సలీం బాషా

ఇది మరో శ్రీహరి సినిమా. కథలో, కథనంలో కొత్తదనం ఏమాత్రం లేని సినిమా. మంచితనమున్న హీరోను సొంతవాళ్లే ముంచే ప్రయత్నాలు చేయడం, చివరికి బుద్ధి తెచ్చుకోవటం ఇందులోని కథ.

సుందరయ్య (శ్రీహరి) బ్యాంకులో అటెండర్. అందరి చేతా మంచివాడనిపించు కుంటాడు. బ్యాంకుకి రుణం చెల్లించాల్సిన అమ్మిరాజు (కోట) అది చెల్లించడు. పైగా అతడి తమ్ముడు శివరాజు (పొన్న..) తన ముఠాలో పట్టపగలే ఆ బ్యాంకును దోచే ప్రయత్నం చేస్తాడు. సుందరయ్య విజృంభించి ఆ ముఠాను చితకబాదుతాడు. శివరాజుకి జైలు పడుతుంది. సుందరయ్య తమ్ముడిని (బ్రహ్మాజీ) అమ్మిరాజు కూతురు ప్రేమించింది. ఉద్యోగం

## మంచితనానికీ ఓ హద్దుందయ్యా




వుంటేనే పిల్లనిస్తానని అతడు షరతు పెడతాడు. దీంతో సుందరయ్య తాను ఉద్యోగానికి స్వయంగా రాజీనామా చేసి ఆ ఉద్యోగాన్ని తమ్ముడికి ఇప్పిస్తాడు. నాలుగు లక్షల రూపాయల ప్రావిడెంట్ ఫండ్‌ను అన్న (ఆహుతి ప్రసాద్) బిజినెస్ చేసుకుంటానంటే ఇచ్చేస్తాడు. మరో వైపు అన్ని సినిమాల్లో మాదిరిగానే పెళ్లి కాని చెల్లి సమస్య కూడా వుంది హీరోకి. తప్పనిసరి పరిస్థితుల్లో తనను ప్రేమించిన శిరీషను పెళ్లి చేసుకుంటాడు సుందరయ్య. పరిస్థితులు బాగా లేని కారణంగా వెంటనే పిల్లలు వద్దనుకుంటారు. సుందరయ్య ఇంత త్యాగమూర్తి అయినా అతడికి ఇంట్లో ఇబ్బందులు తప్పవు. అన్న, తమ్ముడు ఎవరిదారి వారు చూసుకుంటారు. స్టవ్ యాక్సిడెంట్‌లో గాయపడిన చెల్లెల్ని పట్టించుకోరు. చివరికి ఆమెకు బాగవుతుంది. సుందరయ్య కూడా వేరే బంగళా, కారు సంపాదించుకుంటాడు. తిరిగి వచ్చిన సోదరులు, వారి భార్యలకు బుద్ధి చెప్పి వారు 'మారు మనసు' పొందేలా చేస్తాడు. శ్రీహరి హీరో అయినా ఇది పూర్తి ఫైటింగ్‌లున్న మాస్ మసాలా సినిమా కాదు. బహుశా శ్రీహరి ఒక సెంటిమెంటల్ పాత్ర చేయటం ఇదే మొదటిసారి. సినిమాలో ఫైట్స్ అవసరం అంతగా లేకపోయినా శ్రీహరి కోసమే పెట్టారనిపిస్తుంది. ఫొటోగ్రఫీ, సంగీతం ఫర్వాలేదు. మొత్తమ్మీద చెప్పాలంటే చాలా సాదా సీదా సినిమా.

- కృష్ణమోహన్

రచయిత ఖలీద్ మొహమద్, దర్శకుడు శ్యాంబెనగల్‌ల సమ్మేళనంలో రూపొందిన మామూ, సర్దారీబేగం చిత్రాల వరుసలో మూడవ స్త్రీ దృక్కోణపు చిత్రం జుబేదా. ఇది తొంభైశాతం కల్పనతో ఒకింత



గుండా స్వేచ్ఛాలోకాలకు వెళ్లడం దర్శకుడు ప్రేక్షకుల హృదయాలు కదిలేటట్టుగా చిత్రించాడు.

1940-50ల మధ్య రాజకీయ చైతన్యం వివిధ వర్గాల స్త్రీల భావాల్లో తెచ్చిన మార్పుల్ని మనం ఈ చిత్రంలో గమనించ

## స్వేచ్ఛాన్వేషణలో మరో సమిధ - జుబేదా

యదార్థంతో తీసిన సినిమా. చిత్రం చూస్తున్నంతసేపూ జుబేదా స్వేచ్ఛాతపన, ప్రేమకోసం ఆరాటం, ఉద్వేగమూ ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. దర్శకుడు కథను చెప్పడంలో ఎంచుకున్న పద్ధతి సినిమాను ముందుకు నడిపించడంలో ఎంతగానో తోడ్పడింది. కథాకాలం 1940-80ల మధ్య సాగుతుంది.

సినిమా ప్రారంభంలోనే ఆకాశంలో ఎగురుతున్న ఎర్రని వస్త్రాన్ని చాలాసేపు చూపిస్తాడు దర్శకుడు. యిది సినిమాలోని ప్రధాన పాత్రకు తిరుగుబాటు తత్వం వుంటుందన్న ఊహను ప్రేక్షకులకు ముందుగానే కలిగిస్తుంది. ధనిక కుటుంబానికి చెందిన జుబేదా సినిమా నాయిక కావాలని కలలు కంటుంది. అందుకు తగినట్టుగా డాన్స్ నేర్చుకుంటుంది. జుబేదా ప్రయత్నాలను తండ్రి అడ్డుకుంటాడు. జుబేదా యిష్టానికి వ్యతిరేకంగా చదువు మాన్పించి, తన మిత్రుడి కుమారుడితో పెళ్ళి జరిపిస్తాడు. కొంత కాలానికి అనివార్య ఘర్షణ కారణంగా భర్త జుబేదాను విడిచి తండ్రితో పాకిస్తాన్ వెళ్ళిపోతాడు. తండ్రి కారణంగా రెండుసార్లు తన స్వేచ్ఛను కోల్పోయిన జుబేదా కొడుకుతో ఒంటరిగా గడుపుతుంది. జుబేదాకు ఒక సందర్భంలో ఫతేపూర్ రాజాతో పరిచయమేర్పడి ప్రణయంగా మారి చివరికి పెళ్ళికి దారితీస్తుంది. తల్లి కోరిక మేరకు కొడుకును వదిలి, రాజాంతఃపురంలోకి అడుగుపెడుతుంది. రాచరికపు కట్టుబాట్లకి, ఆచారాలకి జుబేదా తన స్వేచ్ఛా కాంక్షను కోల్పోతుంది. అంతఃపుర రాజకీయాల కారణంగా క్రమంగా భర్త ప్రేమకు దూరమవుతుంది. భర్త తనకంటే మొదటి భార్య రాణీ మందీరాదేవిపై ఎక్కువ ప్రేమను చూపడంతో జుబేదా మానసిక సంఘర్షణకు లోనవుతుంది. మరోవైపు మరిది రాజా ఉదయ్‌సింగ్ అవాంఛనీయ ప్రవర్తన వల్ల కలత చెందుతుంది. గతంలో ఆశించని ప్రేమకు దూరమైన జుబేదా, ప్రస్తుతం ఆశిస్తున్న ప్రేమకు దూరం కావడాన్ని భరించలేక - భర్తతో కలిసి మృత్యువులో స్వేచ్ఛను సాధించటంతో సినిమా ముగుస్తుంది. జుబేదా కొడుకు పెద్దవాడై తల్లిని గురించి వివరాలను శోధించే క్రమంలో వరుస ఫ్లాష్‌బ్యాక్‌లతో బిగి తెగకుండా కథను దర్శకుడు అద్భుతంగా మలిచారు. జుబేదా స్వేచ్ఛాపిపాస, ఆ క్రమంలో ఎదుర్కొన్న మానసిక సంఘర్షణ, చివరకు జీవన భద్రతకు సవాలు ఎదురైనపుడు తలవంచక మృత్యుద్వారం వచ్చు. అధికారాన్ని తప్ప ప్రేమను పంచలేని రాజాంతఃపురాల్లో జుబేదా లాంటి స్వేచ్ఛా పిపాసి మిగిల్చిన కన్నీటి చారలనూ మనం చూడవచ్చు. తన తల్లి జీవితాన్ని శోధించే క్రమంలో ఫతేపూర్ కోటకు వెళ్ళిన జుబేదా కొడుకు తల్లి జాడలు ఏ అణువులోనూ మిగలకపోవడం చూసి కుమిలిపోవడం మన గుండెల్ని మెలిపెడుతుంది. గుప్పెడు ప్రేమ కోసం, చిటికెడు స్వేచ్ఛ కోసం తపించి తమ జీవితాల్ని విషాదాంతం చేసుకున్న ఎందరో స్త్రీల జీవితాల మాదిరిగానే జుబేదా జీవితం కూడా ముగుస్తుంది. ఒక వాస్తవానికి అనేక కల్పనలను జోడించి ఈ డిజిటల్ సినిమా కాలంలో ఇటువంటి సున్నితమైన అంశాన్ని చెప్పడంలో బెనగల్ ఎంతో ప్రతిభను కనబరిచాడు.

స్వేచ్ఛాభావాల్ని, గాయాల్ని అంతరాంతరాల్లోనే దాచుకుని అనంతమైన ప్రేమకోసం తపించిన జుబేదాగా కరిష్మాకపూర్ అద్భుతంగా నటించింది. 1940ల నాటి 'మై అల్‌బెలి, ఘూమ్ అకేలీ' పాటలో కరిష్మా మరపురాని అభినయాన్ని చూపింది. జుబేదా తండ్రి సులేమాన్‌గా అమ్రిష్‌పురి, జమీందారుగా, భార్యపట్ల ప్రేమగల భర్తగా మనోజ్ బాజ్‌పాయ్, తల్లికోసం నిరంతరాన్వేషణలో ఎన్నో అనుభవాలను తన గుండెలో బాధగా భద్రపరుచుకున్న కొడుకుగా రజత్‌కపూర్ చెప్పుకోదగ్గ నటనను ప్రదర్శించారు. మహారాజు తమ్ముడిగా పర్వీన్ దస్తూర్, జుబేదా ఆంటీగా సురేఖాసిక్రీ, జుబేదా నృత్యగురువుగా శక్తి కపూర్ నటన వైవిధ్యంగా వుంది. యిక చెప్పుకోవలసింది మహారాజు పెద్ద భార్య మందిరాదేవిగా రేఖ నటన గురించి. నిత్యనూతన యవ్వనంతో పాటు, మహారాణి హుందాతనాన్ని అణువణువునా నింపుకున్న రేఖ చాలా సహజంగా నటించింది.

రహమాన్ సంగీతం ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణ. చిత్రం తాలూకు ప్రతి ప్రేములోని భావోద్వేగాలకి రహమాన్ సంగీతం మరింత జీవం పోసింది. జావేద్ అక్తర్ పాటలు లతామంగేష్కర్ గొంతులో అద్భుతంగా పలికాయి. డ్రెస్ డిజైనర్ పియాబెనగల్, ఆర్ట్ డైరెక్టర్ సమీర్ చందా 1940ల కాలంనాటి వాతావరణాన్ని సృష్టించారు.

స్వేచ్ఛాన్వేషణలో రాజాంతఃపురపు గోడలమీద తన ఆనవాళ్ళనైనా మిగుల్చుకోలేని జుబేదా ప్రేక్షకుల గుండెలపై మాత్రం చెరగని ముద్రవేసింది.

- కె. చైతన్య

మిత్రులకు వీడ్కోలు చెప్పటానికి వెళ్లిన సుదీప్, రైలు కిటికీలో నుంచి కనిపించిన సుమని తొలి చూపుతోనే ప్రేమించేస్తాడు. ఆమె వివరాలు తెలుసుకుని వాళ్ల ఊరు వెళతాడు. సుమ బాబాయిని తన కవితా ప్రతిభతో ఆకట్టుకుంటాడు. సుదీప్‌కీ, సుమకీ పరిచయం పెరిగి, ప్రేమగా ఎదిగి పెళ్లి వరకూ వెళుతుంది. ఈలోగా ఒకసారి సుమ వైజాగ్ ప్రయాణమైతే వీడ్కోలివ్వటానికి రైల్వే స్టేషన్‌కు వెళతాడు. అక్కడ కంగారులో రాధ అనే అమ్మాయిని డీకొడతాడు. ఆ పిల్ల సుదీప్ బనీను పట్టుకుని వేలాడి వెనక్కి పడిపోతుంది. రాధ కాలు రైలు కింద ఇరుక్కుపోతుంది. తన కారణంగానే ప్రమాదానికి లోనైన రాధను ఆస్పత్రికి తీసుకెళతాడు. అక్కడ ఆమెకి




ఆపరేషన్ చేసి మడమ వరకూ కాలు తీసేస్తారు. దీంతో సుదీప్ హృదయం కరిగిపోతుంది. ఈ ప్రమాదం వల్ల రాధకి అంతకు ముందు ఖాయమైన సంబంధం తప్పిపోతుంది. అయితే మేనమామ కొడుకు రాధ ఆస్తిపాస్తులకు ఆశపడి చేసుకుంటానంటూ ముందుకొస్తాడు. కానీ దీనికి రాధ ఒప్పుకోదు. అతడికీ, సుదీప్‌కీ గొడవ జరుగుతుంది. ఆ ఘర్షణలో 'నువ్వెవరివి? నీకేమిటి సంబంధం?' అని అడిగితే 'రాధని పెళ్ళి చేసుకోబోయేది నేనే' అని చెబుతాడు సుదీప్.

ఇది తెలుసుకున్న సుమ సుదీప్‌ను మొదట దూషించినా, తర్వాత అతనిలోని మానవత్వాన్ని అర్థం చేసుకుంటుంది. వారిద్దరి పెళ్లికీ ఒప్పుకుంటుంది. కానీ రాధ ఎవరో కాదు, సుమ స్నేహితురాలే. తాను ఇద్దరు ప్రేమికులను విడదీస్తున్నానని బాధ పడుతుంది. చివరికి సుమనీ, సుదీప్‌లను కలుపుతుంది.

ఈ కన్నడ డబ్బింగ్ సినిమాలో 'సుదీప్'గా సుదీప్, సుమగా రేఖ - ఇద్దరూ తొలిపరిచయమే అయినా చక్కగా నటించారు. రాధగా సుధారాణి కూడా పోటీపడి నటించింది. రెండు మూడు పాటలూ, ఊటీ అందాలూ బాగున్నాయి. సినిమా ఇంటర్వెల్ వరకూ నత్తనడక నడిచినా ఆ తర్వాత వేగంగా సాగుతుంది. మారుతున్న ట్రెండ్‌కి ఈ సినిమా మరో నిదర్శనంగా నిలుస్తుంది. ఎడిటర్ జనార్దన్ నిర్మించిన ఈ సినిమాకి దర్శకుడు సునీల్ కుమార్.

- సి. దాస్

# మహాసౌందర్య ద్వీపం మారిషస్






అగాధమగు జలనిధి మధ్యన మిలమిల మెరిసే పచ్చ... ఈ చిన్ని ద్వీపం. ఇంకా మనిషిగాలే సోకనంత ఆదిమ ప్రశాంతత... ఈ నేల ప్రత్యేకత!! ఎర్రటెండలో కూడా పండు వెన్నెల్ని తలపించే సముద్ర తీరం..... ఇక్కడి అద్భుత సౌందర్యం!!!

పర్యాటకుడి ఆత్మను ఉత్తేజితం చేసే ఈ అందమైన దేశం పేరు మారిషస్. హిందూ మహాసముద్రంలో ఆఫ్రికాకి దగ్గరగా వున్న ఈ ద్వీపదేశం జనాభా అంతా కలిసి పన్నెండు లక్షలు. డచ్‌వాళ్లు, ఫ్రెంచ్ వాళ్లు, చివరికి బ్రిటిష్‌వాళ్లూ... వీళ్లందరి చేతుల్లో నలిగి, చివరికి 1968లో స్వతంత్ర దేశమైంది. భారతీయ సంతతివారూ, క్రియోల్స్ (ఆఫ్రికా సంతతి వారు) ఎక్కువ. హోలీ, శివరాత్రి, దీపావళి, వినాయక చవితి, తెలుగు ఉగాది, రంజాన్ పండుగలతో పాటు చైనీస్ స్ప్రింగ్ ఫెస్టివల్ అక్కడి ముఖ్యమైన పండుగలు. టూరిజమ్, చెరకు ప్రధాన ఆదాయ వనరులు. మారిషస్ ప్రస్తుత ప్రధాని అనిరుధ్ జగన్నాథ్. ఆయన పూర్వీకులు బీహార్‌వారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే మారిషస్‌లో ప్రాథమిక వసతులలో ఉపాధిలో లోటుపాట్లు లేవు. ముప్పయ్‌వేల మంది నిరుద్యోగులున్నారు. వారికి ప్రభుత్వం నిరుద్యోగభృతి చెల్లిస్తుంది. దీంతో వాళ్లు కూడా హ్యాపీ. మొత్తమ్మీద అక్కడి ప్రజల జీవితం ప్రశాంతంగా సాగిపోతుంది. కానీ ప్రకృతి ప్రకోపించిన సందర్భాల్లో మాత్రం ఈ ప్రశాంతత చెదిరిపోతుంది.

తుఫాన్‌లు చెలరేగినప్పుడు రాజధాని పోర్టులూయిస్‌లో పాటు, దేశమంతా అలజడి కనబడుతుంది.

ప్రభుత్వం ప్రమాద హెచ్చరికల ద్వారా ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుంది. తుఫాన్ సమయంలో నాలుగు రకాల ప్రమాద సూచికలను ఎగురవేస్తారు. ప్రసార సాధనాల ద్వారా కూడా సూచిస్తారు. సైరన్ మోగిస్తారు. తుఫాన్ మడగాస్కర్ సమీపంలో ఉందని తెలియగానే ప్రజలకు మొదటి సైరన్ ద్వారా తెలియజేస్తారు. రెండవసారి సైరన్ మోగించగానే కనీసం రెండు రోజులకు సరిపడా ఆహారపదార్థాలు, కూరగాయలు ఇంటికి తెచ్చుకుని ఇంటికి చేరాలి. మూడవ సారి సైరన్ మోగించగానే రోడ్డుపైన పార్కు చేసిన వాహనాలను ఇంటిలోకి తెచ్చుకోవాలి. ఎందుకంటే కార్లు హాలీవుడ్ సినిమా 'ట్విస్టర్'లో చూపించిన విధంగా గాలిలోకి లేచిపోతాయి. తుఫాన్ అంత తీవ్రంగా ఉంటుంది. నాల్గవ సైరన్ మోగించడంతో దేశంలో మొత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. ఈ తుఫాన్లు సాధారణంగా రెండు మూడు గంటలకంటే ఎక్కువ ఉండవు. ఉన్నంతసేపు విధ్వంసం తీవ్రంగానే ఉంటుంది. అరుదుగా ఇంకా ఎక్కువ సమయం కొనసాగవచ్చు. వీటిని మినహాయిస్తే మారిషస్ ఎప్పుడూ ప్రశాంతంగా వుంటుంది.



- పెండ్యాల హరినాథ్ బాబు



